(Seerath-us-Sahaaba in Telugu)

# ధరణి తారలు

భావానువాదం
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, H.No. 16-2-867/A/4,
జీవన్‌యార్‌జంగ్ కాలనీ, సయీదాబాద్,
హైదరాబాద్-59 ✆ 91-944 1515 414

మూల్యం....................................రూ.200/-



| | |
|---|---|
| Name of the Title: | Dharani Taaralu (Telugu) (Seerath-us-Sahaaba) |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition | 1000 Copies : (7/2013) |
| Published by: | Islamic Resource Centre<br>H.No. 16-2-867/A/4, Jeevanyar<br>Jung Colony, Sayeedabad,<br>Hyderabad-59, Ph: 9441515414 |
| Type set by: | Alifain, I.R.C. Graphics<br>Hyderabad-59, Ph: 9441515414 |
| Printed at : | H.S. Offset Printers<br>714, Chandni Mahal, Daryaganj<br>New Delhi-2, Ph: 23244240 |
| Price: | Rs. 200/- |

## సత్యాన్వేషకులకు ఓ సదవకాశం

ఇస్లాం ఓ సమగ్రమైన జీవనవ్యవస్థ. ఇది సృష్టికర్త తనప్రవక్తల ద్వారా మనకు పంపిన సంపూర్ణ సంవిధానం. కాని ఈనాడు ఇస్లాం అనుచరులైన ముస్లింలు దీన్ని పూర్తిగా ఆచరించకపోవడం వల్ల, మరోవైపు జాత్యహంకారులైన మతదురభిమానులు వ్యాపింపజేసిన అపోహల వల్ల సత్యాన్వేషకులకు ఇస్లాంను సరిగా, పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టమైపోయింది. అనువాదాల భాషాశైలి కూడా అన్వేషకులకు ఆసక్తి కల్గించలేకపోతోంది. ఇప్పుడు తెలుగువారి కోసం తేటతెలుగులో ఇస్లాం గురించి సరైన, సమగ్ర సమాచారం అందజేయడానికి “ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్” నడుం కట్టింది. పాఠకులే న్యాయ నిర్ణేతలు. మీఅభిప్రాయాలు ✆ 944 1515 414 ద్వారా తెలియజేయగలరు.

# విషయసూచిక


| వ.నెం. | సహాబీ పేరు | పేజి |
|---|---|---|
| 1. | అబూబకర్ సిద్దీఖ్ (రజి) | 07 |
| 2. | ఉమర్ ఫారూఖ్ (రజి) | 37 |
| 3. | ఉస్మాన్ గని (రజి) | 104 |
| 4. | అలి ముర్తుజా (రజి) | 129 |
| 5. | ఖాలిద్ బిన్ వలీద్ (రజి) | 158 |
| 6. | అమ్ర్ బిన్ ఆస్ (రజి) | 171 |
| 7. | ఇక్రమా బిన్ అబూజహల్ (రజి) | 176 |
| 8. | జైద్ బిన్ హారిసా (రజి) | 178 |
| 9. | ఉసామా బిన్ జైద్ (రజి) | 184 |
| 10. | బిలాల్ (రజి) | 188 |
| 11. | సయీద్ బిన్ జైద్ (రజి) | 189 |
| 12. | ఉమైర్ బిన్ సాద్ (రజి) | 191 |
| 13. | అబూదర్దా అన్సారి (రజి) | 196 |
| 14. | సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) | 200 |
| 15. | వహ్షీ బిన్ హరబ్ (రజి) | 203 |
| 16. | అబ్బాద్ బిన్ బిషర్ (రజి) | 206 |
| 17. | అమ్మార్ బిన్ యాసిర్ (రజి) | 208 |
| 18. | జాఫర్ తయ్యార్ (రజి), నజాషీ (రజి) | 210 |
| 19. | హమ్జా బిన్ అబూతాలిబ్ (రజి) | 218 |
| 20. | మహామాంత్రికుడు జిమాద్ (రజి) | 223 |
| 21. | తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి (రజి) | 228 |
| 22. | అబ్దుల్లా బిన్ హుజాఫా సహ్మి (రజి) | 230 |
| 23. | ఉమైర్ బిన్ వహబ్ (రజి) | 233 |
| 24. | సుమామా బిన్ ఉసాల్ (రజి) | 235 |
| 25. | ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) | 237 |
| 26. | అబూసల్మా (రజి) | 240 |
| 27. | సురాఖా బిన్ మాలిక్ (రజి) | 243 |
| 28. | అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) | 247 |
| 29. | అబ్దుల్లా బిన్ హుజష్ (రజి) | 251 |
| 30. | అబూఉబైదా బిన్ జిర్రా (రజి) | 255 |
| 31. | అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) | 257 |
| 32. | సాబిత్ బిన్ ఖైస్ (రజి) | 260 |
| 33. | సల్మాన్ ఫార్సి (రజి) | 262 |





| | | |
|---|---|---|
| 34. | సుహైబ్ రోమి (రజి) | 268 |
| 35. | అద్దీ బిన్ హాతింతాయి (రజి) | 271 |
| 36. | అబూజర్ గిఫ్ఫారి (రజి) | 274 |
| 37. | అబ్దుల్లా బిన్ ఉమ్మెమఖ్తూమ్ (రజి) | 279 |
| 38. | మజాజా ఇబ్నెసౌర్ (రజి) | 281 |
| 39. | అబూతల్హా అన్సారి (రజి) | 284 |
| 40. | నయీమ్ బిన్ మస్వూద్ (రజి) | 288 |
| 41. | సాద్ బిన్ ముఆజ్ (రజి) | 295 |
| 42. | అబుల్ఆస్ బిన్ రబీ (రజి) | 301 |
| 43. | లూసా బిన్ యహూద్ (రజి) | 306 |
| 44. | అబూజందల్, అబూబసీర్ (రజి) | 312 |
| 45. | ఆసిమ్ బిన్ సాబిత్ (రజి) | 315 |
| 46. | అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) | 318 |
| 47. | అబ్దుల్లా బిన్ సలాం (రజి) | 323 |
| 48. | ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) | 328 |
| 49. | ఉసైద్ బిన్ హుజైర్ (రజి) | 331 |
| 50. | ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) | 334 |
| 51. | సయీద్ బిన్ ఆమిర్ (రజి) | 338 |
| 52. | నోమాన్ బిన్ ముఖ్రిన్ (రజి) | 342 |
| 53. | తల్హా బిన్ ఉబైదుల్లా తైమి (రజి) | 349 |
| 54. | రబీ బిన్ జియాద్ హారిసి (రజి) | 354 |
| 55. | అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) | 357 |
| 56. | అబూహురైరా దౌసి (రజి) | 363 |
| 57. | కాబ్ బిన్ మాలిక్ (రజి) | 367 |
| 58. | విశ్వాసుల మాతృమూర్తి ఉమ్మెసల్మా (రజి) | 372 |
| 59. | విశ్వాసుల మాతృమూర్తి ఉమ్మెహబీబా (రజి) | 376 |
| 60. | సఫియా బిన్త్ అబ్దుల్ముత్తలిబ్ (రజి) | 377 |
| 61. | అస్మా బిన్త్ అబూబకర్ (రజి) | 382 |
| 62. | విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా (రజి) | 388 |
| ❀ | ప్రవక్త(స)పై ప్రేమకు పరాకాష్ఠ ❀ | 399 |


## ఈ రచనకు ఆధార గ్రంథాలు


(1) తారీఖె ఇస్లాం (ఉర్దూ)....................మౌలానా అక్బర్షా నజీబాదాది

(2) సిద్దీఖ్ అక్బర్ (ఉర్దూ)................మౌలానా సయీద్ అహ్మద్ అక్బరాబాది

(3) అల్ ఫారూఖ్ (ఉర్దూ)....................అల్లామా షిబ్లీ నోమాని

(4) సీరతె సహాబా (ఉర్దూ)....................అబూజావీద్ ఇఖ్బాల్ అహ్మద్ ఖాస్మి

(5) రోషన్ సితారె (ఉర్దూ).............మౌలాన ముహమ్మద్ యూసుఫ్ ఇస్లాహి

## వారి జీవితాలే మనకు అనుసరణీయం

"నా అనుచరులు (సహాబీలు) నక్షత్రాలు వంటివారు. వారిలో ఎవరిని విధేయించినా (అనుసరించినా) మీరు సన్మార్గం పొందుతారు."

-మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)



بسم الله الرحمن الرحيم

# ముందు మాట

ఇస్లాం స్వీకరించగానే మనిషి దాన్ని పూర్తిగా ఆచరిస్తూ జీవిత సమస్తరంగాల్లో తాను స్వచ్ఛమైన ముస్లిం అని నిరూపించుకోవాలి. అంటే ఖుర్ఆన్, హదీసుల పరిధిలోనే అతని జీవితశకటం సాగాలన్న మాట. ముఖ్యంగా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జీవితం ముస్లింలకు ఆదర్శం కావాలి. ఆ తర్వాత ఆ మహనీయుని ప్రత్యక్ష అనుచరుల (సహాబీల) జీవితాలను కూడా ఆదర్శంగా తీసుకోవాలి. అందుకే నేను "మహనీయ ముహమ్మద్ (సల్లం) ఆదర్శజీవితం" తరువాత "ధరణి తారలు" పేరుతో సహాబీల జీవిత చరిత్రలకు సంబంధించిన ఈ పుస్తకం మీ ముందుకు తెస్తున్నాను. నాకు తెలిసి నంతవరకు తెలుగులో ఈ శీర్షికకు సంబంధించిన మొట్టమొదటి పుస్తకం ఇదే.

దైవప్రవక్త (సల్లం) ప్రత్యక్షఅనుచరులు వేల సంఖ్యలో ఉన్నారు. వారందరి జీవిత చరిత్రలను సేకరించడం తలకుమించిన పని. పైగా చాలామంది సహాబీల జీవితగాధలు లభించడం కూడా దుర్లభమే. అందువల్ల నేను సుప్రసిద్ధ సహాబీలలో ముఖ్యమైన వారిని మాత్రమే ఎంచుకొని, వారి జీవితచరిత్రలనే గ్రంథస్తం చేశాను.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన అనుచరుల సుగుణసంపత్తిని ప్రశంసిస్తూ "నా అనుచరులు (సహాబీలు) నక్షత్రాలు వంటివారు. వారిలో ఎవరిని విధేయించినా (అనుసరించినా) మీరు సన్మార్గం పొందుతారు" అని చెప్పారు. అయితే ఈ పుస్తకంలో లేదా మరే పుస్తకంలోనైనా పేర్కొనబడిన సహాబీల జీవితచరిత్రలన్నీ సంపూర్ణమైనవని, సమగ్రమైనవని చెప్పలేము. కొందరు సహాబీల జీవితచరిత్రలకు సంబంధించిన అనేక కోణాలు వెలుగులోకి వచ్చినవయితే, మరికొందరు సహాబీల జీవితచరిత్రలకు సంబంధించిన కొన్ని కోణాలు మాత్రమే వెలుగులోకి వచ్చినవైనవయి ఉన్నాయి.

కాబట్టి పాఠకులు ఈ పుస్తకంలో ఎవరో ఒకరి జీవితచరిత్రను మాత్రమే ఆదర్శంగా తీసుకొని, పుస్తకంలో పేర్కొనబడిన ఆయన సుగుణాలను మాత్రమే అనుసరిస్తూ మిగతా వ్యవహారాల్లో తమ ఇష్టానుసారం నడచుకోవచ్చని భావించడం చాలా పొరపాటు. మిగతావ్యవహారాల్లో దైవప్రవక్త (స), ఇతర సహాబీల గుణగణాలు, నీతినడవడికలు ఎలా ఉన్నాయో అధ్యయనం చేసి తదనుగుణంగా నడచుకోవాలి. అప్పటికీ మనకు మరికొన్ని వ్యవహారాల్లో మార్గదర్శనం లభించకపోతే ఖుర్ఆన్, హదీసుల్ని అధ్యయనంచేసి వాటి నుండి మార్గదర్శనం గ్రహించవలసి ఉంటుంది. అందుకే "ప్రతి ముస్లిం స్త్రీ, పురుషుడు విధిగా జ్ఞానం సంపాదించాలి" అన్నారు దైవప్రవక్త (స). "జ్ఞానులు మాత్రమే దేవునికి భయపడతారు" అన్నది ఖుర్ఆన్. కనుక సహాబీల జీవితచరిత్రలపై మొదటిసారిగా తెలుగులో వెలువడిన ఈ పుస్తకం పాఠకులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

**-అబుల్ ఇర్ఫాన్, అనువాదకుడు**

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# ధరణి తారలు

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒకరోజు భావి కార్యక్రమం గురించి ఆలోచిస్తుంటే ఆయన మిత్రుడు అబూబకర్ వచ్చాడు. మిత్రులిద్దరూ కాస్సేపు అదీఇదీ మాట్లాడుకున్నారు.

తరువాత దైవప్రవక్త (సల్లం) విషయం మార్చుతూ "అబూబకర్! నీవు నన్ను ఎలాంటి వాడని భావిస్తున్నావు?" అని అడిగారు.

"ఏమిటి, ఈరోజు కొత్తగా మాట్లాడుతున్నావు!! నీ సంగతి నాకు తెలియనిదే ముంది? నువ్వు ఎంతో మంచివాడవు, సత్యవంతుడవు, నిజాయితీపరుడవు" అన్నాడు అబూబకర్.

"సరే, ఒకవేళ నేను దైవప్రవక్తనని, నాపై దైవసందేశం అవతరిస్తోందని అంటే నువ్వు నమ్ముతావా?" అడిగారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ.

"తప్పకుండా నమ్ముతాను. నీవు అబద్ధమాడినట్లు, తప్పుడు మాటలు పలికినట్లు నేనింత వరకు వినలేదు" అన్నాడు అబూబకర్.

## 1. అబూబకర్ సిద్దీఖ్ (రజి)

"అయితే విను. నేనిప్పుడు దేవుని తరఫున ప్రవక్తగా నియమించబడ్డాను. నాపై దైవసందేశం అవతరిస్తున్నది. దాని ప్రకారం నీవు కూడా దైవేతర శక్తులన్నింటిని వదలిపెట్టి ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధించు. ఆయనే సర్వసృష్టికర్త. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి" అన్నారు దైవప్రవక్త (సల్లం)

"నిస్సందేహంగా నీవు దైవప్రవక్తవే. నేను సర్వసృష్టికర్త అయిన ఏకేశ్వరుడ్ని విశ్వ సిస్తున్నాను" అన్నారు అబూబకర్ (రజి).

ఈ మాటలు విని దైవప్రవక్త (స) పరమానందభరితులయ్యారు. ఆరోజు నుండి ఆయన తన దగ్గరకొచ్చేవారికి కొత్తధర్మం గురించి హితోపదేశం చేయనారంభించారు.

ఈవిధంగా దైవప్రవక్త (సల్లం) తన దగ్గరకు వచ్చే ప్రతి వ్యక్తి ముందూ తాను దైవప్రవక్తనని ప్రకటించి, హితోపదేశం చేస్తూ రహస్యంగా ధర్మప్రచారం చేయసాగారు. అదేవిధంగా హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ప్రచారం ప్రారంభించారు. ఆయన తన దగ్గరకు వచ్చిన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అనే వ్యక్తికి దైవసందేశం విన్పించి ఇస్లాం స్వీకరించమని అన్నారు. అబ్దుర్రహ్మాన్ తక్షణమే ఇస్లాం స్వీకరించారు.



హజ్రత్ అబూబకర్ (రజి) ఖురైష్ ప్రజలందరిలో ఎంతో సద్గుణసంపన్నులు; అబద్ధానికి ఆమడదూరంలో ఉండేవారు; మాటకు కట్టుబడివుండే వాగ్దానపాలకుడు; అజ్ఞానకాలం నుంచే ఆయన మద్యపానాన్ని దరికి రానిచ్చేవారు కాదు. పురుషుల్లో అందరికంటే ముందు ఆయనే ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (స) ఇస్లాం వైపు పిలవగానే ఆయన ఎలాంటి తటపటాయింపు లేకుండా తక్షణమే 'సద్వచనం' పఠించి సత్యధర్మంలో ప్రవేశించారు. దైవప్రవక్త (స) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "నేను ఇస్లాం వైపు పిలిచినపుడు ఒక్క అబూబకర్ తప్ప ప్రతి మనిషీ ఇస్లాంస్వీకారంలో ఎంతోకొంత తటపటాయించాడు" అని అన్నారు.

ఒకరోజు దైవప్రవక్త (సల్లం) కాబాప్రదక్షిణ చేసిన తర్వాత విగ్రహపూజ, బహుదైవా రాధనల్లోని చెడుల్ని ఎత్తిచూపుతూ బహుదైవారాధకుల ముందు ఏకేశ్వరోపాసన గురించి వివరించడం ప్రారంభించారు.

అప్పుడు బహుదైవారాధకులు ఆయన్ని ఉరిమిచూస్తూ పిడికిళ్ళు బిగించారు. ఉఖ్బా బిన్ అబీ అనే ఒక అవిశ్వాసి తోకతొక్కిన పాములా కస్సున లేచి ఒక్క ఉదుటున దైవప్రవక్త (స)ను సమీపించాడు. ఆ మహనీయుని మెడలో తుండుగుడ్డ వేసి లాగుతూ గొంతు నులమడానికి ప్రయత్నించాడు.

అదే సమయంలో హజ్రత్ అబూబకర్ (రజి) యాదృచ్ఛికంగా అక్కడికొచ్చారు. ఆయన ఈ దృశ్యం చూసి మెరుపువేగంతో ఉఖ్బా మీద లంఘించారు. అతడ్ని ఒక్క తోపుతో పక్కకు నెట్టివేశారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మెడలోని తుండుగుడ్డను తీసేస్తూ "ఏమిటీ అన్యాయం? మీరు నా ప్రభువు అల్లాహ్ అన్నంత మాత్రానికే ఒక మనిషిని చంపడానికి ఒడిగట్టారా!" అన్నారు ఎంతో బాధాతప్త హృదయంతో.

అప్పుడు ఖురైషీయులు పళ్ళు పటపట నూరుతూ ఒక్కసారిగా అబూబకర్ (రజి) మీద విరుచుకుపడ్డారు. ఈ రభస చూసి కాబాలోని ఇతరులు కూడా గుమికూడారు. హజ్రత్ అబూబకర్ (రజి) అంతమంది ఖురైషీయుల్ని ఎలా ఎదుర్కోగలరు? ఆయన కాస్సేపు పెనుగులాడారు. అంతలో జనసమూహంలోని కొందరు పుణ్యాత్ములు కలగ జేసుకొని ఎలాగో ఆయన్ని విడిపించారు.

అవిశ్వాసులు ఇస్లాం ప్రచారం నుండి దైవప్రవక్త (స)ను అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని అవేమీ ఫలించకపోవడంతో ఆయన అనుచరులపై దాడి చేయడానికి పూనుకున్నారు. దాంతో ముస్లింలపై గొప్ప విపత్తు వచ్చిపడింది. ముఖ్యంగా పేదముస్లింలు దుర్భర దౌర్జన్యకాండకు గురయ్యారు.

ఇస్లాం ధర్మాన్ని విశ్వసించి అత్యంత కఠిన పరీక్షలలో నెగ్గిన అదృష్టవంతులలో హజ్రత్ బిలాల్ (రజి) కూడా ఒకరు. ఈయన ఉమయ్యా దగ్గర బానిసగా ఉంటున్నారు.

కేవలం ఇస్లాంని విశ్వసించినందువల్ల ఆయన్ని ఉమయ్యా రకరకాలుగా హింసించ సాగాడు. అప్పుడప్పుడు కూడూనీళ్ళూ ఇవ్వకుండా కడుపు మాడ్చేవాడు.

హజ్రత్ అబూబకర్ (రజి) బిలాల్ (రజి) పడుతున్న దారుణమైన బాధలు చూడలేక పోయారు. ఒకరోజు ఆయన ఉమయ్యా ఆటవిక చర్యలు చూసి “ఉమయ్యా! నీకు కాస్తయినా దైవభీతి లేదా? ఆ అమాయకుడ్ని అలా బాధిస్తున్నావు, నువ్వెంత నిర్దయుడ వయ్యా!” అన్నారు.

“అసలు నువ్వే ఇతడ్ని నాశనం చేశావు. ఎందుకూ పనికిరాని ఇలాంటి వాడ్ని పెట్టుకొని నేనేం చేసుకోను?”

“అలాగయితే నా దగ్గర విగ్రహారాధకుడయిన బానిస ఉన్నాడు. నువ్వతడ్ని తీసుకొని బిలాల్ (రజి)ని నాకివ్వు.”

“సరే, నీ బానిసను నాకిచ్చేసి ఇతడ్ని తీసికెళ్ళు” అన్నాడు ఉమయ్యా తనకు మంచి బానిస లభించబోతున్నాడనే సంతోషంతో.

హజ్రత్ అబూబకర్ (రజి) తన బానిసను ఉమయ్యాకు ఇచ్చారు. అతని దగ్గర్నుంచి హజ్రత్ బిలాల్ (రజి)ని తీసుకున్నారు. ఆ తరువాత ఆయన వెంటనే బిలాల్ (రజి)ని శాశ్వతంగా బానిసత్వం నుంచి విముక్తం చేశారు.

ఇస్లామీయ ఉద్యమాన్ని అణచడానికి అవిశ్వాసులకు మరింత అవకాశం లభించింది. వారి కిరాతకచర్యలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. అబూబకర్ (రజి) కూడా అవిశ్వాసుల దౌర్జన్యాలు భరించలేక బిలాల్ (రజి)ని వెంటబెట్టుకొని అబిసీనియాకు ప్రయాణమయ్యారు. దారిలో మక్కా పరిసర ప్రాంతంలో ఉండే ఒక తెగ నాయకుడు ఇబ్నె దుగన్న తారసపడ్డాడు.

“మిత్రమా అబూబకర్! ఎక్కడికీ ప్రయాణం? ఏమిటి ఈ వేషం యోగిలా తయా రయ్యావు?” అని అడిగాడు ఇబ్నె దుగన్న.

“నా తెగవాళ్ళు నన్ను ప్రశాంతంగా దైవారాధన చేయనీయకుండా వేధిస్తున్నారు. వారి వేధింపులు పడలేక నేను అబిసీనియా వెళ్తున్నాను”అన్నారు అబూబకర్ (రజి).

“వారలా ఎందుకు చేస్తున్నారు. నీవు నీ తెగలో ఎంతో మంచివాడివి. కష్టాలలో ఉన్నవారిని ఆదుకునేవాడివి. ఎంతో నిజాయితీపరుడివి. పద, మక్కా వెళ్దాం. నేను నీకు ఆశ్రయమిస్తున్నా. నా రక్షణలో వారు నిన్నేమీ చేయలేరు” అన్నాడు ఇబ్నె దుగన్న.

ఈమాట చెప్పి అతను అబూబకర్ (రజి)ని వెనక్కి పిలుచుకొచ్చాడు. మక్కాలో ఖురైష్‌నాయకులతో “ఖురైషీయులారా! నేను అబూబకర్‌కు రక్షణహామీ ఇచ్చాను. కనుక మీరెవరూ ఈరోజు నుండి ఇతడ్ని ఏమాత్రం వేధించకూడదు” అన్నాడు.



“సరే అలాగే మేమితడ్ని వేధించం. అయితే ఇతను తన ఇంట్లోనే దైవారాధన చేయాలి. ఈమాట ఒప్పుకుంటే మేమితని జోలికి రాము” అన్నారు వారు.

ఈవిధంగా ఇబ్నెదుగన్న అబూబకర్ (రజి)తో మాట్లాడి ఈ షరతు అంగీకరించామని ఖురైషీయులకు తెలియజేశాడు. ఆరోజు నుండి హజ్రత్ అబూబకర్ (రజి) తన ఇంట్లోనే దైవారాధన చేయసాగారు.

దైవప్రవక్త (సల్లం)కు అవిశ్వాసుల వేధింపులతో పాటు, మరోవైపు ఒంటరిజీవితం కూడా ఆయన అంతరంగంలో అనిర్వచనీయమైన ఆవేదనకు తావిచ్చింది. అమితంగా అభిమానించే అనుచరులు నిత్యం ఆయన చుట్టూ పరిభ్రమిస్తున్నా, కన్నకొడుకు కన్నా మిన్నగా చూసుకున్న పెత్తండ్రిలేని వెలితి తీరుతుందా? కష్టసుఖాలలో చేదోడు వాదోడుగా ఉండి ఇస్లామీయ ఉద్యమంలో పాలుపంచుకుంటూ వచ్చిన అర్థాంగి కూడా పోయి నప్పుడు మిత్రుల ఊరడింపు తన హృదయానికి ఏమేరకు చల్లదనం ఇస్తుంది?

ఆయన పరిస్థితి చూసి హజ్రత్ ఖౌలా బిన్ హకీం (రజి) కరిగిపోయారు. ఆమె ఓరోజు దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడి, ఆయన అనుమతి తీసుకొని హజ్రత్ అబూ బకర్ (రజి) ఇంటికి వెళ్ళారు. ఆయన భార్య ఉమ్మెరూమాన్ (రజి)ను కలుసుకొని ఆమెతో ఇలా అన్నారు:

“మీ ఇంట శుభాల పంట! దైవప్రవక్త (సల్లం) మీ అమ్మాయి ఆయిషా (రజి)ను వివాహం చేసుకోవాలనుకుంటున్నారు.”

“నిజమా! ఎంత మంచివార్త! కొంచెం ఆగు ఖౌలా! అబూబకర్‌గారు వచ్చే వేళయింది” అన్నారు ఉమ్మెరూమాన్ (రజి) పట్టరాని సంతోషంతో.

అంతలో అబూబకర్ (రజి) వచ్చారు. ఖౌలా (రజి) ఈవార్త ఆయనకు విన్పించారు. అబూబకర్(రజి) ఎంతో సంతోషించారు. వెంటనే ఆయన ఈ సంబంధం ఒప్పుకున్నారు.

ఆతర్వాత కొన్నాళ్ళకే దైవప్రవక్త (స) వివాహం ఆయిషా (రజి)తో జరిగిపోయింది. అయితే ఆయిషా (రజి) ఇంకా లేతవయస్సులో ఉండటంతో తల్లిదండ్రుల నీడలోనే కొన్నాళ్ళు ఉండవలసివచ్చింది.

## (1) మేరాజ్ సందర్భంలో సిద్దీఖ్ బిరుదు

దైవప్రవక్త (సల్లం) ఓరోజు రాత్రి దైవదూత జిబ్రీల్ (అలైహి)తో పాటు సప్తాకాశాలు పర్యటించి వచ్చారు. ఆ మరునాడు ఉదయం కాబాలయానికి వెళ్ళి ఓ మూల కూర్చొని తన గగనపర్యటన (మేరాజ్) సంఘటన గురించి అవిశ్వాసులకు ఎలా తెలియజేద్దామా అని ఆలోచించసాగారు. అంతలో ఒక అవిశ్వాసి “ముహమ్మద్! ఏమిటి విశేషం, ఈరోజు చాలా మౌనంగా కూర్చున్నావు?” అంటూ కదిలించాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) మేరాజ్ సంఘటన గురించి చెప్పడం ప్రారంభించారు. అవిశ్వాసులు ఆ సంఘటన విని ఆయన్ని హేళన చేయడం మొదలెట్టారు. కాస్సేపటికి హ॥జ్రత్ అబూబకర్ (రజి) కూడా కాబాలయానికి చేరుకున్నారు.

కాబా వెలుపల మేరాజ్‌వార్త గురించి వింతగా చెప్పుకుంటన్న కొందరు ఆయన్ని చూడగానే "అబూబకర్! విన్నావా నీ ప్రియమిత్రుడు ఏమంటున్నాడో? రాత్రి ఆయన బైతుల్‌మఖ్దిస్‌కు పోయి ఆ రాత్రికే అంతదూరం నుంచి తిరిగొచ్చాడట!" అన్నారు.

"ఏమిటి ఆయన అలా అన్నారా? నిజంగానా??" అడిగారు హ॥జ్రత్ అబూబకర్ (రజి) కుతూహలంగా వారి వైపు చూస్తూ.

"ఔనయ్యా బాబూ! సాక్షాత్తు నీ ప్రాణస్నేహితుడు ముహమ్మద్ ఈ సంగతి మా అందరి ముందు బహిరంగంగా ప్రకటించాడు" అన్నారు ఖురైషీయులు.

"అయితే ఆయన చెప్పింది ముమ్మాటికి నిజమే. అందులో నాకెలాంటి అనుమానం లేదు" అన్నారు హ॥జ్రత్ అబూబకర్ (రజి).

"నీకేమయినా మతి పోయిందా? ఒకేఒక రాత్రి వేలమైళ్ళ దూరంలో ఉన్న బైతుల్‌మఖ్దిస్‌కు పోవడం, అదే రాత్రి తెల్లారక ముందే తిరిగిరావడమా! ఇది నమ్మదగిన విషయమేనా?" అన్నారు ఖురైషీయులు ముఖాలు చిట్లించుకొని.

"నిస్సందేహంగా నమ్మదగినదే. ఇదేకాదు ఆయన ఇంతకంటే అద్భుత విషయాలు చెప్పినా నేను నమ్ముతాను. ఎలాంటి సమయంలోనయినా ఆకాశం నుంచి తన దగ్గరకు తృటిలో వార్తలు వస్తుంటాయని ఆయన తరచుగా అంటుంటారు. నాకు మాత్రం అందులో ఎలాంటి వింతా, విడ్డూరం కన్పించదు" అన్నారాయన దృఢవిశ్వాసంతో.

"లాత్, ఉజ్జాల సాక్షి! నీ మాటల్ని మేము ఎన్నటికీ నమ్మలేం. ఇదంతా అబద్ధం, పచ్చి అబద్ధం" అంటూ అరిచారు అవిశ్వాసులంతా కాబాగోడలు దద్దరిల్లి పోయేలా.

"కాదు, ఇది నిజం. ముహమ్మద్ (స) ఎప్పుడూ అబద్ధమాడలేదు. ఆయన చెప్పేది ముమ్మాటికీ నిజం" అన్నారు హ॥జ్రత్ అబూబకర్ (రజి) అప్పుడే లోపలికి ప్రవేశిస్తూ.

ఖురైషీయులు ఒక్కసారిగా ఆయన వైపు చూస్తూ "అయితే నిరూపించమను" అన్నారు. అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) వైపు చూశారు సమాధానం కోసం. అంతలో ముత్యిమ్ అనే అవిశ్వాసి "ముహమ్మద్! ఏది కొంచెం బైతిల్‌మఖ్దిస్‌ని గురించి వివరాలు చెప్పు విందాం" అని అడిగాడు.

"దైవప్రవక్తా! చెప్పండి. సందేహించకండి. నేను స్వయంగా బైతిల్ మఖ్దిస్ చూశాను. దాని వివరాలన్నీ నాకు తెలుసు. మీరు చెప్పేది వీరు కాదనడానికి ఆస్కారం ఉండదు" అన్నారు హ॥జ్రత్ అబూబకర్ (రజి).



దైవప్రవక్త (సల్లం) బైతిల్ మఖ్దిస్‌ని గురించి చెప్పడం ప్రారంభించారు. ఆయన ఇది వరకెప్పుడూ దాన్ని చూడలేదు. ఈ సంగతి అవిశ్వాసులకు కూడా తెలుసు. అంచేత దైవప్రవక్త (సల్లం) అక్కడున్న ఒక్కొక్క వస్తువు స్వరూపం, సైజు, రంగు గురించి పూస గుచ్చినట్లు చెబుతుంటే అంతా ఆశ్చర్యంతో చూస్తున్నారు.

మహాప్రవక్త (సల్లం) చెబుతున్న విషయం పూర్తికాకముందే ఖురైష్‌నాయకులు దిగ్గునలేచి తల అడ్డంగా తిప్పుతూ తిరస్కరించారు.

అప్పటిదాకా దైవప్రవక్త (సల్లం) చెప్పే మాటలు అత్యంతాసక్తితో విన్న అబూబకర్ (రజి) ఆనందం పట్టలేక "దైవప్రవక్తా! మీరు చెప్పినదంతా నిజం. మీరు నిస్సందేహంగా సత్యసంధులు" అన్నారు.

అప్పుడు దైవప్రవక్త (స) తలవంచుకొని కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. తరువాత తలపైకెత్తి "అబూబకర్! దేవుడు నీకు సిద్దీఖ్ (సత్యసంధుడు) అనే బిరుదు ప్రదానం చేశాడు" అని చెప్పారు.

## (౨) మదీనా హిజ్రత్ (వలస)

నబవీశకం 14వ సంవత్సరం సఫర్ నెలలో ఓ రోజు ఖురైష్ నాయకులు దారున్నద్వాలో సమావేశమయి దైవప్రవక్త (సల్లం)ను హతమార్చడానికి పథకం రూపొందించారు.

ఈ హింసాదౌర్జన్యాల వల్ల మక్కాలో ముస్లింల జీవితాలు దుర్భరమై పోయాయి. దైవప్రవక్త (సల్లం) రోజురోజుకు విషమిస్తున్న పరిస్థితి గమనించి, ఈ హింసాకాండ నుంచి బయటపడి ప్రశాంతంగా ధార్మికజీవితం గడిపేందుకు వారికి మదీనా వలస పోయేందుకు అనుమతినిచ్చారు.

ఈ అనుమతితో ముస్లింలు పథకం ప్రకారం ఒక్కొక్కరుగా, జట్లుజట్లుగా మక్కా నుండి బయటపడి రహస్యంగా మదీనా దారిపట్టారు. కాని కొంతమంది ముస్లింలు ఖురైషీయులకు పట్టుబడి పోయారు. ఆ దుర్మార్గులు వారిని నిర్బంధించి మరింత హింసించడం ప్రారంభించారు.

సూర్యుడు గగనం మధ్యకు వచ్చి పుడమి వైపు ఉరిమి చూడసాగాడు. అతని వాడిచూపులు భరించలేక హ॥జ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లోకెళ్ళి తలుపేసుకున్నారు. కాని అంతలోనే బయట తలుపు తట్టిన శబ్దం విన్పిస్తే వెళ్ళి తలుపు తెరిచారు. చూస్తే వాకిలి ముందు మహనీయ ముహమ్మద్ (సల్లం) గంభీర వదనంతో నిల్చున్నారు.

"రండి, రండి. ఇంత తీక్షణమైన ఎండలో ఏదో ప్రత్యేక పనిమీదే వచ్చినట్లున్నారు" అన్నారు అబూబకర్ (రజి) ఆయన్ని చూడగానే.

"ఔను. ఇక్కడ ఇంకెవరైనా ఉన్నారా? ఉంటే అవతలికి పంపు. నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అన్నారు దైవప్రవక్త (స) లోపలికి వచ్చి కూర్చుంటూ.

"ఇక్కడ మీ శ్రీమతి ఆయిషా (రజి) తప్ప ఇంకెవ్వరూ లేరు."

"సరే. నాకు మక్కా నుంచి వలసపోవడానికి అనుమతి లభించింది. అతి త్వరలో నేను ఎస్రిబ్ (మదీనా)కు బయలుదేరాలి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"నిజమా! మరి నాక్కూడా ఈ ప్రయాణంలో మీ సహచర్యభాగ్యం ప్రాప్తమవుతుందా?" అడిగారు హజ్రత్ అబూబకర్ (రజి) ఆదుర్దాగా.

"ఆ..." దైవప్రవక్త (సల్లం) ముక్తసరిగా సమాధానమిచ్చారు.

"మహాభాగ్యం! నేను ముందుగానే వలసపోవడానికి కావలసిన సామగ్రి సిద్ధంచేసి పెట్టాను. రెండుఒంటెల్ని కూడ ఏర్పాటుచేశాను. ప్రయాణసౌలభ్యం కోసం అబ్దుల్లా బిన్ అర్తఖ్‌తో కూడా మాట్లాడాను" త్వరత్వరగా అన్నారు అబూబకర్ (రజి) ఆనందంతో.

"ఒంటెలు ఇప్పుడే అవసరం లేదు. శత్రువులు మనల్ని వెన్నంటి ఉన్నారు. అందువల్ల ముందుగా మనం దక్షిణ దిశగా బయలుదేరి సౌర్‌గుహలో కొన్నాళ్ళు తలదాచుకోవాలి." అన్నారు దైవప్రవక్త (సల్లం) విషయాన్ని విశదీకరిస్తూ.

సౌర్‌గుహ మక్కాకు దక్షిణంవైపు మూడుమైళ్ళ దూరాన యమన్‌కు పోయే దారిలో ఉంది. మదీనా ఉత్తరం వైపుంది. మక్కా వదలిన ముహమ్మద్ (సల్లం) మదీనా దారి పడ్తారని తలచి ప్రతివాడూ ఉత్తరం వైపు పరుగెడుతాడు. ఇలా దైవప్రవక్త (స) తమను వెంబడించేవారికి తామెటుపోయిందో కూడా అర్థంకాని విధంగా పథకం రూపొందించారు. ఆయనీ పథకం గురించి అబూబకర్ (రజి)కు వివరించి వెళ్ళిపోయారు.

ఖురైషీయులు దైవప్రవక్త (స)ను అంతంచేయడానికి ఒక పథకం తయారుచేశారు. తేదీ కూడా నిర్ణయమైపోయింది. నిర్ణయించిన ఆ కాళరాత్రి రానే వచ్చింది.

నలువైపుల నుంచి చీకటి తెరలు అలుముకున్నాయి. నింగిలోని నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ నేల వైపు కళ్ళు చించుకొని చూస్తున్నాయి. గాడాంధకారంలో మక్కా నగరం మౌనముద్ర దాల్చింది. విశ్వకారుణ్యమూర్తి (సల్లం) ఇంటి చుట్టూ శత్రువులు ఈటెలు, ఖడ్గాలు, బాకులు తీసుకొని మాటుకాసి కూర్చున్నారు. కాని ఇస్లామీయఉద్యమ రథసారథి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పరుల హృదయాల్లో సత్యామృతం చిలికించడానికి నడిరేయి కటిక చీకటిలో మక్కా నుండి ఎప్పుడో అదృశ్యమయ్యారు.

స్వస్థలం ఎడబాటుతో పొరలివచ్చిన ఆవేదనను బలవంతంగా దిగమింగి కర్తవ్య న్ముఖులయ్యారు దైవప్రవక్త (స). చీకటిలో చరచరా నడవసాగారు. కొంతదూరం పోయిన



తర్వాత మరోదారి నుంచి ప్రియసహచరుడు అబూబకర్ (రజి) కూడా వచ్చి కలుసుకున్నారు. ఇద్దరూ వేగంగా అడుగులేస్తూ 'సౌర్' గుహకు చేరుకున్నారు.

ఉదయకాంతులతో చీకటి తెరలు క్రమక్రమంగా విడిపోతున్నాయి. దైవప్రవక్త (స), ఆయన ఆప్తమిత్రుడు అబూబకర్ (రజి) కలసి నమాజ్ చేశారు.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) గుహలో ప్రవేశించి రాళ్ళు, ముళ్ళూ తీసేసి నేల శుభ్రం చేశారు. అక్కడక్కడ కన్నాలు ఉంటే గుడ్డపేలికలు చుట్టి వాటిలో పెట్టారు. తరువాత దైవప్రవక్త (స)ను లోపలికి తీసికెళ్ళారు.

దైవప్రవక్త (స) చాల అలసిపోయారు. అంచేత ఆయన అబూబకర్ (రజి) తొడ మీద తలపెట్టి పడుకున్నారు. కాస్సేపటికి ఆయనకు నిద్ర పట్టింది.

హజ్రత్ అబూబకర్ (రజి) గుహలోని కన్నాలన్నీ గుడ్డ పేలికలతో మూసినా ఇంకో కన్నం మిగిలిఉంది. దానిపై ఆయన తనకాలి బొటనవ్రేలు పెట్టారు. అయితే కాస్సేపటికి ఆ కన్నంలో ఏం విషపురుగుందోగాని, అది అబూబకర్ (రజి) కాలికి కాటేసింది. కాని దైవప్రవక్త (స)కు నిద్రాభంగం కలుగుతుందని ఆయన బాధను ఓర్చుకుంటూ అలాగే కదలకుండా కూర్చున్నారు.

కాస్సేపటికి దైవప్రవక్త (స) మేల్కొన్నారు. చూస్తే అబూబకర్ (రజి) లోలోన బాధ పడుతున్నట్లు అన్పించింది. "అబూబకర్! ఏమైంది ఏదో బాధపడుతున్నట్లు ఉన్నావు?"

"దైవప్రవక్తా! ఏమని చెప్పను? ఇదిగో ఈ కన్నం మూసేయడానికి కాలి బొటన వ్రేలు అడ్డంపెడ్తే విషపురుగేదో కరిచింది."

"బాధపడకు. ముందు అక్కడ్నుంచి కాలు తీసెయ్యి" అన్నారు దైవప్రవక్త (స).

అబూబకర్ (రజి) కన్నంపై నుంచి కాలుతీసి దగ్గరకు లాక్కున్నారు. వెంటనే కన్నంలో నుంచి భయంకరమైన ఓ త్రాచుపాము బయటికొచ్చి పడగ విప్పింది.

"సర్పమా! నువ్వు నా ఆప్తమిత్రుడ్ని కాటేసి నా మనస్సు నొప్పించావే!" అన్నారు దైవప్రవక్త (స).

ఈ మాట వినగానే త్రాచుపాము తలవంచి అక్కడ్నుంచి చరచరా వెళ్ళిపోయింది.

ఆ తర్వాత దైవప్రవక్త (స) తన లాలాజలం తీసి అబూబకర్ (రజి) కాలిబొటనవ్రేలిపై రాసి రుద్దారు. మరుక్షణమే పాము విషప్రభావం పోయి అబూబకర్ (రజి)కు బాధ తగ్గిపోయింది. తరువాత దైవప్రవక్త (స) మళ్ళీ నడుంవాల్చి పడుకున్నారు.

కాస్సేపటికి ఓ సాలెపురుగు వచ్చి గుహముఖంపై గూడుఅల్లింది. ఆతర్వాత రెండు పావురాళ్ళు వచ్చి గుహద్వారం ముందు కిచకిచమంటూ ఎగరసాగాయి.

అటు ఖురైషీయులు ఎలాగైనా దైవప్రవక్త (స)ను పట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వారు అడుగుజాడల్ని గుర్తించగలిగే మనిషికోసం వెతికారు. చివరికి కుర్జ్ బిన్ అల్ఖమా అనే వ్యక్తి దొరికాడు. కుర్జ్ బిన్ అల్ఖమా అడుగుజాడల్ని గుర్తించడంలో గొప్ప ప్రవీణుడు.

మరునాడు మధ్యాహ్నం సౌర్ పర్వతం నరరూప రాక్షసుల అరుపులతో దద్దరిల్ల సాగింది. ఖురైషీయులు ఈలలు, అరుపులు, వికటాట్టహాసాలతో కర్రలు, కటారులు తిప్పుకుంటూ కుర్జ్ బిన్ అల్ఖమా వెంట వచ్చారు.

ఆ సమయంలో దైవప్రవక్త (స) తనను చెండాడటానికి వస్తున్న రాకాసిమూకల పొలికేకలకు ఏమాత్రం చలించకుండా ప్రశాంతంగా దైవధ్యానంలో నిమగ్నులై ఉన్నారు. కాని దుష్టుల అరుపులు దగ్గరయ్యే కొద్దీ అబూబకర్ (రజి)లో ఆందోళన అంతకంతకు ఎక్కువ కాసాగింది. తన ప్రియతమ నాయకుడ్ని కాపాడుకునే మార్గం ఏమిటీ?

“అయ్యో! నేను ముహమ్ముద్‌ను నా హృదయంలో దాచుకోగలిగితే ఎంత బాగుండు! శత్రువుల కంటబడకుండా ఆయన్ని నా దేహంతో కప్పగలిగితే నేనెంత అదృష్టవంతుడ్ని!!” ఆయన హృదయం విలపించింది.

కుర్జ్ ఎంతోజాగ్రత్తగా దారిలో పాదచిహ్నాలు చూసుకుంటూ కొండ మీదికి ఎక్కాడు. ఖురైషీయులు అతని వెనకాలగా నడుస్తున్నారు. కుర్జ్ కొండ మీదికి పోయి హఠాత్తుగా ఒక చోట ఆగాడు. తరువాత ఎటు పోవాలో అర్థంగాక అయోమయంగా చూడసాగాడు. అతని దేహం నుండి చెమట కారుతోంది. చివరికి అతను దిక్కుతోచక దిగాలుపడిపోయి నిలబడ్డాడు. అతని వాలకం చూసి ఖురైషీయులకు ఆశ్చర్యం కలిగింది.

“ఏమయింది? అకస్మాత్తుగా ఆగిపోయి అలా దిక్కులు చూస్తున్నావేమిటీ?”

“వాళ్ళిద్దరు ఈ రాయి దాకా వచ్చారు. ఆ తరువాత ఎటు పోయారో తెలియడం లేదు” అన్నాడు కుర్జ్ ఎదురుగా ఉన్న ఓ రాతి వైపు చూపిస్తూ.

“ఇబ్నె అల్ఖమా! ఈరోజు ఏమయింది నీకు? ఇలా ఇదివరకెప్పుడూ పొరబడలేదే నీవు!” అన్నారు ఖురైషీయులు వస్తున్న కోపాన్ని తమాయించుకుంటూ.

కొద్దిదూరంలో వారికి ఓ పశువులకాపరి కన్పించాడు. ఖురైషీయులు అతని దగ్గరకు పోయి “కొండ మీదికి ఇద్దరు మనుషులు రావడం చూశావా నువ్వు?” అని అడిగారు.

“నేనెవరినీ చూడలేదు. వారిద్దరు ఆ గుహలో ఉంటారేమో చూడండి” అన్నాడు పశువులకాపరి కొండ ఎగువభాగాన కొద్ది దూరంలో ఉన్న గుహ వైపు చూపిస్తూ.

ఖురైషీయులు వెంటనే పైకెక్కి గుహ వైపు వడివడిగా నడవసాగారు. అందరి చేతుల్లో కత్తులు, ఈటెలు, విల్లంబులు ఉన్నాయి. అందరి హృదయాల్లో ఒకే దీక్ష!



ఒకే కాంక్ష!! ముహమ్మద్ (స)ని వధించే అదృష్టం తనకే దక్కాలి. అంచేత గుహ దగ్గరవుతున్న కొద్దీ వారి ఆరాటం, ఆర్భాటాలు ఎక్కువ కాసాగాయి.

వారిలో ఒక యువకుడు అతి వేగంగా గుహ వైపు పరుగెత్తాడు. కాని గుహ ఇంకా కొన్ని గజాల దూరం ఉందేమో, ఠక్కున ఆగిపోయాడు. రెండు క్షణాలు అటూ ఇటూ అయోమయంగా చూసి, నిరుత్సాహంతో వెనక్కి మరిలాడు. వెనకాల వడివడిగా అక్కడికి చేరుకున్న ఖురైషీయులు అతడ్ని చూసి విస్తుబోయారు.

గుహ లోపలున్న అబూబకర్ (రజి)కు గుహ బయట కొద్ది దూరంలో ఉన్న శత్రువుల పాదాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దాంతో ఆయన దైవప్రవక్త (సల్లం)కు ప్రమాదం ముంచుకొస్తుందేమోనని భావించి కంగారు పడసాగారు. దైవప్రవక్త (సల్లం) ధ్యానం ముగిసింది. ఆయన అబూబకర్ (రజి) ముఖంలోని ఆందోళనను గమనించి “భయపడకు. దేవుడు మనకు తోడున్నాడు” అన్నారు ధైర్యం చెబుతూ.

ఖురైషీయులు ఆ యువకుని వైపు ఆశ్చర్యంగా చూస్తూ “ఏమయింది వెనక్కి తిరిగావు, గుహలోకి తొంగయినా చూడకుండా” అని అడిగారు ఆదుర్దాగా.

“ఏమని చెప్పను? బహుశా అప్పటికి ముహమ్మద్ పుట్టనైనా పుట్టివుండడు. అప్పటి నుంచి గుహమీద పెద్ద సాలెగూడు అల్లుకొనివుంది. గుహ బయట రెండు పావురాళ్ళు గుడ్లు పెట్టి ఎగురుతున్నాయి. దారిలో పెద్ద చెట్టు కూడా ఉంది. ఇక అలాంటి గుహలో మనుషులు ఉంటారని ఎలా అనుకోను?” అన్నాడా యువకుడు రొప్పుతూ.

ఆ యువకుని మాటలు విని ఖురైష్ నాయకుల ముఖాలు జావగారి పోయాయి. చివరికి అందరూ నిరాశా నిస్పృహలతో చేతులు నులుపుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు.

అవిశ్వాసులు తనను ఇంకా వెంటాడుతూ ఉండవచ్చని దైవప్రవక్త (స) మూడు రోజుల దాకా సౌర్‌గుహలోనే ఉండవలసి వచ్చింది. ఈ మూడు రోజులు అబూబకర్ (రజి) కొడుకు అబ్దుల్లా (రజి) పగలంతా నగరంలో తిరిగి, ఖురైషీయులు దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఏమేమి కుట్రలు పన్నుతున్నారో తెలుసుకొని రాత్రిపూట వచ్చి సమాచారం అందజేసేవారు. ఆయన చెల్లెలు అస్మా (రజి) తండ్రికి, దైవప్రవక్త (స)కు అన్నం నీళ్ళు తెచ్చిచ్చేవారు. అబూబకర్ (రజి) సేవకుడు ఆమిర్ బిన్ ఫుహైరా మేకలను మేపుకుంటూ గుహ దగ్గరకు వచ్చేవాడు.

హజ్రత్ అస్మా (రజి) తెచ్చిన అన్నం దైవప్రవక్త (స), అబూబకర్ (రజి) తినేవారు. ఆ తరువాత అస్మా (రజి), అబ్దుల్లా (రజి) గుహ దగ్గర్నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు శత్రువులు అడుగుజాడల్ని గుర్తించడానికి వీలులేకుండా ఉండేందుకు ముందు వారిద్దరు నడుస్తుంటే వారి వెనుక ఆమిర్ మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు.

ఇలా మూడు రోజులు గుహలో గడిపి, అబ్దుల్లా (రజి) సేకరించిన సమాచారాన్ని బట్టి శత్రువులు తమను వెంటాడటం మానేశారని నిర్ధారణ చేసుకున్నారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) కొడుకుతో "నేను మన ఇంటి దగ్గర రెండు ఒంటెల్ని సిద్ధంచేసి ఉంచాను. నీవు వెంటనే పోయి, ఎవరికీ తెలియకుండా వాటిని తీసుకురా. వచ్చేటప్పుడు ఇబ్నెఅర్ఖత్‌ను కూడా పిలుచుకురా" అని చెప్పి పంపించారు.

ఆ సాయంకాలమే అబ్దుల్లా (రజి) గుహ దగ్గరకు తిరిగొచ్చారు. ఆయన వెంట అస్మా (రజి), ఆమిర్ కూడా ఉన్నారు. వారి వెనకాల ఇబ్నెఅర్ఖత్ ఒంటెలను తోలుకొని వచ్చాడు. ఇబ్నెఅర్ఖత్ ముస్లిమేతరుడు అయినప్పటికీ అబూబకర్ (రజి)కు ఎంతో నమ్మకస్తుడు. అందువల్ల అబూబకర్ (రజి) అతనికి కొంత పైకం ముట్టజెప్పి తమను నిర్జనప్రాంతం గుండా మదీనా తీసికెళ్ళటానికి మార్గదర్శిగా కుదుర్చుకున్నారు.

దైవప్రవక్త (స) ఒకఒంటెపై, ఆయన సహచరుడు మరోఒంటెపై కూర్చున్నారు. ఇబ్నెఅర్ఖత్ తన సొంతఒంటె మీద కూర్చున్నాడు. అబూబకర్ (రజి) తన వెనుక సేవకుడు ఆమిర్‌ని కూర్చోబెట్టుకున్నారు. అలా ఈ నలుగురూ కలసి క్రీ.శ. 16-9-622 న ఇబ్నెఅర్ఖత్ సారథ్యంలో నిర్మానుష్యంగావున్న తీరప్రాంతం గుండా ప్రయాణమయ్యారు.

ప్రవక్త (స) ప్రయాణం ఒకరాత్రి, ఒక పగలు నిరాటంకంగా సాగింది. శత్రువులెవరూ వెంటాడుతున్న సూచనలు లేకపోవడంతో అందరూ నిశ్చింతగా ప్రయాణిస్తున్నారు.

మరుసటిరోజు మధ్యాహ్నంవేళ. ఎండ తీవ్రంగా ఉంది. ప్రయాణ బడలికతో విశ్రాంతి తీసుకుందామని తలచి అందరూ ఓ చెట్టు క్రింద దిగారు. హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) కోసం ఓ చోట శుభ్రపరచి మేకచర్మం పరిచారు. తరువాత వెంట తెచ్చిన అన్నం మూట విప్పి ముందుంచారు. అందరూ కలసి అన్నం తిన్నారు. భోజనం ముగిసిన తరువాత దైవప్రవక్త (స) కాస్సేపు నిద్రపోవడానికి ఉపక్రమించారు.

సాయంత్రం కావచ్చింది. ఎండ తీక్షణత కూడా తగ్గింది. ప్రవక్త బృందం ప్రయాణం కొనసాగించడానికి సిద్ధమయింది. అంతలో అకస్మాత్తుగా అబూబకర్ (రజి) దృష్టి దక్షిణ దిక్కు వైపుగా మళ్ళింది. ఎవరో ఒక వ్యక్తి గుర్రం మీద వేగంగా ఇటువైపే వస్తున్నాడు. దాంతో అబూబకర్ (రజి) గుండెలు దడదడ లాడిపోయాయి.

"దైవప్రవక్తా! మనం పట్టుబడి పోయాం. అదిగో అటు చూడండి శత్రువు వస్తున్నాడు" అన్నారు కంగారుపడుతూ ఆయన.

కాని దైవప్రవక్త (స) ముఖంలో ఆందోళన మచ్చుకైనా లేదు. "అబూబకర్! కంగారు పడకు. దైవం మనకు తోడున్నాడు" అన్నారు ఆయన ధైర్యం చెబుతూ.

ఒక రౌతు దైవప్రవక్త (స)ను వెంబడిస్తూ దారిలో మూడు పల్టీలు కొట్టి ముందుకు సాగలేక దైవప్రవక్త (స)ను, ఆయన సహచరుల్ని కేకవేసి పిలుస్తూ "నేను మాలిక్ బిన్



జూషమ్ కొడుకు సురాఖాను. కొంచెం ఆగండి, మీతో మాట్లాడాలి. నేను మీకు ఎలాంటి హాని తలపెట్టను. నామాట నమ్మండి" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఈమాట విని సురాఖా కోసం దైవాన్ని ప్రార్థించారు. దాంతో ఇసుకలో కూరుకుపోయిన సురాఖా గుర్రం బయటపడింది. అప్పుడతను దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి ఇలా అన్నాడు వినయంగా :

"దైవప్రవక్తా! ఖురైషీయులు మిమ్మల్ని పట్టితెచ్చేవారికి వందఒంటెలు బహుమానం ఇస్తామని ప్రకటించారు. ఆ బహుమానం కోసం అనేకమంది మిమ్మల్ని పట్టుకోవడానికి పట్నం నలుదిక్కులా పరుగెత్తారు. వందఒంటెల పేరాశ నన్ను కూడా వివశుడ్ని చేసింది. దైవప్రవక్తా! నన్ను క్షమించండి. నేనిప్పుడు మిమ్మల్ని వెంటాడేవాళ్ళను ఆపి వెనక్కి పంపిస్తాను. నాకో శాంతిపత్రం రాసివ్వండి చాలు."

ఈమాటలు విని దైవప్రవక్త (స)కు దయ కలిగింది. అతను కోరినట్లు అబూబకర్ (రజి) చేత శాంతిపత్రం రాయించి ఇచ్చారు. సురాఖా దాన్ని తీసుకొని తిరిగి వెళ్ళిపోవడానికి గుర్రం ఎక్కాడు. అప్పుడు దైవప్రవక్త (స) "సురాఖా! నువ్వు కిస్రా (ఈరాన్ చక్రవర్తి) కంకణం ధరించినప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!" అన్నారు సురాఖా వైపు చిరునవ్వుతో చూస్తూ.

"ఏమిటీ! నేను కిస్రాకంకణం ధరించడమా!!" సురాఖా నోరు తెరచి సంభ్రమాశ్చర్యాలతో దైవప్రవక్త(స) వైపు చూడసాగాడు. "ఔను. నువ్వు ఈరాన్‌చక్రవర్తి కంకణం ధరిస్తావు" అన్నారాయన మళ్ళీ.

"దైవప్రవక్తా! నాకు నమ్మకం ఉంది. మీమాట ఎన్నటికీ అసత్యం కాదు. ఇక నేను వెళ్తున్నాను" అంటూ సురాఖా గుర్రం అదిలించి మక్కా వైపు బయలుదేరాడు.

సూర్యుడు నిప్పులు చెరగుతున్నాడు. దాహంతో నాలుకలు పిడచ కట్టుకొని పోతున్నాయి. కాని దరిదాపుల్లో ఎక్కడా నీటిచుక్కయినా ఉన్నట్లు జాడ లేదు. మరికొన్ని మైళ్ళు ప్రయాణంచేసిన తర్వాత ఆశలు రేకెత్తిస్తూ దూరాన కొన్నిగుడారాలు కన్పించాయి. వెంటనే దైవప్రవక్త (స), ఆయన అనుచరులు ఆ గుడారాల వైపు నడిచారు.

బాటసారుల్లో హజ్రత్ అబూబకర్ (రజి)ని చూడగానే గుడారాల దగ్గర్నుంచి ఒక వ్యక్తి వడివడిగా వచ్చి "రండి, రండి. అబూబకర్! మేమెంతో అదృష్టవంతులం. ఈరోజు మక్కాకు చెందిన ప్రముఖవ్యాపారి మాకు అతిథి అవుతున్నాడు" అన్నాడు.

అబూబకర్ (రజి) అతనికి కృతజ్ఞతలు చెప్పి మిత్రులతో గుడారాల దగ్గరకు చేరుకున్నారు. ఓ పెద్ద గుడారంలోకి ప్రవేశిస్తూ "బురైదా! దాహం వేస్తోంది. ముందు మాకు నీళ్ళు ఇప్పించు" అన్నారు ఆయన.

"ఏమిటి నీళ్ళా! మేము మీకు కనీసం పాలయినా ఇవ్వలేని దౌర్భాగ్యులమా? ఉండండి, ఇప్పుడే రెండుక్షణాల్లో పాలు తెప్పిస్తాను" అంటూ బురైదా పాలు తీసుకు రమ్మని ఓ మనిషిని పంపించాడు. అతను వెంటనే వెళ్ళి ఓ పాత్రనిండా పాలు తెచ్చాడు. అబూబకర్ బృందం కడుపునిండా పాలు తాగి ఆకలి, దాహం తీర్చుకున్నారు.

బురైదా దైవప్రవక్త (స) వైపు మాటిమాటికి చూస్తూ "అబూబకర్! ఈయనగారు ఎవరు? నేనెప్పుడూ చూడలేదే!" అన్నాడు.

"ఈయన నాకు దారి చూపడానికి వచ్చిన మార్గదర్శి. పేరు ముహమ్మద్ (స)."

"ఎవరూ? మన తాతముత్తాతల మతాన్ని మంటగలిపి, మన దేవతలకు అపచారం తలపెడ్తున్న ముహమ్మదా ఈయన!?" అన్నాడు బురైదా.

"బురైదా! బుద్ధిమంతులు ప్రతి విషయాన్నీ ప్రశాంతహృదయంతో జాగ్రత్తగా వింటారు. ఆ తర్వాత మంచీచెడుల విచక్షణ చేసి అంతరాత్మ ప్రబోధనం ప్రకారం నడుచుకుంటారు" అన్నారు దైవప్రవక్త (స) తక్షణమే.

"సరే ఇంతకూ మీరు చెప్పదలచుకున్నదేమిటో చెప్పండి" అన్నాడు బురైదా.

"ఈ విగ్రహాలు మీరు, మీ తాతముత్తాతలు తయారుచేసుకున్నవే కదా! ఇలా మనుషులు తయారుచేసిన విగ్రహాలు దేవుళ్ళు ఎలా అవుతాయి? సర్వసృష్టికర్త, విశ్వప్రభువు, అగోచర జ్ఞానసంపన్నుడు, జీవన్మరణాలకు మూలకారకుడయినవాడే మనకు దేవుడవుతాడు. ఆయన్ని మాత్రమే మనం ఆరాధించాలి......." అంటూ వివరించారు దైవప్రవక్త (స).

బురైదా ఈ మధురవాక్కులు విని "ఈరోజు నేను ఎంత మంచి విషయాలు విన్నాను! మిమ్మల్ని గురించి ఇదివరకే విని ఉన్నాను. కాని నేనప్పుడు అంతగా పట్టించుకోలేదు. మీరు నిజంగా దైవప్రవక్త (స) అని నాకిప్పుడు నమ్మకం కలిగింది. అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్నాడు బురైదా.

బురైదా ముస్లిం అయినందుకు దైవప్రవక్త (స) సంతోషం వ్యక్తపరిచారు.

తమ నాయకుడు ముస్లిం కావడం చూసి బురైదా అనుచరులు కూడా సద్వచనం పఠించి ముస్లింలై పోయారు. వారంతా డెబ్భయి మంది ఉన్నారు. ఒకేసారి అంతమంది ముస్లింలుగా మారినందుకు హజ్రత్ అబూబకర్ (రజి) కూడా హర్షం వెలిబుచ్చారు.

ఈ విధంగా వారు సుదీర్ఘప్రయాణం తర్వాత నబవీశకం 14వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ 8వ తేదీన ఖుబా అనే గ్రామానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి మదీనా మూడు మైళ్ళే ఉంది. ఖుబావాసుల్లో అత్యధికమంది ఇదివరకే ముస్లింలై ఉన్నారు



గనక, వారు దైవప్రవక్త (స)ను స్వాగతకుసుమాల్లో ముంచెత్తారు. దైవప్రవక్త (స) ఖుబా గ్రామంలో పధ్నాలుగు రోజులు ఉండి, అక్కడి ముస్లింలకు తగిన శిక్షణ గరిపారు. ఆ తరువాత ఆయన ముఖ్య అనుచరులతో కలసి మదీనా నగరానికి బయలుదేరారు.

## (3) యుద్ధఖైదీలు, ధనత్యాగం

బదర్ యుద్ధ సన్నాహాల సందర్భంలో దైవప్రవక్త (స) అనుచరుల్ని సమావేశపరచి "ఒకవైపు ఉత్తరాన ఖురైషీయుల వర్తకబిడారాలు ఉన్నాయి. మరోవైపు దక్షిణాన వారి సైన్యం వస్తోంది. ఈ రెండింటిలో ఏదోఒకటి మనకు లభిస్తుందని దేవుడు వాగ్దానం చేశాడు. కనుక ఎటు పోదామో చెప్పండి" అని అడిగారు.

కొందరు వాణిజ్యబృందం ఉన్న వైపుకెళ్దాం అన్నారు. కాని దైవప్రవక్త (స)కు అందులో ఔచిత్యం ఉన్నట్లు అన్పించలేదు. అంచేత ఆయన మళ్ళీ అదే ప్రశ్న అడిగారు.

వాస్తవ పరిస్థితి అర్థం చేసుకున్న హజ్రత్ అబూబకర్ (రజి) లేచి ఇలా అన్నారు:

"మక్కాలో ఉన్నంతకాలం ఖురైషీయులు మనకు దారుణమయిన చిత్రహింసలు పెట్టారు. వారి దౌర్జన్యకాండ భరించలేక ఇల్లూవాకిలి వదలిపెట్టి వస్తే, ఇక్కడా మనల్ని వదలి పెట్టడంలేదు. అలాంటి దుర్మార్గుల్ని ఇక సహించకూడదు. అందువల్ల మనం ఖురైష్‌సైన్యం వస్తున్న దిశకే వెళ్దాం. దైవప్రసన్నత కోసం, ధర్మరక్షణ కోసం ప్రాణాలైనా త్యజించి పోరాడుదాం."

"రెండు వర్గాలలో ఒక వర్గం మీకు చేజిక్కుతుందని దేవుడు మీకు వాగ్దానం చేశాడు. ఆ సందర్భం కాస్త గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మీరు (ఆయుధాలు లేని) బలహీన (వ్యాపార) వర్గం మీకు చేజిక్కితే బాగుంటుందని భావించసాగారు. కాని దేవుడు తన ఆదేశాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించదలిచాడు. అంతేకాకుండా నేరస్థులకు ఎంత వెగటు అన్పించినా సత్యం సత్యంగా, అసత్యం అసత్యంగా రుజువు కావడానికి ఆయన అవిశ్వాసుల్ని పూర్తిగా తుడిచిపెట్టాలని కూడా సంకల్పించుకున్నాడు." (ఖుర్ఆన్-8:7,8)

ఒకసారి హజ్రత్ అలి (రజి) ప్రజలతో మాట్లాడుతూ "మీ దృష్టిలో అత్యంత ధైర్యశాలి ఎవర"ని అడిగారు. దానికి వారు మీరే అన్నారు. అలి (రజి) ఈమాట విని "నేను ఎల్లప్పుడూ నాతో సమాన ఉజ్జీతోనే పోరాడాను. ఇది ఏమంత సాహసం కాదు. అత్యంత సాహసవంతుడు ఎవరో చెప్పండి" అని అన్నారు. ప్రజలు తమకు తెలియ దన్నారు. అప్పుడు అలి (రజి) ఇలా అన్నారు: "అబూబకర్ అందరికంటే అత్యంత సాహసవంతుడు. బదర్‌యుద్ధం సందర్భంగా మేము దైవప్రవక్త (స) కోసం ఓ ప్రత్యేక శిబిరం నెలగొల్పాము. అప్పుడు మాలో ఒకరు బహుదైవారాధకుల నుండి దైవప్రవక్త (స)ను కాపాడటానికి ఆయన దగ్గర ఎవరుంటారని అడిగాడు. దైవసాక్షి! మాలో

ఏ ఒక్కరూ ఆ బాధ్యత తీసుకోవడానికి సాహసించలేక పోయారు. అప్పుడు అబూబకర్ (రజి) వరలేని ఖడ్గంతో నిలబడి ఒక్క శత్రువుని కూడా దగ్గరకు రాకుండా చేశారు...."

కొన్నాళ్ళకు దైవప్రవక్త (స) బదర్ యుద్ధఖైదీల సమస్యను గురించి చర్చించడానికి అనుచరులను సమావేశపరచి ఖైదీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో చెప్పమని అడిగారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచారు:

"దైవప్రవక్తా! నష్టపరిహారం తీసుకొని వదలిపెడ్తే మంచిదని నా అభిప్రాయం. ఇలా చేయడంవల్ల ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద ముస్లింలకు ధనసహాయం అందించినట్లూ ఉంటుంది; మరోవైపు దైవానుగ్రహమయితే మనసు మారి ఖైదీలు ఇస్లాం స్వీకరించనూవచ్చు."

హజ్రత్ అబూబకర్ (రజి) దైవమార్గంలో తన సర్వస్వాన్ని ధారపోయడానికి సైతం వెనుదీయని గొప్ప దానశీలురు. ఇస్లాం స్వీకరించేనాటికి ఆయన దగ్గర నలభైవేల దిర్హంల పైకం ఉండేది. ఆ పైకాన్నంతా ధర్మవికాసం కోసం దైవప్రవక్త (స)కు సమర్పించు కున్నారు. దైవప్రవక్త (స) ఒకసారి ఆయన దానశీలతను ప్రశంసిస్తూ "నేను అందరి ఉపకారాన్ని తీర్చాను. కాని అబూబకర్ ఉపకారం ఇంకా మిగిలివుంది. దానికి ప్రళయ దినాన దేవుడు బదులు తీరుస్తాడు. అబూబకర్‌ధనం వల్ల నాకెంత ప్రయోజనం చేకూరిందో ఇతరుల ధనంవల్ల నాకంత ప్రయోజనం చేకూరలేదు" అని అన్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి) దైవమార్గంలో ధనత్యాగం చేసే విషయంలో ఎల్లప్పుడూ అందరికంటే ముందుండేవారు. తబూక్ దండయాత్ర కోసం దైవప్రవక్త (సల్లం) విరాళాలు అందజేయవలసిందిగా అనుచరులకు విజ్ఞప్తి చేశారు. అప్పుడు అనేకమంది తమతమ తాహతును బట్టి భూరి విరాళాలు అందజేశారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: "నేనీ విషయంలో అబూబకర్‌ని మించి పోవాలని నిర్ణయించుకొని నా యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చాను. దైవప్రవక్త (స) అది చూసి 'భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చావా లేదా?' అని అడిగారు. దానికి నేను "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను' అన్నాను. ఆ తరువాత అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (స) పాదాలచెంత పోశారు. దైవప్రవక్త (స) నన్ను అడిగినట్లే 'అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలి పెట్టావు?' అని అడిగారు. దానికాయన 'భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు' అని అన్నారు. నేనీ అసాధారణ దాతృత్వం చూసి 'నేనిక ఎప్పుడూ ఏ విషయంలో కూడా అబూబకర్‌ని మించిపోలేను' అని భావించాను.

ఒకరోజు దైవప్రవక్త (స) తన అనుచరులతో మాట్లాడుతూ "ఈరోజు మీలో ఎవరైనా ఉపవాసం ఉన్నారా?"అని అడిగారు. తర్వాత ఆయన "ఈరోజు మీలో ఎవరైనా



ఎవరి జనాజా నమాజయినా చేశారా?" అనడిగారు మళ్ళీ. ఈ రెండు ప్రశ్నలకు ఎవరి నుండీ సమాధానం రాలేదు. చివరికి అబూబకర్ (రజి) "దైవప్రవక్తా! నేనీ రోజు ఉపవాసం ఉన్నాను; జనాజా నమాజ్ కూడా చేశాను" అని చెప్పారు.

అదే విధంగా దైవప్రవక్త (స) మరి కొన్ని విషయాలు అడుగుతూ "ఈరోజు మీలో ఎవరైనా ఏ పేదవాడికైనా అన్నదానం చేశారా? ఏ రోగినయినా పరామర్శించారా?" అనడిగారు. వీటికి కూడా అందరూ మౌనం వహించారు. అబూబకర్ (రజి) మాత్రమే "నేను చేశాను, నేను పరామర్శించాను" అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఒక్క రోజులో ఇన్ని పుణ్యకార్యాలు చేసినవాడు తప్పకుండా స్వర్గానికి పోతాడు" అని చెప్పారు.

# (4) ప్రవక్త (స) పట్ల ప్రేమ, నమాజ్ నాయకత్వం

దైవప్రవక్త (సల్లం) తన వీడ్కోలు కాబాయాత్ర సందర్భంలో అర్ఫాత్‌లో ప్రసంగం చేసిన తర్వాత నమాజ్ చేయించారు. లక్షమందికి పైగా దైవదాసులు విశ్వప్రభువు సన్నిధిలో మోకరిల్లారు. నమాజ్ తర్వాత ఆయనపై ఇలా దైవవాణి అవతరించింది:

"నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవనవ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీకోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను." (ఖుర్‌ఆన్-5:4)

ఈసూక్తి వినగానే హజ్రత్ అబూబకర్ (రజి) కళ్ళ నుండి అశ్రువులు జలజల రాలాయి. దైవప్రవక్త (సల్లం) ఇహలోకానికి వచ్చిన పని ముగిసిందని, ఇక ఆయన తనువుచాలించే తరుణం ఆసన్నమయిందని గ్రహించి ఆయన భోరున విలపించారు.

దైవప్రవక్త (సల్లం) వీడ్కోలు కాబాయాత్ర నుండి తిరిగొచ్చి మూణ్ణెల్లయినా కాలేదు, వ్యాధిగ్రస్తులయ్యారు. దైవప్రవక్త (స) ఓరోజు మగ్రిబ్‌నమాజ్ చేయించడానికి అతి కష్టం మీద మసీదుకు వెళ్ళారు. మసీదు నుంచి ఇంటికొచ్చిన తరువాత జ్వరం తీవ్రమయింది. లేచి నిలబడలేనంత బలహీనులయ్యారు.

ఇషా నమాజ్ వేళ అయింది. ఆయన మసీదులో కూర్చున్న సహచరుల్ని ఉద్దేశించి "నమాజ్ అయిందా?" అని అడిగారు. "కాలేదు మీ కోసమే మేము ఎదురుచూస్తున్నాం" అన్నారు సహచరులు. ఆ తరువాత దైవప్రవక్త (స) నీళ్ళు తెప్పించి స్నానం చేశారు. లేచి నిలబడబోతే సొమ్మసిల్లి పడిపోయారు. ఇలా మూడు సార్లు జరిగింది. అంచేత ఆయన "నమాజ్ చేయించమని అబూబకర్‌కు చెప్పండి" అని ఆదేశించారు. అనుచరుల్ని. "కాని, దైవప్రవక్తా! ఆయన కంఠస్వరం చాలా చిన్నది. ఖుర్‌ఆన్ పఠిస్తూ ఆయన దుఃఖిస్తారు. ప్రజలు ఆయన కంఠస్వరం సరిగా వినలేరు" అన్నారు ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి).

"నమాజ్ చేయించమని అబూబకర్‌కు చెప్పండి" అన్నారు ఆయన తిరిగి. హజ్రత్ ఆయిషా (రజి) ప్రాధేయపడుతూ తిరిగి అవే మాటలు పలికారు. "అబూబకర్‌కు చెప్పండి నమాజ్ చేయించమని" అన్నారు మళ్ళీ దైవప్రవక్త (స) చిరుకోపంతో.

అప్పుడాయన ఆదేశానుసారమే హజ్రత్ అబూబకర్ (రజి) నమాజ్ చేయించారు. ఆరోజు నుంచి ఆయనే నమాజ్ చేయించడం ప్రారంభించారు. అలా కొన్ని రోజులు గడిచాయి. దైవప్రవక్త (స) ఆరోగ్యం కాస్త కుదుటపడినట్లు అన్పించింది. అప్పుడాయన నమాజ్ కోసం మసీదుకు వెళ్ళాలని సంకల్పించుకున్నారు.

అది జుహర్ వేళ. దైవప్రవక్త (స) స్నానం చేశారు. బట్టలు తొడుక్కున్నారు. తలపాగ పెట్టుకున్నారు. అలి (రజి), ఫజల్ బిన్ అబ్బాస్ (రజి)ల భుజాలపై చేతులు వేసి, నేల మీద కాళ్ళు ఈడుస్తూ అతి కష్టం మీద మసీదుకు వెళ్ళారు.

సరిగ్గా అదే సమయంలో హజ్రత్ అబూబకర్ (రజి) నమాజ్ చేయించడానికి ఇమాం స్థానం మీదికెళ్ళి నిల్చున్నారు. దైవప్రవక్త (స) వస్తున్నట్లు అలికిడి వినగానే ఆయన ఇమాం స్థానం నుండి తప్పుకోబోయారు. కాని దైవప్రవక్త (స) వారిస్తూ ఆయన పక్కన పోయి కూర్చున్నారు. నమాజ్ ముగిసింది. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) శ్రోతలను ఉద్దేశించి ఓ చిన్న ప్రసంగం చేశారు:

"సోదరులారా! నేను చనిపోతానేమోనని మీరు ఆందోళనపడుతున్నట్లు నాకు తెలిసింది. కాని నాకు పూర్వం వచ్చిపోయిన దైవప్రవక్తలందరికీ మరణం తప్పలేదు. నేను కూడా వారిలో ఒక దైవప్రవక్తనే కదా! దేవుడు తన దాసుల్లో ఒకనికి, ఈ ప్రపంచలోనయినా ఉండవచ్చని లేదా తన అనుగ్రహఛాయలోకయినా రావచ్చని అధికారం ఇచ్చాడు. అప్పుడా దాసుడు దేవుని అనుగ్రహఛాయలోకి వెళ్ళే విషయానికే ప్రాధాన్యం ఇచ్చాడు."

ఈ మాటలు వినగానే హజ్రత్ అబూబకర్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. ఇక దైవప్రవక్త (స) త్వరలోనే ఇహలోకం వీడనున్నారని గ్రహించి ఆయన పసిపిల్లవాడిలా విలపించారు. దైవప్రవక్త (స) ఆయన్ని ఓదార్చారు. ఆయన మైత్రిని, ఔన్నత్యాన్ని గురించి అందరి ముందు ప్రశంసించారు.

హిజ్రీశకం 11వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ మాసం 12వ తేది, సోమవారం విశ్వకారుణ్యమూర్తి (స) యావత్తు ముస్లింజగత్తును శోకసముద్రంలో ముంచిపోయారు. ఈ విషాదవార్త హజ్రత్ అబూబకర్ (రజి) చెవిన పడగానే క్షణంపాటు ఆయన నోట మాట పెగల్లేదు. ఆ తరువాత కాస్త తేరుకొని ఆయన ఆదరాబాదరగా హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి పరుగెత్తారు. అప్పటికే అక్కడ వేలాదిమంది ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడారు. వారి కళ్లు కుండపోతలా కన్నీళ్ళు వర్షిస్తున్నాయి.



హజ్రత్ అబూబకర్ (రజి) మౌనంగా లోపలికి వెళ్ళారు. దుప్పటి తొలగించి దైవప్రవక్త (సల్లం) ముఖపద్మాన్ని తనివితీరా దర్శించారు. కళ్ళ నుండి అశ్రుధారలు కారుతుండగా ఆయన దైవసందేశహరుని (స) నుదుటిపై ముద్దాడారు.

"దైవప్రవక్తా! జీవించి ఉన్నప్పుడు కూడా మీరు బాగున్నారు. మరణించిన తరువాత కూడా మీరు బాగుంటారు. నిస్సందేహంగా ఇది మీ కోసం దైవం లిఖించిన మరణం తప్ప మరేమీ కాదు. దీని తరువాత మీకు మరెన్నటికీ మరణం సంభవించదు" అన్నారు ఆయన పొంగివస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ.

హజ్రత్ అబూబకర్ (రజి) కన్నీటితో దైవప్రవక్త (స)కు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తరువాత ఆయన బయటికొచ్చి మసీదుకు వెళ్ళారు. మసీదులో ప్రవక్త అనుచరులు తమ ప్రియతమ నాయకుడ్ని తలచుకొని ఇంకా కన్నీరుమున్నీరుగా దుఃఖిస్తూనే ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) మాత్రం దైవప్రవక్త (స) బ్రతికే ఉన్నారని చెబుతూ ఆవేశంగా ప్రసంగిస్తున్నారు. "ఉమర్! కాస్త ఆగు. నన్ను మాట్లాడనివ్వు" అన్నారు అబూబకర్ (రజి). కాని ఉమర్ (రజి) ఆయన మాటలు పట్టించుకోకుండా ఉద్రేకంతో తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్నారు.

దైవప్రవక్త గుహామిత్రుడు హజ్రత్ అబూబకర్ (రజి) ఆయన్ని ఈ పరిస్థితిలో ఆపడం కష్టమని భావించి నిలబడిన చోటు నుంచే సోదరులారా! అని సంబోధిస్తూ మాట్లాడటం ప్రారంభించారు. హజ్రత్ అబూబకర్ (రజి) సంబోధనా పలుకులు వినగానే జనమంతా ఒక్కసారిగా ఆయన వైపు దృష్టి మళ్ళించారు. దాంతో హజ్రత్ ఉమర్ (రజి) తన ప్రసంగాన్ని ఆపేయక తప్ప లేదు. హజ్రత్ అబూబకర్ (రజి) కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగి ఎంతో నిబ్బరంగా ఇలా ప్రసంగించారు:

"సోదరులారా! వినండి. ఒకవేళ ఎవరైనా ముహమ్మద్ (సల్లం)ని ఆరాధిస్తుంటే ముహమ్మద్ (స) ఇహలోకం వీడిపోయారని తెలుసుకోవాలి. అల్లాహ్‌ని మాత్రమే ఆరాధించే వారికి అల్లాహ్ సజీవంగా ఉన్నసంగతి తెలిసిందే. నిత్యజీవుడు అల్లాహ్ మాత్రమే. ఆయనకు మరణమన్నదే లేదు. ఆయన మనకు ఇదివరకే దైవప్రవక్తను గురించి ఇలా వివరించాడు:

"ముహమ్మద్ (మానవమాత్రుడయిన) దైవప్రవక్త మాత్రమే. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగి పోతారా? గుర్తుంచుకోండి. అలా వెనుదిరిగి పోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కలిగించలేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగిన బహుమానం ప్రసాదిస్తాడు" (ఖుర్‌ఆన్–3:144)

"(ముహమ్మద్!) నిస్సందేహంగా నీవూ చావవలసిందే, వారు చావవలసిందే...." "ఆయన (అల్లాహ్) తప్ప ప్రతి వస్తువూ అంతమయ్యేదే. సార్వభౌమాధికారం ఆయనకే ఉంది. ఆయన వైపుకే మీరంతా మరలిపోవలసి ఉంది..." (ఖుర్ఆన్)

"నా ప్రియసోదరులారా! దైవప్రవక్త (స) దైవధర్మాన్ని స్థాపించారు. దైవమార్గంలో తన శక్తిసామర్థ్యాలన్నీ ధారపోసి దైవసందేశాన్ని నలుమూలలా వ్యాపింపజేశారు. అప్పటి దాకా ఆయన్ని దేవుడు సజీవంగా ఉంచాడు.

"దైవప్రవక్త (స) మనకు రుజుమార్గం చూపించారు. అజ్ఞానాంధకారం పటాపంచలు చేసి జ్ఞానజ్యోతి ప్రసాదించారు. ఇలాంటి పరిస్థితిలో ఎవరయితే దైవధర్మాన్ని విడనాడి దుర్మార్గంలో పడిపోతారో వారే దానికి బాధ్యులవుతారు.

"ఎవరైతే అల్లాహ్‌ను తమ ప్రభువని భావిస్తున్నారో వారు అల్లాహ్ నిత్యజీవుడని, ఆయనకు అంతంలేదని గ్రహించాలి. మరెవరు ముహమ్మద్ (స)కు పూజారులై, ఆయన్ని దేవుడని తలుస్తున్నారో వారు తమ దైవాన్ని మృత్యువు కబళించిందని తెలుసుకోవాలి.

"సోదరులారా! దేవునికి భయపడండి. ఆయన్నే నమ్ముకోండి. ఆయన ధర్మాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరు. దైవధర్మానికి సహాయపడుతూ, దాని వృద్ధివికాసాల కోసం పోరాడేవారికి దేవుడు తప్పకుండా సహాయం చేస్తాడు.

"దైవగ్రంథం మన మధ్య ఉంది. అదే మన పాలిట జ్యోతిర్మండలం. మన కోసం దేవుడు ధర్మసమ్మతం చేసినవి, నిషేధించినవి అన్నీ అందులోనే ఉన్నాయి."

హజ్రత్ అబూబకర్ (రజి) ప్రసంగంతో ముస్లింలకు కాస్తంత ధైర్యం వచ్చింది. దుఃఖంతో క్రుంగిపోయినవారి హృదయాలకు కాస్త ఊరట చేకూరింది.

హజ్రత్ అబూబకర్ (రజి) ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు పేర్కొన్నప్పుడు అవి ఇప్పుడే అవతరించాయా అన్పించింది ముస్లింలకు. దాంతో వారు పుట్టిన ప్రతిజీవీ గిట్టక తప్పదన్న యదార్థంతో పాటు, దైవప్రవక్త (సల్లం) దివంగతులైనప్పటికీ నిత్యజీవుడయిన దేవుని ఆరాధన మాత్రం నిరంతరం కొనసాగాలన్న వాస్తవాన్ని గ్రహించారు. ఈ భావనే వారికి సహనాన్ని, స్థయిర్యాన్ని ఇచ్చింది.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ ప్రసంగం వినగానే కళ్ళుతిరిగి క్రింద పడిపోయారు. తర్వాత వెంటనే స్పృహలోకి వచ్చి "దైవప్రవక్త (సల్లం) దివంగతులయ్యారనడంలో ఇక నాకెలాంటి సందేహం లేదు" అని భావించారు మనసులో.

## (5) ఖలీఫాగా ఎన్నిక

ఇదిలా ఉండగా మరొక చోట ఓ చిన్న కలకలం బయలుదేరింది. అది చిలికి చిలికి గాలివానలా మారే పరిస్థితి ఏర్పడింది. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ఇంటి



దగ్గర అన్సార్ ముస్లింలు అనేకమంది గుమిగూడి దైవప్రవక్త (సల్లం)కు వారసుడెవరనే విషయంపై తర్జనభర్జనలు చేయసాగారు. పరిస్థితి విషమిస్తూ ఉండటం గమనించిన ఒక ముహాజిర్ ముస్లిం పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అబూబకర్! ఉమర్!! పదండి, పదండి. సాద్ బిన్ ఉబాదా (రజి) ఇంటి దగ్గర అన్సారులంతా గుమిగూడి తమలో ఒకడ్ని ఖలీఫాగా ఎన్నుకోబోతున్నారు. త్వరగా పదండి. లేకపోతే పెద్ద ఉపద్రవం వచ్చి పడుతుంది" అన్నాడతను రొప్పుతూ.

తక్షణమే అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు ఆ ప్రదేశానికి పరుగెత్తారు. వారితో పాటు మరికొందరు ముస్లింలు కూడా పరుగెత్తారు. పోయిచూస్తే అక్కడ అన్సార్‌లు గుమిగూడిఉన్నారు. కొందరు ముహజిర్‌లు కూడా ఉన్నారు. ఉభయవర్గాల మధ్య విభేదం వచ్చింది కాబోలు, వాగ్వివాదం జోరుగా సాగుతోంది. అబూబకర్ (రజి) వారికి సర్దిచెప్పి ఎలాగో పరిస్థితిని అదుపులో ఉంచగలిగారు.

చివరికి అందరూ ఒక అభిప్రాయానికి వచ్చారు. అందరూ ఏకగ్రీవంగా హజ్రత్ అబూబకర్ (రజి)ని ఖలీఫాగా ఎన్నుకున్నారు. కొన్ని క్షణాల్లో విభేదాలన్నీ తొలగిపోయాయి. పెద్ద ప్రమాదం తప్పిపోయింది. మరుసటి రోజు మసీదులో ప్రజలు హజ్రత్ అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి ఆయన్ని తమ ఖలీఫాగా ఆమోదించారు.

దైవప్రవక్త (స) కాబోయే తన రాజకీయ వారసుడ్ని గురించి ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. అంచేత ముహాజిర్‌ముస్లింలకు, అన్సార్‌ముస్లింలకు మధ్య జరిగిన చర్చల్లో ఖలీఫా ముహాజిర్‌వ్యక్తి కావాలా లేక అన్సార్‌వ్యక్తి కావాలా అనే విషయమై భేదాభిప్రాయాలు వచ్చాయి. అయితే దైవప్రవక్త (స) తన జీవిత చరమదశలో, అనారోగ్య స్థితిలో 'నమాజ్ నాయకత్వం' వహించడానికి అబూబకర్ (రజి) పేరును ప్రతిపాదించారు. హజ్రత్ అబూబకర్ (రజి)కు లభించిన ఈ విశిష్ఠ ఔన్నత్యంతో పాటు, మరికొన్ని ఇతర విషయాల్లో దైవప్రవక్త (స) ద్వారా లభించిన ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ముస్లింలు ఆయన్నే ప్రవక్త రాజకీయ వారసుడిగా, తొలి ఖలీఫాగా ఎన్నుకున్నారు.

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు : "ప్రజలారా! వినండి. మీప్రభువు ఒక్కడే. అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి, నల్లవాడిపై తెల్లవాడికి, తెల్లవాడిపై నల్లవాడికి దైవభీతిపరాయణత ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఘనతా ఔన్నత్యాలు లేవు." (బైహఖి)

మరొక సందర్భంలో ఆయన ఇలా ప్రవచించారు : "ప్రజలారా! "మీరు దేవునికి భయపడుతుండాలని, మీకు నాయకుడిగా (లేక ఖలీఫాగా) నియమించబడే వ్యక్తి నీగ్రోజాతికి చెందిన బానిసయినా సరే, (అతను చెప్పినట్లు) విని విధేయత చూపాలని నేను మీకు ఉపదేశిస్తున్నాను." (అబూదావూద్, తిర్మిజి)

ఖిలాఫత్‌పదవి ఎన్నిక అత్యవసర సమయంలో అలి (రజి), జుబైర్ (రజి), తల్హా (రజి)లు ప్రవక్త భౌతికదేహ ఖననసామగ్రి సేకరణలో నిమగ్నులై ఉన్నందున వారిని 'బైత్'కోసం పిలవడం జరగలేదు. ఆ ముగ్గురు ఖిలాఫత్‌పదవి ఎన్నిక సమయంలో తమను పిలువలేదన్న ఆరోపణతో నలభై రోజులదాకా బైత్ చేయలేదు.

ఓరోజు అలి(రజి) అబూబకర్(రజి) దగ్గరకెళ్ళి "నేను మీ ఖిలాఫత్ అర్హతలకు వ్యతిరేకిని కాను. కాని నేను దైవప్రవక్త (స)కు అతిసన్నిహిత బంధువైనప్పటికీ నన్ను మీరు ఖిలాఫత్‌ఎంపిక సంప్రదింపులకోసం 'సఖీఫాబనూసాదా' (బనూసాదా పందిరి)కి పిలువలేదు. ఆరోజు అక్కడికి నన్ను మీరు పిలిపించుకొనివుంటే అందరికంటే ముందు నేనే మీ చేతిలో చేయివేసి బైత్ చేసివుండేవాడ్ని" అని అన్నారు.

దానికి ఖలీఫా అబూబకర్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "నా బంధువుల పట్ల సద్భావనతో మసలుకోవడం కంటే దైవప్రవక్త (స) బంధువుల పట్ల సద్భావనతో మసలుకోవడమే నాకెక్కువ ఇష్టం. నేనక్కడికి బైత్ చేయించుకునే ఉద్దేశ్యంతో పోలేదు. ముహాజిర్‌లు, అన్సార్‌ల మధ్య చెలరేగిన వివాదాన్ని పరిష్కరించడానికి వెళ్ళాను. అప్పుడది చాలా అవసరమయింది. వారప్పుడు కొట్టుకోవడానికి, చంపుకోవడానికి సిద్ధమయ్యారు. నాఅంతట నేను బైత్ కోసం ఎవరినీ అడగలేదు. సభికులే ఏకాభిప్రాయానికి వచ్చి నాచేతిలో చేయివేసి బైత్ చేశారు. ఒకవేళ నేనప్పుడు బైత్ పనిని వాయిదా వేసివుంటే ఆ తరువాత ఈ వివాదం మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉండేది. అదీగాక మీరా సమయంలో ఖననసంస్కార కార్యంలో నిమగ్నమైఉన్నారు. అలాంటప్పుడు నేను మిమ్మల్ని ఆ పని వదిలేసి రమ్మని ఎలా చెబుతాను?"

హజ్రత్ అలి(రజి) ఈ మాటలు విని తన ఆరోపణను ఉపసంహరించుకున్నారు. మరుసటి రోజు మస్జిదెనబవీలో జనసమూహం ముందు అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి బైత్ (ప్రమాణం) చేశారు. ఆ తర్వాత ఖలీఫా అబూబకర్ (రజి) లేచి ప్రజలను సంబోధిస్తూ ఈవిధంగా ప్రసంగించారు:

"ప్రజలారా! నేను మీ అందరికంటే ఎక్కువ శ్రేష్ఠుడ్ని కాకపోయినా మీరు ప్రభుత్వ నిర్వహణబాధ్యత నాకప్పగించారు. నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తి స్వరూపుడి సాక్షిగా చెబుతున్నాను. నేనీ పదవిని ఎన్నడూ కోరుకోలేదు. దాని కోసం నేను దైవాన్ని ప్రార్థించలేదు కూడా. ముస్లింలలో అరాచకం-విభేదాలు, అరేబియాలో మతభ్రష్టతలు తలెత్తే ప్రమాదం ఉన్నందునే ఇష్టం లేకపోయినా నేనీ బాధ్యత స్వీకరించవలసి వచ్చింది. ఈ పదవిలో నాకెలాంటి సుఖం లేదు. ఇదసలు నా బలహీన భుజస్కంధాలపై మోపబడిన పెనుభారం. ఇప్పటికైనా మించిపోలేదు, మీరు వేరొక మనిషిని ఎన్నుకోవచ్చు. నాకెలాంటి అభ్యంతరంలేదు. మీలో అందరికంటే ఎక్కువ బలవంతుడికి



నేనతని హక్కు ఇప్పించనంతవరకు అతను నాదృష్టిలో బలహీనుడే. అలాగే మీలో అందరికంటే ఎక్కువ బలహీనుడికి నేనతని హక్కు ఇప్పించనంతవరకు అతను నా దృష్టిలో బలవంతుడే. ప్రజలారా! నా స్థాయి మీలో ఒక సాధారణ మనిషి స్థాయికంటే ఏమాత్రం ఎక్కువ కాదు. కాబట్టి నేను సన్మార్గంలో నడచినంత కాలం మీరు నాకు విధేయులై ఉండండి. ఒకవేళ నేను సన్మార్గం తప్పి నడవడం చూస్తే మీరు నన్ను సరి చేయండి. నేను దేవుడు, దైవప్రవక్త చూపిన మార్గంలో నడిచేవాడ్ని మాత్రమే, కొత్త మార్గాలు, పద్ధతులు కనిపెట్టేవాడ్ని కాను."

## (6) పరిపాలనా వ్యవహారాలు

ఖలీఫా అబూబకర్ (రజి) దేశ పరిపాలనా వ్యవహారాలను సజావుగా సాగించడానికి కొందరు ముఖ్యఅనుచరులకు వాటి బాధ్యతలు అప్పగించారు. జాతీ నిజాయితీపరుడు (అమీనుల్‌మిల్లత్) అయిన అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి)ను ఆర్థికమంత్రిగా, కోశాధికారిగా నియమించారు; ఉమర్ ఫారూఖ్ (రజి)ను న్యాయశాఖ మంత్రిగా నియమించారు; అలి కరముల్లా వజ్హా (రజి)ను సాధారణ పాలనావ్యవహారాల మంత్రిగా, ఉస్మాన్ గనీ(రజి)ని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఒక సంవత్సరం తరువాత అబూఉబైదా (రజి)ను సేనాపతిగా నియమించి సిరియా పంపారు.

అదేవిధంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు గవర్నర్లను కూడా నియమించారు. మక్కా, దాని పరిసర ప్రాంతాలకు ఇతాబ్ బిన్ ఉసయ్యిద్ (రజి)ను; తాయిఫ్‌కు ఉస్మాన్ బిన్ ఆస్ (రజి)ను, సనాకు ముహాజర్ బిన్ ఉమయ్యా (రజి)ను, హజ్రెమౌత్‌కు జియాద్ బిన్ లబీద్ (రజి)ను, ఖౌలాన్‌కు లాయిలీ బిన్ ఉమయ్యా (రజి)ను, యమన్‌కు అబూమూసా అష్అరీ (రజి)ను, జునద్‌కు ముఆజ్ బిన్ జబల్ (రజి)ను, బహ్రైన్‌కు ఇలాఅ బిన్ హజ్రమీ (రజి)ని, దూమతుల్ జందల్‌కు అయాజ్ బిన్ గనమ్ (రజి)ని, ఇరాఖ్‌కు ముస్నా బిన్ హారిస్ (రజి)ని గవర్నర్‌లుగా నియమించారు.

పోతే దేశరక్షణ కోసం దైవకరవాలం (సైపుల్లా)గా బిరుదాంకితుడైన ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సర్వసేనానిగా నియమించారు. ఆయనతో పాటు వివిధ ప్రాంతాలకు వేరే సేనాపతులను నియమించారు. సిరియాలో రోమన్ల వైపునుండి ఎల్లప్పుడూ ప్రమాద సూచనలు కన్పిస్తున్నందువల్ల అక్కడ అబూఉబైదా (రజి)కు సహాయకారులుగా యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి), షర్జీల్ బిన్ హుస్నా (రజి)లను సేనాపతులుగా నియమించి పంపారు. సర్వసేనానితో పాటు, ఇతర సేనాపతులందరికీ ఎప్పటి కప్పుడు ఖలీఫా అబూబకర్ (రజి) తగిన ఆదేశాలు జారీచేస్తుంటారు.

హజ్రత్ అబూబకర్ (రజి) గతంలో వస్త్రవ్యాపారం చేస్తుండేవారు. అందువల్ల ఆయన ఖలీఫాగా ఎన్నికయిన మరుసటి రోజు నుంచే యథాప్రకారం బట్టలమూట

భజాన వేసుకొని బయలుదేరారు. దారిలో హజ్రత్‌ఉమర్ (రజి) తారసపడి "మీరిప్పుడు ముస్లింలకు (దేశానికి) నాయకులయ్యారు. మీకీ పని శోభించదు" అన్నారు. దానికి అబూబకర్ (రజి) "మరి నేను నా భార్యాపిల్లల్ని ఎలా పోషించుకోవాలి?" అన్నారు. "ఆ ఏర్పాటు (మన కోశాధికారి) అబూఉబైదా చేస్తారు, పదండి ఆయన దగ్గరకు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి). చివరికి ముహాజిర్‌ముస్లింలలో మధ్యతరగతి వ్యక్తి సంపాదనను దృష్టిలో పెట్టుకొని ఖలీఫాకు సంవత్సరానికి దాదాపు నాలుగువేల దిర్హమ్‌లు (ఈనాటి మన లెక్క ప్రకారం నెలకు సుమారు అయిదు వేల రూపాయలు) జీతం నిర్ణయించబడింది.

అయితే రెండేళ్ళ తరువాత మరణసమయం ఆసన్నమైనప్పుడు ఖలీఫా అబూబకర్ (రజి) వీలునామాలో "నేను వదలిన ఆస్తి నుండి 8 వేలు దిర్హమ్‌లు తీసి ప్రభుత్వ ధనాగారానికి వాపసుచేయాల"ని రాశారు. తరువాత ఈపైకం ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు తీసుకురాబడినప్పుడు ఆయన "దేవుడు అబూబకర్ (రజి)పై కారుణ్యవర్షం కురిపించుగాక! ఆయన తన తర్వాత వచ్చేవారిని కష్టాల్లో పడవేశారు" అని అన్నారు.

దైవప్రవక్త (స) తన అనారోగ్యస్థితిలో సిరియా రోమన్ల నుండి పొంచివున్న ప్రమాదాన్ని నివారించడానికి 17 ఏళ్ళ నవయువకుడయిన ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో ఓ భారీసైన్యాన్ని పంపాలని ఆదేశించారు. అయితే అప్పట్లో దైవప్రవక్త (స) ఆరోగ్యం మరింత క్షీణించడం, తరువాత కొన్నాళ్ళలోనే ఆయన ఆత్మ అనంత వాయువుల్లో కలసిపోవడంతో సైన్యం మదీనా నుండి వెళ్ళలేకపోయింది. ఇప్పుడా సమయం వచ్చింది. కనుక ఖలీఫా అబూబకర్ (రజి) సైన్యాన్ని తీసుకొని బయలుదేర మని యువసేనాపతి ఉసామా (రజి)ను ఆదేశించారు.

ఈ ఆదేశం ప్రకారం హజ్రత్ ఉసామా (రజి) సైన్యం తీసుకొని బయలుదేరారు. సైన్యంలో హజ్రత్ ఉమర్ (రజి)తో పాటు అనేకమంది అనుభవశాలురైన ప్రముఖ సహాబీలు ఉన్నారు. యువసేనాని ఉసామా(రజి) ఓసారి సైన్యాన్ని కలియజూసి "గొప్ప గొప్ప వాళ్ళంతా సైన్యంలో ఉన్నారు. సైన్యం వెళ్ళిపోయిన తరువాత అవిశ్వాసులు మదీనా మీద దాడిచేసి మీపై, ప్రజలపై ఏదైనా ఆపద తెచ్చిపెడ్తారేమోనని నేను భయపడ్తున్నాను. అంచేత వాళ్ళను మీరు వెనక్కి పిలిపించుకోండి" అని ఖలీఫాకు లేఖ రాసి ఉమర్ (రజి) చేతికిచ్చి పంపారు. అప్పుడు అన్సార్ సైనికుల్లో కొందరు "సేనాపతిగా ఉసామా (రజి)కు బదులు ఆయనకంటే ఎక్కువ వయస్సున్న, గౌరవ ప్రదమైన వంశానికి చెందిన మరెవరినైనా నియమిస్తే బాగుంటుంది" అని ఖలీఫాకు మరొక లేఖ రాసి ఉమర్ (రజి) చేతికి అందించారు.



ఉమర్ (రజి) ఈ రెండులేఖలు తీసుకొని అబూబకర్ (రజి) సన్నిధికి వెళ్ళారు. ఆయన సేనాపతి లేఖ చదివి "సైన్యంలో అందర్నీ భర్తీచేసి నగరంలో నేనొక్కడినే మిగిలిపోయి, క్రూరజంతువులు వచ్చి నన్ను చీల్చిచెండాడినా సరే, నేను సైన్యం నుండి ఏ ఒక్కర్నీ వెనక్కి పిలిపించుకోవడంగాని, ఈ దండయాత్రను వాయిదా వేయడంగాని జరగదు" అని అన్నారు. తరువాత అన్సార్‌సైనికులు రాసిన లేఖ చదివి "వీళ్ళ హృదయాల్లో నుంచి జాత్యహంకారం ఇంకా పూర్తిగా సమసిపోలేదు, పద" అంటూ ఉమర్ (రజి)తో కలసి సైన్యం ఆగిన చోటుకు బయలుదేరారు.

సైన్యం బయలుదేరింది. యువసేనాని అశ్వరూఢుడై నడవసాగాడు. ఖలీఫా అతని గుర్రం పక్కనే పాదాచారి అయి నడవసాగాడు. యువసేనాని సిగ్గు పడిపోతూ "మీరైనా మరోగుర్రం ఎక్కండి లేదా నన్నయినా గుర్రం దిగి నడవనీయండి" అని విన్నవించుకున్నాడు ఖలీఫాతో. కాని ఖలీఫా ఈ విజ్ఞప్తిని సున్నితంగా తిరస్కరిస్తూ "నేను గుర్రం ఎక్కను; నీవు గుర్రం దిగనవసరమూ లేదు. దైవమార్గంలో కాస్తంత దూరం కాలినడకన నడిస్తే నాకొచ్చే నష్టం ఏమిటీ?" అని అన్నాడు.

ఈ అపూర్వ దృశ్యం చూసి, సమతాసౌభాగ్యం తొణికిసలాడే ఈ మాటలు విని సైనికులందరూ ఆశ్చర్యచకితులయ్యారు. వారిలో కొందరి హృదయాల్లో ఇంకా మిగిలి ఉన్న జాత్యహంకారం, వయోవివక్షలు పూర్తిగా అంతమై విధేయత, సమతా భావాలు చోటుచేసుకున్నాయి. ఖలీఫా అబూబకర్ (రజి) గుర్రం పక్కన కాలినడక నడుస్తూ యువసేనాని ఉసామా (రజి)కు ఇలా హితోపదేశం చేశారు:

"ఉసామా! ఎట్టి పరిస్థితుల్లో కూడా (1) నమ్మకద్రోహానికి పాల్పడకూడదు. (2) అబద్ధమాడకూడదు. (3) వాగ్దానభంగం చేయకూడదు. (4) స్త్రీలు, పిల్లలు, వృద్ధుల్ని హతమార్చకూడదు. (5) పండ్లచెట్లను నరకడంగాని, కాల్చివేయడంగాని చేయ కూడదు. (6) తినడానికి తప్ప ఆవులు, ఒంటెలు, మేకలు మొదలైన పశువుల్ని చంప కూడదు. (7) ఏదైనా తెగ దగ్గరకు పోయినప్పుడు ముందుగా ఆ తెగప్రజలకు ఇస్లాం గురించి ఉపదేశించి దానివైపుకు పిలవాలి. (8) వారిలో ఎవరినైనా కలుసుకుంటే వారి హోదా అంతస్తుల్ని దృష్టిలో పెట్టుకోవాలి. (9) నీ ముందుకు ఆహారం వచ్చినప్పుడు దేవునిపేరు ఉచ్చరించి తినాలి. (10) యూదులు, క్రైస్తవుల్లో ప్రాపంచిక వ్యవహారాలు వదిలేసి సన్యాసులై తమ మఠాలలో కూర్చుండిపోయినవారి జోలికి పోకూడదు. ఇక దైవప్రవక్త (స) చేయమని ఆదేశించిన పనుల్లో ఏఒక్క పనినైనా వదిలేయడంగాని లేదా అదనంగా చేర్చడంగాని ఏమాత్రం చేయకూడదు. దేవుని పేరుతో నడుం బిగించి దైవమార్గంలో సత్యతిరస్కారులతో పోరాడు."

ఖలీఫా సేనాపతి ఉసామా (రజి)కు ఇలా హితబోధ చేసిన తర్వాత వెనుదిరిగి నగరానికి బయలుదేరారు. ఆ సమయంలో ఆయన "ఉసామా! నీవు అనుమతిస్తే

నాకు సలహా, సహకారాలు అందజేయడానికి ఉమర్ (రజి) నాదగ్గర నగరంలో ఉండి పోతాడు" అని అన్నారు తిరుగులేని సామ్రాజ్యాధినేత అయివుండి కూడా తన క్రింది అధికారి అనుమతి కోరుతూ. దానికి సేనాని ఉసామా (రజి) సంతోషంగా అంగీకరించారు. ఈ అనుమతి లభించగానే ఉమర్ ఫారూఖ్ (రజి) సైన్యం నుండి వేరయి ఖలీఫా అబూబకర్ (రజి)తో కలిసి నగరానికి వెళ్ళిపోయారు.

దైవప్రవక్త (స) నిర్యాణం తరువాత కొన్ని తెగలు మతభ్రష్టులైపోయాయి; మరి కొన్ని తెగలు జకాత్ చెల్లించడానికి నిరాకరించాయి. అందువల్ల ఖలీఫా అబూబకర్ (రజి) జకాత్‌నిరాకరుల్ని అణచివేయడానికి నిర్ణయించుకున్నారు. తరువాత ముఖ్య అనుచరుల్ని సమావేశపరచి జకాత్ నిరాకరులపై తీసుకునే చర్య గురించి వారి అభిప్రాయాలు అడిగారు. అయితే ఉమర్(రజి)తో సహా చాలామంది "అవిశ్వాసులు, బహుదైవారాధకులకు మాదిరిగా జకాత్‌నిరాకరులకు వ్యతిరేకంగా యుద్ధం చేయడం సరికాద"ని అన్నారు.

అప్పుడు అబూబకర్ (రజి) ఇలా అన్నారు: "దైవసాక్షి! నమాజ్, జకాత్‌ల మధ్య విచక్షణచేసే ప్రతివ్యక్తితో నేను యుద్ధంచేస్తాను. జకాత్ సంపదహక్కు. (సంపద కల్గిన వారు దానిమీద పేదల ఆర్థికహక్కుయిన జకాత్‌ని విధిగా చెల్లించాలి.) దైవసాక్షి! వారు గనక దైవప్రవక్త (స) కాలంలో ఇస్తూవుండిన సంపద నుండి ఒంటె తాడయినా సరే ఇవ్వడానికి నిరాకరిస్తే నేను వారితో తప్పకుండా పోరాడుతాను."

హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "దైవసాక్షి! దేవుడు సత్యావగాహన కోసం అబూబకర్ హృదయకవాటాలు తెరిచాడు. అబూబకర్ దృక్పథమే సరైనదని నేను ఆ తరువాత గ్రహించాను" అని అన్నారు. (సహీబుఖారి)

ఆ తరువాత వివిధ ప్రాంతాల్లో జకాత్ నిరాకారులతో పాటు మతభ్రష్టులపై జరిగిన అనేక యుద్ధాలలో ముస్లింలు వారి పీచం పూర్తిగా అణచివేశారు.

ఈవిధంగా ఖలీఫా అబూబకర్ (రజి) హిజ్రీశకం 11వ సంవత్సరాంతం మొదలు 12వ సంవత్సరం ప్రారంభం వరకు ఒకేఒక సంవత్సరంలో అరేబియాలోని మతభ్రష్ట అరాచకాన్ని పూర్తిగా అంతమొందించారు.

ఆయన సైన్యంలో ఖాలిద్ బిన్ వలీద్ (రజి), ఇక్రమా (రజి), షుర్జీల్ (రజి), హుజైఫా (రజి) లాంటి హేమాహేమీలు ఉన్నారన్నది నిజమే. కాని అబూబకర్ (రజి) మదీనాలోనే కూర్చొని జకాత్ నిరాకరుల డిమాండ్లకు తలవొగ్గకుండా, ఆవేశపూరితుడైన ఉమర్ (రజి) వెలిబుచ్చిన తీవ్రమైన అభ్యంతరాలను సైతం ఖాతరుచేయకుండా, ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షిస్తూ, ఉసామా బిన్ జైద్ (రజి) సిరియా దండయాత్రను వాయిదా వేయకుండా, తాను పంపిన పదకొండు మంది సేనాపతులకు



సందర్భోచితంగా తగిన ఆదేశాలు జారీచేస్తూ ఈ ఘనకార్యం సాధించగలిగారు.

మతభ్రష్టులతో జరిగిన యుద్ధాలలో ఖుర్‌ఆన్ స్మర్తలు (హాఫిజ్‌లు) చాలామంది అమరగతులు కావడంతో ఖుర్‌ఆన్ పరిరక్షణకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయ వలసివచ్చింది. ఖుర్‌ఆన్‌కు చెందిన వివిధభాగాలు దైవప్రవక్త (స) అనుచరులు ఇంతకుముందే కాగితాలపై, చర్మపుపొరలపై, ఖర్జూరపుటాకులపై, నాపరాళ్ళపై వ్రాసి భద్రపరచుకున్నారు. వ్రాతపూర్వకమైన ఈ ఖుర్‌ఆన్ భాగాలన్నిటినీ ఖలీఫా అబూబకర్ (రజి) తెప్పించి గ్రంథరూపంలో కూర్చవలసిందిగా 'దివ్యావిష్కృతి రచయిత' హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి)ని ఆదేశించారు.

పూర్తి ఖుర్‌ఆన్ చాలామంది హృదయాల్లో ఉన్నప్పటికీ గ్రంథానికి ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. జైద్ బిన్ సాబిత్ (రజి) కూడా ఖుర్‌ఆన్ హాఫిజే. ఆయన మస్జిదెనబవీలో ఓ ప్రకటన చేయడం ద్వారా ఖుర్‌ఆన్ విడిభాగాలు ఎవరెవరి దగ్గర ఉన్నాయో వాటన్నిటినీ సేకరించి గ్రంథంగా తయారుచేశారు. పూర్తి ఖుర్‌ఆన్‌ని గ్రంథంలో రాసిన తర్వాత అనేకమంది హాఫిజ్‌ల సమక్షంలో పఠించి, అంతాసవ్యంగా ఉందని వారందరూ ధృవీకరించిన తర్వాత దాన్ని ఖలీఫాకు అప్పగించారు.

## (7) ప్రజాసేవ, పొదుపుదనం

మదీనా సమీపంలో అంధురాలైన ఓ వృద్ధమహిళ ఉండేది. ఆమెకు వెనుకా ముందూ ఎవరూలేరు. అందువల్ల హజ్రత్ ఉమర్ (రజి) ప్రతిరోజూ ఉదయాన్నే ఆమె పూరింటికి వెళ్ళి ఆమె పనులన్నీ చేసేవారు. అయితే కొన్నాళ్ళ నుంచి వచ్చి చూస్తుంటే తనకు ముందే ఎవరో వచ్చి ఆ పనులన్నీ చేసి పోతున్నట్లు అన్పించింది ఆయనకు. ఆ మనిషి ఎవరో తెలియక ఉమర్ (రజి) లోలోన మధనపడసాగారు.

ఒకరోజు ఉమర్ ఫారూఖ్ (రజి) ఉదయం పెందలకడనే వెళ్ళి ఆ వృద్ధురాలి ఇంటి చూరు కింద దాగి గమనించడం మొదలెట్టారు. తరువాత కాస్సేపటికి ఒకతను వచ్చి ఆ ఇంట్లో ప్రవేశించి ఆమె పనులన్నీ చేసి వెళ్ళిపోయాడు. అతడ్ని చూసి ఉమర్ (రజి)కు చాలా ఆశ్చర్యం వేసింది. ఆ మనిషి ఎవరో కాదు, సాక్షాత్తు ఖలీఫా హజ్రత్ అబూబకరే (రజి)!

హజ్రత్ అబూబకర్ (రజి) ప్రభుత్వ ధనాగారాన్ని ప్రజల సొమ్ముగా భావించేవారు. ఈ భావనతో ఆయన ప్రజాఅవసరాల కోసం మాత్రమే ఎంతో జాగ్రత్తగా ఖర్చుపెట్టేవారు. ఒకరోజు అబూబకర్ (రజి) శ్రీమతి ఆయన కోసం ఏదైనా తీపి పదార్థం వండటానికి తేనె కావాలని అడిగారు. దానికాయన "నాకొచ్చే జీతండబ్బుతో నేను తేనె కొనలేనని నీకు తెలుసు కదా! ఉండనీ, తేనె వద్దు గీనెవద్దు" అన్నారు. దాంతో పాపం శ్రీమతి మారు మాట్లాడకుండా నోరుమూసుకున్నారు.

అయితే ఆమె తన భర్తకు ఎలాగైనా ఓసారి తీపి పదార్థం తిన్పించాలన్న పట్టుదల మాత్రం వదల్లేదు. అందువల్ల ప్రభుత్వం నుండి లభించే కరువుభత్యంలో రోజూ కొంత మిగల్చి పొదుపు చేయడం ప్రారంభించారు. చివరికి ఒకరోజు పొదుపుచేసిన ఆ డబ్బుతో తేనె తెప్పించి తీపిపదార్థం తయారుచేశారు. ఆరోజు సాయంత్రం భర్త ఇంటికి రాగానే ఆయన ముందు ఈ తీపి వంటకం ఉంచారు.

హజ్రత్ అబూబకర్ (రజి) దాని వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఈ తీపి పదార్థం ఎక్కడ్నుంచి వచ్చింది?" అని అడిగారు. అప్పుడు ఆయన శ్రీమతి జరిగిన సంగతంతా వివరించారు. హజ్రత్ అబూబకర్ (రజి) ఆ సంగతి విని "మన రోజువారీ ఖర్చు నుండి నీవు ఇంత మిగుల్చుతున్నావు. అయినా మనకు ఎలాంటి లోటు రావడంలేదు. దీన్నిబట్టి నాకు అంత డబ్బు ఎక్కువ లభిస్తోందన్న మాట" అన్నారు. అనడమే కాదు. వెంటనే ఆయన ఆ మేరకు డబ్బు తన జీతం నుండి తగ్గింప జేయించారు.

## (8) అబూబకర్ (రజి) నిర్యాణం, రాజకీయవారసుడి ఎంపిక

ఇబ్నెసాద్, హాకింల ఉల్లేఖనాల ప్రకారం ఒకసారి ఖలీఫా అబూబకర్ (రజి), ఆయన సహచరుడు హజ్రత్ ఇబ్నెకల్దా (హారిస్)-(రజి) ఎవరో కానుకగా పంపిన పాయసం (హరీరా) తినసాగారు. కాస్సేపటి తరువాత హారిస్ (రజి) తినడం మానేసి "దైవప్రవక్త ప్రతినిధీ! ఆగండి, ఈ పాయసం తినకండి, ఇందులో విషం ఉంది. దీని ప్రభావం ఒక సంవత్సరం తరువాత కన్పిస్తుంది. కనుక నేను, మీరు దాదాపు ఒకే రోజు చనిపోతాం" అని అన్నారు. చివరికి ఒక సంవత్సరం తరువాత ఆ ఇద్దరూ ఒకేరోజు చనిపోయారు.

హిజ్రీశకం 13వ ఏడు, జమాదివుస్సాని నెలారంభంలో ఖలీఫా అబూబకర్ (రజి) వ్యాధిగ్రస్తులయ్యారు. 15 రోజులపాటు తీవ్రమైన జ్వరంతో బాధపడ్డారు. దాంతో తనకిక అంతిమఘడియలు సమీపించాయని భావించారు. అప్పుడాయన తన ముఖ్య అనుచరులను ఒకరి తర్వాత మరొకరిని పిలిపించి, తన రాజకీయవారసుడి విషయంలో ఉమర్ ఫారూఖ్ (రజి) పట్ల వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) తన అభిప్రాయం చెబుతూ "ఆయన చాలా మంచివాడనడంలో సందేహం లేదు. కాకపోతే ఆయన స్వభావంలో కాఠిన్యత, ఉద్రేకాలున్నాయి" అని అన్నారు. దానికి అబూబకర్ (రజి) "ఖలీఫా బాధ్యతాభారం మీద పడితే అవన్నీ వాటంతటవే అంతమైపోతాయి"అన్నారు. ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) మాట్లాడుతూ "అతని బాహ్యాచరణకంటే అతని అంతర్గతం శ్రేష్ఠమైనది"ని చెప్పారు. తర్వాత ఉసయ్యిద్ బిన్ హుజైర్ (రజి) మాట్లాడుతూ "నేను మీ తరువాత ఉమర్‌ని చాలా శ్రేష్ఠుడని భావిస్తున్నాను. అతని బాహ్యాచరణకంటే అతని అంతర్గతం



శ్రేష్ఠమైనది. మీ తర్వాత ఖిలాఫత్‌పదవికి అతనే అందరికంటే ఎక్కువ అర్హుడు" అని అన్నారు. మరికొందరు కూడా ఉమర్ (రజి)కు అనుకూలంగా మాట్లాడారు.

అయితే తల్హా (రజి) వారందరికీ భిన్నంగా మాట్లాడుతూ "ఉమర్ ఎలాంటి ఉద్రేకస్వభావియో మీకు తెలుసు. అయినా మీరతడ్ని మీ రాజకీయ వారసునిగా చేస్తున్నారు. రేపు మీప్రభువు అడిగితే ఏమని సమాధానమిస్తారు?" అని అడిగారు. దీనికి అబూబకర్ (రజి) తీవ్రంగా స్పందిస్తూ "ఏమిటీ నీవు నన్ను నా ప్రభువు గురించి భయపెడ్తున్నావా! ఆయన నన్నడిగితే 'దేవా! నేను నీదాసులపై అందరికంటే అత్యంత శ్రేష్ఠుడైన నీ దాసుడ్ని ఖలీఫాగా నియమించాన'ని చెబుతాను" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఉద్రేకం, కాఠిన్యతలు దైవధర్మం విషయాల్లోనే వ్యక్తమవుతాయి. సత్యం, న్యాయం వ్యవహారాల్లో ఆయన అబూబకర్ (రజి)ని కూడా ఖాతరు చేయరు. ఉదాహరణకు- ఓసారి ఖలీఫా దగ్గరకు ఇద్దరు నవముస్లింలు వచ్చి తమ ప్రాంతంలో నిరుపయోగంగా పడివున్న ఓ బీడుభూమిని తమకివ్వమని అడిగారు. ఖలీఫా వారికా భూమికి సంబంధించి పట్టా రాసిచ్చారు. దానిపై ఆమోదముద్ర కోసం వారు ప్రధానకార్యదర్శి, న్యాయాధికారి అయిన ఉమర్ (రజి) దగ్గరికి వచ్చారు.

ఉమర్ (రజి) ఆ దస్తావీజు చూడగానే దాన్ని చించివేస్తూ "ఇస్లాం బలహీనంగా ఉన్న రోజుల్లో దైవప్రవక్త (స) మిమ్మల్ని ఇలా సంతోషపెడ్తుండేవారు. కాని ఇప్పుడు ఇస్లాం శక్తిమంతమైపోయింది. మీరు చేయదలచుకున్నది చేసుకోండి" అని అన్నారు.

దాంతో ఆ నవముస్లింలిద్దరూ కోపంతో ఊగిపోతూ అబూబకర్ (రజి) దగ్గరకు తిరిగొచ్చి "ఖలీఫా మీరా? ఉమరా?" అనడిగారు. దానికి అబూబకర్ (రజి) "ఉమర్ కోరుకుంటే ఆయనే ఖలీఫా అయ్యేవాడు" అన్నారు.

అప్పుడు వారు "సరేలెండి, మరో దస్తావీజు రాసివ్వండి" అన్నారు. అబూబకర్ (రజి) నిరాకరిస్తూ "ఉమర్ రద్దు చేసిన దాన్ని నేను పునరుద్ధరించలేను" అన్నారు.

ఈ సంభాషణ సాగుతుండగానే ఉమర్ (రజి) కూడా వచ్చి "మీరీ భూభాగాన్ని వీరిద్దరికి ఎలా ఇచ్చారు? ఇది మీసొంతమా లేక ప్రజలదా?" అనడిగారు. అబూబకర్ (రజి) ప్రజలదే అన్నారు. "అలాంటప్పుడు దాన్ని వీళ్ళకు ఇవ్వడానికి మీకేం అధికారం ఉంది?" అని ప్రశ్నించారు ఉమర్ (రజి). "ఆ సమయంలో నా ముందు ఉన్నవారితో సంప్రదించిన తర్వాతే వీరికిచ్చాను" అన్నారు అబూబకర్ (రజి). చివరికి ఆయన తన నిర్ణయాన్ని మార్చుకొని ఉమర్ (రజి) తీర్పునే అమలుపరిచారు.

ఉమర్ (రజి) తన నిర్ణయాన్ని సైతం ఖాతరుచేయని ఉద్రేకపరుడని తెలిసి కూడా అబూబకర్ (రజి) ఆయన్నే తన రాజకీయవారసుడిగా నిర్ణయించారు. ఇలా అధికసంఖ్యాకులు ఉమర్ (రజి)కు అనుకూలంగా సమాధానమివ్వడంతో అబూబకర్

(రజి) ఉస్మాన్ (రజి)ని పిలిపించి ఉమర్ (రజి)ను తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తూ వీలునామా రాయించారు. దాన్ని ప్రజలకు చదివి విన్పించమని చెప్పి తన సతీమణి సహాయంతో అతికష్టమ్మీద ఇంట్లోనుంచి బయటికి వచ్చారు. చూస్తే ఇంటి ముందు జనం కిటకిటలాడసాగారు. అప్పుడాయన వారితో ఇలా మాట్లాడారు:

“నా తర్వాత నేను ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)ని నా వారసుడిగా, ఖలీఫాగా నియమించాను. నేను నాబంధువుల్లో ఎవర్నీ ఖలీఫాగా చేయలేదు; నా సొంత నిర్ణయంతో కూడా ఈపని చేయలేదు. మంచిసలహాలు ఇవ్వగలవారితో సంప్రదించిన తర్వాతే నేనీ నిర్ణయం తీసుకున్నాను. మరి మీకు ఉమర్ (రజి) ఖలీఫా కావడం ఇష్టమేనా?”

ప్రజలీ మాట విని “మాకిష్టమే. మీఎంపిక మాకిష్టమే” అన్నారు ముక్తకంఠంతో. “అయితే మీరు ఉమర్ (రజి)కు పూర్తిగా విధేయులై అతను చెప్పినట్లు నడచుకోవాలి” అన్నారు అబూబకర్ (రజి). దానికి ప్రజలు ముక్తకంఠంతో తమ అంగీకారం తెలిపారు. ఆ తరువాత ఆయన ఉమర్ (రజి)ని సంబోధిస్తూ ఇలా అన్నారు:

“ఉమర్! నేను నిన్ను దైవప్రవక్త (స) అనుచరులపై నా ప్రతినిధిగా నియమించా. కనుక నీవు ఎల్లప్పుడూ దేవునికి భయపడుతూ ఉండాలి. రాత్రివేళకు సంబంధించిన దేవుని హక్కులు కొన్ని ఉన్నాయి. వాటిని ఆయన పగటివేళ స్వీకరించడు. అలాగే పగటి వేళకు సంబంధించిన కొన్ని హక్కులున్నాయి. వాటిని ఆయన రాత్రివేళ స్వీకరించడు. విధిగా పాటించవలసిన (ఫరజ్) సత్కార్యాలను నిర్వహించనంతవరకు దేవుడు ఐచ్ఛిక (నఫిల్) సత్కార్యాలను ఆమోదించడు.

“ఉమర్! గుర్తుంచుకో. ప్రళయదినాన ఎవరి సత్కర్మలు బరువుగా ఉంటాయో వారికే మోక్షం లభిస్తుంది. సత్కర్మలు తక్కువగా ఉన్నవారు ఆపదల్లో చిక్కుకుంటారు. ఖుర్ఆన్ ప్రకారం నడచుకునే సదాచారులకే ముక్తిమార్గం లభిస్తుంది. ఉమర్! ఖుర్ఆన్‌లో నరకవాసుల ప్రస్థావన వచ్చినపుడు నీవు ‘దేవా! నన్ను నరకవాసుల్లో చేర్చకు’ అని వేడుకో. స్వర్గవాసుల ప్రస్థావన వచ్చినపుడు ‘దేవా! నన్ను స్వర్గవాసుల్లో చేర్చు’ అని ప్రార్థించు. ఉమర్! నీవు నాయీ హితవచనాల ప్రకారం నడచుకుంటే నన్ను నీదగ్గరే ఉండే అనుభూతి పొందగలుగుతావు.”

ఉమర్ (రజి) ఈమాట విన్న తర్వాత బయటికి వెళ్ళిపోయారు. అబూబకర్ (రజి) ఆ తర్వాత ఖలీఫాగా ఉమర్ (రజి) శ్రేయోసంక్షేమాల కోసం, ప్రజల శ్రేయస్సు-సద్వర్తనల కోసం దైవాన్ని కడుదీనంగా ప్రార్థించారు. ఈప్రార్థన ముగిసిపోగానే ఆయన ఆత్మ అనంతవాయువుల్లో కలసిపోయింది. హి.శ. 13వ సంవత్సరం, జమాదివుస్సాని 23వ తేదీన 63ఏండ్ల వయస్సులో ఆయన ఇహలోకం వీడిపోయారు. రెండేళ్ళ



ఆర్నెల్ల పాటు నిర్విరామంగా ఇస్లామీయ వెలుగురవ్వలు వెదజల్లిన ఓ నేలతార నింగికెగిసింది. యావత్తు ముస్లింజగత్తు కన్నీటిసంద్రంలో మునిగిపోయింది.

ఖలీఫా అబూబకర్ (రజి) మరణవార్త వినగానే అలి కరముల్లా వజ్‌హూ (రజి) భోరున విలపించారు. వెంటనే ఆయన ఇంటికి పరుగెత్తి విలపిస్తూనే ఆయన్ని పరిపరి విధాల ప్రశంసిస్తూ కన్నీటినివాళులు అర్పించారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ విషాదవార్త విని “మహానుభావా! నీవు నీ తదనంతరం ముస్లింసముదాయాన్ని దుర్భరమైన ఆపదల్లోకి నెట్టివేశావు. నేను నీ కాలిధూళి స్థాయిక్కూడా చేరుకోలేని బలహీనుడ్ని. నేను ఏ విషయంలోనూ నీకు సమానంగా పనిచేయలేను. నాయీ బలహీన భుజస్కంధాలపై నేను మోయలేని (పరిపాలనా)భారం మోపివెళ్ళావు” అని అన్నారు శోకతప్త హృదయంతో.

ప్రాణం పోయిన రోజే ఇషానమాజ్ వేళకుముందు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) భౌతికకాయాన్ని ఖననం చేయడం జరిగింది. అనుచరులు ఆయన మృతి పట్ల కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ తుదివీడ్కోలు పలికారు.

అబూబకర్ (రజి) మొదటి భార్య పేరు ఖతైలా బిన్తె అబ్దుల్ ఉజైరీ. ఆమె కడుపున ఇద్దరు సంతానం అబ్దుల్లా (రజి), అస్మా (రజి) జన్మించారు. అయితే ఖతైలా ఇస్లాం స్వీకరించడానికి నిరాకరించినందు వల్ల అబూబకర్ (రజి) ఆమెకు విడాకులు ఇచ్చివేశారు. తర్వాత ఉమ్మెరూమాన్ (రజి)ని వివాహమాడారు. ఆమె ఇస్లాం స్వీకరించారు. ఆమె కడుపున అబ్దుర్రహ్మాన్ (రజి), ఆయిషా (రజి) జన్మించారు. అబూబకర్ (రజి) ఇస్లాం స్వీకరించిన తర్వాత కూడా మరో ఇద్దర్ని వివాహమాడారు. వారిలో జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) వితంతు భార్యయిన అస్మా బిన్తె అమీస్ (రజి) ఒకరు. ఆమె కడుపున ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) జన్మించారు. రెండవ స్త్రీ ఖజ్రజ్ తెగకు చెందిన హబీబా బిన్తె ఖారిజా (రజి). ఆమె కడుపున ఒక కుమార్తె ఉమ్మెకుల్సూమ్ (రజి) అబూబకర్ (రజి) మరణానంతరం జన్మించారు.

ఖుర్ఆన్, హదీసుల జ్ఞానం అందరికంటే అబూబకర్ (రజి)కే ఎక్కువ ఉంది. జ్ఞాపకశక్తి కూడా ఆయనకే ఎక్కువ. అందుకే దైవప్రవక్త (స) తన అనారోగ్యస్థితిలో నమాజీలకు నాయకత్వం వహించడానికి అబూబకర్ (రజి)నే పంపారు. ఖలీఫాపదవి కోసం ప్రజలు ఆయన్ని ఎన్నుకోవడంలో ఈ విషయమే ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంది. పోతే ఖుర్ఆన్, హదీసుల వెలుగులో సమస్యల్ని పరిష్కరించి సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన మంచికి సంబంధించిన ప్రతి విషయంలోనూ అందరికంటే ముందుండేవారు. అందుకే ముస్లిం సముదాయం ఆయనకు దైవప్రవక్తల తరువాత మానవోత్తముడని బిరుదిచ్చింది.

# 2. ఉమర్ ఫారూఖ్ (రజి)

మక్కా అవిశ్వాసుల ఇస్లాంవ్యతిరేక పథకాలు ఒక్కొక్కటే బెడిసికొట్టసాగాయి. వారి దుష్ప్రచారం, దౌర్జన్యాలు అధికమవుతున్న కొద్దీ శత్రుశిబిరం నుండి ఒక్కొక్కరే ఇస్లాం శిబిరంలోకి వచ్చిచేరుతున్నారు. దాంతో అవిశ్వాసులు చిర్రెత్తిపోయి ఇస్లాంను శాశ్వతంగా అంతమొందించే ఉద్దేశ్యంతో సమావేశమయి కారాలు, మిరియాలు నూరుతూ ప్రసంగించారు. ఈ రెచ్చగొట్టే ప్రసంగాలతో రెచ్చిపోయిన ఓ అవిశ్వాస యోధుడు సమావేశం సమాప్తం కాగానే వరలేని ఖడ్గంతో బయలుదేరాడు.

“దీనికంతటికీ మూలకారకుడైన ముహమ్మద్ (స) అంతం చూస్తాను. జనాన్ని తప్పుదారి పట్టిస్తూ దేశంలో అశాంతి, అనైక్యతలు సృష్టిస్తున్నాడు. అలాంటివాడ్ని ఇక ఏమాత్రం సహించకూడదు. ఇప్పుడే పోయి అతని శిరస్సు ఖండిస్తాను.”

“ఈరోజుతో ముహమ్మద్ కథ సమాప్తం” కోపోద్రేకాలతో ఊగిపోతూ వడివడిగా నడుస్తున్నాడు.

“ఉమర్! ఎక్కడికి మహా ఆర్భాటంగా పోతున్నావు?” నయీమ్ బిన్ అబ్దుల్లా (రజి) దారిలో ఎదురయి అడిగారు.

నయీమ్ (రజి) ఇదివరకే ఇస్లాం స్వీకరించారు. అయితే ముస్లింలపై జరుగుతున్న దారుణాలు చూసి ఆయన తన విశ్వాసాన్ని ఇంకా ప్రజల ముందు బహిర్గతం చేయలేదు. కళ్ళలో నిప్పుసెగలు, నడుముకు ఖడ్గంతో వెళ్తున్న ఉమర్‌ని చూసి, ఇతను ఇస్లాంకు ఏదో కీడు తలపెట్టబోతున్నాడని ఆయన శంకించారు.

“అదే, ఆ మతభ్రష్టుడి దగ్గరికి. మన దేవతలకు అపచారం తలపెట్టి సామాజిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్న ముహమ్మద్ దగ్గరికి వెళ్తున్నా. ఈరోజు అతని రక్తం కళ్ళ చూడదలిచాను” అన్నాడు ఉమర్ బిన్ ఖత్తాబ్ పిడికిలి బిగిస్తూ.

ఉమర్ కోపం నయీమ్ (రజి)కు తెలియనిది కాదు. అతను తలచుకుంటే అంతపని చేస్తాడని భావించి, ఎలాగైనా అతడ్ని దారి మళ్ళించాలనుకున్నారు ఆయన.

“ఏమిటీ ముహమ్మద్ (సల్లం)ని చంపడానికి పోతున్నావా? బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా? అలాగైతే అబ్దెమునాఫ్ తెగవాళ్ళు నిన్ను సజీవంగా వదలుతారనుకున్నావా? సరే, ముహమ్మద్ సంగతి తర్వాత చూద్దువుగాని ముందు నీ బావ, చెల్లెళ్ల సంగతి కనుక్కో” అన్నారు ఆయన.

“ఏమంటున్నావ్!?” అడిగాడు ఉమర్ ఆశ్చర్యాగ్రహాలతో.

“నీ చెల్లెలు, బావ ఈ మధ్యనే ముహమ్మద్ మతాన్ని స్వీకరించారు. మొదట వాళ్ళ సంగతి తేల్చుకో; తర్వాత ముహమ్మద్‌ని గురించి ఆలోచించవచ్చు.”



ఈ సంగతి విని ఉమర్ అదిరిపడ్డాడు. “ఆ... నా కుటుంబ సభ్యులే అంతగా బరితెగించారా! అయితే ఇప్పుడే పోయి వారి ఆట కట్టిస్తానుండు.” పళ్ళు పటపట కొరుకుతూ ఉమర్ అక్కడ్నుంచి వెనక్కి తిరిగి సరాసరి చెల్లెలి ఇంటికి దారితీశాడు.

అక్కడికి వెళ్ళి తలుపులు దబదబా తట్టాడు. తలుపులు విరిగిపోయేటట్లు బాదుతున్న శబ్దానికి ఇంట్లో వాళ్ళు భయపడ్డారు. “ఎవరండీ!” లోపలి నుంచే అడిగారు.

“ఉమర్ బిన్ ఖత్తాబ్” బయటి నుంచి సమాధానం వచ్చింది సింహగర్జనలా.

ఉమర్‌పేరు వినగానే ఇంట్లోవారి గుండెలు గుభేలుమన్నాయి. ఖుర్‌ఆన్ విన్పిస్తున్న ఖబ్బాబ్ (రజి) వెంటనే పుస్తకం మూసేసి నిలబడ్డారు. ఆయనకు ఎదురుగా కూర్చొని ఖుర్‌ఆన్ వింటున్న ఉమర్ చెల్లెలు ఫాతిమా (రజి), ఆమె భర్త సయీద్ (రజి) కంగారు పడుతూ లేచి ఏదో మూల దాక్కోవడానికి ప్రయత్నించారు.

బయట తలుపు తడ్తున్న శబ్దం మరింత అధికమయింది. హజ్రత్ ఖబ్బాబ్ (రజి) ఖుర్‌ఆన్‌ని అక్కడే వదిలేసి ఒక్క అంగలో పోయి లోపల గదిలో ఓ మూల దాక్కున్నారు.

హజ్రత్ ఫాతిమా (రజి) పుస్తకం తీసి కన్పించకుండా తన వీపు వెనుక చేతిలో పట్టుకొని తలుపు వైపే చూడసాగారు భయం భయంగా.

హజ్రత్ సయీద్ (రజి) అదురుతున్న గుండెను చేత పట్టుకొని మెల్లిగా తలుపు తెరిచారు. అంతే, ఆకలిగొన్న బెబ్బులిలా లోపలికి దూసుకొచ్చాడు ఉమర్. లోపల నలుమూలలా పరికించిచూశాడు. తన బావా, చెల్లెలు తప్ప మరెవరూ కన్పించలేదు.

“ఇప్పుడు నేను విన్న కంఠం ఎక్కడ్నుంచి వచ్చింది?” గర్జించాడు ఉమర్.

“అబ్బే... ఇక్కడ అలాంటిదేమీ లేదే!” నసిగారు వారిద్దరు భయపడుతూ.

“దాచి పెట్టకండి. మీరు ఇస్లాం స్వీకరించిన సంగతి నాకు తెలియదనుకున్నారా?” అంటూనే సయీద్ (రజి) మీదికి లంఘించాడు ఉమర్. పిడిగుద్దులతో ఆయన వళ్ళు హూనం చేయడం ప్రారంభించాడు.

ఫాతిమా (రజి) సహించలేక భర్తను విడిపించుకోవడానికి అడ్డం వచ్చారు. దాంతో ఉమర్ మరింత రెచ్చిపోయి బావను వదలి చెల్లెలిపై చెయ్యెత్తాడు. ఆ చెంప ఈ చెంప ఎడాపెడా వాయించసాగాడు.

పాపం ఫాతిమా చెంపలు కందిపోయాయి. తల నుంచి రక్తం కారసాగింది. ఉమర్ ఇక తమను ప్రాణాలతో వదలిపెట్టడని భావించారు ఆమె. దాంతో ఆమె హృదయంలోని విశ్వాసతరంగాలు పరవళ్ళు తొక్కాయి. ఆమె దెబ్బ తిన్న చిరుతపులిలా ఉరిమి చూస్తూ అన్నకు ఎదురు తిరిగారు.

"అన్నయ్యా! ఆగు. నువ్వు ఖత్తాబ్ కొడుకువయితే నేను ఖత్తాబ్ కూతుర్ని. నేను నీకేమీ తీసిపోను. ఔను, మేము ఇస్లాం స్వీకరించాం. ఇక మేము ఇస్లాం నుంచి ఒక్క అంగుళమైనా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు. నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అన్నారు ఆమె ఉద్రేకంతో ఊగిపోతూ.

ఆమె వాలకం చూడగానే ఉమర్ చేయి అప్రయత్నంగా ఆగిపోయింది. చెల్లెలి పలుకులు అతని హృదయాన్ని కదిలించాయి. ఆమె చెంపల మీదుగా కారుతున్న రక్తం అతని మనస్సును క్షణంలో మైనంలా కరిగించివేసింది. అంతలో అతని దృష్టి చెల్లెలి చేతిలో ఉన్న పుస్తకంపై పడింది.

"ఇదేనా మీరు చదువుతున్నది? ఏది ఓసారి ఇటివ్వు, నేనూ చూస్తాను" అన్నాడు ఉమర్ ప్రశాంతంగా.

"ఇది నీ చేతికిస్తే మళ్ళీ మాకు లభిస్తుందో లేదో!" అన్నారు ఫాతిమా (రజి) భయమూ, అనుమానం మేళవించి చూస్తూ.

"భయపడకు, తప్పకుండా తిరిగిస్తాను."

"అయితే ముందు నువ్వు స్నానం చేసి రా."

ఉమర్ లోపలికి వెళ్ళి స్నానంచేసి వచ్చాడు. ఫాతిమా (రజి) తడబడుతున్న చేతులతో ఖుర్ఆన్‌ని అతని చేతికి అందించారు.

ఉమర్ దాన్ని తెరచి జాగ్రత్తగా చదవడం ప్రారంభించాడు. కొన్ని క్షణాల తరువాత అతని వాలకంలో మార్పు రాసాగింది. చేతులు వణికి పోతున్నాయి.

"ఎంత మంచి విషయాలు! ఎంత పవిత్రమైన వాణి ఇది!!" ఉమర్ నోట అప్రయత్నం గా వెలువడ్డాయీ మాటలు.

లోపల దాక్కున్న ఖబ్బాబ్ (రజి) ఈ మాటలు వినగానే బయటికి వచ్చారు.

"ఉమర్! దైవప్రవక్త (స) నిన్నుగాని, అబూజహల్‌నిగాని ఇస్లాం వడిలోకి వచ్చేటట్లు చేయమని దైవాన్ని ప్రార్థించారు. ఆ ప్రార్థన బహుశా నీ విషయంలోనే దైవం అంగీకరించి ఉండవచ్చు. ఇక ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టకు ఉమర్!" అన్నారు ఆయన.

"నేను ఇస్లాం స్వీకరించదలిచాను. నన్ను ముహమ్మద్ దగ్గరకు తీసికెళ్ళండి."

హఠాత్తుగా ఉమర్‌లో వచ్చిన ఈ మార్పు చూసి ఖబ్బాబ్ (రజి) పరమానంద భరితులయ్యారు. ఇక ఫాతిమా, సయీద్ (రజి)ల ఆనందానికైతే అవధులే లేవు.

అర్ఖమ్ ఇంట్లో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తమ అనుచరులకు ఖుర్ఆన్ బోధిస్తూ భావి కార్యక్రమం గురించి వివరిస్తున్నారు. హమ్జా(రజి), అబూబకర్(రజి),



బిలాల్(రజి), అలి (రజి) ప్రభృతులు శ్రద్ధాసక్తులతో వింటున్నారు. అంతలో బయట తలుపుతట్టిన చప్పుడు విన్పించింది.

"ఎవరూ?" హజ్రత్ బిలాల్ (రజి) అడిగారు లోపలి నుంచే.

"నేను ఉమర్ బిన్ ఖత్తాబ్‌ని" బయట నుంచి సమాధానం వచ్చింది.

ఉమర్ పేరు వినగానే ప్రవక్త అనుచరులు కంగారుపడ్డారు.

"దైవప్రవక్తా! ఉమర్ వచ్చాడు. తలుపు తెరిస్తే వచ్చి రభస చేస్తాడేమోనని భయంగా ఉంది" అన్నారు హజ్రత్ బిలాల్ (రజి) అనుమానిస్తూ.

"రానియ్. అతని ఉద్దేశ్యం మంచిదయితే, అంతకంటే కావాల్సిందేమిటీ మనకు?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఒకవేళ దురుద్దేశంతో వచ్చినా భయపడాల్సిన పనిలేదు. అతడ్ని మట్టి కరిపించడం నా ఎడమచేతి పని" అన్నారు హజ్రత్ హమ్జా (రజి) ధైర్యంతో.

ఆ తరువాత హజ్రత్ బిలాల్ (రజి) తలుపు తీయడానికి వెళ్ళారు. హమ్జా(రజి) కూడా వెళ్ళారు. బిలాల్ (రజి) తలుపు తెరిచారు. ఉమర్ లోపలికి అడుగుపెట్టాడు. హమ్జా, బిలాల్ (రజి) ఒకేసారి ఒక్కఊపులో ముందుకు లంఘించి ఉమర్ రెక్కలు చెరోపక్క గట్టిగా పట్టుకున్నారు.

ఉమర్‌ని చూడగానే దైవప్రవక్త (సల్లం) "దేవా! చీకటి అలుముకొనివున్న ఉమర్ హృదయంలో విశ్వాసజ్యోతి వెలిగించు" అని ప్రార్థించారు. ఆ తర్వాత "హమ్జా! బిలాల్! ఉమర్ చేతులు వదిలేయండ"ని ఆదేశించారు.

హమ్జా, బిలాల్ (రజి) ఉమర్ చేతులు వదిలేసి పక్కకు తప్పుకున్నారు. ఉమర్ దైవప్రవక్త (సల్లం) ముందు చేతులు కట్టుకొని తలవంచి మౌనంగా నిలబడ్డాడు.

"ఉమర్! భయంకర శిక్ష సమీపించేదాకా నీ వైఖరి మారదా? ఏమిటీ నీ ఉద్దేశ్యం? నీ రాకకు కారణం ఏమిటీ?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఇస్లాం ధర్మం స్వీకరించడానికి వచ్చాను" అన్నారు ఉమర్. ఆ వెనువెంటనే సత్యవచన సాక్ష్యం పలికాడు.

ఉమర్ ఇస్లాంస్వీకార ప్రకటన విని ప్రవక్త అనుయాయులు ఆనందాతిశయంతో 'అల్లాహు అక్బర్!' అంటూ బిగ్గరగా అరిచారు. ఈ నినాదంతో అర్ఖమ్ ఇంటిగోడలు ప్రకంపించాయి; మక్కా కొండలు మార్మోగిపోయాయి.

దైవప్రవక్త (సల్లం) దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ "దేవా! ఉమర్‌కు సన్మార్గం అనుగ్రహించు, అతనికి స్థయిర్యం ప్రసాదించు"అని ప్రార్థించారు.

ఉమర్ (రజి) ఇప్పుడు జ్యోతిర్మయ హృదయంతో ముస్లింలలోకి వచ్చికూర్చున్నారు. మిత్రులతో ఇస్లాం గురించి ముచ్చట కూడా మొదలెట్టారు. "దైవప్రవక్తా! చచ్చినా బ్రతికినా సత్యం మన పక్షానే ఉందికదూ?" అడిగారు ఆయన.

"ఎవరి అధీనంలో నాప్రాణముందో ఆ దేవుని సాక్షి! నిస్సందేహంగా సత్యం మన వైపే ఉంది. ఉమర్! చావుబ్రతుకులతో ఏమౌతుంది?" అన్నారు దైవప్రవక్త (స).

"అయితే మనం ఇలా దాక్కోవడం ఎందుకూ?" అడిగారు ఉమర్ (రజి).

"మనం ఇప్పుడు తక్కువ సంఖ్యలో ఉన్నాం. శత్రువులు అధిక సంఖ్యలో ఉన్నారు" సమాధానమిచ్చారు దైవప్రవక్త (సల్లం).

"దైవారాధన దాక్కొని చెయ్యడమా! వీల్లేదు. మిమ్మల్ని సత్యధర్మం ఇచ్చిపంపిన దేవుని సాక్షి! ఇప్పటిదాకా నేను ఎక్కడక్కడ అవిశ్వాస గానాలు ఆలపించానో ఇకనుంచి అక్కడ ఇస్లాం నినాదాలు చేస్తాను" అన్నారు ఉమర్ (రజి) దృఢ సంకల్పంతో.

మహాప్రవక్త ముహమ్మద్ (స) తన అనుచరుల్ని ఉమర్ (రజి), హమ్జా (రజి)ల నాయకత్వంలో రెండుజట్లుగా విభజించి కాబా వంపించారు. వీరంతా కాబా వెళ్ళి నమాజ్ చేసి దిక్కులు పిక్కటిల్లేలా 'లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని నినదించారు.

ఆరోజు ముస్లింలలో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు వర్ణనాతీతం. ఇస్లామీయ ఉద్యమంలో అదొక మైలురాయి. ఆ రాత్రే ఉమర్ (రజి) మక్కా వీధులన్నీ తిరిగి తన విశ్వాసాన్ని ప్రకటిస్తూ అనేకమందిని ఇస్లాం వైపు పిలిచారు.

తరువాత ఆయన సరాసరి మేనమామ అబూజహల్ ఇంటికెళ్ళి తలుపుతట్టారు. అబూజహల్ తలుపు తీసి ఎంతో ప్రేమాభిమానాలతో ఉమర్‌ని లోపలికి తీసికెళ్ళాడు.

"బాగున్నావా ఉమర్! ఏమిటీ విశేషం ఇలా వచ్చావు వేళకాని వేళలో."

"నేను అల్లాను, ఆయన ప్రవక్తను విశ్వసించాను. ఈసంగతి చెప్పడానికే వచ్చాను."

అబూజహల్‌కు నెత్తి మీద పిడుగు పడినట్లయింది. అతను అసహ్యంగా చూస్తూ "దేవుడు నిన్ను నాశనం చెయ్య, నువ్వు కూడా మతభ్రష్టుడయ్యావా!" అన్నాడు.

## (1) ఫారూఖ్ బిరుదు

ఉమర్ (రజి) ముస్లిం అయిన వార్త నగరంలో కార్చిచ్చులా వ్యాపించింది. ఖురైష్ నేతలు వెంటనే కూడబలుక్కొని ఇస్లాం నినాదం చేస్తూ వస్తున్న ఉమర్ (రజి) మీదికి దాడి చేశారు. నాలుగు వైపులా చుట్టుముట్టి పరమనీచంగా దూషించారు. ఉమర్(రజి) రెండు క్షణాలు పెనుగులాడి వర నుంచి కత్తిదూసి ఝుళిపించారు.



"అల్లాహ్ తప్ప ఆరాధ్యదైవం లేడని, ముహమ్మద్ (సల్లం) ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను. ఎవరైనా సరే ముందుకు అడుగు వేశాడా, తల ఎగిరిపోతుంది." సింహంలా గర్జించారు ఉమర్ (రజి) కళ్ళలో నుంచి నిప్పులు చెరుగుతూ.

దాంతో ఖురైషీయులు భయపడి అక్కడ్నుంచి మెల్లిగా జారుకున్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి తిరిగొచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని పరమ సంతోషంతో కౌగిలించుకున్నారు. అదీగాక, ఆయన చూపిన ధైర్యసాహసాల్ని గురించి విని ఆయనకు 'ఫారూఖ్' అనే బిరుదు కూడా ప్రదానం చేశారు.

ఖురైషీలందరిల్లో ఉమర్ (రజి) గొప్ప సాహసవీరుడు. ఆయన ధైర్యానికి, పట్టుదలకు ప్రతీక; అనుకున్నది సాధించేవరకు విశ్రమించని ధీశాలి. ఇబ్నెసాద్(రజి) ప్రకారం "ఉమర్ (రజి) ముస్లింకాగానే ఇస్లాం బహిర్గతమయింది. మేము కాబా చుట్టు కూర్చోవడం, దాని ప్రదక్షిణ చేయడం, బహుదైవారాధకుల నుండి బదులు తీర్చు కోవడం, వారికి జవాబివ్వడం ప్రారంభించాం."

ఇబ్నెఅబ్బాస్ (రజి) ప్రకారం, ఉమర్‌ఫారూఖ్ (రజి) ఇస్లాం స్వీకరించిన రోజు అవిశ్వాసులు "ముస్లింలు మన నుండి పూర్తి బదులు తీర్చుకున్నార"ని అన్నారు.

హుజైఫా (రజి) ప్రకారం "ఉమర్ ఫారూఖ్ (రజి) ఇస్లాం స్వీకరించిన నాటినుంచి ఇస్లాం ఒక్కొక్క మెట్టు పైకెక్కిపోయే మనిషిలా అడుగడుగునా వృద్ధిచెందుతూపోయింది. అయితే ఆయన అమరగతి పొందినప్పటి నుంచి ఇస్లాం ప్రతి అడుగూ వెనక్కిపోతోంది."

ముస్లింలపై మక్కా అవిశ్వాసుల దౌర్జన్యాలు మరింత అధికమయ్యాయి. సాంఘిక బహిష్కరణకు కూడా గురయ్యారు. ఈ బాధలు భరించలేక కొందరు ముస్లింలు దైవ ప్రవక్త (స) అనుమతితో అబిసీనియా వెళ్ళిపోయారు. ఆ తరువాత కొంతకాలానికి ఇస్లాం స్వీకరించిన కొందరు మదీనావాసుల సహకారంతో, దైవప్రవక్త (స) అనుమతితో దాదాపు ముస్లింలందరూ తమ ఆస్తిపాస్తులన్నీ వదులుకొని రహస్యంగా మక్కా నుండి మదీనా వలసపోయారు. చివర్లో దైవప్రవక్త (స) కూడా మదీనా వలసపోయారు.

ఇబ్నెఅసాకర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం అలి (రజి) ఇలా తెలిపారు: "(మాలో) ప్రతివ్యక్తీ 'హిజ్రత్' రహస్యంగా చేశాడు. అయితే ఉమర్ (రజి) హిజ్రత్ చేయడానికి నిర్ణయించుకున్నప్పుడు ఆయన ఒకచేతిలో వరలేని ఖడ్గం, మరొక చేతిలో విల్లు, వీపుపై అంబులపొది తీసుకొని కాబాకు వెళ్ళి దాని చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేశారు. తర్వాత 'మఖామెఇబ్రాహీం' దగ్గర నిల్చొని రెండు రకాతులు నమాజ్ చేశారు.

ఆ తరువాత ఖురైష్‌నాయకులు కూర్చున్న చోటికెళ్ళి, వారిని పేరు పేరున సంబోధిస్తూ 'నీ ముఖం మాడ! నువ్వు నీ తల్లిని తనయులులేనిదైి చేయాలనుకుంటే,

నీభార్యని వితంతువు చేయదలిస్తే నన్ను ఎదిరించు' అని అన్నారు. ఈ మాటలు విన్న తర్వాత వారిలో ఎవరూ ఆయన్ని నిరోధించడానికి సాహసించలేకపోయారు."

## (౨) అజాన్ పలుకులు

మదీనాలో మొదట నమాజ్ కోసం ప్రజలను పిలవడానికి ఏ పద్ధతీ లేదు. ప్రజలు తమంతట తామే మసీదులో గుమిగూడి సామూహికంగా నమాజ్ చేసేవారు. అప్పుడు ముస్లింలు చాలా తక్కువసంఖ్యలో ఉండటంవల్ల ఎలాగో పని జరిగిపోయింది. ఇప్పుడు ముస్లిం జనసంఖ్య అధికమయింది. నమాజ్ వేళయిందని దూరాన ఉన్నవారికి తెలియజేయడానికి ఒక పద్ధతి అంటూ ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

అప్పుడు కొందరు అనుచరులు యూదుల మాదిరిగా బాకా ఊద్దామని సూచించారు. మరికొందరు గంట కొడ్దామన్నారు. కాని దైవప్రవక్త (స)కు ఈ బాకా ఊదుడు, గంటకొట్టుడు నచ్చలేదు. మరికొందరు కూడా దీన్ని వ్యతిరేకించారు. అయితే "క్రైస్తవుల మాదిరిగా శంఖం పూరిద్దామని ఇంకొందరు అన్నారు.

ఈ సలహా చాలామందికి నచ్చింది. ఎందుకంటే యూదులకంటే క్రైస్తవులు ముస్లింల పట్ల కాస్త సన్నిహితంగా మసలుకుంటారు. వీరు యూదుల్లా ఇస్లాంను విరోధించే, కుట్రలు పన్నే దుర్మార్గులు కాదు. ఈ విషయంపై ఏకీభావం కుదరగానే శంఖం ఏర్పాటు చేయమని దైవప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (రజి)ని ఆదేశించారు.

సరేనని హజ్రత్ ఉమర్ (రజి) ఇంటికి వెళ్ళిపోయారు. అదే ఆలోచనలతో ఆ రాత్రి నిద్రపోయారు. కాస్సేపటి స్వప్నజగత్తులో విహరించసాగారు.

"గంటేమిటి గంట!! అజాన్ చెప్పండి, అజాన్" అన్నారు ఎవరో కలలో కన్పించి.

ఉషోదయమయింది. హజ్రత్ ఉమర్ (రజి) మేల్కొన్నారు. ఈ విషయం దైవప్రవక్త (సల్లం) తెలియజేద్దామని బయలుదేరారు. అంతలో ఎక్కడ్నుంచో మధురాతి మధురమైన పలుకులు విన్పించసాగాయి:

"అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్. అష్హదుఅన్ లాఇలాహ ఇల్లల్లాహ్...."

ఈ మధుర వచనాలు విని హజ్రత్ ఉమర్ (రజి) గబగబా నడచి మసీదుకు చేరుకున్నారు. హృదయాల్లో అమృతం చిలికించే ఈ సుమధుర ధ్వని మసీదు పక్కనే ఉన్న ఓ ఇంటికప్పు పైనుండి వస్తోంది. చూస్తే ఆ ఇంటి కప్పుపై హజ్రత్ బిలాల్ (రజి) నిలబడి ఉన్నారు. మస్జిద్ దగ్గర అటూఇటూ అనేకమంది ముస్లింలు నిలబడి వింటున్నారా విచిత్ర పలుకులు.

"ఎవరు తెలిపారీ అజాన్ పలుకులు?" అడిగారు ఉమర్ (రజి) ఆశ్చర్యంతో.



"ఇందాక అబ్దుల్లా బిన్ జైద్ (రజి) వచ్చి రాత్రి తన కలలో ఒక మనిషి కన్పించి ఇలా అజాన్ ఇవ్వాలని చెప్పాడట" అన్నాడు ఒకతను.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట వినగానే దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళి "దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యాన్నిచ్చి పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. రాత్రి నేను కూడా అబ్దుల్లా కన్న కలలాంటిదే కన్నాను" అని అన్నారు.

"ఇదంతా దేవుని అనుగ్రహం ఉమర్! నా దగ్గరక్కూడా దీన్ని గురించి దైవసందేశం వచ్చింది" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.

## (3) ఖైదీల సమస్య, వితంతు కుమార్తె వివాహం

ముస్లింలు మక్కా నుండి మదీనాకు వలసవచ్చినా మక్కా బహుదైవారాధకులు వారిని వదలిపెట్టలేదు. చివరికి వారు ముస్లింలను కయ్యానికి కాలుదువ్వి బదర్ యుద్ధంలో ఘోరంగా ఓడిపోయారు. కొందరు ఖైదీలుగా పట్టుబడ్డారు.

యుద్ధఖైదీల సమస్య పరిష్కారం కోసం దైవప్రవక్త (స) అనుచరుల్ని సంప్రదించినపుడు హజ్రత్ ఉమర్ (రజి) తన అభిప్రాయాన్ని ఇలా తెలిపారు:

"వీరు దైవవిరోధులు. దైవధర్మాన్ని అంతమొందించదలచుకున్న పరమ దుర్మార్గులు. మిమ్మల్ని అనేకసార్లు చంపడానికి ప్రయత్నించారు ఇలాంటి నీచుల్ని వదలిపెట్టకూడదు. వీరందర్నీ వధించాలి. మనలో ఎవరు ఏ ఖైదీల బంధువులో వారే ఆ ఖైదీలను వధించాలి. దానివల్ల మన హృదయంలో బంధుప్రేమ కంటే దేవుని, దైవ ప్రవక్తల ప్రేమే అధికమని, దైవధర్మం ముందు సమస్త బాంధవ్యాలు బలదూర్ అని అవిశ్వాసులు తెలుసుకుంటారు."

కాని దైవప్రవక్త (స) హజ్రత్ అబూబకర్ (రజి) అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఖైదీలను నష్టపరిహారం తీసుకొని విడుదల చేశారు.

బదర్ యుద్ధంలో హజ్రత్ ఉమర్ (రజి) అల్లుడు ఖునైస్ (రజి) తీవ్రంగా గాయపడి ఆ తరువాత చనిపోయారు. అందువల్ల హజ్రత్ ఉమర్ (రజి) కుమార్తె హఫ్సా (రజి) దుస్థితి పట్ల చాలా విచారంగా ఉన్నారు. ఆమెకు పునర్వివాహం చేయడానికి సరయిన సంబంధం ఇంకా లభించలేదు. ఓరోజు ఆయన ఉస్మాన్ (రజి) దగ్గరికి పోయి ఈ విషయం గురించి ప్రస్తావించారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) అర్ధాంగి రుఖియ్యా (రజి) కూడా ఈ మధ్యనే చనిపోయారు. అంచేత హజ్రత్ ఉమర్ (రజి) తన కుమార్తెను ఉస్మాన్ (రజి) చేసుకుంటాడేమోనని భావించి వచ్చారు. కాని ఉస్మాన్ (రజి) తానీ విషయం గురించి ఆలోచించి చెబుతానని విషయం దాటవేయడానికి ప్రయత్నించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని నిరాశతో వెళ్ళిపోయారు. మరొక రోజు ఆయన హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఈ విషయమే ప్రస్తావించారు. కాని ఆయన దగ్గర నుంచి కూడా ఆశించిన సమాధానం ఏదీ రాలేదు. దాంతో ఆయన మరింత విచారంతో క్రుంగిపోయారు.

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) సలహా కోసం దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. దైవప్రవక్త (సల్లం) ఆయన విచారవదనం చూసి "ఉమర్! ఏమిటీ ఈరోజు నువ్వు చాలా విచారంగా ఉన్నట్లు కన్పిస్తున్నావు?" అని అడిగారు.

"దైవప్రవక్తా! నా కూతురు హఫ్సా పునర్వివాహం విషయం నన్ను క్రుంగదీస్తోంది. నేను ఉస్మాన్ దగ్గరికెళ్ళి అడిగితే ఆయనగారు ఆలోచించి చెబుతానని చెప్పి నన్ను పంపివేశారు. అబూబకర్ దగ్గరికెళ్తే ఆయన దగ్గర్నుంచి కూడా నాకు సరైన సమాధానం రాలేదు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి) విచారంతో.

దైవప్రవక్త (స) ఈమాట విని చిరునవ్వు నవ్వుతూ "ఉమర్! దేవుడు ఉస్మాన్‌కు నీ కూతురి కంటే మంచిభార్యను ప్రసాదించాడు. నీ కూతురికి ఉస్మాన్ కంటే మంచి భర్త ప్రసాదించాడు" అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి)కు దైవప్రవక్త (స) మాటల్లోని గూఢార్థం తెలియక కాస్సేపు తికమకపడ్డారు. తరువాత దైవప్రవక్త (స) విషయం వివరంగా తెలియజేశారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఉమర్ (రజి) కుమార్తె హఫ్సా (రజి)ను వివాహమాడారు.

## (4) యుద్ధ సమయాల్లో

బదర్‌యుద్ధంలో ఓడిపోయిన మక్కా అవిశ్వాసులు దాని బదులుతీర్చుకోవడానికి కొన్నాళ్ళ తర్వాత ఉహుద్ యుద్ధజ్వాలలు రగిలించారు. ఆ సందర్భంలో జరిగిన రెండు దుస్సంఘటనల కారణంగా విజయపథంలో పురోగమిస్తుండిన ముస్లింలు పరాజయ పథంలోకి జారిపడ్డారు.

గెలుపు ఖురైషీయుల వైపే మొగ్గు చూపుతున్నా, ఎందుకో వారు ముస్లింలతో యుద్ధం కొనసాగించలేదు. ముస్లింలు కూడా తమ పోరాటాన్ని నిలుపుదల చేసుకున్నారు. దాంతో అబూసుఫ్యాన్ వికటాట్టహాసం చేశాడు.

"ముస్లింలారా! మీలో ముహమ్మద్ ఉన్నారా?"అన్నాడతను బిగ్గరగా కేకవేసి. దానికి సమాధానం ఇవ్వద్దని దైవప్రవక్త (స) అనుచరులకు చెప్పారు.

"మీలో అబూబకర్ ఉన్నాడా?" అరిచాడు మళ్ళీ అబూసుఫ్యాన్ బిగ్గరగా. దానిక్కూడా ముస్లింల నుంచి సమాధానం రాలేదు.



"మీలో ఉమర్ బిన్ ఖత్తాబ్ ఉన్నాడా?" దానికీ సమాధానం రాలేదు.

"ఏమిటీ అంతా నిశ్శబ్దంగా ఉంది! అంటే వీళ్ళంతా వధించబడ్డారన్న మాట" అన్నాడు అబూసుఫ్యాన్ స్వగతంలో.

హజ్రత్ ఉమర్ (రజి) ఇక ఉద్రేకం పట్టలేక "ఓరీ దైవవిరోధీ వీళ్ళంతా సజీవంగానే ఉన్నారు. నీకు అవమానం తప్పదులే" అన్నారు.

అబూసుఫ్యాన్ క్షణంపాటు నిర్ఘాంతపోయాడు. తరువాత "హుబల్ దేవతకు జై" అన్నాడు గర్వంతో ఘనవిజయం సాధించినట్లు భావిస్తూ.

"అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు, మహోన్నతుడు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (స) సూచించిన విధంగా.

"ఉజ్జా విగ్రహం మాది, మీది కాదు" అన్నాడు అబూసుఫ్యాన్.

"అల్లాహ్ మా రక్షకుడు, మీ రక్షకుడు కాదు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (స) ఇచ్చిన సూచన ప్రకారం.

"ఈ యుద్ధం బదర్‌యుద్ధంతో సమానమైనది. మేము బదర్ ప్రతీకారం తీర్చుకున్నాం" అన్నాడు అబూసుఫ్యాన్ మళ్ళీ.

"ఇది బదర్ యుద్ధంతో సమానం కాదు. ఈ యుద్ధంలో మావాళ్ళు చనిపోయి స్వర్గంలో ప్రవేశించారు. మీవాళ్ళు నరకానికి పోయారు" అన్నారు ఉమర్ (రజి) దైవప్రవక్త (స) సూచించినట్లు.

"సరే, మన ఉభయుల మధ్య వచ్చే ఏడు బదర్‌లో మళ్ళీ పోటీ ఉంటుంది" అన్నాడు అబూసుఫ్యాన్. "ఈ పోటీ మాకు సమ్మతమే" అన్నారు ఉమర్ (రజి) దైవప్రవక్త సూచన ప్రకారం.

ఆ తర్వాత జరిగిన అహ్జాబ్‌యుద్ధంలో బహుదైవారాధకులు నీరుగారి పోవడంతో వారు ముస్లింల వైపు కన్నెత్తి చూడటానిక్కూడా సాహసించలేకపోయారు. కాని ఆ రోజుల్లోనే ముస్లింలు హజ్‌యాత్ర కోసం మక్కా సమీపానికి చేరుకుంటే మక్కా ఖురైషీయులు ఒక ఒప్పందం ద్వారా వారిని అడ్డుకొని వెనక్కి పంపివేశారు. అయితే ఆ ఒప్పందంలో వారు దారుణమైన షరతులు పెట్టారు. దైవప్రవక్త (స) వాటిని దేవుని ఆదేశంతో అంగీకరించారు. అనుచరులు మాత్రం విస్తుపోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ తర్వాత వారిలో ఆవేశం, ఆత్మాభిమానాలు పెల్లుబికాయి.

హజ్రత్ ఉమర్ (రజి) ఆవేశం అణచుకోలేక దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి "ఏమిటీ, మీరు దైవప్రవక్త కాదా?!" అన్నారు.

“అందులో సందేహం ఏముంది?” అన్నారు దైవప్రవక్త (స).

“మనం ముస్లిములం కామా?!”

“నిస్సందేహంగా మనం ముస్లిములమే.”

“వారు బహుదైవారాధకులు కాదా?!”

“అందులో కూడా ఎలాంటి అనుమానం లేదు.”

“అయితే మరి మనం ధర్మం విషయంలో ఈ అవమానం భరించవలసిన అగత్యం ఏమిటీ? ఈ విధంగా వారికి లోకువయి సంధి చేసుకోవడం ఎందుకు?”

“ఉమర్! ఆవేశపడకు. నేను దేవుని దాసుడ్ని. ఆయన సందేశహరుడ్ని. ఇది ఆయన నిర్ణయమే. ఆయన మనకు నష్టం వాటిల్లనివ్వడు” అన్నారు దైవప్రవక్త (స).

హజ్రత్ ఉమర్ (రజి) కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆయన మనసు కుదుటపడ లేదు. అక్కడ్నుంచి లేచి అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఇలాగే ప్రశ్నించారు.

“ఉమర్! ఆందోళన చెందకు. ముహమ్మద్ (స) దేవుని సందేశహరుడు. ఆయన ఏదిచేసినా దైవాజ్ఞ ప్రకారమే చేస్తారు. కాస్త ఓపికపట్టు. దేవుడు మనకే విజయం చేకూర్చు తాడని ఆశించు” అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

హజ్రత్ ఉమర్ (రజి) కకావికలమైన మనసుతో అక్కడ్నుంచి వెళ్ళారు.

ఆ తరువాత అందరూ బలిపశువుల్ని జిబహ్‌చేసి మదీనాకు తిరుగుప్రయాణ మయ్యారు. మదీనా నుండి బయలుదేరినప్పటి ఉత్సాహం తిరుగుప్రయాణంలో లేదు. ఖురైషీయులు విధించిన దారుణమైన షరతులు దైవప్రవక్త (సల్లం) ఎందుకు ఆమోదించారో ఎంత ఆలోచించినా అనుచరులకు అర్థంకాలేదు. ఈ విషయాన్ని గురించి హజ్రత్ ఉమర్ (రజి) ప్రయాణంలో కూడా దైవప్రవక్త (సల్లం)ను అనేకసార్లు అడిగారు. కాని దైవప్రవక్త (సల్లం) ఎలాంటి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయారు. దాంతో ఉమర్ (రజి)కు దుఃఖం పొరలివచ్చింది. దైవప్రవక్త (సల్లం)ను విసిగించానే అని ఆయన లోలోన బాధపడసాగారు. కాస్సేపటికి హఠాత్తుగా వెనుక నుండి ఓ పిలుపు వినవచ్చింది.

“ఉమర్! దైవప్రవక్త (సల్లం) నిన్ను పిలుస్తున్నారు.”

దైవప్రవక్త (సల్లం) పిలుస్తున్నారనగానే ఉమర్ (రజి) గుండెలు దడదడలాడాయి. కొంపదీసి తాను చేసిన తప్పుకు దివ్యావిష్కృతి ద్వారా దైవాగ్రహం విరుచుకుపడలేదు కదా అన్న అనుమానం వచ్చి ఆయన ఓ క్షణం పాటు నిలువునా కంపించిపోయారు. అలా భయపడుతూనే ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళారు.



కాని అక్కడ చూస్తే దైవప్రవక్త (స) దివ్యమోము పూర్ణచంద్రుడిలా వెలిగిపోతోంది. పెదవులపై దరహాసం తొణికిసలాడుతోంది.

“ఉమర్! ఇప్పుడిప్పుడే నాపై ఖుర్‌ఆన్ అధ్యాయం (ఫతహ్ సూరా) ఒకటి అవత రించింది. సుమధుర వాణి! హృదయాన్ని ఆనందసాగరంలో ఓలలాడించే దివ్యసందేశం!! దాని ముందు ఎంత పెద్ద ప్రాపంచిక సంతోషమైనా బలాదూరే. ఇదిగో విను” అంటూ ఇలా విన్పించారు:

“ముహమ్మద్ (సల్లం)! మేము నీకు స్పష్టమయిన విజయం ప్రసాదించాం. దేవుడు నీ గత పొరపాట్లు, భావి పొరపాట్లు మన్నించి నీపై తన అనుగ్రహం పరిపూర్తి చేయాలని, నీకు రుజుమార్గం చూపి, పెద్ద సహాయం చేయాలని (ఈ శుభవార్త నీకు విన్పిస్తున్నాడు).”

“ఆయనే ముస్లింల విశ్వాసం ద్విగుణీకృతం కావడానికి వారి హృదయాలలో శాంతీ స్థిమితాలను అవతరింపజేశాడు. భూమ్యాకాశాల సైన్యాలన్నీ దేవుని అధీనంలోనే ఉన్నాయి. ఆయన సర్వం ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు.”

“(ఇలా చేయడానికి కారణం) విశ్వసించిన స్త్రీ పురుషుల్ని శాశ్వతనివాసం కొరకు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేయాలని, వారి నుండి చెడులను తొలగించాలని-- దేవుని దృష్టిలో ఇది గొప్ప విజయం--” (48:1-6)

“విశ్వాసులు చెట్టు క్రింద నీ చేతిలో చేయి వేసి శపథం చేస్తున్నప్పుడు దేవుడు వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారి ఆంతర్యాల స్థితి ఆయనకు తెలుసు. అందువల్ల వారిపై ఆయన శాంతీ స్థిమితాలు అవతరింపజేశాడు. బహుమానంగా వారికి సమీప విజయాన్ని, అపార సమరసొత్తును అనుగ్రహించాడు. దాన్ని వారు (త్వరలోనే) సాధిస్తారు. దేవుడు మహా శక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు.”

“దేవుడు మీకు పెద్ద ఎత్తున సమరసొత్తు లభిస్తుందని వాగ్దానం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన మీకు ఈ విజయం ప్రసాదించి, భవిష్యత్తులో మీకు వ్యతిరేకంగా ఇతరులు తోక జాడించకుండా వారిని నిలువరించాడు. మరోవైపు విశ్వాసులకు ఒక నిదర్శనంగా చేశాడు. మీరు సన్మార్గంలో స్థిరంగా ఉండేందుకు దేవుడు మీకు మరింత సద్బుద్ధి ప్రసాదించాలన్న ఉద్దేశ్యం కూడా దీని వెనక ఉంది. అదీగాక మరికొన్ని సమరసొత్తులు కూడా మీకు లభిస్తాయని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరింకా సాధించలేదు. దేవుడు వాటిని చుట్టుముట్టి ఉంచాడు. దేవుడు ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు.”

“ఇప్పుడీ అవిశ్వాసులు గనక మీతో పోరాడితే తప్పకుండా వెన్నుజూపి పారిపోతారు. వారికి ఎలాంటి మద్దతు, సహాయం లభించవు. ఇది పూర్వకాలం నుండీ వస్తున్న దైవ సంప్రదాయం. దైవసంప్రదాయంలో నీవు ఎన్నడూ మార్పు చూడలేవు.”

“దేవుడే మక్కా లోయలో వారి చేతుల్ని మీనుండి, మీ చేతుల్ని వారినుండి (యుద్ధం జరగకుండా) నిరోధించాడు. నిజానికి ఆయన వారిపై మీకు ఇంతకు ముందే ఆధిక్యత (విజయం) ప్రసాదించాడు. మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు.”

“సత్యాన్ని తిరస్కరించినవారు, మిమ్మల్ని ప్రతిష్ఠాలయంకు రానివ్వకుండా నిరోధించిన వారు, బలిపశువుల్ని వాటి బలిప్రదేశానికి చేరనీకుండా అడ్డుకున్నవారు వారేకదా! (మక్కాలో) మీరెరుగని స్త్రీపురుష విశ్వాసులు లేకుండాఉంటే, పొరపాటున మీరు వారిపై కూడా దాడి చేస్తారన్న ప్రమాదం, దానివల్ల మీరు అప్రతిష్ఠ పాలవుతారన్న భయం లేకుండాఉంటే (ఈ యుద్ధాన్ని మేము నివారించేవారం కాము). దేవుడు తానుకోరిన వారిని తన కారుణ్య ఛాయలోకి తీసుకోవడానికే (ఈ యుద్ధాన్ని నివారించాడు). ఈ విశ్వాసులు వేరే చోటికి పోయివుంటే (మక్కా) అవిశ్వాసుల్ని మేము తప్పక కఠినంగా శిక్షించేవాళ్లం.” (48:18-25)

ఈ సూక్తులు విని ముస్లింలు పరమ సంతోషంతో పొంగిపోయారు. ఇక ఉమర్ (రజి) ఆనందమయితే అవధులు దాటింది. ఒక నిమిషానికి ముందున్న ఆయన మనోవ్యథ అంతా ఇప్పుడు పటాపంచలైపోయింది.

ఈ సూరా (అధ్యాయం)లోని భవిష్యవాణి ప్రకారం కొన్నాళ్ళ తరువాత ముస్లింలు అనేక విజయాలు సాధించారు. చివరికి మక్కాపై కూడా ఇస్లాం విజయపతాకం రెపరెప లాడింది. లక్షలాది మంది అవిశ్వాసులు ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (స) వచ్చిన పని ముగిసింది. అంచేత దేవుడు ఆయన్ని తన దగ్గరకు పిలిపించుకున్నాడు. ఈ విషాదవార్త విని ముస్లింలు దుఃఖసముద్రంలో మునిగిపోయారు.

## (5) ప్రవక్త పట్ల పిచ్చిప్రేమ, ధర్మంలో కాఠిన్యం

హజ్రత్ ఉమర్ (రజి) ఈ వార్త వినగానే ఆయనకు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలైనట్లు అన్పించింది. ఒక్కసారి నిలువునా కంపించిపోయారు. అయితే ఆయన కూడా ఈ విషయాన్ని ఓ పట్టాన నమ్మలేకపోయారు. పరుగువేగంతో హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి పోయారు. అక్కడ జనం శోకమూర్తులయి కన్పించారు.

ఉమర్ (రజి) లోపలికి ప్రవేశించిచూస్తే ప్రవక్త (స) భౌతికకాయంపై వస్త్రం కప్పబడి ఉంది. ఆయన దైవప్రవక్త (స) ముఖం మీది వస్త్రం తొలగించి చూశారు. ఆ ముఖం ఎలాంటి మార్పులేకుండా ఎప్పటిలాగానే విప్పారిన పువ్వులా ఉంది. బహుశా వ్యాధి తీవ్రత వల్ల స్పృహతప్పి ఉంటారని, కాస్సేపటికి స్పృహ రావచ్చని భావించారు ఆయన అయోమయంగా చూస్తూ.

తరువాత ఆయన మసీదుకు వెళ్ళి వర నుంచి ఖడ్గం లాగి “ఖబర్దార్! ఎవరైనా దైవప్రవక్త ముహమ్మద్ (స) చనిపోయారని అంటే అతని తల ఎగిరిపోతుంది” అన్నారు కోపోద్రేకాలతో అటూ ఇటూ తిరుగుతూ.



“ప్రజలారా! కొంతమంది దైవప్రవక్త (స) చనిపోయారని చెబుతున్నారు. లేదు, లేదు. ఆయన చనిపోలేదు, స్పృహ తప్పారు. కాస్సేపటికి స్పృహలోకి రావచ్చు. మూసా ప్రవక్త (అలై)లా ముహమ్మద్ ప్రవక్త (స) కూడా నలభైరోజుల పాటు అదృశ్యమై ఉంటారు. ఆ తరువాత తిరిగొస్తారు......” అంటూ వేదిక ఎక్కి ఉపన్యాసం మొదలెట్టారు.

కాస్సేపటికి అబూబకర్ (రజి) మసీదుకు చేరుకొని ఉమర్ (రజి)ని వారించి ప్రసంగించారు. ఉమర్ (రజి) అందులో పేర్కొనబడిన ఖుర్ఆన్ సూక్తులు వినగానే కళ్ళుతిరిగి క్రిందపడిపోయారు. తర్వాత స్పృహలోకి వచ్చి “దైవప్రవక్త (స) దివంగతు లయ్యారనడంలో ఇక నాకెలాంటి సందేహం లేదు” అని భావించారు మనసులో.

దైవప్రవక్త (స) ఓరోజు ఉమర్ (రజి)తో “దైవసాక్షి! నీవు ఏ దారిన నడిస్తే ఆ దారిన షైతాన్ ఏమాత్రం నడవలేడు; వాడా దారి తప్పించి వేరే దారిన నడుస్తాడు” అని అన్నారు. మరొక సందర్భంలో ఆయన మాట్లాడుతూ “నా తదనంతరం ఎవరైనా దైవప్రవక్త కాగలిగితే అతను ఉమర్ (రజి) మాత్రమే అవుతాడు” అని అన్నారు.

ఇబ్నెమస్వూద్ (రజి) ప్రకారం ఉమర్ (రజి) గొప్పతనం నాలుగు విషయాల ద్వారా తెలుసు&ంది. (1) బదర్ యుద్ధఖైదీలను చంపాలని ప్రతిపాదించారు ఆయన. తరువాత దానికి అనుకూలంగా ‘లౌలా కితాబున్ మినల్లాహి’ అనే దైవసూక్తి వెలువడింది. (8:68 సూక్తి) (2) విశ్వాసుల మాతృమూర్తులు పరదాపాటిస్తే బాగుంటుందని అన్నారు. దానిపై పరదా సూక్తి అవతరించింది. (33:59 సూక్తి). అప్పుడు ఉమర్ (రజి)తో ‘వహీ మాఇంట్లో అవతరిస్తుంది. అయితే దానికి ముందే నీకా విషయం మహిమాన్వితంగా తెలిసిపోతుంది’ అని చెప్పబడింది. (3) దైవప్రవక్త (స) తరచుగా ‘దేవా! ఉమర్ (రజి)ని ముస్లింగా చేసి ఇస్లాంకు సహాయం చెయ్యి’ అని ప్రార్థించేవారు. (4) అబూబకర్ (రజి)ని ఖలీఫాగా అంగీకరిస్తూ ఉమర్ (రజి) అందరికంటే ముందు బైత్ చేశారు.

## (6) పరిపాలనా దక్షత

అబూబకర్ (రజి) పాలనాకాలంలో ఉమర్ ఫారూఖ్ (రజి) న్యాయశాఖ మంత్రిగా నియమించబడ్డారు. హిజ్రీశకం 13వ ఏట, జమాదివుస్సాని మాసం 23వ తేదీన ఖలీఫా అబూబకర్ (రజి) నిర్యాణంచెందిన రోజే ముస్లింలంతా ఏకగ్రీవంగా ఉమర్ (రజి)ని ఖలీఫాగా ఆమోదిస్తూ ‘బైత్’ (ప్రమాణం) చేశారు.

దైవప్రవక్త (స) జీవిత చరమదశలో (యమన్‌లోని) నజ్రాన్‌లో ముస్లింలు మాత్రమే ఉండాలని, అక్కడున్న యూదుల్ని, క్రైస్తవుల్ని వేరే ప్రాంతానికి తరలించాలని అన్నారు. అబూబకర్ (రజి) తన పాలనలో మతభ్రష్టుల బెడదను నిర్మూలించడంలో నిమగ్నులై ఉన్నందున ఆయనీ పని చేయలేకపోయారు. ఇప్పుడా బెడద తొలగిపోవడంతో ఖలీఫా ఉమర్ (రజి) ఆ పనిని లాయిలా బిన్ ఉమయ్యా (రజి)ను పంపి చేయించారు.

నజ్రాన్ క్రైస్తవుల్ని అరేబియా నుండి వేరే ప్రాంతానికి పంపడానికి కారణం వారు వడ్డీవ్యాపారం మానుకుంటామని ముస్లింలతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అదీగాక ముస్లింలకు వ్యతిరేకంగా కవ్వింపుచర్యలకు పాల్పడుతున్న రోమన్లకు వారు లోలోన సహాయసహకారాలు అందజేస్తుండేవారు.

ఈరానీయులతో జరిగిన ఖాదిసియా యుద్ధం ముస్లింలకు పెద్ద సమస్యాత్మక యుద్ధంగా మారింది. అంచేత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఖాదిసియా యుద్ధపర్యవసానం గురించి తెలుసుకోవడానికి అనుక్షణం ఎదురుచూస్తుండేవారు. ఖాదిసియా నుండి మదీనాకు వార్త చేరడానికి అనేక రోజులు పడ్తుంది. అయినప్పటికీ ఖాదిసియా నుండి ఈరోజు ఎవరైనా తిరిగొస్తారేమో, ఏదైనా శుభవార్త తెస్తారేమోనని ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతిరోజూ వేయికళ్ళతో ఎదురుచూసేవారు. దాని కోసం ఆయన ప్రతిరోజూ మదీనా నగరం బయటికి వెళ్ళి గంటల తరబడి నిరీక్షిస్తుండేవారు.

అలా నిరీక్షిస్తుంటే ఓరోజు దూరాన్నుంచి దుమ్ములేపుకుంటూ ఓ రౌతు వేగంగా పట్నం వైపే వస్తున్నట్లు కన్పించింది. ఇంకేముంది, ఖలీఫాగారికి ఆరాటం ఎక్కువై పోయింది. రౌతు మరికాస్త దగ్గరయ్యాడు.

ఖలీఫాగారు పరుగువేగంతో ఎదురెళ్ళి "ఎక్కడ్నుంచి వస్తున్నావ"ని అడిగారు తహతహలాడుతూ. "ఖాదిసియా నుండి వస్తున్నా" అన్నాడు రౌతు.

"అయితే ఖాదిసియా యుద్ధ పర్యవసానం ఏమిట"ని అడిగారు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి).

"ఖాదిసియాయుద్ధంలో ముస్లింలు విజయం సాధించారు. ఈ శుభవార్త తెలియ జేయడానికే మా సేనాపతి నన్నిక్కడకు పంపించారు" చెప్పాడు రౌతు తాపీగా.

ఈమాట వినగానే ఖలీఫాగారు రొట్టె విరిగి నేతిలో పడినట్లు పరమానందంతో పులకించి పోయారు. అంతటితో ఆయన రౌతును వదలిపెట్టలేదు.

"బాబ్బాబ్బాబు! దాని విశేషాలేమిటో కాస్త వివరంగా చెప్పు నాయనా!" అంటూ ఒంటె అంబారీ పట్టుకొని, దాని పక్కనే పరుగెత్తసాగారు.

రౌతు యుద్ధవిశేషాలు వివరిస్తూ వేగంగా మదీనా వైపు సాగుతున్నాడు. ఖలీఫాగారు అంబారీ పట్టుకొని, విజయవార్తలు వింటూ ఒంటె పక్కన పరుగిడుతూనే ఉన్నారు. ఆ విధంగా వారుభయులు పట్నంలో ప్రవేశించారు.

పట్నంలో ప్రవేశించగానే వాళ్ళకు ఎదురొస్తున్న ప్రతి మనిషీ "విశ్వాసుల నాయకా! అస్సలాము అలైకుం" అని చెప్పసాగాడు. పాపం అప్పుడు తెలిసింది రౌతుకు తనను యుద్ధవిశేషాలు అడుగుతున్నది సాక్షాత్తు ఖలీఫాగారేనని.



వెంటనే ఆయన భయపడి ఒంటె మీద నుంచి దిగబోయాడు. అయితే ఖలీఫా ఆయన్ని వారిస్తూ "వద్దు, నీవు నీ ఒంటెపైనే కూర్చొని యుద్ధవార్తలు వివరిస్తూ నడు" అన్నారు ఖలీఫా ఉమర్. అదే పరిస్థితిలో ఇద్దరూ ఖలీఫా ఇంటికి చేరుకున్నారు. ఆతర్వాత ఉమర్ (రజి) మస్జిదె నబవీలో ప్రజల్ని సమావేశపరచి, విజయ శుభవార్త తెలియజేసి ఇలా ప్రసంగించారు:

"సోదరులారా! మిమ్మల్ని బానిసలుగా చేసుకోవడానికి నేను రాజును కాను. నేను స్వతహాగా దేవుని బానిసను. కాకపోతే ఖిలాఫత్ పాలనాబాధ్యత నా భుజస్కంధాల మీద పడింది. మీరు మీఇండ్లలో నిశ్చింతగా జీవితం గడిపేలా నేనీ బాధ్యత నిర్వహించ గలిగితే అది నా అదృష్టమని భావిస్తున్నాను. ఒకవేళ మీరంతా మీమీ అవసరాలు తీర్చుకోవడానికి నా ఇంటి ముందు హాజరుకావాలని నేను కోరుకుంటే అది నా దౌర్భాగ్యమని తలుస్తాను. నేను మీకు నోటి ద్వారానే గాక ఆచరణ ద్వారా కూడా హితోపదేశం చేస్తున్నాను."

అది హిజ్రీ 16వ శతాబ్దం. ముస్లింలు ఈరాన్ సామ్రాజ్యంలోని జలూలా కోటను ఆక్రమించుకున్నారని తెలియగానే చక్రవర్తి యజ్దగిర్ద్ హల్వాన్ నుంచి "రే" వైపుకు పారిపోయాడు. అతను రాజధాని మదాయెన్‌లోని ఖరీదైన అనేక వస్తువులతో పాటు అపార సిరిసంపదల్ని మదాయెన్ ఆక్రమణకు ముందే జలూలా కోటకు తరలించాడు. ఇప్పుడా వస్తువులు, సిరిసంపదలన్నీ సమరసొత్తుగా ముస్లింలకు దక్కాయి. ముస్లిం సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఆ సమరసొత్తులో సైనికుల భాగం పోగా మిగతా సమరసొత్తును జియాద్ (రజి) ద్వారా మదీనాకు పంపివేశారు.

మస్జిదెనబవీ ఆవరణలో కనీవినీ ఎరగనంతటి అపార సమరసొత్తును, కళ్ళు జిగేల్ అన్పించే ఎంతో విలువైన వస్తువుల్ని చూసిన ప్రజలు సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. కాని సువిశాల సామ్రాజ్యానికి అధినేతయిన ఉమర్ ఫారూఖ్ (రజి) మాత్రం ఆ ధనరాసుల్ని చూసి కన్నీరు కార్చారు. ప్రజలు ఆయన్ని చూసి ఆశ్చర్యపోయారు. "ఏమిటీ ఈయనగారు ఇంతపెద్దఎత్తున లభించిన సిరులు చూసి సంతోషించాల్సింది పోయి ఏడుస్తున్నారు?" అనుకున్నారు జనం ముక్కుమీద వేలేసుకొని.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు కూడా ఖలీఫా పరిస్థితి అర్థంకాలేదు. అందుకే ఆయన "విశ్వాసులనాయకా! ఎందుకిలా కంటతడి పెట్టుకున్నారు? ఇది సంతోషంతో దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకునే సమయంకదా!" అని అడిగారు.

దానికి ఉమర్‌ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "దేవుడు ఏ జాతికి ప్రపంచ సిరిసంపదలు ప్రసాదిస్తాడో ఆజాతిలో అసూయాద్వేషాలు జనిస్తాయి. దానివల్ల ఆజాతిలో చీలికలు ఏర్పడుతాయి. ఈ విషయమే నన్నిప్పుడు కంటతడి పెట్టించింది" అని అన్నారు.

ఆ సమరసొత్తులో చక్రవర్తి రత్నఖచిత కిరీటం, మణిమాణిక్యాలు పొదగబడిన అతని నడుంకట్టు, వెండి-బంగారు జల్తారు అల్లిన అతని దుస్తులు, వజ్ర కంకణాలు కూడా ఉన్నాయి. ఖలీఫా చేతిలోని ఖడ్గంతో వాటిని తిప్పిచూసి సురాఖా బిన్ మాలిక్ (రజి)ని పిలిపించారు. కాస్సేపటికి సురాఖా(రజి) వచ్చిన తరువాత ఖలీఫా ఉమర్ (రజి) ఆయనకు ఈరాన్ చక్రవర్తి దుస్తులు ధరింపజేసి ఆయన తలమీద అతని కిరీటం పెట్టారు. తర్వాత ఆయన నడుముకు చక్రవర్తి ఖడ్గం వ్రేలాడదీసి, చేతులకు అతని కంకణాలు తొడిగించారు. అప్పుడు ఇతర ముస్లింలు సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు.

ఆ తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సురాఖా బిన్ మాలిక్ (రజి) వైపు తిరిగి "వారెవా! ఒక సాధారణ పల్లెవాసి తలపై ఈరాన్‌చక్రవర్తి రత్నఖచిత కిరీటమా!! చేతులకు అతని వజ్రఖచిత కంకణాలా!!!" అని అన్నారు. మదీనాకు వలసపోతున్న దైవప్రవక్త (స)ను పట్టుకోవడానికి వచ్చిన సురాఖా (రజి)కు ఆనాడు ఆ మహనీయుడు చెప్పిన భవిష్యవాణి ఈనాడీ విధంగా నెరవేరింది.

**హిజ్రీ శకారంభం :** ఉమర్ (రజి) పాలనాకాలానికి పూర్వం సంవత్సరాలు లెక్క కట్టడానికి ఒకపద్ధతి అంటూ లేదు. ఏదో ఓ ప్రత్యేక చారిత్రక సంఘటన దగ్గర్నుంచి సంవత్సరం లెక్కకట్టేవారు. మాసాలు, శకం ప్రస్తావనలు ఉండేవికావు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఖలీఫా అయిన తరువాత హిజ్రీశకం 16వ సంవత్సరంలో సంతకం కోసం ఆయన దగ్గరకు ఒక చెక్కు వచ్చింది. దానిపై తేదీ అన్న చోట షాబాన్ (నెల) అని మాత్రమే వ్రాసి ఉంది. ఉమర్ ఫారూఖ్ (రజి)కు అనుమానం వచ్చి "ఇది గడచిపోయిన సంవత్సరానికి చెందిన మాసమా లేక నడుస్తున్న సంవత్సరపు మాసమా? ఎలా తెలుసుకోవాలి?" అని ప్రశ్నించారు.

వెంటనే ఆయన సలహా మండలి సభ్యులను సమావేశపరచి వారి ముందు ఈ సమస్య పెట్టారు. సభ్యులందరూ తేదీ, నెల, సంవత్సరం అన్నీ ఉండాలన్నారు. అయితే శకారంభం ఎప్పటి నుంచి లెక్కకట్టాలి అనే మరో సమస్య ఉంది. సభ్యులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాని హజ్రత్ అలి (రజి) ఇచ్చిన సలహా అందరికీ నచ్చింది. దైవప్రవక్త (సల్లం) మదీనాకు హిజ్రత్ (వలస) చేసి వచ్చినప్పటి నుండి సంవత్సరాల లెక్క ప్రారంభించాలని ఆయన అన్నారు. ఈ విధంగా హిజ్రీశకం ప్రారంభమయింది.

అరేబియాతో పాటు ఇరాఖ్, జజీరా, ఖుజిస్తాన్, ఆర్మేనియా, ఆజర్‌బాయ్‌జాన్, పారసీకం(ఈరాన్), కర్మాన్, ఖురాసాన్, మక్రాన్ (బెలూచిస్తాన్), సిరియా, ఈజిప్టు మొదలైన దేశాలతో కూడిన సువిశాల సామ్రాజ్యానికి నాయకత్వం వహించి ఎంతో



సమర్ధవంతంగా, నీతీన్యాయాలతో పాలించిన తీరు గమనిస్తే ఆనాడు ఈ మహాకార్యానికి ఉమర్ (రజి) మాత్రమే సమర్థుడని చరిత్రకారులు అంగీకరించక తప్పదు.

ఈ దేశాల కోసం వందలాది యుద్ధాలు చేయవలసివచ్చింది. కాని ఉమర్ ఫారూఖ్ (రజి) ఏయుద్ధంలో కూడా ప్రత్యక్షంగా పాల్గొనలేదు. ఆయన రాజధానిలో ఉండే ఎక్కడ ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సేనాపతులకు తగిన ఆదేశాలు జారీచేస్తుండేవారు. చివరికి ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో యుద్ధం చేయాలి; సైన్యాలను ఏమార్గాన తీసికెళ్ళాలి అనే విషయాల్ని గురించి కూడా ఆయనే నిర్దేశించే వారు. ఆయా ప్రాంతాలు అధీనంలోకి వచ్చిన తర్వాత అక్కడ తక్షణమే పాలనాఏర్పాట్లు, శాంతిభద్రతల విషయంలో కూడా ఆయనే సముచిత జాగ్రత్తలు తీసుకొని, ఆయా పాలకులకు వాటి విషయమై ఉత్తర్వులు జారీచేసేవారు. అయితే ఏ యుద్ధంలోనూ ఉమర్ (రజి) ఇచ్చిన ఆదేశం తప్పయిందని లేదా నిరుపయోగ మైందని రుజువుకాలేదు. అలాగే ఉమర్ (రజి) చేసిన ఏ పాలనాఏర్పాటైనా నష్టం కలిగించిందని చెప్పలేము.

అంతేకాదు, సేనాపతులు, పాలనాధికారుల ఎంపిక విషయంలో కూడా ఉమర్ (రజి) ఏనాడూ పొరపాటు పడలేదు. వారి శక్తిసామర్థ్యాలు, విజ్ఞతావివేచనలను అంచనా వేయడంలో ఆయనకు ఆయనే సాటి. వారి ఎంపికకు ఆయన వారి ధర్మపరాయణతను, నమాజ్-రోజాలను మాత్రమే గీటురాయిగా తీసుకోలేదు. ఎవరిలో ఎలాంటి శక్తి సామర్థ్యాలు ఉన్నాయి, ఎవరు ఏ పనికి ఉపయోగపడతారు, ఎవరికి ఏపని మీద ఎక్కువ ఆసక్తి ఉంది అనే విషయాల్ని కూడా ఆయన పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసేవారు. దీన్నిబట్టి ఆయన మేధాశక్తి, విశ్లేషణాసామర్థ్యం, దూరదృష్టి ఎలాంటివో అంచనా వేయవచ్చు. ఆ మహనీయుని సమరవ్యూహాలు, పాలనాసౌలభ్యాలు ఆయన అసాధారణ పరిపాలనా దక్షతకు ప్రబల నిదర్శనాలని చెప్పవచ్చు.

## (7) బైతిల్‌మఖ్దిస్ ప్రయాణం

సేనాపతి అబూఉబైదా (రజి) పాలస్తీనా వైపు పురోగమించి ముందుగా బైతిల్ మఖ్దిస్ (జెరూసలేం) చుట్టుపక్కలున్న ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అమ్ర్ బిన్‌ఆస్ (రజి) నేతృత్వంలో ముస్లింలు బైతిల్‌మఖ్దిస్‌ను దిగ్బంధించారు. కొన్నాళ్ళకు సేనాపతి అబూఉబైదా (రజి) కూడా అక్కడికి చేరుకోవడంతో ఈ ముట్టడి మరింత బిగుసుకుపోయింది. క్రైస్తవులు కోటతలుపులు మూసేసి తీవ్రంగా ప్రతిఘటించారు. కాని అందులో వారు విజయం సాధించలేక కాళ్ళబేరానికి వచ్చారు.

అయితే తమ మతాన్ని కాపాడుకోవడానికి, క్షేమంగా ప్రాణాలతో బయటపడటానికి వారు ప్రయత్నించారు. ముస్లింలు ఎప్పుడు ఎటువంటి పరిస్థితిలోనైనా, ఎలాంటి షరతులతో కూడిన ఒడంబడికనైనా ఒప్పుకుంటారని రోమన్లు గ్రహించారు. అందువల్ల

వారొక పథకం రూపొందించారు. దానిప్రకారం పట్టణం మరికొన్ని గంటల్లో ముస్లింల అధీనమయ్యే సూచనలు కన్పించగానే వారు జిజ్యా చెల్లించి ఒప్పందం చేసుకోవడానికి ముందుకొచ్చారు. అయితే అందుకు వారొక షరతు విధించారు. ఒప్పందం మీద ఖలీఫా వచ్చి సంతకం చేయాలన్నారు. వీలైనంత వరకు రక్తపాతాన్ని అరికట్టాలన్నది ముస్లింల ధ్యేయం. అంచేత సేనాపతి అబూఉబైదా (రజి) ఆ షరతుతో పాటు ఒప్పందాన్ని అంగీకరించి, విషయం వివరిస్తూ ఖలీఫాకు లేఖ రాసి పంపారు.

ఈ లేఖ అందగానే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సలహామండలిని సమావేశ పరచి సలహా అడిగారు. హజ్రత్ ఉస్మాన్‌గని (రజి) తన అభిప్రాయం తెలియజేస్తూ "క్రైస్తవులు తమ ప్రతిఘటనను కొనసాగించలేక లొంగిపోయారు. ఎలాంటి షరతులు లేకుండానే వారు తమ పట్టణాన్ని మనకు అప్పగిస్తారు. కనుక మీరు బైతిల్‌మఖ్దిస్‌కు వెళ్ళకండి" అని అన్నారు. హజ్రత్ అలి (రజి) మాత్రం "మీరు బైతిల్‌మఖ్దిస్‌కు వెళ్ళడమే మంచిద"ని సలహా ఇచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి)కు అలి (రజి) అభిప్రాయమే నచ్చింది.

హిజ్రీశకం 16వ ఏట, రజబ నెలలో హజ్రత్ ఉమర్ (రజి) మదీనాలో ఉస్మాన్‌గనీ (రజి)ని గవర్నర్‌గా నియమించి కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని బైతిల్‌మఖ్దిస్‌కు బయలుదేరారు. అది చరిత్రలో సువర్ణక్షరాలతో వ్రాయవలసిన ప్రయాణ సంఘటన. సువిశాల సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తిగా, శత్రువులకు సింహస్వప్నంగా భాసిల్లు తుండిన ఉమర్‌ఫారూఖ్ (రజి) ఎలాంటి అట్టహాసం, మందీమార్బలం, సైనికదళాలు లేకుండా సాదాసీదా దుస్తుల్లో ఒక సాధారణ పౌరుడిగా ప్రయాణమయ్యారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తనపర్యటన గురించి బైతిల్‌మఖ్దిస్, డెమాస్కస్ లలో తన సైన్యాధికారులందరికీ తెలియజేశారు. కనుక ఖలీఫా బైతిల్‌మఖ్దిస్ సమీపం లోని "జాబియా" అనే ప్రదేశానికి చేరుకొని విడిదిచేయగానే అబూఉబైదా, యజీద్ బిన్ అబూసుఫ్యాన్, ఖాలిద్ బిన్ వలీద్ (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి) వగైరా సైన్యాధి కారులు వచ్చి ఖలీఫాకు స్వాగతంచెప్పారు.

ఖలీఫా పటాటోపంతోకూడిన వారి దుస్తులు చూసి ఆగ్రహోదగ్రులై 'రెండేండ్లలోనే మీరు అరబ్బేతరుల అలవాట్లకు బానిసలై పోయారా?" అన్నారు.

దానికి వారు "ఈ దుస్తుల వెనుక మా సమరసాహసం, ఇస్లామీయ నైతికతలు యధాతథంగా ఉన్నాయి. (వాటిని మేము విడనాడలేదు)" అన్నారు. ఖలీఫా (రజి) ఈ సమాధానం విని "అలాగైతే పరవాలేదు" అంటూ సంతృప్తిచెందారు.

ఆ తర్వాత కాస్సేపటికి బైతిల్‌మఖ్దిస్ పట్టణపెద్దలు కూడా అక్కడికి చేరుకున్నారు. వారు ఎలాంటి రాచరికపు అట్టహాసం, కిరీటంలేకుండా సాధారణ పౌరదుస్తుల్లో ఉన్న



ఖలీఫాను చూసి ఆశ్చర్యపోయారు. కుశలప్రశ్నలయ్యాక ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) వారి ముందు ఈవిధంగా శాంతిఒప్పందం వ్రాయించారు:

"ఇది అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) ఉమర్ బిన్ ఖత్తాబ్ 'బైతిల్ మఖ్దిస్' క్రైస్తవులకు రాసిచ్చిన శాంతిఒప్పందం. వారి ప్రాణాలు, ఆస్తులు, చర్చీలు, సిలువలకు రక్షణహామీ ఇవ్వబడుతోంది. ఇక్కడ నివసించే ప్రతి మతస్థుడికీ రక్షణహామీ ఇవ్వబడుతోంది. వారి ఆరాధనాలయాలకు, సిలువలకు, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లంపజేయడం జరగదని హామీ ఇస్తున్నాను. వారి మతవ్యవహారాల్లో ఎలాంటి జోక్యం చేసుకోవడం జరగదని కూడా హామీ ఇస్తున్నాను. అయితే క్రైస్తవులతో పాటు ఇక్కడ యూదులు ఉండకూడదు. (వారిని బయటికి పంపివేయాలి.) రోమన్లలో ఎవరైనా నగరం విడిచి వెళ్ళదలచుకుంటే నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు. ఇక్కడే ఉండదలచినవారు ఇక్కడి పౌరులతో పాటు మాకు జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. ఈ ఒప్పందంలో వ్రాయబడిన విషయాలకు దేవుడు, దైవప్రవక్త (స), ఖలీఫాలు, ముస్లింలంతా బాధ్యు లవుతారు. అయితే పట్టణవాసులు నిర్ణీత జిజ్యా చెల్లించడానికి నిరాకరించరాదు."

ఈ ఒప్పందంపై ఖలీఫా సంతకంచేసిన తరువాత ఖాలిద్, అమ్ర్ బిన్ ఆస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి)లు సాక్షులుగా సంతకాలు చేశారు. ఆ వెనువెంటనే పట్టణవాసులు ముస్లింలకు జిజ్యా చెల్లించి పట్టణ ప్రధానద్వారం తెరిచారు. ఖలీఫా, ఆయనసేవకుడు ఒంటెపై వంతులవారిగా కూర్చొని ప్రయాణంచేస్తూ నగరంలో ప్రవేశించే సమయానికి ఒంటెపై కూర్చునే వంతు సేవకునికి వచ్చింది. సేవకుడు ఎంత బ్రతిమాలినా ఉమర్ (రజి) వినకుండా అతడ్ని ఒంటెపై ఎక్కించి తాను ఒంటె ముకుతాడు పట్టుకొని కాలినడకనే నగరంలో ప్రవేశించారు.

"ముస్లింలచక్రవర్తి వస్తున్నాడు, పదండి చూద్దాం" అంటూ క్రైస్తవులు తండోపతండ లుగా తమ ఇళ్ళలో నుంచి బయటికి వచ్చారు. వారు ఒంటె మీద కూర్చున్న ఖలీఫా సేవకుడిపై దృష్టి సారించారు. కాని స్థానిక ముస్లింలు ఒంటె ముకుతాడు పట్టుకొని కాలినడకన వస్తున్న ఖలీఫా దగ్గరకొచ్చి సలాంచేస్తుంటే "ఏమిటీ ఇతనా ముస్లింల చక్రవర్తి!" అంటూ క్రైస్తవులు ఆశ్చర్యచకితులై పోయారు. చినిగిన తలపాగా, అతుకుల చొక్కా ధరించిన ఆ మహా చక్రవర్తిని చూసి వారు నోరెళ్లబెట్టారు.

ఉమర్‌ఫారూఖ్ (రజి) తన అనుచరులతో అఖ్సామస్జిద్‌లో ప్రవేశించి 'ఇబ్రాహీం గూడు' దగ్గర దైవానికి కృతజ్ఞతగా సజ్దా చేశారు. తర్వాత అక్కడి చర్చిలో తిరిగిచూశారు.

ఒకరోజు ఉమర్ ఫారూఖ్ (రజి) హజ్రత్ బిలాల్ (రజి)తో 'అజాన్ చెప్పు' అన్నారు. దానికాయన "దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఎవరడిగినా అజాన్ చెప్పనని నిర్ణ యించుకున్నాను. కాని ఈరోజు మీఆజ్ఞ పాటిస్తున్నాను" అని ఆ తర్వాత అజాన్ చెప్పారు.

బిలాల్ నోట అజాన్ వినగానే దైవప్రవక్త (స) కాలంనాటి మధురస్మృతులు గుర్తుకొచ్చి సహాబీలలో అప్రయత్నంగా దుఃఖం పొర్లుకొచ్చింది. చాలా సేపటిదాకా వారి కళ్ళు చిల్లులుపడిన నీటికడవలై పోయాయి.

బైతిల్‌మఖ్దిస్‌లో ఖలీఫాను కలసుకోవడానికి వివిధప్రాంతాల నుంచి ఉన్నతాధికారులు వచ్చి ఉన్నందున హజ్రత్ ఉమర్ (రజి) కొన్నాళ్ళు బైతిల్‌మఖ్దిస్‌లోనే ఉండి వారికి తగిన ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత ఆయన మదీనా వెళ్ళిపోయారు.

హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో సర్వసేనానిగా నియమించబడిన ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని ఖలీఫా ఉమర్ (రజి) సర్వసేనాని పదవి నుంచి తొలగించారు.

ఆ తరువాత ఖలీఫా ఉమర్ (రజి) ఖాలిద్ (రజి)తో "ఖాలిద్! దైవసాక్షిగా చెబుతున్నాను. నేను నిన్ను అభిమానిస్తున్నాను; గౌరవిస్తున్నాను కూడా" అని చెప్పి రాజ్యంలోని పాలకులందరికీ ఇలా ఓ లేఖ రాశారు:

"నేను ఖాలిద్‌ని కోపంతో లేదా నమ్మకద్రోహం కారణంగా పదవి నుండి తొలగించలేదు. ప్రజలు అతని పట్ల అతిగా ఆకర్షితులవుతున్నారు. (అది వారిని వ్యక్తిపూజ వైపుకు గొనిపోయే ప్రమాదం గోచరిస్తోంది నాకు.) అంచేత (ప్రజల్ని వ్యక్తిపూజ పాపం నుండి కాపాడి) ఏది జరిగినా దాన్ని దేవుడు మాత్రమే చేస్తాడని వారు గ్రహించేందుకు నేను ఖాలిద్‌ని తొలగించడం మంచిదని భావించాను."

## (8) ఈరాన్ సేనాని హుర్ముజాన్

ముస్లింలు తుస్తర్ పట్టణాన్ని వశపరచుకునే తరుణంలో ఈరాన్‌సేనాపతి హుర్ముజాన్ మరొకసారి కాళ్ళబేరానికి వచ్చాడు. తనను ఖలీఫా దగ్గరకు తీసికెళ్ళి తన వ్యవహారాన్ని ఆయన నిర్ణయానికి వదిలేస్తే లొంగిపోతానని సేనాపతి అబూమూసా (రజి)కు మనవి చేసుకున్నాడు. దానికి అబూమూసా (రజి) అంగీకరించి కొందరు సైనికుల వెంట హుర్ముజాన్‌ని మదీనా పంపివేశారు. హుర్ముజాన్ మదీనా చేరుకోగానే ధగధగ మెరిసిపోయే చంద్రహారం, రత్నఖచిత కిరీటం, ఖరీదైన ఖడ్గం, వెండి-బంగారు జల్తారుతో కూడిన పట్టువస్త్రాలు ధరించి రాజఠీవి ఒలకబోయడానికి ప్రయత్నించాడు.

ముస్లింయోధులు హుర్ముజాన్‌ని మస్జిదెనబవీ వైపుకు తీసికెళ్తుంటే రోమ్,ఈరాన్‌లు వంటి అగ్రరాజ్యాల్ని మట్టుపెడ్తున్న ముస్లించక్రవర్తి దర్బారు మరెంత వైభవంగా, అట్టహాసంగా ఉంటుందోనని భావించాడు. కాని మస్జిద్‌లో అలాంటి హోదా, అంతస్తులతో కూడిన చక్రవర్తి కానరాకపోవడంతో "ఏరి మీ ఖలీఫాగారు" అనిఅడిగాడు. ముస్లింలు చేత్తో సైగచేసి చూపించారు. హుర్ముజాన్ అటువైపు తిరిగి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగాడు. అతుకుల ముతకదుస్తులు ధరించి కటికనేల మీద పడుకొని కునికిపాట్లు



పడుతున్న ఖలీఫాగారు ఈ అలికిడికి లేచికూర్చున్నారు. చూస్తే ఎదురుగా గొప్పసేనాపతి హోదావేషంలో ధగధగ మెరుస్తున్న ఓ భారీ కాయం కన్పించింది.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఓసారి హుర్ముజాన్ వైపు ఎగాదిగా చూసి, అతణ్ణి ఆశ్చర్యంగా చూస్తున్న ఇతర ముస్లింల వైపుకు తిరిగి "ఇహలోకంలోని ఈ ధగధగలు, తళుకుబెళుకులు క్షణభంగురాలు-మోసపూరితమైనవి మాత్రమే" అన్నారు. ఆ తరువాత ఆయన హుర్ముజాన్ వైపు తిరిగి "నువ్వు అనేకసార్లు ఒప్పందం ఉల్లంఘించి మమ్మల్ని చికాకుపరచావు. అలాంటి నిన్ను సజీవంగా వదలిపెట్టకూడదు" అని అన్నారు.

హుర్ముజాన్ అంతకుముందే ముస్లింల చేతిలో తనకు చావు తప్పదని గ్రహించాడు. అయినప్పటికీ అతను ఒకింత ధైర్యంతో "దేవుడు మావైపు ఉన్నంతకాలం మీరు మాకు బానిసలుగా ఉండేవారు. ఇప్పుడు దేవుడు మీవైపున్నాడు గనక మేము మీకు బానిసలమై పోయాము" అని చెప్పి కొంచెం మంచినీళ్ళు ఇప్పించండని అడిగాడు. ఒక ముస్లిం మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చాడు.

అప్పుడు హుర్ముజాన్ మంచినీళ్ళ ముంత చేతిలో పట్టుకొని "నేనీ నీళ్ళు తాగకముందే మీరు నన్ను చంపుతారేమోనని భయపడుతున్నాను" అన్నాడు. "భయపడకు. నువ్వు మంచినీళ్ళు తాగనంతవరకూ నీకెలాంటి నష్టం జరగనివ్వం" అన్నారు ఉమర్ (రజి). హుర్ముజాన్ ఈమాట వినగానే నీళ్ళముంత నేలమీద జారవిడిచాడు. దాంతో ముంత పగిలిపోయి నీళ్ళు నేలలో ఇంకిపోయాయి. ముంత పగలగానే హుర్ముజాన్ "ఇప్పుడు మీరు నన్ను వధించలేరు. ఎందుకంటే మీరు నాకు రక్షణహామీ ఇచ్చారు" అన్నాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "నువ్వు అబద్ధమాడుతున్నావు. మేము నీకు ఎలాంటి రక్షణహామీ ఇవ్వలేదు" అన్నారు. వెంటనే హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ముందుకొచ్చి "విశ్వాసుల నాయకా! హుర్ముజాన్ నిజమే చెప్పాడు. నీళ్ళు తాగనంత వరకూ అతనికి ఎలాంటి నష్టం జరగనివ్వమని మీరిప్పుడే కదా చెప్పింది, మరచిపోయారా?" అని అన్నారు. ఆయన మాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) ఆశ్చర్యపోయారు. తరువాత ఆయన హుర్ముజాన్‌తో "నువ్వు నన్ను మోసగించావు. కాని నేను నిన్ను మోసగించను. నిన్ను వదలిపెడ్తున్నాను, వెళ్ళు" అని అన్నారు. ఈమాట వినగానే హుర్ముజాన్ కలిమా (సద్వచనం) పఠించి ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించాడు.

హుర్ముజాన్ ఇస్లాంస్వీకార ప్రకటన వినగానే ముస్లింలు సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు. ఇక ఖలీఫా ఆనందమైతే అవధులు దాటింది. ఆ తరువాత ఆయన హుర్ముజాన్‌ని మదీనాలో ఉండనిచ్చి ఏటా రెండువేల దిర్హాంలు జీతం మీద అతణ్ణి సైనికసలహాదారుడిగా నియమించారు.

## (౯) సమరసొత్తు కానుక నిరాకరణ

ఈరాన్-ఇరాఖ్ సరిహద్దులో ఉన్న అహ్వాజ్ కోటను ముస్లింలు కైవశం చేసుకున్నపుడు వారికక్కడ సమరసొత్తుగా అపార సిరిసంపదలు లభించాయి. అందులో ఎంతో అందమైన, అత్యంత విలువైన ఒక ఆభరణం కూడా ఉంది. సేనాపతి సల్మా బిన్ ఖైస్ (రజి) అనుచరయోధుల్ని సంప్రదించి వారి అనుమతితో దాన్ని ఖలీఫాకు కానుకగా సమర్పించడానికి రాజధాని మదీనాకు పంపించారు. ఒక సైనికుడు ఓ చిన్న పెట్టెలో ఆ కానుక పెట్టుకొని, తన సేవకుడ్ని తీసుకొని రెండుఒంటెల మీద బయలు దేరాడు. అతను బస్రా పట్టణం మీదుగా ప్రయాణించి మదీనా చేరుకున్నాడు.

ఆ సమయంలో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రజలకు భోజనం పెట్టే పనిలో నిమగ్నులై ఉన్నారు. ఆ పని ముగిసిన తరువాత ఆయన ఇంటికి చేరుకున్నారు. కానుక తెచ్చిన ఆ సైనికుడు, అతనిసేవకుడు ఖలీఫా వెనకాల నడచి ఆయన ఇంటికి చేరుకొని లోపల ప్రవేశించడానికి అనుమతి అడిగాడు. అనుమతి లభించిన తరువాత లోపలికి ప్రవేశించి ఖలీఫాకు సలాం చేసి కూర్చున్నాడు. తరువాత అతను సేనాపతి సల్మా బిన్ ఖైస్ (రజి) దగ్గర్నుండి ఒక సందేశం తెచ్చానని అన్నాడు. అదేమిటని అడిగినపుడు అతను అహ్వాజ్‌లో ముస్లింలు విజయం సాధించారని, ఆ ప్రాంతం ఇప్పుడు తమ అధీనంలో ఉందని చెప్పాడు. ఉమర్ ఫారూఖ్ (రజి) అతని చేతిలో ఉన్న పెట్టె చూసి అదేమిటని అడిగారు. దానికతను ఇలా సమాధానమిచ్చాడు :

"విశ్వాసులనాయకా! దేవుడు మాకు విజయంతో పాటు అపారసమరసొత్తు ప్రసాదించాడు. అందులో ఎంతోవిలువైన ఒక వస్తువు లభించింది. మా సేనాపతి సైనికుల్ని సంప్రదించి దాన్ని మీకు కానుకగా ఇవ్వడానికి నన్ను మీ దగ్గరకు పంపించాడు. ఆ కానుకే ఈ పెట్టెలో వున్న వస్తువు." అంటూ ఆ సైనికుడు దాన్ని ఖలీఫా ముందుంచాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ పెట్టె తెరచి చూడగానే దిగ్గున లేచినిలబడి దాన్ని విసురుగా నేలకేసి కొట్టారు. పెట్టె క్రిందపడి పోగానే అందులోని ఆభరణంలో పొదగబడిన మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలు నేల మీద చెల్లచెదరుగా పడి పోయాయి. ఆ దృశ్యం చూసి సైనికుడు నిలువెల్లా కంపించిపోయాడు. ఖలీఫా ఉమర్ (రజి) కళ్ళ నుంచి అగ్ని కణాలు వెలువడుతుండగా ఆయన వాటిని పోగుచెయ్యి అని అదేశించారు. ఆ సైనికుడు వెంటనే పెట్టెలో నుంచి క్రిందపడిపోయిన ఆ మణి మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలను ఒక చోట పోగుచేశాడు. ఆ తర్వాత ఖలీఫా ఉమర్ (రజి) తన సేవకుడు ఎర్ఫాను "ఇతడ్ని బాగా కొట్టు" అని ఆజ్ఞాపించారు.

ఎర్ఫా అతడ్ని ఎడాపెడా వాయించడం మొదలెట్టాడు. ఆ దెబ్బలకు సైనికుడు క్రిందపడిపోయాడు. అయినా ఎర్ఫా అతడ్ని కొట్టడం మానేయలేదు. అప్పుడు ఖలీఫా



"ఇక ఆపెయ్యి" అని ఎర్ఫాను ఆదేశించి, సైనికుడితో "లే, లేచి నిలబడు. నువ్వొ మంచివాడివి కాదు, మీ నాయకుడూ మంచివాడు కాదు" అని అన్నారు.

పాపం, ఆ సైనికుడు బిత్తరపోయి "విశ్వాసులనాయకా! నేనిక వెళ్ళిపోతాను. మీ సేవకుడు మా ఒంటల్ని స్వాధీనం చేసుకున్నాడు. దయచేసి అహ్వాజ్ వెళ్ళడానికి మాకోసం రెండు ఒంటెలు ఇప్పించండి" అని ప్రాధేయపడ్డాడు. ఖలీఫా ఒంటెల్ని తెచ్చివ్వమని సేవకుడ్ని ఆదేశించారు. తరువాత ఆయన సైనికుడితో "వెంటనే నీవు అహ్వాజ్‌కు చేరుకొని, ఈ మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలను సమరసొత్తుగా సైనికులకు పంచివ్వా లని మీ సేనాపతికి చెప్పు" అని ఆదేశించారు. దానికా సైనికుడు "చిత్తం, తమరు చెప్పినట్లే చేస్తాను, ఇక నాకు సెలవు ఇప్పించండి" అన్నాడు జావగారిన ముఖంతో.

"ఒకమాట గుర్తుంచుకో. దైవసాక్షిగా చెబుతున్నాను, ఒకవేళ ఈ నవరత్నాల పంపిణీ జరగకముందే సైనికులు తమకు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్ళిపోవడం జరిగితే మాత్రం నీకు, మీ నాయకుడికి కఠినశిక్ష విధిస్తాను" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి).

ఆ తర్వాత ఆ సైనికుడు, అతని సేవకుడు ఖలీఫా అనుమతి తీసుకొని అక్కడ్నుంచి బయలుదేరి ఆహ్వాజ్ దారిపట్టారు. అహ్వాజ్ చేరుకోగానే సేనాపతి సల్మా బిన్ ఖైస్ (రజి)కు జరిగిన వృత్తాంతం వివరించారు. సేనాపతి సల్మా (రజి) ఈ సంఘటన విని అప్పటికప్పుడు ఆ నవరత్నాలను సైనికులకు పంచివేశారు.

## (10) ప్లేగు వ్యాధి, కరువు రోజుల్లో

హిజ్రీశకం 17వ సంవత్సరాంతంలో ఇరాఖ్, సిరియా, ఈజిప్టు దేశాల్లో ప్లేగు వ్యాధి వ్యాపించింది. ఇది 18వ ఏట ప్రారంభంలో ఉగ్రరూపం దాల్చి నెలల తరబడి జనాన్ని పీల్చి పిప్పిచేస్తూ వేలాదిమందిని పొట్టన పెట్టుకోసాగింది. అంచేత ఖలీఫా ఉమర్ (రజి) పరిస్థితి సమీక్షించి తగిన ఏర్పాట్లుచేసే ఉద్దేశంతో కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని మదీనా నుండి బయలుదేరి సిరియాలోని 'సర్గ్' ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు స్వాగతంచెప్పడానికి సేనాపతి అబూఉబైదా (రజి), మరికొందరు సైనికాధికారులు వచ్చారు. ఉమర్ (రజి) వారిని సంప్రదించి సలహాలు అడిగారు.

వారిలో అత్యధిక మంది ఇక్కడ్నుంచి ఇక ముందుకు సాగి ప్లేగుసోకిన ప్రాంతానికి వెళ్ళవద్దని సలహా ఇచ్చారు. వాళ్ళను మరికొందరు సమర్థిస్తూ "మీరిక్కడ ఆగడం ఏమాత్రం మంచిది కాద"ని చెప్పారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) దైవప్రవక్త (స) ప్రవచించిన ఒక హితోక్తిని గుర్తుచేస్తూ "ఏ ప్రాంతంలో అంటువ్యాధి వ్యాపిస్తే ఆ ప్రాంతానికి వెళ్ళకండి, ఒకవేళ అంటువ్యాధి వ్యాపించిన ప్రాంతానికి వెళ్ళడం జరిగితే అక్కడ్నుంచి మీరు పారిపోకండి" అని దైవప్రవక్త (స) తెలిపారని అన్నారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ మహితోక్తి వినగానే "మనం ఇక్కడ్నుంచి రేపే బయలుదేరాలి, సిద్ధంగా ఉండండి" అని వెంటవచ్చిన అనుచరుల్ని ఆదేశించారు. అయితే విధివ్రాత పట్ల అతిగా విశ్వాసం కలిగివున్న అబూఉబైదా (రజి) మాత్రం ఖలీఫా తిరుగు ప్రయాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఆయన కనుబొమలు చిట్లిస్తూ "ఉమర్! విధివ్రాత (అదృష్టం) నుండి పారి పోతున్నావా?" అనడిగారు.

దానిని ఉమర్‌ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "ఔను, నేను విధివ్రాత నుండి పారిపోతున్నాను. కాని ఆ పారిపోవడం కూడా విధివ్రాత వైపుకే" అని అన్నారు.

ఆ తర్వాత ఆయన అంటువ్యాధి నివారణ కోసం వీలైనన్ని ఏర్పాట్లు చేసుకోవల సిందిగా అధికారులకు ఆదేశాలిచ్చి మదీనాకు తిరుగుప్రయాణమయ్యారు.

ప్లేగువ్యాధి బారిన పడి చనిపోయినవారిలో ఉబూఉబైదా, ముఆజ్ బిన్ జబల్, యజీద్ బిన్ అబూసుఫ్యాన్, హారిస్ బిన్ హిషామ్, సుహైల్ బిన్ అమ్ర్, ఉతబా బిన్ సుహైల్ (రజి) వంటి అగ్రనాయకులతో పాటు అనేకమంది సైన్యాధికారులతో సహా మొత్తం 25 వేల మంది ఉన్నారు.

ఆ తరువాత అదే సంవత్సరం అరేబియా భూభాగంలో తీవ్రమైన కరవు వచ్చి పడింది. వర్షాభావంతో పచ్చనిచెట్లు మలమల మాడిపోయాయి. కుంటలు, చెరువులు ఎండిపోయాయి. ప్రజలు తిండిగింజల కొరతతో తల్లడిల్లి పోయారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రజల్ని కరవురక్కసి కోరల నుండి కాపాడటానికి నిర్విరామంగా శ్రమిస్తూ వీలైనన్ని ఏర్పాట్లు చేశారు. ఆయన వివిధ రాష్ట్రాల గవర్నర్లకు లేఖలు రాసి సాధ్యమైనంత ఎక్కువగా ధాన్యం పంపవలసిందిగా ఆదేశించారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం మదీనాకు పెద్దఎత్తున ధాన్యం చేరింది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దాన్ని ఓ ఇంట్లో భద్రపరిచారు. తర్వాత తిండిగింజల లేమితో బాధ పడుతున్న ప్రజల జాబితా ఒకటి తయారు చేయించి ఆ ధాన్యం కరవు బాధితులకు పంచిపెట్టారు. అదీగాక ప్రజలపై కరవురక్కసి తాండవిస్తున్నంత కాలం తాను పాలు, నెయ్యి ఉపయోగించనని కూడా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతిజ్ఞ చేశారు. ఆయన సహచరులు కూడా అనేకమంది పాలు, నెయ్యి వాడకం మానేశారు.

ఒకరోజు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రజల్ని వెంటబెట్టుకొని మదీనా పట్టణం బయటికి వెళ్ళారు. అక్కడ 'ఇస్తిస్ఖా నమాజ్' చేసి వర్షం కోసం దైవాన్ని ప్రార్థించారు. ప్రార్థన ముగిసిందో లేదో చిటపట చినుకులతో వర్షం ప్రారంభమై కొన్ని క్షణాల్లోనే అది ఉధృతమై కుంభవృష్టిగా మారిపోయింది. ప్రజలు వర్షంలో తడిసి ఆనందంతో పులకించిపోయారు.



అటు సిరియాలో ప్లేగుమహమ్మారి కనుమరుగై కాస్తంత ప్రశాంత వాతావరణం నెలకొన్నది. అయితే విపరీతమైన ప్రాణనష్టం జరగడం వల్ల వితంతువులు, అనాథపిల్లలు కకావికలమై పోయారు. పాలనావ్యవస్థ కుంటుపడింది. అందువల్ల సిరియాలో పరిస్థితులు చక్కదిద్దేందుకు ఉమర్ ఫారూఖ్ (రజి) కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని మదీనా నుండి సిరియాకు చేరుకున్నారు. సిరియాలోని అనేక జిల్లాలలో విస్తృతంగా పర్యటించి అక్కడి పాలకులకు, అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. సరిహద్దు రక్షణ సైనికులకు జీతాలు అందజేశారు. ప్లేగుతో మరణించినవారి వారసుల్ని ఓదార్చి వారికి ధనసహాయం చేశారు. సరిహద్దుప్రాంతాల్లో శాశ్వత సైనికశిబిరాలు నెలకొల్పి రక్షణదళాలకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఆ తరువాత మదీనా తిరిగొచ్చారు.

## (11) సారియా! మాయ కాదిది, మహిమ

ఈరానీ తిరుగుబాటులతో మరొకసారి పోరు మొదలైంది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సేనాపతి నోమాన్ (రజి)కు మద్దతుగా సారియా (రజి) నేతృత్వంలో ఒక చిన్న సైనికదళమిచ్చి నిహావంద్ వైపుకు పంపించారు. అయితే దారిలో ఓచోట శత్రువులతో తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. ముస్లింలు ఓటమి పాలయ్యే పరిస్థితిలో వారికి ఎక్కడ్నుంచో "సారియా! కొండ వైపుకు వెళ్ళు" అంటూ మూడుసార్లు ఓ అదృశ్యవాణి విన్పించింది. అప్పుడు దళపతి సారియా వెంటనే సైన్యం తీసుకొని కొండమీదికి చేరుకొని శత్రువులపై పునర్విజృంభించారు. దాంతో ఆయన విజయం సాధించారు.

సరిగ్గా అదేరోజు, అంటే శుక్రవారం రోజు మదీనాలో ఖలీఫా ఉమర్ (రజి) జుమా ప్రసంగంచేస్తూ హఠాత్తుగా "సారియా! కొండ వైపుకు వెళ్ళు" అంటూ మూడుసార్లు అన్నారు. ప్రజలీ మాట విని ఆశ్చర్యపోతూ "సారియా నిహావంద్ యుద్ధానికి వెళ్ళి పోయాడు కదా! ఇక్కడ మీరు సారియాను పిలుస్తున్నారేమిటీ?" అని అడిగారు. దానికి ఆయన సమాధానమిస్తూ "అప్పుడు నేను ముస్లింలు యుద్ధం చేస్తున్న దృశ్యం చూశాను. వారు కొండవైపుకు పోవడంలోనే వారి శ్రేయస్సుంది. అంచేత నా నోట అప్రయత్నంగా ఈ మాటలు వెలువడ్డాయి" అని అన్నారు. ఆ తర్వాత నెలరోజులకు సారియా దగ్గర్నుంచి ఒక సైనికుడు మదీనా వచ్చి ఆరోజు జరిగిన సంఘటన ఖలీఫాకు వివరించాడు.

## (12) భూసంస్కరణలు

ఇరాఖ్, సిరియా, ఈజిప్టు దేశాలు ముస్లింల స్వాధీనంలోకి రాకముందు ఆనాటి పాలకులు ప్రజల మీద భారీఎత్తు శిస్తులు విధించి దౌర్జన్యంగా వసూలుచేసేవారు. ఆ దేశాలు ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఇతర అనేక సంస్కరణలతో పాటు భూమిశిస్తు వ్యవహారాన్ని కూడా సంస్కరించి ప్రజల మీది పెనుభారం తగ్గించి వారికి న్యాయం చేకూర్చారు.

రోమన్లు సిరియా, ఈజిప్టు దేశాల్ని ఆక్రమించిన తరువాత అక్కడి సేద్యభూముల్ని రైతుల నుండి బలవంతంగా లాక్కొని తమ సైనికులకు, దర్బారీలకు, రాజవంశీయులకు, చర్చీలకు, జమీందారులకు కట్టబెట్టేవారు. దాంతో అసలు యజమానులైన రైతులు వారి కింద వ్యవసాయకూలీలుగా జీవితం గడపవలసి వచ్చేది. ఖలీఫా ఉమర్ (రజి) సిరియా, ఈజిప్టులు తమ స్వాధీనంలోకి వచ్చిన తరువాత ఆ రైతులకు వారి భూముల్ని తిరిగి ఇప్పించడమే గాక, బయటిదేశాల నుండి వచ్చే అరబ్బులైనా, మరెవరైనా ఆ భూముల్లో సేద్యం చేయకూడదని కూడా శాసించారు. దీనివల్ల వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందసాగింది. మరోవైపు ఆ దేశాల రైతులు, ఇతర పౌరులు రోమన్లకు వ్యతిరేకంగా ముస్లింలకు మద్దతునివ్వడానికి సిద్ధమయ్యారు. అదే విధంగా ఇరాఖ్, ఈరాన్లలో కూడా ఖలీఫాఉమర్ (రజి) రైతుల కడుపులు కొట్టే రాక్షస చట్టాల్ని అంతమొందించి న్యాయవంతమైన భూసంస్కరణలు ప్రవేశపెట్టారు.

ఆయన వ్యవసాయాభివృద్ధి కోసం రైతులకు అనేక సదుపాయాలు కల్పించారు. భూములు సాగుబడి చేసే విషయంలో వారి సలహాలు తీసుకునేవారు. నీటి పారుదల కోసం వీలైన ప్రాంతాల్లో పెద్దనదుల నుండి కాలువలు త్రవ్వించి, సుదూర ప్రాంతాలకు సైతం నీరందే ఏర్పాట్లు చేశారు. ఇన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ వెనుకటి ప్రభుత్వాలకంటె తక్కువ శిస్తు వేయడం జరిగింది. ఈ కారణంగానే వ్యవసాయదారులు ఇస్లామీయ ప్రభుత్వానికి నిజమైన శ్రేయోభిలాషులయ్యారు. ఒకసారి సిరియాకు చెందిన ఒక రైతు వచ్చి "మీ సైన్యం నాపొలాల గుండా పోతూ మొత్తం పంటను సర్వనాశనం చేసిపోయింది" అని ఫిర్యాదు చేశాడు. హజ్రత్ ఉమర్ (రజి) వాస్తవం రాబట్టిన తరువాత నష్టపరిహారం క్రింద ఆ వ్యవసాయదారునికి పదివేల దిర్హములు డబ్బు ఇప్పించారు.

ఖలీఫా ఉమర్ (రజి) పాలనలో ఇరాఖ్, ఈరాన్, సిరియా, ఈజిప్టులలో ముస్లింలు చూపిన ఈ సానుభూతి, వారి న్యాయవైఖరులే వారి విజయాలకు కారణమయ్యాయి. ఫ్రాన్స్‌కు చెందిన ఓ ప్రముఖ రచయిత తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తపరిచాడు:

"ఇస్లాం విజయాలకు రెవెన్యూ, శిస్తుల వ్యవహారం ఎంతగానో తోడ్పడ్డాయన్నది నగ్నసత్యం. రోమ్‌సామ్రాజ్యంలో దేశపౌరులు రోమన్లకు కఠినమైన శిస్తులు, పన్నులు చెల్లించవలసి వస్తుండేది. ఈ దౌర్జన్యవిధానం ముస్లింల విజయాలను ఎంతో వేగవంతం చేసింది. ముస్లింల దాడుల్ని రోమన్లు మాత్రమే ఎదిరించారు గాని, దేశవాసులు కాదు. ఈజిప్టులోనైతే ఆ దేశవాసులైన ఖబ్తీతెగ రైతులు రోమన్లకు వ్యతిరేకంగా ముస్లింలకు సహాయం చేశారు. డెమాస్కస్, హమస్ పట్టణాల్లోని క్రైస్తవులు హెర్క్యులస్ సేనలకు వ్యతిరేకంగా తమ పట్టణ ముఖద్వారాలను మూసుకున్నారు. ఆ సందర్భంలో వారు ముస్లింలకు తమ మద్దతునిస్తూ 'నిర్దాక్షిణ్యమైన రోమన్ల ప్రభుత్వం కంటే మీ ప్రభుత్వమే మాకు బాగా నచ్చింది' అని అన్నారు." (అల్‌ఫారూఖ్)



# (13) ప్రభుత్వ ధనాగారం

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రభుత్వధనాగారం (బైతుల్‌మాల్) విషయంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. ధనాగారంలో సంపద ఎక్కువగా పేరుకొని ఉండటాన్ని, విచ్చల విడిగా ఖర్చుపెట్టడాన్ని ఆయన ఏమాత్రం సహించేవారు కాదు. కాబాలో చాలాకాలం నుండి నిల్వవున్న వెండి, బంగారు రాసుల్ని త్వరగా బయటికి తీసి ప్రజలకు పంచాలని ఉత్తర్వు జారీచేశారు.

ఒకసారి మదీనాలో భారీఎత్తు సమరసొత్తు వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) సతీమణి, ఉమర్ ఫారూఖ్ (రజి) ముద్దుల కుమార్తె అయిన హజ్రత్ హఫ్సా (రజి) వచ్చి "విశ్వాసులనాయకా! ఈ సమరసొత్తులో నా హక్కు కూడా ఉంది. నేను బంధువర్గం (జవిల్‌ఖుర్బా)కు చెందిన దాన్ని. నా హక్కు నాకు ఇప్పించండి" అని అన్నారు. దానికి ఖలీఫా ఉమర్ (రజి) సమాధానమిస్తూ "అమ్మా! నీ హక్కు ఏదైనా ఉంటే అది నా సొంత పైకం నుంచి తీసుకో. ఇది సమరసొత్తు (ఇందులో నీకెలాంటి హక్కు లేదు.) నువ్వు నీ తండ్రిని మోసగింపజూస్తున్నావు" అని అన్నారు. హజ్రత్ హఫ్సా (రజి) ఈ సమాధానం విని బిక్కమొగం వేసుకొని వెళ్ళిపోయారు.

సిరియా ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత ముస్లింలకు, రోమన్లకు మధ్య స్నేహపూర్వకమైన ఉత్తరప్రత్యుత్తర సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ కాలంలో ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) అర్ధాంగి హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) రోమ్ మహారాణికి అత్తరు నింపిన కొన్ని సీసాలు పంపించారు. దానికి సమాధానంగా రోమ్ మహారాణి ఆ సీసాలలో మణిమాణిక్యాలు నింపి హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి)కు పంపడం జరిగింది. ఈ విషయం తెలియగానే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఉమ్మెకుల్సూమ్ (రజి)తో మాట్లాడుతూ "అత్తరు నీదే కావచ్చు. కాని అత్తరు తీసికెళ్ళిన దూత ప్రభుత్వ సేవకుడు. అతని జీతభత్యాలు ప్రభుత్వ ఆదాయం నుండి చెల్లించడం జరిగింది. కాబట్టి ఆ మణి మాణిక్యాలు ప్రభుత్వానికి చెందుతాయి" అని చెప్పి వాటిని ప్రభుత్వధనాగారంలో జమచేశారు. కాకపోతే అత్తరు ధర మాత్రం భార్యకు అందజేశారు. పాపం ఖలీఫాగారి భార్యామణి నోట మాట పెగలక నిశ్చేష్టురాలై చూడసాగింది.

ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) బజారున పోతుంటే ఒక బలిసిన ఒంటె అమ్మబడుతుండటం కన్పించింది. ఆయన ఆ ఒంటె ఎవరిదని అడిగితే మీ కుమారుడు అబ్దుల్లాది అని చెప్పారు జనం. అప్పుడాయన దగ్గరకు వెళ్ళి "ఈఒంటె లోగడ ఎక్కడుండేద"ని అడిగారు కొడుకును. దానికి అబ్దుల్లా "నేనీ ఒంటెను కొని సర్కారు పచ్చిక బయలులో వదిలాను. అక్కడిది బాగ మేసి బలిసింది. ఇప్పుడు నేను దీన్ని అమ్మకానికి పెట్టాను" అని అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "ఈ ఒంటె సర్కారు

పచ్చిక బయలులో మేసి బలిసింది కనుక, దీని కొన్నధర మాత్రమే తీసుకోవడానికి నీక్కు హక్కుంది. మిగిలిన పైకం సర్కారు ఖజానాలో జమచెయ్యి" అని చెప్పారు.

ఒకసారి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) జబ్బు పడ్డారు. దాని చికిత్స కోసం తేనె వాడమన్నారు కొందరు. కాని తేనె ఖలీఫా గారింట్లో లేదు. ప్రభుత్వ ధనాగారంలో ఉంది కాని, ప్రజల అనుమతి లేకుండా ఆయన తీసుకోలేరు. అంచేత ఆయన నమాజ్ వేళలో ప్రజలను సంబోధిస్తూ "ప్రభుత్వ ధనాగారం నుంచి కొంచెం తేనె తీసుకోవడానికి నాకు అనుమతిస్తారా?" అని అడిగారు. దానికి ప్రజలు సంతోషంగా అనుమతించారు.

సాధారణంగా ఉమర్ ఫారూఖ్ (రజి) వంటిపై చినిగిన, అతుకులు వేసిన దుస్తులే ఉండేవి. అవి కూడా ఒక జత బట్టలే. వాటినే ఉతుక్కొని తొడుక్కునేవారు. ఇంట్లో నెలల తరబడి రొట్టెలు తయారయ్యేవి కావు. వాటిక్కారణం సన్యాసిగా, సర్వసంగ పరిత్యాగిగా ఉండాలన్న ఉద్దేశం కాదు. ప్రజలందరితో పాటు తన వాటాకు అధిక ధనం వస్తే విశాలహృదయంతో దాన్ని ఖర్చు కూడా పెట్టేవారు. ఆయన హజ్రత్ అలి (రజి) కుమార్తె ఉమ్మెకుల్సూమ్ (రజి)ని వివాహమాడిన రోజుల్లో సమరసొత్తు నుండి తనవాటాకు పెద్ద మొత్తమే వచ్చింది. అప్పుడాయన ఉమ్మెకుల్సూమ్ (రజి) కుటుంబ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని మహర్ కింద ఆమెకు నలభైవేల దిర్హంలు చెల్లించారు.

## (14) న్యాయ వ్యవస్థ

ఖలీఫా ఉమర్ (రజి) ఎవరినైనా న్యాయాధికారిగా నియమించే ముందు అతడ్ని పరీక్షించేవారు. ఖాజీషరయి అనే న్యాయాధికారికి సంబంధించిన ఒక సంఘటన ఇలా ఉంది: తనకు నచ్చిన గుర్రమే కావాలన్న షరతుపై ఉమర్ (రజి) ఒక గుర్రం కొన్నారు. పరీక్షించడానికి దానిపై ఎక్కి స్వారిచేశారు. కాని యాదృచ్ఛికంగా అది కాలుజారి పడి గాయపడింది. ఉమర్ (రజి) ఆ గుర్రాన్ని అమ్మినవాడికి తిరిగిచ్చేద్దాం అనుకున్నారు. కాని అతనా గుర్రాన్ని వాపసు తీసుకోవడానికి నిరాకరించాడు. తరువాత ఇద్దరూ కలిసి తీర్పు కోసం ఇరాఖ్‌కు చెందిన ఒక న్యాయాధికారి దగ్గరకు వెళ్ళారు.

ఆ న్యాయాధికారి కేసు విని "అమీరుల్ మోమినీన్! మీరు ఈ గుర్రాన్ని కొనాల్సిందే. లేదా మీరు తీసుకున్నప్పుడు గుర్రం ఏ విధంగా ఉండిందో అదే స్థితిలో దాన్ని ఇతనికి వాపసు చేయండి" అని ఏమాత్రం మొహమాటం లేకుండా తీర్పిచ్చాడు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ తీర్పు విని చాలా సంతోషించారు. తర్వాత ఆయన ఆ న్యాయాధికారిని కూఫా ప్రాంతపు ఖాజి (జడ్జీ)గా నియమించారు.

ఖలీఫా ఉమర్ (రజి) న్యాయవ్యవస్థ సూత్రాలు పేర్కొంటూ బస్రా రాష్ట్రగవర్నర్ అబూమూసా అష్అరీ (రజి)కి ఓ చారిత్రక లేఖ రాశారు. దాని సారాంశం ఇలా ఉంది:



"ఫిర్యాదులను పరిష్కరించడం ఎంతో బాధ్యతతో కూడిన పని. ఏదైన ఫిర్యాదు మీకందితే, అందులోని ప్రతి మాటను క్షుణ్ణంగా పరిశీలించి, ఆలోచించి తీర్పివ్వండి, తీర్పు ఇచ్చాక దాని ప్రకారం అమలుచేయాలి. వాది, ప్రతివాదుల పట్ల ఒకేవిధంగా వ్యవహరించాలి. ఫిర్యాది నుండి సాక్ష్యం అడగాలి. 'దావా'ను నిరాకరించేవారి చేత ప్రమాణం చేయించండి. ముస్లింల మధ్య రాజీ కుదర్చడం గొప్ప సత్కార్యం. ఫిర్యాది తన 'దావా'ను నిరూపించుకోడానికి వ్యవధి అడిగితే ఇవ్వండి. సాక్ష్యం తెస్తే దాని ఆధారంగా తీర్పుచేయండి. ఫిర్యాది సాక్ష్యం సమర్పించకపోతే ఆ కేసు కొట్టివేయండి. ప్రతి ముస్లిం నిజం చెప్పేవాడని భావించండి. అయితే ఏదైన విషయంలో శిక్ష పడివుంటే లేదా తప్పుడు సాక్ష్యమిచ్చివుంటే అతని మాటలు నమ్మదగినవికావు. ముద్దాయి లేదా ఫిర్యాది పట్ల మీ హృదయంలో ఏమాత్రం కోపంగాని, విసుగుగాని ఉండరాదు. న్యాయశీలుడు దేవుని బహుమానానికి, పేరు ప్రతిష్ఠలకు హక్కుదారుడౌతాడు. నిష్కల్మష మైన మనస్సు కలవాడికి, ప్రజలకు మధ్య దేవుడే చాలు. కృత్రిమ నైతికత ప్రదర్శించే వాడు ఎన్నటికీ దేవుని కారుణ్యానుగ్రహాలను ఆశించలేడు."

ఒకసారి ఉమర్‌ఫారూఖ్ (రజి), ఉబయ్యి బిన్‌కాబ్ (రజి)ల మధ్య ఏదో విషయంలో గొడవ వచ్చింది. ఉబయ్యి (రజి) ఈ వ్యవహారాన్ని జైద్ బిన్ సాబిత్ (రజి) దగ్గరకు తీసికెళ్ళారు. ఖలీఫా ఉమర్ (రజి) ముద్దాయిగా హాజరయ్యారు. ఖలీఫా అయినందున ఆయన్ని జైద్ (రజి) ఎంతో గౌరవిస్తూ కూర్చోబెట్టదలిచారు. కాని ఉమర్ (రజి) అందుకు అభ్యంతరం తెలుపుతూ "జైద్! ఇది నీ మొదటి అన్యాయం" అన్నారు. అలా చెప్పిన తరువాత ఆయన వెళ్ళి ఉబయ్యి బిన్ కాబ్ ప్రక్కన కూర్చున్నారు. ఉబయ్యి వద్ద ఎలాంటి సాక్ష్యం లేదు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన దావాను నిరాకరించారు. న్యాయశాస్త్రం ప్రకారం ఉబయ్యి బిన్ కాబ్ (రజి) ఖలీఫా ఉమర్ (రజి) చేత ప్రమాణం చేయించదలిచారు. కాని న్యాయాధికారి జైద్ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి) హోదాను దృష్టిలో ఉంచుకొని ఉబయ్యి బిన్ కాబ్ (రజి)తో "అమీరుల్ మోమినీన్‌కు ప్రమాణం నుంచి మినహాయింపు ఇవ్వండ"ని అన్నారు.

న్యాయమూర్తి జైద్ (రజి) ప్రదర్శించిన ఈ రెండవ పక్షపాతవైఖరి చూసి ఖలీఫా ఉమర్ (రజి) విచారం వ్యక్తపరుస్తూ "జైద్! న్యాయం చేసేటప్పుడు ధనికుడు-నిరుపేద, సాధారణవ్యక్తి-ఉమర్ (రజి) నీ దృష్టిలో సమానులు కానంతవరకు నీవు ఖాజీ పదవికి అర్హుడవని భావించలేము" అని అన్నారు.

## (15) ఇస్లాం సందేశ విస్తరణ

ఇస్లామీయ పోరాటాల లక్ష్యం రాజ్యవిస్తరణ ఎంతమాత్రం కాదు. హింసా దౌర్జన్యాలు, అన్యాయం-అక్రమాలను అంతమొందించి శాంతిభద్రతలు, నీతీన్యాయాలు

నెలకొల్పడమే ఈ పోరాటాల ప్రధానలక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరితే ప్రకృతి సిద్ధమైన దైవధర్మం దానంతటదే మొగ్గతొడిగి మూడుపువ్వులు, ఆరుకాయలుగా విస్తరిస్తూ పోతుంది. దౌర్జన్యం అంతరించగానే సత్యం బహిర్గతమవుతుంది. ఆ సత్యమే ఇస్లాం-దైవనిర్దేశిత ధర్మం. దౌర్జన్యం అంతరించినప్పుడు సత్యం ఎలా బహిర్గతమవుతుందో తెలుసుకుందాం.

సాధారణంగా జనసామాన్యం అన్యాయంగా ఇతరుల హక్కులు కొల్లగొట్టాలని, వారిపై దౌర్జన్యం చేసి విలాసజీవితం గడపాలని భావించరు. హింసాప్రవృత్తి కలవారు, దుర్మార్గులే దౌర్జన్యాలకు పాల్పడతారు. అయితే బలవంతుడైతే తన కండబలంతో, ఆయుధశక్తితో, మందీమార్బలంతో ఇతరుల్ని దోచుకుంటాడు. అలాంటి శక్తిసామర్థ్యాలు అంతగా లేనివాడు కుట్రలు, కుయుక్తులకు ఒడిగడ్తాడు.

ఇస్లాం అలాంటి దోపిడీగాంఁడ్రను, దోపిడీవ్యవస్థను నిరోధించడానికి ప్రయత్నించి నప్పుడల్లా ఆ దుష్టశక్తులు దాన్ని అంతమొందించడానికో లేదా అప్రతిష్ఠ పాలుజేయ డానికో రంగంలోకి దిగుతాయి. ఆనాడైనా, ఈనాడైనా లోకంలో జరుగుతున్నది ఇదే. అయితే శాంతివిఘాతకుల్ని, దోపిడీగాంఁడ్రను ఎదుర్కొని హింసాదౌర్జన్యాల్ని అంత మొందించగల్గే, నీతిన్యాయాల్ని నెలగొల్పగల్గే అనుయాయులు ఇస్లాంకు లభించినపుడు జనసామాన్యం సహజంగానే ఇస్లాంవైపు ఆకర్షితులవుతారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో, ఆ తర్వాత సన్మార్గగాములైన ఖలీఫాల కాలంలో ఇస్లాంకు అలాంటి అనుచరులు లభించడం వల్లనే ప్రపంచంలో అది శరవేగంతో విస్తరించింది.

హి.శ.11లో 'జలూల' ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తర్వాత అక్కడి భూస్వాములు, ధనికులు సంతోషంగా ఇస్లాం స్వీకరించారు. వారసలు జలూల పాలకుల దౌర్జన్యాలతో విసిగిపోయి ముస్లింల సత్ప్రవర్తనతో ప్రభావితులై ఇస్లాం స్వీకరించారు. వారిలో ప్రజా బలంగల నాయకులు కూడా ఉన్నారు. అంచేత వారి ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించారు. ఖాదిసియా యుద్ధం తర్వాత ఈరాన్ చక్రవర్తి ఖుస్రూపర్వేజ్ శిక్షణ ఇచ్చిన ప్రత్యేక సైనికదళంలోని నాలుగువేల మంది సైనికులు ఇస్లాం స్వీకరించి ముస్లింసముదాయంలో చేరిపోయారు. ఆతర్వాత కూడా వేలాదిమంది ఈరాన్‌సైనికులు ఇస్లాం స్వీకరించారు.

సయ్యా అనే ఒక ఈరాన్ సైన్యాధికారి ఓరోజు తన అనుచర సైనికుల్ని సమావేశ పరచి "మన పెద్దలు మన దేశాన్ని అరబ్బులు జయిస్తారని చెబుతుండేవారు. ఆ భవిష్యవాణి ఇప్పుడు నిజమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. అంచేత మనమంతా ఇస్లాం స్వీకరించడంలోనే మన శ్రేయస్సు ఉంది" అని అన్నాడు. ఈమాట విని అందరూ ఇస్లాం స్వీకరించి ముస్లిం సైన్యంలో చేరిపోయారు.



ఈజిప్టులోని కొన్ని ప్రాంతాలవారు తిరుగుబాటుచేసి చివరికి ఖైదీలుగా పట్టు బడ్డారు. అప్పుడు ఈజిప్టుగవర్నర్ అమ్ర్ (రజి) వారిని బానిసలుగా అమ్మివేశారు. వారంతా అరేబియా నలువైపులా వ్యాపించారు. ఖలీఫాకు యుద్ధఖైదీలను బానిసలుగా అమ్మేయ డం నచ్చలేదు. ఆయన ఆ బానిసలందరినీ సమీకరించి ఈజిప్టుకు తిప్పిపంపుతూ "వారందరూ తాము కోరుకుంటే ఇస్లాం స్వీకరించవచ్చు లేదా తమ మతంలోనే ఉండి పోవచ్చు" అని ఈజిప్టుగవర్నర్‌కు లేఖరాశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ యుద్ధఖైదీ లంతా క్రమక్రమంగా ఇస్లాం స్వీకరించారు. ఈజిప్టులోనే 'షితా' పట్టణాధికారి ముస్లింల స్థితిగతులు తెలుసుకొని ఇస్లాం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆ తరువాత ముస్లిం సైన్యం షితా పట్టడానికి సమీపంలోని ఒక ప్రదేశంలో విడిదిచేసిందని తెలుసుకొని, అతను రెండువేల మంది ప్రజలను తీసుకొని వెళ్ళి ఇస్లాం స్వీకరించాడు.

సిరియాలో కూడా జనం పెద్దఎత్తున ఇస్లాం స్వీకరించారు. వారి ధార్మికశిక్షణ కోసం గవర్నర్ మావియా విజ్ఞప్తిపై ఖలీఫా ముగ్గురు ధర్మవేత్తల్ని పంపారు. వారిలో హజ్రత్ అబూదర్దా (రజి) ఒకరు. ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రారంభంలో అబూదర్దా (రజి)ను సిరియా గవర్నర్‌గా నియమించాలని ప్రయత్నించారు. దానికి ఆయన అంగీక రించకుండా ధర్మప్రచారకునిగా, బోధకునిగా మాత్రమే సిరియా వెళ్ళడానికి సిద్ధమ య్యారు. అప్పుడు ఖలీఫా ఆయన్ని ధర్మప్రచారకునిగా సిరియా పంపారు.

హజ్రత్ అబూదర్దా (రజి) సిరియా రాజధాని డెమాస్కస్‌కు చేరుకొని పరిస్థితి గమనిస్తే అక్కడి ముస్లింలు ప్రాపంచిక వ్యామోహంలో పడి విలాసవంతమైన జీవితం గడుపుతూ కన్పించారు. ఒకరోజు వారిని ఆయన మసీదులో సమావేశపరచి ఎంతో బాధాతప్త హృదయంతో హితబోధ చేశారు. ఐహికవ్యామోహంలో కూరుకుపోయి, సృష్టికర్తను విస్మరించి దైవశిక్షలకు గురైన గత జాతుల చారిత్రక గాథలను విన్పించి హెచ్చరించారు. పరలోక దుష్పరిణామాలను గురించి భయపెట్టారు. రాతిగుండెలను సైతం కరిగించే ఆయన ప్రసంగం విని సభికులు పశ్చాత్తాపంతో కంటతడి పెట్టారు.

ఈవిధంగా అబూదర్దా (రజి) ప్రచారభేరి మోగించి ప్రజలను ఆకట్టుకోసాగారు. విభిన్న మనస్తత్వం గలవారికి ఆయన సందర్భానుసారం సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ తగిన హితవులు కూడా గరుపుతుండేవారు. సిరియాలో ఆయన జీవనసరళి ఆయన నోట వెలువడే హితోక్తులకు పూర్తి క్రియారూపంగా ఉండేది. ఆ విషయాన్ని ఖలీఫా ఉమర్ (రజి) కూడా తన పర్యటన సందర్భంలో ప్రత్యక్షంగా చూసుకున్నారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఇతర ప్రాంతాలక్కూడా ధార్మికశిక్షణ కోసం ధర్మవేత్తల్ని పంపారు. ఆయన ఇమాములకు, ముఅజ్జిన్‌లకు వేతనాలు నిర్ణయించి మసీదుల్లో ప్రత్యేకంగా ఖుర్‌ఆన్ బోధనాకార్యక్రమాల ఏర్పాటు కూడా చేశారు. అయితే

ఇస్లాం సందేశ విస్తరణ ప్రచారం ద్వారా కాకుండా ముస్లింల నీతినడవడికల ద్వారానే ఎక్కువగా జరిగిందనే విషయం ఈనాటి ముస్లింలు గమనించాలి.

## (16) ఉమర్ (రజి) నైతిక జీవనసరళి

ఖలీఫా ప్రజల యోగక్షేమాలు, బాగోగులు చూసి తగిన చర్యలు తీసుకోవడానికి రాత్రివేళ నగరంలో గస్తీ తిరిగేవారు. ప్రజలకు ఏకాస్త కష్టం వచ్చినా ఆయన సహించేవారు కాదు. తక్షణమే తగిన చర్యలు తీసుకోనిదే ఆయన ఆ రాత్రి నిద్ర పోయేవారు కాదు. ప్రజాసేవలో అందరికంటే ముందుండేవారు. ఆయన ప్రజలందరికీ భావప్రకటన స్వేచ్ఛ ఇచ్చేవారు. వాస్తవికతకు, ధర్మశాస్త్రానికి అనుగుణంగా తనను ఓ సాధారణ పౌరుడు విమర్శించినా సరే ఆయన తన పొరపాటును ఉపసంహరించుకునేవారు.

అంతేకాదు, ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) చట్టాన్ని వర్తింపజేయడంలో, శిక్షలు విధించడంలో తనవారు, పరాయివారన్న వివక్ష ఏమాత్రం చూపేవారుకాదు. తప్పుచేస్తే తన కన్నకొడుకునైనా, రాష్ట్ర గవర్నరైనా వదలిపెట్టేవారు కాదు. ముస్లింమేతర పౌరుల హక్కుల పట్ల ఎంతో శ్రద్ధవహించేవారు.

### ♦ రాత్రివేళ గస్తీలో

(1) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) నగరంలో ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి మారువేషంలో ఓరోజు రాత్రి గస్తీ తిరుగుతూ ఓ పూరిపాక దగ్గరకు వచ్చారు. ఆ పూరిపాకాలో ఉంటున్న పౌరుడితో ఆయన మాట్లాడసాగారు. కాస్సేపటికి హఠాత్తుగా ఆ పూరిపాక నుంచి ఒక స్త్రీ ఏడ్పు వినవచ్చింది. ఉమర్ ఫారూఖ్ (రజి) పూరిపాక వైపు చూస్తూ "ఎవరామె ఏడుస్తోంది?" అనడిగారు. "ఆమె నా భార్యేనండీ! పురిటి నొప్పులతో బాధపడుతోంది" అన్నాడు గుడిసెవాసి.

'అయితే ఉండు, ఇప్పుడే వస్తాన'ంటూ ఉమర్ ఫారూఖ్ (రజి) పరుగు వేగంతో ఇంటికెళ్ళి తన భార్య ఉమ్మెకుల్సూమ్ (రజి)కు ఈ విషయం చెప్పారు. "అయ్యయ్యో ఎంత బాధపడుతుందో కదండీ! పదండి, నేను మీవెంట వస్తున్నా" అంటూ ఉమ్మెకుల్సూమ్ (రజి) దుప్పెట కప్పుకొని సిద్ధమయ్యారు. ఉమర్ ఫారూఖ్ (రజి) శ్రీమతిని వెంటబెట్టుకొని పూరిపాక దగ్గరకు చేరుకున్నారు. పోగానే శ్రీమతిని లోపలికి పంపించి ఆయన బయట గుడిసెవాసి దగ్గర కూర్చున్నారు.

కాస్సేపటికి ఉమ్మెకుల్సూమ్ (రజి) ఆ స్త్రీకి కాన్పు చేసి "అమీరుల్ మోమినీన్! మీ స్నేహితుడికి శుభాకాంక్షలు చెప్పండి, ఆయనకు కొడుకు పుట్టాడు" అని లోపలి నుంచి కేకవేసి చెప్పారు. నిరుపేద గుడిసెవాసి తన భార్యకు కాన్పుచేసిన స్త్రీ దేశాధినేత భార్య అని తెలియగానే బిత్తరపోయాడు.



(2) మరొకరోజు ఉమర్ (రజి) ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి రాత్రివేళ గస్తీ తిరుగుతుంటే ఒక ఇంటి నుంచి ఈ మాటలు విన్పించాయి:

"లేమ్మా! లేచి పాలలో నీళ్ళు కలుపు" అన్నది ఓ మహిళ. "అమ్మా! పాలలో నీళ్ళు కలపకూడదని మన ఖలీఫాగారు ప్రకటన చేయించిన సంగతి నీకు తెలియదా?" అన్నది ఒక బాలిక. "ఇక్కడ ఖలీఫా మనల్ని చూడటం లేదుకదా! ఖలీఫా మనుషులు కూడా లేరు. త్వొరగా పాలలో నీళ్ళుకలుపు. ఇక్కడకొచ్చి ఎవరు చూడబోయారు?" అన్నది తల్లి. "అమ్మా! మనం ఇక్కడ పాలలో నీళ్ళు కలుపుతున్న సంగతి ఖలీఫాకు తెలియకపోవచ్చు. కాని దేవునికి తెలియదా? ఆయన ఎల్లవేళలా అందరినీ చూస్తున్నాడు. నేను మాత్రం పాలలో నీళ్ళు కలపలేను" అన్నదా బాలిక.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ సంభాషణ విని మౌనంగా వెళ్ళిపోయారు. మరునాడు ఉదయం తన కుమారుల్ని పిలిచి ఇలా అన్నారు: "నాయనలారా! నేను రాత్రి ఫలానా వీథిలోని ఓ పూరిపాకలో ఒక యువతి పలికిన మధురమైన మాటలు విన్నాను. ఆ యువతి ముఖారవిందమైతే చూడలేదుకాని, ఆమె నోట దైవభీతిపరాయణత జాలువారే పలుకులు మాత్రం విన్నాను. ఆమెను నా కోడలిగా మనింటికి తీసుకురావాలని భావిస్తున్నాను. దైవచిత్తమైతే ఆ అమ్మాయి ద్వారా మనకు ఓ శుభప్రదమైన చిరంజీవి కలగవచ్చు. దీనికి మీలో ఎవరు సిద్ధమవుతారో చెప్పండి." దానికి ఆసిమ్ (రజి) "నాన్నాగారూ! నేనిందుకు సిద్ధంగా ఉన్నాను" అన్నారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ పూరిపాక వైపు బయలుదేరారు.

ఖలీఫా తమ ఇంటివైపే రావడం చూసి ఆ వృద్ధమాత కంగారుపడిపోయింది. యువతి ఆమెకు ధైర్యంచెబుతూ ఓ మాసినచాప పరచింది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) చాపపై కూర్చుంటూ "నేను మీ అమ్మాయిని నా కోడలుగా చేసుకోదలిచాను. మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" అన్నారు. యువతితల్లి ఖలీఫానోట ఈమాట వినగానే కొయ్యబారి క్షణంపాటు నోటమాట పెగల్లేదు. ఆ తర్వాత తేరుకొని "ఏమిటీ నేను కలగంటున్నానా?" అన్నది. దానికి ఖలీఫా ఉమర్ (రజి) "కలగాదు, నిజమే. నేను మీఅమ్మాయిని మాఅబ్బాయి ఆసిమ్‌కి ఇప్పించి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. మీ అభిప్రాయం చెప్పండి" అని అన్నారు. దానికి ఆ వృద్ధమాత "విశ్వాసులనాయకా! మీరెక్కడా, ఈ పూరిగుడిసెలో ఉంటున్న మేమెక్కడ!! మీరంతటి మీరొచ్చి అడుగుతుంటే అంతకంటే భాగ్యం మాకింకేం కావాలి" అన్నది కనుగొలుకుల నుండి జాలువారుతున్న ఆనందభాష్పాలు తుడుచుకుంటూ.

ఆ తరువాత ఆసిమ్‌తో ఆ బాలిక వివాహం జరిగింది. ఆమె పవిత్రఉదరం నుంచి ఉమ్మెఆసిమ్ పుట్టింది. ఆమెకు జన్మించిన మహనీయుడే ఉమర్ బిన్ అబ్దుల్

అజీజ్ (రహ్మాలై). ఆయన ఖలీఫాగా ఎన్నుకోబడి ఎంతో న్యాయంగా, నిజాయితీగా దేశాన్ని పాలించి ఐదవ శ్రేష్ఠఖలీఫాగా ఖ్యాతి చెందారు.

(3) ఖలీఫా ఉమర్ (రజి) ఓసారి అర్ధరాత్రివేళ గస్తీ తిరుగుతుంటే ఒక వ్యక్తి తన ఇంట్లో ఏదోపాట పాడుతున్నాడు. ఆ పాట వినగానే ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. ఆయన వెంటనే అతని ప్రహరీగోడెక్కి తొంగిచూస్తే మందూ, మగువా కన్పించాయి. ఆయన కోపంతో "ఓరి దైవవిరోధీ! నీవు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే ఆయన నీ గుట్టు రట్టుచేయడని భావించావా?" అని అరిచారు.

దానికా వ్యక్తి ఇలా అన్నాడు: "విశ్వాసుల నాయకా! తొందరపడకండి. నేను ఒక పాపంచేస్తే మీరు మూడుపాపాలు చేశారు. దేవుడు ఇతరుల రహస్యాలు కూపీ తీయడాన్ని నిషేధించాడు. కాని మీరా పని చేశారు. దేవుడు ఇండ్లలోకి ముఖద్వారం గుండా ప్రవేశించమని ఆదేశిస్తే మీరు ప్రహరీ గోడెక్కి వచ్చారు. దేవుడు ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకూడదంటే, మీరు నా అనుమతి లేకుండానే నాఇంట్లో ప్రవేశించారు." ఉమర్ (రజి) ఈమాట విని తప్పు ఒప్పుకున్నారు. అతనిపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కాకపోతే అతని చేత దుష్కార్యాలు మానేసి నీతిమార్గం అవలంబిస్తానన్న వాగ్దానం చేయించుకున్నారు.

(4) ఖలీఫా ఉమర్ (రజి) రోజులాగే ఆరోజు రాత్రి కూడా యధాప్రకారం ప్రజల మంచిసెబ్బరలు తెలుసుకోవడానికి రాజధాని నగరంలో గస్తీ తిరగసాగారు. అలా గస్తీ తిరుగుతుంటే ఒక చోట ఆయనకు ఓ స్త్రీ కంఠం వినవచ్చింది. ఆ కంఠస్వరంలో ఈ విధంగా ఒక విరహగేయం తొంగిచూసింది:

"ముద్దూముచ్చట్లతో నన్నాందపరిచే చెలికాడు లేకుండా పోయాడే!!
అయ్యో! ఈ విషయమే నన్ను రాత్రుళ్ళలో నిద్ర లేకుండా చేసింది.
దేవుని దగ్గర పట్టుబడిపోతానన్న భయమే గనక లేకపోయి ఉంటే,
ఈపాటికి ఈ మంచం పట్టెలు సయితం కదిలిపోయి ఉండేవి!!"

ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ గేయం విని చలించిపోయారు. ఆ యువతి భర్త జిహాద్ చేయడానికి వెళ్ళి చాలాకాలం గడిచింది. అందుకే ఆ కావ్యకన్యలో జాలువారిన ఈ విరహవేదన. ఖలీఫా ఉమర్ (రజి) మరునాడు కుమార్తె హఫ్సా (రజి) ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు విచారించిన తర్వాత "స్త్రీ తన భర్త ఎక్కడికైనా వెళ్ళిపోయినపుడు భర్త ఎడబాటును ఎంత కాలందాకా సహించ గల్గుతుంది?" అని అడిగారు.

హజ్రత్ హఫ్సా (రజి) తండ్రి నోట ఈమాట విని క్షణంపాటు సిగ్గుపడి పోయారు. తర్వాత ఆమె నేలచూపులు చూస్తూ "నాలుగు నెలలదాకా సహించగల్గుతుంది" అని



చెప్పారు. ఖలీఫా ఉమర్ (రజి) ఆ తరువాత "ఏ సైనికుణ్ణయినా తన భార్య దగ్గరకు పోనీయకుండా నాల్గు నెలలకు మించి ఆపిఉంచకూడదు" అని ఉత్తర్వు జారీచేశారు.

(5) ఒకరోజు రాత్రివేళ గస్తీ తిరుగుతుంటే మదీనాపట్టణానికి మూడుమైళ్ళ దూరంలోని సరార్ అనే ప్రదేశంలో ఒక స్త్రీ ఏదో వండుతూ, ఆమె పక్కన ముగ్గురు పిల్లలు ఏడుస్తూ కన్పించారు. ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఆ స్త్రీ దగ్గరకు వెళ్ళి పరిస్థితి ఏమిటని అడిగారు. దానికామె సమాధానమిస్తూ 'రెండ్రోజుల నుంచి పిల్లలకు తిండి దొరక్కపోవడం వల్ల ఆకలి బాధతో ఏడుస్తున్నారు. వీళ్ళను ఓదార్చడానికి నేను ఖాళీకుండలో నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టాను" అని అన్నది.

ఈమాట వినగానే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మదీనా వెళ్ళి ప్రభుత్వధనాగారం నుంచి సత్తుపిండి, నెయ్యి, ఖర్జూరపండ్లు ఓ గోతంలో వేసుకొని భుజానికి ఎత్తుకున్నారు. సేవకుడు అస్లం ఆ గోతం పట్టుకొని "నేను తీసుకొస్తాను, నా తల మీద పెట్టండి" అన్నాడు. దానికి హజ్రత్ ఉమర్ (రజి) "వద్దు, నువ్వు ప్రళయదినాన నా బరువు మోయ లేవు" అని చెప్పి బయలుదేరారు. ఆ స్త్రీ దగ్గరకు చేరుకొని గోతంలోని వస్తువులు తీసి ఆమె ముందుంచారు. ఆమె పిండి తీసుకొని పిసికి కుండలో పోసి పొయ్యిమీద పెట్టింది. ఖలీఫాఉమర్ (రజి) పొయ్యిరాజేశారు. కాస్సేపటికి భోజనం తయారవగానే పిల్లలు ఆవురావురుమంటూ తిని సంతోషంతో గంతులేయసాగారు.

అప్పుడా స్త్రీ "దేవుడు నీకు దీని ప్రతిఫలం ప్రసాదించుగాక! నిజం చెప్పాలంటే విశ్వాసుల నాయకుడయ్యే యోగ్యత నీలో ఉంది, ఉమర్‌లో కాదు" అని అన్నది.

## ♦ పర్యటనల్లో ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి

ఖలీఫా సిరియా పర్యటన ముగించుకొని మదీనాకు తిరిగొస్తుంటే దారిలో ఓ ఇల్లు కన్పించింది. రాజధానికి చాలా దూరంలో ఉన్న ఆ ఇంటివారి పరిస్థితి ఎలావుందో తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. గుర్రం దిగి చూస్తే తలుపు దగ్గర ఓ ముసలమ్మ విచారంతో తల పట్టుకొని కూర్చున్నది. ఖలీఫా ఉమర్ (రజి) ఆమెకు సలాం చేసి బాగున్నావమ్మా! అనడిగారు. ఆ తరువాత ఆయన మాటల సందర్భంలో "ఉమర్ పరిస్థితి ఏమిటో తెలుసుకున్నావమ్మా!" అని అడిగారు.

దానికి ముసలమ్మ కస్సునలేచి "ఉమర్ (రజి)తో నాకేంటి పని? నా ఇబ్బందులు నాకున్నాయి. అయినా ఇప్పుడు ఉమర్ (రజి) సంగతి ఎందుకు? ఆయన సిరియా పర్యటన నుంచి తిరిగొస్తున్నాడని మాత్రం విన్నాను" అని అన్నది విసుక్కుంటూ.

"అమ్మా! ఉమర్ మాటెత్తితే ఎందుకు నీకింత కోపం?" అడిగారు ఉమర్ (రజి). దానికి ముసలమ్మ కనుబొమలు చిట్లిస్తూ "అదిగో మళ్ళీ ఉమర్ ప్రస్తావన తెస్తున్నావు! ఏం వెలగబెట్టాడేంటి ఆయన? నేనిక్కడ కడుపునిండా తిండి దొరక్క బతుకుబండి

భారంగా ఈడుస్తుంటే ఉమర్ ఎప్పుడైనా నా గురించి పట్టించుకున్నాడా? నా దారిద్ర్యం చూసి జాలితో నాకేదైనా సహాయం చేశాడా? ప్రళయదినాన ఉమర్‌కు, నాకు మధ్య తీర్పు జరుగుతుంది. అప్పుడు ఉమర్ దేవుని ముందు ఏం సమాధానం చెప్పుకుంటాడో చూస్తా" అని అన్నది స్వరం కాస్త పెంచి.

ఖలీఫా ఉమర్(రజి) ప్రళయదినం, తీర్పుమాటలు విని కంగారుపడుతూ "అమ్మా! నువ్వెప్పుడైనా నీ సంగతి ఉమర్ దగ్గరకు తీసికెళ్ళావా?" అని అడిగారు. దానికి ముసలమ్మ "భలేవాడివయ్యా! నేను నా గోడుగురించి ఉమర్ దగ్గరికెళ్ళి మొరపెట్టుకోవాలా? నేనుండే ఈ ప్రదేశం ఆయన రాజ్యపరిధిలో లేదా? ఆయన రాజ్యపరిధిలోని ఈ ఇంటి పరిస్థితి గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా ఆయనకు?" అని అన్నది మరింత ఉద్రేకంతో.

ఖలీఫా ఉమర్ (రజి) అనునయంగా మాట్లాడుతూ "అమ్మా! నగరానికి, జనసంచారానికి చాలా దూరాన ఈ నిర్జన ప్రదేశంలో నివసిస్తుంటే, నీ పరిస్థితి ఉమర్‌కు ఎలా తెలుస్తుంది? కాస్త నువ్వే చెప్పు. నీదుస్థితి తెలిసికూడా పట్టించుకోకపోతే ఉమర్ నిజంగా పాపాత్ముడే అని చెప్పవచ్చు" అని అన్నారు.

దానికి వృద్ధురాలు ఇలా అన్నది: "బాబూ! చూస్తే నువ్వు చాలా బుద్ధిమంతుడిలా ఉన్నావు. కాని ఇస్లామీయరాజ్యంలో ఉంటూ మరీఇంత అమాయకంగా మాట్లాడుతున్నావేంటీ? ఉమర్ ఇంత దూరంలో ఉన్న ప్రజల స్థితిగతులు తెలుసుకోలేకపోతే ఈ ప్రాంతాన్ని తన రాజ్యపరిధిలో ఎందుకు చేర్చుకున్నాడు? ఎక్కడదాక పరిస్థితులు తెలుసుకోగల్గుతాడో అక్కడదాకే ఆయన తన రాజ్యసరిహద్దులు పరిమితంచేసుకోవాలి."

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వృద్ధురాలి మాటలు విని తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఆయన కళ్ళ నుంచి అశ్రుధారలు కట్టలు తెంచుకున్నాయి. కంఠం రుద్ధమైపోయింది. కాస్సేపటికి ఎలాగో నిలదొక్కుకొని "అమ్మా! నువ్ చెబుతున్నది నిజమే. ఇక నేను వెళ్ళొస్తా" అంటూ ఉమర్ (రజి) గుర్రమెక్కి బయలుదేరారు.

## ♦ భావప్రకటనా స్వేచ్ఛ

హజ్రత్ ఉమర్ (రజి) ప్రజలకు షరీఅత్ పరిధిలో పూర్తి భావప్రకటనా స్వేచ్ఛ ఇచ్చారు. చివరికి ఖలీఫాగా తన వ్యక్తిత్వంపై తీవ్ర విమర్శలు చేసినా దాన్ని కూడా సహించేవారు. పైగా అలాంటి విమర్శలు చేసినవారిని ఆయన ప్రోత్సహించారు కూడా.

(1) ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) మసీదులో ప్రసంగవేదికపై నిల్చొని ఉపన్యసిస్తూ "ఒకవేళ నేను ప్రాపంచిక వ్యామోహం వైపుకు మొగ్గితే మీరేం చేస్తారు?" అని ప్రశ్నించారు. అప్పుడొక మనిషి లేచి వర నుంచి ఖడ్గం లాగి "అప్పుడు మేము ఖడ్గంతో మీ శిరస్సు ఖండిస్తాం" అన్నాడు నిర్భయంగా. దానికి ఖలీఫా ఉమర్ (రజి)



అతని వైపు ఉరిమి చూస్తూ "ఏమిటీ, (నా హోదా, స్థాయి తెలిసి కూడా) నా గురించేనా నువ్వీ మాటలు అంటున్నది?" అని అన్నారు. "ఔను, మీ గురించే నేనిలా మాట్లాడుతున్నాను" అన్నాడా వ్యక్తి అదురుబెదురు లేకుండా. అప్పుడు ఉమర్ (రజి) 'అల్‌హమ్దులిల్లాహ్' అంటూ దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ "నేను వక్రమార్గాన నడిస్తే నన్ను సరైన గాడిలో పెట్టేవారు కూడా మన జాతిలో ఉన్నారు" అని అన్నారు.

(2) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) యువకులకు వివాహం కావడం కష్టమైపోయేలా మహర్ (వధువుహక్కు) హద్దూపద్దూ లేకుండా పెరిగిపోతుండటంతో ఆయన 'మహర్'పై పరిమితి విధించాలని భావించారు. అంచేత ఓసారి ఆయన జుమాప్రసంగం చేస్తూ వివాహంలో నాల్గొందల దిర్హంలకు మించి మహర్ చెల్లించడానికి అనుమతి ఇవ్వకూడదని ప్రతిపాదన చేశారు. వెంటనే ఒక స్త్రీ లేచి "అలా ఆదేశించే అధికారం మీకు లేదు. ఖుర్‌ఆన్ మహర్‌గా ఎంత పెద్ద ధనరాసి ఇవ్వడానికైనా అనుమతిస్తుంటే దానికి హద్దు లేర్పరచేందుకు మధ్యలో మీరెవరు?" అని విమర్శించింది. ఖలీఫా ఉమర్ (రజి) తక్షణమే తన ప్రతిపాదన ఉపసంహరించుకున్నారు.

(3) మరొకసారి ఆయన్ని సల్మాన్‌ఫార్సి (రజి) నిండుసభలో పట్టుకొని "అందరికీ లెక్క ప్రకారం ఒక్కొక్క దుప్పటే వచ్చింది కదా, మరి మీరు ఇంత పెద్ద చొక్కా ఎలా కుట్టించుకున్నారు? దానికి రెండు దుప్పట్లయితేగాని సరిపోదు" అని అడిగారు. ఉమర్ ఫారూఖ్ (రజి) భారీకాయంగల ఎత్తయిన మనిషి. అందువల్ల ఆయన చొక్కా కుట్టించు కోవడానికి తన భాగానికి వచ్చిన దుప్పటి సరిపడనందున తన కుమారుడు అబ్దుల్లా (రజి) వాటాకు వచ్చిన దుప్పటి అడిగితీసుకొని చొక్కా కుట్టించుకున్నారు. ఆ విషయమే ఆయన తన కుమారుని చేత చెప్పించారు.

(4) ఖలీఫా ఉమర్ (రజి) ఓరోజు తన సహచరులు కొందరిని వెంటబెట్టుకొని ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఒక వృద్ధమహిళ ఆయన్ని కలసి "మీతో మాట్లాడాలి, కాస్త ఆగండి" అన్నది. ఉమర్ (రజి) ఆమెకు సలాంచేసి, ఆగి ఆమె మాటలు వినడానికి సిద్ధమయ్యారు. అప్పుడా స్త్రీ ఇలా అన్నది:

"ఓహో ఉమర్! ఎంత మారిపోయావు!! ఒకప్పుడు నువ్వు ఉకాజ్ బజారులో తిరుగుతుంటే చూశాను. అప్పుడు నిన్ను జనం ఉమైర్ అని పిలిచేవారు. నువ్వు చేతిలో కర్ర తీసుకొని మేకలు కాస్తుండేవాడివి. తర్వాత ఎంతోకాలం గడవలేదు, జనం నిన్ను ఉమర్ అని పిలవడం మొదలెట్టారు. ఆతర్వాత ఇప్పుడు నువ్వు అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) అని పిలవబడుతున్నావు. ప్రజల విషయంలో కాస్త దేవునికి భయపడుతూ మసలుకో. ఒక విషయం గుర్తుంచుకో, దేవుని శిక్షకు భయపడేవానికి సుదూరవ్యక్తి కూడా దగ్గరి బంధువులా మారిపోతాడు. చావుకు భయపడేవాడు తాను కాపాడుకోవాలనుకున్న వస్తువునే పోగొట్టుకునే ప్రమాదం ఉంది."

ఉమర్ (రజి) వెంట ఉన్న ఒకతను ఆ స్త్రీ వైఖరి సహించలేక “నువ్వు మన అమీరుల్ మోమినీన్ (ఖలీఫా) ముందు హద్దుమీరి మాట్లాడుతున్నావు” అన్నాడు.

ఉమర్ ఫారూఖ్ (రజి) అతడ్ని వారిస్తూ “ఆమెను చెప్పనివ్వు. అసలీమె ఎవరో నీకు తెలుసా? ఈమె ఫిర్యాదుమాటలు సప్తాకాశాలపై ప్రతిధ్వనించాయి. దైవసాక్షి! ఈమె ఇలా నన్ను రాత్రిపొద్దు పోయేదాకా నిలబెట్టినాసరే నేను నిలబడతాను. కాకపోతే నమాజ్ వేళలప్పుడు మాత్రం నా అశక్తతను తెలుపుకుంటాను” అని అన్నారు. ఈ మహిళే హజ్రత్ ఖౌలా-రజి. (ఖతాదా, బైహఖి)

## ♦ చట్టం అందరికీ సమానమే

(1) ఓసారి ఇరాఖ్‌లోని ఒక పట్టణంపై ముస్లింల సుదీర్ఘముట్టడి సాగింది. అలాంటి పరిస్థితిలో ఓరోజు ముస్లింసైన్యంలోని ఒక బానిససైనికుడు తాను పట్టణ వాసులకు రక్షణహామీ ఇస్తున్నట్లు ఒక కాగితంలో రాసి దాన్ని బాణం ద్వారా పట్నంలోకి విసురుతాడు. ఈ విషయం తెలియని ముస్లింయోధులు మరుసటి రోజు పట్టణంపై దాడిచేయడానికి సిద్ధమవుతారు. అప్పుడు పట్టణవాసులు రక్షణహామీ పత్రం తీసుకొని బయటికొచ్చి “ఒక ముస్లిం మాకు రక్షణహామీ పత్రం రాసిచ్చాడు కదా, ఇక మీరెందుకు మాపై దాడిచేయడానికి వచ్చారు?” అని అడుగుతారు.

ముస్లింసేనాపతి అబూమూసా అష్అరీ (రజి) రక్షణహామీ పత్రం చూసి, ఒక బానిసయోధుడు రాసిచ్చిన హామీపత్రానికి ఎంత విలువుంటుందో, అతని రక్షణ హామీని అమలుపరచవచ్చా లేదా అని ఆలోచనలో పడిపోయారు. ఆ విషయం గురించి ఖలీఫాకు లేఖరాస్తే దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ “బానిస ముస్లిం కూడా ఇతర ముస్లింల వంటివాడే. ఇతరముస్లింల బాధ్యతలకు ఎంత విలువుంటుందో బానిసముస్లిం బాధ్యతకు కూడా అంతే విలువ ఉంటుంది. కనుక ఆ బానిససైనికుడు ఇచ్చిన రక్షణహామీని అమలుపరచాలి” అని ఆజ్ఞాపించారు.

(2) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) దగ్గర చాల ధనం పోగయిఉందని ఆరోపణ రావడంతో ఖలీఫా ఉమర్ (రజి) “గవర్నర్ పదవికి పూర్వం మీదగ్గర ఇంత ధనం ఉండేదికాదు, ఇప్పుడీ ధనం మీకు ఎక్కడ్నుంచి వచ్చింద”ని వివరణ కోరుతూ ఆయనకు లేఖ రాశారు. దానికి అమ్ర్ బిన్ ఆస్ (రజి) సమాధానమిస్తూ “నా రాష్ట్రం సారవంతమైన ప్రాంతం. అంచేత నాదగ్గర నాఖర్చులు పోను చాలా డబ్బు మిగులుతుంది” అని అన్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ సమాధానంతో సంతృప్తిచెందక విచారణ కోసం ముహమ్మద్ బిన్ మస్లమాకు సర్వాధికారలిచ్చి ఈజిప్టు పంపారు. ముహమ్మద్ (రజి) ఈజిప్టు వెళ్ళి అమ్ర్ బిన్ ఆస్ (రజి) గత ఆస్తి విలువెంతో, దానిపై ఎంత ఆదాయం వస్తుందో లెక్కకట్టి అదంతా పోగా మిగిలిన ధనాన్ని జప్తు చేసుకొని



ప్రభుత్వ ధనాగారంలో జమచేశారు. ఎంతో విశాలమైన రాష్ట్రానికి గవర్నర్ అయిన అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇదంతా చూసి కూడా నోరు మెదపలేక పోయారు.

(3) ఓరోజు ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) బజారున నడచివెళ్తుంటే ఒకతను వచ్చి “ఉమర్! అధికారుల పని నిర్వహణ కోసం కొన్ని నిబంధనలు నిర్ణయించినంత మాత్రాన నీవు దైవశిక్ష నుండి తప్పించుకోగలవని భావిస్తున్నావా? దక్షిణ ఈజిప్టు పాలనాధికారి అయాజ్ బిన్ గనమ్ (ఖరీదైన) సన్నని బట్టలు ధరిస్తున్నాడు; ఇంటి ద్వారం దగ్గర ద్వారపాలకుడ్ని పెట్టుకున్నాడు”అని అన్నాడు.

ఉమర్‌ఫారూఖ్ (రజి) ఈమాట విన్న తర్వాత ముహమ్మద్ బిన్ మస్లమాను పిలిచి “నీవు తక్షణమే ఈజిప్టుకు వెళ్ళి అయాజ్‌ని ఉన్నపళంగా పిలుచుకురా” అని ఆదేశించారు. ఈఆజ్ఞ ప్రకారం ముహమ్మద్ బిన్ మస్లమా ఈజిప్టుకు వెళ్ళిచూస్తే అయాజ్ సన్నటిబట్టలు ధరించడం, ఆయన ఇంటిముందు ద్వారపాలకుడు ఉండటం కన్పించాయి. ఆతర్వాత ఆయన అయాజ్‌ని మదీనాకు పిలుచుకొచ్చారు.

అప్పుడు ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) అయాజ్ వంటిమీది ఖరీదైన సన్న బట్టలు తీసేసి ముతకబట్టలు ధరింపజేశారు. తరువాత ఓ మేకలమంద తెప్పించి “ఈ మేకలమందను అడవికి తోలుకెళ్ళి కాస్తుండు” అని ఆదేశించారు.

పాపం అయాజ్ పరిస్థితి మింగలేక, కక్కలేక అన్నట్లయింది. ఆ అవమానం భరించలేక “ఇంతకంటే చావడం మంచిది” అన్నారు గొణుక్కుంటూ.

ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన వాలకం చూసి “మేకలు కాయడానికి ఎందుకు సిగ్గుపడుతున్నావు? మేకలు కాస్తుండటం వల్లనే కదా మీనాన్నకు గనమ్ అనే పేరు పడింది” అని అన్నారు. చివరికి అయాజ్ బిన్ గనమ్ పశ్చాత్తాపంతో దైవాన్ని క్షమాపణ వేడుకొని ఆరోజు నుంచి జీవితాంతం తన విధుల్ని సక్రమంగా నిర్వహించారు.

(4) బస్రా గవర్నర్ ముగీరా బిన్ షాబా (రజి)కు ఒక స్త్రీతో అక్రమసంబంధం ఏర్పడిందని ఖలీఫా దర్బారులో ఆరోపణ వచ్చింది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వెంటనే అబూమూసా అష్అరి (రజి)ని పిలిపించి “బస్రాలో షైతాన్ నివాసం ఏర్పరచుకున్నాడు. మీరక్కడికి వెళ్ళి పరిస్థితి పరిశీలించి సాక్షులతోసహా ముగీరాను మదీనా పంపండి” అని ఆదేశించారు.

ఈ ఆజ్ఞ ప్రకారం ముగీరా (రజి) మదీనా పంపబడతారు. న్యాయస్థానంలో విచారణ ప్రారంభమవుతుంది. కాని నలుగురు సాక్షుల్లో ఒక సాక్షి తానా స్త్రీని సరిగ్గా చూడలేదని చెప్పడంతో నేరం రుజువుకాలేదు. దాంతో ఉమర్ (రజి) ముగీరా (రజి)ను విడుదల చేస్తారు. విడుదలచేస్తూ “సాక్ష్యం పూర్తయితే (నేరారోపణ నిజమని తేల్తే) నేను మీకు శిలాశిక్ష విధించి హతమార్చేవాడ్ని” అని అన్నారు.

ముగీరా (రజి) ప్రవక్త ముఖ్యఅనుచరుల్లో ఒకరు. రాజకీయంగా, యుద్ధ పరంగా ఇస్లాంకు గొప్ప సేవలు అందజేశారు. ఆనాటి అరేబియాలో నలుగురు ప్రముఖ యుద్ధ వ్యూహకర్తలో ఈయన ఒకరు. ఈవిధంగా ముగీరా గొప్ప ప్రజానాయకునిగా, యుద్ధ తాంత్రికునిగా, బస్రా రాష్ట్రగవర్నర్‌గా పేరుగాంచారు. కాని అవేవీ ఇస్లామీయ న్యాయ స్థానంలో ఆయనకు ఏమాత్రం ఉపయోగపడలేదు.

(5) ఈజిప్టుగవర్నర్ (అమ్ర్) కొడుకు అబ్దుల్లా ఓసారి ఒక వ్యక్తిని అకారణంగా కొట్టాడు. ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ (రజి) ఆ వ్యక్తి చేత అబ్దుల్లాను అదేవిధంగా కొట్టించాలని ఆదేశించారు. దాని ప్రకారం ఆ వ్యక్తి అబ్దుల్లాపై కొరడా ఝుళిపించి ప్రతీకారం తీర్చుకున్నాడు. పాపం గవర్నర్‌గారు హృదయాన్ని కలచివేసే ఆ దృశ్యాన్ని బిక్కమొగం వేసుకొని చూడటం తప్ప ఏమీ చేయలేకపోయారు.

(6) ఒకసారి ఖలీఫా (రజి) హజ్ సందర్భంలో గవర్నర్‌లందర్నీ మక్కా పిలిపించి ఇతర హాజీలతో పాటు సమావేశపరిచారు. అప్పుడాయన ప్రజలతో "ఈ గవర్నర్ల ప్రవర్తన పట్ల మీకేదైనా అభ్యంతరాలుంటే నాముందు నిస్సంకోచంగా ఫిర్యాదు చేయవచ్చు" అని అన్నారు. అప్పుడా సమావేశం మొత్తంలో కేవలం ఒక్క మనిషి లేచి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)పై ఫిర్యాదుచేస్తూ "ఈయనగారు నన్ను అన్యాయంగా వంద కొరడాదెబ్బలు కొట్టించారు" అని అన్నాడు. ఉమర్‌ఫారూఖ్ (రజి) ఈమాట విని "అయితే ఇతని దగ్గరకు వచ్చి ఆ దెబ్బలకు బదులుతీర్చుకో" అని అన్నారు.

ఖలీఫా ఆదేశం వినగానే గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) తన నిరసన వ్యక్తపరుస్తూ "గవర్నర్‌ల విషయంలో దయచేసి ఈ పద్ధతి అవలంబించకండి" అని అన్నారు. దానికి ఉమర్‌ఫారూఖ్ (రజి) "స్వయంగా దైవప్రవక్త (స) తన విషయంలోనూ ఇతరులకు బదులుతీర్చుకునే అవకాశమిచ్చినట్లు నేను చూశాను" అని చెప్పి, దెబ్బలు తిన్న ఆ వ్యక్తిని ఉద్దేశించి 'బదులుతీర్చుకో' అని మరొకసారి ఆదేశించారు. చివరికి అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఆ పీడితునికి ఒక దెబ్బకు రెండు వరహాలు చొప్పున మొత్తం రెండొందలు వరహాలు జరిమానా చెల్లించి తన వీపును కాపాడుకోవలసి వచ్చింది.

(7) ఖలీఫా కుమారుడు అబూసెహ్మా ఈజిప్టులో ఒకసారి (సహవాస దోషంతో) సారా తాగి సాధారణ నేరస్థుడిలా పట్టుబట్టారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) అతనికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టాలని ఈజిప్టు గవర్నర్‌ని ఆదేశించారు. కాని గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) నేరస్థుడు ఖలీఫా కుమారరత్నం అయినందున ఇతర నేరస్థులకు మాదిరి కఠినంగా కాకుండా కొరడా అంటీఅంటనట్లు తేలిగ్గా కొట్టించారు.

ఈ సంగతి తెలిసి ఉమర్ ఫారూఖ్ (రజి) వెంటనే అబూసెహ్మాను మదీనా పంపమని ఈజిప్టు గవర్నర్‌ను ఆదేశించారు. అబూసెహ్మా (రజి) మదీనా వచ్చిన తరువాత



ఉమర్ ఫారూఖ్ (రజి) కన్నకొడుకని కూడా కనికరించకుండా ఆయన్ని ఇతర నేరస్థులకు కొట్టినదాని కన్నా గట్టిగాకొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక పాపం ఆ యువకుడు ప్రాణం వదిలాడు. తర్వాత ఉమర్ (రజి) హృదయంలో సహజసిద్ధమైన పితృవాత్సల్యం అప్రయత్నంగా పెల్లుబికింది. అది కళ్ళ నుండి అశ్రుబిందువుల రూపంలో జాలువారింది.

## ♦ జిమ్మీల పట్ల సత్ప్రవర్తన

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు అనేక దేశాలు జయించారు. కాని ఏ పరాజిత ప్రాంతంలోనూ ముస్లిమేతరుల ఆరాధనాలయాలను పడ్డగొట్టడం జరగలేదని, వాటిని యథాతథంగా ఉంచడం జరిగిందని ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మాలై) తన గ్రంథం 'కితాబుల్‌ఖిరాజ్'లో పేర్కొన్నారు.

(1) ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చే ప్రాంతాలలోని ముస్లిమేతరుల నుండి ఇస్లామీయ ప్రభుత్వం జిజ్యా (రక్షణరుసుం) వసూలుచేస్తుంది. దాంతోపాటు పంట పొలాలు, తోటలలో వచ్చే రాబడి నుండి శిస్తు వసూలుచేస్తుంది. ముస్లింల నుండి జకాత్ (పేదల ఆర్థికహక్కు)తో పాటు పొలాలు, తోటలలో వచ్చే రాబడి నుండి 'ఉష్ర్' వసూలు చేస్తుంది. ముస్లింల నుండి వసూలుచేసే ఈ జకాత్, ఉష్ర్‌ల రాబడి జిమ్మీల నుండి వసూలుచేసే జిజ్యా, శిస్తుల రాబడి కంటే అధికంగా ఉంటుంది. వృద్ధాప్యం, ఇతర బలహీనతల కారణంగా ఎలాంటి సంపాదన లేనివారు ముస్లిములైనా, ముస్లిమేతరులైనా అలాంటివారికి ప్రభుత్వ ధనాగారం నుండి పింఛన్ లభిస్తుంది.

జిమ్మీలకు ఇస్లామీయ ప్రభుత్వం రక్షణ కల్పించలేని పరిస్థితులు ఎదురైతే రక్షణ రుసుంగా వసూలుచేసిన జిజ్యా పైకాన్ని వారికి వాపసు ఇవ్వడం కూడా జరిగేది. ఎర్మూక్‌యుద్ధ సమయంలో ముస్లింలు హమస్ పట్టణం వదలి వెళ్తున్నపుడు హమస్ వాసులైన యూదులకు, క్రైస్తవులకు జిజ్యాపైకం వాపసుచేశారు.

అప్పుడు హమస్‌వాసులు ముస్లింల సత్ప్రవర్తన పట్ల ఎంతో ప్రభావితులయ్యారు. యూదులు తౌరాత్ గ్రంథం చేతిలోకి తీసుకొని "మేము జీవించి ఉన్నంతవరకు రోమన్లు ఈ పట్టణంలోకి అడుగుపెట్టలేరు" అన్నారు. క్రైస్తవులు కంటతడిపెడుతూ "దైవసాక్షిగా చెబుతున్నాం. రోమన్లకంటే మీరే మాకెక్కువ ప్రియమైనవాళ్ళు" అని అన్నారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో జిమ్మీలలో ఎవరైనా ఒక సంవత్సరం పాటు ముస్లింలతో కలసి శత్రుసేనలతో యుద్ధంచేస్తే వారి నుండి జిజ్యా వసూలు చేయడం జరిగేదికాదు. ఒకవేళ జిమ్మీలు ముస్లింలలో అరాచకం, దౌర్జన్యాలకు పాల్పడితే వారిని వేరే ప్రాంతాలకు బహిష్కరించడం జరిగేది. అయితే అప్పుడు వారి స్థిరాస్తులకు ప్రభుత్వం డబ్బు చెల్లించి మరీ వారిని వేరే ప్రాంతాలకు పంపివేసేది.

(2) హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఒకసారి ఓ పెద్దమొత్తం జిజ్యాధనం వచ్చింది. ఉమర్ ఫారూఖ్ (రజి) అంత పెద్ద ధనరాసి చూసి వసూలు చేసితెచ్చిన వారితో "మీరు ప్రజలను నాశనం చేశారు" అన్నారు. దానికి జిజ్యా వసూలుచేసి తెచ్చినవారు "దైవసాక్షి! మేము జిమ్మీల పట్ల చాలా మృదువుగా వ్యవహరించి వసూలుచేశాం" అని చెప్పారు. ఉమర్ఫారూఖ్ (రజి) "వారిని కొట్టకుండా, నిర్బంధించకుండా వసూలుచేశారా?" అని అడిగారు. దానికి వారు "కొట్టకుండా, నిర్బంధించకుండానే వసూలుచేశాం" అన్నారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) దాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమచేయడానికి అనుమతించారు.

(3) ఖలీఫా ఉమర్ (రజి) దగ్గరికి ఇరాఖ్ నుండి రెవెన్యూపైకం వచ్చినపుడు కూఫా నుండి పదిమంది, బస్రా నుండి పదిమంది ఉన్నతాధికారులు రాజధానికి వచ్చేవారు. వారు ఖలీఫా ముందు నాలుగుసార్లు దేవుని పేరుతో ప్రమాణంచేస్తూ "మేము ఏ ముస్లింపై, ఏ జిమ్మీ (ముస్లిమేతరుని)పై దౌర్జన్యంచేసి ఈ ధనం వసూలు చేయలేదు" అని చెప్పేవారు. (ఖిలాఫత్ ఓములూకియత్-కితాబుల్‌ఖిరాజ్)

(4) ఉమర్ (రజి) పాలనలో బకర్ బిన్ వాయిల్ తెగకు చెందిన ఒక ముస్లిం హైరా(ప్రాంతాని)కి చెందిన ఒక జిమ్మీని చంపాడు. అప్పుడు ఉమర్ఫారూఖ్ (రజి) హంతకుడ్ని హతుని వారసులకు అప్పగించమని ఆదేశించారు. దాని ప్రకారం హంతకుడ్ని హతుని వారసులకు అప్పగిస్తే వారతడ్ని హతమార్చారు. (బుర్హాన్)

(5) ఖలీఫా ఉమర్ (రజి) జెరూసలేం వాసులకు రాసిచ్చిన ఒడంబడిక పత్రంలో విషయాలు ఇలా ఉన్నాయి: "వారికి, వారి ధనప్రాణాలకు, చర్చీలకు-సిలువలకు, వారి ఆరోగ్యవంతులకు-వ్యాధిగ్రస్తులకు రక్షణహామీ ఉంది. ఈ రక్షణహామీ ఏలియా సముదాయానికంతటికీ ఉంది. వారి చర్చీలను ముస్లింల ఇండ్లుగా మార్చేయడం లేదా ధ్వంసంచేయడం, వారి ఆవరణలను-భవనాలను తగ్గించడం, వారి సిలువలకు, ఆస్తిపాస్తులకు నష్టం కలిగించడం, మతవ్యవహారంలో వారిని బలవంతం చేయడం, వారికి ఏవిధమైన బాధాపెట్టడం జరగదని హామీ ఇస్తున్నాం." (కితాబుల్‌ఖిరాజ్)

(6) ఒకరోజు ఒక వృద్ధుడు బిక్షం అడుక్కుంటుంటే ఖలీఫా ఉమర్ (రజి) చూసి "ఎవరు నాయనా నువ్వు?" అనడిగారు. దానికతను "నేను యూదుడ్ని. జిజ్యా చెల్లించడానికి, తిండి-బట్టల కోసం బిక్షం అడుక్కుంటున్నాను" అన్నాడు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "తాతా! మేము నీకు న్యాయం చేకూర్చలేదు. యుక్తవయసులో ఉన్నపుడు మేము నీనుండి జిజ్యా వసూలుచేశాం. కాని వృద్ధాప్యంలో నిన్నీ దుస్థితిలో వదిలేశాం"అని చెప్పి అతడ్ని తన ఇంటికి పిలుచుకువెళ్ళారు. తన చేతులతో అతనికి అన్నం తినిపించారు. తర్వాత "ఈవృద్ధుడు, ఇలాంటి వృద్ధులందరి కనీసవసరాల



కోసం తక్షణమే పింఛన్లు నిర్ణయించండి" అని కోశాధికారికి ఉత్తర్వు జారీచేశారు.

(7) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) తన అభిమతానికి వ్యతిరేకంగా తన ఇంటిని ఆక్రమించుకొని మస్జిద్‌లో కలిపేశాడని ఈజిప్టు నుంచి ఒ స్త్రీ ఖలీఫా ఉమర్ (రజి)కు ఫిర్యాదు చేసింది. ఖలీఫా ఉమర్ (రజి) వెంటనే ఈ ఆరోపణ గురించి సంజాయిషీ ఇవ్వాలని ఈజిప్టు గవర్నర్‌కు ఉత్తర్వు జారీచేశారు. దానికి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇలా సమాధానమిచ్చారు:

"(కొత్తగా ఇస్లాం స్వీకరించి ముస్లిములైపోయిన కారణంగా) భక్తుల సంఖ్య పెరిగిపోవడం వల్ల మస్జిద్‌ని విస్తరించవలసి వచ్చింది. మస్జిద్ విస్తరణ కోసం మస్జిద్‌కు ఆనుకొనివున్న ఆ స్త్రీ ఇంటిని స్వాధీనం చేసుకొని మస్జిద్‌లో కలిపేయవలసి వచ్చింరీ. ఇంటిధర మార్కెట్‌ధర కంటే ఎక్కువ చెల్లించడానికి మేము ముందుకొచ్చినా ఆమె అంగీకరించలేదు. అంచేత మేము విధిలేక ఆమె ఇంటిని బలవంతంగా పడగొట్టి మస్జిద్‌లో కలిపేయవలసి వచ్చింది. ఇంటి ధరను ప్రభుత్వధనాగారంలో జమచేశాము. ఆమె ఎప్పుడు కావాలంటే అప్పుడా పైకం ఆమె మా దగ్గర్నుండి తీసుకోవచ్చు."

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇచ్చిన ఈ వివరణ సమంజసంగానే ఉంది. ఈనాటి చట్టాలు కూడా అందుకు అనుమతిస్తున్నాయి. ప్రజాహిత కార్యాల కోసం, ట్రాఫిక్ సౌలభ్యాల కోసం ఏవైనా ఇండ్లు, దుకాణాలు అడ్డుగా ఉంటే అలాంటి కట్టడాల యజమానులకు సముచిత ధర చెల్లించి వాటిని స్వాధీనం చేసుకొని పడగొట్టేందుకు ఈనాటి చట్టాలు అనుమతిస్తున్నాయి.

ఉమర్ఫారూఖ్ (రజి) అందుకు అంగీకరించలేదు. ఆ స్త్రీ ఇంటిని స్వాధీనంచేసుకొని మస్జిద్‌విస్తరణలో భాగంగా కట్టిన నూతనభవనాన్ని వెంటనే పడగొట్టాలని, ఆమె ఇంటిని పూర్వమున్న మాదిరిగా పునర్నిర్మించి ఆమెకు తిరిగి స్వాధీనంచేయాలని ఆదేశించారు. ఈ ఆదేశంతో ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) మసీదు కొత్తకట్టడాన్ని పడగొట్టి ఆ స్థలంలో పూర్వమున్న మాదిరిగా ఇల్లు కట్టించి ఆమెకు స్వాధీనంచేశారు.

## ♦ మూఢనమ్మకాల ఖండన

(1) ఉమర్ ఫారూఖ్ (రజి) బహుదైవారాధన (షిర్క్)కు సంబంధించిన ఛాయను కూడా సహించేవారు కాదు. దైవప్రవక్త (స) ఓసారి మక్కా శివార్లలోని హుదైబియా ప్రాంతంలో ఒక చెట్టు క్రింద నిల్చొని అనుచరుల్ని ధర్మపోరాటానికి ప్రేరేపిస్తూ వారి చేత శపథం చేయించారు. ప్రవక్తకాలంలో ఆ చెట్టుకు అంతకుమించి మరెలాంటి ప్రాముఖ్యం లేదు. కాని ఆతర్వాత ఉమర్ (రజి) పాలనాకాలంలో ప్రజలు దాన్ని పవిత్రమైన శుభవృక్షంగా భావించి సందర్శనం కోసం సుదూరప్రాంతాల నుంచి కూడా రావడం ప్రారంభించారు. ఉమర్ (రజి) ఈసంగతి విని ఎంతోఆందోళన వెలిబుచ్చారు.

భవిష్యత్తులో ఈ వ్యాధి ముదిరి 'షిర్క్'కు దారి తీయవచ్చని భావించి, వెంటనే ఆయన కొందరు మనుషుల్ని పంపి ఆ చెట్టును కూకటివేళ్ళతో సహా నరికివేయించారు.

(2) మరొకసారి హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) కాబాయాత్ర చేసి తోటియాత్రికులతో కలసి మదీనా తిరిగి వస్తుంటే దారిలో ఒక మసీదు వచ్చింది. దాన్ని చూడగానే జనం ఎంతో ఉత్సాహంతో ఆ మసీదులో నమాజ్ చేయడానికి అటుగా పరుగెత్తారు. ఆ మసీదులో దైవప్రవక్త (స) ఓసారి నమాజ్ చేశారు. అంచేత ప్రజలు దానికి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వసాగారు. అయితే ఉమర్ (రజి)కు ఈ వైఖరి కూడా నచ్చలేదు. ఆయన వారితో "గ్రంథప్రజలు తమ ప్రవక్తల సమాధుల్ని, వారి స్మారకచిహ్నాలను ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. కేవలం ఈ కారణంగానే వారు నాశనమయ్యారు. మీరు కూడా ఇలాంటి అవాంఛనీయ పనులకు పాల్పడి చేజేతులా నాశనం కొని తెచ్చుకోకండి" అని హెచ్చరించారు.

(3) పూర్వకాలంలో ఇస్లాం ప్రవేశించక ముందు ఈజిప్టు వాసులు (ఖబ్తీలు) నైలు నదిని దేవతగా నమ్మేవారు. వారు ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక నెలలో పన్నెండవ తేదీన ఒక కన్యను వధువుగా ముస్తాబు చేసి నైలునదిలో పడవేసేవారు. ఇలా ప్రతి సంవత్సరం ఒక కన్యను బలివ్వకపోతే నైలునది ఆగ్రహించి నీటిని ఇవ్వడం మానేస్తుందని వారి నమ్మకం.

ఈజిప్టు ముస్లింల అధీనంలోకి వచ్చిన తరువాత ఆ ప్రత్యేక నెల రాగానే ఈజిప్టు వాసులు అక్కడి రాష్ట్ర గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) దగ్గరికి వచ్చి నైలునదికి కన్యను బలివ్వడానికి అనుమతించమని అభ్యర్థించారు. గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) వారికి నచ్చజెబుతూ, ఇవన్నీ వట్టిమాటలని, ఇలా ఒక మనిషి ప్రాణాలు తీయడం ఇస్లాం అనుమతించదని చెప్పారు. ఈమాట విని ప్రజలు తిరిగి వెళ్ళిపోయారు.

కాని యాదృచ్ఛికంగా ఆ సంవత్సరం నైలు నది ఎండిపోయింది. నీరు రాలేదు. దాంతో ఆ ఏడు పొలాలు ఎండిపోయాయి. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. క్షామం వల్ల వారు స్వదేశం వదలిపోసాగారు. గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) జరిగినదంతా ఖలీఫా ఉమర్ (రజి)కు తెలియజేశారు. దానికి ఆయన ఇలా జవాబిచ్చారు: 'మీరు ఖబ్తీలతో నిజం పలికారు. నేనొక ఉత్తరం పంపుతున్నాను. మీరు దానిని నైలునదిలో పడేయండి.' ఆ ఉత్తరంలో ఇలా వ్రాసి ఉంది:

"దేవుని దాసుడైన విశ్వాసుల నాయకుడు (అమీరుల్ మోమినీన్) నైలునదికి వ్రాయడం: నైలునదీ! నీ ఇష్టప్రకారం పారుతుంటే పారడం మానెయ్యవచ్చు. అలా కాకుండా దేవుని పట్ల విధేయత కలిగివుండి ఆయన ఆజ్ఞ ప్రకారం పారుతుంటే వెంటనే పారడం ప్రారంభించు."



ఈ ఉత్తరం నైలునదిలో పడవేయబడింది. దైవాజ్ఞ వల్ల మళ్ళీ నైలునది ప్రవహించడం ప్రారంభమయింది. మునుపెన్నడూ లేని విధంగా అందులో నీళ్ళు వచ్చాయి. ఆ తరువాత నైలు నది మరెప్పుడూ ఎండిపోలేదు.

## ♦ ఆర్థిక పరిస్థితి, నిరాడంబరత

(1) ఖలీఫా ఉమర్ (రజి) ఓ ప్రసంగంలో తనహోదాను గురించి ఇలా అన్నారు: "మీ (ప్రజా)ధనంతో నా సంబంధం ఒక అనాథధనంతో అతని సంరక్షకునికున్న సంబంధం వంటిదే. నేను స్థితిపరుడినైతే ఇందులో నుంచి చిల్లిగవ్వ కూడా తీసుకోను; పేదవాడినైతే నా సేవకు లభించేటంత ప్రతిఫలమే తీసుకుంటాను. మీహక్కులు కొన్ని నాపై ఉన్నాయి. వాటిని గురించి మీరు నన్ను డిమాండ్ చేయవచ్చు. మీ ఆదాయం నుండి, 'ఫై'(సమరసొత్తు) రూపంలో దైవం మీకిచ్చిన సంపద నుండి (ప్రభుత్వ) రెవెన్యూ ఖాతాకు రావలసిన దానికంటే ఎక్కువ పన్నులు నేను వసూలుచేయను. ధర్మసమ్మతమైనంత పన్ను మాత్రమే రాబట్టడం నాబాధ్యత. నా చేతికొచ్చే ధనాన్ని నేను ధర్మసమ్మతంగాతప్ప మరేవిధంగాను ఖర్చుచేయకుండా మీరు నన్ను అదుపులో ఉంచవచ్చు. ఇది నామీద మీకున్న హక్కు." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

(2) దైవప్రవక్త (స) హితోక్తి : "మన ప్రభుత్వంలో ఏదైనా పదవి చేపట్టిన మనిషికి వివాహం కాకపోతే అతను (ప్రభుత్వ సొమ్ముతో) వివాహం చేసుకోవచ్చు; సేవకుడు లేకపోతే ఒక సేవకుడ్ని పెట్టుకోవచ్చు; ఇల్లు లేకపోతే ఒక ఇంటిని తీసుకోవచ్చు; వాహనం లేకపోతే ఒక వాహనం తీసుకోవచ్చు. అంతకుమించి మరేదైనా తీసుకుంటే అలాంటి వాడు నమ్మకద్రోహి లేక దొంగగా పరిగణించబడతాడు."

దీన్ని గురించి ఉమర్ (రజి) మాట్లాడుతూ "నా కోసం దేవుని ధనసంపద (ప్రభుత్వధనాగారం) నుండి వేసవికాలపు బట్టలు ఒకజత, శీతాకాలపు బట్టలు ఒకజత, నా భార్యాపిల్లల కోసం ఖురైషీయుల్లో ఒక సగటుమనిషికి సరిపడ ఉపాధి మాత్రమే తీసుకుంటాను. అంతకుమించి మరేమీ తీసుకోను" అని అన్నారు.

ఆయన ఓసారి ప్రసంగిస్తూ "మీ(ప్రజా)ధనంతో నా సంబంధం అనాథసొమ్ముతో అతని సంరక్షకుడికున్న సంబంధంలాంటిదే. నేను నిరాధారుడ్ని కాకపోతే (కనీసావసరాలు తీర్చుకోగలిగే వాణ్ణయితే) అందులోనుంచి ఏమీ తీసుకోను. నిరాధారుణ్ణయితే సముచితరీతిలో మాత్రమే కొంత తీసుకుంటాను" అని అన్నారు.

(3) ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా బాధ్యత స్వీకరించిన ప్రారంభంలో చాలాకాలం దాకా తన దగ్గరున్న సంపదతోనే ఎలాగో బ్రతుకుబండి లాగుతుండేవారు. దానివల్ల ఆయన ఆర్థికపరిస్థితి క్రమంగా క్షీణిస్తూ చివరికి పస్తులుండవలసివచ్చింది. అంచేత ఆయన ఓరోజు తన ముఖ్యఅనుచరుల్ని పిలిచి "నేను

పాలనావ్యవహారాల్లో లీనమైపోవడం వల్ల ఉపాధి గురించి పట్టించుకోలేక పోతున్నాను. నా ఉపాధి కోసం ఏదైనా ఏర్పాటుచేయండి'' అన్నారు. హజ్రత్ అలి (రజి) సలహాతో ఆయనకు రోజుకు రెండుపూటల సాధారణ భోజనం, ఏడాదికి రెండుజతల బట్టలకు సరిపడ జీతం నిర్ణయించారు. తరువాత కొంతకాలానికి అందరితో పాటు ఖలీఫా (రజి)కు కూడా ఏడాదికి ఐదువేల దిర్హంల చొప్పన ఉపకారవేతనం నిర్ణయించడం జరిగింది.

(4) ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈరాన్ నుండి ఉత్తరాఫ్రికా వరకూ ఇస్లాం విజయపతాకాలు రెపరెపలాడాయి. సమరసొత్తు, జకాత్ (పేదల ఆర్థికహక్కు), జిజ్యా (రక్షణరుసుం) రూపాల్లో ప్రతిఏడూ కోట్లాది దిర్హమ్‌లు ప్రభుత్వ ధనాగారంలోకి చేరుతుండేవి. అయినప్పటికీ ఆ మహాసామ్రాజ్యాన్ని ఏలే ఖలీఫా పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో చూడండి:

ఆయన వంటిపై పదేసి అతుకులతో కూడిన ముతకబట్టలు, కాళ్ళకు చిరిగిన చెప్పులు, తలమీద చింపిరి తలపాగ మాత్రమే ఉండేవి. ఆ బట్టలు కూడా ఒక జతే ఉండేవి. వాటినే మాటిమాటికి ఉతికిఆరేసుకొని తొడుక్కునేవారు. హజ్రత్ ఉమర్ (రజి) చనిపోయేనాటికి ఆయన ఆస్తిలో ఒక ఇల్లు, అప్పులు మాత్రమే మిగిలాయి. అంచేత ఇల్లు అమ్మి అప్పులు తీర్చాలని వారసులకు చెప్పి ఇహలోకం వీడిపోయారు. దాని ప్రకారం ఆయన వారసులు ఇంటిని అమ్మి అప్పు తీర్చవలసివచ్చింది.

## ♦ బాధ్యతాభావం, దైవభీతి

(1) ఖలీఫా ఉమర్ (రజి) పరిపాలనా వ్యవహారాలను ఎంత బాధ్యతాయుతంగా నిర్వహించేవారంటే, తన రాజ్యంలో ఏ ప్రాణికి ఏ నష్టం జరిగినా దానికి దేవుని ముందు తాను సమాధానం చెప్పుకోవలసి వస్తుందేమోనని ఎంతో భయపడుతుండేవారు. చివరికి "ఫిరాత్ నదీతీరాన ఒక మేకపిల్ల చచ్చిపోయినా దాన్ని గురించి దేవుడు నన్ను ప్రశ్నిస్తాడేమోనని నేను భయపడుతున్నా"నని చెప్పేవారు ఆయన. ఒకరోజు ఆయన ఒంటెకు గాయమయితే ఆ గాయాన్ని కడుగుతూ "ప్రళయదినాన ఈ ఒంటె గాయం గురించి కూడా దేవుడు నన్ను ప్రశ్నిస్తాడేమోనని నాకు భయంగా ఉంది" అని అన్నారు.

(2) ఒక రోజు అహ్నఫ్ బిన్ ఖైస్ (రజి) ఖలీఫాను కలుసుకోవడానికి వస్తే ఆయన కంగారుపడ్తూ అటూఇటూ పరుగెత్తుతూ కన్పించారు. ఆయన అహ్నఫ్ (రజి)ని చూడగానే "ప్రభుత్వధనాగారానికి చెందిన ఒక ఒంటె ఎక్కడికో పారిపోయింది. రండి మీరు కూడా, ఇద్దరం కలసి వెతుకుదాం. ఒక ఒంటెలో ఎంతమంది పేదల హక్కుందో మీకు తెలుసు కదా!" అని అన్నారు. అహ్నఫ్ (రజి) ఈమాట విని "దాని కోసం మీకెందుకండి ఈశ్రమ. ఎవరైనా బానిసను ఆజ్ఞాపిస్తే అతనే వెతికి తెస్తాడుకదా?" అని అన్నారు. దానికి ఖలీఫా ఉమర్ (రజి) "నాకంటే పెద్ద బానిస ఇంకెవరుంటారు?" అన్నారు.



(3) ఒకసారి ఖలీఫా ఉమర్ (రజి) సల్మాన్ ఫార్సీ (రజి)తో మాట్లాడుతూ "ఇంతకూ నేను ఖలీఫానా లేక రాజునా?" అని అడిగారు. దానికి సల్మాన్ (రజి) సమాధానమిస్తూ "మీరు గనక ప్రజల భూముల నుండి అధర్మంగా ఒక్క దిర్హం కూడా వసూలుచేస్తే, దాన్ని అధర్మంగా ఖర్చుచేస్తే మీరు రాజు అవుతారు. అలా చేయకపోతే మీరు ఖలీఫాగా ఉంటారు" అని అన్నారు. వేరొక సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) ఒక సమావేశంలో మాట్లాడుతూ "నేను ఖలీఫానో రాజునో ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నాను. ఒకవేళ నేను రాజునై పోతే, ఇది చాలా తీవ్రమైన విషయమవుతుంది" అని అన్నారు. అప్పుడా సమావేశంలో ఒకతను లేచి "విశ్వాసులనాయకా! ఈ రెండిటిలో చాల తేడా ఉంది. ఖలీఫా (ప్రభుత్వధనాగారం నుంచి) ధర్మసమ్మతంగా తప్ప ఏదీ తీసుకోడు; ధర్మసమ్మతంగా తప్ప ఏదీ ఖర్చుపెట్టడు. దేవుని దయవల్ల మీరు అలాంటివారే. ఇక రాజు విషయానికి వస్తే, అతను ప్రజలపై దౌర్జన్యం చేస్తాడు. ఒకరి నుండి హద్దుమీరినంత వసూలుచేస్తాడు; మరొకరికి హద్దుమీరినంత ఇస్తాడు" అని అన్నాడు.

(4) ఉమర్ (రజి)కు ఏదైనా విషయంలో ఎవరిమీదైనా కోపం వస్తే అది చాలా తీవ్రంగా ఉంటుంది. కాని ఆ సమయంలో ఎవరైనా ఆయన ముందు దేవుని ప్రస్తావన తెస్తే లేదా ఖుర్‌ఆన్ సూక్తి పఠిస్తే ఆ కోపం చప్పున చల్లారిపోతుంది. ఒకసారి బిలాల్ (రజి) అస్లం (రజి)తో మాట్లాడుతూ "ఉమర్ (రజి) ఎలాంటి మనిషని అడిగారు. దానికి అస్లం (రజి) సమాధానమిస్తూ "ఉమర్ (రజి) మానవులందరిలో కెల్లా ఎంతో ఉత్తముడనడంలో సందేహంలేదు. కాని కోపం వస్తే మాత్రం అగ్ని పర్వతంలా విరుచుకు పడతాడు" అని అన్నారు. "ఆ సమయంలో నువ్వేదైనా ఖుర్‌ఆన్ సూక్తి పఠిస్తే చాలు, ఆయన కోపం వెంటనే చల్లారిపోతుంది" అన్నారు బిలాల్ (రజి).

(5) ఒకసారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి)తో మాట్లాడుతూ "ప్రజలు మీకు చాలా భయపడుతున్నారు. మీవైపు సూటిగా చూడలేకపోతున్నారు. మీ ముందు పెదవి విప్పడానికే భయపడుతున్నారు" అని అన్నారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈమాట విని "దైవసాక్షిగా చెబుతున్నాను. ప్రజలు నాకు ఎంతగా భయపడుతున్నారో నేను వారికి అంతకంటే ఎక్కువ భయపడుతున్నాను" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) పరలోక కర్మవిచారణ గురించి ఎంతో భయపడుతుండేవారు. ఒకసారి ఆయన హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి)తో మాట్లాడుతూ "అబూమూసా! మనం ఇస్లాం స్వీకరించాం. హిజ్రత్ చేశాం. దైవప్రవక్త (స) సన్నిధిలో సదా ఉండేవాళ్ళం. వాటన్నిటి పుణ్యఫలంగా సరికిసరి అన్నట్లు మనం వదలిపెట్టబడతాము. మనకు పుణ్యఫలం వద్దు; యాతనా వద్దు. దీని పట్ల నీవు సంతృప్తి చెందుతావా?" అని అడిగారు. దానికి అబూమూసా "లేదు. నేనిందుకు అంగీకరించను. మనం అనేక పుణ్యకార్యాలు చేశాం. మనకు ఎన్నో ఆశలున్నాయి" అని అన్నారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. మనం ఏవిధమైన కర్మవిచారకు గురికాకుండా వదలిపెట్టబడితే చాలు. నేను మాత్రం ఇదే చాలనుకుంటున్నాను" అని అన్నారు.

ఒకసారి ఆయన దారిన నడుస్తూ నేల మీద పడివున్న ఓ పుడక తీసుకొని "నేను ఇలాంటి పుడకలా అయివుంటే ఎంత బాగుండేది! లేక నేనసలు పుట్టకుండా ఉంటే ఎంత బాగుండేది!" అని అన్నారు. మరొక సందర్భంలో ఆయన "ఒకవేళ అశరీరవాణి ఒక మనిషి తప్ప అందరూ స్వర్గానికి పోతారని ప్రకటిస్తే అప్పుడు నరకంలో పడిపోయే ఆ ఒక్క దురదృష్టవంతుడు నేనౌతానేమో అని భయపడుతున్నాను" అని అన్నారు.

ఓసారి ఉమర్‌ఫారూఖ్ (రజి) ఇలా అన్నారు: "అయ్యయ్యో! నేను మానవుణ్ణి కాక పోయివుంటే ఎంత బాగుండేది. నేను మేకపోతునైఉండి, ప్రజలు నన్ను బలిసి పోయేలా మేపి, తర్వాత తమ బంధుమిత్రుల కోసం నన్ను జిబహ్‌చేసి కొంత మాంసం వేయించి, మిగిలిన దాంతో వడియాలు చేసి నన్ను తినేస్తే ఎంత బాగుండేది. కాని అలా జరగలేదే! అయ్యో! నేను మానవుణ్ణి కాకపోయివుంటే ఎంత బాగుండు!!"

ఓరోజు ఉమర్ ఫారూఖ్ (రజి) మస్జిద్‌లో ప్రసంగవేదికై నిల్చొని ఉపన్యసిస్తుంటే హజ్రత్ అలీ (రజి) పుత్రరత్నం హుసైన్ (రజి) ఆయన దగ్గరకు పోయి "ఇది మానాన్న వేదిక. మానాన్న వేదిక పైనుండి దిగిపో" అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "నిజమే ఇది మీనాన్నగారి వేదికే, కాని నిన్నీ మాటకు పురిగొల్పినవాడి వేదిక మాత్రం కాదు" అని అన్నారు. దానిపై హజ్రత్ అలి (రజి) మాట్లాడుతూ "వీడికీ మాటలు ఎవరూ నేర్పలేదు" అన్నారు ఆయనతో. తరువాత కొడుకు వైపు తిరిగి "ఒరెయ్ వెధవా! నిన్ను శిక్షిస్తా ఉండు" అన్నారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) "సోదరా! ఎందుకు శిక్షిస్తావు? ఇతను నిజమే చెప్పాడు" అన్నారు అలీ (రజి)తో.

ఖలీఫా ఉమర్ (రజి) తన మరణసమయం ఆసన్నమైనపుడు తన కుమారునికి ఇలా ఉపదేశించారు: "నా వస్త్రసంస్కారం విషయంలో (ఆర్భాటాలకు పోకుండా) మధ్యేమార్గం అవలంబించాలి. దేవుని సన్నిధిలో నాకు మేలు జరిగితే ఆయన నాకు ఇంతకంటే మంచిదుస్తులు ప్రసాదిస్తాడు. అలా కాకపోతే ఉన్న బట్టలు కూడా ఊడ బెరుక్కుంటాడు. నాసమాధి విషయంలోకూడా మధ్యేమార్గం అవలంబించాలి. దేవుని దృష్టిలో నేను విశాలమైన చోటుకు అర్హుడినైతే ఆయన నాకు నా కనుచూపు మేర విశాలమైన చోటు కల్పిస్తాడు. ఒకవేళ నేనందుకు అర్హుణ్ణి కాకపోతే ఆయన నా సమాధిని నా పక్కటెములు ఒకవైపు నుండి మరొకవైపుకు వచ్చేటంత ఇరుకుగా చేస్తాడు. నా జనాజా (శవపేటిక) వెంట స్త్రీలు ఎవరూ రాకూడదు. సమస్త విషయాలు దేవునికే బాగాతెలుసు. అంచేత నాలోలేని గుణాలను గురించి ప్రస్తావించకూడదు."



జైద్ బిన్ అస్లం ద్వారా ఇబ్నెఅసాకర్ ఉల్లేఖనం: అబ్దుల్లా బిన్ అమ్రే బిన్ ఆస్ (రజి) ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి)ని కలలో చూశారు. అప్పుడు అబ్దుల్లా ఆయన్ని "దేవుడు మీపట్ల ఎలా వ్యవహరించాడ"ని అడిగారు. దానికి ఉమర్ (రజి) "నేను చనిపోయి ఎంత కాలం అయింద"ని ప్రశ్నించారు. "దాదాపు పన్నెండు సంవత్సరాలు అయింద"ని చెప్పారాయన. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "ఇప్పుడిప్పుడే నేను కర్మవిచారణ నుండి బయటపడ్డాను" అని అన్నారు.

సాలమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం ఇబ్నెసాద్ ఉల్లేఖనం: ఒక అన్సార్ మనిషి తనకు కలలో ఉమర్ (రజి)ని చూపించమని దేవుణ్ణి ప్రార్థించాడు. ఓ రోజురాత్రి ఆ అన్సారీ ఉమర్ (రజి) చనిపోయిన పదేళ్ళ తర్వాత కలలో ఆయన్ని చూశాడు. అప్పుడు ఉమర్ (రజి) నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటున్నారు. అన్సారీ ఆయన్ని "విశ్వాసులనాయకా! ఇక్కడ మీ పరిస్థితి ఎలా ఉంద"ని అడిగాడు. దానికాయన "దైవానుగ్రహంవల్ల ఇప్పుడిప్పుడే నేను కర్మవిచారణ నుండి బయట పడ్డాను. దైవానుగ్రహం గనక లేకపోయివుంటే నేను నాశనమయ్యేవాణ్ణి" అని చెప్పారు.

## ♦ నిగర్వి

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా వ్యవహారాల్లో, సమరవ్యూహాల్లో, విద్యా జ్ఞానాల్లో, విజ్ఞతావివేచనల్లో, దైవభీతిపరాయణతలో, ప్రతిభాపరాక్రమాల్లో- ఒకటేమిటి, ప్రతివిషయంలో, ప్రతిరంగంలోనూ అందరికంటే గొప్పవారని చెప్పవచ్చు. అయినప్పటికీ ఆయనలో అహంకారం మచ్చుకైనా కానరాదు.

(1) ఒకసారి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మసీదులో ఉపన్యాసమిస్తూ మధ్యలో హఠాత్తుగా టాపిక్ మార్చి "సోదరులారా! ఒకప్పుడు నేను ప్రజలకు నీళ్ళు సరఫరా చేస్తుండేవాణ్ణి. దానికి ప్రతిఫలంగా వారు నాకు కొన్ని ఖర్జూరపండ్లు (కూలిగా) ఇస్తుండే వారు. నేను వాటినే తిని జీవితం గడుపుతుండేవాణ్ణి" అని అన్నారు. ఆ తరువాత శ్రోతల్లో ఒకతను దగ్గరకు వచ్చి "విశ్వాసులనాయకా! మీరిప్పుడు మీ ఉపన్యాసంలో ఆ విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఏమిటీ?" అని అడిగాడు. దానికి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) "నా హృదయంలో ఒక విధమైన గర్వం తొంగిచూసింది. దానికి విరుగుడుగా నేనలా చెప్పవలసి వచ్చింది" అని అన్నారు.

(2) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతి సంవత్సరం హజ్‌యాత్ర కోసం మక్కా వెళ్తుండేవారు. యధాప్రకారం ఓ సంవత్సరం మక్కా వెళ్ళి కాబాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటే దగ్గర్లో ఒక పల్లెటూరిబైతు ఎంతో శ్రద్ధాసక్తులతో చేస్తున్న దుఆ ఆయనకు వింతగా తోచింది. ఆ పల్లెవాసి "ఓనా ప్రభువా! ఓనా ప్రభువా!! నువ్వు నన్ను నీ అల్ప సంఖ్యాక దాసుల జాబితాలో చేర్చు" అని వేడుకుంటున్నాడు.

ఈ విచిత్ర వేడుకోలు విని ఉమర్ ఫారూఖ్ (రజి) ఆశ్చర్యపోయారు. ఆయన ఆ పల్లెవాసిని పిలిపించి "సోదరా! ఏమిటీ నువ్విలా దుఆ చేస్తున్నావు? ఇలాంటి విచిత్రమైన దుఆ నేనింతవరకు ఎవరి నోటా వినలేదే!" అని అడిగారు.

దానికి ఆ గ్రామీణుడు "అయ్యా! తమరిక్కూడా ఆ దుఆ తెల్సు, నన్నెందుకు అడుగుతారు అనవసరంగా?" అన్నాడు.

ఈమాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) మరింత ఆశ్చర్యపోయారు. "నాకేం తెలుసు? ఆ దుఆ ఏమిటో కాస్త నువ్వే చెప్పు వింటాను" అన్నారాయన.

దానికి గ్రామీణుడు "ఎందుకు తెలియదు, మీకు నాకంటే బాగా తెల్సులెండి" అన్నాడు. ఈమాట విని ఉమర్ (రజి) ఇంకా ఆశ్యర్యపోతూ ఎలాగైనా ఆ దుఆ ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తితో "నువ్వు చెప్పేదేమిటో నాకేమీ అర్థం కావడంలేదు. బాబ్బాబు! ఆ దుఆ ఏమిటో కాస్త నువ్వే చెప్పి పుణ్యం కట్టుకో" అని అన్నారు.

అప్పుడా పల్లెటూరిబైతు "విశ్వాసులనాయకా! మీరు ఖుర్ఆన్ చదవలేదా? అందులో 'వఖలీలుమ్మిన్ ఇబాదియషుకూర్' (నాకు కృతజ్ఞతులైన దాసులు చాలా తక్కువమంది ఉంటారు.) అనే సూక్తి చూడలేదా మీరు? నేను నా ప్రభువుని 'దేవా! నీకు కృతజ్ఞతులైన దాసుల జాబితాలో నన్ను కూడా చేర్చ'మని వేడుకుంటున్నా" అని అన్నాడు. ఖలీఫా ఉమర్ (రజి) ఈమాట విని ఎంతో ప్రభావితులయ్యారు. తరువాత ప్రజలవైపు తిరిగి "ప్రతి మనిషీ ఉమర్ కంటే ఎక్కువ తెలిసినవాడే" అని అన్నారు.

## ♦ 'విశ్వాసుల నాయకుడు' బిరుదు కాదు

హజ్రత్ఉమర్ (రజి) పాలనాకాలం నుండి ఖలీఫాను విశ్వాసుల నాయకా (అమీరుల్ మోమినీన్) అని పిలిచే సంప్రదాయం ఏర్పడింది. విశ్వాసుల నాయకుడు అనేది బిరుదు కాదు. దాని వెనుక ఓ సంఘటన ఉంది. ఆ కాలంలో ఇది హోదా, ప్రజాసేవల వ్యక్తీకరణ కోసం వాడే పదం మాత్రమే. మక్కా విజయం తరువాత అవిశ్వాసులు దైవప్రవక్త (స)ను మక్కా నాయకుడు (అమీరుల్ మక్కా) అని పిలిచేవారు. అలాగే ఉమర్ (రజి) పాలనాకాలంలో ఇరాఖ్ గవర్నర్గా నియమించ బడిన సాద్ బిన్ అబీవఖ్కాస్ (రజి)ను ఇరాఖ్ప్రజలు అమీరుల్మోమినీన్ అని పిలిచేవారు.

ఒకసారి ఇరాఖ్రాజధాని కూఫా నుండి లబీద్ బిన్ రబీఆ, అద్దీ బిన్ హాతిం అనే ప్రజాప్రతినిధులు ఖలీఫాను కలుసుకోవడానికి మదీనా వచ్చారు. అప్పుడు వారు "మేము అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడి)ని కలుసుకోవడానికి వచ్చాము; ఆయనకీ సంగతి చెప్పి మాకు అనుమతి ఇప్పించండి" అని అన్నారు. అప్పుడు అక్కడే ఉన్న ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఖలీఫాను అదే పదంతో సంబోధిస్తూ, మిమ్మల్ని కలుసుకోవడానికి ఫలానావారు వచ్చారని తెలియజేశారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఆశ్చర్య



పోతూ ఈ కొత్త సంబోధనకు కారణం ఏమిటని అడిగారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) విషయం వివరించారు. ఉమర్ ఫారూఖ్ (రజి)కు ఈ పదం నచ్చింది. ఆనాటి నుంచి ప్రజలు ఆయన్ని అమీరుల్ మోమినీన్ అని పిలవడం ప్రారంభించారు. ఆ తరువాత వచ్చిన ఖలీఫాలు కూడా అమీరుల్ మోమినీన్ అనే పిలవబడ్డారు.

## ♦ సూటిపోటి మాటలు, సహనం

అరబ్బులు జన్మతాః ఎవరికీ లొంగని స్వేచ్ఛాప్రియులు; ఏ ప్రభుత్వం పంచనా దాస్యం చేయడానికి ఇష్టపడని గట్టి ఆత్మాభిమానులు. అంచేత మక్కా విజయం తర్వాత ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త శిక్షణకు అంతగా నోచుకోని ప్రముఖులు కొందరు ఒక మేకలకాపరి ఖలీఫా కావడమేమిటన్న భావనతో ఉమర్ (రజి) పాలన పట్ల గుర్రుగా ఉండేవారు. మరికొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సూటిపోటి మాటలతో ఉమర్ (రజి) మనస్సును గాయపరిచేవారు. ఆయన వాటన్నిటినీ సహించేవారు.

ఒకసారి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని ఖలీఫా ఉమర్ (రజి) ప్రభుత్వ రాబడి గురించి లెక్క చూపమని వత్తిడి చేశారు. అప్పుడాయన కోపాన్ని దిగమింగుతూ "అజ్ఞానకాలంలో నా తండ్రి ఖరీదైన దుస్తులు ధరించి తిరుగుతుంటే (ఉమర్ తండ్రి) ఖత్తాబ్ నెత్తి మీద కట్టెల మోపు మోస్తూ తిరుగుతుండేవాడు. ఈరోజు అలాంటి ఖత్తాబ్ కొడుకు నా మీద పెత్తనం చెలాయిస్తున్నాడు. అంతా దైవలీల!" అని అన్నారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) సిరియా పర్యటనకు వెళ్ళినపుడు జరిగిన ఒక సమావేశంలో ప్రజలు ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతి పదవి నుండి తొలిగించడానికి కారణం అడిగితే ఆయన కారణం చెప్పారు. అప్పుడొక వ్యక్తి లేచి కనుబొమలు చిట్లిస్తూ ఇలా అన్నాడు: "ఉమర్! దైవసాక్షిగా చెబుతున్నాను- నువ్వు ఖాలిద్ వ్యవహారంలో ఏమాత్రం న్యాయం చేయలేదు. దైవప్రవక్త (స) నియమించిన ప్రముఖుడ్ని పదవి నుండి తొలగిం చావు. దైవప్రవక్త (స) బయటికి లాగిన ఖడ్గాన్ని వరలోకి నెట్టివేశావు. నువ్వు బంధుత్వాన్ని తెంచివేశావు, నువ్వు నీ పినతండ్రి కుమారుడిపై ద్వేషం పెంచుకున్నావు." ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ మాటలు విని ఆ వ్యక్తిపై మండిపడలేదు. పైగా "నీ సోదరుడ్ని సమర్థించడంలో నీకు కోపం వచ్చింది, శాంతించు" అని మాత్రమే అన్నారు ప్రశాంతంగా.

ఒకసారి అబూసుఫ్యాన్ (రజి)తో పాటు కొందరు ఖురైష్పెద్దలు ఖలీఫాను కలుసుకో వడానికి వచ్చారు. అదేసమయంలో ఒకప్పటి బానిసలైన సుహైబ్ రూమి (రజి), బిలాల్ (రజి), అమ్మార్ (రజి)లు కూడా వచ్చారు. వారంతా ఖలీఫా ఆఫీసు బయట కూర్చొని అనుమతి కోసం ఎదురుచూడసాగారు. ఉమర్ఫారూఖ్ (రజి) ఇస్లాం ప్రారంభ కాలం లోనే ముస్లిములైపోయిన వారికి ప్రాధాన్యమిస్తూ ముందుగా బలహీనవర్గానికి చెందిన సుహైబ్, బిలాల్, అమ్మార్ (రజి)లనే లోపలికి

పిలిపించుకున్నారు. అబూసుఫ్యాన్ (రజి)కు ఈ ధోరణి నచ్చలేదు. ఆయన తోటి ఖురైషీయులతో మాట్లాడుతూ "ఏమిటీ దైవలీల! బానిసలకైతే ఖలీఫా దర్బారులో ప్రవేశించడానికి అనుమతి లభించింది. మనం మాత్రం బయటే పడిగాపులు కాయవలసిన దుస్థితి ఏర్పడింది" అని అన్నారు.

ఆ ఖురైష్‌పెద్దల్లో కొందరు సత్యప్రియులు ఉన్నారు. వారిలో ఒకతను మాట్లాడుతూ "సోదరులారా! నిజం చెప్పాలంటే ఉమర్‌ని కాదు, మనం మనల్నే నిందించుకోవాలి. ఇస్లాం అందర్నీ ఒకే విధంగా సంబోధిస్తూ పిలిచింది. కాని మనలో కొందరు ఆ పిలుపుకు వెంటనే స్పందించకుండా ముందుకు రావడంలో చాలా ఆలస్యంచేసి వెనకపడి పోయారు. అలాంటివాళ్ళు ఈనాడు కూడా వెనుకనే ఉండవలసి వస్తుంది" అని అన్నాడు.

## ♦ బంధుప్రీతికి ఆమడ దూరం

(1) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) బంధుప్రీతికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉండేవారు. చివరికి ప్రజల ఉపకారవేతనం నిర్ణయించడంలో కూడా తన బంధువులపై ఇతరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన ఉసామా బిన్ జైద్ (రజి)కు నిర్ణయించిన ఉపకారవేతనం కంటే తన కన్నకొడుకు అబ్దుల్లా (రజి)కు తక్కువ ఉపకార వేతనం నిర్ణయించారు. దానిపై అబ్దుల్లా (రజి) ఇలా ఎందుకు చేశారని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త (స) నీకంటే ఉసామా (రజి)ను ఎక్కువగా ప్రేమించేవారు; ఆయన నీ తండ్రి కంటే ఉసామా (రజి) తండ్రి (జైద్)ని ఎక్కువగా అభిమానించేవారు." హజ్రత్ జైద్ (రజి) పూర్వం బానిసగా ఉండేవారు.

(2) ఉమర్ ఫారూఖ్ (రజి) తన పరిపాలనలో తన బంధువుల్లో ఏఒక్కరికీ ఎలాంటి పదవీ కట్టబెట్టలేదు. కాకపోతే తన తెగకు చెందిన ఒకేఒక వ్యక్తికి మాత్రమే ఒక చిన్న పదవి ఇచ్చారు. తన తెగకుచెందిన నోమాన్ బిన్ అదీ (రజి)ని బస్రా పట్టణం సమీపం లోని మైసాన్ అనే ఓచిన్న ప్రాంతానికి తహ్సీల్‌దారుగా నియమించారు. అదైనా కొంత కాలం వరకే; ఆ తరువాత ఆయన్నా పదవి నుంచి తొలగించారు.

నోమాన్ బిన్ అదీ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి) కంటే ముందు ఇస్లాం స్వీకరించారు. తండ్రితో పాటు ఆయన అబిసీనియాకు వలస కూడా పోయారు. ఖలీఫా ఉమర్ (రజి) నోమాన్ (రజి) చేసిన ధర్మత్యాగాలను దృష్టిలో పెట్టుకొని ఆయన్ని మైసాన్‌కు తహ్సీల్‌దార్‌గా నియమించారు. ఆ బాధ్యతనిర్వహణ కోసం నోమాన్ (రజి) మైసాన్‌కు వెళ్ళినపుడు ఆయన భార్య ఏదో కారణం వల్ల ఆయన వెంట వెళ్ళలేదు. కొన్నాళ్ళకు నోమాన్ (రజి) భార్య ఎడబాటుతో బాధపడుతూ ఒక గేయం పాడారు. ఆ గేయంలో సారాయి ప్రస్తావన వచ్చింది. ఆ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్



(రజి) ఆయన్నా పదవి నుంచి తొలగిస్తూ ఇకముందు ఆయనకు ఎలాంటి పదవి ఇవ్వకూడదని ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఒక్కవిషయం తప్ప ఉమర్‌ఫారూఖ్ (రజి) తన బంధువుల్లో గాని, తెగవారిలోగాని మరెవ్వరికీ ఎలాంటి పదవులూ కట్టబెట్టలేదు.

(3) తెలుగుభాషలో బంధుప్రీతికి, బంధుప్రేమకు కొంచెం తేడా ఉంది. బంధు ప్రేమలో ఎలాంటి తప్పు లేదు. కాని బంధుప్రీతి అనేక అనర్థాలు తెచ్చిపెడ్తుంది. బంధుప్రేమ శృతిమించితే బంధుప్రీతిగా మారుతుంది. అరబీలోని "సిలారహ్మీ" అనే పదాన్ని ఇస్లాం ఎంతగానో ప్రోత్సహించింది. బంధువుల్ని అభిమానించడాన్ని, వారికి సహాయం చేయాడాన్ని ఇస్లాం గొప్ప పుణ్యకార్యంగా పరిగణించింది. ఉమర్‌ఫారూఖ్ (రజి) తరువాత ఖలీఫాగా ఎన్నికైన ఉస్మాన్ (రజి) సిలారహ్మిని బంధుప్రేమ భావంతోనే ప్రభుత్వంలో తన బంధువులకు, తెగవాళ్ళకు అనేకపదవులు కట్టబెట్టారు. అయితే ఆ బంధుప్రేమ శృతిమించడంతో అది కాస్తా బంధుప్రీతిగా మారిపోయింది. చివరికి హద్దుమీరిన ఈ బంధుప్రీతే ఆయన మెడకు ఉరిత్రాడుగా మారింది.

(4) ఉమర్ ఫారూఖ్ (రజి) హజ్రత్ ఉస్మాన్ (రజి) విషయంలో ఈ ప్రమాదాన్ని పసిగట్టి ఒకసారి ఇబ్నెఅబ్బాస్ (రజి)తో ఇలా అన్నారు: "ఒకవేళ ఉస్మాన్ (రజి)ని గనక నేను నా రాజకీయవారసుడిగా ప్రతిపాదిస్తే అతను బనూఉమయ్యా మనుషుల్ని ప్రజల మెడలపై కూర్చోబెడ్తాడు. వారు ప్రజల విషయంలో దైవధిక్కార వైఖరికి పాల్పడతారు. దైవసాక్షిగా చెబుతున్నాను. నేను ఉస్మాన్ (రజి)ని నా రాజకీయ వారసుడ్ని చేస్తే అతను ఇలాగే చేస్తాడు. ఒకవేళ ఉస్మాన్ (రజి) అలా చేస్తే వారు తప్పకుండా దుష్కార్యాలకు ఒడిగడ్తారు. దాంతో ప్రజలు అల్లర్లు లేవదీసి, ఆందోళనలు చేపట్టి చివరికి ఉస్మాన్ (రజి)ని అంతమొందిస్తారు." ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ ప్రమాదానికి భయపడే ఎన్నికల సంఘాన్ని నియమించి దానికి తన రాజకీయవారసుడి బాధ్యత అప్పగించారు.

## ♦ ప్రజాసేవ

(1) హి.శ. 18వ ఏట అరేబియాలో తీవ్రమైన కరువు వచ్చింది. ప్రభుత్వధనాగారం లోని ధాన్యం, ధనరాసులు అయిపోయిన తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అరేబియా వెలుపల ఉన్న వివిధ రాష్ట్రాల గవర్నర్లలకు లేఖలు రాసి ధాన్యం పంపమని ఉత్తర్వులు జారీచేశారు. అప్పుడు సిరియా నుండి అబూఉబైదా (రజి) నాలుగు వేల ఒంటెల ధాన్యం పంపించారు. ఈజిప్టు నుండి అమ్ర్ బిన్ ఆస్ (రజి) సముద్రమార్గం గుండా ఇరవై ఓడల్లో దాదాపు అరవైవేల బస్తాల ధాన్యం పంపించారు. ఖలీఫా ఉమర్ (రజి) స్వయంగా మదీనా సమీపంలోని రేవు దగ్గరకు వెళ్ళి ధాన్యం దిగుమతి పనుల్ని పర్యవేక్షించారు. తరువాత ఒక రిజిష్టర్‌లో క్షుత్బాధితుల పేర్లు నమోదు చేయించి, ప్రజలకు టోకెన్లు అందజేసి ధాన్యం పంపిణీ చేయించారు. అంతేకాకుండా ప్రతిరోజూ వేలాదిమంది క్షుత్బాధితుల కోసం అన్నం కూడా తయారుచేయించేవారు.

(2) సాధారణంగా అప్పనంగా లభించే ధనధాన్యాల వల్ల ప్రజలు బద్ధకస్తులయి కష్టపడి పనిచేయడం మానేస్తారు. అంచేత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సంపాదనా శక్తి లేని నిరుపేదలకు మాత్రమే ఉపకారవేతనాలు, ఇతర సహాయక వస్తువులు అందజేసే వారు. భిక్షాటనను వృత్తిగా చేసుకున్న యాచకులను ఆయన ఏమాత్రం ప్రోత్సహించేవారు కాదు. ఒకసారి ఓ యాచకుడు ఖలీఫా ఉమర్ (రజి) దగ్గరకు వచ్చి దేబరించాడు. చూస్తే అతని జోలె నిండా పిండి ఉంది. ఖలీఫాఉమర్ (రజి) కళ్ళెర్ర జేస్తూ ఆ జోలెను లాక్కొని అందులోని పిండి తీసి దగ్గర్లో ఉన్న ఒంటె ముందు విసిరి పడేశారు. తరువాత అతనితో "ఇప్పుడు అడుక్కో నీకేం కావాలో" అని అన్నారు. ఒక్కపూట కూడా తిండిలేని యాచకుల్ని మాత్రమే ఆయన కనికరించేవారు.

(3) ఏ పనీ చేయలేని వృద్ధులు, బలహీనులకు ఉపకార వేతనాలు మంజూరు చేయడమే గాక వారిలో కొందరికి ఆయన వెళ్ళి ఉపకార వేతనాలు అందజేసేవారు. యుద్ధరంగంలో ఉండే యోధుల నుండి వచ్చే ఉత్తరాలు వారిండ్లకు వెళ్ళి వారి భార్యాపిల్లలకు అందజేసేవారు. వారినుండి ప్రత్యుత్త రాలు తీసుకొని సమరయోధులకు పంపేవారు. వారి కుటుంబాల్లో ఎవరైనా నిరక్షరాస్యులుంటే వారు వ్రాయమన్న విధంగా ఉత్తరాలు రాసిచ్చేవారు. వితంతువులకు నీళ్ళు మోసుకొచ్చి తెచ్చిచ్చేవారు.

(4) ఒకసారి ఓ బాటసారిబృందం వచ్చిందని తెలిసి హజ్రత్ ఉమర్ (రజి) దాని రక్షణ, ఇతర అవసరాల కోసం అక్కడికి చేరుకున్నారు. ఎవరు ఏ పరిస్థితిలో ఉన్నారో తెలుసుకోవడానికి బాటసారుల మధ్య తిరుగుతూ చూస్తుంటే ఒక స్త్రీ వడిలో పాలకోసం శిశువు ఏడుస్తూ కన్పించింది. ఖలీఫా ఉమర్ (రజి) ఆ స్త్రీ దగ్గరకు వెళ్ళి "పాపను సముదాయించు" అని చెప్పి వెళ్ళిపోయారు. కాస్సేపటి తరువాత ఆ పాప ఏడ్పు మళ్ళీ విన్పించింది. హజ్రత్ ఉమర్ (రజి) మళ్ళీ ఆమె దగ్గరకు వెళ్ళి "ఎంత దయలేని తల్లివమ్మ నువ్వు, పాపకు పాలివ్వకుండా ఏడ్పిస్తున్నావు!" అని అన్నారు కోపంతో.

దాంతో ఆస్త్రీ ముఖం చిట్లించి "ఎవరయ్యా బాబు, నువ్వు నావెంట పడ్డావు! నీకసలు విషయం తెలియదు. బిడ్డ తల్లిపాలు విడిచిపెట్టనంత వరకు అతనికి ఉపకార వేతనం మంజూరు చేయరని ఖలీఫా ఆదేశించాడు. దాని కోసం నేనీ పాపకు పాలు మాన్పించడానికి ప్రయత్నిస్తున్నాను" అని చెప్పింది. ఈ మాట వినగానే ఉమర్ (రజి)కు కళ్ళనీళ్ళ పర్యంతమయింది. "అయ్యో ఉమర్! నువ్వు ఎంతమంది పసిపిల్లల్ని చంపి వారి ఉసురుపోసుకున్నావో కదా!!" అని భావిస్తూ వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆయన "ఏరోజు పిల్లవాడు పుడ్తాడో ఆరోజు నుంచే అతనికి ఉపకారవేతనం మంజూరుచేయడం జరుగుతుంది" అని ఓ బహిరంగ ప్రకటన చేయించారు.



(5) ఒకసారి ఓ గ్రామీణుడు వచ్చి "ఓ ఉమర్! ఎక్కడైనా ఆనందం ఉందంటే అది స్వర్గంలోనే. నా కుమార్తెలు ధరించడానికి బట్టలు ఇవ్వు. నువ్వీ పని చేయక తప్పదు" అన్నాడు కవితా ధోరణిలో. ఖలీఫా ఉమర్ (రజి) ఈమాట విని "నేనీ పని చేయకపోతే ఏమవుతుంది?" అని ప్రశ్నించారు. దానికా పల్లెవాసి "ప్రళయదినాన నా విషయంలో నిన్ను విచారించడం జరుగుతుంది. అప్పుడు నువ్వు బిత్తరపోతావు. చివరికి నువ్వు స్వర్గానికో లేదా నరకానికో పోవలసి ఉంటుంది" అని సమాధానమిచ్చాడు.

ఈమాట వినగానే ఉమర్ ఫారూఖ్ (రజి) కళ్ళు నీటికుండలై గడ్డాన్ని కూడా తడిపి వేశాయి. దుఃఖాన్ని దిగమింగుతూ తన సేవకుడితో " ఇదిగో ఈ చొక్కా అతనికి ఇచ్చెయ్యి. ప్రస్తుతం నా దగ్గర ఇంతకంటే మరే వస్తువూ లేదు" అన్నారు. ఇలా చెప్పిన తరువాత ఆయన తన వంటి మీది చొక్కా తీసి ఆ పల్లెవాసికి అందజేయించారు.

(6) వేరొకసారి ఖలీఫా ఉమర్ (రజి) ప్రజలకు భోజనం పెట్టి పర్యవేక్షిస్తుంటే ఒకతను ఎడమచేత్తో తినసాగాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఎడమచేత్తో తినడానికి కారణం ఏమిటని అడిగితే, అతను మూతాయుద్ధంలో తన కుడిచేయి తెగిపోయిందని చెప్పాడు. ఈమాట వినగానే ఉమర్ ఫారూఖ్ (రజి)కు దుఃఖం పొర్లుకొచ్చింది. ఆయన ఆ యోధుడి దగ్గరకెళ్ళి కూర్చొని "అయ్యయ్యో, నీకెంత ఆపద వచ్చిపడింది! ఇప్పుడు నీకెవరు ఉజూ చేయిస్తారు, ఎవరు తలంటు చేయిస్తారు, ఎవరు బట్టలు మార్చుతారు?" అంటూ విచారం వెలిబుచ్చారు. ఆ తరువాత ఆయన ఆ సమరయోధుడి సేవ కోసం ఒక నౌకర్‌ని నియమించి అతనికి కావలసిన వస్తువులన్నీ సమకూర్చారు.

## (17) ధర్మావగాహన

ఉమర్‌ఫారూఖ్ (రజి) పరిపాలనాదక్షతతో పాటు, ధార్మికఆజ్ఞల అనువర్తన విషయంలో కూడా ఎంతో విజ్ఞతా వివేచనలతో వ్యవహరించేవారు. ఈ విషయంలో ప్రారంభం నుండి ప్రజల్లో రెండు దృక్పథాలు ఉంటున్నాయి. ఒకటి, ఇందులో బుద్ధి వివేచనలకు ఎలాంటి తావులేదు. రెండు, ధర్మానికి సంబంధించిన ప్రతిఆదేశం బుద్ధి వివేచనల సూత్రం మీదే ఆధారపడి ఉంది. ఈ రెండవ దృక్పథాన్ని "అస్రారుద్దీన్" విద్య అంటారు. అయితే ఈసూత్రాన్ని చాలా తక్కువమంది అంగీకరిస్తారు. దీనికి క్కారణం- మొదటి దృక్పథానికి అనుకూలురైన అధికసంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం జటిలమైన ఈ కళ జనసామాన్య అవగాహనా పరిధికి వెలుపల ఉంది. అదీగాక ధర్మానికి సంబంధించిన ప్రతి విషయాన్నీ బుద్ధివివేచనల ప్రమేయం లేకుండా నోరుమూసుకొని అంగీకరించడంలోనే మనిషి ధర్మపరాయణత, ధార్మికశ్రేయస్సు ఇమిడి ఉన్నాయి.

(1) హజ్రత్ ఉమర్ (రజి) రెండవ దృక్పథానికి అనుకూలురు. నిజం చెప్పాలంటే "అస్రారుద్దీన్" విద్యకు ఆయనే పునాది వేశారని చెప్పవచ్చు. ధర్మానికి సంబంధించిన

ఏదైనా విషయం బుద్ధివిజ్ఞతలకు వ్యతిరేకంగా ఉందనిపిస్తే ఆయన దాని పూర్వపరాలను గురించి ఆలోచించి తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు.

ప్రయాణావస్థలో నాలుగు రకాతుల ఫరజ్ నమాజ్‌ని తగ్గించి రెండు రకాతులతో చేసే నమాజ్‌ని "ఖసర్" నమాజ్ అంటారు. దీని పూర్వపరాలు ఇలా ఉన్నాయి- ఇస్లాం ప్రారంభకాలంలో ప్రయాణమార్గాలు సురక్షితంగా ఉండేవికావు. మరొకవైపు ముస్లింలకు సత్యతిరస్కారుల బెడద కూడా ఉండేది. అంచేత నాలుగు రకాతుల నమాజ్‌ని రెండు రకాతులతో పూర్తిచేసుకోవాలని దైవాజ్ఞ అవతరించింది. అయితే మక్కావిజయంతో పాటు అరేబియాలోని అత్యధిక భూభాగం ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత ప్రయాణం ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షితమై పోయింది. హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (స) ముందు ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ, మనమిక నమాజ్‌లో ఖసర్ (తగ్గింపు) చేయవలసిన అవసరమేమిటని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఇది దేవుని తరఫున మనకు ప్రసాదించబడిన కానుక" అని సమాధానమిచ్చారు.

కాబాప్రదక్షిణ చేస్తున్నపుడు మొదటి మూడు చుట్లు భుజాలు ఎగరేస్తూ, ఠీవీ-దర్పం ప్రదర్శిస్తూ వేగంగా నడవడాన్ని "రమల్" అంటారు. ఇది ప్రవక్త సంప్రదాయం (సున్నత్). దీని పూర్వపరాలు ఇలా ఉన్నాయి- దైవప్రవక్త (స) హజ్‌యాత్ర కోసం మదీనా నుండి మక్కా వచ్చినపుడు మక్కా అవిశ్వాసులు ముస్లింలను విమర్శిస్తూ, ముస్లింలు ఇప్పుడు చాలా బలహీనులై పోయారని, కాబాప్రదక్షిణ కూడా సరిగా చేయలేకపోతున్నారని నిందించారు. దైవప్రవక్త (స) ఈమాట విని అనుచరులకు 'రమల్' చేయమని ఆదేశిం చారు. ఆ తరువాత కాలంలో ఇదొక శాశ్వత సంప్రదాయమై పోయింది. కాని హజ్రత్ ఉమర్ (రజి) ఇప్పుడా పరిస్థితి లేదు గనక రమల్ చేయవలసిన అవసరం లేదంటారు. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)తో ఒకతను, ప్రజలు రమల్‌ని సున్నత్ (సంప్రదాయం)గా భావిస్తున్నారని అంటే, ప్రజలు తప్పుగా భావిస్తున్నారని అన్నారాయన.

(2) ఓసారి అబీ బిన్ కాబ్ (రజి)ని కలుసుకోవడానికి అనేకమంది వచ్చారు. సమావేశం ముగించి బయలుదేరినపుడు వారాయన్ని సాగనంపడానికి ఆయన వెనకాల నడవసాగారు. అదే సమయంలో హజ్రత్ ఉమర్ (రజి) అటుగా వచ్చి చూసి కోపంతో అబీ బిన్ కాబ్ (రజి)పై కొరడా ఝుళిపించారు. అబీ (రజి) బిత్తరపోయి చూస్తూ "ఏమయింది (నన్ను కొట్టారు)?" అని అడిగారు. దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) "ఏమిటీ మీరు చేస్తున్నది? (ఇది ప్రజల్లో అరాచకానికి, విధేయులకు అవమానానికి కారణమవు తుంది)" అని అన్నారు. ఇది నేటి స్వాములు, బాబాలు తమ భక్తులు- అభిమానులను తమ చుట్టూ చేర్చుకునే ధోరణి లాంటిదే. ఈ ధోరణి వ్యక్తిపూజకు దారితీసే ప్రమాదం ఉంది గనక ఉమర్ (రజి) దాన్ని మొగ్గలోనే త్రుంచివేయడానికి ప్రయత్నించారు.



ముస్లిమేతర రాజ్యాధిపతుల గుండెల్లో గుర్రాలు పరుగెత్తిస్తూ, అనేక ప్రాంతాలను జయిస్తూ అప్రతిహతంగా ముందుకు దూసుకువెళ్తున్న సర్వసేనాని ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని పదవి నుండి తొలగించడంలో కూడా ఖలీఫా ఉమర్ (రజి) ఉద్దేశ్యం ఇదే.

(3) ధర్మావగాహన (ఫిఖ్హా) విద్యలో ఉమర్ ఫారూఖ్ (రజి)ని మించినవారెవరూ లేరని ప్రతీతి. ఈ విషయాన్ని ఆనాడు దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరులంతా అంగీక రిస్తారు. ముస్నద్‌దార్మి గ్రంథం ప్రకారం హుజైఫా బిన్ ఐమాన్ (రజి) ఇలా అన్నారు: "ఇమామ్ లేదా ఖుర్‌ఆన్ విద్య బాగా తెలిసిన వ్యక్తి మాత్రమే ధార్మిక తీర్పు(ఫత్వా)లు ఇవ్వగలడు." ప్రజలు ఈమాట విని అలాంటి వ్యక్తి ఎవరని అడిగారు. దానికి హుజైఫా (రజి) 'ఉమర్ బిన్ ఖత్తాబ్' అన్నారు. అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఇలా తెలిపారు: "అరబ్ ప్రజలందరి విద్యాజ్ఞానాలు ఒక (త్రాసు)పళ్ళెంలో పెట్టి, ఉమర్ (రజి) విద్యాజ్ఞా నాలు రెండవ పళ్ళెంలో పెట్టి చూస్తే ఉమర్ (రజి) పళ్ళెమే బరువుగా ఉంటుంది." ఆయన మరొక సందర్భంలో "ఉమర్ (రజి) దగ్గర ఒక క్షణం కూర్చోవటం ఏడాది పాటు దైవారాధన కంటే మేలని నేను భావిస్తున్నాను" అని అభిప్రాయపడ్డారు.

ఓసారి ఆయన ప్రయాణం చేస్తూ ఒక చెరువు దగ్గరకు చేరుకొని ఆగిపోయారు. వెంట ఉన్న అమ్ర్ బిన్ ఆస్ (రజి) అక్కడున్న కొందరు వ్యక్తులతో "ఈ చెరువులో జంతువులు నీళ్ళు తాగవు కదా?" అని అడిగారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ వ్యక్తుల్ని చెప్పవద్దని వారించారు. వేరొకసారి రమజాన్‌లో ఆకాశం మేఘావృతమై ఉండటం వల్ల సూర్యుడు కన్పించలేదు. హజ్రత్ ఉమర్ (రజి) సూర్యాస్తమయిందని భావించి ఉపవాసం విరమించారు. తర్వాత మేఘాలు తొలగడంతో సూర్యుడు ప్రత్యక్ష మయ్యాడు. దాంతో ప్రజలు 'అయ్యో ఇప్పుడెలా' అనే భావనతో సందిగ్ధంలో పడ్డారు. అయితే ఉమర్ ఫారూఖ్ (రజి) వారి సందిగ్ధానికి తెరదించుతూ "విషయం అంత తీవ్రమైనది కాదు. మనం శాయాశక్తులా ప్రయత్నించాము" అని చెప్పారు.

(4) ధార్మికవ్యవహారాల్లో ఉమర్ (రజి) ప్రవేశపెట్టిన కొత్త విషయాలు ఇలా ఉన్నాయి:- (1) ఖుర్‌ఆన్, హదీసుల్లో సమస్యకు స్పష్టమైన పరిష్కారం కన్పించనప్పుడు దాని కోసం ఆయన 'ఖ్యాస్' (ఊహాగానం) సూత్రాన్ని ప్రవేశపెట్టారు. (2) విధి (ఫర్జ్)గా ఆచరించ వలసిన సత్కార్యాల సమస్య పరిష్కారం కోసం "ఔల్" సిద్ధాంతం కనిపెట్టారు. (3) ఫజర్ నమాజ్ వేళలో చెప్పే అజాన్ పదాల్లో "అస్సలాతు ఖైరుమ్‌మినన్నౌమ్" (నిద్ర కంటే నమాజ్ శ్రేష్ఠమైనది) అనే పదాలను చేర్చారు. (4) తరావీ నమాజ్ సామూహికంగా చేయడాన్ని ప్రవేశపెట్టారు. (5) ఒకేసారి ఇచ్చే మూడు తలాఖులను "బాయెన్ తలాఖ్"గా పరిగణించారు. (6) మద్యపానం శిక్షను ఎనభై కొరడాదెబ్బలుగా నిర్ణయించారు. (7) వక్ఫ్‌ఆస్తుల వ్యవస్థ కనిపెట్టారు. (8) జనాజానమాజ్‌లో నాలుగు

తక్బీర్‌లు చెప్పే విషయమై సహాబీలలో ఏకాభిప్రాయం కుదిర్చారు. (9) మసీదుల్లో ధార్మిక ప్రసంగాల సంప్రదాయం ప్రవేశపెట్టారు. (10) ఇతరుల పరువుప్రతిష్ఠలపై బురదచల్లే మాటలు, పలుకులపై నిషేధం విధించి, దాని శిక్ష ప్రవేశపెట్టారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలన తరువాయి కాలంలో ఇస్లామీయ ధార్మికకళ బాగా వృద్ధి చెందింది. ముఖ్యంగా ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫై, ఇమామ్ బుఖారి, ఇమామ్ గజాలి, రాజి (రహ్మలై) వగైరా ప్రముఖులు చేసిన సేవ మరువరానిది. కాని వారిలో ఎవరూ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రవేశపెట్టిన పద్ధతుల్లో, చేసిన సంస్కరణల్లో ఒక్కటీ అదనంగా చేర్చడంగాని, వ్యతిరేకించడంగాని చేయలేదు. ఆయన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలాఅన్నారు: "నా తర్వాత ఎవరైనా దైవప్రవక్త అయ్యే అవకాశముంటే అతను ఉమర్ బిన్ ఖత్తాబ్ అవుతాడు." (తిర్మిజి). దీన్నిబట్టి ఉమర్ ఫారూఖ్ (రజి) ధర్మావగాహనాశక్తి, నైతికసామర్థ్యం, దూరదృష్టి ఎలాంటివో మనం ఊహించవచ్చు.

**(5) హదీసు ప్రకటనలో జాగ్రత్తలు** :- ఉమర్ ఫారూఖ్ (రజి) హదీసులను ప్రకటించడంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. ప్రజలు ఖుర్‌ఆన్‌పై హదీసులకు ప్రాధాన్యత ఇవ్వకూడదన్నదే ఈ జాగ్రత్త వెనుక ఆయన ఉద్దేశ్యం. అందుకే ఆయన 70 హదీసులు మాత్రమే ఉల్లేఖించారు. అయితే ఆయన చేసిన ప్రసంగాలలో, వ్రాతపూర్వకమైన సూచనలు, ఉపదేశాల్లో దైవప్రవక్త (స) పేరు ప్రస్తావన లేకుండా ఎన్నో హదీసులున్నాయి. విషయం ఒకరి ద్వారా మరొకరికి, మరొకరి ద్వారా వేరొకరికి చేరుతున్నపుడు అందులో కొద్దిగొప్పా తగ్గింపు లేదా పొడిగింపు వచ్చే ప్రమాదం ఉండొచ్చు. అంచేత హదీసులు ఎక్కువగా ప్రకటించకూడదని ఆయన సహాబీలకు తాకీదుచేశారు. అదీగాక వారు హదీసులు ప్రకటించడంలో మునిగిపోయి ఖుర్‌ఆన్ అధ్యయనంలో ఏమరుపాటుకు గురైపోతారేమోనని కూడా ఆయన భయపడేవారు.

ప్రముఖ హదీసువేత్త అల్లామా జుహబి (రహ్మలై) "తజ్కిరతుల్ హుప్ఫాజ్"లో హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పరిస్థితి ప్రస్తావిస్తూ ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఆయన అదే గ్రంథంలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) విషయాన్ని ప్రస్తావిస్తూ, హదీసు ప్రకటనలో జాగ్రత్త వహించినవారిలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) మొట్టమొదటి వ్యక్తి అని పేర్కొన్నారు. అల్లామా జుహబీ (రహ్మలై) ప్రకారం హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) అయిదొందలు హదీసులు వ్రాసిపెట్టుకున్నారు. అయితే ఆ తరువాత ఆయన వాటిని కాల్చివేశారు. కారణం తాను ఒక మనిషిని "సిఖా" (నమ్మకస్థుడు) అని భావించి అతని నుండి హదీసుల్ని ఉల్లేఖించానని, కాని వాస్తవానికి అతను 'సిఖా' (నమ్మకస్థుడు) కాకపోవచ్చని హజ్రత్ అబూబకర్ (రజి) పేర్కొన్నారు.



# (18) విషాద సంఘటన

హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రజి) హజ్‌యాత్ర సందర్భంగా జరిగిన ఒక సంఘటన ఇలా తెలియజేశారు : "ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) మినా నుండి అబ్తహ్ చేరుకొని అక్కడ ఒంటెను కూర్చోబెట్టి వెల్లకిలా పడుకున్నారు. తర్వాత ఆయన చేతులు పైకెత్తి 'దేవా! నా వయస్సు పెరిగిపోయింది. నా శక్తి ఉడిగిపోయింది. నా పట్టు సడలి పోయింది. అంచేత నా బుద్ధి మందగించి, నేను విజ్ఞతావివేచనలు కోల్పోవక ముందే దేవా! నన్ను నీ వైపుకు లేపుకో' అని ప్రార్థించారు..." (హాకిమ్)

కాబ్ అహ్‌బార్ అనే వ్యక్తి ఉమర్ (రజి)తో మాట్లాడుతూ "తౌరాత్ ద్వారా నాకు మీరు అమరగతులవుతారని అన్పిస్తోంది" అన్నాడు. ఉమర్ (రజి) ఈమాట విని "అరేబియాలో ఉంటున్న నాకు అమరగతి భాగ్యం ఎలా లభిస్తుంది?" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఓరోజు "దేవా! నీమార్గంలో నాకు అమరగతిభాగ్యం ప్రసాదించు. నీప్రవక్త (స) నగరంలోనే నాకు మృత్యువు కలిగించు" అని ప్రార్థించారు.

మాదాన్ బిన్ అబూతల్హా కథనం: ఉమర్ ఫారూఖ్ (రజి) ఒకసారి ఉపన్యాసం ఇస్తూ "నేనొక కల గన్నాను. ఆ కలలో ఓ కోడిపుంజు నన్ను ఒకటి లేక రెండు సార్లు పొడిచింది" అని చెప్పారు. తరువాత ఆ కల గూఢార్థం తెలుపుతూ ఇలా అన్నారు- "అంటే నా మరణకాలం సమీపించింది. జనం నా రాజకీయ వారసుడ్ని ప్రకటించమని అడుగుతున్నారు. కాని దేవుడు తన ధర్మాన్ని, ఖిలాఫత్ వ్యవస్థను వృథాచేయడు. ఒకవేళ మృత్యువు నాకు కొంచెం గడువిచ్చినా (నేను ప్రత్యేకంగా ఎవరి పేరునూ ప్రతిపాదించను.) దైవప్రవక్త (స) తన నిర్యాణ సమయంలో అభిమానించిన ఆ ఆరుగురు వ్యక్తుల సలహా సంప్రదింపులతోనే ఖలీఫా ఎంపిక జరుగుతుంది." (హాకిమ్)

ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఏ నవయువకుడ్ని కూడా మదీనాలో ప్రవేశించడానికి అనుమతించేవారు కాదు. అయితే కూఫా గవర్నర్ ముగీరా బిన్ షాబా ఖలీఫాకు ఓసారి ఉత్తరం రాసి అందులో "నా దగ్గర ఓ మంచి తెలివితేటలు గల యువకుడు ఉన్నాడు. అతనికి అనేక పనులు తెలుసు. అతని ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. అతను కంసలి, వడ్రంగి, డిజైన్ పనుల్లో నిపుణుడు. అంచేత అతనికి మదీనా రావడానికి అనుమతి ఇస్తే బాగుంటుంది" అని విజ్ఞప్తి చేశారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పార్శీ బానిసయిన ఆ యువకుడికి మదీనా వచ్చి ఉండటానికి అనుమతి ఇచ్చారు. అతని పేరు ఫేరోజ్ అబూలూలూ.

ఓరోజు ఉమర్ ఫారూఖ్ (రజి) బజారున నడచిపోతుంటే 'ఫేరోజ్ అబూలూలూ' ఎదురొచ్చి "నా యజమాని ముగీరా బిన్ షాబా నా దగ్గర జిజ్యా ఎక్కువ వసూలు చేస్తున్నాడు" అని ఫిర్యాదు చేశాడు. ఎంత వసూలు చేస్తున్నాడని అడిగితే రోజుకు

రెండు దిర్హమ్‌లని చెప్పాడు. ఖలీఫా ఈమాట విని 'నువ్వేం పని చేస్తావ'ని అడిగారు. దానికి ఫేరోజ్ "వడ్రంగం, రాళ్ళ చెక్కుడు, రాతి కళాకృతుల పనులు చేస్తాన"ని చెప్పాడు. "అయితే ఈ పనులు చేస్తున్నపుడు రెండు దిర్హాంలు ఎక్కువేమీ కాదు" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి). ఫేరోజ్ ఈమాట విని లోలోన రగిలిపోయాడు.

ఆ సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) "నువ్వు గాలిబలంతో తిరిగే తిరగలి తయారు చేస్తావని విన్నాను. అలాంటి తిరగలి నాకొకటి తయారుచేసి ఇవ్వగలవా?" అని అడిగారు. దానికి ఫేరోజ్ "తప్పకుండా. నేను మీకు అత్భుతమైన తిరగలి తయారు చేసిస్తా. దాని తిరుగుడు శబ్దం తూర్పు-పడమర వాసులందరికీ విన్పిస్తుంది" అని సమాధానమిచ్చాడు.

మరునాడు ఉదయం ప్రజలు ఫజర్ నమాజ్ చేయడానికి మస్జిదెనబవీలో సమావేశమయ్యారు. అందరూ నమాజ్ చేయడానికి పంక్తుల్లో నిల్చున్నారు. ఖలీఫా ఉమర్ (రజి) నమాజ్ చేయించడానికి ముందుకెళ్ళి ఇమామ్ స్థానంలో నిలబడ్డారు. ఫేరోజ్ కూడా వేషంమార్చి ముందు వరుసలో నిల్చున్నాడు. "అల్లాహుఅక్బర్" అంటూ నమాజ్ ప్రారంభం కాగానే ఫేరోజ్ ముందుకు దూసుకొచ్చి కత్తితో ఖలీఫా ఉమర్ (రజి)పై దాడిచేసి వెంటవెంటనే ఆరు పోట్లు పొడిచి పారిపోయాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తక్షణమే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని లాగి తన స్థానంలో నిలబెట్టారు. తరువాత పక్కకు జరిగి కుప్పకూలిపోయారు. అదే పరిస్థితిలో అబ్దుర్రహ్మాన్ (రజి) నమాజ్ చేయించారు. ఫేరోజ్ రక్తసిక్తమైన కత్తితో పారిపోతుంటే ప్రజలు అతడ్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. అయితే ఆ దుర్మార్గుడు తనను పట్టుకోవడానికి ప్రయత్నించినవారిలో అనేకమందిని గాయపరిచాడు. వారిలో ఆరుగురు ఆ తరువాత చనిపోయారు. చివరికి ఆ దుర్మార్గుడు ఎలాగో పట్టుబడగానే అదే కత్తితో పొడుచుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

నమాజ్ ముగిసిపోగానే ప్రజలు ఖలీఫాను ఎత్తుకొని ఆయన ఇంటికి చేర్చారు. అప్పటిదాకా ఆయన అపస్మారకస్థితిలోనే పడివున్నారు. స్పృహరాగానే తనను హతమార్చిన వ్యక్తి ఎవరని అడిగారు. జనం ఫేరోజ్ అబూలూలు అని చెప్పారు. అప్పుడాయాన దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటూ "దేవుని దయవల్ల నేను ముస్లిం అని చెప్పుకునే మనిషి చేతిలో హతమార్చబడలేదు" అని అన్నారు ప్రశాంతహృదయంతో.

తరువాత ఆయన తన కుమారుడు అబ్దుల్లా (రజి)ను పిలిచి తన మీద ఎంత రుణభారం ఉందని అడిగారు. దానికి అబ్దుల్లా లెక్కచూసి ఆరువేలు (దిర్హాంలు) అని చెప్పారు. ఉమర్ (రజి) ఈమాట విని "మన దగ్గరున్న పైకంతో ఈ అప్పు పూర్తిగా తీర్చగల్గితే తీర్చు. లేకుంటే బనీఅద్దీ తెగవారిని అడిగి తీసుకో" అని చెప్పారు.



ప్రజలు వైద్యుని కోసం హడావిడి చేశారు. అప్పుడొక వైద్యుడు వచ్చి ఖర్జూరంయవలతో చేసిన పానకం, పాలు తాగించాడు. కాని ఆ రెండు ద్రవపదార్థాలు గాయాల నుండి బయటికి వచ్చేశాయి. అది చూసి వైద్యుడు పెదవి విరిచాడు. ప్రజలు కూడా ఆశాలు వదలుకొని "అబూబకర్ (రజి) తన వారసుడ్ని ఎలా ప్రకటించారో మీరు కూడా మీ రాజకీయ వారసుడెవరో ప్రకటించి వెళ్ళండి" అని అన్నారు.

అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) తన వారసుడి ఎంపిక కోసం అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని, సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)ని, జుబైర్ బిన్ అవామ్ (రజి)ని, తల్హా (రజి)ని, అలీ (రజి)ని, ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి)ని పిలిపించారు. తల్హా (రజి) అప్పుడు నగరంలో లేనందున ఆయన తప్ప మిగిలిన అయిదుగురు వచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి) వారైదుగురిని సంబోధిస్తూ "మీరు తల్హా కోసం మూడురోజులు ఎదురుచూడండి. ఈలోగా వస్తే అతడ్ని కూడా కలుపుకోండి. రాకపోతే మీరైదుగురే పరస్పరం సంప్రదించుకొని మీలో ఒకడ్ని ఖలీఫాగా ఎన్నుకోండి" అని చెప్పారు.

ఆ తర్వాత ఆయన తన కుమారుడు అబ్దుల్లా (రజి)ని పిలిచి "ఖిలాఫత్ విషయంలో ఏదైనా భేదాభిప్రాయం వస్తే, నీవు మెజార్టీ సభ్యులతో కలవాలి. ఒకవేళ రెండు పక్షాలు సమానసంఖ్యలో ఉంటే, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఏపక్షాన ఉంటే నువ్వా పక్షంలో చేరిపో" అని చెప్పారు. ఆ తరువాత ఆయన అబూతల్హా అన్సారి (రజి)ని, మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి)ని పిలిపించి "ఖలీఫా ఎన్నిక సంప్రదింపుల కోసం వారొక చోట సమావేశమైనప్పుడు సమావేశం ముగిసేదాకా మీరిద్దరు ద్వారం దగ్గర కాపలాకాస్తూ ఎవరినీ లోపలికి రానీయకూడదు" అని ఆదేశించారు. ఆ తరువాత ఉమర్ ఫారూఖ్ (రజి) ఎన్నికల సంఘం సభ్యులకు ఈవిధంగా ఉపదేశించారు:

"మీలో ఖలీఫాగా ఎన్నికయ్యే వ్యక్తికి నేనిలా ఉదేశిస్తున్నాను- అతను అన్సారుల హక్కుల పట్ల చాలా శ్రద్ధ వహిస్తుండాలి. అన్సారులు దైవప్రవక్త (స)కు సహాయం చేశారు. ముహాజిర్‌లకు తమ ఇండ్లలో చోటిచ్చారు. వారు మీ ఉపకారులు. వారికి అతను మేలు చేయాలి. వీలైనంతవరకు వారి తప్పులు, పొరపాట్లను ఉపేక్షించాలి. ఖలీఫాగా ఎన్నికయ్యే వ్యక్తి ముహాజిర్ల హక్కుల పట్ల కూడా శ్రద్ధ వహించాలి. ముహాజిర్లు ఇస్లాం సౌధానికి పునాదిరాళ్ళు వంటివారు. అలాగే అతను జిమ్మీల పట్ల సద్భావనంతో మసలుకోవాలి. వారిహక్కులు గౌరవించాలి. వారికి చేసిన వాగ్దానాలు పూర్తిగా నెరవేర్చాలి. వారిపై వారు మోయలేని భారాన్ని మోపకూడదు."

ఆ తరువాత ఉమర్ ఫారూఖ్ (రజి) తన కుమారుడు అబ్దుల్లా (రజి)ని పిలిచి "నువ్వు వెంటనే ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి 'తనను దైవప్రవక్త (స) సమాధి పక్కన ఖననం చేయడానికి అనుమతించవలసిందిగా ఉమర్ అర్థిస్తున్నాడని ఆమెకు చెప్పు"

అని అన్నారు. అబ్దుల్లా (రజి) పరుగుపరుగున ప్రవక్తసతీమణి ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి ఆ విషయం ఆమెకు చెప్పారు. దానికామె సంతోషంగా అనుమతిచ్చారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) హి.శ. 23వ ఏట జిల్‌హజ్జ నెల, 27వ తేదీన గాయపడి మూడురోజుల తర్వాత, ముహర్రం 1వ తేదీన మృతిచెందారు. ఇలా పదేండ్ల ఆరునెలలు పరిపాలన చేసి తమప్రభువు సన్నిధికేగారు. అదేరోజు ఆయన్ని ఖననం చేశారు. దాంతో మదీనాపై దట్టమైన విషాదఛాయలు అలుముకున్నాయి.

**భార్యాపిల్లలు :** ఉమర్ ఫారూఖ్ (రజి) మొదటి వివాహం అజ్ఞానకాలంలో జైనబ్ బిన్త్ మజ్వూన్‌తో జరిగింది. ఆమెద్వారా ఆయనకు అబ్దుల్లా, అబ్దుర్రహ్మాన్, అక్బర్, హఫ్సా(రజి) జన్మించారు. జైనబ్ (రజి) మదీనాహిజ్రత్‌కు ముందే మక్కాలో చనిపోయారు. ఆ తరువాత ఉమర్ ఫారూఖ్ (రజి) అజ్ఞానకాలంలోనే మలీకా బిన్త్ జరూల్‌ని వివాహ మాడారు. ఆమె ద్వారా ఉబైదుల్లా (రజి) జన్మించారు. మలీకా ఇస్లాం స్వీకరించడానికి నిరాకరించడం వల్ల ఉమర్ ఫారూఖ్ (రజి) హిజ్రీ 6వ ఏట ఆమెకు విడాకులిచ్చారు. అజ్ఞానకాలంలోనే ఆయన ఖరీబా బిన్త్ అబీఉమయ్యాని కూడ వివాహమాడారు. ఖరీబా కూడా ఇస్లాం స్వీకరణను నిరాకరించినందు వల్ల ఉమర్ ఫారూఖ్ (రజి) హిజ్రీ 6వ ఏట ఆమెక్కూడా విడాకులిచ్చారు. నాల్గవవివాహం ఉమ్మెహకీం బిన్త్ హరస్‌తో జరిగింది. ఆమెద్వారా ఫాతిమా (రజి) జన్మించారు. అయిదో వివాహం హిజ్రీశకం 7వ ఏట జమీలా బిన్త్ ఆసిమ్‌తో జరిగింది. ఆమెద్వారా ఆసిమ్ (రజి) జన్మించారు. అయితే ఏదో కారణం చేత ఆమెకు కూడా విడాకులిచ్చారు. ఆరవ వివాహం హిజ్రీ 17వ ఏట హజ్రత్ అలి (రజి) కుమార్తె ఉమ్మెకుల్సూమ్‌తో జరిగింది. ఆమె ద్వారా రుఖియా, జైద్ జన్మించారు. ఏడవ వివాహం ఆతికా బిన్త్ జైద్ బిన్ అమ్ర్‌తో జరిగింది.

## (12) ఉమర్ (రజి) అభిమతానికి అనుగుణంగా దివ్యావిష్కృతి

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) దైవశాసనాలను అర్థం చేసుకోవడంలో దిట్ట. కొన్ని సందర్భాలలో ఆయన అభిమతానికి అనుగుణంగా దైవసూక్తులు అవతరించేవి. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "ఎప్పుడైనా ప్రజలు ఏదైనా విషయంలో (దైవప్రవక్త-స ముందు) తమతమ అభిప్రాయాలు వెలిబుచ్చేటప్పుడు ఉమర్ (రజి) కూడా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చేవారు. అయితే ఖుర్‌ఆన్ (సూక్తులు) ఉమర్ (రజి) అభిప్రాయం ప్రకారమే అవతరించేవి." (ఇబ్నెఅసాకర్)

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) అభిలాష, అభిమతాలకు అనుగుణంగా దాదాపు 21 సందర్భాలలో దివ్యఖుర్‌ఆన్ సూక్తులు అవతరించాయని జలాలుద్దీన్ అబ్దుర్రహ్మాన్ అల్‌సయూతి తన గ్రంథం "తారీఖుల్ ఖుల్ఫా"లో పేర్కొన్నారు. వాటి వివరాలు కొన్ని ఈవిధంగా ఉన్నాయి :-



1-దైవప్రవక్త (స) బదర్‌యుద్ధం కోసం సన్నాహాలు చేస్తున్నప్పుడు హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) తన అభిప్రాయం వెలిబుచ్చుతూ "మనం (మదీనా) బయటికెళ్ళి యుద్ధం చేయడం మంచిది" అన్నారు. దాని ప్రకారం ఖుర్‌ఆన్‌లో "నీ ప్రభువు నిన్ను ఇంటి నుండి (యుద్ధానికి) బయలు దేరతీసినప్పుడు, కొందరు విశ్వాసులకు ఇది నచ్చలేదు" (8:5) అనే సూక్తి అవతరించింది.

2-మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) బదర్ యుద్ధఖైదీల సమస్య విషయంలో అనుచరుల్ని సలహా అడిగినపుడు ఉమర్ ఫారూఖ్ (రజి) ఇతరుల అభిప్రాయానికి భిన్నంగా ఆ ఖైదీలను హతమార్చాలని చెప్పారు. దాని ప్రకారం ఖుర్‌ఆన్‌లో "దేశంలో శత్రువుల్ని పూర్తిగా అణచివేయనంత వరకు ఖైదీలను తన అధీనంలో ఉంచుకోవడం ఏ దైవప్రవక్తకూ శోభించదు" (8:66) అనే సూక్తి అవతరించింది.

3-ఓసారి ఉమర్ ఫారూఖ్ (రజి) "దైవప్రవక్తా! మీ సహధర్మచారుణుల దగ్గరకు మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు కూడా వస్తుంటారు. అంచేత మీరు వారికి పరదా పాటించమని ఆదేశిస్తే ఎంత బాగుంటుంది!" అని అన్నారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లింస్త్రీలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు. దేవుడు క్షమాశీలి, దయామయుడు" (33;59)

4-దైవప్రవక్త (స) భార్యల్లో కొందరు సవతి అసూయకు గురయి ముఠా కట్టారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) "ఆయన ప్రభువు సమీపంలోనే ఉన్నాడు. ఒకవేళ ఆయన మీకు విడాకులిస్తే దేవుడు ఆయనకు మీకంటే మంచి భార్యలను ప్రసాదిస్తాడు" అని అన్నారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "ఒకవేళ దైవప్రవక్త మీకందరికీ విడాకులిస్తే, దేవుడు మీ స్థానంలో అతనికి మీకంటే శ్రేష్ఠమైన భార్యల్ని ప్రసాదిస్తాడు. వారు (మీకంటే) ఎంతో మంచి ముస్లింలుగా, విశ్వసనీయులుగా, వినయవతులుగా, క్షమాపణ కోరుకునేవారుగా, దైవారాధకులుగా, ఉపవాసకులుగా ఉంటారు. వారు భర్తృవిహీనులూ కావచ్చు, లేదా కన్యలు కూడా కావచ్చు" (66:5) అనే సూక్తి అవతరించింది.

5-హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) మద్యపానం అనర్థాలతో విసుగెత్తి ఓసారి "దేవా! సారాయి (నిషేధం) గురించి ఏదయినా ఆజ్ఞ జారీచెయ్యి" అని ప్రార్థించారు. దానిపై ఖుర్‌ఆన్‌లో అంచెలంచెల వారీగా ఇలా సూక్తులు వెలువడ్డాయి:- "విశ్వాసులారా! మీరు మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన దరిదాపులకు పోకండి. ప్రార్థనలో మీరు పఠిస్తున్న దేమిటో మీకు తెలుస్తున్నప్పుడే ప్రార్థన చేయాలి" (4:43); "విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం– ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థకమవుతుంది. మద్యం, జూదాల ద్వారా

షైతాన్ మీమధ్య విరోధం, విద్వేష బీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి." (5:90,91) అనే సూక్తులు అవతరించాయి.

6-కపటముస్లిం అబ్దుల్లా బిన్ ఉబయి దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) పాతివ్రత్యంపై నిందారోపణ చేసినపుడు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని సలహాల కోసం సంప్రదించారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీ వివాహం (ఆయిషా-రజి.తో) ఎవరు జరిపించారు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "దేవుడు జరిపించాడు" అని చెప్పారు. "అయితే దేనిలోనైనా ఏదైనా లోపం ఉంటే దేవుడు మీకు తెలియకుండా దాన్ని రహస్యంగా ఉంచాడా? దేవుడు పరిశుద్ధుడు. ఇది ఘోరమైన అపనింద మాత్రమే" అన్నారు ఉమర్ ఫారూఖ్ (రజి). దానిపై ఖుర్‌ఆన్‌లో "ఈసంగతి వినగానే 'ఇలాంటి మాటలు అనడం మనకు తగదు. దేవుడు పరిశుద్ధుడు. ఇది పచ్చిఅపనింద' అని మీరెందుకు అనలేదు? మీరు (నిజమైన) విశ్వాసులైతే ఇకముందు ఎన్నటికీ ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని దేవుడు మీకు ఉపదేశిస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతో వివేకవంతుడు" (24:16-18) అనే సూక్తులు అవతరించాయి.

7-మహాప్రవక్త ముహమ్మద్ (స) కపటవిశ్వాసుల పాపమన్నింపు కోసం దేవుణ్ణి ఎక్కువగా ప్రార్థిస్తుండేవారు. ఉమర్ ఫారూఖ్ (రజి)కు ఇది నచ్చలేదు. అంచేత ఆయన "వారి కోసం పాపమన్నింపు ప్రార్థన చేసినా, చేయకపోయినా ఒకటే" అన్నారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "ప్రవక్తా! వారికోసం నీవు పాపమన్నింపు ప్రార్థనచేసినా, చేయకపోయినా ఒకటే. దేవుడు వారిని ఎన్నటికీ మన్నించడు. దుర్జనులకు దేవుడు సన్మార్గం చూపడు" (63:6) అనే సూక్తి అవతరించింది.

8-కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై చనిపోయినపుడు దైవప్రవక్త (స) అతని విశ్వాసి కుమారుని కోరికపై అతని జనాజానమాజ్ చేయడానికి సిద్ధమయ్యారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) "దైవప్రవక్తా! మీగురించి ఎన్నో చెడ్డమాటలు పలికిన ఇలాంటి దైవవిరోధి కోసం జనాజా నమాజ్ చేయడానికి సిద్ధపడుతున్నారా?" అని అన్నారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "ఇకముందు వారిలో ఎవరైనా చనిపోతే, నీవు వారి కోసం శవప్రార్థన చేయకు; వారి సమాధుల వద్ద కూడా నిల్చోవద్దు. వారు దేవుణ్ణి, ఆయన ప్రవక్తను తిరస్కరించారు. వారు చనిపోయినా దుర్మార్గస్థితిలోనే చనిపోతారు" (9:84) అనే సూక్తి అవతరించింది.

9-ఇస్లాంకు పూర్వం మూఢకాలంలో పగటివేళ ఉపవాసవ్రతాలు పాటిస్తున్నపుడు రాత్రివేళలో (ఉపవాస విరమణ తరువాత) భార్యతో సంగమించడం అధర్మంగా ఉండేది.



అయితే హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఒక రోజురాత్రి మేల్కొని తన అర్ధాంగితో సంగమించారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "ఉపవాస కాలం రాత్రివేళల్లో మీరు మీ భార్యల దగ్గరకు పోవడం ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు. మీరు (మీ భార్యల చెంతకు పోవడానికి సంకోచిస్తూ) ఆత్మద్రోహం చేసుకుంటున్న సంగతి దేవునికి తెలుసు. అందువల్ల ఆయన మిమ్మల్ని కనికరించి మీ పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఇప్పుడిక మీరు మీ భార్యలతో నిస్సంకోచంగా రాత్రులు గడపవచ్చు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసినదాన్ని (దాంపత్య సుఖాన్ని) అనుభవించండి" (2:187) అనే సూక్తి అవతరించింది.

10-ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) ఇంట్లో పడుకొని ఉంటే ఆయన సేవకుడు (అనుమతి లేకుండా) లోపలికి దూసుకొచ్చాడు. అప్పుడాయన "దేవా! అనుమతి లేకుండా ప్రవేశించడాన్ని నిషేధించు" అని దైవాన్ని ప్రార్థించారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "విశ్వాసులారా! మీరు మీ ఇండ్లలోకి తప్ప ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా, వారికి సలాం చేయకుండా ప్రవేశించకండి. ఇది మీకెంతో మంచిపద్ధతి" (24:27) అనే సూక్తి అవతరించింది.

11-హజ్‌యాత్ర సందర్భంగా ఉమర్ ఫారూఖ్ (రజి) "దైవప్రవక్తా! మనం మఖామె ఇబ్రాహీంని నమాజ్ స్థలంగా చేసుకుంటే ఎంత బాగుంటుంది!" అని అన్నారు. దానిపై ఖుర్‌ఆన్‌లో "మేము కాబాలయాన్ని ప్రజల కోసం (ఆరాధనా) కేంద్రంగాను, శాంతి నిలయం గాను చేసి, ఇబ్రాహీం నిలబడిన చోటును ప్రార్థనా స్థలంగా చేసుకోవలసిందిగా ప్రజలను ఆదేశించాము." (2:125) అనే సూక్తి అవతరించింది.

12-ఒకసారి ఇద్దరు (ముస్లిం) వ్యక్తుల మధ్య ఏదో తగాదా వచ్చింది. అందువల్ల వారు తీర్పు కోసం దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి విషయం వివరిస్తూ తీర్పు చేయమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) వ్యవహారం విన్న తరువాత వారిలో ఒకతనికి అనుకూలంగా తీర్పిచ్చారు. అయితే రెండవ వ్యక్తి తృప్తిచెందక ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు వెళ్దాంపద అన్నాడు. ఇలా చెప్పి వారిద్దరు ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు వెళ్ళారు. తీర్పు తనకు అనుకూలంగా వచ్చిన వ్యక్తి మాట్లాడుతూ "దైవప్రవక్త (స) తీర్పు నాకు అనుకూలంగా ఇచ్చారు. కాని ఇతను దాంతో తృప్తిచెందకుండా ఉమర్ దగ్గరికి వెళ్దాంపద అని నన్నిక్కడకు పిలుచుకొచ్చాడు" అని చెప్పాడు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని దాన్ని ధృవపరచుకోవడానికి "ఇది నిజమేనా?" అడిగారు రెండవ వ్యక్తితో. అతను నిజమే అన్నాడు. అప్పుడు ఉమర్ (రజి) "అయితే ఉండు, ఇప్పుడే వస్తా"నంటూ ఇంట్లోకి పోయి చేతిలో ఖడ్గం తీసుకొని వచ్చారు. రాగానే 'ఉమర్ దగ్గరకు వెళ్దాంపద' అన్న వ్యక్తి శిరస్సును ఒక్క వ్రేటుతో ఖండించారు.

ఆ తరువాత రెండవ వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి పోయి జరిగిన సంఘటన గురించి వివరిస్తూ "ఉమర్ (రజి) నా సహచరుడ్ని హతమార్చారు" అని చెప్పాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "ఇలా జరుగుతుందని నేననుకో లేదు. అయినా ఉమర్ ఒక విశ్వాసిని హతమార్చేటంతటి సాహసం చేస్తాడా!" అన్నారు ఆశ్చర్యపోతూ. అప్పుడు ఖుర్‌ఆన్‌లో ఈ సూక్తి అవతరించింది : "నీ ప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారం కోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పుపట్ల ఏమాత్రం తటపటాయించకుండా ఆసాంతం స్వీకరించనంత వరకూ వారు నిజమైనవిశ్వాసులు కాలేరు." (4:65). ఈ సూక్తితో హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) నేరారోపణ బంధం నుండి బయటపడ్డారు.

## (20) ఉమర్ (రజి) ఫారూఖ్ (రజి) హితోక్తులు

- ఎవరైతే నమాజును కాపాడుకుంటాడో అతడు తన ధర్మాన్ని కాపాడుకున్నట్లే.
- పరలోకంలో గౌరవప్రదమైన జీవితం గడపదలచుకుంటే ఇహలోకంలో సత్కార్యాలు చేయండి.
- దేవునికి భయపడండి, ఆయనపైనే భారం వేయండి. ఇది చాలు ముస్లింలకు.
- అల్లాహ్ సన్నిధిలో మన సదాచరణలే మనకు పనికొస్తాయి. పేరు ప్రతిష్ఠలు, వంశమర్యాదలు ఏవీ పనికిరావు.
- ఇతరుల తప్పులను క్షమించనివాడ్ని దేవుడు కూడా క్షమించడు.
- మనిషి పాటించే నమాజు, ఉపవాసాలను చూడకండి, అతని మాటలు, చేతలు మాత్రమే చూడండి.
- అత్యంత శ్రేష్ఠమైన సంపద ఆత్మసంతృప్తే.
- అతిథి సత్కారం మనిషి ఔన్నత్యాన్ని పెంచుతుంది.
- హద్దుమీరిన పరిహాసం వల్ల మనిషి గౌరవం తగ్గుతుంది.
- ఈ రోజు చేయవలసిన పనిని రేపటికి వాయిదా వేయకండి.
- వెనుకేసిన అడుగు ఇక ముందుకు సాగదు.
- చెడును గుర్తించండి, లేకుంటే ఆ చెడులో మీరూ కూరుకుపోవచ్చు.
- ఇతరుల తప్పులు ఎత్తిచూపే ముందు తమ తప్పులేమిటో చూసుకోవాలి.
- సహనం వహించండి, ప్రశాంత జీవితం గడుపుతారు.
- ఈర్ష్య పడకండి, దానివల్ల విరోధభావం జనిస్తుంది.



- నా లోపం ఏమిటో నాకు ఎత్తి చూపేవాడికి దైవం మేలుచేయుగాక!
- పశ్చాత్తాపంచెందేవారి సాంగత్యంలో కూర్చోండి. వారి హృదయాలు మెత్తబడి ఉంటాయి.
- ఇతరుల కోసం తన పరలోక జీవితాన్ని నాశనం చేసుకునేవాడే అందరికంటే పెద్ద మూర్ఖుడు.
- పాపకార్యాలు తక్కువగా చేయండి, మరణబాధ తేలికవుతుంది.
- మరణించిన మీ తండ్రిగారి స్నేహితుల పట్ల సద్భావంతో మెలగండి; మీ జీవితం సార్థకం అవుతుంది.
- ఇతరుల విషయంలో అతి శ్రద్ధకు పోయి మిమ్మల్ని మీరు మరచిపోకండి.
- ఏ పాలకుని కారణంగా అతని ప్రజలు నీతి తప్పుతారో అతనికంటే నికృష్ట పాలకుడు మరొకడుండడు.

# 3. ఉస్మాన్ గని (రజి)

పూర్వం ఉస్మాన్ బిన్ అప్ఫాన్ అనే ఓ ధనికుడు వ్యాపార నిమిత్తం సిరియా పోయి మక్కా తిరిగొస్తున్నాడు. దారిలో ఓ చోట రాత్రివేళ విడిదిచేసి నిద్రపోతుంటే "పడుకున్న వాడా! మేలుకో మక్కాలో అహ్మద్ బయల్పడ్డాడు" అని దిక్కులు పిక్కటిల్లేలా ధ్వని విన్పించింది. దాంతో ఉస్మాన్ చివాలునలేచి కూర్చున్నాడు. చూస్తే ఎవరూ కన్పించలేదు. కాని ఆ పలుకులు మాత్రం అతని చెవుల్లో మాటిమాటికి ప్రతిధ్వనించ సాగాయి.

ఉస్మాన్ వ్యాపారసామగ్రితో అక్కడ్నుంచి కదలి మళ్ళీ ప్రయాణం సాగించాడు. మక్కా ఇంకా కొన్నిమైళ్ళ దూరం ఉండగా ఆయన్ని తల్హా బిన్ ఉబైదుల్లా అనే మిత్రుడు కలిశాడు. అతను తన బస్రా పర్యటన విశేషాలు తెలియజేస్తూ ఇలా చెప్పాడు:

"నేను బస్రా గుండా వస్తుంటే ఒక సాధువు ఎదురై 'మక్కా ప్రజలలో అహ్మద్ అవతరించాడా' అని అడిగాడు. నేను అహ్మద్ ఎవరన్నాను. దానికా సాధువు 'అబ్దుల్లా బిన్ అబ్దుల్‌ముత్తలిబ్ కొడుకు. ఆయన అంతిమదైవప్రవక్త' అని సమాధానమిచ్చాడు."

అప్పుడు ఉస్మాన్ ఎడారిలో అర్ధరాత్రి తనకు ఎదురైన అనుభవం గురించి చెప్పాడు. ఆ తరువాత వారిద్దరు మక్కా చేరుకొని హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళారు. ఆయన ముందు తమ అనుభవాల్ని గురించి చెప్పుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే వారిద్దర్నీ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పిలిచికెళ్ళారు. అక్కడ తల్హా, ఉస్మాన్‌లు దైవప్రవక్త (సల్లం) హితోక్తులు విని ఇస్లాం స్వీకరించారు.

ఇస్లాంస్వీకరణతో ముస్లింలపై దుర్భరమైన కష్టాలు విరుచుకుపడ్డాయి. మక్కా అవిశ్వాసుల వేధింపులు భరించలేక కొందరు ముస్లింలు దైవప్రవక్త (స) అనుమతితో అబిసీనియాకు వలసపోయారు. అలా వలసపోయినవారిలో హజ్రత్ ఉస్మాన్ (రజి), ఆయన సతీమణి దైవప్రవక్త (స) ప్రియకుమార్తె హజ్రత్ రుఖియా (రజి) కూడా ఉన్నారు.

ఆ తరువాత వారిద్దరు దంపతులు ఇతర ముస్లింలతో పాటు మదీనాకు వలస పోయారు. మక్కా అవిశ్వాసులతో జరిగిన మొదటి (బదర్) యుద్ధంలో హజ్రత్ రుఖియా (రజి) జబ్బుపడి ఉన్నందున హజ్రత్ ఉస్మాన్ (రజి) పాల్గొనలేక పోయారు.

బదర్‌యుద్ధ విజయవార్త తెలియజేయడానికి దైవప్రవక్త (స) ఇద్దరు యోధులను మదీనా పంపించారు. వీరిద్దరు వేగంగా మదీనా చేరుకున్నారు. కాని అక్కడ ప్రజావాహిని మూగబోయినట్లు కన్పించింది. దైవప్రవక్త (స) ఉస్మాన్ (రజి) ధర్మపత్ని రుఖియా (రజి) మరణం మదీనాపై మౌనముద్ర వేసింది. ఆ సాధ్వీమణిని ఖననంచేసే సమయంలో ఈ విజయవార్త అందింది. అప్పుడు విచారంతో ఉన్న ముస్లింల ముఖాలలో కాంతిరేఖలు తొణికిసలాడాయి.

దైవప్రవక్త (సల్లం) బదర్‌యుద్ధం నుండి తిరిగిరాగానే తన కుమార్తె రుఖియా (రజి) మరణవార్త వినవలసి వచ్చింది. భార్య మరణం పట్ల హజ్రత్ ఉస్మాన్ (రజి) ఎంతో తల్లడిల్లి పోయారు. "దైవప్రవక్తా! మీతో ఏర్పడిన ఈ ప్రత్యేక సంబంధం కాస్తా ఇప్పుడు లేకుండా పోయింది" అన్నారు ఆయన ఎంతో ఆవేదనతో.

మహాప్రవక్త ముహమ్మద్ (స) హజ్రత్ ఉస్మాన్ (రజి)ని అమితంగా అభిమానించే వారు. ఆయన సుగుణసంపత్తి వల్ల కూడా దైవప్రవక్త (స) ఎంతో ప్రభావితులయ్యారు. అంచేత కొన్నాళ్ళకు ఆయన తన రెండోకుమార్తె హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి)ని ఉస్మాన్ (రజి)కిచ్చి వివాహం చేశారు.

దైవప్రవక్త (స) మొదట్లో తన కుమార్తె హజ్రత్ రుఖియా (రజి)ను ఉస్మాన్ (రజి)కు ఇచ్చి పెళ్ళిచేశారు. అయితే ఆమె చనిపోవడం వల్ల తన రెండవ కుమార్తె హజ్రత్ కుల్సూమ్ (రజి) వివాహం కూడా ఆయనతోనే జరిపారు. అందువల్ల ఉస్మాన్ (రజి) 'జున్నూరైన్' అని పేరుపడ్డారు. కాని ఆతర్వాత కొన్నేళ్ళకు హి.శ. 9వ సంవత్సరంలో ఉమ్మెకుల్సూమ్ (రజి) కూడా చనిపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఉస్మాన్ (రజి)కు పెళ్ళి చేయండి. నాకు మూడవ కుమార్తె ఉంటే ఆమెను కూడా ఉస్మాన్‌కు ఇచ్చి పెళ్ళి చేసేవాడ్ని. నేను ఉస్మాన్‌తో నా కుమార్తెల వివాహం దివ్యావిష్కృతి ద్వారా (అంటే దేవుని అనుమతితో) చేశాను" (తిబ్రాని). ఆయన మరో సందర్భంలో ఇలా అన్నారు: "ఒకవేళ నాకు నలభై మంది కుమార్తెలు ఉంటే ఒకరి తర్వాత మరొకరు చొప్పున వారందరినీ ఉస్మాన్‌కు ఇచ్చి పెళ్ళిచేస్తాను" (ఇబ్నెఅసాకర్).



హజ్రత్ ఉస్మాన్ (రజి) ఎంతో బిడియస్థులు. దైవప్రవక్త (స)ను కలుసుకోవడానికి ఎంతోమంది వస్తుంటారు. కాని ఉస్మాన్ (రజి) రాగానే ఆయన సావధానమై మోకాళ్ళ మీది బట్టలు సరిచేసుకునేవారు. ఈ విషయాన్నే ప్రవక్తసతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ప్రస్తావిస్తూ "ఓసారి ఉస్మాన్ (మాఇంటికి) వచ్చినపుడు (వెంటనే) దైవప్రవక్త (స) తమ బట్టలన్నీ సరిచేసుకున్నారు. తర్వాత 'ఇతనిపట్ల దైవదూతలు సైతం సిగ్గుపడుతుంటే నేనెలా సిగ్గుపడకుండా ఉంటాను?' అని అన్నారాయన. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉస్మాన్ (రజి) దైవప్రవక్త (స)తో కలసి అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. హి.శ. 6వ సంవత్సరంలో దైవప్రవక్త (స) తన అనుచరుల్ని తీసుకొని కాబా (ఉమ్రా) యాత్ర జరిపే ఉద్దేశంతో మదీనా నుండి మక్కా బయలుదేరినపుడు హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా ఆయన వెంట ఉన్నారు. అయితే ఈ యాత్రికులు మక్కా సమీపంలోని హుదైబియా ప్రాంతానికి చేరుకునేటప్పటికి మక్కాఅవిశ్వాసులు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ముస్లింలు తాము కాబాయాత్ర చేసే ఉద్దేశ్యంతో మాత్రమే వచ్చామని ఎంత చెప్పినా మక్కా ఖురైష్‌నాయకులు వినకుండా తమ ప్రతినిధుల్ని పంపి చర్చల ద్వారా వారిని బెదిరించడానికి ప్రయత్నించారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో ఖురైషీయుల విషయం గురించి సంప్రదించారు. ఖురైషీయులతో చర్చలు జరిపి తగిన పరిష్కారం తెచ్చే సమర్థుడైన ప్రతినిధిని పంపదలచుకున్నారు. ఈ పని కోసం హజ్రత్ ఉస్మాన్ (రజి)ని ఎంపిక చేసి మక్కా నగరానికి పంపించారు.

మక్కాలో ఉస్మాన్ (రజి) సోదరుడు ఒకాయన ఉన్నాడు. అతని మద్దతుతో ఉస్మాన్ (రజి) మక్కా వెళ్ళారు. అక్కడ ఖురైష్ నాయకుల్ని కలుసుకొని వారితో ఇలా అన్నారు: "మేము మీ ముందు రెండే రెండు విషయాలు ఉంచుతున్నాం. మమ్మల్ని కాబాప్రదక్షిణ చేసుకోనివ్వండి. దానికి ఒప్పుకోకపోతే యుద్ధానికి సిద్ధంగా ఉండండి".

"అలా కుదరదు. కావాలంటే నువ్వొక్కడివే కాబాప్రదక్షిణ చేసుకో. అంతేగాని ఇతరులప్రస్తావన ఎత్తకు. వారు అటు నుంచి అటే వెళ్ళిపోవాలి" అన్నారు ఖురైషీయులు.

ఈ మాటలు వినగానే హజ్రత్ ఉస్మాన్ (రజి)కు వళ్ళు మండిపోయింది.

"ఏమిటీ? ముస్లింలు కాబాదర్శనానికి నోచుకోకుండా వెళ్ళిపోవాలా, నేనొక్కడ్ని మాత్రం కాబాప్రదక్షిణ చేసుకోవచ్చా? కాదు, ముస్లింలందరికీ కాబాప్రదక్షిణ చేసుకునే అవకాశం ఇవ్వాల్సిందే" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) పట్టుదలతో.

ఖురైషీయులు అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా పట్టు విడవకుండా కాబాదర్శనం చేసుకునే అవకాశాన్ని ముస్లింలందరికీ ఇవ్వాలని అన్నారు. ఇలా చర్చలు ఎటూ తెగకుండా కొన్నాళ్ళు జరిగిపోయాయి.

చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. అదీగాక ఖురైషీయులు హజ్రత్ ఉస్మాన్ (రజి)ని మక్కా నుండి వెళ్ళనివ్వకుండా ఆపి ఉంచారు. ఈలోగా ఉస్మాన్ (రజి)ని హత్య చేశారని జనంలో పుకార్లు పుట్టాయి. ఆయన తిరిగి రాకపోవడంతో ముస్లింలు కూడా ఈ వార్త నిజమేనని భావించారు.

ఇంకేముంది! ముస్లింలలో పెద్ద కలకలం చెలరేగింది. వారు ఆగ్రహోదగ్రులయి పోయారు. అందరిలోనూ పౌరుషం పడగ విప్పి నాట్యమాడసాగింది.

“ఎంత ద్రోహానికి వడిగట్టారు వీరు! పైగా పవిత్ర మాసంలో ఈ ఘాతుక చర్య!! వీరికి పవిత్ర మాసం పట్లగాని, యాత్రికుల పట్లగాని ఏ మాత్రం గౌరవం లేదు” అన్నారు దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని.

అయితే ఇప్పుడు ముస్లింల తక్షణ కర్తవ్యం ఏమిటీ?

రాజనీతి ఉల్లంఘించి ఒక దౌత్యవేత్తను చంపడమంటే స్పష్టంగా యుద్ధ ప్రకటన చేయడమే. అందువల్ల వెంటనే దైవప్రవక్త (సల్లం) ప్రధాన అనుయాయుల నందరినీ సమావేశపరిచారు.

“ఖురైషీయుల నుండి ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం మన విధి. ప్రతీకారం తీర్చుకోకుండా మనం ఇక్కడ్నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి మరల కూడదు” అన్నారు దైవప్రవక్త (సల్లం) గంభీర వదనంతో.

ఈమాట చెప్పిన తరువాత ఆయన కొంచెం దూరాన ఉన్న ఓ తుమ్మచెట్టు నీడకు పోయి కూర్చున్నారు. అనుచరులు కూడా అక్కడికెళ్ళి తమ ప్రియతమ నాయకుని చుట్టూ గుమికూడారు.

ఓ మహోన్నతకార్యం కోసం వారు కంకణం కట్టుకున్నారు. దైవప్రీతి కోసం, ధర్మరక్షణ కోసం ఒక మహోద్యమానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (సల్లం)కు పూర్తిగా విధేయులై దైవధర్మం పరిరక్షణ కోసం ముస్లింలంతా తమ సర్వస్వాన్ని త్యాగం చెయ్యడానికి ముందుకొచ్చారు.

దైవప్రవక్త (సల్లం) చేయి జాపారు. అనుచరులు ఒక్కొక్కరే ముందుకొచ్చి ఆయన చేతిలో చేయి వేసి, శపథం చేశారు. ఘోరమైన శపథం! ఇక విజయమో, వీరమరణమో తేల్చుకోవడమే తరువాయి పని!!

ఆ తరువాత మక్కానాయకులు హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పంపివేశారు. ఆయన హుదైబియాకు తిరిగివచ్చారు. ఆయన్ని చూడగానే ముస్లింలంతా తాము విన్న వార్త నిజం కాదని గ్రహించి చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. అంతలో ఖురైషీయుల దౌత్యవేత్తగా సుహైల్ బిన్ అమ్ర్ చర్చలు జరపడానికి వచ్చాడు. అతను దారుణమైన షరతులు



విధించడం, వాటిని దైవప్రవక్త (స) దేవుని ఆదేశంతో అంగీరించడం, దాంతో ముస్లింలు ఉమ్రా జరపకుండానే మదీనా తిరిగివెళ్ళిపోవడం జరిగింది.

## (1) అపూర్వ ధనత్యాగం

హజ్రత్ ఉస్మాన్ (రజి) గొప్ప ధనికులు కావడంతో పాటు మంచి దానశీలి కూడా. ఒకసారి దైవప్రవక్త (స) (మసీదులో ప్రసంగవేదికపై నిల్చొని సైన్యాన్ని సమాయత్తపరుస్తూ ఆర్థికసహాయం కోసం ప్రజలను ప్రోత్సాహపరుస్తున్నారు. అప్పుడు ఉస్మాన్ (రజి) లేచి “దైవప్రవక్తా! నేను అవసరమైన సామగ్రితో పాటు వంద ఒంటెలను (దైవమార్గంలో) ఇస్తున్నాను” అని అన్నారు. దీనికి దైవప్రవక్త (స) స్పందించకుండా ప్రజలను మళ్ళీ ప్రోత్సాహపరచసాగారు. ఈసారి ఉస్మాన్ (రజి) “దైవప్రవక్తా! నేను రెండొందల ఒంటెల్ని ఇస్తున్నాను” అని అన్నారు. దానికీ దైవప్రవక్త (స) స్పందించకుండా ప్రజలను మళ్ళీ ప్రోత్సాహపరచసాగారు. అప్పుడు ఉస్మాన్ (రజి) లేచి “దైవప్రవక్తా! నేను అవసరమైన సామగ్రితో పాటు మూడొందల ఒంటెల్ని (దైవమార్గంలో) ఇస్తున్నాను” అని అన్నారు. ఈమాట వినగానే దైవప్రవక్త (స) ప్రసంగవేదికపై నుండి దిగి “ఇప్పటి నుంచి ఉస్మాన్ ఐచ్ఛిక (నఫిల్) ఆరాధనలు చేయకపోయినా సరే ఇతనికి ఇదే (మూడొందల ఒంటెలదానమే) సరిపోతుంది” అని అన్నారు (తిర్మిజి).

ఒకసారి మదీనాలో కరువు వచ్చింది. జనం తిండిగింజల కోసం అల్లాడిపోసాగారు. ఓరోజు ఖలీఫా అబూబకర్ (రజి) ప్రజలదుస్థితి చూసి “ఈరోజు సాయంత్రానికల్లా దేవుడు మీబాధ దూరం చేస్తాడు” అని జోస్యం చెప్పారు.

విచిత్రమేమిటంటే కాకతాళీయంగా అదే రోజు సాయంత్రం సిరియా నుంచి హజ్రత్ ఉస్మాన్ (రజి)కు చెందిన వాణిజ్యబిడారాలు మదీనా చేరుకున్నాయి. వేయి ఒంటెల మీద ధాన్యపు బస్తాలు కిటకిటలాడసాగాయి. సిరియా నుంచి ఉస్మాన్ (రజి) గారి సరుకు వచ్చిందని తెలియగానే మదీనాలోని పెద్దపెద్ద వర్తకులంతా బేరమాడటానికి మార్కెట్‌కు తరలి వచ్చేశారు.

ఉస్మాన్ (రజి) వర్తకుల్ని ఉద్దేశించి “సిరియా నుంచి దిగుమతి అయిన ఈ సరుకుపై మీరు నాకు ఎంత లాభం ఇవ్వగలరు?” అని అడిగారు.

“మీరు సరుకును పది రూపాయలకు కొంటే దానికి నేను పన్నెండు రూపాయలు ఇస్తాను” అన్నాడు ఒక వ్యాపారి.

“నాకు దానికంటే ఎక్కువ లాభం వస్తుంది” అన్నారు ఆయన.

“అట్లయితే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పదమూడు రూపాయలు ఇస్తాను” అన్నాడు మరోవ్యాపారి వేలంపాట పెంచుతూ.

“నాకు ఇంతకంటే ఎక్కువ లాభం వచ్చే అవకాశముంది.”

“సరే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పద్నాలుగు రూపాయలు ఇస్తాను, వదిలేయండి” అన్నాడు వేరొక వర్తకుడు.

“ఉహూ, ఆ లాభం నాకు చాలదు. నాకు దానికంటే కూడా ఎక్కువ లాభం వచ్చే అవకాశం ఉంది” అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

“పోనీ, మరో రూపాయి పెంచుతున్నా, సరుకు వదిలేయండి.”

“లాభం లేదు. నాకు ఇంతకంటే కూడ ఎక్కువ లాభం వచ్చే చాన్సుంది” అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ.

“ఏమిటీ ఇంతకంటే ఎక్కువ లాభమా! ఎవరండీ మీకింత కంటే ఎక్కువ లాభం ఇస్తానంటున్నది?” అన్నారు వర్తకులంతా ఆశ్చర్యపోతూ.

“నాకు పదిరూపాయల సరుకు మీద వందరూపాయలు ధర లభిస్తుంది. మీరు ఇంతకంటే ఎక్కువధర పెట్టి ఈ సరుకు కొనగలరా?” అన్నారు ఉస్మాన్ (రజి).

అంటే పది రూపాయల పెట్టుబడికి తొంభయి రూపాయలు లాభం వస్తుందన్న మాట! ఈ మాటలు విన్న వర్తకులు నోరెల్లబెట్టి మరింత ఆశ్చర్యపోయారు.

“ఇది మరీ చోద్యంగా ఉంది. మేమ్మటుకు అంత ధర పెట్టలేమండీ!” అన్నారు వారు నిరాశతో ఢీలా పడిపోయి.

“అయితే వినండి. నేనీ మొత్తం సరుకును దైవమార్గంలో దానం చేస్తున్నాను. దీనికి మీరే సాక్షులు. దేవుడే నా పెట్టుబడిపై పదింతలు లాభం ప్రసాదించేవాడు” అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

ఈ సంగతి వినగానే తిండిగింజల కోసం కటకటలాడుతున్న పేద ప్రజలు ఎంతో సంబరపడిపోయారు. సిరియా నుంచి వచ్చిన మొత్తం వేయిఒంటెల ఎత్తు ఆహార ధాన్యాలు అప్పటికప్పుడు పేదలకు దానం చేశారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

అదే రోజు రాత్రి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఓ విచిత్రమైన కల గన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) జ్యోతిర్మయ దుస్తులు ధరించి టర్కీజాతి తెల్లగుర్రం ఎక్కి ఎక్కడికో బయలుదేరుతున్నట్లు ఆయన కలలో కన్పించారు.

అప్పుడాయన “దైవప్రవక్తా! మీరు హడావిడిగా ఎక్కడికి వెళ్తున్నారు? నా హృదయం మాత్రం మీ దర్శనం కోసం తహతహలాడుతోంది” అన్నారు.

“ఈరోజు ఉస్మాన్ (రజి) వేయి ఒంటెల ఆహారధాన్యాలు దానం చేశాడు కదా! ఆయన చేసిన ఈ దానాన్ని దేవుడు స్వీకరించి, దానికి ప్రతిఫలంగా ఒక స్వర్గకన్యతో



ఆయన వివాహం జరిపిస్తున్నాడు. నేనా వివాహమహోత్సవంలో పాల్గొనడానికి వెళ్తున్నా” అన్నారు దైవప్రవక్త (సల్లం).

## (౨) ఖలీఫా ఎన్నిక

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) హత్యోదంతంలో తీవ్రంగా గాయపడినప్పుడు కొందరు ఆయన్ని తన రాజకీయ వారసుడిని ప్రతిపాదించమని అడిగారు. అప్పుడాయన ఇలా అన్నారు : “నేనొకవేళ అబూబకర్ (రజి) సంప్రదాయం ప్రకారం ఆచరించకుండా ఖలీఫా వారసుడిగా ఎవరి పేరునూ ప్రతిపాదించకపోతే అది నాకు ధర్మసమ్మతమే అవుతుంది. నా వారసుడిగా ఎవరి పేరునైనా ప్రతిపాదించదలచుకుంటే నేను అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) పేరును ప్రతిపాదించేవాడ్ని. కాని ఆయన నాకు ముందే చనిపోయారు. లేదా నేను అబూహుజైఫా బానిస సాలమ్ (రజి) పేరును ప్రతిపాదించేవాడ్ని. కాని ఆయన కూడా నాకు ముందే చనిపోయారు.”

ఆ తరువాత ఆయన ఒక ఎన్నికల సంఘం నియమించారు. ఆ సంఘంలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి), జుబైర్ బిన్ అవామ్ (రజి), తల్హా (రజి), అలీ (రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) సభ్యులుగా ఉన్నారు. తల్హా (రజి) ఆ సమయంలో మదీనాలో లేనందున ఆయన కోసం మూడు రోజులు ఎదురుచూడండని చెప్పారు. తర్వాత ఆయన తన కుమారుడు అబ్దుల్లా (రజి)ని పిలిచి “ఖిలాఫత్ విషయంలో ఏదైనా భేదాభిప్రాయం వస్తే, నీవు మెజార్టీ సభ్యులతో కలవాలి. ఒకవేళ రెండు పక్షాలు సమానసంఖ్యలో ఉంటే, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఏపక్షాన ఉంటే నువ్వా పక్షంలో చేరిపో” అని చెప్పారు. ఆ తర్వాత ఆయన అబూతల్హా అన్సారి (రజి)ని, మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి)ని పిలిపించి “ఖలీఫా ఎన్నిక సంప్రదింపుల కోసం వారొక చోట సమావేశమైనప్పుడు సమావేశం ముగిసేదాకా మీరిద్దరు ద్వారం దగ్గర కాపలాకాస్తూ ఎవరినీ లోపలికి రానీయకూడదు” అని ఆదేశించారు.

ఫారూఖీ వీలునామా ప్రకారం మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి), అబూతల్హాఅన్సారీ (రజి)లు ఉమర్ ఫారూఖ్ (రజి) ఖననం తరువాత కొత్త ఖలీఫా ఎన్నిక జరిగేవరకు హజ్రత్ సుహైబ్ (రజి)ని మూడు రోజుల పాటు తాత్కాలిక ఖలీఫాగా నియమించారు. తరువాత ఎన్నికల సంఘం సభ్యుల్ని తీసుకొని ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి తీసికెళ్ళారు. అక్కడ ఒక గదిలో వారందర్నీ సమావేశపరచి తలుపులు మూసేసి, లోపలికి ఎవరినీ రానీయకుండా కాపలాకాస్తూ బయట కూర్చున్నారు.

సభ ప్రారంభమయింది. అందరికంటే ముందు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) లేచి నిలబడి ఇలా అన్నారు. “ ఖిలాఫత్ ప్రాతినిధ్యం కోసం ప్రతిపాదించబడిన మీలో ఎవరు తనను తాను ఖిలాఫత్ పదవిని వదలుకోవడానికి సిద్ధమవుతారో చెప్పండి. ఆ

సభ్యునికే ఖలీఫాను ఎన్నుకునే అధికారం ఉంటుంది.” దీనికి ఎవరూ స్పందించలేదు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) “సరే, నేనే ఖిలాఫత్ పదవి ఆలోచన విరమించుకొని, ఖలీఫా ఎన్నికపని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాను” అని అన్నారు. ఇతర సభ్యులందరూ ఈమాట విని “చాలా సంతోషం. మీరే మాలో ఉత్తముడని భావించిన సభ్యుడ్ని ఖలీఫాగా ఎన్నుకోండి. ఆ మేరకు మేము మీకు అధికారమిస్తున్నాం. మీ ఎంపికను మేము సమర్థిస్తాం; దాన్ని అమలుపరచడంలో మేము మీతో పూర్తిగా సహకరిస్తాం” అని అన్నారు. సమావేశం ముగిసింది.

ఖలీఫాఎంపిక నిర్ణయం ప్రకటించడానికి ఇంకా మూడురోజులు గడువుంది. ఈలోగా ఎన్నికల అధికారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సంఘంలోని ఇతర సభ్యులందరినీ విడివిడిగా కలుసుకొని, వారితో చర్చలుజరిపి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మూడురోజుల గడువులోని చివరిరోజు రాత్రి ఎన్నికలసంఘం మళ్ళీ సమావేశమయింది. అబ్దుర్రహ్మాన్ బిన్ఔఫ్(రజి) సమావేశం నుండి సాద్ (రజి), జుబైర్ (రజి)లను కొంచెం దూరంతీసికెళ్ళి “ఈ మూడురోజులు నేను మన సభ్యులతో జరిపిన చర్చల్లో అలి(రజి), ఉస్మాన్(రజి) పేర్లు ప్రముఖంగా బహిర్గతమయ్యాయి. అలీ అభిప్రాయం అడిగితే ఆయన ఉస్మాన్(రజి) పేరు ప్రతిపాదించాడు. ఉస్మాన్ అభిప్రాయం అడిగితే ఆయన అలి(రజి) పేరు ప్రతిపాదించాడు. మీ ఉద్దేశ్యం ఏమిటో చెప్పండి” అన్నారు.

సాద్, జుబైర్ (రజి)లు ఈమాట విని “మీరు మానుండి ‘బైత్’ తీసుకోండి. మేము మిమ్మల్ని ఈఊబి నుండి బయటికి తీస్తాం” అన్నారు. దానికి అబ్దుర్రహ్మాన్ (రజి) “నేనెలా బైత్ తీసుకుంటాను? ఖిలాఫత్ పదవికి ప్రతిపాదించబడినవారి నుండి నేను తొలగిపోయాను కదా!” అన్నారు. తర్వాత ఆయన అలి, ఉస్మాన్ (రజి)లతో విడివిడిగా చర్చలు జరిపారు. అంతలో తెల్లవారింది. ఫజర్ నమాజ్ కోసం వచ్చినవారితో మసీదు కిటకిటలాడుతోంది. జనం ఖలీఫా ఎన్నిక ప్రకటన కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్నారు.

నమాజ్ ముగిసింది. జనంలో ఆరాటం ఎక్కువైపోయింది. మరొకవైపు కొందరిలో గుసగుసలు మొదలయ్యాయి. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) పక్కవారితో గుసగుసలాడుతూ “నేను ఖలీఫా పదవికి అందరికంటే అలి (రజి) యోగ్యుడని భావిస్తున్నాను” అని అన్నారు. ఇబ్నె అబీ సరా (రజి), అబ్దుల్లా బిన్ అబీ రబిఆ (రజి)లు మాట్లాడుతూ “మేము ఖలీఫా పదవికి ఉస్మాన్ (రజి) ఎక్కువ యోగ్యుడని భావిస్తున్నాం” అని అన్నారు. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఈ గుసగుసలు విని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) దగ్గర కెళ్ళి “ఆలస్యం ఎందుకు? మీరు తొందరగా ఖలీఫాఎంపిక నిర్ణయం ప్రకటించండి. లేకుంటే జనంలో అల్లకల్లోలం చెలరేగే ప్రమాదం ఉంది” అని హెచ్చరించారు.



హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) వెంటనే లేచి నిలబడి ప్రజలను సంబోధిస్తూ ఇలా అన్నారు : “నేను ఎలాంటి శక్తివంచన లేకుండా ప్రతి వర్గం అభిప్రాయం తెలుసుకోవడానికి కృషిచేశాను. దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరులు, సలహామండలి సభ్యులు, ఖలీఫా పదవికి ప్రతిపాదించబడినవారు అందరూ నా నిర్ణయాన్ని ఆమోదించారు. నేను ఉమర్ ఫారూఖ్ (రజి) రాజకీయ వారసుడిగా ఉస్మాన్ (రజి)ని నిర్ణయించాను. నా శక్తి సామర్థ్యాల మేరకు నేను సరైన నిర్ణయమే తీసుకున్నానని భావిస్తున్నాను.”

ఈమాట చెప్పిన తర్వాత ఆయన ఉస్మాన్ (రజి)ని దగ్గరకు పిలిచి “దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త (స) సంప్రదాయాలు, గతఖలీఫాల ఆదర్శాల ప్రకారం ఖలీఫాగా నేను నా విధులు సక్రమంగా నిర్వహిస్తానని ప్రమాణం చెయ్యి” అని చెప్పారు. దాని ప్రకారమే ఉస్మాన్ (రజి) ప్రమాణం చేశారు. ఆ తరువాత అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) తన చేతిని ఉస్మాన్ (రజి) చేతిలో పెట్టి “బైత్” చేశారు. ఆ వెనువెంటనే ప్రవక్త అనుచరుల తోపాటు ఇతరులందరూ ఎంతో ఉత్సాహంతో బైత్ చేశారు.

హజ్రత్ తల్హా (రజి) ఆరోజు (హి.శ. 24, ముహర్రం ఒకటో తేదీ) వరకు మదీనా చేరుకోకపోవడం వల్ల సలహాసంప్రదింపుల్లో పాల్గొనలేక పోయారు. మరుసటి రోజు ఆయన మదీనా చేరుకొని బైత్ చేయడానికి సరాసరి ఉస్మాన్ (రజి) ఇంటికి వెళ్ళారు. కుశలప్రశ్నలయ్యాక ఖలీఫా ఉస్మాన్ (రజి) మాట్లాడుతూ “మీరు నగరంలో లేనప్పుడు నా ఎన్నిక జరిగింది. ఇప్పుడైనా మించిపోలేదు, మీరు ఖలీఫాగా ఉంటానంటే నేనీ పదవి నుండి తప్పుకుంటాను” అని అన్నారు.

హజ్రత్ తల్హా (రజి) ఈమాట విని “నేను ముస్లింలలో అరాచకం రేకెత్తించదలచుకోలేదు. అందరూ మిమ్మల్ని ఖలీఫాగా ఆమోదించి బైత్చేశారు గనక నేను కూడా మిమ్మల్ని ఖలీఫాగా ఆమోదించి బైత్ చేస్తున్నాను” అంటూ ఉస్మాన్ (రజి) చేతిలో చేయి కలిపి బైత్ చేశారు.

బైత్ తరువాత ఖలీఫా ఉస్మాన్ (రజి) ప్రజలను సంబోధిస్తూ సత్కర్మల ఆవశ్యకత, ప్రాముఖ్యతలను గురించి వివరించారు. ధనాధిక్యత తెచ్చిపెట్టే ఏమరుపాటు, అనర్థాలను గురించి హెచ్చరించారు. ప్రతి విషయంలోనూ దైవప్రసన్నతను దృష్టిలో పెట్టుకోవాలని ఉపదేశించారు. ఆతర్వాత ఆయన వివిధరాష్ట్రాల గవర్నర్లకు, అధికారులకు ఒకఉత్తర్వు జారీచేస్తూ ‘వారు ఉమర్ (రజి) పాలనలో ఎలా బాధ్యతాయుతంగా, నిజాయితీగా తమవిధులు నిర్వహించారో ఇప్పుడూ అలా నిర్వహించాలని అన్నారు.

## (3) పదవుల ఉద్వాసన, కొత్త నియామకాలు

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మరణవార్త వినగానే రోమ్తో పాటు అనేక శత్రు రాజ్యాలు తిరుగుబాటుకు పాల్పడ్డాయి. ఈరానీయులు తిరుగుబాటు బావుటా ఎత్తగానే

ఖలీఫా ఉస్మాన్ (రజి) హమ్దాన్, రే మొదలైన ఈరాన్ ప్రాంతాల వైపు సేనలను పంపి తిరుగుబాటును పూర్తిగా అణచివేశారు.

కూఫాలో సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) గవర్నర్‌గా పనిచేస్తున్న రోజుల్లోనే అక్కడ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ప్రభుత్వధనాగారం కోశాధికారిగా పనిచేస్తుండేవారు. ఒకసారి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఏదో అవసరం వచ్చి అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) దగ్గర కొంత అప్పు తీసుకున్నారు. కొన్నాళ్ళ తరువాత అబ్దుల్లా (రజి) బాకీ తిరిగివ్వమని అడిగితే సాద్ (రజి) ఇవ్వలేక పోయారు. దాన్ని గురించి వారిద్దరి మధ్య తగాదా వచ్చింది. ఈ తగాదా సంగతి మదీనాలో ఖలీఫా ఉస్మాన్ (రజి) దాకా చేరింది. అప్పుడాయన హి.శ. 25లో సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి)ని గవర్నర్ పదవి నుండి తొలగించి ఆ స్థానంలో తన క్షీరసంబంధ సోదరుడైన వలీద్ బిన్ ఉఖ్బా (రజి)ని నియమించారు.

కూఫా రాష్ట్రంలోని ఆజర్‌బాయ్‌జాన్ ప్రాంతం రక్షణ కోసం నియమించబడిన భద్రతాదళాల అధికారి ఉతెబా బిన్ ఫర్ఖద్‌ని కూడా ఆ పదవి నుండి ఆయన తొలగించారు. ఉతెబాను తొలగించగానే ఆజర్‌బైజాన్ వాసులు తిరుగుబాటుకు పాల్పడ్డారు. వెంటనే కూఫా కొత్తగవర్నర్ వలీద్ బిన్ ఉఖ్బా (రజి) ఆజర్‌బైజాన్‌పై సైనికచర్య తీసుకున్నారు. దాంతో ఆ ప్రాంతం ప్రజలు పాత షరతులపై తిరిగి ఒప్పందం చేసుకొని జిజ్యా చెల్లించడం ప్రారంభించారు. సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)ని గవర్నర్ పదవి నుండి తొలగించడం కూఫా ప్రజలకు ఏమాత్రం ఇష్టం లేకపోయింది. అదీగాక కొత్త గవర్నర్ వలీద్ బిన్ ఉఖ్బా (రజి) ప్రవర్తన కూడా వారికి నచ్చలేదు.

వలీద్ బిన్ ఉఖ్బాతో అబూజుబైదా అనే ఓ తాగుబోతు కవి చనువు పెంచుకొని ఎక్కువగా ఆయన సహచర్యంలోనే ఉండేవాడు. ఒకరోజు వలీద్ ఫజర్ నమాజ్‌లో నాలుగు రకాతులు పఠించి, వెనక్కితిరిగి నమాజీలతో "ఇంకా పఠించాలా?" అని అడిగారు. ఈ సంఘటన ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమై విషయం మదీనా దాకా చేరింది. ప్రజలు వలీద్‌పై మద్యం సేవించినట్లు ఖలీఫాకు ఫిర్యాదు చేశారు. అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) వలీద్‌ని మదీనా పిలిపించి విచారణ జరిపారు. విచారణలో వలీద్ మద్యం సేవించినట్లు రుజువయినందున ఆయనకు ఖలీఫా లాఠీ దెబ్బల శిక్ష విధించి గవర్నర్ పదవి నుండి తొలిగించారు. ఆయన స్థానంలో సయీద్ బిన్ ఆస్ (రజి)ని కూఫా గవర్నర్‌గా నియమించారు.

అబ్దుల్లా బిన్ సాద్ అల్‌మారూఫ్ (రజి) ఖలీఫా ఉస్మాన్ గని (రజి)కి క్షీరసంబంధ సోదరుడవుతారు. ఆయన దైవప్రవక్త (స) కాలంలో ఒకసారి మతభ్రష్టుడైపోయి, ఆ తర్వాత కొన్నాళ్ళకు పశ్చాత్తాపంచెంది మళ్ళీ ముస్లిం అయ్యారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను గవర్నర్ పదవి నుంచి తొలగించి



సైన్యాధ్యక్షుడిగా మాత్రమే ఉంచారు. ఆయన స్థానంలో అబ్దుల్లా బిన్ సాద్ (రజి)ను గవర్నర్‌గా నియమించ డమే గాకుండా ఆయనకు కోశాధికారి పదవి కూడా కట్టబెట్టారు. బహుశా ఈ మార్పు కారణంగా సైన్యాధికారుల్లో, పాలనాధికారుల్లో అనైక్యత, అంతః కలహాలు జనించాయి. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు ఈసంగతి తెలిసి అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను సైన్యాధ్యక్షుడి పదవి నుండి కూడా తొలగించి, అబ్దుల్లా బిన్ సాద్ (రజి)కు ఈజిప్టు, అలెగ్జాండరియాల్లో పూర్తి అధికారాలు ఇచ్చారు.

అయితే అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఉద్వాసన ఈజిప్టు ప్రజల హృదయాలను కలచివేసింది. వారు అబ్దుల్లా బిన్ సాద్ (రజి)కు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. మరొక వైపు రోమ్ చక్రవర్తికి ఈజిప్టు పరిస్థితులు తెలిసి దాన్ని సువర్ణవకాశంగా భావిస్తూ అలెగ్జాండరియాపై దాడి చేయడానికి ఓ పెద్ద సైనికపటాలం పంపించాడు. కొద్దిపాటి ప్రతిఘటన తరువాత రోమన్లు అలెగ్జాండరియాను స్వాధీనం చేసుకున్నారు. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు ఈ సంగతి తెలియగానే ఆయన అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను మళ్ళీ గవర్నర్‌గా నియమించి ఈజిప్టు పంపారు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టు వెళ్ళి గవర్నర్ బాధ్యతలు చేపట్టగానే మొట్టమొదట అలెగ్జాండరియాపై దాడిచేసి అక్కడి రోమ్‌సైనికుల్ని తరిమికొట్టారు. తరువాత అక్కడ ఒక మసీదు నిర్మించారు. దాని పేరు మస్జిదుల్ రహ్మత్. అమ్ర్ బిన్ ఆస్ (రజి) రాష్ట్ర పరిస్థితుల్ని పూర్తిగా అదుపుచేసి, పరిపాలనా వ్యవహారాలను చక్కదిద్దిన తరువాత ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని గవర్నర్ పదవి నుండి మళ్ళీ తొలగించి ఆ స్థానంలో తిరిగి అబ్దుల్లా బిన్ సాద్ (రజి)నే నియమించారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈసారి జరిగిన తన ఉద్వాసనతో చాలా బాధపడ్డారు. అటు అబ్దుల్లా (రజి) కూడా ఈ పునరుద్వాసన, పునర్నియామకాల పట్ల కలతచెందారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలం వరకు ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి) డెమాస్కస్-జోర్డాన్‌ల వరకు మాత్రమే గవర్నర్‌గా ఉండేవారు. ఉమర్ ఫారూఖ్ (రజి) నిర్యాణం తరువాత హమస్, ఖన్సరీన్ ప్రాంతాల గవర్నర్ ఉమైర్ బిన్ సయీద్ (రజి) తన పదవికి రాజీనామా ఇవ్వడంతో ఖలీఫాఉస్మాన్ (రజి) ఆ రెండు ప్రాంతాలను కూడా ముఆవియా (రజి) అధీనం చేశారు. ఆ తరువాత పాలస్తీనా గవర్నర్ అబ్దుర్రహ్మాన్ బిన్ అల్ఖమా చనిపోవడంతో పాలస్తీనాను కూడా ముఆవియా (రజి) రాష్ట్రంలో కలిపేశారు. ఇలా ఆయన యావత్తు సిరియా ప్రాంతానికి తిరుగులేని అధినేత అయ్యారు.

హి.శ. 27లో బస్రాప్రజలు తమ గవర్నర్ అబూమూసా అష్అరీ (రజి)పై ఖలీఫా ముందు ఆరోపణలు మోపడంతో ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని తొలగించి అక్కడ తన మామకొడుకు అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి)ని గవర్నర్‌గా నియమించారు. అంతేగాక

ఉస్మాన్ బిన్ఆస్ సఖఫీ అధీనంలోని అమ్మాన్, బహ్రైన్‌ల సైనికదళాలను కూడా ఆయన అధీనంలో ఉంచారు. ఖురాసాన్‌లో గవర్నర్ ఉబైదుల్లా బిన్ మామ్మర్‌ని తొలగించి ఆ స్థానంలో ఉమైర్ బిన్ఉస్మాన్ బిన్సాద్ (రజి)ని గవర్నర్‌గా నియమించారు. ఉమైర్ బిన్ ఉస్మాన్ (రజి) ఖురాసాన్ చేరుకోగానే పాలనావ్యవస్థను పటిష్ఠవంతం చేసి ఫర్ఘానా వరకున్న ప్రాంతాన్ని స్వాధీనంచేసుకున్నారు. హి.శ. 27 చివర్లో ఖలీఫా ఆయన్ని తొలగించి ఇబ్నెఅహ్మర్‌ని ఖురాసాన్ గవర్నర్‌గా నియమించారు. కర్మాన్‌లో అబ్దుర్రహ్మాన్ బిన్ అబస్‌ని గవర్నర్‌గా నియమించారు. అయితే కొన్నాళ్ళ తరువాత ఆయన్ని తొలగించి అక్కడ ఆసిమ్ బిన్ అమ్ర్ (రజి)ని గవర్నర్‌గా నియమించారు.

అప్పుడు ఈరానీయులు త్వరత్వరగా జరిగిన ఈ మార్పుల్ని తమకు ఓ అదృశ్య సహాయంగా తలచి తిరుగుబాటు ధ్వజమెత్తి సైనికసన్నాహాలు ప్రారంభించారు. ఈరాన్ గవర్నర్ ఉబైదుల్లా బిన్ మామ్మర్ ఈ సంగతి తెలుసుకొని ఆ సైన్యంపై దాడిచేశారు. కాని ఈ యుద్ధంలో ఆయన అమరగతి చెందారు. ఆయన సైన్యం పారిపోయింది. వెంటనే బస్రా గవర్నర్ అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) హరమ్ బిన్ హయాన్‌ని జూర్ పట్నం ముట్టడి కోసం పంపి, తానొక సైనికదళంతో ఇస్తెఖర్‌కు వెళ్ళి దాడిచేశారు. ఇరుపక్షాల మధ్య భీకరయుద్ధం జరిగింది. చివరికి ఈరానీయులు ముస్లింల ధాటికి నిలువలేక పారిపోయారు. ఇస్తెఖర్ పట్టణం ముస్లింల స్వాధీనమయింది.

## (4) దైవప్రవక్త (స) రాజముద్ర, ఖుర్ఆన్ కూర్పు

మహాప్రవక్త ముహమ్మద్ (స) దగ్గర అధికారిక లేఖలు, ఉత్తర్వుల మీద ముద్ర (సీలు) వేయడానికి ఒక ప్రత్యేకమైన ఉంగరం ఉండేది. దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఆ ఉంగరం ఆయన సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) అధీనంలో ఉండేది. అబూబకర్ (రజి) ఖలీఫా అయిన తర్వాత ఆమె దాన్ని ఆయనకు ఇచ్చివేశారు. అబూబకర్ (రజి) తదనంతరం అది ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు చేరింది. ఉమర్ ఫారూఖ్ (రజి)కు అంతిమఘడియలు సమీపించినపుడు ఆ ఉంగరాన్ని ఆయన తన కుమార్తె హఫ్సా (రజి)కు అప్పగిస్తూ, తాను నియమించిన ఎన్నికల సంఘంసభ్యులు ఖలీఫాగా ఎన్నుకునే వ్యక్తికి అప్పగించాలని చెప్పారు. దాని ప్రకారం ఆ ఉంగరం ఇప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) చేతికి లభించింది.

అయితే హి.శ. 30లో ఆ ఉంగరం ఉస్మాన్ గని (రజి) వ్రేలి నుండి జారి బావిలో పడిపోయింది. దాన్ని తీయడానికి బావిలోని నీరంతా తోడేసి వెతికారు. కాని ఉంగరం దొరకలేదు. దైవప్రవక్త (స) అధికారికముద్ర ఇలా అదృశ్యమైపోవడం పట్ల ఖలీఫా ఉస్మాన్ (రజి) ఎంతగానో విచారించారు. ఆనాటినుంచి ఆయనపై ఆపదలు, అరాచకాలు అవతరించడం మొదలయ్యాయి. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ ఉంగరం



స్థానంలో అచ్చం అలాంటిదే మరోఉంగరం చేయించుకొని వ్రేలికి పెట్టుకున్నారు.

హి.శ. 30లోనే నమాజ్ చేసేవారి సంఖ్య బాగా పెరిగిపోయి జుమాప్రసంగం కోసం చెప్పే అజాన్ అందరికీ విన్పించేదికాదు. అంచేత ఖలీఫా ఉస్మాన్ (రజి) జుమా ప్రసంగం కోసం చెప్పే అజాన్‌కు ముందు ముఅజ్జిన్ ఎత్తయిన చోటుపై ఎక్కి మరొక అజాన్ బిగ్గరగా చెప్పాలని ఆదేశించారు. ఈవిధంగా శుక్రవారం నాడు రెండు సార్లు అజాన్ చెప్పే సంప్రదాయం ఏర్పడింది.

**ఖుర్ఆన్ కూర్పు** : ఖుర్ఆన్ పారాయణం విషయంలో మాండలిక ఉచ్ఛారణలు హి.శ. 30 వరకు విభిన్నరకాలుగా ఉండేవి. ఇరాఖ్‌ప్రజలు ఒక విధమైన ఉచ్ఛారణతో, సిరియాప్రజలు మరొక విధమైన ఉచ్ఛారణతో ఖుర్ఆన్ పఠించేవారు. అలాగే బస్రా ప్రజల ఉచ్ఛారణ కూఫాప్రజలకు ఉచ్ఛారణకు, కూఫాప్రజల ఉచ్ఛారణ పార్శీప్రజల ఉచ్ఛారణకు భిన్నంగా ఉండేది. ఉచ్ఛారణలోని ఈ వైరుధ్యం గమనించిన హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (రజి) ప్రజలందరి కోసం ఒకే విధమైన ఉచ్ఛారణ ఉండేలా చేస్తే బాగుంటుందని భావించారు. ఈ అభిప్రాయం అందరికీ నచ్చింది.

అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) ఉమర్ (రజి) కుమార్తె హజ్రత్ హఫ్సా (రజి) దగ్గరున్న ఖుర్ఆన్ ప్రతిని తెప్పించారు. ఇది అబూబకర్ (రజి) పాలనాకాలంలో జైద్ బిన్ సాబిత్ (రజి), మరికొందరు ప్రముఖ సహాబీల ఉచ్ఛారణతో తయారైన ప్రతి. ఈ ప్రతి నుండి నకళ్ళు తీసి ప్రచురించడానికి ఖలీఫా ఉస్మాన్ (రజి) సమర్థులు, యోగ్యులైన కొందరిని నియమించారు. ఇలా అనేక నకళ్ళు తయారైన తరువాత వాటిలో ఒక్కొక్క ప్రతిని ఒక్కొక్క ముఖ్యపట్టణానికి పంపుతూ ఇకనుంచి ఈ ప్రతి నుండే నకళ్ళు తీసి ప్రచురిస్తూ ఉండాలని, ఆయా పట్టణాలలో ఉన్న పాత వ్రాత ప్రతులన్నిటినీ కాల్చివేయాలని ఆయన ఉత్తర్వులు జారీచేశారు. ఇస్లామీయ రాజ్యమంతటా ఈ ఉత్తర్వును తక్షణమే అమలుపరచడం జరిగింది. అప్పటినుండి ప్రపంచంలో ఈ ప్రతే కొనసాగుతోంది.

## (5) అరాచక ఆప్తమిత్రులు

కూఫా కొత్తగవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి) పరిపాలనా బాధ్యతలు చేపట్టిన తరువాత కూఫాప్రజల్ని సంతోషపెట్టడానికి తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకున్నారు. సయీద్ (రజి) అవలంబించిన ఈ వైఖరితో కొందరు వ్యక్తులు ఆయన దర్బారుకు వస్తూపోతూ ఆయన పట్ల చనువుగా మసలుకోసాగారు. అలాంటివారిలో మాలిక్ బిన్ హారిస్ (మాలిక్ అష్తర్), సాబిత్ బిన్ ఖైస్ హమ్దాని, అస్వద్ బిన్ యజీద్, అల్ఖమా బిన్ ఖైస్, జుందుబ్ బిన్ జహీర్, జుందుబ్ బిన్ కాబ్ అజ్దీ, ఉర్వా బిన్ జాద్, ఉర్వా బిన్ హఖ్ ఖజాయి, సాసా వజీద్, కమీల్ బిన్ జియాద్ మొదలైన వారున్నారు.

గవర్నర్ సయీద్ (రజి) ప్రతిరోజూ రాత్రివేళ తన సహచరులతో సమావేశమవుతూ పిచ్చాపాటి కబుర్లు చెప్పుకునేవారు. ఈ సమావేశాలకు పైన ప్రస్తావించబడిన వ్యక్తులు కూడా వస్తుండేవారు. ఈ సమావేశాల్లో అప్పుడప్పుడు పరిహాస పలుకులు కూడా ప్రస్తావనకు వస్తుండేవి.

ఒకరోజు గవర్నర్ సయీద్ (రజి) నోట "ఈ ప్రాంతం ఖురైషీయుల బృందావనం" అనే మాట వెలువడింది. మాలిక్ బిన్ అష్తర్ ఈమాట వినగానే కోపోద్రేకాలతో ఊగిపోతూ "దేవుడు మా ఖడ్గాలతో విజయం చేకూర్చి ప్రసాదించిన ఈ భూభాగాన్ని నీవు నీజాతివాళ్ళ తోట అని భావిస్తున్నావా?" అన్నాడు. వెంటనే మరి కొందరు కూడా అతడ్ని సమర్థిస్తూ అలాంటి మాటలే బిగ్గరగా చెప్పసాగారు. ఇలా అరుపులు, కేకలతో సమావేశం రసాభాసం కావడం చూసిన అబ్దుర్రహ్మాన్ అసది వారితో అల్లరి చేయ కండని చెప్పాడు. అంతే, అల్లరిమూకలు ఒక్కసారిగా విరుచుకుపడి అబ్దుర్రహ్మాన్‌ని చితకబాదారు. దాంతో అతను స్పృహతప్పి పడిపోయాడు. ఈ దుర్ఘటన తరువాత గవర్నర్ సయీద్ (రజి) రాత్రిసమావేశాల్ని రద్దుచేసి లోపలికి ఎవర్నీ రానీయవద్దని చెప్పి కొందరిని కాపలాదారులుగా నియమించారు.

కూఫాలో రాత్రిసమావేశాలు రద్దుకావడంపట్ల అనేకమంది విచారం వ్యక్తపరిచారు. వారిలో కొందరు ఇద్దరు ముగ్గురు ఒకచోట కలిసినప్పుడల్లా గవర్నర్ సయీద్ (రజి)పై, ఖలీఫాఉస్మాన్ (రజి)పై ఆరోపణలు చేసేవారు. వారి చుట్టు కొందరు మూర్ఖులు గుమికూడి వారికి వత్తాసు పలికేవారు. ఈ అరాచకం, అల్లకల్లోలాలు క్రమంగా అధిక మవుతుండటంతో గవర్నర్ సయీద్ (రజి) విషయం వివరిస్తూ ఖలీఫాకు లేఖ రాశారు. ఖలీఫా ఉస్మాన్ గని (రజి) ఆ అల్లరిమూకను అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు సిరియా పంపివేయమని ఆదేశించారు. సయీద్ (రజి) అలాగే చేశారు.

అమీర్ ముఆవియా (రజి) ఆ అల్లరిమూకను దారికి తెచ్చేందుకు వారిపట్ల ఎంతో ప్రేమతో, మృదువుగా ప్రవర్తించారు. ఆ తర్వాత ఓరోజు ఆయన వారితో మాట్లాడుతూ "ఖురైషీయుల నాయకత్వాన్ని అంగీకరించండి. ముస్లింల ఐక్యతను చెడగొట్టకండి" అని చెప్పారు. కాని ముఆవియా (రజి) మృదుభాషణ, సానుభూతి వచనాలకు వారిలో ఒకడు కస్సుమంటూలేచి అనుచిత సమాధానమిచ్చాడు. దాంతో ఇక లాభంలేదని తలచి ఆయన ఖలీఫాకు లేఖ రాసి ఆయన ఆదేశంతో ఆ మిత్రమూకను హమస్ గవర్నర్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఖాలిద్ దగ్గరకు పంపివేశారు. అబ్దుర్రహ్మాన్ వారిపట్ల కఠినంగా ప్రవర్తించడం ప్రారంభించారు. దాంతో కొన్నాళ్ళకు వారు తమ వాదనలు మానుకొని దారికి వచ్చారు. అప్పుడు ఖలీఫా వారిని కూఫాకు వెళ్ళిపోవడానికి అనుమతించారు.



**సబాయీ అరాచకం** : సనా పట్టణంలో అబ్దుల్లా బిన్ సబా అనే ఓ యూదుడు ఉండేవాడు. అతను ఉస్మాన్ (రజి) పాలనలో ముస్లింలకు అపార సిరిసందలు లభించడం, ఇప్పుడు ముస్లింలే ప్రపంచంలో విజేతజాతి అయిపోవడం చూసి అసూయాగ్నిలో పడి మండిపోయాడు. దాంతో అతను మదీనా వెళ్ళి తనను తాను ముస్లిం అని చెప్పుకొని ముస్లింలలో కలసిపోయాడు. అతను మదీనాలో ఉంటూ ముస్లింలలోని అంతర్గత, బాహ్య బలహీనతలను అధ్యయనంచేసి ఇస్లాం వ్యతిరేక పన్నాగాలు పన్నే పనుల్లో నిమగ్నుడైపోయాడు.

ఆరోజుల్లోనే బస్రాలో హకీం బిన్ జబలా అనే ఒకముస్లిం ధనపిపాసి ఉండే వాడు. అతను యుద్ధసమయాల్లో వీలు చిక్కినప్పుడల్లా జిమ్మీలను (ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల్ని) దోచుకునేవాడు. అతనికీ పనిలో మరికొందరు తోడుదొంగలు దొరికారు. అతని దోపిడీవార్తలు మదీనా వరకు ప్రాకాయి. హజ్రత్ ఉస్మాన్ (రజి) అతడ్ని పట్నంసరిహద్దులు దాటి పోనివ్వకుండా బస్రాలోనే నిర్బంధించి ఉంచమని బస్రాగవర్నర్‌కు ఉత్తర్వు జారీచేశారు. ఆవిధంగా హకీం బిన్ జబలా బస్రా పట్నంలోనే నిర్బంధానికి గురయి ఉండసాగాడు.

ముస్లింవేషంలో కుట్రలు పన్నుతున్న ఇబ్నెసబా ఈ సంగతి తెలుసుకొని బస్రా వెళ్ళి హకీంబిన్‌జబలా ఇంట్లో ఉండసాగాడు. ఇక్కడ తననుతాను ముస్లింల శ్రేయోభి లాషిగా, ప్రవక్త కుటుంబాభిమానిగా చెప్పుకుంటూ తన దుష్టపథకాన్ని అమలు చేయ నారంభించాడు. మొదట అతను మాయమాటలతో హకీంని, అతని మిత్ర మూకను బుట్టలో వేసుకున్నాడు. తర్వాత క్రమంగా అతని బాహ్యావతారం చూసి కొందరు అమాయకులు, మరికొందరు స్వార్థపరులు అతని వలలో పడిపోయారు.

వీరందరి సహకారంతో ఇబ్నెసబా ప్రజల హృదయాల్లో అరాచకం, అల్లకల్లోలు రేకెత్తించే ఆలోచనలు, నమ్మకాలు నూరిపోయడం మొదలెట్టాడు. అతను ఒక్కోసారి "ముస్లింలు ఈసా (అలై) మళ్ళీ ప్రపంచంలోకి వస్తారని నమ్ముతారు. కాని ముహమ్మద్ (స) కూడా మళ్ళీ ప్రపంచంలోకి వస్తారనే విషయాన్ని నమ్మకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది" అని చెప్పేవాడు. ఖుర్‌ఆన్‌లోని "ఇన్నల్లజీ ఫరజ అలైకల్ ఖుర్‌ఆన లరద్దుక ఇలా మఆద్" (ప్రవక్తా! నీపై ఈ ఖుర్‌ఆన్‌ని అవతరింపజేసిన దేవుడు నిన్ను తప్పకుండా అత్యంత శ్రేష్ఠమైన స్థానానికి చేర్చుతాడు-28:85) అనే సూక్తికి తప్పుడు వ్యాఖ్యానం చేస్తూ "ముహమ్మద్ (స) మళ్ళీ ప్రపంచంలోకి తప్పక వస్తార"నే విశ్వాసంపై ప్రజల్ని స్థిరంగా ఉంచే ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.

దాంతో బుద్ధిహీనులు అనేకమంది అతని మాయాజాలంలో పడిపోయారు. ఆ తర్వాత అతను 'ప్రతి దైవప్రవక్తకూ ఒక ఖలీఫా (ప్రతినిధి), ఒక వారసుడు ఉంటాడు, అలి (రజి) ముహమ్మద్ (స)కు వారసుడు. ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త

అయినట్లే అలి (రజి) అంతిమ వారసుడవుతారు' అనే విశ్వాసంపై ఆ బుద్ధిహీనుల్ని స్థిరంగాఉంచే పని ప్రారంభించాడు. ఈపని కాస్త వేడి పుంజుకోగానే "దైవప్రవక్త (స) తదనంతరం ప్రజలు హజ్రత్ అలి (రజి)ని వదిలేసి వేరే వ్యక్తిని ఖలీఫాగా చేసి పెద్ద తప్పుచేశారు. అంచేత ఇప్పుడు అందరూ అలీ (రజి)కి తమ సహాయసహకారాలు అందజేయాలి. ప్రస్తుత ఖలీఫాను హతమార్చిగాని, పదవీచ్యుతుడ్ని చేసిగాని అలీ (రజి)ని ఖలీఫాగా ఎన్నుకోవాలి" అని అతను ప్రచారం మొదలెట్టాడు.

ఈవిధంగా ఇబ్నెసబా తన దుష్టపథకాన్ని చాలా తెలివిగా అమలుపరుస్తూ ఒకవర్గం ముస్లింలకు హీరోగా తయారుకాసాగాడు. ఈ అరాచకం క్రమక్రమంగా విస్తరిస్తూ బస్రాగవర్నర్ కుర్చీకి తాకింది. వెంటనే బస్రాగవర్నర్ అతడ్ని పిలిపించి చీవాట్లుపెట్టాడు. దాంతో అతను బస్రాలో తన అనుచరమూకకు తగిన సూచనలిచ్చి బస్రా నుంచి కూఫా పట్నానికి వెళ్ళిపోయాడు. కూఫాలో కూడా అతను తన పైశాచిక కార్యకలాపాలు సాగించాడు. కూఫాలో అంతకుముందు నుంచే ఖలీఫాకు కొందరు ప్రత్యర్థులు తయారైవున్నారు. అందువల్ల ఇబ్నెసబాకు తన దుష్టపథకాన్ని ముందుకు తీసికెళ్ళేందుకు సువర్ణవకాశం లభించింది.

అతను కొద్ది కాలంలోనే తన ధర్మపరాయణత, తపోనిష్ఠల పగటివేషంతో కూఫా ప్రజల హృదయాల్ని సులభంగా చూరగొన్నాడు. జనం భక్తిశ్రద్ధలతో అతడ్ని ఎంతో గౌరవించేవారు. అయితే కూఫా గవర్నర్ ఇబ్నెసబా పైశాచిక విశ్వాసాల ప్రచారం గురించి వినగానే అతడ్ని పిలిపించి చీవాట్లుపెట్టాడు. కూఫాలోని కొందరు విజ్ఞులు, పెద్దలు కూడా అతడ్ని అనుమానాస్పదంగా చూడసాగారు. అందువల్ల అతను కూఫా కూడా వదలి సిరియా రాజధాని డెమాస్కస్‌కు వెళ్ళిపోయాడు. అతను బస్రాలోలాగే కూఫాలో కూడా తన అనుచరమూకకు తగిన సూచనలు ఇచ్చి వెళ్ళిపోయాడు. డెమాస్కస్‌లో తన పాచిక పారకపోవడంతో అక్కడ్నుంచి కూడా మూటాముల్లే సర్దుకొని వెళ్ళి ఈజిప్టు రాజధానిలో తిష్ఠవేశాడు.

ఇబ్నెసబా ఇక్కడ మరెంతో చాకచక్యంతో "ప్రవక్త కుటుంబాభిమానం, అలీ (రజి)కి మద్దతు" అనే తన స్వయంకృత విశ్వాసాల్ని ప్రజలమెదళ్ళలో జొప్పించడం ప్రారంభించాడు. దానికోసం ఈజిప్టులో అనేకచోట్ల రహస్యస్థావరాలు నెలకొల్పాడు. ఇక్కడ్నుంచి బస్రా, కూఫా పట్టణాల్లోని తన అనుచరగణంతో ఉత్తరప్రత్యుత్తారాలు జరిపేవాడు. అదిగాక హజ్రాత్ అలి, జుబైర్, తల్హా, ఆయిషా (రజి)ల పేర్లతో బస్రా, కూఫా, ఈజిప్టుల్లోని వారి అభిమానులకు ఉత్తరాలు రాసి పంపేవాడు. ఇలా బస్రా, కూఫా, ఈజిప్టుల నుంచి అక్కడి పాలకులు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మదీనా ప్రజలకు; మదీనా నుండి ఈజిప్టు, బస్రా, కూఫా ప్రజలకు ప్రారంభించిన ఉత్తరప్రత్యుత్తరాల పరంపర ఓ పెద్ద 'నెట్‌వర్క్'గా తయారైపోయింది.



ఈజిప్టుగవర్నర్‌కు ఆఫ్రికా, కాన్‌స్టాంటినోపిల్ వగైరా విదేశీసైన్యాల ఎడ తెరిపిలేని దాడుల్ని ప్రతిఘటించడంలో నిమగ్నమైపోవడంవల్ల దేశ అంతర్గతవ్యవహారాల్ని గురించి ఆలోచించడానికి తీరికే లభించేది కాదు. దానికి తోడు ఈజిప్టువాసుల్లో కొందరికి గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ వ్యవహారాలు నచ్చలేదు. ఈరెండు విషయాలు ఇబ్నెసబా పనిని మరింత సులువుచేశాయి.

ఇబ్నెసబా, అతని మిత్రమూకలు ప్రారంభించిన ఉత్తరప్రత్యుత్తరాల"నెట్‌వర్క్" ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపింది. ప్రతి రాష్ట్రంలోని ప్రజలు తమకంటే ఎక్కువ ఇతరరాష్ట్రాల ప్రజలపై దౌర్జన్యం జరుగుతోందని, ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ రాష్ట్రాల ప్రజలపై దౌర్జన్యపరులైన గవర్నర్‌లను బలవంతంగా రుద్దారని, వాళ్ళను పదవుల నుంచి తొలగించడానికి నిరాకరిస్తున్నారని భావించసాగారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి ఈజిప్ట్‌కు అమ్మార్ బిన్ యాసిర్ (రజి)ని, కూఫాకు ముహమ్మద్ బిన్ మస్లమాని పంపించారు. ఈజిప్టులో ఇబ్నెసబా అనుచరులు, అక్కడి గవర్నర్‌పట్ల అయిష్టంగా ఉన్నవారు అమ్మార్ (రజి)కు ఖలీఫా వైఖరి గురించి లేనిపోని మాటలుచెప్పి ఆయన్ని మదీనా పోనీయకుండా ఆపుకున్నారు. ముహమ్మద్ బిన్ మస్లమా కూఫాలో నానాటికి దిగజారుతున్న పరిస్థితుల్ని గురించి ఖలీఫాకు లేఖ రాశారు. ఆ రోజుల్లోనే కూఫాలోని ఖిలాఫత్ వ్యవస్థ మద్దతు దారులు, ప్రజాప్రతినిధులు, జనశ్రేయోభిలాషులైన కొందరు ప్రముఖులు రాష్ట్రంలో ఏర్పడిన అరాచక పరిస్థితి పట్ల విసుగెత్తి వేరే ప్రాంతాలకు తరలిపోయారు.

కూఫాగవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి) రాష్ట్రంలో నానాటికి తీవ్రమవుతున్న తిరుగుబాటు, అల్లకల్లోల పరిస్థితి చూసి, తన స్థానంలో ఖాఖా బిన్ అమ్రని ఇన్‌చార్జ్ గవర్నర్‌గా నియమించి, రాష్ట్రపరిస్థితి గురించి వివరించడానికి మదీనా వెళ్ళారు. ఆయన మదీనా వెళ్ళిన తరువాత కూఫాలో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ప్రజలలో అనేకమంది ఖలీఫా ఉస్మాన్ (రజి)ని, ఆయన నియమించిన గవర్నర్‌లను దూషిస్తూ అల్లర్లు, అల్లకల్లోలాకు పాల్పడ్డారు.

ఇదిలా ఉంటే మరొకవైపు యజీద్ బిన్ ఖైస్ అనే ఓ దుర్మార్గుడు కొందరు జనాన్ని వెంటేసుకొని హజ్రత్ ఉస్మాన్ (రజి)పై వత్తిడితెచ్చి ఆయన్ని ఖిలాఫత్ పదవి నుండి తొలిగించే ఉద్దేశ్యంతో మదీనా బయలుదేరాడు. అతని దురుద్దేశ్యం తెలుసుకున్న ఇన్‌చార్జ్ గవర్నర్ ఖాఖా బిన్ అమ్ర ఓ చిన్న సైనికదళంతో వెళ్ళి దారిలోనే అతడ్ని అణచివేసి దారికి తీసుకొచ్చారు. కాని మరికొన్నాళ్ళలోనే డెమాస్కస్ నుండి మాలిక్‌అష్త్రా అనే ఓ తలబిరుసు ముస్లిం తన మిత్రమూకతో కూఫాకు వచ్చేశాడు. అతని రాకతో కూఫా అల్లరిమూకకు, యజీద్ బిన్ ఖైస్ అనుచరులకు మరింత ధైర్యం

వచ్చింది. వారంతా ఖలీఫా ఉస్మాన్ (రజి)కు వ్యతిరేకంగా పెద్దఎత్తున తిరుగుబాటు బావుటా ఎగరవేసి కూఫా నుండి బయలుదేరారు. ఇన్‌చార్జ్ గవర్నర్ ఖాఖా ఆ గుంపును అడ్డుకోలేకపోయారు.

## (6) ఖలీఫా మీద తిరుగుబాటు

ఆఏడు ఖలీఫా ఉస్మాన్ (రజి) వివిధరాష్ట్రాల గవర్నర్‌లకు, అధికారులకు లేఖలురాసి, హజ్ చేసిన తర్వాత మదీనా వచ్చి తనను కలుసుకోవాలని ఆదేశించారు. ఈ ఆదేశం ప్రకారం వివిధరాష్ట్రాల నుండి గవర్నర్లు, ఉన్నతాధికారులు హజ్‌యాత్ర అనంతరం మదీనా చేరుకున్నారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) వారందరినీ సమావేశపరచి "నాకు వ్యతిరేకంగా చెలరేగిన ఈ అరాచకానికి కారణం ఏమిటో తెలియజేసి, ఇలాంటి పరిస్థితిలో నన్నేం చేయమంటారో చెప్పండి" అని సలహా అడిగారు.

అప్పుడు బస్రా గవర్నర్ అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) ఈమాట విని "నా దగ్గర ఈ సమస్యకు ఒకేఒక పరిష్కారం ఉంది. ఈ అల్లరిమూకను ఎల్లప్పుడూ జిహాద్‌లో నిమగ్నమై ఉండేలా చేయాలి. వీరు జిహాద్‌లో గనక నిమగ్నులైపోతే ఈ అల్లర్లు, అల్లకల్లోలాలు వాటంతటవే సమసిపోతాయి" అని చెప్పారు.

కూఫా గవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి) మాట్లాడుతూ "ఈ అల్లరి మూకల నాయకులను ప్రతి చిన్న విషయంలోనూ చీవాట్లుపెట్టి తీవ్రంగా హెచ్చరిస్తూ వారిని చెల్లాచెదరు చేయాలి. అప్పుడు వారి శిష్యగణం కూడా వారిని వదిలేసి చెల్లాచెదరై పోతుంది" అని చెప్పారు. దానికి ఖలీఫా ఉస్మాన్ (రజి) "ఈ అభిప్రాయం బాగానే ఉందికాని, దాన్ని ఆచరణలో పెట్టడం అంత సులభం కాదు" అన్నారు. సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) ఈమాట విని "దాన్ని గురించి మీరు చింతించ కండి. మేమంతా మా రాష్ట్రాల్లో అల్లర్లు జరగనీయకుండా ఆ దుండగుల్ని పూర్తిగా తుడిచిపెడ్తాం" అని అన్నారు.

ఈజిప్టు గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ బిన్ అబీసరా (రజి) మాట్లాడుతూ "వీరసలు ధనపిపాసులు. అంచేత మనం వీరిని ధనకనక వస్తువులతో మనవైపు తిప్పుకుందాం" అని అన్నారు. కొందరు ఉన్నతాధికారులు తమ అభిప్రాయం వెలిబుచ్చుతూ "ఇలాంటి అరాచకశక్తులు, తిరుగుబాటుదారుల పట్ల ఏమాత్రం మెతకవైఖరి ప్రదర్శించకూడదు. అసలు ఇలాంటి నేరస్థుల్ని వెతికివెతికి హతమార్చాలి" అని చెప్పారు. దానికి హజ్రత్ ఉస్మాన్ (రజి) సమాధానమిస్తూ "నేను ఖుర్‌ఆన్, హదీసులు నిర్దేశించిన మేరకే వారికి శిక్షలు విధించగలను. అంతకు మించి నేనేమీ చేయలేను సహనం వహించడం తప్ప" అని అన్నారు. ఆ తరువాత ఈ సమావేశం ఎలాంటి తీర్మానం చేయకుండానే ముగిసింది.



కూఫా నుండి మదీనాకు బయలుదేరిన ఈ అల్లరిమూకలు దారిలో ఒకచోట మదీనా నుండి తిరిగొస్తున్న గవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి)ని అడ్డగించి, 'కూఫా గవర్నర్‌గా అబూమూసా అష్అరీ (రజి)ని నియమించాలని ఖలీఫాకు చెప్పాలంటూ ఆయన్ని బలవంతంగా వెనక్కి పంపింది. హజ్రత్ సయీద్ (రజి) గత్యంతరంలేక మదీనాకు తిరిగొచ్చి విషయం ఖలీఫాకు చెప్పారు. ఖలీఫా వెంటనే అబూమూసా అష్అరీ (రజి)ని కూఫా గవర్నర్‌గా నియమించి పంపారు. అబూమూసా (రజి) కూఫా చేరుకొని ప్రజలకు నచ్చజెప్పడంతో చాలామంది ఖలీఫా ఉస్మాన్ (రజి)కు విధేయులై ఉంటామని ఒప్పుకున్నారు.

అయితే పగటివేషధారి అయిన ఇబ్నెసబా, అతని అనుచరమూకలు 'ఉత్తర ప్రత్యుత్తరాల నెట్‌వర్క్'ద్వారా తమ తిరుగుబాటు కార్యకలాపాల్ని మరింత విస్తృతం, వేగవంతం చేశారు. ఇబ్నెసబా గూఢచారులు, అనుచరులు ఇస్లామీయ రాజ్యమంతటా వ్యాపించారు. వారు ఖలీఫా ఉస్మాన్ (రజి)కు, ఆయన గవర్నర్‌లకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే పనుల్ని ముమ్మరం చేశారు.

ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిస్థితులు విషమిస్తూ పోవడం చూసి ప్రవక్త అనుచరుల్లో నమ్మకస్థులైన కొందరు ప్రముఖుల్ని ఎన్నుకొని రాజ్యంలోని మొత్తం గవర్నర్లపై వస్తున్న ఆరోపణల్ని గురించి నిజానిజాలేమిటో తెలుసుకొని రమ్మని పంపించారు. వారంతా వెళ్ళివచ్చి గవర్నర్‌లందరూ న్యాయంగా, నిజాయితీగానే ప్రజల్ని పాలిస్తున్నారని తెలియజేశారు.

జనంలో అనేకమంది ఉస్మాన్ (రజి) బంధుప్రేమ (సిలారహ్మి) 'బంధుప్రీతి'గా మారి హద్దుమీరిందని భావించసాగారు. అంచేత ఖలీఫా పిలిచిన ఒకసభలో వారాయ నపై రకరకాల ఆరోపణలు చేశారు. ఖలీఫా వారికి తగిన సమాధానాలిచ్చి పంపివేశారు. కాని వారు ఖలీఫా సమాధానాలతో పూర్తిగా తృప్తిచెంద లేదు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన రాజకీయ వారసుని ఎంపిక కోసం ఎన్నికల సంఘాన్ని నియమించి, అందులోని ప్రతిసభ్యుడ్ని "నా తర్వాత నీవు ఖలీఫా అయితే నీ తెగవాళ్ళను ప్రజలమెడలపై కూర్చోబెట్టకూడదు" అని హెచ్చరించారు. అంతేకాదు, ఖలీఫాగా ఎన్నికైన వ్యక్తి తన తెగవాళ్ళకు ఎలాంటి ప్రత్యేక రాయితీలు ఇవ్వకూడదనే విషయానికి కట్టుబడి ఉండాలని కూడా చెప్పారు. కాని హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫా అయిన తర్వాత ఆ విషయాన్ని పాటించలేకపోయారు. ఆయన తన తెగవారైన బనూఉమయ్యా మనుషులు అనేకమందికి ప్రభుత్వంలో పెద్దపెద్ద హోదాలు ఇచ్చారు.

ఖలీఫా ఉస్మాన్ (రజి) ఓసారి బంధుప్రేమ (సిలారహ్మి) విషయమయి మాట్లాడుతూ "ఉమర్ (రజి) దైవప్రసన్నత కోసం తన బంధువులకు ఏమీ ఇవ్వలేదు.

నేను దైవప్రసన్నత కోసం నా బంధువులకు (పదవులు) ఇస్తున్నాను" అనిఅన్నారు. (తబ్ఖాతె ఇబ్నెసాద్); వేరొక సందర్భంలో ఆయనిలా అన్నారు: "ప్రభుత్వ ధనాగారం విషయంలో అబూబకర్, ఉమర్ (రజి)లు తాము స్వయంగా దీనావస్థలో ఉండటాన్నే గాకుండా తమ బంధువుల్ని కూడా దీనావస్థలో ఉంచడాన్ని ఇష్టపడ్డారు. కాని నాకు 'బంధుప్రేమ' అంటే ఇష్టం." (అత్తబరి)

హజ్రత్ ఉస్మాన్ (రజి) సతీమణి హజ్రత్ నాయిలా (రజి) ప్రభుత్వ కార్యదర్శి మర్వాన్ గురించి తనభర్త ముందు మాట్లాడుతూ "మీరు గనక మర్వాన్ చెబుతున్నట్లు నడచుకుంటే అతను మిమ్మల్ని వధింపజేసిగాని వదలిపెట్టడు. అతనిలో దేవుని పట్ల భయమూ, భక్తీ ఏమాత్రం లేవు" అని అన్నారు.

ఓసారి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి)తో మాట్లాడుతూ "మీరు ప్రజల పట్ల మితిమీరిన మృదుత్వంతో వ్యవహరిస్తున్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఇలా వ్యవహరించేవారు కాదు. వేలమైళ్ళ దూరంలో ఉన్న గవర్నర్లు, అధికారులు ఆయన సన్నిధిలో బానిసలకంటే కూడా ఎక్కువ భయపడేవారు. ముస్లింలలో అనైక్యతాబీజాలు నాటేందుకు ప్రయత్నిస్తున్న అసాంఘికశక్తుల్ని గుర్తించి కూడా మీరు వారిని శిక్షించడం లేదు" అని అన్నారు. ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈ మాట విని మౌనంగా ఉండిపోయారు. అల్లరిమూకపై ఎలాంటి చర్యా తీసుకోలేదు.

సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి 'ఖలీఫాభద్రత కోసం తాను సిరియా నుంచి బ్రహ్మాండమైన సైనిక పటాలాన్ని మదీనా పంపిస్తానని హజ్రత్ ఉస్మాన్ (రజి)కు విన్నవించుకున్నారు. కాని ఆయన అందుకు అంగీకరించ లేదు.

ఈజిప్టులో ఇబ్నెసబా తన దుష్టపథకానికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేసుకున్నాడు. అతని మాయాజాలంలో అమ్మార్ బిన్ యాసిర్ (రజి), వరఖా బిన్ రాఫె (రజి) లాంటి సహాబీలు కూడా చిక్కుకున్నారు. ఇబ్నెసబా అసలులక్ష్యం గురించి ముస్లింవేషాల్లో ఉన్న అతని యూదసహచరులకు తప్ప మరెవరికీ తెలియదు. అతను ఖిలాఫత్ వ్యవస్థను తుదముట్టించడానికి అలీ(రజి)కి మద్దతు, ప్రవక్తకుటుంబాభిమానాల బూటకపు ప్రచారాన్ని ఓ సాధనంగా వాడుకుంటున్నాడు. అంచేత అతని ఉద్యమకారుల్లో కపటముస్లింలు, స్వార్థపరులు, అజ్ఞానులు, అమాయకులు అనేకమంది చేరిపోయారు.

వేరొక వైపు (ఇబ్నెఅసాకర్ కథనం ప్రకారం) ఈజిప్టు గవర్నర్ అబ్దుల్లా బిన్ అబీసరా దౌర్జన్యాలు నానాటికి పెరిగిపోతుండటంతో ఈజిప్టు నుంచి కొందరు



ప్రజాప్రతినిధులు మదీనా వెళ్ళి ఖలీఫాకు ఫిర్యాదుచేశారు. ఆ గవర్నర్‌ని తీవ్రంగా మందలిస్తూ ఒక లేఖ రాసిపంపారు. కాని అబ్దుల్లా బిన్ అబీసరా తనపై వచ్చిన ఆరోపణలను ఖండించాడు. పైగా తనపై ఖలీఫాకు ఫిర్యాదు చేసినవారిని నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు. అప్పుడు ఈజిప్టు నుంచి ఏడొందల మంది ప్రజలు మదీనా చేరుకొని అనేకమంది సహాబీల ముందు అబ్దుల్లా బిన్ అబీసరా దౌర్జన్యం గురించి ఫిర్యాదుచేశారు.

దానిపై సహాబీలు వెంటనే స్పందిస్తూ ఇబ్నె అబీసరాను గవర్నర్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. హజ్రత్ అలి (రజి) కూడా పరిస్థితి తీవ్రతను వివరిస్తూ "ఈజిప్టుప్రజలు ఇబ్నె అబీసరాను తొలగించి వేరొకర్ని నియమించాలని పట్టుబడుతున్నారు" అని చెప్పారు. ఆరోజుల్లోనే ఇబ్నెసబా ఆజ్ఞ ప్రకారం దాదాపు మూడు వేలమంది తిరుగుబాటుదారులు హజ్‌సాకుతో వివిధప్రాంతాల నుంచి బయలుదేరి మదీనా సమీపానికి చేరుకున్నారు. అల్లరిమూకల ప్రతినిధులు మూడు గ్రూపులుగా తయారై నగరంలోకి ప్రవేశించారు.

వారు హజ్రాత్ అలి, జుబైర్, తల్హా (రజి)లను వేర్వేరుగా కలుసుకొని తాము ఉస్మాన్ (రజి)ని ఖలీఫాగా ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించమని చెబుతూ "మేము మిమ్మల్ని ఖలీఫాగా అంగీకరిస్తూ 'బైత్' (శపథం) చేయడానికి సిద్ధంగా ఉన్నాం, మా నుండి బైత్ చేయించుకోండి" అన్నారు. దానికి ఆ ముగ్గురు ప్రముఖులు కఠినంగా సమాధానమిస్తూ వారి 'బైత్'ని నిరాకరించారు. అప్పుడు ఈజిప్టు దుండగుల ప్రతినిధులు హజ్రత్ అలి (రజి)తో మాట్లాడుతూ "సరే మీరు మా నుండి 'బైత్' తీసుకోకపోతే పోనివ్వండి. మా రాష్ట్రగవర్నర్ ఇబ్నె అబీసరా ప్రజలపై చాలా దౌర్జన్యం చేస్తున్నాడు. అతడ్ని మేము గవర్నర్ పదవి నుండి తీసివేయించే దాకా మదీనా నుండి వెళ్ళిపోము" అని అన్నాడు.

హజ్రత్ అలి (రజి) ఈజిప్టు దుండగుల్లోని ఈ దుస్సాహసం చూసి పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించారు. వెంటనే ఆయన కొందరు సహాబీలతో కలసి ఖలీఫా (రజి) దగ్గరకు వెళ్ళి పరిస్థితి వివరించారు. ఆ తర్వాత ఆయన "నగరం వెలుపల తిష్ఠవేసిన వేలాదిమంది అల్లరిమూకలు నగరంలో ప్రవేశించక ముందే ఇబ్నె అబీసరాను గవర్నర్ పదవి నుండి తప్పించి ఈజిప్టులో మరొకర్ని గవర్నర్‌గా నియమించి పంపండి" అని సలహా ఇచ్చారు. అపుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) 'ఎవర్ని నియమించాల'ని అడిగితే 'ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)ని నియమించండ'ని చెప్పారు హజ్రత్ అలి (రజి).

ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) హజ్రత్ అలి (రజి) మద్దతుదారు. అయితే ఆయన ఇబ్నెఅబీసబా మాయాజాలంలో పడిపోయారు. ఈ సంగతి అలీ (రజి)కి

తెలియదు. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు అసలే తెలియదు. అందువల్ల ఆయన అలి (రజి) సలహా పాటిస్తూ ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)కు గవర్నర్‌పదవి నియామకపత్రం రాసిచ్చి ఈజిప్టుకు పంపించారు. ఆతర్వాత హజ్రత్ అలి(రజి) ఈజిప్టు దుండగుల ప్రతినిధుల్ని కలసి విషయం తెలియజేస్తూ "ఇప్పుడు మీ కోరిక నెరవేరిందికదా! ఇక మదీనా నుండి వెళ్ళిపోండి" అని చెప్పి వారిని పంపివేశారు.

ఆ తర్వాత ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) గవర్నర్ నియామకపత్రం తీసుకొని మదీనా నుండి ఈజిప్టుకు బయలుదేరారు. ఆయన వెంట అనేకమంది ముహాజిర్, అన్సార్ సహాబీలు కూడా బయలుదేరారు. దారిలో ఒకచోట ఒక నీగ్రో బానిస ఒంటెపై వేగంగా తమ వైపు రావడం చూసి అతడ్ని ఆపి విషయం ఏమిటని అడిగారు వారు. దానికా బానిస "నేను విశ్వాసుల నాయకుని బానిసను. ఆయన నన్ను ఈజిప్టు గవర్నర్‌కు ఒక సందేశం అందజేయడానికి పంపించారు" అని చెప్పాడు. అప్పుడు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) "దానికి సంబంధించిన లేఖ ఏదైనా ఉందా నీ దగ్గర?" అని అడిగారు. దానికతను లేదన్నాడు. కాని జనం అతని దగ్గరున్న నీళ్ళులేని ఒక తోలుతిత్తి లాక్కొని చించి దాన్నుండి లేఖ తీశారు. దాన్ని చదవగానే అందరికీ దిమ్మ తిరిగిపోయింది.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది: "నీ దగ్గరకు ముహమ్మద్ (బిన్ అబూబకర్), ఫలానా ఫలానా వ్యక్తులు చేరుకోగానే ఏదో ఒక సాకుతో వారందర్నీ హతమార్చు. అతని నియామకాన్ని తప్పుడు నియామకంగా భావించి నేను మరొక ఆజ్ఞ పంపే వరకు నీవు నీ పదవిలో కొనసాగు. ఎవరైనా నీ దౌర్జన్యం గురించిన ఫిర్యాదు నా దగ్గరకు తీసుకు రావడానికి ప్రయత్నిస్తే అలాంటివాళ్ళను కారాగారంలో బంధించిపెట్టు."

ఈ ఉత్తరంలో రాసిన విషయాలు వినగానే అందరూ కోపంతో బుసలుకొడ్తూ మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. మదీనా చేరుకొని తల్హా, జుబైర్, అలి (రజి) వగైరా ప్రముఖులకు ఆ లేఖ చూపించారు. వారీ లేఖ చదివి ఎంతో విచారం వెలి బుచ్చారు. అబ్దుల్లా బిన్ మస్‌వూద్, అబూజర్ గిఫ్ఫారీ, అమ్మార్ బిన్ యాసిర్ (రజి)లు ఇంతకు ముందు నుంచే ఖలీఫా ఉస్మాన్ (రజి) పట్ల గుర్రుగా ఉండేవారు. ఇప్పుడీ లేఖ వారి ఆగ్రహానికి ఆజ్యం పోసింది. ప్రవక్త అనుచరులంతా ఇండ్లకు వెళ్ళి పోయిన తరువాత వేలసంఖ్యలో ఉన్న దుండగులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఒక్కసారిగా నగరంలోకి ప్రవేశించి ఖలీఫా ఇంటిని చుట్టుముట్టారు.

హజ్రత్ అలి (రజి) పరిస్థితులు విషమించడంతో ఆందోళన చెందుతూ ఖలీఫా దగ్గరకెళ్ళి "ఈ ఉత్తరం మీరు రాశారా?" అని అడిగారు. దానికాయన దేవుని మీద ప్రమాణం చేసి తానీ ఉత్తరం రాయలేదని, రాయమని ఎవర్నీ ఆదేశించలేదని,



అసలు తనకీ ఉత్తరం సంగతే తెలియదని అన్నారు. తరువాత ఆరాతీస్తే ఆ లేఖ ఖలీఫా ప్రధానకార్యదర్శి మర్వాన్ రాశాడని తెలిసింది. దాంతో కొందరికి ఖలీఫాపై అనుమానం కలిగింది. వారు మర్వాన్‌ని తమకు అప్పగించమని అడిగారు. అందుకు ఖలీఫా ఉస్మాన్ (రజి) నిరాకరించారు.

హజ్రత్ అలీ (రజి), మరికొందరు సహాబీలు కలసి దుండగులకు నచ్చజెప్ప డానికి ఎంతగానో ప్రయత్నించారు. కాని వారు మంకుపట్టు వదల్లేదు. తత్ఫలితంగా హజ్రత్ ఉస్మాన్ (రజి) నలభై రోజులపాటు నిర్బంధానికి గురయ్యారు. ఆరోజుల్లో ఆయన నమాజు కోసం ఇంటికి దగ్గర్లోనే వున్న మసీదుకు మాత్రమే పోయివస్తుండే వారు. చివరి మూడు రోజులు దుండగులు ఆయన్ని ఇంటి నుంచి గడప కూడా దాట నివ్వలేదు. చివరికి వారు ఆయన ఇంటికి నీటిసరఫరా కూడా నిలిపివేశారు. అప్పుడు ఓ పొరుగింటి ముస్లిం రహస్యంగా నీళ్ళు సరఫరా చేస్తుండేవాడు. ఖలీఫా తన గవర్నర్‌లందరికీ పరిస్థితులు వివరిస్తూ లేఖలు రాశారు. వెంటనే గవర్నర్లు తమతమ సైన్యాలు తీసుకొని మదీనా బయలుదేరారు. అయితే ఈ సైన్యాలు మదీనా చేరుకోక ముందే పరిస్థితి చేయిదాటి పోయింది.

దుండగులకు, ఖలీఫా ప్రతినిధులకు మధ్య చర్చలు జరుగుతున్నప్పుడు ఖలీఫా కార్యదర్శి మర్వాన్ అనేకసార్లు తన నోటిదురుసు, సూటిపోటి మాటలతో అలి(రజి), ఆయన సహచరుల మనస్సుల్ని చాలా నొప్పించాడు. అంచేత ప్రజలు దుండగులను కలుసుకొని, మర్వాన్‌ని మదీనా నుండి తీసేసే విషయం మాట్లాడమని అడిగారు. మర్వాన్‌ని మదీనా నుండి తీసి దుండగులకు అప్పగించివుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో! అలా జరగలేదు.

సబాయీ దుండగలు మదీనాలో ప్రవేశించి ప్రజల పట్ల అనేక దుశ్చర్యలకు పాల్పడ్డారు. విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మెహబీబా (రజి)ని కించపరిచారు. దైవప్రవక్త (స) మరో సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) మక్కాకు బయలుదేరినప్పుడు మదీనా వదలి ఎందుకు వెళ్తున్నారని ఒకతను అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ "ఈ పైశాచిక తుఫాన్‌లో నేను కూడా నన్ను కించపరచుకోవాలా" అని చెప్పి వెళ్ళిపోయారు.

## (7) ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య, కొత్తఖలీఫా ఎన్నిక

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం : "సమీప కాలంలో అరాచకం-అల్లకల్లోలాలు చెలరేగుతాయి. ఆ సందర్భంలో ఇతను (ఉస్మాన్) పీడితుడై హతమార్చబడతాడు" (తిర్మిజి); ముర్రా బిన్ కాబ్ (రజి) ఉల్లేఖనం : "సమీపకాలంలో అరాచకం-అల్లకల్లోలాలు చెలరేగుతాయి అన్నారు దైవప్రవక్త (స). అంతలో ఒకతను

దుప్పటి కప్పుకొని మా సమీపం నుండి వెళ్ళిపోతుంటే దైవప్రవక్త (స) అతని వైపు చూపిస్తూ 'ఆరోజు సత్యం ఇతని పక్షాన ఉంటుంది' అన్నారు. ఈమాట వినగానే నేను అతని వైపు దూసుకుపోయి చూశాను. చూస్తే అతను ఉస్మాన్ (రజి). నేను దైవప్రవక్త (స) దగ్గరకు తిరిగొచ్చి 'అతడ్ని గురించేనా మీరు చెప్పేది?' అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) 'ఔను, అతడ్ని గురించే' అన్నారు." (ఇబ్నెమాజ)

హ్జ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం : "ఉస్మాన్! దేవుడు నీకు ఓచొక్కా ధరింపజేస్తాడు. ఒకవేళ ఆ చొక్కాను కపటముస్లింలు నీ నుండి తీసేయడానికి ప్రయత్నిస్తే నువ్వు మాత్రం (పరలోకంలో) నన్ను కలుసుకునే వరకు దాన్ని తీసేయకు." (తిర్మిజి, హాకిమ్); హ్జ్రత్ ఉస్మాన్ (రజి) దిగ్బంధించబడినప్పుడు ఇలా అన్నారు : "దైవప్రవక్త (స) నాచేత ఒక వాగ్దానం చేయించుకున్నారు. నేనా వాగ్దానంలో సహనంతో, స్థిరంగా ఉన్నాను." (తిర్మిజి)

ఖలీఫా ఉస్మాన్ (రజి) తనవల్ల ఇతరులకు బాధ కలగకూడదన్న మనస్తత్వం గల మహామనీషి. ఆయన అనుక్షణం పరలోకభీతితో ప్రపంచకార్యాలు నిర్వహించే గొప్ప ధర్మపరాయణుడు. ఏదైనా సమావేశంలోగాని, బంతిభోజనంలోగాని ఆయన అందరితోపాటు కలసి కూర్చునేవారు. అందరినీ ఒకేవిధంగా గౌరవించేవారు. ఆయన ఒకసారి తన బానిసతో "నేను నీ చెవి పట్టుకొని నీపై దౌర్జన్యం చేశాను. దానికి నా నుండి బదులుతీర్చుకో" అన్నారు. బానిస ఖలీఫా చెవి పట్టుకోవడానికి సంకోచించాడు. కాని "ఊ..పట్టుకో" అని రెండవసారి చెప్పిన తరువాత అతను సంకోచిస్తూనే ఖలీఫా గారి చెవి పట్టుకున్నాడు. అప్పుడు హ్జ్రత్ ఉస్మాన్ (రజి) బానిసతో "సోదరా! నా చెవి గట్టిగా పట్టుకొని మెలెయ్యి. పరలోక ప్రతీకారశిక్ష కంటే ఇహలోక ప్రతీకారశిక్షే చాలా తేలిగ్గా ఉంటుంది" అని అన్నారు.

ఖలీఫా ఉస్మాన్ (రజి) తానొక్కడి కోసం ముస్లింలు రక్తసిక్తమై పోకూడదని భావించారు. అంచేత తనరక్షణ కోసం దుండగులతో పోరాడి ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన సహాబీలను ఆయన నిరోధించారు. అయినప్పటికీ వారిలో కొందరు ప్రముఖులు ఖలీఫాను కాపాడేందుకు శతవిధాల పోరాడారు. కాని అల్లరిమూకల ముందు వారి ప్రయత్నాలు ఫలించలేదు. వారిలో కొందరు దుండగులతో పోరాడుతూ అమరగతులైపోయారు. మరికొందరు సహాబీలు ఈ అరాచకం, అల్లకల్లోల పరిస్థితిలో తలదూర్చడం ఎందుకని తమతమ ఇండ్లలో కూర్చొని తలుపులు మూసుకున్నారు.

దుండగులు పొరుగింట్లోకి ప్రవేశించి, అక్కడ ఓ పిట్టగోడ దూకి ఖలీఫా ఇంట్లోకి జొరబడ్డారు. అందరికంటే ముందు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) లోపలికి ప్రవేశించి, ఖలీఫా ఉస్మాన్ (రజి) గడ్డం పట్టుకొని "పొడుగు గడ్డంవాడా! దేవుడు నిన్ను



అవమానపరచుగాక" అన్నారు. దానికి హ్జ్రత్ ఉస్మాన్ (రజి) "నా పేరు పొడుగు గడ్డంవాడు కాదు. నేను విశ్వాసులనాయకుడు ఉస్మాన్‌ని" అని అన్నారు. ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) మరింత రెచ్చిపోయి "ఈ ముసలితనంలో కూడా నీకు ఖిలాఫత్ పదవి కావాల్సివచ్చిందా!" అన్నారు గడ్డం పట్టుకొనివుండే. దానికి హ్జ్రత్ ఉస్మాన్ (రజి) "నీ తండ్రి బ్రతికివుంటే నాయీ వృద్ధాప్యాన్ని గౌరవించేవారు; నా గడ్డాన్ని ఈవిధంగా పట్టుకునేవారు కాదు" అని అన్నారు. ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) ఈమాట వినగానే ఖలీఫా గడ్డం వదిలేసి వెళ్ళిపోయారు.

అయితే ఆ తర్వాత కొందరు సబాయీ దుండగులు కూడా పొరుగింటి పిట్టగోడ దూకి ఖలీఫా ఇంట్లోకి జొరబడ్డారు. అప్పుడు హ్జ్రత్ ఉస్మాన్ గని (రజి) ఖుర్ఆన్ పఠిస్తున్నారు. కనానా బిన్ బషీర్ అనే దుర్మార్గుడు లోపలికి రాగానే హ్జ్రత్ ఉస్మాన్ (రజి)పై ఖడ్గంతో వ్రేటువేశాడు. వాడు ఖడ్గం పైకెత్తగానే హ్జ్రత్ ఉస్మాన్ (రజి) అర్ధాంగి నాయిలా (రజి) చేత్తో కత్తివ్రేటును నిరోధించడానికి ప్రయత్నించారు. దాంతో ఆమె చేతివ్రేళ్ళు తెగిపడ్డాయి. మరొకవ్రేటుతో 82ఏండ్ల ఖలీఫా ఉస్మాన్ (రజి) నేలకొరిగారు. అమ్ర్ బిన్ అమిఖ్ అనే మరొక దుర్మార్గుడు చలనం లేకుండా పడివున్న ఖలీఫా ఉస్మాన్ (రజి)ని బరిశతో తొమ్మిది సార్లు పొడిచాడు.

ఇంటికప్పుపై, ద్వారందగ్గర ఉన్నవారికి ఈ గొడవే తెలియదు. ఖలీఫా భార్య నాయిలా పెట్టిన అనేక కేకల తర్వాత వారు లోపలికివచ్చి చూశారు. అప్పటికే సబాయీ దుండగులు పని ముగించి అక్కడ్నుంచి జారుకున్నారు. ఖలీఫాశ్రేయోభిలాషులు ఖలీఫా భౌతికకాయం చూసి "ఇన్నాలిల్లాహి వఇన్నాఇలైహి రాజివూన్" ('మేము దేవునిఆస్తులం. దేవుని వైపుకే పోవలసినవాళ్ళం')" అంటూ వెళ్ళిపోయారు. ఖలీఫా హత్యవార్త నగరంలో కార్చిచ్చులా వ్యాపించింది. ఈ హత్యవార్త విన్న సహాబీలు శోకసముద్రంలో మునిగిపోయారు. ఇలా యూదుల కుట్రతో హి.శ. 35వ ఏట జిల్హజ్ 18వ తేదీన 12ఏండ్ల ఉస్మానియాపాలన అంతమైపోయింది. ఖలీఫా ఉస్మాన్ (రజి) భౌతికకాయం మూడు రోజులదాకా ఖననం కాకుండా ఇంట్లోనే పడివుంది.

ఈజిప్టులో కూర్చొని కథ నడిపిస్తున్న ముస్లింముఖయూదుడు ఇబ్నెసబా ఖలీఫా హత్య తర్వాత అకస్మాత్తుగా మదీనాలో ప్రత్యక్షమయ్యాడు. ఆ తర్వాత జరగబోయే తతంగంలో అతను ప్రత్యక్షంగా నాయకపాత్ర వహించకుండా అల్లరిమూకల ద్వారా పనులు జరిపించడం మొదలెట్టాడు. అతను తన అనుచరులకు కొత్తఖలీఫా ఎంపిక ప్రతిపాదన గురించి సూచించాడు. వెంటనే అతని అనుచరులు, తల్హా (రజి), జుబైర్ (రజి), అలీ (రజి)ల దగ్గరకు పోయి "ఖలీఫా పదవి స్వీకరించండి, మేము మీ చేతిలో 'బైత్' చేస్తాం" అని మనవిచేశారు. కాని ఆ ముగ్గురిలో ఎవరూ ఖలీఫాపదవి స్వీకరించడానికి అంగీకరించలేదు.

ఈ పాచిక పారకపోవడంతో ఇబ్నెసబా సూచనతోనే దుండగులు మదీనా పౌరుల్ని సంబోధిస్తూ "రెండురోజుల్లో కొత్త ఖలీఫాను ఎన్నుకోవాలని; లేకుంటే అలి, తల్హా, జుబైర్ (రజి)లను చంపివేస్తామని నగరంలో దండోరా వేయించారు. దాంతో మదీనా ప్రజలు భయపడి ఆ ముగ్గురు సహాబీల దగ్గరికెళ్ళి సంప్రదించారు. కాని వారిలో ఎవరూ ఖలీఫా కావడానికి అంగీకరించ లేదు. చివరికి ఎలాగో ప్రజల వత్తిడి, అభిమానాలతో హజ్రత్ అలి (రజి) ఖలీఫా పదవి స్వీకరించడానికి అంగీకరించారు. అప్పుడు ప్రజలు తండోపతండలుగా వచ్చి ఆయన చేతిలో చేయివేసి బైత్ చేశారు. ఇబ్నెసబా అనుచరమూకలు కూడా బైత్ చేశాయి.

# 4. అలి ముర్తుజా (రజి)

మక్కాలో వేసవితాపంతో జనం సతమతమవుతున్నారు. పచ్చనిచెట్లు మలమల మాడిపోతున్నాయి. కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయి. దైనందిన వ్యాపార లావాదేవీలు కుంటుపడి పోతున్నాయి. కరువురక్కసి కరాళనృత్యం చేస్తోంది.

గంపెడు పిల్లలతో ముందే సంసారం ఈదలేక సతమతమవుతున్న అబూతాలిబ్‌ని ఈ కరువు మరింత క్రుంగదీసింది. మహనీయ ముహమ్మద్ (సల్లం) తన పెదనాన్న పడుతున్న కష్టాలు చూసి తల్లడిల్లిపోయారు. ఆయన ఓరోజు పినతండ్రి అబ్బాస్‌ని కలుసుకొని "బాబాయ్! అబూతాలిబ్ పెదనాన్న సంసారం రోజురోజుకు చితికిపోతోంది. మనం చూస్తూ ఎలా ఉండగలం? మనిద్దరం ఆయన సంతానంలో ఇద్దరు పిల్లల్ని మన సంరక్షణలోకి తీసుకుంటే బాగుంటుంది. దానివల్ల ఆయనకు కొంతైనా భారం తగ్గుతుంది" అని అన్నారు.

"సరే, అలాగే తీసుకుందాం. ఇలాంటి పరిస్థితిలో మనం గాకపోతే మరెవరు ఆయన్ని ఆదుకుంటారు? తప్పకుండా తీసుకుందాం" అన్నాడు అబ్బాస్.

ఆ తరువాత వారిద్దరూ అబూతాలిబ్ దగ్గరకు పోయి ఈ విషయం ఆయనకు చెప్పారు. అబూతాలిబ్ సంతోషంతో "మీరు కోరుకున్న వాళ్ళను తీసికెళ్ళండి" అన్నారు. అప్పుడు అబ్బాస్, జాఫర్‌ని తన సంరక్షణలోకి తీసుకున్నాడు. ముహమ్మద్ మహనీయుని (సల్లం) సంరక్షణలోకి అయిదేళ్ళ అలి వచ్చాడు.

మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్త అయిన తరువాత ఓరోజు ఆయన, ఆయన శ్రీమతి చేసే కొత్త ఆరాధనా పద్ధతి చూస్తుంటే వారింట్లో ఉండే పదేళ్ళ అలీకి ఎంతో విచిత్రంగా తోచింది. ఆ బాలుడు ఇంతకు ముందెప్పుడూ ఈవిధంగా వారిద్దరు ప్రార్థన చేయడం చూడలేదు. అంచేత అదేమిటో తెలుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రార్థన పూర్తికాగానే "ఏమిటిదీ, ఇలా చేస్తున్నారు మీరు?" అని అడిగాడు కుతూహలంతో.



"ఇది దేవుడు మానవుల కోసం పంపిన ధర్మం బాబూ! దీన్ని ఇస్లాం అంటారు. గత దైవప్రవక్తలంతా లోకానికి ఇస్లాం ధర్మాన్నే బోధించారు" అన్నారు దైవప్రవక్త (స).

"అలాగా! మరి ఈ రుకూ, సజ్దాలేమిటీ?" అలి మరింత ఆశ్చర్యంతో అడిగాడు.

"దేవుడు నన్ను ప్రవక్తగా నియమించాడు బాబూ! మార్గం తప్పిన ప్రజలకు సన్మార్గంచూపి వారికి మంచిమంచి విషయాలు తెలియజేయడానికి, దైవారాధన కోసం వారిని ప్రేరేపించడానికి ఆయన నాపై తన వాణిని అవతరింపజేస్తున్నాడు. మనం చేసే రుకూ, సజ్దాలు ఆ దైవం కోసమే" వివరించారు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"అయితే చాలా మంచి విషయమే. మరి మీరు నమ్ముతున్న ధర్మాన్ని నేనూ నమ్మవచ్చా? మీతో పాటు నేను కూడా ప్రార్థన చేయవచ్చా?" అడిగాడు బాలుడు.

"తప్పకుండా తమ్ముడూ! అలాగే చెయ్యి. యావత్తు ప్రపంచానికి దేవుడు ఒక్కడే ఆయనకు మరెవరూ సాటి లేరు. ఆయనే ఆరాధనకు అర్హుడు. నువ్వు కూడా ఆయన్నే ఆరాధించు. విగ్రహాలను వదలి ఆ దేవుడ్నే నమ్ముకో బాబూ!" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"అయితే నేను మా నాన్నగారిని అడిగి చెప్తా" అన్నాడు అలి.

అలా అన్నాడేగాని, ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. దైవప్రవక్త (సల్లం) బోధించిన మాటలే మాటిమాటికి మననం చేసుకుంటూ తీవ్రంగా ఆలోచించాడు.

తెల్లవారిన తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పోయి "నేను మిమ్మల్ని విశ్వసిస్తున్నాను. మిమ్మల్ని అనుసరించడానికి నిర్ణయించుకున్నాను. దీనికోసం నాకు మా నాన్నను అడగాల్సిన పనిలేదు. ఎలా ప్రార్థన చేయాలో చెప్పండి" అని అన్నాడు.

ఈ మాటలు విని దైవప్రవక్త (సల్లం) ఎంతో సంతోషించారు. అలీని ప్రేమగా కౌగలించుకొని అతనికి నమాజు చేసే పద్ధతి నేర్పారు.

ఒకరోజు దైవప్రవక్త (స) తన బంధువులందరినీ విందుభోజనానికి ఆహ్వానించారు. భోజనాలు అయిన తరువాత వారిని సంబోధిస్తూ ఇలా ప్రసంగించారు:

"నా ప్రియ బంధువులారా! నాగురించి నా బాల్యం నుండీ మీకందరికీ తెలుసు. నేను ఎలాంటి పరిస్థితిలోనూ అబద్ధమాడనని మీకు తెలుసు. ఇప్పుడు కూడా నేను నిజమే చెబుతున్నాను. దైవసాక్షిగా చెబుతున్నాను. నేను దేవునిప్రవక్తను. దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించి మీదగ్గరకు పంపాడు. నేను మీదగ్గరకు సత్యధర్మం తీసుకొచ్చాను. మీ కోసం ఇంతకంటే గొప్పసందేశం పూర్వం అరేబియాలో ఎవరూ తీసుకురాలేదు. నేను మీదగ్గరకు ఉభయలోకాల శ్రేయస్సు తెచ్చాను. దేవుడు మిమ్మల్ని తన మార్గం వైపు పిలవమని నన్నాదేశించాడు. నేను మీ సహకారం కోరుతున్నాను. మరి ఈ

మహాకార్యంలో నాకు తోడ్పడేవాళ్ళు మీలో ఎవరైనా ఉన్నారా? నా తదనంతరం కూడా ఈ పనిని నిర్విఘ్నంగా కొనసాగించే వాళ్ళు మీలో ఎవరైనా ఉన్నారా?"

దైవప్రవక్త (స) ఇలా మాట్లాడిన తర్వాత ఓసారి అందరినీ కలియజూశారు. ఎవరి అంతరాత్మ విశ్వాసం వైపు మొగ్గుతుందో, ఎవరి హృదయకవాటాలు ఇస్లాంజ్యోతి కోసం తెరుచుకుంటాయో, ఎవరు ధర్మసంస్థాపన కోసం నడుంబిగించి ముందుకొస్తారో అని ఆయన ఎదురుచూడసాగారు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

కాని ఏ ఒక్కరూ పెదవి విప్పలేదు. అందరూ బెల్లం కొట్టిన రాళ్ళలా కళ్ళప్పగించి చూడసాగారు. కొందరు ఇవేవో పిచ్చివాడి పలుకులు అనుకొని ఆయన వైపు తెగ ఆశ్చర్యపోతూ చూడసాగారు. మరికొందరు అయిష్టంగా ముఖం తిప్పుకొని లేచి వెళ్ళి పోవడానికి సిద్ధమయ్యారు.

అంతలో ఒక బాలుడు లేచి నిలబడ్డాడు. ఆ బాలుడికి మహాఉంటే పన్నెండేళ్ళు ఉంటాయేమో! పొట్టిగా, బక్కచిక్కిన దేహంతో పీలగా ఉన్నాడు. అయితేనేం, పిడుగు!

"దైవప్రవక్తా! నేనుమీకు తోడ్పడతాను. మీరు తలపెట్టే ఈ మహాకార్యంలో సహాయం చేయడానికి నేను సిద్ధంగాఉన్నాను" అన్నాడా అబ్బాయి. ఆ అబ్బాయే అలి (రజి).

ఈ మాటలు వినగానే సభికులంతా ఒక్కసారిగా బాలుని వైపు సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు. కొంతమంది హేళనగా వికటాట్టహాసం చేస్తూ వెళ్ళిపోయారు.

## (1) మదీనా వలస, సోదరీకరణ, వివాహం

చివరికి ఖురైషీయులు దైవప్రవక్త (స)ను అంతంచేయడానికి ఒక పథకం తయారు చేశారు. తేదీ కూడా నిర్ణయమైపోయింది. నిర్ణయించిన ఆ కాళరాత్రి రానే వచ్చింది.

నింగిలోని నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ నేల వైపు కళ్ళు చించుకొని చూస్తున్నాయి. గాఢాంధకారంలో మక్కా నగరం మౌనముద్ర దాల్చింది. మానవులకు సన్మార్గం చూపడానికి వచ్చిన విశ్వకారుణ్యమూర్తి (స) ఇంటి చుట్టూ శత్రువులు ఈటెలు, బాకులు తీసుకొని మాటుకాసి కూర్చున్నారు.

దుర్మార్గుల పన్నాగం విశ్వప్రభువు ద్వారా దైవప్రవక్త (సల్లం)కు తెలిసిపోయింది. ఆయన వెంట హజ్రత్ అలి (రజి) కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) అన్ని విషయాలు అలి (రజి)కి వివరంగా చెబుతూ "అలీ! ఇదీ విషయం. జాగ్రత్తగా మసలుకోవాలి. తెల్లవారగానే మనింట్లో భద్రపరచిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకు ఇచ్చెయ్యి. ఆ తర్వాత బయలుదేరి మదీనా వచ్చెయ్యి" అని అన్నారు.

భద్రపరచిన వస్తువులు ప్రజలకు అప్పగించడానికి హజ్రత్ అలి (రజి) సంతోషంగా అంగీకరించారు. చివరిసారిగా దైవప్రవక్త (స) అలి (రజి)ని ఆలింగనం చేసుకొని "దేవుడే



నీకు రక్ష. ఆయన తలచుకుంటే వారు నిన్నేమీ చేయలేరు. మనం మళ్ళీ మదీనాలో కలుసుకుందాం. ఇక పోయి పడుకో" అన్నారు.

తరువాత ఆయన బయటికి వచ్చి నేలమీది మన్ను కొంచెం చేతిలోకి తీసుకున్నారు. దాన్ని అవిశ్వాసులపై విసిరేసి ఖుర్ఆన్‌లోని యాసీన్‌సూరా పఠిస్తూ వారి మధ్య నుంచే వెళ్ళిపోయారు. కాని అవిశ్వాసులెవరూ ఆయన్ని చూడలేకపోయారు.

అవిశ్వాసులు బయట ఊపిరి బిగబట్టి దైవప్రవక్త (స) కోసం ఎదురుచూస్తున్నారు. చాలాసేపు ఎదురుచూసి సహనం కోల్పోయారు. తూర్పుదిక్కున ఆకాశంలో కారుచీకట్లను చీల్చుకుంటూ ఉషఃకాంతులు కూడా ఉబికి వస్తున్నాయి.

అవిశ్వాసుల ఆరాటం ఎక్కువైపోయింది. అసహనంతో కస్సుబుస్సు మంటున్నారు. కొంతమంది ఉండబట్టలేక తలుపుసందు నుంచి లోపలికి తొంగిచూశారు. పడక మీద పచ్చదుప్పటి కప్పుకొని పడుకున్న ఓ ఆకారాన్ని చూసి అసహనంగా నిట్టూర్పు విడిచారు.

"అదుగో చూడండి, ముహమ్మద్ (సల్లం) ఎలా పడుకున్నాడో నిశ్చింతగా దుప్పటి కప్పుకొని. పాపం! ఈ అమాయకుడికి జరగబోయే దారుణం తెలియదేమో అదమర్చి మస్తుగా నిద్రపోతున్నాడు" అని చెప్పుకున్నారు పరస్పరం.

"సరే ఇంకాస్సేపటికైనా బయటికి వస్తాడు కదా? అప్పుడు ఒక్కసారిగా అందరం విరుచుకుపడి పని పూర్తిచేద్దాం" అంటూ ద్విగుణీకృత ఉత్సాహంతో నిరీక్షించసాగారు.

గంటలు దొర్లిపోతున్నాయి. శత్రువులకళ్ళు మూతలు పడుతున్నాయి. అలా మగత లోనే భళ్ళున తెల్లారింది. ఇంట్లో అయిన అలికిడికి వారు ఉలిక్కిపడి లేచారు. మరుక్షణం అందరూ కత్తులు సిద్ధంచేసుకొని రక్తదాహంతో తహతహలాడుతూ లేచారు.

దారుణం! మహాదారుణం జరగబోతోంది!! ఇక ఒక్క క్షణం కూడా ఓపిక పట్ట లేనట్లు మళ్ళీ తలుపుకన్నం నుంచి తొంగిచూశారు. అంతే! లోపలి దృశ్యం చూసి కొయ్యబారి పోయారు అంతా.

దైవప్రవక్త (స) పడక మీద దుప్పటి తొలగించుకుంటూ కొత్త ఆకారం కన్పించింది. శత్రువులు నిర్ఘాంతబోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు.

"ఎవరీయన? అబూతాలిబ్ కొడుకులా ఉన్నాడే!"

"ఔను. అబూతాలిబ్ కొడుకే. అలి బిన్ అబూతాలిబ్."

"మరి ముహమ్మద్ ఏమైనట్లు? అతని పడక మీద ఇతనెలా వచ్చాడు? మనం రాత్రంతా అలి కోసమే జాగారం చేశామా? ముహమ్మద్ మన కళ్ళుగప్పి పారిపోయాడా?"

"తప్పించుకొని ఎప్పుడో పోయివుంటాడు మన కళ్ళలో కారం చల్లి మరీ."

"అయ్యయ్యో ఎంతపని జరిగింది! నలుగురికి తెలిస్తే ఎంత అవమానం!! మన పథకమంతా తల్లకిందులై పోయిందే!"

పథకం భగ్నం కావడంతో ఖురైషీయులు అలి (రజి) మీద విరుచుకుపడ్డారు.

"ఏడి మీ నాయకుడు? ఎక్కడున్నాడు?" అంటూ గదమాయించారు వారు. "ఏమో, నాకు తెలియదు" అన్నారు హజ్రత్ అలి (రజి).

దాంతో అవిశ్వాసులు రెచ్చిపోయి హజ్రత్ అలి (రజి)ని బరబర బయటికి ఈడ్చుకుపోయారు. ముహమ్మద్ (స) ఎక్కడికి పోయాడో చెప్పమంటూ ఆయన్ని అమానుషంగా కొట్టసాగారు. కాని ఎంత కొట్టినా అలి (రజి) తనకేమీ తెలియదనే చెప్పారు.

దాంతో అవిశ్వాసులు బుసలుకొడ్తూ అలి (రజి)ని కాబాలో నిర్బంధించి హింసించడం మొదలెట్టారు. ఆఖరికి బంధువుల జోక్యంవల్ల అలి (రజి) ప్రాణం దక్కింది.

హజ్రత్ అలి (రజి) ఎలాగో శత్రువుల బారి నుండి బయటపడి ఎవరి వస్తువులు వారికప్పగించి మదీనాదారిపట్టారు. ఎలాంటి వాహనంలేని దయనీయస్థితిలో కాలినడకన గుట్టలు మిట్టలు దాటుకుంటూ ప్రయాణం చేసి చివరికి ఖుబా గ్రామం చేరుకున్నారు.

అప్పుడే దైవప్రవక్త (స) నమాజు చేసి మసీదు నుండి బయటికి వచ్చారు. బయట అడుగుపెట్టగానే ఎదురుగా అలి(రజి) కన్పించారు. అంతే, ఆయన సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఒక్కఉదుటున ముందుకొచ్చి అలి(రజి)ని గట్టిగా ఆలింగనం చేసుకున్నారు. ఆయన నుదుటిని అనేకసార్లు చుంబించారు. కాని ఆ తరువాత వాడి పోయిన ముఖం, దుమ్ముకొట్టుకున్న శరీరం, చినిగిన బట్టలు, పగిలి రక్తసిక్తమైన పాదాలు చూసి ఆయన కళ్ళు చెమర్చాయి. ఆ దృశ్యం చూసి మిగిలినవాళ్ళు కూడా కంటతడి పెట్టుకున్నారు. అయితే అలి (రజి) కళ్ళు మాత్రం ఆనందకిరణాలు వెదజల్లుతున్నాయి. దైవప్రవక్త (సల్లం) దర్శనంతో ఆయన ప్రయాణబడలిక పటాపంచలై పోయింది.

ఓరోజు మదీనా పట్టణం అన్సార్‌లు (ఆదుకున్నవారు), ముహాజిర్‌ల (వలసవచ్చిన వారి) కలయికతో కళకళలాడుతోంది. వారి మధ్య దైవప్రవక్త (సల్లం) నిలబడి విశ్వమానవ సౌభాతృత్వాన్ని గురించి బోధిస్తున్నారు. ఆ మహనీయుని నైతికశిక్షణ వల్ల అనుచరుల్లో ఇదివరకే చాలావరకు పరస్పర సోదరభావం పెనవేసుకున్నది. ఇప్పుడీ ప్రత్యేక సమావేశంలో బోధించే ఇస్లాం హితవులతో వారు మరింత ఉత్తేజితులయ్యారు.

ప్రసంగం ముగిసిన తర్వాత కట్టుబట్టలతో మాత్రమే వచ్చిన ముహాజిర్‌ల (వలస వచ్చినవారి) వైపు చూపిస్తూ "ఇదిగో వీరు మీ సోదరులు" అని అన్సార్‌ల (ఆదుకున్నవారి)కి గుర్తుచేశారు. ఆ తరువాత వరుసగా ఒక్కొక్క ముహాజిర్‌ను, ఒక్కొక్క అన్సార్‌ని పిలిచి "ఈరోజు నుంచి మీరిద్దరు పరస్పరం అన్నదమ్ములు" అని చెప్పారు.



ప్రవక్త అనుచరులకు ప్రవక్త (స) ఆదేశానికి మించిన విషయం మరేదీలేదు. ఆయన ఆజ్ఞాపిస్తే చాలు, తోటిసోదరుని కోసం ప్రాణమైనా అర్పించడానికి సిద్ధం. అన్సారులు పరమసంతోషంతో తమ ముహాజిర్ సోదరుల్ని గుండెలకు హత్తుకున్నారు.

అయితే హజ్రత్ అలీ (రజి)కు ఏ అన్సార్ ముస్లిం కూడా సోదరునిగా లభించలేదు. దాంతో ఆయన పుట్టెడు దుఃఖంతో దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "మీరు అందరి మధ్యా సోదరీకరణ నెలకొల్పారు. నేనొక్కడ్నే మిగిలిపోయాను" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నువ్వు నాతమ్ముడివి" అన్నారు. అలి (రజి) ఈమాట విని పరమానందభరితులయ్యారు.

బదర్ యుద్ధం తరువాత ఓరోజు హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి తలొంచుకొని మౌనంగా కూర్చున్నారు. ఏదో చెప్పాలనుకున్నారు గాని, నోటమాట పెగలడంలేదు. దైవప్రవక్త (సల్లం) కళ్ళలోకి సూటిగా చూడలేకపోతున్నారు. ఆయన ముఖారవిందం ఒక విధమైన బిడియంతో ముడుచుకుపోతోంది.

దైవప్రవక్త (స) విషయం పసిగట్టి చిరునవ్వు నవ్వారు. "అలీ! నువ్వు బహుశా ఫాతిమాను వివాహమాడదలిచానని చెప్పడానికి వచ్చావను కుంటున్నాను, ఔనా?" అన్నారు ఆయన వాత్సల్యంతో చూస్తూ.

"ఆ..... ఔను దైవప్రవక్తా!" అన్నారు హజ్రత్ అలి (రజి) సిగ్గుపడుతూనే.

"సరే, నీ దగ్గర మహర్ కోసం ఏదైనా ఉందా?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"నా దగ్గర ఒక గుర్రం, కవచం మాత్రమే ఉన్నాయి."

"గుర్రం, కవచం యుద్ధ సమయాల్లో పనికొస్తాయి. కాని గుర్రం చాలా అవసరం. అంచేత నువ్వు కవచం అమ్మెయ్యి."

ఈమాట వినగానే అలి (రజి) ముఖం ఒక్కసారిగా తామరపువ్వులా వికసించింది. సిగ్గుదొంతర నుండి ఆనందకుసుమాలు రాలిపడ్డాయి. సంతోష కెరటాలతో హృదయ సాగరం పరవళ్ళుతొక్కింది. వెంటనే ఆయన బయటికెళ్ళారు. కవచాన్ని ఉస్మాన్ (రజి)కు నాల్గొందల దిర్హమ్‌లకు అమ్మి డబ్బు తెచ్చారు మహర్‌సొమ్ము చెల్లించడానికి.

ఆ తర్వాత దైవప్రవక్త (స) దగ్గరుండి అలి, ఫాతిమా(రజి)ల వివాహం జరిపించారు. ఆయన తన ముద్దుల కుమార్తె సంసారానికి ఒక మంచం, ఒక తోలు పరుపు, ఖర్జూరపు ఆకులతో నింపిన ఒక తలగడ, ఓ చిన్న తోలుసంచి, రెండు మట్టికుండలు, రెండు తిరగళ్ళు ఇచ్చారు. అల్లుడి దగ్గర ఒక గొర్రెచర్మం, ఓ చినిగిన దుప్పటి మాత్రమే ఉన్నాయి. ఇవీ ఆ కొత్త దంపతుల కొత్త కాపురానికి సమకూరిన వస్తువులు. ఇవే వారి మొత్తం ఆస్తిపాస్తులు.

# (౭) ఖైబర్ యుద్ధం

హిజ్రీశకం 7వ సంవత్సరం, ముహర్రం నెలలో దైవప్రవక్త (సల్లం) మదీనాలో సబా బిన్ అరఫ్తా (రజి)ను గవర్నర్‌గా నియమించి దాదాపు 1600 మంది యోధుల్ని తీసుకొని యూదుల పీచం అణచడానికి ఖైబర్‌కు బయలుదేరారు.

ప్రారంభంలో ముస్లింలు యూదుల ధాటికి నిలవలేక పోయారు. తత్ఫలితంగా యాభైమంది ముజాహిద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత స్థిరంగా నిలబడి తీవ్రంగా విజృంభించారు. దాంతో నాలుగు కోటలు ముస్లింల కైవశం అయ్యాయి. అయితే ఖమూస్ అనే కోటను జయించడానికి చాల ప్రయాసపడవలసి వచ్చింది.

రోజులు గడిచిపోతున్నా యుద్ధం ఓ కొలిక్కి రాలేదు. ఇలా మరికొన్నాళ్ళు గడిస్తే అటు యూదులే కాదు, ఇటు ముస్లింలు కూడా ఘోరనష్టానికి గురికావలసి వస్తుంది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) తాడో పేడో తేల్చుకోవాలని నిశ్చయించుకున్నారు. ఆయన సమరధ్వజాన్ని హజ్రత్ అబూబకర్ (రజి) చేతికి అందించి, వెళ్ళి ఖమూస్ కోటను జయించమని ఆదేశించారు.

హజ్రత్ అబూబకర్ (రజి) ఉదయం నుండి సాయంత్రం దాకా పోరాడినా ఖమూస్ కోటను జయించలేక పోయారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఉమర్ (రజి)ని పంపించారు. ఉమర్ (రజి) కూడా కోటను జయించలేక పోయారు.

చివరికి దైవప్రవక్త (స) "రేపు ఉదయం నేను ధ్వజం ఒక వీరునికి అప్పగిస్తాను. అతను దేవుణ్ణి, దైవప్రవక్తను ఎంతగానో అభిమానిస్తాడు; దేవుడు, ఆయన ప్రవక్త కూడా ఆ వీరుణ్ణి బాగా అభిమానిస్తారు" అని ప్రటించారు.

ఈ ప్రకటన వినగానే ఆ మహాభాగ్యం ఎవరికి దక్కుతుందోనని అనేకమంది ఎదురు చూడసాగారు. ఇలా ఆలోచిస్తూ ముస్లింలు ఆరోజు రాత్రి ఎలాగో గడిపారు. మరునాడు ఉదయం నమాజ్ ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) "అలి ఏడి, ఎక్కడున్నాడు?" అని అడిగారు సమీపంలో ఉన్న అనుచరుల్ని.

"ఆయన కళ్ళజబ్బుతో బాధపడుతూ గుడారంలోనే ఉండిపోయాడు. నిన్న యుద్ధంలో కూడా పాల్గొలేక పోయాడు" అన్నారు అనుచరులు.

"సరే, అతణ్ణి వెంటనే నా గుడారం దగ్గరికి పిలుచుకు రండి."

దైవప్రవక్త (స) ఆజ్ఞ వినగానే కొందరు వెళ్ళి అలీ (రజి)కి ఈ విషయం తెలియ జేశారు. అలి (రజి) కళ్ళు నులుపుకుంటూ తక్షణమే వారి వెంట బయలుదేరారు.

హజ్రత్ అలి (రజి) రాగానే దైవప్రవక్త (సల్లం) తన నోటి నుండి కొంత లాలాజలం తీసి ఆయన కళ్ళకు పూశారు. మరుక్షణం అలి (రజి) కళ్ళజబ్బు మటుమాయమైపోయింది.



తరువాత దైవప్రవక్త (సల్లం) ధ్వజాన్ని ఆయన చేతికిస్తూ ఇలా అన్నారు:

"అలీ! ముందుగా నీవు యూదుల ముందు ఇస్లాం సందేశం పెట్టు. నీ ఉపదేశంతో వారిలో ఒక్కడయినా సరే ఇస్లాం స్వీకరిస్తే అది నీ కోసం ఎర్రఒంటెల కంటే కూడా ఎంతో విలువైనది. ఇక వెళ్ళు. దైవం నీకు తోడ్పడుగాక!"

హజ్రత్ అలి (రజి) సైన్యం తీసుకొని యుద్ధరంగానికి వెళ్ళిపోయారు. అక్కడ ఓ చోట యుద్ధపతాకాన్ని నేలమీద గుచ్చి యూదులకు సవాలు విసిరారు.

అది విని హారిస్ అనే మల్లయోధుడు కోట నుండి బయటికి వచ్చాడు. కాని అతను ఒకే ఒక వ్రేటుకు కుప్పకూలిపోయి ఊపిరి విడిచాడు.

ఆ తరువాత వెంటనే అతని సోదరుడు మర్హబ్ ముందుకు వచ్చాడు. ఖమూస్ కోట నాయకుడైన మర్హబ్ యావత్ అరేబియాలోనే పేరుమోసిన గొప్ప మల్లయోధుడు. అతను తలకు పాగా ధరించి దానిపై శిరస్త్రాణం పెట్టుకున్నాడు. దేహానికి ఒకదాని మీద మరొకటి చొప్పున రెండు ఉక్కుకవచాలు కూడా తొడుక్కున్నాడు. నడుముకు రెండు ఖడ్గాలు వ్రేలాడదీసి, చేతిలో తళతళ మెరిసే ఈటె తీసుకొని వచ్చాడు.

మర్హబ్ ఓసారి అలి (రజి) వైపు ఎగాదిగా చూసి ఓ వెకిలి నవ్వు నవ్వాడు. తరువాత ఒక్కఉదుటున లంఘించి అలి(రజి) మీద వ్రేటు వేశాడు. అలి (రజి) మెరుపువేగంతో డాలు అడ్డంపెట్టి వ్రేటు నుంచి తప్పించుకున్నారు. మర్హబ్ ఈసారి మరింత చాకచక్యంతో వ్రేటువేశాడు. దాంతో అలి (రజి) చేతిలోని డాలు జారి దూరంగా పడిపోయింది.

అయితే వెంటనే ఆయన కోట తలపు వైపు దూసుకుపోయి దాన్ని బలంగా లాగివేశారు. ఆ తలుపు రెక్కను డాలుగా తీసుకొని మర్హబ్ ముందుకు వచ్చారు.

కోట తలుపును ఊడబెరకడం ఎంత శ్రమతో కూడుకున్న పనో, ఆ తలుపు ఎంత బరువైనదో మర్హబ్‌కు తెలుసు. అంచేత అలి(రజి) కోట తలుపు రెక్క ఊడబెరికి చేతిలోకి తీసుకోవడం చూసి మర్హబ్ నిర్ఘాంతపోయాడు.

అలి (రజి) కళ్ళెర్ర జేసి మర్హబ్ మీద బలంగా ఒకేఒక వ్రేటు వేశారు. ఆ వ్రేటుకు మర్హబ్ శిరస్త్రాణం తెగి క్రిందపడిపోయింది. కరవాలం అతని తలను కోసివేస్తూ దవడ దాకా చేరింది. దాంతో మర్హబ్ తుమ్మమొద్దులా దభేలున నేలకూలాడు.

ఆ తర్వాత కొన్నిరోజుల పాటు సామూహిక యుద్ధం జరిగింది. చివరికి యూదులు కాళ్ళబేరానికి వచ్చి ఒప్పందం చేసుకున్నారు.

మక్కా ఖురైషీయులు హుదైబియా ఒప్పందం ఉల్లంఘించి మక్కా పరిసర ప్రాంతంలోని ముస్లింమిత్ర పక్షమైన ఖుజాఅ తెగ బహుదైవారాధకులపై దాడిచేసి ఊచకోత కోశారు. అంచేత ఆ తెగనాయకుల అభ్యర్థనపై మక్కా ఖురైషీయుల నుండి

ప్రతీకారం తీర్చుకోవడానికి దైవప్రవక్త (స) యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ఈ సంగతి తెలుసుకున్న మక్కా ఖురైషీయులు తీవ్రంగా పశ్చాత్తాపం చెందుతూ చర్చల కోసం అబుసుఫ్యాన్‌ని మదీనా పంపారు.

అబూసుఫ్యాన్ మొదట దైవప్రవక్త (స) దగ్గరకు, తరువాత అబూబకర్ (రజి), ఉమర్ (రజి)ల దగ్గరకు వెళ్ళాడు. కాని అక్కడ నిరాశ ఎదురుకావడంతో అలి (రజి) దగ్గరకొచ్చి తన గోడు చెప్పుకొని దైవప్రవక్త (స)కు సిఫారసు చెయ్యమని అర్థించాడు.

కాని అలి (రజి) "అబూసుఫ్యాన్! దైవప్రవక్త (స) ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఇక అందులో ఎవరూ జోక్యం చేసుకోవడానికి సాహసించలేరు" అన్నారు.

అయినా అబూసుఫ్యాన్‌లో ఇంకా ఆశ చావలేదు. "ఫాతిమా! నువ్వయినా కాస్త నా కోసం సిఫారసు చెయ్యి తల్లీ!" అని అభ్యర్థించాడు. "అబూసుఫ్యాన్! ఇలాంటి వ్యవహారాల్లో స్త్రీలు జోక్యం చేసుకోలేరని మీకు తెలుసు కదా!" అన్నారు ఆమె.

"అయితే నీపిల్లవాడి చేత 'నేను రెండుపక్షాల మధ్య రాజీ కుదిర్చాను' అని ఒక్క మాట చెప్పించు చాలు. ఈ ఒక్క మాట చెప్పిస్తే ఈరోజు నుండి నీ పిల్లవాడు యావత్తు అరబ్బులకు నాయకుడన్పించుకుంటాడు. ఏమంటావ్?" అన్నాడు అబూసుఫ్యాన్.

"అబూసుఫ్యాన్! రాజకీయ వ్యవహారాల్లో పిల్లలు ఏం చెయ్యగలరు? ఈ విషయం మీకూ తెలుసుకదా! అయినా మీ విషయంలో దైవప్రవక్త (స) మౌనం వహించినప్పుడు మరొకరు నోరు మెదపగలరా?" అన్నారు హజ్రత్ ఫాతిమా (రజి).

పాపం! అబూసుఫ్యాన్‌కు తల తిరిగిపోయింది. చుట్టూ అంధకారం అలుము కున్నట్లు అన్పించింది. ఆశాకిరణం కనుచూపు మేరలో కూడా కన్పించడం లేదు. ఏమీ పాలుపోక హజ్రత్ అలి (రజి) వైపు మరొక సారి ఆశగా చూశాడు.

"అబుల్ హసన్! నేను పెద్ద ఆపదలో చిక్కుకున్నాను. ఇందులో నుంచి బయట పడే మార్గం కన్పించడంలేదు. ఇలాంటి స్థితిలో నేనేం చెయ్యాలో కాస్త సలహా అయినా ఇవ్వు" అని దీనంగా అడిగాడతను.

"ఇప్పుడు నేనేం సలహా ఇవ్వగలను? మీరు మాటతప్పారు. పరిస్థితి చేజారి పోయింది. అయితే ఓపని చెయ్యి. మసీదుకెళ్ళి 'నేను హుదైబియా ఒప్పందం పునరుద్ధరిస్తున్నాన'ని బిగ్గరగా చాటిచెప్పి మక్కా వెళ్ళిపో" అన్నారు అలి (రజి).

"ఇలా చేస్తే ప్రయోజనం ఉంటుందంటావా?" అని అడిగాడు అబూసుఫ్యాన్ ఆశా నిరాశాల మధ్య ఊగిసలాడుతూ.

"ఉంటుందని నేను గట్టిగా చెప్పలేను. కాని అంతకుమించి మరోమార్గం లేదు" అన్నారు హజ్రత్ అలి (రజి). అబూసుఫ్యాన్ మసీదుకెళ్ళి అలి (రజి) ఇచ్చిన సలహా



ప్రకారమే 'నేను హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నాన'ని బిగ్గరగా చాటిచెప్పి మక్కా వెళ్ళిపోయాడు.

## (3) అలి (రజి) ఘనతా ఔన్నత్యాలు

హజ్రత్ అలి (రజి) మదీనాకు వలసపోయిన తరువాత దైవప్రవక్త (స)తో పాటు తబూక్‌దండయాత్ర తప్ప మిగతా యుద్ధాలన్నిటిలో పాల్గొన్నారు. తబూక్ దండ యాత్రలో పాల్గొనలేకపోవడానికి కారణం ఆయన్ని దైవప్రవక్త (స) ఆ సమయంలో మదీనా రక్షణ కోసం నియమించడమే.

అప్పుడు అలి (రజి) కాస్తంత నిరుత్సాహంతో "మీరు నన్ను స్త్రీలు, పిల్లలకు ఖలీఫా (ప్రతినిధి)గా చేసి వెళ్ళిపోతున్నారా?" అని అడిగారు.

దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "(దివ్యదర్శనార్థం) మూసా (అలై) (సోదరుడు) హారూన్ (అలై)ను (ఇస్రాయీల్‌సంతతి ప్రజల రక్షణ కోసం) వదలిపోయి నట్లు నేను నిన్ను వదలివెళ్తున్నాను. ఈ విషయం నీకు సంతోషం కలిగించదా? కాకపోతే నా తదనంతరం మరే దైవప్రవక్తా ఉండడు" అని అన్నారు.

ఒకరోజు అలి (రజి) ఏదో కారణంతో భార్యపై అలిగి ఇంటి నుంచి మసీదుకు వెళ్ళిపోయారు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) మసీదుకు వెళ్ళి చూస్తే ఆయన నేల మీద దుమ్ము పూసుకొని నిద్రపోతూ కన్పించారు. దైవప్రవక్త (స) ఆయన బట్టలకు అంటుకున్న దుమ్ముదులుపుతూ "అబూతురాబ్ (మట్టివాడా)! లే" అని అన్నారు.

ఆనాటినుంచి ఆయనకు అబూతురాబ్ అని కూడా పేరుపడింది. ఎవరైనా అలి (రజి)ని అబూతురాబ్ అని పిలిస్తే ఆయన మహాసంతోష పడిపోయేవారు. అలీ (రజి)కి కుమారుడు హసన్ (రజి) పుట్టిన తర్వాత అబుల్‌హసన్ అనే పేరు కూడా పడింది.

దైవప్రవక్త (స) ఒకసారి "నేను విద్యాజ్ఞానాల పట్టణాన్ని, అలి (రజి) దాని ప్రధానద్వారం" అన్నారు. అలి (రజి) ధర్మావగాహనతో పాటు, వ్యవహారావగాహనలో కూడా అందెవేసిన చేయి. ఆయన ప్రత్యర్థులు సైతం ధార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆయన్ని అడిగి తెలుసుకునేవారు. ఈ విషయానికి సంబంధించిన ఒక సంఘటనను ఇక్కడ పేర్కొనడం సందర్భోచితంగా ఉంటుంది.

ఒకసారి ఇద్దరుమిత్రులు భోజనం చేయడానికి కూర్చున్నారు. వారిలో ఒకడి దగ్గర అయిదు రొట్టెలున్నాయి. రెండోవాడి దగ్గర మూడు రొట్టెలున్నాయి. అంతలో మరొకడు ఆకలితో వారి దగ్గరకు వచ్చాడు. మిత్రులిద్దరు అతడ్ని కూడా కలుపుకొని భోజనం చేశారు. మూడోవ్యక్తి భోజనంచేసి ప్రతిఫలంగా వారిద్దరికి కలిపి ఎనిమిది దిర్హాలు ఇచ్చి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయిన తరువాత మిత్రులిద్దరి మధ్య

డబ్బు పంచుకోవడంలో తగాదా వచ్చింది. అయిదు రొట్టెలవాడు "నేను అయిదు దిర్హంలు తీసుకుంటాను. నీదగ్గర మూడురొట్టెలుండేవి గనక నీకు మూడుదిర్హంలు మాత్రమే లభిస్తాయి" అని అన్నాడు. అందుకు మూడు రొట్టెలవాడు అంగీకరించ కుండా "నేను సగం డబ్బు తీసుకోనిదే నిన్ను వదలను" అని అన్నాడు.

చివరికి వారిద్దరు హజ్రత్ అలి (రజి) దగ్గరకు వెళ్ళి విషయం వివరిస్తూ తమ తగాదా తీర్చమని అడిగారు. వ్యవహారం గ్రహించిన అలి (రజి) మూడు రొట్టెలవాడితో "నీ రొట్టెలు తక్కువగా ఉండేవి. నీకు నీ మిత్రుడు ఇస్తానన్న మూడు దిర్హంలు కూడా ఎక్కువే. కాబట్టి మూడు దిర్హంలు తీసుకోవడానికి ఒప్పుకో" అని అన్నారు.

కాని అతను అందుకు అంగీకరించకుండా "నా హక్కు నాకు పూర్తిగా లభించక పోతే నేనెలా మూడు దిర్హంలతో తృప్తిచెందాలి?" అని అడిగాడు.

"అయితే నీ మిత్రుడికి ఏడు దిర్హంలు లభిస్తాయి. నీకు ఒక్క దిర్హం మాత్రమే లభిస్తుంది" అన్నారు అలి (రజి). మూడు రొట్టెలవాడు ఈమాట విని "అదెలా!?" అన్నాడు ఆశ్చర్యంతో నోరెల్లబెట్టి చూస్తూ. అప్పుడు అలి (రజి) ఇలా చెప్పారు:

"విను చెబుతా. మొత్తం ఎనిమిది రొట్టెలు ఉండేవి. వాటిని తిన్నవారు ముగ్గురు. ఎనిమిది రొట్టెల్ని యథాతథంగా ముగ్గురికి సమానంగా పంచడం సాధ్యం కాదు. అంచేత ఒక్కొక్క రొట్టెను మూడు సమభాగాల చొప్పున ఎనిమిది రొట్టెల్ని ఇరవై నాలుగు సమభాగాలుగా చేసి, ముగ్గురూ సమానంగా తిన్నారనుకోండి. అంటే ముగ్గురిలో ప్రతివ్యక్తీ ఎనిమిది ముక్కలు తిన్నాడని భావించవలసి ఉంటుంది. నీ మూడు రొట్టెల తొమ్మిది ముక్కల్లో ఒక ముక్క మూడోవాడు తిన్నాడు. మిగిలిన ఎనిమిది ముక్కలు నువ్వు తిన్నావు. పోతే నీ మిత్రుడి అయిదు రొట్టెల పదిహేను ముక్కల్లో ఏడు ముక్కలు మూడోవాడు తిన్నాడు. ఆ పదిహేను ముక్కల్లో ఈ ఏడు ముక్కలు పోగా మిగిలిన ఎనిమిది ముక్కలు నీ మిత్రుడు తిన్నాడు. మూడోవాడు నీ రొట్టెల్లో ఒకముక్క, నీ మిత్రుడి రొట్టెల్లో ఏడుముక్కలు తిని ఎనిమిది దిర్హంలు ఇచ్చిపోయాడు. కాబట్టి నీకు ఒక దిర్హం, నీ మిత్రుడికి ఏడు దిర్హంలు లభిస్తాయి."

మూడు రొట్టెలవాడు ఈ తీర్పు విని "బాగుంది మీ తీర్పు. నేనిప్పుడు ఒప్పు కుంటున్నాను" అని అన్నాడు.

మరొకసారి ఒకతను హజ్రత్ అలి (రజి) దగ్గరకు వచ్చి "ఫలానా మనిషి తన కలలో నా తల్లితో సంభోగించినట్లు చెబుతున్నాడు" అని ఫిర్యాదు చేశాడు.

అలి (రజి) ఈమాట విని "అయితే ఆ కలగని దాన్ని గురించి చెబుతున్నవాడ్ని ఎండలో నిలబెట్టి అతని నీడపై కొరడాదెబ్బలు కొట్టు" అని చెప్పారు.



హజ్రత్ అలి(రజి) ప్రభుత్వధనాగారం విషయంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. రాజు తలచుకుంటే ప్రభుత్వధనాగారం నుంచి కోరినంత ధనం తీసుకొని విచ్చల విడిగా ఖర్చుపెట్టగలడు; భోగభాగ్యాలు అనుభవించగలడు. కాని శ్రేయస్కర ఖలీఫాల జీవితం దీనికి పూర్తిగా భిన్నమైనది. ఆయన తన జీతాన్ని పూర్వ ఖలీఫాలైన అబూబకర్ (రజి), ఉమర్‌ఫారూఖ్ (రజి)లు తీసుకున్న జీతమంతే నిర్ణయించుకున్నారు.

ఈ జీతం ఈనాటి ఓ సాధారణకార్మికుడి జీతం కంటే కూడా చాలా తక్కువ. అందుకే ఖలీఫా హజ్రత్ అలి (రజి) అతుకులు వేసిన ముతకబట్టలు మాత్రమే ధరించేవారు. ఒకసారి చలికాలంలో ఒకతను అలీ (రజి)ని కలుసుకోవడానికి వచ్చాడు. అప్పుడా రాజర్షి ఓ చింపిరి దుప్పటి కప్పుకొని చలికి గజగజవణికిపోతూ కూర్చున్నాడు. జీవిత చరమఘడియల్లో ఆయన ఆస్తిని పరిశీలిస్తే ఏడొందలు దిర్హంలు మాత్రమే ఉన్నట్లు తేలింది. అదయినా ఆయన ఒక సేవకుడ్ని కొనడానికి ఒక్కొక్క పైసా కూడబెట్టిన డబ్బు మాత్రమే.

హజ్రత్ అలి(రజి) తనకు ఎలాంటి ఆర్థికఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వ ధనాగారం నుంచి ఒక్క దిర్హం కూడా తీసుకునేవారు కాదు. అంతేకాదు, ఆయన తన దగ్గరి బంధువులక్కూడా ప్రభుత్వధనాగారం నుండి ఆర్థికసహాయం చేసేవారు కాదు.

ఒకసారి అలి (రజి) అన్న అఖీల్ (రజి) వచ్చి ప్రభుత్వధనాగారం నుంచి తనకు లక్షదీనార్లు తీసివ్వమని అడిగారు. అందుకు అలి (రజి) నిరాకరిస్తూ "ఏమిటీ నీ తమ్ముడు ప్రజలసొత్తు నీకిచ్చి నరకానికి పోవాలని నీవు కోరుకుంటున్నావా?" అన్నారు.

ఒకసారి ఇద్దరు వ్యక్తులు తమ సమస్యపరిష్కారం కోసం హజ్రత్ అలి(రజి) దగ్గరకు వచ్చారు. అప్పుడాయన ఒక పడిపోనున్న గోడ పక్కన కూర్చున్నారు. వారిద్దరిలో గోడ దుస్థితి గమనిస్తూ "ఈ గోడ పడిపోయేలా ఉంది" అన్నాడు. దానికి ఖలీఫా అలి (రజి) మీరు మీ సమస్య ఏమిటో చెప్పండి. దేవుడే నా రక్షకుడు. ఆయనే నన్ను కాపాడుతాడు" అని అన్నారు. వారిద్దరు వ్యక్తులు తమ సమస్య చెప్పడం, హజ్రత్ అలి (రజి) వారికి దాని పరిష్కారం తెలియజేయడం జరిగింది. ఆ తరువాత ఆయన అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయారు. ఆయన లేచివెళ్ళిన మరుక్షణమే ఆ గోడ దబేలున కూలిపోయింది.

ఒకరోజు హజ్రత్ అలి (రజి) ఏదో విషయం మాట్లాడుతుంటే ఒకతను దాన్ని ఖండించాడు. అప్పుడు అలి (రజి) "నువ్వు అబద్ధాలరాయుడవైతే నేను నిన్ను శపిస్తాను" అన్నారు. దానికా వ్యక్తి శపించండి అన్నాడు. అలి (రజి) "దేవుడు నీ కళ్ళు పోగొట్టుగాక" అని శపించారు. దాంతో అతను అక్కడ్నుంచి లేచాడో లేదో గుడ్డి వాడైపోయాడు.

# (4) నివురుగప్పిన నిప్పు

ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య తర్వాత అల్లరిమూకలు ఇంకా మదీనాలోనే తిష్ఠవేసి ఉన్నారు. వారిలో అత్యధికమంది అలీ (రజ)ని సమర్థించేవారున్నారు. మదీనా ప్రజల్లో కూడా అత్యధికమంది అలీ (రజ)ని సమర్థించేవారున్నారు. అంచేత బైత్ సమయంలో ముందుగా దుండగుల నాయకుడు మాలిక్ బిన్ అష్తర్ ముందుకొచ్చి అలి(రజి) చేతిలో బైత్ (శపథం) చేశాడు. ఆ తరువాత అందరూ బైత్ చేశారు.

హజ్రత్ అలి (రజి) ఖిలాఫత్ఎన్నిక అల్లర్లు, అలజడులు, విభేదాలు, వైషమ్యాలతో నిండిన విషపూరితమైన వాతావరణంలో జరిగింది. అంచేత ప్రముఖ సహాబీలలో అనేకమంది అలీ (రజి)తో 'బైత్' (శపథం) చేయడానికి రాలేదు. ముఖ్యంగా తల్హా (రజి), జుబైర్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) రాలేదు. వారు ప్రజల్లో బాగా పలుకుబడి ఉన్న సహాబీలు. అంచేత తల్హా, జుబైర్‌ల అభిప్రాయం కూడా తెలుసుకోవాలి కదా! అన్నారు అలి (రజి).

అప్పుడు మాలిక్ బిన్ అష్తర్, అతని అనుచరులు ఆ ఇద్దర్ని బలవంతంగా పిలుచుకొచ్చి అలి (రజి) ముందు ప్రవేశపెట్టారు. అలి (రజి) వారితో "మీరిద్దరిలో ఎవరైనా ఖలీఫా కావాలని కోరుకుంటే నేనతడ్ని సమర్థిస్తూ బైత్ చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు.

అయితే తల్హా, జుబైర్ (రజి)లు ఖలీఫా పదవిని నిరాకరించారు. అప్పుడు దుండగుల్లో ఒకతను "మీకు ఖలీఫా కావడం ఇష్టంలేకపోతే అలి (రజి) ఖిలాఫత్‌ను సమర్థిస్తూ బైత్ చేయండి" అన్నాడు. ఈమాట విని వారిద్దరు ఆలోచనలో పడిపోయారు. మాలిక్ బిన్ అష్తర్ వారిద్దరు బైత్ చేయడానికి సందేహిస్తున్నారని భావించి వర నుంచి ఛర్రున కత్తిలాగి "ఉండండి, మీరిద్దరి కథ ఇప్పుడే ముగించివేస్తాను" అన్నాడు. దాంతో వారిద్దరు బైత్ చేశారు. ఆతర్వాత అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) కూడా బైత్ చేశారు. కొందరు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తటస్థంగా ఉండిపోయారు. అలాంటి వారిలో ఉసామా బిన్ జైద్, ముహమ్మద్ బిన్ మస్లమా, హస్సాన్ బిన్ సాబిత్, కాబ్ బిన్ మాలిక్, అబూసయీద్ ఖుద్రీ, నోమాన్ బిన్ బషీర్, జైద్ బిన్ సాబిత్, ముగీరా బిన్ షాబా వగైరా సహాబీలు కూడా ఉన్నారు.

బనూఉమయ్యా తెగవాళ్ళు బైత్ నుండి తప్పించుకోవడానికి మదీనా వదలి సిరియా వెళ్ళిపోయారు. వారిలో కొందరు హజ్రత్ ఉస్మాన్ (రజి) రక్తసిక్తమైన చొక్కా, నాయిలా తెగిన చేతివ్రేళ్ళు తీసికెళ్ళారు. వారక్కడ అమీర్ ముఆవియా (రజి) ఆదేశంతో వాటిని డెమాస్కస్‌లోని జామియా మస్జిద్‌లో ఉంచి ప్రజలకు చూపిస్తూ అలీ (రజి)కి వ్యతిరేకంగా వారిని సంఘటిత పరచడం ప్రారంభించారు.



మరుసటి రోజు తల్హా (రజి), జుబైర్ (రజి)లు ఖలీఫా అలి (రజి) దగ్గరకు వచ్చి "మీరు ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకుంటారన్న షరతు పైన్నే మేము మీ ఖిలాఫత్‌ను సమర్థిస్తూ బైత్ చేశాం. మీరలా చేయకపోతే మా 'బైత్' రద్దయి పోతుంది" అని అన్నారు. దానికి అలి (రజి) సమాధానమిస్తూ "నేను ఉస్మాన్ (రజి) హంతకులకు తప్పకుండా తగిన శిక్ష విధించి పూర్తిన్యాయం చేకూర్చుతాను. అయితే అల్లరిమూకల రభస తగ్గిపోయి ఖిలాఫత్ వ్యవస్థ కాస్త పటిష్ఠమైన తరువాత ఆ విషయంపై దృష్టి సారిస్తాను. అప్పటిదాకా నేనేమీ చేయలేను" అని అన్నారు. తల్హా (రజి), జుబైర్ (రజి)లు ఈమాట విని వెళ్ళిపోయారు.

సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి), ఆయన అనుచరులు మొదట్లో ఉస్మాన్ (రజి) హంతకుల్ని పట్టుకొని శిక్ష విధిస్తే చాలు, తాము బైత్ చేస్తామని అన్నారు. కాని ఆతర్వాత అమీర్ ముఆవియా (రజి) హంతకుల్ని శిక్షించడానికి వారిని తనకు అప్పగించాలని సిరియాఅధినేత స్థాయిలో డిమాండ్ చేశారు. ఈవిధంగా ఆయన ఖలీఫా అలీ (రజి)కి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు.

మరోవైపు మదీనాప్రజల హృదయాల్లో ఖలీఫా ఉస్మాన్ (రజి) పట్ల సానుభూతి, ఆయన హంతకుల పట్ల ద్వేషం తీవ్రస్థాయికి చేరాయి. హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యకు ముందే పరిపాలనావ్యవస్థ అస్తవ్యస్తమైపోయి రాజధానివాతావరణం చెడిపోయి ఉంది. ఇప్పుడు పరిస్థితి మరింత దిగజారిపోయి, ఎప్పుడు ఏమవుతుందో తెలియని విధంగా "నివురుగప్పిన నిప్పు"లా మారింది.

హజ్రత్ అలి (రజి) ఖలీఫా అయిన తర్వాత ఈ 'నివురుగప్పిన నిప్పు' మరో అరాచకానికి బీజం వేసింది. ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించే విషయంలో ఖిలాఫత్ వ్యవహారకర్తలు రెండువర్గాలుగా విడిపోయారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) వంశీయులు, ఆయన మద్దతుదారులు "బనూఉమయ్యా వర్గం"గా, హజ్రత్ అలి (రజి) వంశీయులు, ఆయన మద్దతుదారులు "బనూఅబ్బాసీ వర్గం"గా విడిపోయారు.

హజ్రత్ అలి (రజి) సిరియాగవర్నర్ అమీర్ ముఆవియా (రజి) పేర ఒక ఉత్తరం రాసి జరీర్ బిన్ అబ్దుల్లా ద్వారా డెమాస్కస్‌కు పంపారు. కాని అక్కడ్నుంచి మూడు నెలలదాకా ఎలాంటి జవాబు రాలేదు. తరువాత అమీర్ ముఆవియా (రజి) ఓ దూత ద్వారా ఒక సీల్డ్‌కవర్ పంపారు. ఆ కవర్ మీద "ముఆవియా నుండి అలీకి" అని రాయబడివుంది. అయితే అలి (రజి) దాన్ని తెరచి చూస్తే అందులో ఉత్తరం ఏదీ లేదు. ఖలీఫా అలి (రజి) ఆశ్చర్యపోయి చూస్తూ "ఇదేమిటీ" అన్నారు.

అప్పుడా దూత ఇలా అన్నాడు: "నా వెనుక డెమాస్కస్‌లో అరవై వేలమంది యోధులు ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి తహతహలాడు

తున్నారు" అని అన్నాడు. "ఎవరి నుండి ప్రతీకారం తీర్చుకోదలిచార"అ అడిగితే "మీ మెడనరం నుండి" అన్నాడతను. (ఖిలాఫత్ వ ములూకియత్)

హజ్రత్ అలి (రజి) మద్దతుదారుల్లో (బనూఅబ్బాసీ వర్గంలో) అత్యధిక మంది 'ముస్లింముఖయూదుడు' అబ్దుల్లా బిన్ సబా అనుచరులే ఉన్నారు. ఉస్మాన్ (రజి) హత్య తర్వాత వివిధప్రాంతాల నుంచి వచ్చిన తిరుగుబాటుదారులు వెంటనే తమ తమ ప్రాంతాలకు తిరిగివెళ్ళిపోవాలని అలి (రజి) ఆదేశించారు. కాని అబ్దుల్లా బిన్ సబా, అతని అనుచరమూకలు అలీ (రజి)కి మద్దతుదారులుగా నిలిచినప్పటికీ ఆయన ఆజ్ఞను త్రోసిపుచ్చి మదీనాలోనే తిష్ఠవేశారు.

ముఆవియా (రజి), ఆయన వర్గీయుల తిరుగుబాటు కార్యకలాపాల సంగతి తెలియగానే అలి (రజి) సిరియాపై దాడిచేయడానికి సన్నాహాలు మొదలెట్టారు. తల్హా (రజి), జుబైర్ (రజి)లకు ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించడంలో అలి(రజి) చేస్తున్న జాప్యం నచ్చలేదు. పైగా ఆయన సిరియాపై దాడిచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా మదీనాలో యుద్ధవాతావరణం నెలకొనడం చూసి వారిద్దరు 'ఉమ్రా'చేసే నెపంతో మక్కా పోవడానికి అలి (రజి)ని అనుమతి అడిగారు. అలి (రజి) వారికి అనుమతిచ్చారు. దాంతో తల్హా (రజి), జుబైర్ (రజి) మక్కా వెళ్ళిపోయారు.

ఆ తర్వాత అలి (రజి) సిరియాపై దాడిచేయడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని ప్రకటించారు. ఖాజీ అబూబకర్ "అహ్కాముల్‌ఖుర్‌ఆన్"లో "అలి (రజి) ఆ పరిస్థితిలో ఈ సూక్తి ప్రకారమే ఆచరించారు..." అని పేర్కొన్నారు.

"విశ్వాసుల్లో రెండువర్గాలు పరస్పరం జగడానికి దిగితే వారిమధ్య రాజీ కుదర్చండి. ఒకవేళ (రాజీయత్నం విఫలమై) ఆ రెండువర్గాల్లో ఒక వర్గం రెండో వర్గంపై దౌర్జన్యానికి పాల్పడితే, దౌర్జన్యానికి పాల్పడిన వర్గం దేవుని ఆజ్ఞ వైపు మరలివచ్చే దాకా దానితో పోరాడండి. అది దేవుని ఆజ్ఞ వైపు మరలివస్తే వాటి మధ్య న్యాయంగా రాజీ కుదర్చండి. న్యాయం చేయండి, న్యాయం చేసేవారిని దేవుడు ప్రేమిస్తాడు." (ఖుర్‌ఆన్-49:9)

ప్రవక్త సతీమణి ఆయిషా (రజి) ఉస్మాన్ (రజి) హత్యకు ముందే మదీనాలో అరాచక పరిస్థితులతో విసుగెత్తి మక్కా వెళ్ళిపోయారు. అక్కడ హజ్ చేసిన తరువాత మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే దారిలో ఉస్మాన్ (రజి) హత్యావార్త, అలి (రజి) బైత్ సంగతి విని మక్కాకు తిరిగి వెళ్ళిపోయారు. ఆమె కూడా ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించే విషయంలో అలి (రజి)కి వ్యతిరేకమైపోయారు. ఇప్పుడు తల్హా (రజి), జుబైర్ (రజి)లు కూడా మదీనా వదలి మక్కా చేరుకున్నారు.

ఆయిషా సిద్దీఖా (రజి) మార్గమధ్య నుండే తిరిగిరావడం చూసి మక్కా ప్రజలకు ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడా కలిగింది. వారామె కూర్చున్న ఒంటె చుట్టు



గుమికూడి ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్యగావించబడ్డారన్న దుర్వార్త విని తీవ్ర విభ్రాంతికి గురయ్యారు. అప్పుడు ఆయిషా (రజి) ఇలా అన్నారు. "ఏపాపం ఎరగని ఉస్మాన్ (రజి)ని దుండగులు దారుణంగా హతమార్చారు. రక్తపాతం నిషేధించబడిన హజ్‌సీజన్‌లో ఘోరమైన రక్తపాతం జరిపారు. మదీనాపట్టణ పవిత్రను దిగజార్చారు. దైవసాక్షి! నేను ఉస్మాన్(రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకుంటాను."

హజ్రత్ ఆయిషా (రజి) మాటలు వినగానే మక్కా ప్రజల రక్తం ఉడికిపోయింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) చేత మక్కా గవర్నర్‌గా నియమించబడిన అబ్దుల్లా బిన్ ఆమిర్ హజ్రమీ (రజి) మరింత రెచ్చిపోతూ "ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి అందరికన్నా ముందు నేనుంటాను" అన్నారు. ఉస్మాన్ (రజి) హత్య తర్వాత అప్పుడే మక్కా చేరుకున్న బనూఉమయ్యా వర్గీయులు ఆయన మాటలు వినగానే "ఈ విషయంలో మేమంతా మీవెంట ఉంటాం" అన్నారు ముక్తకంఠంతో. బస్రాగవర్నర్ పదవి నుండి ఉద్వాసనకు గురైన అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) కూడా మక్కా చేరుకున్నారు. తర్వాత మదీనా నుండి మక్కా చేరుకున్న తల్హా (రజి), జుబైర్ (రజి), ముగీరా బిన్ షాబా (రజి) కూడా ఆయిషా (రజి)తో కలసిపోయారు.

ఇంకేముంది! క్షణాల్లో మక్కా పరిస్థితి మారిపోయింది. మక్కా ప్రజలు ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. దైవప్రవక్త సతీమణి ఆయిషా (రజి) నేతృత్వంలో అనేకమంది సహాబీలతో పాటు మూడువేల మంది సాయుధులు బస్రాకు బయలుదేరారు.

## (5) ఉష్ట్రయుద్ధం (జంగెజమల్)

మక్కాలో ఉన్న అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ద్వారా ఖలీఫా అలీ (రజి)కి ఈసంగతి తెలియగానే ఆయన సిరియాపై దాడి నిర్ణయం వాయిదావేసి, బస్రాకు బయలుదేరారు. కూఫా ప్రజలు కూడా ఆయన సైన్యంలో చేరారు.

హజ్రత్ ఆయిషా (రజి) సైన్యం బయలుదేరే సమయంలో మర్వాన్ బిన్ హకం వచ్చి సైన్యంలో చేరిపోయాడు. ఈ మర్వాన్ మరెవరో కాదు, ఖలీఫా ఉస్మాన్ (రజి) పేరు, రాజముద్రలతో ఈజిప్టుగవర్నర్‌కు దొంగఉత్తరం వ్రాసి సబాయీదుండగుల అరాచకపుఅగ్నికి ఆజ్యం పోసినవాడే. ఖలీఫా కార్యదర్శిగా ఉంటూ తన నోటిదురుసు, దుష్ప్రవర్తనలతో మదీనాప్రజల ఛీత్కారానికి గురైనవాడే ఈ మర్వాన్.

సైన్యం కొన్నిమైళ్ళు ప్రయాణంచేసి 'ఖాబ్' సరస్సు దగ్గరకు చేరుకోగానే అక్కడ కుక్కలు మొరగడం మొదలెట్టాయి. ఆయిషా (రజి) ఆ సరస్సు పేరేమిటని అడిగితే కొందరు 'ఖాబ్' సరస్సు అని చెప్పారు. ఈపేరు వినగానే ఆమె ఒంటెను ఆపుతూ "నన్ను వెనక్కి పంపండి" అన్నారు. ప్రజలు, ఎందుకని అడిగారు. దానికామె ఇలా

చెప్పారు: "ఒకసారి దైవప్రవక్త (స) తమ భార్యలతో మాట్లాడుతూ 'మీలో ఎవరిని చూసి ఖాబ్ కుక్కలు మొరుగుతాయో తెలిస్తే ఎంత బాగుండు!' అని అన్నారు. ఈమాట చెప్పి ఆమె ఒంటె మెడపై కొట్టి దాన్ని అక్కడే కూర్చోబెట్టారు. ఒక పగలు, ఒకరాత్రి అక్కడే ఉండిపోయారు. సైన్యం ఆమెతోపాటు అక్కడే ఆగిపోయింది.

ఆ సమయంలో కొందరు ఆయిషా (రజి) దగ్గరకొచ్చి "ఎవరో పొరపాటున ఇది 'ఖాబ్' సరస్సు అని చెప్పారు మీకు. ఇదసలు ఖాబ్ సరస్సు కాదు. ఖాబ్ సరస్సు ఈ దారిలో రాదు" అని అన్నారు. ఆ తర్వాత తెల్లవారుజామున "అలి (రజి) సైన్యం మనకు దగ్గరగా వచ్చింది. లేవండి, త్వరగా బయలుదేరండి" అంటూ అకస్మాత్తుగా సైన్యంలో కలకలం చెలరేగింది. ఈమాట వినగానే సైనికులంతా బస్రా దిశగా బయలుదేరారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా వాళ్ళను అనుసరించారు.

చివరికి ఈసైన్యం బస్రా సమీపానికి చేరుకుంది. బస్రా సైనికులకు ఆయిషా (రజి) ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగాయి. చర్చల సందర్భంలో బస్రా సైనికుల్లో తీవ్రవిభేదాలు వచ్చాయి. దాంతో సైన్యంలో ఒకవర్గం యుద్ధం చేయడానికి నిరాకరించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఆయిషా (రజి) సైన్యం యుద్ధంచేసి బస్రా పట్టణాన్ని సులభంగా స్వాధీనం చేసుకుంది.

అటు ఖలీఫా అలి (రజి) సైన్యం బస్రాకు కొన్నిమైళ్ళ దూరం వచ్చి విడిది చేసింది. ఆ సైన్యంలో ముస్లింముఖ యూదుడు ఇబ్నెసబా, అతని మిత్రమూకలు కూడా చేరివున్నారు. అలి (రజి) ప్రతినిధులకు, ఆయిషా ప్రతినిధులకు మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఉభయపక్షాల్లోని ముస్లింసముదాయ శ్రేయోభిలాషులంతా యుద్ధనివారణ కోసమే కృషిచేశారు. యుద్ధం ప్రారంభానికి ముందు అలి (రజి) తన సైనికుల్లో ఇలా ఓ ప్రకటన చేయించారు: "పారిపోయేవాడ్ని వెంటాడకూడదు. గాయపడినవాడిపై దాడిచేయకూడదు. విజయం సాధిస్తే ప్రత్యర్థుల ఇండ్లలోకి జొరబడకూడదు."

ఆ తర్వాత హజ్రత్ అలి (రజి) ప్రత్యర్థివర్గంలో ఉన్న జుబైర్ (రజి), తల్హా(రజి) లను పిలిపించి వారికి ప్రవక్త(స) హితోక్తులు గుర్తుచేస్తూ, యుద్ధం నుండి తొలిగి పొమ్మని చెప్పారు. ఆయన జుబైర్ (రజి)తో మాట్లాడుతూ "ఓసారి దైవప్రవక్త (స) మీ గురించి ఏమన్నారో గుర్తుచేసుకోండి. 'నువ్వు ఒకరితో పోరాడుతావని, అప్పుడు నీవు అతనిపై దౌర్జన్యం చేసినవాడవుతావని ఆయన చెప్పలేదా?" అని అన్నారు. జుబైర్ (రజి) ఈమాట వినగానే "నిజమే. ఈమాట నాకు ముందే చెప్పివుంటే నేనసలు మదీనా నుండి బయలుదేరేవాడ్ని కాను. ఇప్పుడు నేను దైవసాక్షిగా చెబుతున్నాను. నేను మీతో ఎన్నటికీ పోరాడను" అని చెప్పి వెనక్కి వెళ్ళిపోయారు.



తరువాత ఆయన తల్హా (రజి)తో మాట్లాడుతూ "అమ్మార్ బిన్ యాసిర్ (రజి) గురించి దైవప్రవక్త (స) 'నిన్ను ఓ తిరుగుబాటువర్గం వధిస్తుంద'ని భవిష్యత్‌వాణి పలికిన సంగతి మీకు తెలియదా?" అని అన్నారు. దానికి తల్హా (రజి) అలి (రజి) పక్షంలో నిల్చున్న అమ్మార్ (రజి)ని చూస్తూ "ఔనౌను. గుర్తొచ్చింది. నేనిప్పుడు మీతో ఎన్నటికీ పోరాడను" అన్నారు. ఆ తర్వాత ఆయన కూడా వెనక్కి వెళ్ళిపోయారు.

ఇలా వారిద్దరు పరిస్థితి అర్థం చేసుకున్నారు. జుబైర్ (రజి) యుద్ధమైదానం వదలి వేరే వైపుకు వెళ్ళిపోయారు. తల్హా (రజి) ఖడ్గం పారేసి ముందుపంక్తుల నుండి వెనుక పంక్తుల్లోకి పోయినిల్చున్నారు. అయితే అలి (రజి) పక్షంలో ఉన్న అమ్ర్ బిన్ జర్మూజ్ అనే ఓ దుర్మార్గుడు జుబైర్ (రజి)ని, ఆయిషా (రజి) పక్షంలో ఉన్న మర్వాన్ బిన్ హకమ్ అనే మరోదుర్మార్గుడు తల్హా(రజి)ని అన్యాయంగా పొట్టన బెట్టుకున్నారు. తరువాత జుబైర్ (రజి) హంతకుడు ఇబ్నెజర్మూజ్ సంతోషంతో భుజాలు ఎగరేస్తూ బహుమానం పొందడానికి అలి (రజి) దగ్గరకు వస్తే, ఆయన మండిపడుతూ ఆ దుర్మార్గుడికి నరక దుర్వార్త విన్పించారు.

యుద్ధనివారణకు అలి (రజి) చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మరునాడు ఉదయం సంధిపత్రంపై సంతకాలు చేయవలసి ఉండింది. అయితే ఈసంగతి తెలుసుకున్న 'సబాయీదుండగులు' ఆందోళనచెందారు. ఈసంధి విజయవంతమైతే ముస్లింలంతా ఏకమై తమ భరతం పడ్తారని భావించి వణికిపోయారు. అంచేత వారా రాత్రంతా నిద్రపోకుండా రహస్యమంతనాలు జరిపారు. చివరికి నాయకుని ఆదేశం ప్రకారం కొందరు తెలతెల వారుతుండగా దొంగచాటుగా వెళ్ళి ఆయిషా (రజి) సైన్యం మీద మెరుపుదాడి చేశారు. దాంతో ఆ సైనికులు తమపై అలి(రజి) సైనికులు దాడి చేశారని భావించి అరుపులు, కేకలతో అప్రమత్తులైపోయారు.

ఈ గందరగోళానికి అలి (రజి) లేచి విచారిస్తే, ఇబ్నెసబా అనుచరులు "తల్హా, జుబైర్‌లు మన సైన్యంపై దాడిచేశారని, మనవాళ్ళు గత్యంతరం లేక ఆత్మరక్షణ పోరాటానికి సిద్ధమయ్యారని" అబద్ధమాడారు. అలి (రజి) ఈమాట వినగానే సైనికుల్ని సమాయత్తపరిచారు. కొన్నిక్షణాల్లోనే యుద్ధమైదానం వేడెక్కింది. కాని యుద్ధానికి దారితీసిన అసలు విషయం తెలియక ప్రతిమనిషీ ఎదుటి పక్షంవారినే దుర్మార్గులుగా భావించసాగాడు. హజ్రత్ ఆయిషా (రజి) ఒక అనుచరుడి సలహాతో ఒంటె మీద అంబారీలో కూర్చొని యుద్ధమైదానంలోకి ప్రవేశించారు. ఆమెను చూసి ఉభయపక్షాల యోధులు మరింత రెచ్చిపోయి పోరాటాన్ని ఉధృతం చేశారు.

ఖలీఫా అలి (రజి) పరిస్థితి తీవ్రతను గమనిస్తూ, ఆయిషా (రజి) కూర్చున్న ఒంటె కాలికి గురిపెట్టి బాణం వదలమని ఒక సైనికుడ్ని ఆదేశించారు. అతనలా బాణం వదలగానే ఒంటె దబేలున కూలిపోయి కూర్చున్నది. ఆ దృశ్యం చూడగానే

ఒంటె చుట్టూ రక్షణవలయంగా నిలబడి పోరాడుతున్న ఆయిషా (రజి) సైనికులు భీతావహులై పారిపోయారు. చివరికి ఆయిషా (రజి) సైన్యం ప్రత్యర్థిసైన్యం ముందు నిలువలేక చేతులెత్తేసింది. ముస్లింముఖయూదుడైన ఇబ్నెసబా కుట్ర ఫలితంగా రెండు పక్షాలకు చెందిన పదివేల మందికిపైగా ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. హి.శ. 36లో జరిగిన ఈ యుద్ధాన్ని "ఉష్ట్రయుద్ధం" (జంగెజమల్) అంటారు.

యుద్ధం ముగిసిన వెంటనే ఖలీఫా అలి (రజి) యుద్ధంలో చనిపోయిన ఉభయపక్షాల సైనికులకు జనాజానమాజ్ చేయించి ఖననం చేశారు. సమరసొత్తును బస్రా జామియామస్జిద్‌లో సమీకరించి ఎవరి వస్తువులు వారు వచ్చి తీసికెళ్ళమని ప్రకటన చేయించారు. ఇలా ఆయిషా (రజి) పక్షం సైనికులు యుద్ధమైదానంలో తాము పోగొట్టుకున్న వస్తువులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

ఆ సందర్భంలో తల్హా (రజి) కుమారుడు తనను కలుసుకోవడానికి వచ్చినపుడు అలి (రజి) ఆయన్ని ఎంతో ప్రేమగా తన దగ్గర కూర్చోబెట్టుకొని సమరసొత్తులోని ఆయన వస్తువుల్ని ఆయనకు తిరిగిచ్చేశారు. "పరలోకంలో నాకు, మీ నాన్నకు మధ్య ఈ ఖుర్‌ఆన్‌సూక్తి ప్రకారమే వ్యవహారం వస్తుందని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.. "వారి హృదయాల్లో రాగద్వేషాలు ఏవైనా మిగిలివుంటే వాటిని మేము తీసేస్తాం. వారు పరస్పరం అన్నదమ్ముల్లా మారి ఆసనాల మీద ఎదురెదురుగా కూర్చుంటారు." (15:47)

తర్వాత అలి (రజి) ఆయిషా (రజి) సన్నిధికి వెళ్ళి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ జరిగిన సంఘటన పట్ల విచారం వెలిబుచ్చారు. ఆ తర్వాత అలి(రజి) ఆయిషా (రజి)ను ఎంతో గౌరవమర్యాదలతో ఆమె సోదరుడు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) రక్షణలో నలభైమంది స్త్రీల వెంట బస్రా నుండి పంపివేశారు.

హజ్రత్ ఆయిషా (రజి) బస్రా నుండి మక్కా చేరుకొని ఉష్ట్రయుద్ధానికి ముందు ఎదురైన పరిస్థితుల్ని గుర్తుకుతెచ్చుకొని బాధపడ్డారు. ఖాబ్ సరస్సు దగ్గర కుక్కలు మొరగడం, అలి (రజి) సైన్యంలో అమ్మార్ బిన్ యాసిర్ (రజి) ఉండటం మొదలైన విషయాలు ఆమె విజయానికి దుశ్శకునాలయ్యాయి. కాని అప్పుడామె వాటిని గురించి పట్టించుకోలేదు. పరాజయం తరువాత వాస్తవం వికృతనాట్యంచేస్తూ తన ముందు నిలబడగానే ఆమె తీవ్రంగా పశ్చాత్తాపం చెందారు.

అబ్దుల్లా బిన్ హంబల్, ఇబ్నెమున్జిర్, ఇబ్నె అబీషైబా, ఇబ్నెసాద్ వంటి ప్రముఖులు తమ గ్రంథాల్లో మస్రూఖ్ కథనాన్ని ఉల్లేఖిస్తూ, ఆయిషా (రజి) ఖుర్‌ఆన్ పఠన సందర్భంగా ఉష్ట్రయుద్ధంలో తనవల్ల జరిగిన పొరపాటు జ్ఞాపకమొచ్చి, "మీరు మీ ఇండ్లలోనే ఆగిఉండండి." అనే సూక్తి (33:32) దగ్గరికి వచ్చేటప్పటికి అప్రయత్నంగా దుఃఖించేవారని, కన్నీటితో ఆమె ఓణి తడిసిపోయేదని వ్రాశారు.



## (6) సిఫ్ఫిన్, నహ్రావాన్ యుద్ధాలు-మతవిభేదాలకు నాంది

సబాయీదుండగలు సమరసొత్తు విషయంలో అలి (రజి)తో తీవ్రంగా విభేదిస్తూ న్యాయం చేయలేదన్న సాకుతో బస్రా నుంచి వేరేప్రాంతాలకు తరలిపోయారు. అంతటితో వారు తమ కుట్రల పరంపరకు తెరదించలేదు. వారు తమ దుష్టపథకం లోని ఒక భాగంగా ముస్లింలను రాజకీయపరంగా చీల్చి విజయం సాధించారు. ఇక రెండవ భాగమైన మతపరంగా ముస్లిం సముదాయాన్ని చీల్చే దిశగా పురోగమించారు.

ఖలీఫా అలి (రజి) రాజధానిని మదీనా నుండి కూఫాకు మార్చి, కేంద్రప్రభుత్వా నికి అవిధేయుడైపోయిన అమీర్ ముఆవియా (రజి)ను దారికి తెచ్చేందుకు వివిధ రాష్ట్రాల నుంచి నలభైవేల మంది సైనికుల్ని సమీకరించి సిరియా బయలుదేరారు. ఈరాన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సబాయీ దుండగులు కూడా ఇద్దరేసి ముగ్గురేసి చొప్పున వచ్చి అలి (రజి) సైన్యంలో చేరిపోయారు. అటు సిరియాగవర్నర్ ముఆవియా (రజి) ఉస్మాన్ (రజి) రక్తసిక్త దుస్తుల్ని, ఆయనభార్య తెగిన చేతివ్రేళ్ళను ప్రజల ముందు ప్రదర్శిస్తూ, వారిని తనకు అనుకూలంగా కూడగట్టి అరవైవేల మంది సైనికులతో బయలుదేరారు.

ఈజిప్టు మాజీగవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్య తర్వాత తన ఇద్దరు కుమారులతో కలసి మదీనా నుండి బైతిల్‌మఖ్దిస్‌కు వెళ్ళి ఉండసాగారు. ఇప్పుడు మారిన పరిస్థితుల్ని విశ్లేషించి సిరియాగవర్నర్ అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు చేరుకొని, ఆయనకు సైనికసలాహాదారుడిగా ఉండసాగారు.

ఈరెండు సైన్యాలు ఫురాత్‌నదికి పశ్చిమదిశలోని సిఫ్ఫీన్ ప్రాంతానికి వచ్చి ఆగాయి. మొదట సంధికోసం రెండుమూడు సార్లు చర్చలుజరిగాయి. అవి విఫలం కావడంతో చిన్నచిన్న దళాలతో స్వల్పస్థాయి యుద్ధాలు జరిగాయి. తర్వాత మళ్ళీ చర్చలు జరిగాయి. అవీ ఫలించకపోవడంతో తీవ్రస్థాయి యుద్ధాలు జరిగాయి. ఇలా కొన్నినెలలు గడిచాయి. ఆ తర్వాత జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి.

అమీర్ ముఆవియా (రజి) ప్రతినిధివర్గం నాయకుడు హబీబ్ బిన్ మస్లమా ఖలీఫా అలి (రజి) దగ్గరకు వచ్చి "మీరు ఉస్మాన్ (రజి)ని హత్యచేయలేదని చెబితే, హత్యచేసినవాళ్ళను మాకు అప్పగించండి. మేము వాళ్ళను హతమార్చి ఉస్మాన్ (రజి) వైపున ప్రతీకారం తీర్చుకుంటాం. తర్వాత ముస్లింలు పరస్పరం సలహాసంప్రదింపులతో కొత్త ఖలీఫాను ఎన్నుకోవడానికి వీలుగా మీరు ఖిలాఫత్ పదవిని వదలిపెట్టండి" అని అన్నారు. సిరియా రాష్ట్రగవర్నర్ స్థాయిలో అమీర్ ముఆవియా (రజి) తరఫున వ్యక్తం చేయబడిన ఈ మాటలు ఖలీఫాపై తిరుగుబాటుకు ప్రబలనిదర్శనం.

ఇలా ఒక రాష్ట్రగవర్నర్ గతఖలీఫా హత్యకు ప్రతీకారంసాకుతో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించడంతో హి.శ. 37లో ఇరుపక్షాల మధ్య తీవ్రమైన యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఇరుపక్షాలలోఉన్న చాలామంది సత్యం ఏపక్షం వైపున్నదో అర్థం చేసుకోలేకపోయారు. అయితే అలి (రజి) పక్షంలోని 'అమ్మార్ బిన్ యాసిర్' (రజి) గురించి దైవప్రవక్త (సల్లం) "నిన్ను ఓ తిరుగుబాటు వర్గం వధిస్తుంద"ని భవిష్యవాణి పలికివున్నారు. ఈ యుద్ధంలో అమ్మార్ (రజి) ముఆవియా వర్గంతో పోరాడుతూ వధించబడ్డారు. దాంతో సత్యం ఖలీఫా అలి (రజి) వర్గం వైపే ఉందని, ముఆవియా (రజి) వర్గంవైపు లేదని, అది తిరుగుబాటు వర్గమని స్పష్టమైపోయింది.

ఖలీఫా అలి (రజి) అమ్మార్ బిన్ యాసిర్ (రజి) అమరగతి సంగతి విని తీవ్ర విచారం వెలిబుచ్చారు. ఈ దుర్వార్త అమీర్ ముఆవియా (రజి) వర్గానికి తెలిసినపుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) కుమారుడు అబ్దుల్లా వెంటనే అమ్ర్ (రజి), ముఆవియా (రజి)ల దగ్గరకు వెళ్ళి అమ్మార్ బిన్ యాసిర్ (రజి) విషయంలో దైవప్రవక్త (స) చెప్పిన ఈ భవిష్యవాణి వారికి గుర్తుచేశారు. దానిపై అమీర్ ముఆవియా (రజి) ప్రతికూలంగా స్పందిస్తూ "ఏమిటీ మనం అమ్మార్‌ని హతమార్చామా? కాదు, ఆయన్ని రణరంగంలోకి తీసుకొచ్చినవారే హతమార్చారు" అని అన్నారు.

అమీర్ ముఆవియా (రజి) చేసిన ఈ వ్యాఖ్యానం సంగతి అలీ (రజి)కి తెలిసి "ఇలాంటి వ్యాఖ్యానంతో, హమ్జా (రజి)ను స్వయంగా దైవప్రవక్తే (స) హతమార్చారని చెప్పవచ్చు" అని అన్నారాయన. (షరా ఫిఖాఅక్బర్-ముల్లాఅలి ఖారి)

ఈ యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన డెబ్బయి వేలమంది యోధులు నేలకొరి గారు. అనేక వేలమంది గాయపడ్డారు. ముఆవియా (రజి) సైన్యంలోనే అధిక ప్రాణనష్టం జరిగింది. ఆ సైన్యం పరాజయం పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. అంచేత అమ్ర్ బిన్ ఆస్ (రజి) ముఆవియా (రజి)కు సలహాఇస్తూ "ఇప్పుడు మన సైనికులు ఈటెలకు ఖుర్ఆన్‌ప్రతులు కట్టి తీసికెళ్ళి 'ఈ ఖురాన్ మీకు మాకు మధ్య మధ్యవర్తి' అని చెప్పాలి. దీనివల్ల అలి (రజి) సైన్యంలో చీలికలు వస్తాయి. వారిలో కొందరు ఈ విషయాన్ని మనం ఒప్పుకుందాం అంటారు. మరికొందరు ఒప్పుకోకూడదంటారు. ఒకవేళ వారు ఒప్పుకుంటే మనకు కాస్త వ్యవధి లభిస్తుంది" అని చెప్పారు.

దానిప్రకారం ఆ సైనికులు తమ నాయకుడి ఆదేశంతో ఈటెలకు ఖుర్ఆన్ ప్రతులు కట్టి "సోదరులారా! మీకు, మాకు మధ్య దైవగ్రంథం ఖుర్ఆనే మధ్యవర్తి. మనం దైవధర్మం కోసం యుద్ధం చేస్తున్నాం. కనుక మనమందరం దైవగ్రంథం తీర్పుని శిరసావహిద్దాం. మేము ఖుర్ఆన్ తీర్పుని అంగీకరిస్తాం. సిరియా సైనికులు హతమైతే రోమన్లదాడుల్ని ఎవరు నిరోధిస్తారు? ఇరాఖ్ సైనికులు నాశనమైతే తూర్పురాజ్యాల



నుండి ఎదురయ్యే దాడుల్ని ఎవరు అడ్డుకుంటారు?" అని అన్నారు బిగ్గరగా.

ఈ మంత్రం అలి (రజి) సైనికులపై అమోఘంగా పనిచేసింది. వారీ మాటలు వింటూ ప్రత్యర్థిసైనికుల ఈటెలకు కట్టబడిన ఖుర్ఆన్ ప్రతుల్ని చూడగానే యుద్ధం ఆపేశారు. అలి (రజి), కొందరు సైనికాధికారులు ఎంత నచ్చజెప్పినా వారు సిరియా సైనికులతో యుద్ధం చేయడానికి అంగీకరించలేదు. అదను కోసం కాచుకొని వున్న సబాయీ దుండగులు యుద్ధవిరమణ ప్రచారం చేసి అనేకమంది సైనికుల్ని తమ వైపుకు తిప్పుకున్నారు. దాంతో సైనికులు అలి (రజి)పై తిరగబడి మాట్లాడారు. దాంతో అలి (రజి) ప్రత్యర్థి ప్రతిపాదన ముందు తలవంచక తప్పలేదు.

సమస్య పరిష్కారానికి ముఆవియా (రజి) వైపున అమ్ర్ బిన్‌ఆస్ (రజి), అలి(రజి) వైపున అబూమూసా (రజి)లు మధ్యవర్తులుగా నియమించబడ్డారు. వారు ఆర్నెల్లలో తాము తీసుకుబోయే నిర్ణయంపై ఇరుపక్షాల వైపున అంగీకారపత్రాలు తీసుకున్నారు. ఇలా ఒప్పందం జరిగిన తర్వాత ఇరుపక్షాలసైన్యాలు తమతమ ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యాయి. హి.శ.37లో జరిగిన ఈ యుద్ధాన్ని "సిఫ్ఫీన్‌యుద్ధం" అంటారు.

'సబాయీదుండగులు' చర్చలు విఫలం చేయడానికి, రెండుసేనల మధ్య యుద్ధ జ్వాలలు రగిలించడానికి తమవంతు పాత్ర కూడా నిర్వహించారు. ఆ తరువాత వారు కూఫాకు తిరుగుప్రయాణంలో ఉభయపక్షాల మధ్య జరిగిన ఒప్పందాన్ని రద్దు చేయించడానికి ప్రయత్నించారు. వారు అలి (రజి) దగ్గరకు వచ్చి మనం వెనక్కి వెళ్ళిపోయి సిరియన్లపై దాడిచేయాలని అన్నారు. దానికి అలి (రజి) సమాధానమిస్తూ "యుద్ధం జరుగుతున్నప్పుడు (మనం విజయం దిశగా పురోగమిస్తున్న దశలో) మీరు నా అభిప్రాయానికి వ్యతిరేకంగా యుద్ధం నిలిపివేయాలని నాపై ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు మీరే ఆ ఒప్పందానికి వ్యతిరేకంగా వెనక్కి వెళ్ళి సిరియన్లపై దాడిచేయాలని చెబుతున్నారు. సంధిపత్రంపై సంతకాలు చేసిన తర్వాత దాన్ని ఎలా ఉల్లంఘిస్తాం. మనం రమజాన్ నెల (ఆర్నెల్ల)వరకు వేచివుండాలి. అప్పటిదాకా ఒప్పందాన్ని ఉల్లం ఘించే ఆలోచనను కూడా మన మనసులోకి రానీయకూడదు" అని అన్నారు.

సబాయీదుండగులు అంతటితో ఊరుకోకుండా యుద్ధ సందర్భాల్లో తీసుకోబడిన నిర్ణయాల్ని మతపరంగా సందేహాస్పదం చేయడానిక్కూడా ప్రయత్నించారు. దాంతో అలి (రజి) సైనికుల్లో భిన్నస్వరాలు వ్యక్తమయ్యాయి. క్రమంగా ఈ భిన్నస్వరాలు విభేదాలుగా, విభేదాలు విద్వేషాలుగా మారిపోయాయి. యుద్ధానికి పోయేటప్పుడు ఎంతోక్రమశిక్షణతో ఉండిన సైనికులు తిరుగుప్రయాణంలో మతపరమైన విభేదాలు, విద్వేషాలతో విభిన్నవర్గాలుగా చీలిపోయారు. సైన్యం కూఫా సమీపానికి చేరుకోగానే సైన్యం నుండి పన్నెండు వేలమంది మనుషులు వేరైపోయి వెళ్ళిపోయారు.

ఇలా చీలినవారిలో రెండువర్గాలు ముఖ్యమైనవి. వాటిలోఒకటి “మన పనులన్నీ సలహాసంప్రదింపులతో, అధికసంఖ్యాకుల ఏకాభిప్రాయంతోనే జరగాలి. ఖలీఫా, నాయకుడు ఎవరూ ఉండరాదు. అలి, ముఆవియా ఇద్దరూ పాపాత్ములే” అని భావిస్తోంది. ఈవర్గాన్ని 'ఖారిజీ వర్గం' అంటారు. ఈ వర్గం సైన్యం నుండి వేరైపోయి హరూరాకు వెళ్ళిపోయింది.

రెండోవర్గం అలీ (రజి)ని ఏపాపం ఎరగని పరమ పవిత్రునిగా, ప్రియాతి ప్రియతమ నాయకునిగా భావిస్తోంది. ఖిలాఫత్ లేక నాయకత్వం హక్కు దైవప్రవక్త (సల్లం) తరువాత అలీ (రజి)కి, ఆయన సంతతికి మాత్రమే ఉంటుందని అది నమ్ముతుంది. ఈ వర్గాన్ని 'షియావర్గం' అంటారు.

ఈ రెండు వర్గాలు తీవ్రమైన అతివాదం ఊబిలో కూరుకుపోయాయి. ఖారిజీ వర్గీయులు అలీ(రజి)కి బద్ధశత్రువులై, ఆ పుణ్యపురుషుడ్ని దూషించడానికి సైతం వెనుకాడేవారు కాదు. షియావర్గీయులు అలీ(రజి)కి వీరాభిమానులై, ఆ దైవదాసుడ్ని దేవుని స్థాయికి చేర్చారు. దైవప్రవక్త ఈసా (అలైహి) విషయంలో కూడా యూదులు, క్రైస్తవులు ఇలాంటివైఖరే అవలంబించారు. యూదులు హజ్రత్ ఈసా(అలైహి)కు బద్ధశత్రువులై, ఆ పుణ్యపురుషుడ్ని చంపడానికి సైతం వెనుకాడలేదు. వారికి భిన్నంగా క్రైస్తవులు ఈసా(అలైహి)కు వీరాభిమానులై, ఆ దైవదాసుడ్ని దేవుని స్థాయికి చేర్చారు.

ఈజిప్టులో ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) రాష్ట్రగవర్నర్‌గా ఉండేవారు. కాని ఆయన తన రాష్ట్ర అంతర్గతసమస్యల వల్ల సిఫ్ఫీన్‌యుద్ధంలో అలి(రజి) వర్గానికి ఎలాంటి సహాయం చేయలేకపోయారు. ఉస్మాన్ (రజి) హత్యతో ఆయన హంతకుల పట్ల పెల్లుబికిన ఆగ్రహావేశాలు ఈజిప్టు ప్రజల్ని కూడా ప్రభావితం చేశాయి. మాలిక్ బిన్ అష్తర్ ఈజిప్టుగవర్నర్‌గా నియమించబడి ఆ బాధ్యత తీసుకోవడానికి వెళ్తూ దారిలోనే చనిపోయాడు. ఈ సంగతి తెలుసుకున్న ముఆవియా (రజి) ఈజిప్టుపై దాడిచేయడానికి అమ్ర్ బిన్‌ఆస్ (రజి)కు ఆరువేల మంది సైనికుల్నిచ్చి పంపించారు.

ఈజిప్టు పరిణామాలను గురించి ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) అలీ (రజి)కి లేఖ రాశారు. అప్పుడు అలి (రజి) ఆయన మద్దతుకోసం సైనికసమీకరణకు ప్రయత్నిస్తే రెండువేల మంది మాత్రమే ఈజిప్టు వెళ్ళడానిక సిద్ధమయ్యారు. ఆ రెండువేల మందే ఈజిప్టుకు చేరుకున్నారు. కాని యుద్ధంలో సేనాపతి హతమవ్వగానే వారు పారిపోయారు. వేరొకవైపు ఈజిప్టుసైనికులు కూడా ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)ని వదిలేసి యుద్ధం నుండి పక్కకు తప్పుకున్నారు.

దాంతో ఆయన ఏకాకి అయి యుద్ధమైదానం వదలి జబలా బిన్ మస్రూఖ్ ఇంట్లో దాక్కున్నారు. కాని సిరియాసైనికులు ఆ ఇంటిని చుట్టుముట్టి ముహమ్మద్



బిన్ అబూబకర్ (రజి)ని పట్టుకున్నారు. తర్వాత ఆయన్ని చంపి మృతపశువు చర్మంలో మూసి కాల్చివేశారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టును స్వాధీనం చేసుకున్న తరువాత అక్కడి గవర్నర్‌గా నియమించబడ్డారు. ఈ సంఘటన హి.శ. 38వ ఏట జరిగింది.

సిఫ్ఫీన్ యుద్ధసమయంలో జరిగిన సంధి ప్రకారం రెండుపక్షాలు నియమించిన మధ్యవర్తులు ఆర్నెల్ల తరువాత రమజాన్ నెలలో ఖిలాఫత్ హక్కు విషయమై చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు. కాని ప్రజల ముందు దాన్ని వ్యక్తపరచడంలో ఒక మధ్యవర్తి అమ్ర్ బిన్ ఆస్ (రజి) మరొకసారి తన యుద్ధచాతుర్యం ప్రదర్శిస్తూ తన ప్రత్యర్థి మధ్యవర్తిని మోసగించడంతో మోసపోయిన మధ్యవర్తి తరపు ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

మరొకవైపు వీలుచిక్కితే కాటువేయడానికి అలి(రజి) వర్గంలో కాచుకొని వున్న 'సబాయి దుండగులు' అలీ (రజి)తో “దేవుడ్ని వదలి మానవుల్ని న్యాయనిర్ణేతలుగా అంగీకరించి మీరు అవిశ్వాసి అయిపోయార”ంటూ ఆయనకు ప్రత్యర్థులై కూఫా నుంచి 'నహ్రెవాన్'కు వెళ్ళిపోయారు.

ప్రారంభంలో హజ్రత్ అలీ(రజి)కి మద్దతుదారులుగా ప్రకటించుకొని, కుట్రలతో ముస్లింలలో విభేదాలు సృష్టించి, అరాచకం రేపి హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పొట్టనబెట్టుకున్న సబాయిదుండగులు ఆ తరువాత రాజకీయంగా రెండువర్గాలుగా విడిపోయిన ముస్లింలలో యుద్ధజ్వాలలు రాజేసి, చివరికి అలీ(రజి)కి కూడా శత్రువులై పోయారు. పైగా తాము విభేదించిన విషయానికి మతరంగు పులిమి, తమతో విభేదించిన ముస్లింలను అవిశ్వాసులుగా జమకట్టి హతమార్చడం ప్రారంభించారు.

హజ్రత్ అలి(రజి) ఈవార్త విని 40వేల సైన్యంతో నహ్రెవాన్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన చేసిన హితోపదేశం, హెచ్చరికలతో 25 వేల మంది సబాయివర్గం సైనికుల్లో దాదాపు 17 వేలమంది పక్కకు తప్పుకున్నారు. వారిలో కొందరు అలి (రజి) వర్గంలో చేరిపోతే, మరికొందరు వేరే ప్రాంతాలకు వెళ్ళిపోయారు. 9 మంది మాత్రం ఎలాగో తప్పించుకున్నారు. మిగిలినవారు అలి (రజి) సైన్యంతో పోరాడి నేలకొరిగారు. ఈ యుద్ధాన్ని 'నహ్రెవాన్ యుద్ధం' అంటారు.

## (7) అలి (రజి) వర్గంలో అనాసక్తత, అంతర్విభేదాలు

నహ్రెవాన్‌యుద్ధానికి ఎంతో ఉత్సాహంతో వెళ్ళిన అలి(రజి) సైనికులు సిరియాపై దాడిచేయడానికి పిలిస్తే అందుకు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. అంచేత అలి(రజి) సిరియాపై దాడిచేసే ప్రయత్నాన్ని విరమించుకోవలసివచ్చింది. వారి అనాసక్తి, అంతర్విభేదాల వల్ల ఈజిప్టు, అరేబియాలు అలి(రజి) నుండి చేజారిపోయాయి. ఈరాన్, ఇరాఖ్‌లు మాత్రమే అలి (రజి) అధీనంలో మిగిలాయి. ముఆవియా (రజి)

వర్గంలో ఆయనకు సానుభూతిపరులైన అరబ్బులు అత్యధికంగా ఉంటే, అలి (రజి) వర్గంలో ఆయనపట్ల సానుభూతి లేని అరబ్బేతరులు అత్యధికంగా ఉన్నారు. అంచేత ఈ రెండువర్గాల మధ్య విద్వేషాగ్ని నిరంతరం మండుతుండేది.

ఈజిప్టు ఆక్రమణలోకి వచ్చిన తర్వాత ముఆవియా(రజి)కు మరింత ధైర్యం వచ్చింది. అంచేత ఆయన అలి(రజి) అధీనంలోని బస్రారాష్ట్రాన్ని కూడా ఆక్రమించు కోవడానికి ప్రయత్నించారు. దానికోసం ఆయన అబ్దుల్లా బిన్ హజ్రమీని పంపించారు. అయితే యుద్ధంలో అబ్దుల్లా హతమవడం. అతని సైన్యం పారిపోవడం జరిగింది.

ఇక్కడ ముస్లింలలో ఇలా అంతఃకలహాలు సాగుతుంటే మరోవైపు రోమన్లు, క్రైస్తవులు ఈ అంతఃకలహాల ద్వారా ప్రయోజనం పొందడానికి ప్రయత్నించారు. అలి (రజి) అధీనంలోని ఇరాఖ్‌పై దాడిచేస్తే, అలి(రజి) ప్రత్యర్థి ముఆవియా (రజి) తమతో సహకరిస్తారని లేదా కనీసం సంతోషిస్తారని వారు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు.

ముఆవియా(రజి) ఈసంగతి వినగానే రోమ్ చక్రవర్తికి ఉత్తరం ద్వారా "నీవు గనక అలి(రజి) మీద దాడిచేయడానికొస్తే, నీపని పట్టడానికి అలి(రజి) సైన్యంలో అందరి కంటే ముందుండే సేనాని ముఆవియయేన"ని తీవ్రంగా హెచ్చరించారు. ఈ హెచ్చరికతో రోమ్‌చక్రవర్తి తోకముడిచి యుద్ధనిర్ణయం మానుకున్నాడు.

హి.శ. 40వ సంవత్సరం ప్రారంభకాలం నాటికి సిరియాతో పాటు పాలస్తీనా, ఈజిప్టు, యమన్ మొదలైన ప్రాంతాలు అమీర్ ముఆవియా (రజి) రాజ్యపరిధిలోకి వచ్చేశాయి. మక్కా, మదీనాలను మాత్రం "ఫ్రీజోన్‌లు"గా వదిలేయడం జరిగింది. అంటే ఆ పట్టణాలలో ముఆవియా (రజి) పాలనగాని, అలి (రజి) పాలనగాని లేదన్న మాట. దానికి వారిద్దరు నేతలు సమ్మతించారు.

హి.శ. 40 ప్రారంభకాలంలోనే దురదృష్టకరమైన ఓ సంఘటన జరిగింది. అబుల్ అస్వద్ అనే వ్యక్తి బస్రాగవర్నర్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)పై నిరాధారమైన ఒక అవినీతి ఆరోపణ చేస్తూ ఖలీఫా అలీ (రజి)కి ఉత్తరం రాశాడు. దానికి అలి (రజి) వివరణ అడిగితే, అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఖలీఫాపై అలిగి "నేనిలాంటి గవర్నర్ పదవిని అంటిపెట్టుకొనిఉండలేను. మీరు యోగ్యుడని తలచిన మరొకడ్ని గవర్నర్‌గా నియమించుకోండి" అని ఉత్తరం రాసి బస్రా నుండి మక్కాకు వెళ్ళిపోయారు.

ఆ రోజుల్లోనే మరొక దుర్ఘటన జరిగింది. అలి(రజి) సోదరుడు అఖీల్(రజి) ప్రభుత్వ ధనాగారం నుంచి కొంత డబ్బివ్వమని అడిగితే అలి (రజి) అందుకు నిరాక రించారు. దాంతో అఖీల్ (రజి) అలీ (రజి) మీద అలిగి ముఆవియా (రజి) దగ్గరికి డెమాస్కస్‌కు వెళ్ళిపోయారు. అప్పుడు అమీర్ ముఆవియా (రజి) పరమసంతోషంతో ఆయనకు స్వాగతం చెప్పి ఆర్థికంగా అనేక రాయితీలు కల్పించారు.



అలి (రజి) ఈ విషయం తెలుసుకొని ఎంతో బాధపడ్డారు. ఇక లాభంలేదనుకొని ఆయన సిరియాపై దాడిచేయడానికి మళ్ళీ నిర్ణయించుకున్నారు. దానికోసం ఆయన కూఫాప్రజల్ని యుద్ధంవైపు ప్రేరేపించారు. ఈసారి అరవై వేలమంది అలీ(రజి)కి మద్దతివ్వడానికి సిద్ధమయ్యారు. అప్పుడు హజ్రత్ అలి (రజి) సైనికసామగ్రి సమీక రించడంలో, సమరసన్నాహాలు చేయడంలో నిమగ్నులైపోయారు.

## (8) ముస్లిం రాజ్యాధినేతల హత్యకు కుట్ర

'నహ్రెవాన్'యుద్ధంలో తప్పించుకున్న 9మంది సబాయిదుండగులు ప్రతీకారంతో పెట్రేగిపోతూ అలి(రజి) ఖిలాఫత్‌వ్యవస్థను కూలద్రోయడానికి ప్రయత్నించారు. వారిలో (ఖారిజీ)దుండగులైన అబ్దుర్రహ్మాన్ బిన్ మల్జమ్‌మురావి, బరక్ బిన్ అబ్దుల్లా తమీమి, అమ్ర్ బిన్ బకర్ తమీమి అనే ముగ్గురు వ్యక్తులు చర్చలు జరిపి ఓ భయంకరమైన నిర్ణయం తీసుకున్నారు.

ఆ నిర్ణయం ప్రకారం కూఫాలో ఖలీఫా అలీ (రజి)ని అబ్దుర్రహ్మాన్ బిన్ మల్జమ్ మురావి, డెమాస్కస్‌లో సిరియాగవర్నర్ అమీర్‌ముఆవియా (రజి)ని బరక్ బిన్ అబ్దుల్లా తమీమి, కైరోలో ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని అమ్ర్ బిన్ బకర్ తమీమి ఒకేరోజు ఒకేసారి హతమార్చాలని తీర్మానించారు. దాని కోసం తేది, సమయం కూడా నిర్ణయించారు. హి.శ. 40వ సంవత్సరం, రమజాన్ నెల 16వ తేదీ ఫజర్ నమాజ్ సమయంలో ఈ దుష్టపథకాన్ని అమలుపరచాలని తీర్మానించి వారు తమతమ నిర్ణీత ప్రాంతాలకు వెళ్ళిపోయి సమయం కోసం ఎదురుచూడసాగారు.

ఆ సమయం వచ్చింది. రమజాన్ 16వ తేదీ, శుక్రవారం నాడు బరక్ బిన్ అబ్దుల్లా తమీమి డెమాస్కస్ జామియామస్జిద్‌లో ఫజర్‌నమాజ్ చేయిస్తున్న అమీర్ ముఆవియా (రజి)పై కత్తివ్రేటు వేసి పారిపోయాడు. అయితే అమీర్ ముఆవియా (రజి) చిన్న గాయంతో బ్రతికిపోయారు. హంతకుడు పట్టుబడి హతమార్చబడ్డాడు. ముఆవియా (రజి) ఆ తరువాత మసీదులో ఇమామత్ స్థానానికి సురక్షితమైన ఏర్పాట్లు చేయించారు. తన కోసం అంగరక్షకుల్ని కూడా నియమించుకున్నారు.

ఈజిప్టులో గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) జబ్బుపడటం వల్ల ఆరోజు తెల్లవారు జామున ఫజర్ నమాజ్ చేయించడానికి ఆయన తన స్థానంలో ఒక సైనికాధికారిని నియమించారు. దుండగుడు అమ్ర్ బిన్ బకర్ తమీమి ఆయన్నే అమ్ర్ బిన్ ఆస్ (రజి) అనుకొని హత్యచేసి పారిపోయాడు.

మూడో దుండగుడు అబ్దుర్రహ్మాన్ బిన్ మల్జమ్ కూఫా వెళ్ళిన తర్వాత అక్కడి ఖారిజీలను కలుసుకుంటూ తన దుష్టపథకాన్ని అమలుపరిచేందుకు ప్రయత్నించాడు.

మొదట అతను షబీబ్ బిన్ షజరా అనే ఖారిజీని తన వైపుకు తిప్పుకున్నాడు. తర్వాత నహ్రెవాన్‌యుద్ధంలో చనిపోయిన ఖారిజీల బంధువుల ఇండ్లకు వస్తూపోతూ వారితో చనువు పెంచుకొని, ఖతామ్ అనే ఓ అందాలరాసి ప్రేమలో పడ్డాడు. అయితే ఆమె కొన్ని షరతులు విధించింది. మూడువేల దిర్హంల డబ్బు, ఒక బానిస, ఖలీఫా అలి (రజి) శిరస్సు 'మహర్'గా ఇస్తే వివాహమాడతానని చెప్పింది. ఇబ్నెమల్జమ్ మూడవ షరతు మాత్రమే తీర్చుతానంటే ఆమె ఒప్పుకుంది. అదీగాక ఆమె ఈపని కోసం తన బంధువుల్లో వర్దాన్ అనే వ్యక్తిని కూడా ఇబ్నెమల్జమ్‌కు తోడుగా పంపింది.

హి.శ. 40, రమజాన్ 16వ తేదీ తెల్లవారుజామున ఇబ్నెమల్జమ్, షబీబ్, వర్దాన్‌లు కూఫా జామియామస్జిద్‌లో తలుపుచాటున నక్కికూర్చున్నారు. అలి(రజి) నమాజ్ వేళయింది రండిఅంటూ ప్రజల్ని పిలుస్తూ మసీదులో అడుగుపెట్టారు. తలుపు చాటున కాచుకొనివున్న ఆ దుండగుల్లో వర్దాన్ అనేవాడు వెంటనే అలి(రజి) మీద కత్తివ్రేటు వేశాడు. కాని అలి(రజి) కొంచెం ముందుకు నడవడంతో కత్తివ్రేటు వృధాపోయింది. అయితే ఇబ్నెమల్జమ్ వెంటనే అలి (రజి) వైపు దూసుకుపోయి కత్తివ్రేటు వేశాడు. దాంతో అలి (రజి) తీవ్రంగా గాయపడ్డారు.

ఆ దృశ్యం చూడగానే నమాజుకు వచ్చిన జనం షబీబ్, వర్దాన్‌లు పారిపోతుంటే వాళ్ళను పట్టుకోవడానికి పరుగెత్తారు. ఇబ్నెమల్జమ్ పారిపోకుండా మసీదులోనే మాయమయ్యాడు. ప్రజలు మసీదులో ఓ మూల దాక్కున్న ఇబ్నెమల్జమ్‌ను పట్టుకొని అలి (రజి) ముందు ప్రవేశపెట్టారు. ఖలీఫా అలి (రజి) "నేనీ గాయంతో చనిపోతే అతడ్ని వధించండి. బ్రతికుంటే నేతనికి సముచిత శిక్ష విధిస్తాను" అని అన్నారు. పారిపోయిన మిగతా ఇద్దరిలో వర్దాన్‌ని మాత్రమే ప్రజలు పట్టుకొని అక్కడికక్కడే హతమార్చారు. షబీబ్ వారికి అందకుండా ఎక్కడికో పారిపోయాడు.

కత్తివ్రేటు కణత మీద పడటంతో గాయం తీవ్రంగానే ఉంది. ఆరోజు ఎలాగో అలి (రజి) సజీవంగానే ఉన్నారు. కాని రెండవరోజు పరిస్థితి విషమించింది. ఆ పరిస్థితిలో జుందుబ్ బిన్ అబ్దుల్లా అనే వ్యక్తి వచ్చి "విశ్వాసులనాయకా! ఒకవేళ మీరు ఇహలోకం వీడిపోతే మేము మీ కుమారుడు హసన్ (రజి) చేతిలో 'బైత్' చేయమంటారా?" అని అడిగాడు. దానికి హజ్రత్ అలి (రజి) "దాన్ని గురించి నేనేమీ మాట్లాడను; మీరు ఎలా భావిస్తే అలా చేయండి" అన్నారు. ఆ తరువాత ఆయన కొడుకుల్ని పిలిచి కొన్ని హితోక్తులు ఉపదేశించారు. అంతే ఆ తరువాత "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడ"నే సద్వచనం పఠిస్తూ శాశ్వతంగా కన్నుమూశారు.

ఇలా అలీ ముర్తుజా (రజి) ఆ గాయంతోనే 63 ఏండ్ల వయస్సులో, అయిదేండ్ల ఖిలాఫత్‌పాలన తరువాత హిజ్రీశకం 40వ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీన



అమరగతులయ్యారు. ఒక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్‌హసన్ (రజి) అలి (రజి) భౌతిక కాయాన్ని ఖారిజీలు కించపరుస్తారేమోనన్న భయంతో ఎవరికీ తెలియకుండా ఓ రహస్య ప్రదేశంలో సమాధి చేశారని తెలుస్తోంది. అలా చేయకపోతే షియాముస్లింలు అలి (రజి) సమాధిని దేవాలయంగా చేసుకొని ఆరాధించడం ప్రారంభించేవారు.

## (ఠి) భార్యాపిల్లలు, హితోక్తులు, న్యాయదృక్పథం

హజ్రత్ అలి (రజి) విభిన్న కాలాల్లో తొమ్మిది మంది భార్యలను చేసుకున్నారు. వారిద్వారా పధ్నాలుగు మంది మగసంతానం, పదిహేడు మంది ఆడసంతానం జన్మించారు. ఆయన మొట్టమొదట దైవప్రవక్త (స) చిన్నారి కూతురు హజ్రత్ ఫాతిమా (రజి)ను వివాహమాడారు. ఆమె ద్వారా హసన్, హుసైన్ (రజి) అనే ఇద్దరు కొడుకులు, జైనబ్, ఉమ్మెకుల్సూమ్ (రజి) అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు.

**అలి (రజి) హితోక్తులు:-**

(1) ఆత్మసంతృప్తి కలిగినవాడే ప్రశాంతజీవితం గడుపుతాడు.

(2) (ఖుర్‌ఆన్,హదీసులు) చదివి తదనుగుణంగా ఆచరిస్తూ జ్ఞానం, ఆచరణల మధ్య సమన్వయం పాటించేవాడే (నిజమైన) ధర్మవేత్త.

(3) అడిగినప్పుడు (దానం) ఇవ్వడం అనేది ప్రసాదితం అనబడుతుంది. అడక్కుండా ఇస్తే అది దానశీలత అవుతుంది.

(4) ఆరాధనలో బద్ధకం, కలిమిలో లేమి, రుచుల్లో తగ్గుదల కలగడం పాపాల పర్యవసానం (దైవశిక్ష).

(5) మూర్ఖుడి (అహ్మఖ్)తో మైత్రి చేయకు; అతను నీకు ప్రయోజనం చేకూర్చాలనే భావిస్తాడు, కాని నష్టం కలిగిస్తాడు.

(6) పాపానికి తప్ప మరే విషయానికీ భయపడకూడదు. (పాపభీతి ఉండాలి.) అలాగే దేవుని మీద తప్ప ఏమనిషి మీదా ఆశలు పెట్టుకోకు.

(7) ఎవరికైనా ఏదైనా విషయం తెలియకపోతే దాన్ని నేర్చుకోవడానికి అతను ఏ మాత్రం సిగ్గుపడకూడదు.

(8) విశ్వాసం, సహనాల మధ్య శరీరం, శిరస్సుల మధ్య ఉండే సంబంధమే ఉంటుంది. కాబట్టి సహనం కోల్పోయితే విశ్వాసం కూడా కోల్పోయినట్లేనని భావించండి. శిరస్సే పోతుంటే ఇక శరీరం ఎలా మిగిలివుంటుంది?

**అలి (రజి) న్యాయదృక్పథం** : ఇస్లాం షరీఅత్ (ధర్మశాస్త్రం) ప్రకారం న్యాయ నిర్ణయం చేయడంలో హజ్రత్ అలి (రజి) ఎంతో దూరదృష్టి, విశాల

హృదయంగల నాయకులు. ఒకసారి అయిదుగురు ఖారిజీలు ఖలీఫా అలి (రజి) ముందు ప్రవేశ పెట్టబడ్డారు. వారు అలీ (రజి)ని దూషిస్తున్నారని, వారిలో ఒకడు తాను అలీ (రజి)ని తప్పకుండా చంపుతానని బహిరంగంగా చెబుతున్నాడని వారి మీద ఆరోపించడం జరిగింది.

అయితే హజ్రత్ అలి(రజి) ఆ ఖారిజీలపై ఎలాంటి చర్య తీసుకోకుండా వదిలేస్తూ తన మనుషులతో ఇలా అన్నారు: "వారి దూషణలకు సమాధానంగా కావాలంటే మీరు నోటితో ఇవ్వండి. అంతేగాని వారు క్రియాత్మకంగా తిరుగుబాటు చేష్టలకు పాల్పడనంతవరకూ కేవలం నోటిదురుసు కారణంతో వారిపై నేను ఎలాంటి చర్య తీసుకోలేను."

హజ్రత్ అలి (రజి) రాజధాని నుండి సిఫ్ఫీన్ యుద్ధానికి బయలుదేరుతూ యుద్ధ కవచం కోసం వెతికితే అది కన్పించలేదు. యుద్ధం నుంచి తిరిగొచ్చినప్పుడు ఆ కవచం ఒక యూదుడి దగ్గర కన్పించింది. అలి (రజి) ఆ యూదుడ్ని తన కవచం గురించి అడిగితే అది తనదేనని, తన దగ్గర ఎప్పటినుంచో ఉందని అతను బుకాయించడానికి ప్రయత్నించాడు. యూదుడు అబద్ధమాడుతున్నట్లు అలి (రజి) గ్రహించారు.

అయి నప్పటికీ ఆయన తన ఖలీఫా పదవితో అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ఒక సాధారణ ముద్దాయి మాదిరిగా న్యాయస్థానానికి వెళ్ళి అతనిపై ఫిర్యాదు చేశారు.

న్యాయమూర్తి రాజ్యాధినేతను చూసి గౌరవిస్తూ లేచి నిల్చోలేదు, తిరుగులేని ఆయన అధికారానికి భయపడి కూడా ఆయనకు అనుకూలంగా తీర్పివ్వలేదు. సాధారణ ప్రజలను విచారించినట్లే ఖలీఫా అలీ (రజి)ని కూడా విచారిస్తూ "ఈ కవచం మీదేనని రుజువేమిటీ?" అని ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ అలి (రజి) తన సేవకుడు ఖంబర్ని, తన కుమారుడు దైవప్రవక్త (స) మనవడయిన ఇమామ్ హుసైన్ (రజి)ని సాక్షులుగా ప్రవేశపెట్టారు.

న్యాయమూర్తి ఆ సాక్షుల్ని చూసి "హుసైన్ (రజి) మీ కుమారుడే గనక ఆయన సాక్ష్యం నమ్మదగినది కాదు. తండ్రి అభియోగానికి కొడుకు సాక్ష్యాన్ని అంగీకరించ లేము" అంటూ ఖలీఫా సాక్ష్యాలను త్రోసిపుచ్చాడు. పాపం! ఖలీఫాగారి కేసు వీగి పోయింది. అయితే ఈ వ్యవహారం, న్యాయవైఖరి చూసిన ఆ యూదుడు ముందుకు వచ్చి బిగ్గరగా ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను. ఏ ధర్మంలో ఇలాంటి న్యాయం ఉందో అదే సత్యధర్మం." ఆ యూదుడు చేసిన ఈ ఇస్లాంస్వీకార ప్రకటన వినగానే ప్రజలు సంతోషంతో 'అల్లాహు అక్బర్" అంటూ నినాదం చేశారు.



# 5. ఖాలిద్ బిన్ వలీద్ (రజి)

ఖాలిద్ బిన్ వలీద్ ముస్లింలకు ఒకనాటి బద్ధశత్రువు. ఉహుద్ యుద్ధంలో ఖురైష్ బహుదైవారాధకుల హీరోగా వెలిగిపోయాడు. ఇస్లాం పేరెత్తితేనే నఖశిఖ పర్యంతం మండిపడేవాడు. అలాంటి ఖాలిద్ హుదైబియా ఒప్పందం, ముస్లింల తొలి హజ్‌యాత్ర జరిగిన తరువాత తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు. గతంలో ముస్లింలతో చేసిన యుద్ధాలను గురించి ఓసారి తాపీగా సమీక్షించాడు.

"బదర్, ఉహుద్, కందకం యుద్ధాలలో తాము సర్వసాధన సంపత్తితో ఎంతగా పోరాడినా అంతిమ విజయాలు కనీస వనరులు కూడా లేని ముస్లింలనే వరించాయి. దీన్నిబట్టి మహత్తరమైన అదృశ్యశక్తి ఏదో వారికి సహాయం చేస్తోందని అర్థమవుతోంది. కనుక ఇస్లామే సత్యం, నిజధర్మం కావచ్చు." ఖాలిద్ మెదడు వేడెక్కింది. ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు. పైకి, కిందికీ కదిలాడే త్రాసుపళ్ళాల్లా అతని అంతరంగం 'అటా ఇటా?' అంటూ సందిగ్ధావస్థలో పడి ఊగిసలాడసాగింది.

అంతలో ఒకతను గుర్రం దిగి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ వచ్చాడు. "నేను మదీనానుండి వస్తున్నాను. మీ అన్నయ్య వలీద్ ఈ ఉత్తరం మీకివ్వమని నన్ను పంపించాడు" అంటూ ఆ మనిషి ఖాలిద్ చేతికి ఒక ఉత్తరం అందించి వెళ్ళి పోయాడు. ఖాలిద్ గబగబా ఆ ఉత్తరం తెరచి చదవడం ప్రారంభించాడు.....

"ప్రియమైన తమ్ముడు ఖాలిద్‌కు- ఉభయకుశలోపరి. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఉమ్రా చేయడానికి మక్కా వచ్చినప్పుడు నేను కూడా ఆయన వెంట ఉన్నాను. మక్కా చేరుకున్న తరువాత ఆయన నీగురించి ప్రస్తావిస్తూ 'ఖాలిద్ ఏడి?' అని అడిగారు. నేను నీ కోసం మక్కాలో చాలా వెతికాను. కాని నీవు కన్పించలేదు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) నాతో ఇలా అన్నారు: 'ఖాలిద్‌లాంటి ఉత్తముడు, వివేచనాపరుడు ఇంకా ఇస్లాంకు దూరంగా ఉన్నాడంటే నాకు చాలా ఆశ్చర్యం కలుగుతోంది. ఇస్లాంగురించి, దాని బాగోగుల గురించి ఖాలిద్‌కు తెలియకుండా ఉండవు. అతని శక్తిసామర్థ్యాలు ఇస్లాం కోసం ఉపయోగపడితే ఎంత బాగుండు.'

"తమ్ముడూ! నేను నిజం చెబుతున్నాను. ఇస్లాం లాంటి సంపూర్ణ జీవిత విధానం, మహోన్నత ధర్మం మరొకటి లేదు. ముహమ్మద్ (స) లాంటి మానవోత్తముడు, కరుణా సముద్రుడు లోకమంతా గాలించినా ఎవరూ దొరకరు. నీవు ఇంకా ఆలస్యం చేసి ఆయన ప్రేమాభిమానాలకు దూరంకాకు. సాధ్యమయినంత త్వరగా నువ్వు ఇస్లాం స్వీకరించి ఆ మహనీయునికి ప్రీతిపాత్రుడవుతావని ఆశిస్తున్నాను.

ఇట్లు
మీ అన్నయ్య, వలీద్

# (1) ఇస్లాం స్వీకరణ

ఈ ఉత్తరం మండుతున్న గాయానికి మందులా పనిచేసింది. విపరీతమైన దాహంతో ఉన్నప్పుడు గుక్కెడు మంచినీళ్ళు దొరికితే ఎలా ఉంటుందో అలాంటి అనుభూతికి లోనయ్యాడు ఖాలిద్ బిన్ వలీద్.

"ఔను. ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తే. ఇందులో ఇక నాకు ఎలాంటి సందేహం లేదు. ఆయన మాంత్రికుడు కానేకాదు. ఆయన ప్రచారంచేస్తున్న ధర్మమే సత్యధర్మం" అంతరాత్మ ఘోషతో అతని అంతరంగం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ మాటలే అతని నోట కూడా అప్రయత్నంగా వెలువడ్డాయి."ఏమిటీ! ఖాలిదేనా ఈ మాటలు అంటున్నది!" మక్కా ప్రజలు ముక్కు మీద వేలేసుకొని మరీ ఆశ్చర్యపోయారు.

"నేనిప్పుడు ముస్లింని. ఇస్లామీయ విప్లవ ధ్వజవాహకుణ్ని. ముహమ్మద్ (సల్లం) బోధిస్తున్నది ముమ్మాటికీ దైవసందేశమే. ఇందులో అనుమానించడానికి ఏమాత్రం ఆస్కారం లేదు. కాబట్టి విజ్ఞత, వివేచనలు ఉన్నవాడు ముహమ్మద్ (స)ని అనుసరించక తప్పదు" అన్నాడు ఖాలిద్ నలుగురిలో నిలబడి నిర్భయంగా.

అతని మాటలు విన్న ఖురైషీయులకు వళ్ళు మండిపోయింది. మండుతున్న కళ్ళతో కొరకొర చూసి నోటికొచ్చినట్లు తిట్టిపోశారు. కొందరు మతభ్రష్టుడయ్యారన్నారు. మరి కొందరు మతిభ్రమించింది అన్నారు. ఇక ఖురైషీయుల అగ్రనాయకుడు అబూసుఫ్యాన్ అయితే పళ్ళు నూరుతూ, చిందులు తొక్కుతూ ఖాలిద్‌ని హతమార్చ డానికి సిద్ధమయ్యాడు.

ఇక్రమా అతని ఉగ్రరూపం చూసి విరగబడి నవ్వుతూ "అబూసుఫ్యాన్! ఆగాగు. ఎందుకంత కోపం? ఇక్కడ ఒక్క ఖాలిద్ మాత్రమే కాదు, ఇంకా చాలామంది ఉన్నారు ఇస్లాం వైపు మొగ్గినవారు. అప్పుడే ఏమైంది? ఈ ఏడు గడవని తెలుస్తుంది. మక్కాలో బహుశా బహుదైవారాధకుడిగా ఒక్కడూ మిగలడనుకో" అన్నాడతను.

ఇక్రమా మాటలు విన్నాక అబూసుఫ్యాన్‌కు మతి పోయినంత పనయింది. పాపం! అబూసుఫ్యాన్ ఏం చెయ్యాలో దిక్కుతోచక అయోమయంలో పడిపోయాడు.

ప్రస్తుతం ఖాలిద్ ఒంటరివాడయ్యాడు. తన ఆలోచనలను సమర్థించే ఆప్తమిత్రుల కోసం తహతహలాడిపోయాడు. ఏమయితేనేం అనుకొని ముందుగా ఆయన సఫ్వాన్‌ని కదిలించి చూశాడు :

"సఫ్వాన్! ముహమ్మద్ (సల్లం)ని చూస్తున్నావుగా? ఆయన ప్రజల హృదయాల్ని ఎలా సునాయాసంగా చూరగొంటున్నారో. మనం కూడా ఆయన అనుచరవర్గంలో ఎందుకు చేరిపోకూడదు?"



సఫ్వాన్ తండ్రి, సోదరులు బదర్‌యుద్ధంలో హతమార్చబడ్డారు. అప్పటి నుంచి అతను దైవప్రవక్త (సల్లం)పై పగబట్టిన పాములా బుసలుకొడ్తున్నాడు. ఈ స్థితిలో ఖాలిద్ మాటలు అతనికి అగ్నిపై ఆజ్యం పోసినట్లయింది. "అసాధ్యం. యావత్తు ప్రపంచం ఆయన వెంటపడినా నేను మాత్రం ఆ ధర్మాన్ని విశ్వసించను" అన్నాడు సఫ్వాన్ ప్రతీకారంతో ఉడికిపోతూ.

ఖాలిద్ ఈసారి ఇక్రమాను కదిలించాడు. కాని అక్కడా అతనికి నిరాశే ఎదురయింది. చివరికి అతనొక్కడే మదీనా బయలుదేరాడు. ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. అయితే అతను బయలుదేరే సమయానికి ఓ మిత్రుడు ఉస్మాన్ బిన్ తల్హా వచ్చాడు. ఖాలిద్ అతణ్ని చూసి ఓ క్షణం ఆలోచనలో పడిపోయాడు...

"ఇతనికి తన ప్రయాణం గురించి చెబితే విని తనకు తోడ్పడుతాడా లేదా? అసలే అతనితండ్రి, పినతండ్రి, నల్గురన్నదమ్ములు ఉహుద్‌యుద్ధంలో చనిపోయారు. దానివల్ల అతని మనస్సులో ముస్లింలంటే గుర్రుండవచ్చు. అయినా అడిగి చూద్దాం ఏమంటాడో" అనుకుంటూ ఖాలిద్ ధైర్యంచేసి మనసులోని మాట బయటపెట్టాడు.

ఉస్మాన్ ఓ నిమిషం ఆలోచించి ఇస్లాంపట్ల తన ఆసక్తి వ్యక్తపరిచాడు. అంతేకాదు, ఖాలిద్‌తోపాటు మదీనా బయలుదేరడానిక్కూడా సిద్ధమయ్యాడు. "సరే, అలాగే వెళ్దాం. మక్కాలో నాక్కాస్త పని ఉంది. అది పూర్తికాగానే బయలు దేరుదాం" అన్నాడు ఉస్మాన్.

ఆ పని కూడా పూర్తి కావచ్చింది. ఫలానా రోజు నగరం వెలుపల కలుసుకుందామని ముందే నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం మిత్రులిద్దరూ ఓ రోజు నగరం వెలుపల కలుసుకొని చక్కా మదీనా దారిపట్టారు. దారిలో ఒక చోట అమ్ర్ బిన్ ఆస్ కన్పించి "ఖాలిద్! ఏమిటి విశేషం? ఎక్కడికీ ప్రయాణం?" అని అడిగాడు ఆత్రంగా.

"ముహమ్మద్ (సల్ల) దగ్గరికి వెళ్తున్నాము. మార్గం తేజోవంతంగా ఉంది. మాట సమంజసంగా ఉంది. అలాంటప్పుడు ఇంకెన్నాళ్ళిలా తప్పించుకొని తిరుగుదాం? పదా మాతో పాటు, ఇస్లాం స్వీకరిద్దాం" అన్నాడు ఖాలిద్. "నేనూ అదే ఉద్దేశ్యంతో బయలు దేరాను, పదండి" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్.

ముగ్గురి మార్గం ఒకటే. లక్ష్యం ఒకటే. గమ్యం కూడా ఒకటే. ముగ్గురూ సంతోషంగా మదీనా బయలుదేరారు. దైవప్రవక్త (సల్లం) మసీదులో అనుచరుల మధ్య కూర్చొని ధర్మబోధ చేస్తున్నారు. కాస్సేపటికి ఆయన ధర్మబోధను హఠాత్తుగా ఆపి ఇలా అన్నారు:

"చూడండి, మక్కా నగరం తనకు ప్రాణప్రదమైన తురుపు ముక్కల్ని మన వైపునకు విసిరింది. ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా, అమ్ర్ బిన్ ఆస్- ఈ ముగ్గురూ నగరంలో ప్రవేశించారు. వెళ్ళి పిలుచురండి."

ఈ శుభవార్త వినగానే ప్రవక్త అనుచరులు ఆనంద డోలికల్లో ఊగిపోయారు. ఖాలిద్ అన్న వలీద్ బిన్ వలీద్ అయితే చెప్పనవసరం లేదు. సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ వెంటనే లేచి తమ్ముడికి స్వాగతం చెప్పడానికి బయటికి పరుగెత్తారు. దారిలోనే ఆయన ఆ ముగ్గురిని కలిశారు.

"త్వరగా నడవండి. దైవప్రవక్త (సల్లం)కు మీరు ముగ్గురు వస్తున్నారని తెలిసింది. ముస్లింలందరూ మీకోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు." అన్నారాయన. "ఏమిటీ! దైవప్రవక్త (సల్లం)కు మేమెలాంటి సమాచారం పంపలేదే! మేం వస్తున్న సంగతి వారికెలా తెలిసింది?" ఖాలిద్ ఆశ్చర్యపోతూ అడిగాడు.

"దైవప్రవక్త (సల్లం)కు ఆయన ప్రభువు అవసరమైనప్పుడల్లా అగోచర విషయాలు తెలుపుతుంటాడు" వలీద్ (రజి) సమాధానమిచ్చారు.

ఈ నలుగురూ మసీదులో ప్రవేశించగానే అక్కడున్నవారి ముఖపద్మాలు ఒక్కసారిగా సంతోషంతో విప్పారాయి. "ఖాలిద్! ఏమిటి సంగతి ఇలా వచ్చావు?" ప్రేమగా అడిగారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

"మేము ముగ్గురం ఇస్లాం స్వీకరించడానికి వచ్చాం" అన్నాడు ఖాలిద్ ముక్తసరిగా.

ఆ తర్వాత ఆ ముగ్గురూ సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించారు. దాంతో 'అల్లాహు అక్బర్' అనే నినాదంతో మసీదు మార్మోగింది. వారి ఇస్లాం ప్రకటనతో దైవప్రవక్త (స)తో పాటు ముస్లింలందరూ పరమానంద భరితులయ్యారు.

## (౨) దైవ కరవాలం

రోమన్లతో జరిగిన మూతా యుద్ధంలో దైవప్రవక్త (స) నియమించిన ముగ్గురు సేనాపతులు కూడా అమరగతులయ్యారు. ఇప్పుడు ముస్లిం సేనలకు సేనాపతి ఎవరు? హజ్రత్ సాబిత్ బిన్ అర్ఖం (రజి) ముందుకు వచ్చి సమరధ్వజం చేతిలోకి తీసుకున్నారు.

"ముస్లింలారా! తక్షణమే మీరు మీ నాయకుడ్ని ఎన్నుకోండి" అన్నారాయన. "మీరే ఉండండి మా నాయకుడిగా" అన్నారు ముజాహిద్‌లు. "కాదు, ఇది నావల్ల జరిగే పని కాదు" అన్నారు సాబిత్ (రజి).

అప్పుడు ముజాహిద్‌ల దృష్టి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) మీద పడింది. వెంటనే వారు ఖాలిద్ (రజి)ని సేనాపతిగా ఉండమని చెప్పారు. ఖాలిద్ (రజి) పరిస్థితి అర్థం చేసుకున్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదం ముంచుకొస్తుందని భావించారు. అందువల్ల తక్షణమే ఆయన సమరధ్వజం తీసుకొని సుడిగాలిలా శత్రుపక్షంలోకి దూసుకుపోయారు. ఇదివరకటి సేనాపతులకన్నా భయంకరంగా పోరాడి అనేకమంది శత్రువుల్ని కడతేర్చారు. చీకటిపడగానే ఆరోజు యుద్ధం ముగిసింది.



శత్రువులు అసంఖ్యాకంగా ఉన్నారు. ఆయుధాలు కూడా వారికి అపారంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో వ్యూహాత్మకమైన చర్యలు తీసుకోకపోతే ఉన్న కొద్దిమంది ముజాహిద్‌లు సమరాగ్నికి సమిధలయ్యే ప్రమాదం ఉంది.

ఈ ఆలోచన రాగానే ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైన్యాలను పునర్వ్యవస్థీకరించారు. ఎంతో కట్టుదిట్టంతో ముందు పంక్తులను వెనక్కి, వెనుక పంక్తులను ముందుకు మార్చివేశారు. కొన్ని పంక్తులను వెనుక ఉంచి శత్రుసైనికులు ముందుకు రాగానే గట్టిగా నినాదాలివ్వమని ఆదేశించారు.

మరుసటి రోజు ఉదయం శత్రువులకు కొత్త ముఖాలు కన్పించాయి. మదీనా నుండి కొత్త సైన్యం వచ్చి ఉంటుందని భావించి భయపడ్డారు. అంతలో వెనుక పంక్తుల్లో ఉన్న ముజాహిద్‌లు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. దాంతో రోమ్‌సైన్యం మరింత కంగారుపడిపోయింది. వారి సేనాపతులు యుద్ధం కొనసాగించాలా వద్దా అని వెంటనే తేల్చుకోలేక సందిగ్ధంలో పడిపోయారు.

హజ్రత్ ఖాలిద్ (రజి) ఇదే మంచి అవకాశమని తలచి తక్షణమే మూకుమ్మడి దాడికై అనుచరుల్ని ఆదేశించారు. రోమ్ సైనికులు సందిగ్ధం నుంచి ఇంకా తేరుకోక ముందే ముస్లిం యోధులు ఒక్కసారిగా వారిపై విరుచుకుపడ్డారు. దాంతో రోమ్ సైనికులు మరింత భయపడి చెల్లా చెదరయిపోయారు. కొందరు మాత్రం మొండి ధైర్యంతో ముస్లింలతో పెనుగులాడటం మొదలెట్టారు. కాస్సేపటికి వారు కూడా ముస్లింల ధాటికి నిలువలేక పలాయనం చిత్తగించారు.

ఈ యుద్ధ సంఘటనలు వినేందుకు ఉవ్విళ్ళూరుతూ మదీనాప్రజలు యోధుల రాక కోసం తీవ్రంగా నిరీక్షించసాగారు. ఆ తరువాత కొన్నాళ్ళకే యోధులు వచ్చేశారు. ప్రజలు అమిత సంతోషంతో వారికి స్వాగతం చెప్పారు. దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఖాలిద్ (రజి) పన్నిన సమరవ్యూహాన్ని, చూపిన ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ ఆయనకు సైపుల్లా (దైవకరవాలం) అని బిరుదు ప్రదానం చేశారు.

దైవప్రవక్త (సల్లం) మక్కా నగరాన్ని జయించిన తరువాత ఆయన నవముస్లింలలో ఒక ప్రకటన చేస్తూ "ఇస్లాం స్వీకరించిన ప్రజలంతా తమ ఇండ్లలో ఎలాంటి విగ్రహాలు ఉంచకూడద"ని అన్నారు. తర్వాత ఆయన మక్కా చుట్టుపక్కలున్న సుప్రసిద్ధ విగ్రహాలు, విగ్రహాలయాలను తొలగించడానికి చిన్న చిన్న సైనిక దళాలను పంపించారు.

మక్కా నగరానికి కొన్నిమైళ్ళ దూరంలోని ఒయాసిస్సులో ఉన్న ఉజ్జా అనే ప్రముఖ విగ్రహాలయాన్ని ధ్వంసం చేయడానికి ఆయన ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నాయకత్వంలో ముప్ఫయి వేలమందితో కూడిన సైనికదళం పంపారు. ఖాలిద్ (రజి) ఈ సైనికదళంతో వెళ్ళి ఉజ్జా విగ్రహాన్ని ధ్వంసం చేసి, దాని ఆలయాన్ని నేలమట్టం చేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారం కోసం వివిధ ప్రాంతాలకు తన అనుచరుల్ని పంపారు. ఆయన ఖాలిద్ (రజి)ని కూడా ధర్మప్రచారం కోసం పంపారు. ఖాలిద్ (రజి) కొందరు ముజాహిద్‌లను తీసుకొని 'బనీఖుజైమా' తెగ దగ్గరకు పోయారు. అయితే ఆ తెగవారు దైవసందేశాన్ని త్రోసిపుచ్చడమే గాకుండా ఖాలిద్ (రజి)కు వ్యతిరేకంగా యుద్ధానికి సిద్ధమయ్యారు.

అయితే ఖాలిద్ బిన్ వలీద్ (రజి) తొందరపడలేదు. ఆయన బనీఖుజైమా తెగవారికి నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించారు.

"ఏమిటి మీ ధోరణి? జనమంతా ఇస్లాం స్వీకరించి ఉంటే మీరిప్పుడు యుద్ధం చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నారా! బాగా ఆలోచించుకోండి" అన్నారు ఆయన.

"నిజమే ఇప్పుడేం చెయ్యాలి?" బనీఖుజైమా తెగవాళ్ళు సందిగ్ధంలో పడిపోయారు.

కాని వారిలో 'జహ్‌దమ్' అనే వాడొకతను తన తెగవాళ్ళను రెచ్చగొట్టసాగాడు.

"ప్రజలారా! కాస్త స్పృహలోకి రండి. ఇతనెవరో, ఎలాంటివాడో మీకు తెలియదా? ఇతను ఖాలిద్ సుమా! ఆయుధాలు విసర్జించారా... మీరు బందీలుగా పట్టుబడి పోతారు. ఆ తరువాత మనకు వినాశం తప్పదు. నేను మాత్రం నా శరీరం తూట్లుపడినా ఆయుధాలు వదలను" అన్నాడతను.

"అదేమిటయ్యా అలా అంటావు? మమ్మల్నందరినీ హతమార్పించదలిచావా ఏమిటి? మక్కాలో జనమంతా ఇస్లాం స్వీకరించారు కదా! ఇక ఈ యుద్ధమెందుకు అనవసరంగా? ఇప్పుడు మనం చేయవలసిన పని ఇస్లాం స్వీకరించడమే" అన్నాడు జనంలో నుంచి ఒకడు ముందుకు వచ్చి.

కాని జహ్దమ్ అతని మాటలు త్రోసిపుచ్చాడు. మరికొందరు కూడా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని అతను ఎవరిమాటా వినేస్థితిలో లేడు. యుద్ధం చేసి తీరాల్సిందేనని పట్టుబట్టాడు. అదే మొండివైఖరితో అతను ఖాలిద్ (రజి)పై కత్తి ఝుళిపించాడు. అతణ్ణి చూసి అతని అనుచరులు కూడా వరలలో నుంచి కత్తులు దూసి ముస్లింలపై దాడికి పాల్పడ్డారు. కాని చివరికి జరిగిందేమిటీ? ఘోరపరాజయం.

జహ్దమ్ ఖాలిద్ (రజి) పరాక్రమం ముందు నిలువలేక కాస్సేపటికే చేతులెత్తాడు. అలాగే అతని అనుచరులు కూడా కాస్సేపు పెనుగులాడి చివరికి లొంగిపోయారు.

హజ్రత్ ఖాలిద్ (రజి) వెంటనే వారిని బంధించారు. ఆ తరువాత వారి తలబిరుసు తనానికి శిక్షగా వారిని హతమార్చి వేశారు.

ఈ వార్త వినగానే దైవప్రవక్త (సల్లం) గుండెపై సమ్మెటపోటు పడినట్లు ఎంతో బాధపడ్డారు. ఒకచిన్న విషయానికే మానవరక్తం చిందిందే అన్న భావనతో ఆయన



ఎంతో విచారం వెలిబుచ్చారు. అప్రయత్నంగా ఆ మహనీయుని చేతులు పైకి లేచాయి. "దేవా! ఇది ఖాలిద్ చేసిన పని. నాకిందులో ఎలాంటి బాధ్యత లేదు" అన్నారాయన బధాతప్త హృదయంతో.

ఆ తర్వాత ఆయన అలి (రజి)ని పిలిపించారు. ఆయనకు పెద్దయెత్తున ధన రాసులు అప్పగించి- "వీటిని తీసుకొని బనీఖుజైమా తెగవాళ్ళ దగ్గరకు వెళ్ళు. మన తరఫున రక్తపరిహారంగా మృతుల వారసులకు ఈ పైకం అందజేయి. వారికి హితోపదేశం చేస్తూ అజ్ఞానచీకటి పారదోలిరా" అని చెప్పారు.

హజ్రత్ అలి (రజి) అప్పటికప్పుడు బయలుదేరి వెళ్ళి మృతుల వారసులందరికీ రక్తపరిహారం చెల్లించారు. ధననష్టం జరిగినవారికి కూడా కొంత పైకం ముట్టజెప్పారు. చెల్లించవలసిన వారందరికీ చెల్లించగా పైకం ఇంకా మిగిలిపోయింది. దాన్ని కూడా ఆయన ఆ తెగ నాయకులకు అందిస్తూ ఇలా అన్నారు:

"ఎందుకైనా మంచిది ఈ డబ్బు కూడా మీ దగ్గర ఉంచండి. నష్టపరిహారం పొందవలసినవారు ఎవరైనా ఇంకా మిగిలివుండవచ్చు. వారికీ పైకం అందజేయండి."

వచ్చిన పని పూర్తికాగానే అలి (రజి) మక్కా వెళ్ళిపోయారు. జరిగిన సంఘటన దైవప్రవక్త (స)కు వివరించారు. అప్పుడు కారుణ్యమూర్తి (స) మనసు కుదుటపడింది.

హజ్రత్ ఖాలిద్ (రజి) వల్ల జరిగిన పొరపాటు సంగతి విన్నవారంతా తలలు బాదుకున్నారు. ఆయన చర్యను గర్హించారు. మరికొందరు ఆయన్ని తీవ్రంగా నిందించారు. అయితే దైవప్రవక్త (స) వారిని వారిస్తూ "ఖాలిద్‌ని నిందించకండి. ఖాలిద్ దైవకరవాలం. దేవుడు ఈ ఖడ్గాన్ని సత్యతిరస్కారుల తలలపై వ్రేలాడదీశాడు" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) మాటిమాటికి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న రోమన్లను అణచివేయడానికి తబూక్ దండయాత్రకు వెళ్ళారు. కాని రోమన్లు ముస్లిం సేనలను చూసి భయపడి కోటలో దూరి తలుపులు బిగించుకున్నారు. ముస్లింలు ఎన్ని రోజులు ఎదురుచూసినా రోమన్‌లు ఏమాత్రం కవ్వింపు చర్యలకు పాల్పడలేదు.

అయితే రోమన్లు ఇక లొంగిపోయారని తలచి దైవప్రవక్త (స) నిశ్చింతగా ఉండ లేదు. ఇరుగుపొరుగు శత్రుప్రమాదాన్ని నివారించి ఆయా రాజ్యాలతో, తెగలతో శాంతి ఒప్పందాలు చేసుకుందామని తలచి ఆయన తబూక్ నుండే అనేక రాజ్యాలకు లేఖలు రాశారు. ఆ రాజులు వచ్చి దైవప్రవక్త (స)తో శాంతిఒప్పందాలు చేసుకొని వెళ్ళిపోయారు.

అయితే దూమతుల్‌జందల్ ప్రాంతం రాజు అకీదర్ బిన్ అబ్దుల్ మలిక్ ముస్లింల పట్ల తిరుగుబాటు వైఖరితో ఒప్పందం కోసం రాలేదు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు ఓ సైనికదళం ఇచ్చి దూమతుల్‌జందల్‌కు పంపారు.

ఆ సందర్భంలో ఆయన ఖాలిద్ (రజి)కు ఇలా చెప్పారు: "అకీదర్ నీకు అడవి గోవును వేటాడుతూ కన్పిస్తాడు. వెంటనే నీవు అతణ్ని బంధించి తీసుకొనిరా." హజ్రత్ ఖాలిద్ (రజి) అలాగేనని బయలుదేరారు. రాత్రంతా ప్రయాణంచేసి తెల్లవారేటప్పటికి అకీదర్ ఉండే రాజమందిరం సమీపానికి చేరుకున్నారు.

అది వేసవికాలం, వెన్నెల రాత్రి. అకీదర్ రాజమందిరం కప్పు మీద భార్య దగ్గర రంగుల కలలుకంటూ హాయిగా పడుకొని ఉన్నాడు. కాస్సేపటికి ఎక్కడ్నుంచో ఓ అడవిగోవు వచ్చి కొమ్ములతో రాజమందిరం తలుపులను కుమ్మడం మొదలెట్టింది. అకీదర్ భార్య సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ భర్తను లేపి ఆ దృశ్యాన్ని చూపింది. వెంటనే అకీదర్ తన తమ్ముడు హసాన్‌ని పిలుచుకొని గుర్రం ఎక్కి ఆ అడవి గోవును వేటాడటానికి బయలుదేరాడు.

అడవిగోవు వాళ్ళను చూసి పరుగెత్తింది. అకీదర్, అతని తమ్ముడు దాని వెంటపడి కొంచెం దూరం వెళ్ళారో లేదో ఖాలిద్ (రజి) సైనికులు వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. అకీదర్ కాస్సేపు పెనుగులాడి పట్టుబడ్డాడు. అతని తమ్ముడు హతమార్చబడ్డాడు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) అకీదర్‌ని బంధించి తెచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు. అయితే దైవప్రవక్త (సల్లం) అతణ్ని క్షమించి ప్రాణభిక్ష పెట్టారు. అకీదర్ సంతోషంతో తన విధేయత ప్రకటించి జిజ్యా చెల్లించడానికి అంగీకరించాడు.

ఆ తరువాత అతను తన కోటకు తిరిగివెళ్ళి రాజీ ఒడంబడిక పత్రంతో పాటు రెండు వేల ఒంటెలు, ఎనిమిది వందల గుర్రాలు, నాలుగు వందల ఈటెలు, నాలుగు వందల యుద్ధకవచాలు కానుకలుగా దైవప్రవక్త (స)కు పంపాడు.

## (3) కదన రంగంలో కార్చిచ్చు

దైవప్రవక్త (స) నిర్యాణం తరువాత ఆయన వారసునిగా, ప్రప్రథమ ఖలీఫాగా వచ్చిన హజ్రత్ అబూబకర్ (రజి) ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని యధాప్రకారం సేనాపతిగా కొనసాగనిచ్చారు. ఆయన పాలనాకాలంలో ఖాలీద్ (రజి) రోమన్లతో, ఈరానీయులతో, మతభ్రష్టులతో జరిగిన అనేకయుద్ధాలలో పాల్గొని ఆయా ప్రాంతాల్లో విజయపతాకాలు ఎగరవేశారు. ఆ తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలన ప్రారంభకాలంలో కూడా ఆయన సర్వసేనానిగా పని చేశారు.

హిజ్రీశకం 13వ ఏట, రజబ్ నెలలో ముస్లింయోధులు డెమాస్కస్ కోటను ముట్టడించారు. ఈ ముట్టడి ఆర్నెల్లపాటు కొనసాగింది. హెర్క్యులస్ డెమాస్కస్‌లోని తన సైనికుల్ని ఆదుకోవడానికి ఇతర ప్రాంతాల నుండి పంపిన సైనికుల్ని ముస్లిం యోధులు అడ్డుకున్నారు. దాంతో డెమాస్కస్‌లోని రోమన్లు పూర్తిగా నిరాశచెంది కాళ్ళ బేరానికి రావడానికి నిర్ణయించుకున్నారు. మరోవైపు సేనాపతి అబూఉబైదా (రజి)



ముట్టడిని మరింత పొడిగించడం సమంజసం కాదని తలచి, రేపే పట్టణంపై మూకుమ్మడి దాడిచేయాలని సైనికుల్ని ఆదేశించారు. ఈ సంగతి తెలుసుకున్న పట్టణప్రముఖులు కొందరు 'తూమా' ద్వారం వెలుపల ఉన్న దళపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దగ్గరకు వచ్చి తమకు ప్రాణరక్షణ హామీ ఇవ్వవలసిందిగా అర్థించారు. ఖాలిద్ (రజి) వారి విన్నపం స్వీకరించి ఈవిధంగా ప్రాణరక్షణ హామీపత్రం రాసిచ్చారు:

"ఖాలిద్ (రజి) డెమాస్కస్‌వాసులకు ఈ క్రింది రాయితీలు ఇచ్చాడు- ఇస్లాం సైన్యం డెమాస్కస్‌లో ప్రవేశిస్తున్నప్పుడు నగరవాసుల ధనప్రాణాలకు రక్షణ ఉంటుంది. వారి చర్చిల జోలికి పోవడంగాని, డెమాస్కస్‌ని ధ్వంసం చేయడంగాని, వారి ఇళ్ళను కూల్చడంగాని జరగదు. ఇస్లాం సైన్యానికి చెందిన ఏ మనిషీ నగరవాసులకు చెందిన ఏ ఇంటినీ ఆక్రమించుకోవడం జరగదు. డెమాస్కస్‌వాసులు జిజ్యా చెల్లిస్తున్నంత కాలం ముస్లింలుగాని, వారి ఖలీఫాగాని నగరవాసుల పట్ల మంచిగా తప్ప చెడుగా ప్రవర్తించరు."

ఈ హామీపత్రం రాసిచ్చిన తర్వాత ఆయన దాడిచేయకుండా నగరంలో ప్రవేశించారు. అయితే అదే సమయంలో వేరొక వైపు నుండి సర్వసేనాని అబూఉబైదా (రజి) అధీనంలోని సైనికదళం నిచ్చెనలు వేసి, కోటతలుపులు విరగ్గొట్టి, నగరంలో ప్రవేశించింది. నగరమధ్యలో ఇద్దరు సేనాపతులు కలుసుకున్నారు. అప్పుడు అబూఉబైదా (రజి) "మేము ఖడ్గబలంతో నగరాన్ని జయించాం" అన్నారు. ఖాలిద్ (రజి) ఈమాట విని "మేము శాంతిఒప్పందం ద్వారా నగరాన్ని స్వాధీనం చేసుకున్నాం" అన్నారు.

అప్పుడు కొందరు సైనికులు మాట్లాడుతూ "ఖాలిద్ సర్వసేనాని కాదు గనక అతని ఒప్పందాన్ని ధర్మసమ్మతమైనదిగా భావించకూడదు" అన్నారు. ఈ అభిప్రాయాన్ని సర్వసేనాని అబూఉబైదా (రజి) నిరాకరిస్తూ "కాదు, ముస్లింలలో ఒక సాధారణ సైనికుడు సైతం శత్రువులతో ఒప్పందం చేసుకుంటే దాన్ని ముస్లింలందరూ సమ్మతించవలసి ఉంటుంది. కాబట్టి ఖాలిద్ చేసుకున్న ఒప్పందం ధర్మసమ్మతమైనదిగానే భావించబడుతుంది" అని అన్నారు. "అయితే నగరంలో అర్థభాగం ఒప్పందం ద్వారా, మిగిలిన అర్థభాగం ఖడ్గబలం ద్వారా జయించబడినట్లు పరిగణిద్దాం" అన్నాడు మరొక సైనికుడు. సేనాపతి అబూఉబైదా (రజి) దాన్ని కూడా నిరాకరిస్తూ "కాదు, మొత్తంనగరం ఖాలిద్ ఒప్పందం ప్రకారమే జయించబడినట్లు పరిగణించబడుతుంది" అని అన్నారు.

హిజ్రీశకం 15వ ఏట, రజబ్ నెలలో రోమన్లకు, ముస్లింలకు మధ్య మరొకసారి సమరజ్వాలలు మింటికెగసాగాయి. రోమన్ల యుద్ధ సన్నాహాలను గురించి తెలుసుకున్న ముస్లింలు జోర్డాన్ సరిహద్దులోని ఎర్మూక్ నదీ సమీపానికి చేరుకున్నారు.

అటు రెండున్నర లక్షల మంది రోమన్‌లతో కూడిన మహా సైనికవాహిని పరవళ్ళు తొక్కుతూ ఎర్మూక్ వైపుకు పురోగమిస్తోంది. ఆ సైనికవాహిని ముందు

క్రైస్తవ పండితులు, సాధువులు పెద్దపెద్ద సిలువలు తీసుకొని సైనికుల్ని ఉత్తేజపరుస్తూ నడుస్తున్నారు. ఇలా రోమ్‌సేనలు కూడా ఎర్మూక్ సమీపానికి చేరుకున్నాయి.

ఇరుపక్షాల మధ్య సంకులసమరం మొదలైంది. కాస్సేపటికి యుద్ధం పరాకాష్ఠకు చేరుకుంది. మొదటిరోజు జరిగిన ఈదాడిలో రోమ్ ఫ్రంట్‌లైన్ సైనికులు చిత్తుగా ఓడిపోయి వెనుకంజవేయడంతో యుద్ధం రెండోరోజుకు వాయిదా పడింది. అయితే ఆరోజు ఉభయపక్షాలు చర్చలు జరుపుకోవడానికి సిద్ధమయ్యాయి. ముందుగా రోమన్ల తరపున జార్జ్ అనే దౌత్యవేత్త వచ్చి సైన్యాధ్యక్షుడు అబూఉబైదా (రజి)ను కొన్ని ప్రశ్నలు అడిగాడు. వాటిలో ఒకటి "మీరు ఈసా (అలైహి) విషయంలో ఎలాంటి విశ్వాసం కలిగివున్నార"నేది కూడా ఉంది. దానికి సమాధానంగా అబూఉబైదా (రజి) నిసా సూరాలోని కొన్ని సూక్తులు పఠించారు. ఈ సూక్తులు వినగానే జార్జ్ ఎంతో ప్రభావితుడై ఇస్లాం స్వీకరించి ముస్లింలలో చేరిపోయాడు.

మరునాడు ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దౌత్యవేత్తగా రోమ్ శిబిరానికి వెళ్ళారు. రోమన్లు తమ హోదా వైభవాలు ప్రదర్శించడానికి తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. శిబిరానికి వచ్చే దారిలో ఇరువైపులా ఆపాదమస్తకం ఉక్కుకవచాలు ధరించి అశ్వరూఢులైన సైనికుల్ని చాలాదూరం వరకు నియమించారు. అయితే ఖాలిద్ (రజి) ఆ సైనికుల వైపు ఓసారి నిర్లక్ష్యంగా, అసహ్యంగా చూసి వారి రెండు పంక్తుల మధ్య నుంచి గొర్రెల మందను చీల్చుతూ పోయే బెబ్బులిలా చరచర వెళ్ళిపోయారు.

రోమ్ శిబిరానికి చేరుకోగానే సేనాపతి బాహాన్ గౌరవమర్యాదలతో ఆయనకు స్వాగతం చెప్పి రత్నఖచిత సింహాసనంపై తన పక్కనే కూర్చోబెట్టాడు. తరువాత బాహాన్ దుబాసీద్వారా సాధరణసంభాషణ జరిపాడు. ఆ తర్వాత ప్రసంగ ధోరణిలో మాట్లాడాడు. ముందుగా ఈసా ప్రవక్త (అలైహి)ను ప్రశంసించాడు. తరువాత రోమ్‌చక్రవర్తిని ఆకాశానికి ఎత్తుతూ 'మా చక్రవర్తి యావన్మంది చక్రవర్తులకే చక్రవర్తి...' అన్నాడు. దుబాసీ ఆ మాటల్ని పూర్తిగా అనువదించక ముందే ఖాలిద్ (రజి) అతనికి అడ్డుతగులుతూ "మీ చక్రవర్తి అలాంటివాడే కావచ్చు. కాని మా నాయకుడి మనసులో తాను చక్రవర్తినన్న భావన ఏమాత్రం వచ్చినా మేమతడ్ని తక్షణమే పదవినుంచి తొలగిస్తాం" అని అన్నారు.

రోమ్‌సేనాపతి తమ సిరిసంపదలు, ధనరాసుల్ని గురించి గర్వంగా చెప్పి ఇలా అన్నాడు: "అరబ్బులారా! మా దేశానికి వచ్చి నివసిస్తున్న మీ జాతిప్రజల పట్ల మేము ఎల్లప్పుడూ సద్భావనతో ప్రవర్తించాం. దానికి అరబ్బులంతా మాకు కృతజ్ఞులై ఉంటారని ఆశించాం. కాని మా ఆశలకు భిన్నంగా మీరు మా దేశంపై దండెత్తడానికి వచ్చారు; మమ్మల్ని మాదేశం నుండి తరిమేద్దామని భావిస్తున్నారు. కాని మీకు తెలియదేదో, ఇలా అనేకజాతులు ప్రయత్నించి మాచేతుల్లో చావుదెబ్బలు తిని పారిపోయాయి.



యావత్‌ప్రపంచంలోనే పెద్దమూర్ఖులు, దరిద్రులు, దేశదిమ్మరులైన మీరింతటి దుస్సాహసానికి పాల్పడ్డారా! అయినా మేము మిమ్మల్ని క్షమిస్తున్నాం. పైగా మీరిక్కడ్నుంచి వెళ్ళిపోతే మేము మీకు బహుమతిగా మీ సేనాపతికి పదివేల దీనార్లు, దళపతులకు ఒక్కొక్కరికి వేయి దీనార్లు, సాధారణ సైనికులకు వందేసి దీనార్లు ఇస్తాం."

బాహాన్ ప్రసంగం తర్వాత ఖాలిద్ (రజి) లేచి దైవస్తుతి తర్వాత ఇలా అన్నారు: "నిజమే, మీరు ధనికులు, రాజ్యాధికారులే. మీ దేశంలోని అరబ్బుల పట్ల మీ ప్రవర్తన కూడా మాకు తెలియనిది కాదు. అయితే అది మీరు చేసిన మహోపకారమేమీ కాదు. అది మీ మతప్రచారంలోని ఓభాగం తప్ప మరేమీ కాదు. దాని ప్రభావంతో వారు క్రైస్తవులుగా మారి ఈరోజు మాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఒకప్పుడు మేము అజ్ఞానులం, దేశదిమ్మరులమే. మాలో బలవంతుడు బలహీనుడిపై దౌర్జన్యం చేసేవాడు. మా తెగలు అంతఃకలహాలతో సతమతమయ్యేవి. మేము విగ్రహాల్ని పూజించేవారం. అయితే సృష్టికర్త మమ్మల్ని కనికరించి మా అందరిలో ఉత్తముడు, ఉదారుడైన మనిషిని దైవప్రవక్తగా పంపి మాకు సన్మార్గంచూపాడు. ఆ ప్రవక్త మాకు ఏకేశ్వరుడ్ని మాత్రమే ఆరాధించాలని చెప్పాడు. అంతేకాదు, ఈ బోధనలు యావత్మానవాళికి అందజేయాలని కూడా మాకు హితోపదేశం చేశాడు. ఈ బోధనలు, విశ్వాసాలతో కూడిన ఇస్లాంధర్మాన్ని స్వీకరించేవారు ముస్లిములవుతారు. దాన్ని తిరస్కరించేవారు మాకు జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. అలాంటివారి ధనప్రాణాలకు మేము రక్షణహామీ ఇస్తాము. జిజ్యా చెల్లించడానిక్కూడా నిరాకరించేవారికి ఖడ్గమే సమాధానమిస్తుంది."

జిజ్యాపేరు వినగానే బాహాన్ వెటకారంగా నవ్వుతూ చేత్తో తనసైనికుల వైపు చూపుతూ "వీరు చచ్చినా మీకు జిజ్యా ఇవ్వరు. మేమసలు ఇతరుల నుండి జిజ్యా తీసుకుంటాం, మేము మాత్రం ఇతరులకు జిజ్యా ఇచ్చే ప్రసక్తే లేదు" అని అన్నాడు కఠినంగా. సమస్య సంప్రదింపులతో పరిష్కారమయ్యే సూచనలు కానరాకపోవడంతో ఖాలిద్ (రజి) అక్కడ్నుంచి లేచి తమ శిబిరానికి తిరిగొచ్చారు.

ఆ తరువాత మరుసటిరోజు ఇరుపక్షాలు యుద్ధానికి సిద్ధమయ్యాయి. రెండున్నర లక్షల మంది రోమ్‌సైనికులు సకలవిధాల ఆయుధాలతో, ద్విగుణీకృత ఉత్సాహంతో బయలుదేరారు. ముస్లింలు వారి సంఖ్యాబలం, సమరోత్సహం చూసి ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యం చూసి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సరిగ్గా ముప్ఫయి అయిదు వేలమంది కూడా లేని తమ సైన్యాన్ని ముప్ఫయిఆరు దళాలుగా విభజించి అత్యంత క్రమబద్ధంగా పునర్వ్యవస్థీకరించారు. ఆ తరువాత సంకులసమరం మొదలయింది.

ముస్లింలు విజయమో వీరస్వర్గమో అంటూ సైనిక సంఖ్యాబలానికి అతీతంగా అత్యంత ధైర్యసాహసాలతో తమ ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించసాగారు. ఈ నిర్విరామ

యుద్ధంలో ముస్లింలు జుహర్-అసర్ నమాజులు యుద్ధం చేస్తూనే సైగలతో నిర్వహించారు. అయినప్పటికీ కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. శత్రుసైనికులు అత్యధిక సంఖ్యలో గుట్టలు గుట్టలుగా నేలకొరిగి పోతున్నారు. చివరికి రోమ్ సైనికులు ముస్లింల ధాటికి నిలువలేక కాలికి బుద్ధిచెప్పారు. యుద్ధమేఘాలు మెల్లిగా విడిపోయాయి. ముస్లింలపై విజయభానుడు వెలిగిపోసాగాడు.

## (4) పదవీచ్యుడైనా విధేయుడైన యోధుడు

ఈ విధంగా "దైవకరవాలం" అని బిరుదాంకితుడైన ఖాలిద్ బిన్ వలీద్ (రజి) రోమన్లకు, ఈరానీయులకు సింహస్వప్నమై పోయారు. ముస్లింలలో, ముస్లిమేతరుల్లో, యావత్తుసైనికుల్లో ఎటు చూసినా అందరికంటే గొప్ప సమరయోధుడిగా, అత్యంత పరాక్రమశాలిగా ఖాలిద్ (రజి) పేరే మార్మోగసాగింది. అయితే ముస్లింలలో అలాంటి సమరయోధుడు, పరాక్రమశాలి మరెవరూ లేరా? ఖాలిద్ (రజి)కు లభిస్తున్న ఈ పేరుప్రఖ్యాతులు ముస్లింసముదాయంలో కొంపదీసి వ్యక్తిపూజకు దారితీయవు కదా!

ఉమర్ ఫారూఖ్ (రజి) ఖలీఫా అయిన తరువాత ఖాలిద్ (రజి)పై తీసుకున్న చర్యను గమనిస్తే ఆయన మెదడులో ఇలాంటి ఆలోచనలు రేకెత్తి ఉండవచ్చన్న అనుమానం కలుగుతుంది. ఉమర్ ఫారూఖ్ (రజి) చాలాకాలం నుంచి ఖాలిద్ (రజి) అనుసరిస్తున్న కొన్ని క్రమశిక్షణారాహిత్య చర్యల పట్ల కోపంగా ఉన్నారు. అయితే ఖిలాఫత్ ప్రారంభ కాలంలోనే ఖాలిద్ (రజి)తో పెట్టుకోవడం బాగుండదని భావించి ఉదాసీనంగా వ్యవహ రించారు. ఆ తరువాత పరిస్థితి హద్దుమీరిపోతోందని గ్రహించి ఆయన పదవిపై వేటు వేశారు. ఇంతకు ఆ కారణాలేమిటో తెలుసుకుందాం.

హజ్రత్ ఖాలిద్ బిన్‌వలీద్ (రజి) సమరసొత్తు ఖర్చుకు సంబంధించిన దస్తావీజులు ఖలీఫాకు పంపించేవారు కాదు. దానిపై ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వార్నింగ్ ఇచ్చినప్పటికీ ఆయన దాన్ని ఖాతరు చేయలేదు. అంచేత ఖలీఫా ఆయన్ని సర్వసేనాని పదవి నుండి తొలగించినట్లు హాఫిజ్ ఇబ్నెహజర్ తన గ్రంథం 'కితాబుల్ అసాబా'లో పేర్కొన్నారు. అయితే ఖాలిద్ (రజి)ని ఖలీఫా పదవి నుండి పూర్తిగా తొలగించకుండా అబూఉబైదా (రజి) అధీనంలో ఉంచారని మరికొందరు చరిత్రకారుల ఉవాచ. (అల్లామా షిబ్లీనోమాని- అల్‌ఫారూఖ్)

ఆ తరువాత హిజ్రీశకం 17వ సంవత్సరంలో ఓ సంఘటన జరిగింది. ఓ కవి ఖాలిద్ (రజి)పై ప్రశంసల జల్లు కురిపించాడు. దానికి ఖాలిద్ (రజి) సంతోషించి ఆ కవికి బహుమానంగా పదివేల దిర్హంలు ఇచ్చారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈ సంగతి తెలుసుకొని సేనాపతి అబూఉబైదా (రజి)కు లేఖ రాశారు. ఖాలిద్ (రజి) ఈ పైకం తన జేబు నుండి ఇచ్చివుంటే అది దుబారాఖర్చు క్రిందికి వస్తుందని, ప్రభుత్వ ధనాగారం



నుండి ఇచ్చివుంటే నమ్మకద్రోహం క్రిందికి వస్తుందని, ఇలా ఏవిధంగా ఇచ్చినా ఖాలిద్ (రజి) పదవీభ్రష్టతకు అర్హుడవుతాడని ఆయన ఈ ఉత్తరంలో పేర్కొన్నారు.

తరువాత ఖలీఫాప్రతినిధి ఒకతను ఖాలిద్ (రజి) దగ్గరకు చేరుకొని ఆయన్ని ఆ బహుమానం ఎక్కడ్నుంచి తీసిచ్చావని ప్రశ్నించాడు. ఖాలిద్ (రజి) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. ఖాలిద్ (రజి) తన తప్పు ఒప్పుకుంటే అతడ్ని క్షమించాలని ఖలీఫా తన ప్రతినిధిని ఆదేశించారు. అంచేత అతను పదవి నుండి తొలగింపు సూచనగా ఖాలిద్(రజి) తలమీది టోపీ తీసివేశాడు. పైగా చేసిన తప్పుకు శిక్షగా తలపాగా ఊడదీసి ఆయన మెడకేసి కట్టాడు. తరువాత ఖాలిద్ (రజి) ఆ బహుమానం తన సొంతడబ్బు నుండి ఇచ్చానని చెప్పగానే ప్రతినిధి ఆయన మెడకు కట్టిన తలపాగా తీసేశాడు.

ఈరాన్, రోమ్ చక్రవర్తుల గుండెల్లో దడ పుట్టిస్తూ, ముస్లిం యోధులకు తిరుగులేని హీరోగా వెలిగిపోతున్న ఖాలిద్ (రజి) దీన్ని సహచర సైనికులందరి ముందు తనకు జరిగిన అవమానమని భావించారా? లేదు, ఏమాత్రం అవమానకరమని భావించలేదు. ఒక సాధారణ సైనికుడిగా ఎంతో అణుకువతో ఖలీఫా ఆజ్ఞ ముందు తలవంచారు.

కొన్నాళ్ళతర్వాత హజ్రత్ ఖాలిద్ (రజి) హమస్ చేరుకొని తన పదవీభ్రష్టత గురించి సైనికుల ముందు వాపోతూ "విశ్వాసులనాయకుడు నన్ను సిరియా సేనాపతిగా నియమించారు. కాని నేను సిరియాను జయించాక ఆయన నన్ను సేనాపతి పదవి నుండి తొలగించారు" అని అన్నారు.

ఒక సైనికుడు ఈమాట వినగానే లేచి "నాయకా! నోరు మూసుకో. ఇలాంటి మాటల వల్ల అరాచకం రేకెత్తే ప్రమాదముంది" అన్నాడు. దానికి ఖాలిద్ (రజి) "ఉమర్ ఖలీఫాగా ఉన్నంతవరకూ అరాచకం రేకెత్తే ప్రసక్తే రాదు" అని అన్నారు.

ఖలీఫా ఉమర్ (రజి) వివరణ కోసం ఖాలిద్ (రజి)ని మదీనాకు పిలిపించారు. ఖాలిద్(రజి) ఖలీఫా సన్నిధికి వెళ్ళి "ఉమర్! దైవసాక్షి, మీరు నావిషయంలో న్యాయంగా వ్యవహరించలేదు" అని అన్నారు.

దానికి ఖలీఫా "అసలు నీకంత డబ్బు ఎక్కడ్నుంచి వచ్చింద"ని అడిగారు. అప్పుడు ఖాలిద్ (రజి) సమరసొత్తు నుండి లభించిందని చెప్పి "ఇదిగో ఈ డబ్బు చూడండి. ఇందులో అరవైవేల దిర్హంలకంటే ఎక్కువ ఉంటే దాన్ని మీకప్పగిస్తాను" అని అన్నారు. లెక్కబెడితే ఇరవై వేలు అదనంగా ఉన్నట్లు తేలింది. అప్పుడా ఇరవై వేల దిర్హంల పైకాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమచేయడం జరిగింది.

ఆతర్వాత ఖలీఫా ఉమర్(రజి) సేనాపతి ఖాలిద్ (రజి)తో "ఖాలిద్! దైవసాక్షిగా చెబుతున్నాను. నేను నిన్ను అభిమానిస్తున్నాను; గౌరవిస్తున్నాను కూడా" అని చెప్పి రాజ్యంలోని పాలకులందరికీ ఇలా ఓ లేఖ రాశారు:

"నేను ఖాలిద్‌ని కోపంతో లేదా నమ్మకద్రోహం కారణంగా పదవి నుండి తొలగించ లేదు. ప్రజలు అతనిపట్ల అతిగా ఆకర్షితులవుతున్నారు. (అది వారిని వ్యక్తిఆరాధన వైపుకు గొనిపోవచ్చు) అంచేత (ప్రజల్ని వ్యక్తిపూజ పాపంనుండి కాపాడి) ఏది జరిగినా దాన్ని దేవుడు మాత్రమే చేస్తాడని వారు గ్రహించేందుకు నేను ఖాలిద్‌ని పదవి నుండి తొలగించడం మంచిదని భావించాను."

హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో సర్వసేనానిగా నియమించబడి నిరంతరాయంగా ఆరేండ్ల పాటు శత్రువుల పాలిట సింహస్వప్నమై, ఓటమి ఎరగని యోధాన యోధుడిగా వెలుగొందిన ఖాలిద్ బిన్ వలీద్ (రజి) చివరికి మృత్యుకుహరంలోకి ప్రవేశించారు. మరణసూచనలు కన్పించినపుడు ఆయన, అయ్యో దేవా! ఎన్ని యుద్ధాల్లో పాల్గొన్నా తనకు అమరగతి భాగ్యం దక్కలేదే, చివరికి స్త్రీ మాదిరిగా మంచానపడి ప్రాణం వదలవలసి వస్తోందే!! అని ఎంతో బాధపడ్డారు.

# 6. అమ్ర్ బిన్ ఆస్ (రజి)

ఇస్లామీయ ఉద్యమాన్ని అంతమొందించడానికి మక్కా బహుదైవారాధకులు చేస్తున్న ప్రతియత్నమూ విఫలమవుతోంది. వారి పథకాలన్నీ బెడిసి కొడ్తున్నాయి. ముస్లింలతో జరిగిన తొలియుద్ధంలోనే వారు ఘోరపరాజయం చవిచూశారు. ఆ తర్వాత ఉహుద్ యుద్ధంలో మొదట విజయపతాకం కాస్తంత ఊగుతున్నట్లు కన్పించినా చివరికి అపజయమే ఎదురయింది. కందకం యుద్ధంలో కూడా ఓటమి పాలయ్యారు. పోనీ హుదైబియా ఒప్పందమయినా ఇస్లాం వ్యాప్తిని అరికడ్తుందేమో అనుకుంటే అదీ లేదు. పైగా దానివల్ల ముస్లింల సంఖ్య ఇంకా పెరుగుతూనే పోయింది. మరికొద్ది కాలంలోనే వారి ధర్మం యావత్తు అరేబియాలో విస్తరించినా ఆశ్చర్యం లేదు.

ఈ ఆలోచనలతో మక్కా ఖురైషీయులు అవమాన భారంతో రోజురోజుకు క్రుంగిపోతున్నారు. కొందరయితే ఈ అవమానభారం మరింత దుర్భరం కాకముందే దాన్నుంచి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలు కూడ వెతకడం ప్రారంభించారు. అలాంటి వారిలో అమ్ర్ బిన్ ఆస్ ఒకడు. అతను అభిమానం, పౌరుషంగల గొప్పసేనాని. ఉహుద్ పరిణామం తరువాత అతనో నిర్ణయానికి వచ్చాడు.

"మిత్రులారా! ముహమ్మద్ ధర్మం రోజురోజుకు వ్యాపిస్తూనేఉంది. తగ్గే సూచనలు కన్పించడంలేదు. అందుకని నాకో ఆలోచన తట్టింది. చెప్పమంటారా?" అన్నాడు.

"సరే చెప్పు" అన్నారు ఖురైష్ నాయకులు కుతూహలంతో.

"మనం అబీసీనియా వెళ్ళి నజాషీ రాజు దగ్గర రాజకీయ ఆశ్రయం పొందాలి. ముహమ్మద్ అరేబియాను జయించినట్లయితే మనం అక్కడే ఉండిపోదాం. నజాషీ



రాజ్యంలో మనకు కాస్తయినా గౌరవం ఉంటుంది. ఈ విధంగా మనం ముహమ్మద్ దాస్యం నుండి బయటపడగలం. ఒకవేళ మన జాతివాళ్ళే గెలిస్తే మనం మన ప్రాంతానికి తిరిగిరావచ్చు. అప్పుడు మనం స్వేచ్ఛగా, గర్వంగా తలెత్తుకొని తిరగ్గలగుతాం. ఏ ప్రమాదం ఉండదు. హాయిగా గౌరవంగా జీవించవచ్చు" అన్నాడు అమ్ర్.

"బాగుంది. అలాగే చేద్దాం" అన్నారు అమ్ర్ అనుచరులు. మరునాడే వారు మక్కా నుండి అబీసీనియాకు బయలుదేరారు. ఆ దేశరాజు నజాషీకి కానుకలు సమర్పించుకోవడానికి వారు వెండిబంగారాలతో పాటు ఎంతో విలువైన తివాచీలు కూడా వెంట తీసికెళ్ళారు.

నజాషీరాజు ఖురైష్‌నాయకుల్ని స్వాగతించాడు. వారు తెచ్చిన కానుకల్ని సంతోషంగా స్వీకరించాడు. అలా ఖురైషీయులు నజాషీ రాజ్యంలో సుఖంగా గడపసాగారు.

దైవప్రవక్త (సల్లం) నజాషీ పేరిట రెండు లేఖలు వ్రాశారు. వాటిని ఇబ్నె ఉమయ్యా (రజి) తీసుకొని అబీసీనియా చేరుకున్నారు. అమ్ర్ ఆయన్ని చూడగానే ఇతను దైవప్రవక్త (సల్లం) రాయబారిగా వచ్చిఉంటాడని గ్రహించి నజాషీ దగ్గరికి వెళ్ళాడు.

## (1) ఇస్లాం స్వీకరణ

"మహారాజా! మీ దగ్గరికి మదీనా నుండి ఓ రాయబారి వచ్చాడు. అతను మనందరి గర్భశత్రువు తరపున వచ్చిన దౌత్యవేత్త. అతడ్ని నాకప్పగించండి, హతమార్చివేస్తాను" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్ అబీసీనియా రాజు నజాషీతో.

అమ్ర్ ఎవర్ని గురించి ఇలా అంటున్నాడో నజాషీ వెంటనే గ్రహించాడు. అతను అమ్ర్ వైపు ఉరిమి చూశాడు. తరువాత అతని చెయ్యి అప్రయత్నంగా పైకి లేచింది. మరుక్షణమే అమ్ర్ చెంప ఛెళ్ళుమన్నది. ఒక్కసారిగా అమ్ర్ చుట్టూ గాఢాంధకారం అలుముకున్నది. కాళ్ళక్రింద భూమి చీలిపోయినట్లు అన్పించింది. కాస్సేపటికి అమ్ర్ కళ్ళు తెరిచాడు. చూస్తే నజాషీ కళ్ళు అగ్నికణాలు కురిపిస్తున్నాయి.

"మహాప్రభో! క్షమించండి. బుద్ధి గడ్డితిని ఏదో వాగాను. మీకీ మాటలు నచ్చవని తెలిస్తే నేనసలు నోరు తెరిచేవాడ్ని కాను" అన్నాడు అమ్ర్ తడబడుతూ.

"తుచ్ఛుడా! ఎవరనుకున్నావు ఈ రాయబారి? ఒక సత్పురుషుడు, మూసా, ఈసా ప్రవక్తల మాదిరిగానే దైవదూత జిబ్రీల్ ద్వారా దైవసందేశాన్ని గ్రహించే మహాప్రవక్తయిన ముహమ్మద్ (స) రాయబారిని నీకప్పగించాలా? ఆయన్ని నువ్వు చంపుతావా?"

నజాషీ ఆవేశంతో చెబుతున్నాడు. అతను చెబుతున్న ఒక్కొక్క మాటలో దైవప్రవక్త పట్ల అతనికున్న అచంచలవిశ్వాసం, అపార ప్రేమాభిమానాలు బహిర్గతమవుతున్నాయి. అది చూసి అమ్ర్ ఎంతో ప్రభావితుడయ్యాడు.

"మహారాజా! మీరంటున్నది నిజమేనంటారా?" అన్నాడు అమ్ర్ అనుమానంతో.

"ఓరి పిచ్చివాడా! నామాట నమ్ము. ఆయన సత్యధర్మం తీసుకొచ్చిన అంతిమ దైవప్రవక్త (స). శత్రువులంతా లొంగిపోయి, ఆయన ధర్మం నలుదిశలా విస్తరిస్తుందని నువ్వు త్వరలోనే తెలుసుకుంటావు" అన్నాడు నజాషీ.

అమ్ర్ కంటిపొరలు ఒక్కసారిగా తొలగిపోయాయి. అతని అంతరంగంలో విశ్వాస కణం రగుల్కొంది. ముఖం అప్పుడే వికసించిన కలువపువ్వులా కళకళలాడసాగింది. అతనిప్పుడు ఇస్లాం ధర్మానికి చేరువయ్యాడు. అమ్ర్ ఆతర్వాత నజాషీ దగ్గర సెలవు తీసుకొని అరేబియా వెళ్ళిపోయాడు. అక్కడ ఒక ఒంటెను కొని మదీనా బయలుదేరాడు. దారిలో ఒకచోట ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా కన్పించారు.

"ఖాలిద్! ఏమిటి విశేషం? ఎక్కడికీ ప్రయాణం?" అడిగాడు అమ్ర్ ఆత్రంగా.

"ముహమ్మద్ (స) దగ్గరికి వెళ్తున్నాము. మార్గం తేజోవంతంగా ఉంది. మాట సమంజసంగా ఉంది. అలాంటప్పుడు ఇంకెన్నాళ్ళిలా తప్పించుకొని తిరుగుదాం? పదా మాతోపాటు, ఇస్లాం స్వీకరిద్దాం" అన్నాడు ఖాలిద్.

"నేనూ అదే ఉద్దేశ్యంతో బయలుదేరాను, పదండి" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్. ముగ్గురి మార్గం ఒకటే. లక్ష్యం ఒకటే. గమ్యం కూడా ఒకటే. ముగ్గురూ సంతోషంగా మదీనా బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) మసీదులో ధర్మబోధ చేస్తున్నారు. కాస్సేపటికి ఆయన ధర్మబోధను ఆపి ఇలా అన్నారు: "చూడండి, మక్కా నగరం తనకు ప్రాణప్రదమైన తురుపు ముక్కల్ని మన వైపునకు విసిరింది. ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా, అమ్ర్ బిన్ ఆస్- ఈ ముగ్గురూ నగరంలో ప్రవేశించారు. వెళ్ళి పిలుచురండి."

ఈ శుభవార్త వినగానే ప్రవక్త అనుచరులు ఆనంద డోలికల్లో ఊగిపోయారు. ఖాలిద్ అన్న వలీద్ బిన్ వలీద్ అయితే చెప్పనవసరం లేదు. సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ వెంటనే లేచి బయటికి పరుగెత్తారు. దారిలోనే ఆయన ఆ ముగ్గురిని కలిసి "త్వరగా నడవండి. దైవప్రవక్త (సల్లం)కు మీరు ముగ్గురు వస్తున్నారని తెలిసింది. ముస్లింలంతా మీకోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు" అన్నారాయన.

"ఏమిటీ! దైవప్రవక్త (స)కు మేమెలాంటి సమాచారం పంపలేదే! మేం వస్తున్న సంగతి ఎలా తెలిసింది?" ఖాలిద్ ఆశ్చర్యపోతూ అడిగాడు. "దైవప్రవక్త (స)కు ఆయన ప్రభువు అవసరమైనప్పుడల్లా అగోచరవిషయాలు తెలుపుతుంటాడు"అన్నాడు వలీద్.

ఈ నలుగురూ మసీదులో ప్రవేశించగానే అక్కడున్నవారి ముఖపద్మాలు ఒక్కసారిగా సంతోషంతో విప్పారాయి.



"ఖాలిద్! ఏమిటి సంగతి ఇలా వచ్చావు?" ప్రేమగా అడిగారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ. "మేము ముగ్గురం ఇస్లాం స్వీకరించడానికి వచ్చాం" అన్నాడు ఖాలిద్ ముక్తసరిగా.

ఆ తర్వాత ఆ ముగ్గురూ సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించారు. దాంతో 'అల్లాహు అక్బర్' అనే నినాదంతో మసీదు మార్మోగింది. వారి ఇస్లాం ప్రకటనతో దైవప్రవక్త (స)తో పాటు ముస్లింలందరూ పరమానంద భరితులయ్యారు.

## (౭) సమరంలో సరిరారు నీకెవరు

దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత అమ్ర్ బిన్ ఆస్ (రజి) అబూబకర్ (రజి), ఉమర్‌ఫారూఖ్ (రజి)ల పాలనాకాలాల్లో అనేకయుద్ధాల్లో పాల్గొని గొప్ప సమరయోధు డిగా పేరుగాంచారు. ఉమర్‌ఫారూఖ్ పాలనాకాలంలో సర్వసేనాని అబూఉబైదా (రజి) ఆదేశంతో ఆయన బైతిల్‌మఖ్దిస్ (జెరూసలేం) పట్టణాన్ని ముట్టడించారు. ఈ ముట్టడి దీర్ఘకాలం కొనసాగినప్పటికీ అంతిమవిజయం ముస్లింలనే వరించింది.

హిజ్రీశకం 17వ సంవత్సరంలో ఇరాఖ్, సిరియా, ఈజిప్టు దేశాల్లో భయంకరమైన ప్లేగువ్యాధి వచ్చి వేలాదిమంది ప్రజలను బలి దీసుకుంది. సిరియా సేనాపతులు ఒకరి తరువాత ఒకరు చొప్పున ముగ్గురు మరణించారు. అప్పుడు సిరియా సైన్యానికి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) సేనాపతి అయ్యారు.

ఖలీఫా ఉమర్ (రజి) బైతిల్‌మఖ్దిస్ పర్యటనకు వచ్చినప్పుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టుపై దాడిచేయడానికి ఖలీఫా నుండి అనుమతి అడిగి తీసుకున్నారు. అనుమతి లభించిన తర్వాత ఆయన నాలుగు వేల మంది సైనికుల్ని తీసుకొని ఈజిప్టుకు బయలుదేరారు. రోమన్ల అధీనంలో ఉండిన ఈజిప్టులో అనేక యుద్ధాలు చేసి ఆ దేశ మంతటా విజయఢంకా మోగించిన ఘనత ఆయనకే దక్కింది. ఆ తరువాత ఆయన్ని ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఈజిప్టు గవర్నర్‌గా నియమించారు.

అయితే ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫాగా వచ్చిన కొన్నాళ్ళకు ఈజిప్టు గవర్నర్ పదవి నుండి ఆయన్ని తొలగించి, ఆ స్థానంలో తన క్షీరసంబంధ సోదరుడయిన అబ్దుల్ల బిన్ సాద్ (రజి)ని నియమించారు.

అబ్దుల్లా బిన్ సాద్ (రజి) దైవప్రవక్త (స) కాలంలో ఒకసారి మతభ్రష్టుడైపోయి, ఆ తర్వాత కొన్నాళ్ళకు పశ్చాత్తాపం చెంది మళ్ళీ ముస్లిం అయ్యారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను గవర్నర్ పదవి నుంచి తొలగించి సైన్యాధ్యక్షుడిగా మాత్రమే ఉంచారు. ఆయన స్థానంలో అబ్దుల్లా బిన్ సాద్ (రజి)ను గవర్నర్‌గా నియమించడమే గాకుండా ఆయనకు కోశాధికారి పదవి కూడా కట్టబెట్టారు.

బహుశా ఈ మార్పు కారణంగా సైన్యాధికారుల్లో, పాలనాధికారుల్లో అనైక్యత, అంతఃకలహాలు జనించాయి. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు ఈసంగతి తెలిసి అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను సైన్యాధ్యక్షుడి పదవి నుండి కూడా తొలగించి, అబ్దుల్లా బిన్ సాద్ (రజి)కు ఈజిప్టు, అలెగ్జాండరియాల్లో పూర్తి అధికారాలు ఇచ్చారు.

అయితే అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఉద్వాసన ఈజిప్టు ప్రజల హృదయాలను బాగా కలచివేసింది. వారు అబ్దుల్లా బిన్ సాద్ (రజి)కు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. మరొక వైపు రోమ్ చక్రవర్తికి ఈజిప్టు పరిస్థితులు తెలిసి దాన్ని సువర్ణవకాశంగా భావిస్తూ అలెగ్జాండరియాపై దాడిచేసి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు ఈ సంగతి తెలియగానే ఆయన అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను మళ్ళీ గవర్నర్‌గా నియమించి ఈజిప్టు పంపారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టు వెళ్ళి గవర్నర్ బాధ్యతలు చేపట్టగానే మొట్టమొదట అలెగ్జాండరియాపై దాడిచేసి అక్కడి రోమ్‌సైనికుల్ని తరిమికొట్టారు. తరువాత అక్కడ ఒక మసీదు నిర్మించారు. దాని పేరు మస్జిదుల్ రహ్మత్.

అమ్ర్ (రజి) రాష్ట్ర పరిస్థితుల్ని పూర్తిగా అదుపుచేసి, పరిపాలనా వ్యవహారాలను చక్కదిద్దిన తరువాత ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని గవర్నర్ పదవి నుండి మళ్ళీ తొలగించి ఆ స్థానంలో తిరిగి అబ్దుల్లా బిన్ సాద్ (రజి)నే నియమించారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈసారి జరిగిన తన ఉద్వాసనతో చాలా బాధపడ్డారు. అటు అబ్దుల్లా బిన్ సాద్ (రజి) కూడా ఈ పునరుద్వాసన, పునర్నియామకాల పట్ల కలతచెందారు.

ఖలీఫా ఉస్మాన్ (రజి) అవలంబించిన బంధుప్రేమ విధానం శృతిమించి క్రమంగా బంధుప్రీతిగా మారడంతో ప్రజలు ఆయన పట్ల ఆగ్రహం వ్యక్తపరచసాగారు. ముస్లిం ముఖయాదుడు ఇబ్నెసబా దాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటూ కుట్రలు, కుయుక్తులతో రాజ్యంలో అరాచకం సృష్టించాడు. మృదు మనస్కుడయిన ఖలీఫా ఉస్మాన్ ఆ అరాచక శక్తులపై ఎలాంటి చర్యా తీసుకోలేక పోయారు.

దాన్ని గురించి అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఓరోజు ఆయన ముందు ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "మీరు ప్రజలపట్ల మితిమీరిన మృదుత్వంతో ప్రవర్తిస్తున్నారు. ఉమర్ (రజి) ఇలా ప్రవర్తించేవారు కాదు. వేలమైళ్ళ దూరంలోఉన్న గవర్నర్లు, అధికారులు ఆయన సన్నిధి లో బానిసలకంటే కూడా ఎక్కువ భయపడేవారు. ముస్లింలలో అనైక్యతాబీజాలు నాటేందుకు ప్రయత్నిస్తున్న అరాచకశక్తుల్ని గుర్తించి కూడా మీరు వారిని శిక్షించడం లేదు" అని అన్నారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. అల్లరిమూకపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. తత్ఫలితంగా ఈ అరాచకం హద్దుమీరి పోయి హి.శ. 35, జిల్‌హజ్జ నెలలో ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్యకు దారితీసింది.



అమ్ర్ బిన్ ఆస్ (రజి) మదీనాలో పరిస్థితులు విషమిస్తూ పోతుండటం చూసి తన కుమారులిద్దర్ని తీసుకొని పాలస్తీనా వెళ్ళిపోయారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య తర్వాత ఆయన మారిన పరిస్థితుల్ని విశ్లేషించి సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు చేరుకొని, ఆయనకు సైనికసలాహాదారుడిగా ఉండసాగారు.

ఆ తర్వాత ముఆవియా (రజి) వర్గానికి, అలీ (రజి) వర్గానికి మధ్య సిఫ్ఫీన్ యుద్ధం జరిగింది. ఖలీఫా అలీ(రజి) పన్నెండువేల రౌతులతో కూడిన ఒక సైనికదళం తీసుకొని సమరజ్వాలలు రేకెత్తిస్తూ ముఆవియా (రజి) కూర్చున్న శిబిరం సమీపానికి చేరుకున్నారు. ఆయన ప్రత్యర్థులతో పోరాడుతూనే ముఆవియా (రజి)ను సంబోధిస్తూ "ముస్లింలను చంపించడం వల్ల ప్రయో జనం ఏమీలేదు. ధైర్యం ఉంటే నాతో పోటీకి దిగు. మనిద్దరిలో ఎవరు గెలిస్తే అతనే ఖలీఫా అవుతాడు" అని అన్నారు.

అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈమాట విని "విషయం సమంజసంగా ఉంది. ఆయన సవాలును స్వీకరించి మీరు పోటీకి దిగాలి" అన్నారు ముఆవియా (రజి)తో. కాని ముఆవియా (రజి) దానికి సమాధానమిస్తూ "అలీ (రజి)ని ఎదుర్కోవడానికి వచ్చే ఏ మనిషీ బ్రతికి బట్టకట్టలేడని నీకు తెలియదా?" అని అన్నారు.

ఇబ్నెసబా అనుచరులు ఖారిజీల కుట్రల మూలంగా అలి (రజి), ముఆవియా (రజి) సైనికుల్లో 70వేల మందికి పైగా ముస్లింలు మృత్యువాత పడ్డారు. చివరికి ఆ దుండగులు ముఆవియా (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి), అలీ (రజి)ల హత్యకు పథకం రూపొందించారు. దానిప్రకారం హి.శ. 40, రమజాన్ నెల 16వ తేదీ, ఫజర్ నమాజ్ వేళలో తమ దుష్టపథకాన్ని అమలు పరిచారు. అప్పుడు ముఆవియా (రజి) కొద్దిపాటి గాయంతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఆరోజు సుస్తీచేయడంతో తనకు బదులు మరొకర్ని ఇమామ్‌గా నియమించారు. ఆ విధంగా ఆయన కూడా ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. కాని హజ్రత్ అలీ (రజి)ని మాత్రం ఆ దుర్మార్గులు దారుణంగా హతమార్చారు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) అమీర్ ముఆవియా (రజి) పాలనలో కూడా ఈజిప్టు గవర్నర్‌గా కొనసాగారు. ఆయన తనకాలంలో ఆ రాష్ట్రాన్ని అన్నివిధాలా పటిష్ఠ పరిచారు. చివరికి హి.శ. 43లో ఆయన శాశ్వతంగా ఇహలోకం వీడిపోయారు.

# 7. ఇక్రమా బిన్ అబూజహల్ (రజి)

మక్కావిజయం తర్వాత అబూజహల్ ఇక్రమా జిద్దా పారిపోయి, అక్కడ్నుంచి ఓడలో అబిసీనియా దారిపట్టాడు. రేవు నుంచి ఓడ బయలుదేరిన తరువాత ముఖానికి పట్టిన చెమట తుడుచుకొని 'అమ్మయ్యా!' అంటూ తృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

ప్రయాణీకులతో కిటకిటలాడుతున్న ఆ ఓడ పిల్లగాలికి మెల్లగా ఊగుతూ ముందుకు సాగిపోతోంది. నడి సముద్రంలోకి పోయిన తరువాత ఆ పిల్లగాలి కాస్తా పెద్దగాలయి పోయింది. మరి కాస్సేపటికి అది ఉధృతమయి తుఫానులా మారింది. ఓడ తుఫాను తాకిడికి తూగుటుయ్యాలలా ఎడాపెడా ఊగసాగింది.

దాంతో ప్రయాణీకులు భయపడ్డారు. ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రయాణీకులు ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతూ తమతమ ఇష్టదేవతల్ని మొరపెట్టు కోవడం మొదలెట్టారు. కాని తుఫాను ఏమాత్రం తగ్గలేదు. అది మరింత భీకరంగా తయారై ఓడను ఎత్తి కుదేస్తూ ముంచివేసే స్థితికి చేరుకుంది. ప్రయాణీకులు భయంతో రోదిస్తూ ఇష్టదేవతలను వేడుకుంటున్నారు. అప్పుడు కొందరు అనుభవశాలురు లేచి "ఇది సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుణ్ణి తప్ప మరెవరినీ వేడుకునే సమయంకాదు. ఆయన మాత్రమే తలచుకుంటే మనమీ ఆపద నుండి బయటపడగలం" అన్నారు.

ఈ మాటలు వినగానే ఇక్రమా కళ్ళపై వున్న అజ్ఞానపొరలు తొలగిపోయాయి. "ఏమిటీ!? ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయం చేసేవారు లేరా? మరి ఈ విషయాన్నే కదా ఆ పుణ్యాత్ముడు ఇరవై ఏండ్ల నుంచి చెబుతూ వస్తున్నది. మనం అనవసరంగా ఆయనతో పోరాడుతున్నాం" అని అనుకున్నాడతను. తర్వాత "ఈ తుఫాను నుంచి క్షేమంగా బయటపడితే నేను నేరుగా ముహమ్మద్ మహనీయుని (స) దగ్గరకు పోయి ఆయన చేతిలో చేయి వేసి కలుపుతాను" అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

తుఫాను మెల్లగా తగ్గుముఖం పట్టింది. ఓడ వడిదుడుకులు లేకుండా సవ్యంగా ముందుకు సాగింది. కాస్సేపటికి తుఫాను పూర్తిగా తగ్గిపోయింది. ఓడ అబిసీనియా రేవుకు చేరుకుంది. ప్రయాణీకులు దైవానికి కృతజ్ఞతలు చెప్పి దిగిపోయారు. ఇక్రమా హృదయం కూడా దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. కొన్నాళ్ళ తరువాత అతను ఓడలో జిద్దాకు తిరిగొచ్చి, అక్కడ్నుంచి నేరుగా మదీనా చేరుకున్నాడు. మదీనా చేరుకొని సరాసరి మసీదుకు వెళ్ళాడు.

మసీదులో దైవప్రవక్త (స) ఇక్రమాను చూడగానే "ఇక్రమా! స్వాగతం, నీ రాక శుభప్రదం!!" అన్నారు సంతోషం వ్యక్తపరుస్తూ. తర్వాత ఇక్రమా సద్వచనం పఠించి ముస్లింగా మారి పోయాడు. ఆయన ఇస్లాంస్వీకార ప్రకటన చేయగానే తోటి ముస్లింలు పరమ సంతోషంతో 'అల్లాహు అక్బర్" అంటూ నినదించారు బిగ్గరగా.

హజ్రత్ ఇక్రమా (రజి) దైవప్రవక్త (స) తదనంతరం ఖలీఫా అబూబకర్ (రజి), ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి)ల పాలనాకాలాల్లో అనేక యుద్ధాల్లో పాల్గొని ఇస్లాంకు ఎంతో సేవ చేశారు. ఖాలిద్ బిన్ వలీద్ నేతృత్వంలో జరిగిన యర్మూక్ యుద్ధంలో కూడా పాల్గొని చివరి రక్తపుబొట్టు వరకు తన ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించారు.



హి.శ. 15వ ఏట రోమన్లతో జరిగిన ఈ యుద్ధంలో ముస్లింయోధులు విజయమో వీరస్వర్గమో అంటూ సైనిక సంఖ్యాబలానికి అతీతంగా అత్యంత ధైర్యసాహసాలతో పోరాడారు. ఈ నిర్విరామ యుద్ధంలో ముస్లింలు జుహర్-అసర్ నమాజులు యుద్ధం చేస్తూనే సైగలతో నిర్వహించారు. అయినప్పటికీ కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. శత్రుసైనికులు అత్యధిక సంఖ్యలో గుట్టలు గుట్టలుగా నేలకొరిగి పోతున్నారు. చివరికి రోమ్‌సైనికులు ముస్లింల ధాటికి నిలువలేక కాలికి బుద్ధిచెప్పారు. యుద్ధమేఘాలు మెల్లిగా విడిపోయాయి. ముస్లింలపై విజయభానుడు వెలిగిపోసాగాడు.

అయితే హజ్రత్ హారిస్ బిన్ హిషామ్ (రజి), హజ్రత్ అయాష్ బిన్ రబియా (రజి), హజ్రత్ ఇక్రమా (రజి) బిన్ అబూజహల్ యుద్ధమైదానంలో తీవ్రంగా గాయపడి చావుబ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడసాగారు.

హారిస్ (రజి) తీవ్రమైన దాహంతో విలవిల్లాడుతూ మంచినీళ్ళు అడిగారు. వెంటనే ఒక యోధుడు మంచినీళ్ళు తెచ్చి హారిస్ (రజి) నోటికి అందించాడు. అప్పుడు ఇక్రమా (రజి) అతని వైపు ఆశగా చూశాడు. హారిస్(రజి) అది గమనించి ముందు ఇక్రమా (రజి)కు తాగించు అన్నట్లు ఆయన వైపు సైగచేశారు. ఆ యోధుడు నీళ్ళతిత్తి తీసికెళ్ళి ఇక్రమా (రజి) నోటికి అందించాడు. అప్పుడు అయాష్ (రజి) ఆ నీళ్ళతిత్తి వైపు ఆశగా చూశారు. ఇక్రమా (రజి) అది గమనించి ముందు అయాష్ (రజి)కు తాగించు అన్నట్లు ఆయన వైపు సైగచేశారు. ఆ యోధుడు నీళ్ళు తీసికెళ్ళి అయాష్ (రజి) దగ్గరకొచ్చాడు.

కాని అప్పటికే అయాష్ (రజి) ప్రాణం అనంతవాయువుల్లో కలసిపోయింది. వెంటనే ఆ యోధుడు నీళ్ళు తీసుకొని నీటి కోసం తపిస్తున్న మిగిలిన ఇద్దరి దగ్గరకు వెళ్ళాడు. కాని అప్పటికే వారిద్దరు కూడా కన్నుమూశారు.

## 8. జైద్ బిన్ హారిసా (రజి)

ఒకరోజు మహనీయ ముహమ్మద్ (స) తన చిన్నారికూతురు జైనబ్‌తో కబుర్లు చెబుతూ కూర్చొనివుంటే, బయటికి పోయిన తన అర్ధాంగి అందమైన ఓ బాలుణ్ణి వెంట బెట్టుకొని వచ్చారు.

ముహమ్మద్ (స) బాలుని వంక చూస్తూ "ఎవరీ అబ్బాయి?" అని అడిగారు.

"ఇతను బానిస బాలుడు. నా మేనల్లుడు హకీం సిరియా నుంచి కొంతమంది బానిసలను తెచ్చాడు. నాక్కూడా ఒక బానిసను ఇచ్చాడు" చెప్పారు ఖదీజా.

"కాని ఈ పిల్లవాడి ముఖంలో మంచితనం ఉట్టిపడుతోంది. తెలివితేటల చిహ్నాలు కూడా కన్పిస్తున్నాయి" అన్నారు బాలుని వైపు ప్రేమగా చూస్తూ---

“బాబూ! నీ పేరేమిటీ?” అని అడిగారు ముహమ్మద్ (స). “నా పేరు జైద్’ చెప్పాడు బాలుడు. “మీ వంశావళి సంగతి ఏమైనా తెలుసా నీకు?”

“మానాన్న పేరు హారిసా. మాతాత పేరు షురహబీల్, మాముత్తాత పేరు కాబ్. మాఅమ్మ పేరు సౌదా. ఆమె సాలబాకుమార్తె.” చెప్పాడు జైద్ తన వంశావళిని గురించి.

అప్పుడు మహనీయ ముహమ్మద్ (స), అర్ధాంగి వైపు తిరిగి “ఇప్పుడీ బానిస బాలుడు నావాడు కాదా?” అని అన్నారు. “తప్పకుండా. ఇతను మీ బానిసే. ఇతడ్ని మీకే అప్పగిస్తున్నాను” ఖదీజా సంతోషంగా బానిస బాలుడ్ని శ్రీవారికి సమర్పించారు.

మహనీయ ముహమ్మద్ (స) అప్పటికప్పుడు బాలుడ్ని బానిసత్వం నుంచి విముక్తి కలిగించి తన కుమారునిగా చేసుకున్నారు. తరువాత జైద్ తన వద్ద క్షేమంగా ఉన్నాడని అతని తల్లిదండ్రులకు ఒక మనిషి ద్వారా సమాచారం అందజేశారు.

జైద్ తండ్రి, పినతండ్రి ఈ సంగతి విని జైద్‌ని తీసుకుపోవడానికి మక్కా వచ్చి “మీరెంత ధర అడిగినా ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాం. మా పిల్లవాడ్ని మాత్రం వదిలిపెట్టండి” అంటూ ప్రాధేయపడ్డారు వారిద్దరూ.

“మరో మార్గం చెప్పనా?” అన్నారు ముహమ్మద్ (స). “చెప్పండి ఏమిటో అది”

“ఈ విషయం జైద్ ఇష్టాయిష్టాల మీద వదిలేద్దాం. ఇతను మీ వెంట రావడానికి ఇష్టపడితే నిరభ్యంతరంగా తీసికెళ్ళండి. అందుకు మీరు నాకేమీ ఇవ్వనక్కర్లేదు. ఒకవేళ ఇతను నాదగ్గరే ఉండిపోతానంటే మాత్రం నేనితడ్ని మీ కప్పగించలేను. నన్ను వదలిపెట్టని వాడ్ని వదిలెయ్యడం నా పద్ధతి కాదు” అన్నారు ముహమ్మద్ (స).

“మహాభాగ్యం. అలాగే కానివ్వండి” అన్నారు వారు సంతోషంగా. ముహమ్మద్ (స) అప్పుడు జైద్‌ని దగ్గరకు పిలిచి “చూడు బాబూ! వీళ్ళు మన అతిథులుగా వచ్చారు. మరి వీళ్ళను నీవు గుర్తుపట్టగలవా?” అని అడిగారు. “వీళ్ళు మా నాన్న, మా బాబాయి” అన్నాడు జైద్ వచ్చినవాళ్ళని చూస్తూ.

“అయితే వీళ్ళిప్పుడు నిన్ను తీసికెళ్ళడానికి వచ్చారు. నీ ఇష్టం. వీళ్ళ వెంట నీవు వెళ్ళిపో దలచుకుంటే వెళ్ళిపోవచ్చు. నాకెలాంటి అభ్యంతరంలేదు. లేదా నా దగ్గరే ఉండిపోవాలనుకుంటే సంతోషంగా ఉండిపోవచ్చు. అంతా నీ ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంది” అన్నారు ముహమ్మద్ (స).

జైద్ వెంటనే ముహమ్మద్ (స)ని చుట్టేసుకొని “వద్దు వద్దు. మిమ్మల్ని వదలి నేనెక్కడికీ పోలేను. మీ దగ్గరే ఉండిపోతా” అన్నాడు ఏడుస్తూ. ఈమాట విని తండ్రి మండిపడ్తూ “ఒరే జైద్! అమ్మా, నాన్నా, చుట్టాలు, సొంతూరు అందర్నీ వదిలిపెట్టి ఇక్కడ వెట్టిచాకిరి చేస్తూ బానిసబతుకు బతుకుతావ్రా వెధవా!!” అంటూ గర్జించాడు.



“ఇక్కడ నేనేం బానిసగా బతకడంలేదు. మంచిగానే నన్ను చూసుకుంటున్నారు. ఈయనగారి మంచితనం నన్ను కట్టిపడేసింది. అంచేత నేను మీవెంట రాలేను” అన్నాడు జైద్.“విన్నారు కదా! ఇక ఈ పిల్లవాడు నావాడు” అన్నారు ముహమ్మద్ (సల్లం).

ఆ తర్వాత వెంటనే ఆయన జైద్ చేయి పట్టుకొని కాబాలో ఖురైష్ పెద్దల దగ్గరికి వెళ్ళారు. “ఖురైష్ పెద్దలారా! వినండి. ఈరోజు నుంచి ఈ బాలుడు నా కొడుకు. ఇతను నా వారసుడు. నేనితని వారసుడ్ని. దీనికి మీరే సాక్ష్యం” అని ప్రకటించారు ఆయన అందరి సమక్షంలో. హారిసా ఇది చూసి సంతోషంతో పొంగిపోయాడు. కొడుకుని మక్కాలోనే ముహమ్మద్ మహనీయుని (స) దగ్గర వదలి వెళ్ళిపోయాడు.

అలి (రజి)తో పాటు ప్రవక్త పెంపుడు కొడుకు జైద్ కూడా దైవప్రవక్త (స) ఇంట్లో ఉంటున్నాడు. వారిద్దరు కలసి మెలసి ఉండేవాళ్ళు. ఏది చేసినా ఇద్దరూ కలిసే చేసేవారు. అలి కొత్తధర్మం స్వీకరించిన సంగతి వినగానే జైద్ కూడా దైవప్రవక్త (స)పై విశ్వాసం ప్రకటించి ఇస్లాం పరిధిలోకి వచ్చాడు. వాళ్ళిద్దరూ దైవప్రవక్త (స)ను ఎంతగానో గౌరవించేవారు. ఆయన ఆజ్ఞను అంగుళం కూడా జవదాటేవారు కాదు. దైవప్రవక్త (స) కూడా వాళ్ళను అమితంగా ప్రేమించేవారు.

జైద్ బిన్ హారిసా (రజి) నీగ్రోజాతికి చెందినవారు. యుక్తవయస్సుకు చేరుకోగానే ఆయన వివాహం దైవప్రవక్త (స) మాతృమూర్తి సేవకురాలు ఉమ్మెఐమన్ (బర్కా)తో జరిగింది. కొంతకాలానికి ఆ దంపతులకు ఉసామా అనే ఓ పిల్లవాడు జన్మించాడు.

మక్కాలో ఖురైషీయుల దౌర్జన్యాలు అధికమవుతున్నాయి. అదీగాక వారు ఇస్లాం పరిధిలోకి వచ్చే సూచనలు కనుచూపు మేరలో కానరావడం లేదు. అందువల్ల దైవప్రవక్త (స) హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి)ని వెంటబెట్టుకొని తాయిఫ్ పట్నానికి ప్రయాణ మయ్యారు, అక్కడి ప్రజలైనా ఇస్లాం స్వీకరిస్తారేమోనన్న ఆశతో. కాని తాయిఫ్ పెద్దలు దైవప్రవక్త (స) సందేశాన్ని నిరాకరించడమే గాక, ఆయన్ని అవమానించి, తుంటరి పిల్లల చేత రాళ్ళు కూడా రువ్వించారు. అప్పుడు జైద్ (రజి) దైవప్రవక్త (స)ను కాపాడ టానికి చేసిన ప్రయత్నంలో ఆయన దేహం కూడా రక్తసిక్తమయింది.

మదీనా వలసపోయిన తర్వాత జైద్ బిన్ హారిసా (రజి) దైవప్రవక్త (స)తో కలసి బదర్, ఉహద్, అహ్జాబ్ మొదలైన యుద్ధాల్లో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) కులం, గోత్రం, జాతి, అనే వివక్షల్ని, అసమానతలను అంతమొందించడానికి తన మేనత్త కూతురు జైనబ్ (రజి)ని జైద్ బిన్ హారిసా (రజి)కు ఇచ్చి వివాహం జరిపించారు.

కాని జైద్, జైనబ్ (రజి)ల వివాహబంధం ఎంతోకాలం సాగలేదు. కపటముస్లిం స్త్రీలు హజ్రత్ జైనబ్ (రజి) దగ్గరికెళ్ళి మాటిమాటికి నిమ్నోన్నతా భావాలను ఎత్తిచూపిస్తూ ఆమె లేత హృదయాన్ని గాయపరిచేవారు.

"ఉన్నత వంశానికి చెందిన నువ్వెక్కడా! బానిసగా బ్రతికిన ఈ జైద్ ఎక్కడ!! అసలు నీలాంటి అమ్మాయి, అందులోనూ అసాధారణ సౌందర్యరాసివయిన నువ్వు ఏ గొప్పింటి కోడలో కావాల్సింది. నీ ఖర్మకాలి ఈ బానిస ఇంటికి వచ్చావు. ఏమోనమ్మా! నీ దుస్థితి చూస్తుంటే మా గుండెలు తరుక్కుపోతున్నాయి" అంటూ వారు జైనబ్ (రజి)ను ఆమె భర్త పట్ల వెగటు కల్గించడానికి ప్రయత్నించారు.

ఈ సూటిపోటి మాటల్ని జైనబ్ (రజి) వినీ విననట్లు మౌనంగా ఉండిపోయేవారు. పైగా ఆమె జైద్ (రజి)ని ప్రశంసించేవారు. అలాంటి మంచి భర్త లభించినందుకు ఆమె దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునేవారు. కపట స్త్రీల సంగతి విని జైద్ (రజి) చాలా బాధపడ్డారు. తన మూలంగా జైనబ్ (రజి) ఆ స్త్రీల సూటిపోటి మాటలు వినవలసి వస్తుందే! ఎన్నాళ్ళిలా ఈమె వారి మాటలు వింటూ భరిస్తుంది? ఈ ఆపద నుండి ఆమె విముక్తి పొందాలంటే, తాను ఆమె నుండి విడిపోవడం ఒక్కటే మార్గం- అని భావించారు. ఆ విషయాన్నే ఆయన జైనబ్ (రజి) ముందు ప్రస్తావించారు.

ఈమాట వినగానే జైనబ్ (రజి)కు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలైనట్లు అన్పించింది. "నన్ను కనికరించండి. తొందరపడి అలా చేయకండి. అవన్నీ తాత్కాలికమైన ఉద్రేకపు మాటలు. వాటిని పట్టుకొని మీరంతగా బాధపడాల్సిన అవసరం లేదు. కొన్నాళ్ళకు అంతా సర్దుకుపోతుంది" అన్నారు ఆమె భర్తతో.

ఈ విషయం సమంజసంగా ఉన్నా, హజ్రత్ జైద్ (రజి) మానసిక సంక్షోభం నుంచి బయటపడలేకపోయారు. తన కోరికను దైవప్రవక్త (స)కు కూడా తెలియజేశారు. దానికి దైవప్రవక్త (స) తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. కాని గాయపడిన జైద్ (రజి) హృదయం అంత తేలిగ్గా ఎలా మానుతుంది? కొన్నాళ్ళు ఎలాగో ఓర్పువహించారు. తర్వాత మానసిక సంక్షోభం భరించలేక ఆయన జైనబ్ (రజి)కు విడాకులు ఇచ్చేశారు.

విడాకుల విషయం తెలియగానే హజ్రత్ జైనబ్ (రజి) తీవ్రంగా ఆవేదనచెందారు. చిన్నపిల్లలా ఘోరంగా విలపించారు. ఈ విషయం తెలిసి దైవప్రవక్త (స) చాలా బాధ పడ్డారు. కాని చేసేదేముంది? జరగవలసింది జరిగిపోయింది. భర్త ఎడబాటుతో హజ్రత్ జైనబ్ (రజి) పరిస్థితి రోజురోజుకు దిగజారి పోసాగింది. అప్పుడు దైవప్రవక్త (స) విశ్వప్రభువు అనుమతితో జైనబ్ (రజి)ని వివాహమాడారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ధర్మప్రచారం కోసం సిరియాలోని "జాతుత్తలహ్" అనే ప్రాంతానికి కొందరు అనుచరులను పంపించారు. అయితే శత్రువులు ప్రచార బృందంలోని వారందరినీ దారుణంగా చంపేశారు. ఒకడు మాత్రమే ఎలాగో తప్పించుకున్నాడు. బస్రాగవర్నర్ దగ్గరికి కూడా దైవప్రవక్త (స) తన ప్రతినిధి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని పంపించారు.



హజ్రత్ హారిస్ (రజి) బస్రా వైపు ప్రయాణంసాగిస్తూ సిరియా సరిహద్దు సమీపంలోని మూతా ప్రాంతానికి చేరుకున్నారు. మూతా రోమ్ రాజ్యంలోని భూభాగమే. కాని మూతాగవర్నర్ షుర్జిల్ బిన్ అమ్ర్ దౌత్యనీతికి తిలోదకాలిచ్చి హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని బంధించి, ఆ తరువాత హతమార్చివేశాడు.

ఈ రెండు దుర్ఘటనలు దైవప్రవక్త (స) హృదయాన్ని బాగా కలచివేశాయి. ధర్మ ప్రచారకులుగా, దౌత్యవేత్తలుగా పోయినవారిని ఇలా దౌత్యనీతిని ఉల్లంఘించి అన్యాయం గా హతమార్చడం మానవతకే కళంకం. పౌరుషం, ఆత్మాభిమానం ఉన్నవారు ఎవరూ ఈ అమానుషాన్ని సహించలేరు. ఈ విద్రోహుల్ని అలా వదలిపెడ్తే మరెన్ని ఘాతుకాలకైనా పాల్పడవచ్చు. అంచేత దైవప్రవక్త (స) తక్షణమే మూడు వేల మంది ముజాహిద్‌లతో కూడిన ఓ సైనికదళాన్ని సిద్ధంచేసి దానికి జైద్ బిన్ హారిసా (రజి)ను సేనాపతిగా నియమించారు. తరువాత ముజాహిద్‌లను ఈవిధంగా ఆదేశించారు:

"ఒకవేళ జైద్ అమరగతుడయితే జాఫర్ సేనాపతి అవుతాడు. జాఫర్ అమరగతుడైతే అబ్దుల్లా బిన్ రవాహ సేనాని అవుతాడు. అబ్దుల్లా కూడా అమరగతుడయితే సైనికులు తాము కోరుకున్న వ్యక్తిని సేనాపతిగా ఎన్నుకోవాలి."

యోధులు ఎంతో ఉత్సాహంతో యుద్ధానికి బయలుదేరారు. దైవప్రవక్త (సల్లం) వారికి వీడ్కోలు చెప్పడానికి వచ్చారు. ఆయన యుద్ధపతాకాన్ని హజ్రత్ జైద్ (రజి) చేతికి అందించారు. తరువాత ఆయన సేనలను ఒకచోట ఆపి ఇలా ఉపదేశించారు:

"ముస్లిం యోధులారా! ఎల్లప్పుడూ దైవానికి భయపడుతూ ఉండాలి. ఆయనకు ఆగ్రహం కల్గించే పనులకు దూరంగాఉండాలి. దైవవిరోధులతో యుద్ధం చెయ్యండి. అయితే మోసం మాత్రం ఎట్టి పరిస్థితిలో కూడా చేయకూడదు. నీతీ నిజాయితీలకు తిలోదకాలివ్వకండి. స్త్రీలను అగౌరవపరచకండి. వృద్ధుల జోలికిపోకండి. అనవసరంగా చెట్లను నరకకండి. ఇళ్ళను పడగొట్టవద్దు."

ముజాహిద్‌లు హిజ్రీశకం 8వ సంవత్సరం, జమాదిల్ అవ్వల్ నెలలో మదీనా నుండి బయలుదేరారు. దారిలో ఇబ్నెరవాహ (రజి) తన కవితాపటిమతో ముజాహిద్‌లను ఉత్తేజపరిచేవారు. వారి పౌరుషం పురివిప్పి నాట్యమాడేలా గేయాలు పాడేవారు. యోధులు మరింత ఉత్సాహంతో సాగిపోయి రోమ్ సామ్రాజ్యంలో ప్రవేశించారు.

రోమ్ సామ్రాజ్యంలోని "మూతా" ప్రాంతం పాలకుడు షుర్జిల్ బిన్ అమ్ర్ ముస్లింల యుద్ధసన్నాహాలను గురించి ముందే తెలుసుకొని లక్ష మంది సైనికుల్ని సమీకరించాడు. అదీగాక రోమ్ చక్రవర్తి సహాయం కూడా కోరాడు. రోమ్ చక్రవర్తి తన సోదరుడికి లక్షమంది సైనికుల్ని ఇచ్చి పంపించాడు. ఇలా శత్రుసేనలు అత్యధిక సంఖ్యలో, అపారమైన ఆయుధ సంపత్తితో ముస్లింలను ఢీకొనడానికి సిద్ధమయ్యాయి.

సిరియాలో అడుగుపెట్టేదాకా ముస్లింలకు ఈ సంగతి తెలియదు. వారు లక్షమంది రోమ్‌సైనికుల్ని చూసి నిర్ఘాంతపోయారు. ఇప్పుడేం చేయాలి? వెంటనే పరిస్థితి దైవప్రవక్త (సల్లం)కు తెలియజేయడమా? లేక ఈ సైన్యానికి ఎదురు నిలిచి పోరాడటమా? ముజాహిద్‌లు సందిగ్ధంలో పడిపోయారు. రెండ్రోజుల దాకా ఎటూ తేల్చుకోలేక పోయారు. అయితే హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి)లోని పౌరుషం బుసలుకొట్టింది.

“సోదరులారా! మనం ఎప్పుడూ సంఖ్యాధిక్యతను దృష్టిలో పెట్టుకొని యుద్ధం చేయలేదు. అశ్వాలపై, ఆయుధాలపై కూడా మనం ఎన్నడూ ఆధారపడలేదు. మన అసలు ఆయుధం దైవధర్మం. పదండి. విజయమో, వీరమరణమో ఏదో ఓ కోరిక నెరవేరు తుంది. దైవనామం ఉచ్చరించి ముందుకు సాగండి” అన్నారు ఆయన.

ఇబ్నెరవాహ (రజి) ప్రసంగం వినగానే సేనాపతి జైద్ బిన్ హారిసా (రజి) ఒక చేతిలో పతాకం, మరొక చేతిలో ఈటె తీసుకొని లేచి నిలబడ్డారు. సేనాపతి సమరోత్సాహం చూడగానే  మిగిలిన యోధులలో నూతనుత్తేజం జనించింది. ఆ వెనువెంటనే అందరూ రోమ్ సేనలతో ఢీకొనడానికి సిద్ధమయ్యారు.

ఇరుపక్షాలు యుద్ధరంగంలో ప్రవేశించాయి. ఒక వైపు లక్షమంది రోమ్ యోధులతో కూడిన సైనికవాహిని యుద్ధనురుగులు కక్కుతోంది. రెండోవైపు కేవలం మూడువేల మంది ముస్లింయోధులు దైవంపై భారంవేసి నడుం బిగించారు.

హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) ఒక చేతిలో ధ్వజం, రెండవ చేతిలో ఖడ్గం పట్టుకొని పెనుతుఫానులా శత్రుసైన్యంలోకి దూసుకుపోయారు. ఆయన ప్రాణాలకు తెగించి చాలా సేపటిదాకా భయంకరంగా పోరాడుతూ అనేకమంది శత్రుసైనికుల్ని కూల్చివేశారు. కాని శత్రుసైనికులు అధిక సంఖ్యలో ఉండటం వల్ల హజ్రత్ జైద్ (రజి) పైన నలువైపుల నుంచి బాణాలు ఎడతెరిపిలేకుండా వచ్చిపడుతున్నాయి. అయినప్పటికీ ఆయన ఎంతో ధైర్యంతో పోరాడారు. చివరికి ఆయన శరీరం నిండా గాయాలతో కుప్పకూలిపోయారు.

తక్షణమే హజ్రత్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) సమరధ్వజం ఎత్తుకొని శత్రువులపై విరుచుకుపడ్డారు. కాని శత్రువులు చక్రబంధం వేసి దాడిచెయ్యడంతో ఆయన కూడా అమరగతులయ్యారు.

వెంటనే ఇబ్నెరవాహ (రజి) పరుగెత్తి పతాకం చేతిలోకి తీసుకొని రెండవచేతిలో ఉన్న ఖడ్గంతో శత్రువుల మీదికి లంఘించారు. ఆయన కూడా చాలా సేపటివరకు పోరాడి నేల కూలిపోయారు. దైవప్రవక్త (స) నియమించిన ముగ్గురు సేనాపతులు కూడా అమరగతులయ్యారు. అప్పుడు ముస్లింయోధులు ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతిగా ఎన్నుకొని యుద్ధం కొనసాగించి అంతిమవిజయం సాధించారు.



## మొట్టమొదటి  అమరవీరుడు

సత్యసందేశాన్ని ప్రజలకు అందజేయాలన్న దైవాజ్ఞ ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఓరోజు కాబాలో నిలబడి ‘అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడ’ని బహిరంగంగా ప్రకటించారు. దాంతో బహుదైవారాధకులు ఆగ్రహోదగ్రులై పోయారు. ‘అపచారం! అపచారం’ అంటూ పెద్ద రభసచేస్తూ ఆయన్ని చుట్టుముట్టారు.

అంతలో హజ్రత్ ఖదీజా (రజి) మాజీభర్త అబూహాలా ద్వారా జన్మించిన హారిస్ (రజి) ఈ గొడవ విని పరుగెత్తుకొచ్చారు. ఆయన జనసమూహాన్ని చీల్చుకుంటూ దైవప్రవక్త (స)ను రక్షించడానికి వచ్చారు. దాంతో బహుదైవారాధకులు మరింత రెచ్చిపోయి దైవప్రవక్త (స)ను వదలి హారిస్ (రజి) మీద విరుచుకుపడ్డారు. చూస్తుండగానే నలువైపుల నుంచి ఖడ్గాలు ఆయన మీద పడి రక్తసిక్తం చేశాయి. కాస్సేపటికే హజ్రత్ హారిస్ (రజి) రక్తపు మడుగులో పడి శాశ్వతంగా కన్నుమూశారు.

ధర్మరక్షణ కోసం జరిగిన కృషిలో ఇది మొట్టమొదటి ప్రాణత్యాగం. దైవమార్గంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల్లో హజ్రత్ హారిస్ బిన్ అబూహాలా (రజి) తొట్టతొలి అమరవీరునిగా చరిత్రలో నిలిచారు.

# 9. ఉసామా బిన్ జైద్ (రజి)

అవి ముస్లింలపై మక్కా బహుదైవారాధకులు హింసాదౌర్జన్యాలకు పాల్పడుతున్న రోజులు. వేరొకవైపు దైవప్రవక్త (స) దౌత్యభారంతో క్రుంగిపోతున్నారు. అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (స) పెంపుడుకొడుకు జైద్ బిన్ హారిసా(రజి)కు, అతని భార్య ఉమ్మెఐమన్ (రజి)కు తొలిసారిగా కొడుకు పుట్టాడన్న శుభవార్త దైవప్రవక్త (స) హృదయంలో ఆనంద కుసుమాలు కురిపించింది. ఆమాటకు వస్తే ఆరోజు యావత్తు ముస్లింలు సంతోష సాగరంలో మునిగితేలారు. ఆ బాబు పేరే ఉసామా బిన్ జైద్ (రజి).

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఉసామా బిన్ జైద్ (రజి)ని అమితంగా ప్రేమించేవారు. ఆయన తన మనమడు హసన్ (రజి)ని ఒకతొడ మీద, ఉసామా (రజి)ని రెండవతొడ మీద కూర్చో బెట్టుకొని గుండెలకు హత్తుకుంటూ “దేవా! నేను వీరిద్దరిని ప్రేమిస్తున్నాను. నీవు కూడా వీరిని ప్రేమించు” అని ప్రార్థించేవారు. దైవప్రవక్త (సల్లం) ఉసామా (రజి)ను బాల్యంలోనే కాదు, యుక్తవయసుకు చేరేవరకూ్కడా ఎంతగానే ప్రేమిస్తుండేవారు.

ఉసామా బిన్ జైద్ (రజి) పధ్నాలుగేండ్ల వయసులోనే ఇతర పిల్లలతో పాటు ఉహద్‌యుద్ధంలో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. కాని దైవప్రవక్త (స) సిపాయిలందర్నీ ఓసారి పరిశీలించి యుద్ధానికి అనర్హులని భావించిన బాలయోధుల్ని

సైన్యం నుంచి తొలగించి ఇళ్ళకు పంపివేశారు. అలాంటి బాలయోధుల్లో ఉసామా (రజి) కూడా ఉన్నారు. ఉసామా (రజి) తాను జిహాద్‌పుణ్యానికి నోచుకోలేకపోయానేనని కంట తడిపెట్టుకుంటూ ఇంటికి వెళ్ళిపోయారు.

ఆ తరువాత ఆయన అహ్జాబ్‌యుద్ధంలో కూడా పాల్గొనడానికి ముందుకొచ్చారు. అప్పటికీ ఆ బాలయోధుడి వయసు పదిహేనేండ్లకు మించలేదు. ఈసారి ఉసామా (రజి) తన ఎత్తు కొంచెం తక్కువ ఉన్నట్లు గమనించి కాలిమునివ్రేళ్ళపై నిల్చున్నారు. దైవప్రవక్త (స) ఆయన అత్యుత్సాహం చూసి జిహాద్‌లో పాల్గొనడానికి అనుమతించారు. ఆ తరువాత ఉసామా (రజి) హునైన్, మూతా యుద్ధాల్లో తన ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించి తోటియోధులను ఆకట్టుకున్నారు. మూతాయుద్ధంలో తన తండ్రి జైద్ బిన్ హారిసా (రజి) అమరగతి అయినప్పటికీ ధైర్యం వీడకుండా మరింత పట్టుదలతో పోరాటం కొనసాగించారు.

దైవప్రవక్త (స) పరలోక ప్రస్థానం ప్రారంభమైన రోజుల్లోనే సిరియా, పాలస్తీనాల్లో రోమన్లు అరేబియాపై దాడి చేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. అందువల్ల దైవప్రవక్త (స) రోమన్లను ఎదుర్కోవడానికి సఫర్ నెల 28న ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో ఓ పెద్ద సైనికదళాన్ని పంపారు.

ఈ సైనికదళంలో అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లతో సహా ప్రముఖ సహాబీలంతా ఉన్నారు. అయితే కొందరు ఉసామా (రజి) నాయకత్వంలో యుద్ధానికి పోవడానికి సుముఖంగా లేరు. ఉసామా (రజి) తండ్రి జైద్ (రజి) స్వేచ్ఛపొందిన బానిస. అంచేత ఉసామా (రజి) బానిస కుమారుడన్న భావన వారిలో ఉంది. అదీగాక ఆయన పిన్న వయస్కుడు. ఈ రెండు విషయాలు మానవ సమానత్వానికి వ్యతిరేకం.

అయినప్పటికీ వారు బానిస కొడుకు, పైగా నూనూగు మీసాల యువకుడ్ని ఎంతో అనుభవం ఉన్న యోధానయోధులకు నాయకునిగా నియమించడమా అని ఉసామా (రజి) నాయకత్వాన్ని అంగీకరించలేక పోతున్నారు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) వ్యాధిగ్రస్త స్థితిలోనే మసీదుకెళ్ళి ప్రసంగిస్తూ ఇలా అన్నారు:

"కొందరు ఉసామా (రజి) నాయకత్వాన్ని అంగీకరించకుండా ఏవేవో మాటలు అంటున్నారు. ఈరోజు వారు ఉసామా నాయకత్వం పట్ల అభ్యంతరం లేవదీస్తుంటే ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. వారు లోగడ అతని తండ్రి నాయకత్వం పట్ల కూడా అభ్యంతరం లేవదీశారు. కాని ఉసామా (రజి)లో సైన్యాధ్యక్ష హోదాకు కావలసిన యోగ్యతా అర్హతలు ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు."

దైవప్రవక్త (సల్లం) చేసిన ఈ ప్రసంగం వినగానే ఉసామా (రజి) నాయకత్వాన్ని ఆక్షేపిస్తూ ఆరోపణలు చేసిన వారు పశ్చాత్తాపం చెంది ఆయన నాయకత్వంలో యుద్ధానికి



పోవడానికి సిద్ధమయ్యారు.

హజ్రత్ ఉసామా (రజి) సైన్యం తీసుకొని మదీనాకు మూడు మైళ్ళ దూరంలో ఉన్న జురుఫ్ అనే ప్రదేశానికి చేరుకొని విడిదిచేశారు. సైన్యంలో ఇంకా చేరవలసినవారు ఉండటం వల్ల ఆయన అక్కడ ఆగిపోయారు. అదీగాక దైవప్రవక్త (స) ఆరోగ్యం ఇంకా కుదుట పడలేదు. ఈ కారణంగానే హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)లు సేనాపతి అనుమతి తీసుకొని నగరానికి తిరిగొచ్చారు. ఆ తర్వాత కొన్నాళ్ళకే దైవప్రవక్త (స) దివంగతులై హజ్రత్ అబూబకర్ (రజి) తొలి ఖలీఫా అయ్యారు.

ఖలీఫా అబూబకర్ (రజి) సైన్యాన్ని తీసుకొని బయలుదేరమని యువసేనాపతి ఉసామా (రజి)ను ఆదేశించారు. దాని ప్రకారం ఉసామా (రజి) సైన్యం తీసుకొని బయలుదేరారు. పట్నంవెలుపల సైనికసమీకరణ జరిగింది. సైన్యంలో ఉమర్(రజి)తోపాటు అనేకమంది అనుభవశాలురైన సహాబీలు ఉన్నారు. యువసేనాని ఉసామా (రజి) ఓసారి సైన్యాన్ని కలియజూసి "గొప్పగొప్ప వాళ్ళంతా సైన్యంలో ఉన్నారు. సైన్యం వెళ్ళిపోయిన తరువాత అవిశ్వాసులు మదీనా మీద దాడిచేసి మీపై, ప్రజలపై ఏదైనా ఆపద తెచ్చిపెడ్తారేమోనని భయపడ్తున్నాను. అంచేత వాళ్ళను మీరు వెనక్కి పిలిపించుకోండి" అని ఖలీఫాకు లేఖ రాసి ఉమర్ (రజి) చేతికిచ్చి పంపారు.

అప్పుడు అన్సార్ సైనికుల్లో కొందరు "సేనాపతిగా ఉసామా (రజి)కు బదులు ఆయనకంటే ఎక్కువ వయస్సున్న, గౌరవప్రదమైన వంశానికి చెందిన మరెవరినైనా నియమిస్తే బాగుంటుంద"ని ఖలీఫాకు మరొక లేఖరాసి ఉమర్ (రజి) చేతికి అందించారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ రెండు లేఖలు తీసుకొని ఖలీఫా సన్నిధికి వెళ్ళారు. ఆయన సేనాపతి లేఖ చదివి "సైన్యంలో అందర్నీ భర్తీచేసి నగరంలో నేనొక్కడినే మిగిలిపోయి, క్రూరజంతువులు వచ్చి నన్ను చీల్చిచెండాడినా సరే, నేను మాత్రం సైన్యం నుండి ఏఒక్కర్నీ వెనక్కి పిలిపించుకోవడంగాని, ఈ దండయాత్రను వాయిదా వేయడంగాని జరగదు" అని అన్నారు.

తరువాత అన్సార్ సైనికులు రాసిన లేఖ చదివి "వీళ్ళ హృదయాల్లో నుంచి జాత్యహంకారం ఇంకా పూర్తిగా సమసి పోలేదు, పద" అంటూ ఉమర్ ఫారూఖ్ (రజి)తో కలసి సైన్యం ఆగిన చోటుకు బయలుదేరారు.

సైన్యం బయలుదేరింది. యువసేనాని అశ్వరూఢుడై నడవసాగాడు. ఖలీఫా అతని గుర్రం పక్కనే పాదాచారి అయి నడవసాగాడు. యువసేనాని సిగ్గు పడిపోతూ "మీరైనా మరోగుర్రం ఎక్కండి లేదా నన్నయినా గుర్రం దిగి నడవనీయండి" అని విన్నవించుకున్నాడు ఖలీఫాతో.

కాని ఖలీఫా ఈ విజ్ఞప్తిని సున్నితంగా తిరస్కరిస్తూ "నేను గుర్రం ఎక్కను; నీవు గుర్రం దిగనవసరమూ లేదు. దైవమార్గంలో కాస్తంత దూరం కాలినడకన నడిస్తే నాకొచ్చే నష్టం ఏమిటీ?" అని అన్నాడు.

ఈ అపూర్వ దృశ్యం చూసి, సమతాసౌభాగ్యం తొణికిసలాడే ఈ మాటలు విని సైనికులందరూ ఆశ్చర్యచకితులయ్యారు. వారిలో కొందరి హృదయాల్లో ఇంకా మిగిలి ఉన్న జాత్యహంకారం, వయోవివక్షలు పూర్తిగా అంతమై విధేయత, సమతా భావాలు చోటుచేసుకున్నాయి. ఖలీఫా అబూబకర్ (రజి) గుర్రం పక్కన కాలినడక నడుస్తూ యువసేనాని ఉసామా (రజి)కు ఇలా హితోపదేశం చేశారు:

"ఉసామా! ఎట్టి పరిస్థితుల్లో కూడా (1) నమ్మకద్రోహానికి పాల్పడకూడదు. (2) అబద్ధమాడకూడదు. (3) వాగ్దానభంగం చేయకూడదు. (4) స్త్రీలు, పిల్లలు, వృద్ధుల్ని హతమార్చకూడదు. (5) పండ్లచెట్లను నరకడంగాని, కాల్చివేయడంగాని చేయ కూడదు. (6) తినడానికి తప్ప ఒంటెలు, మేకలు వగైరా పశువుల్ని చంపకూడదు. (7) ఏదైనా తెగ దగ్గరకు పోయినప్పుడు ముందుగా వారికి ఇస్లాం గురించి ఉపదేశించి దానివైపుకు పిలవాలి. (8) వారిలో ఎవరినైనా కలుసుకుంటే వారి హోదా అంతస్తుల్ని దృష్టిలోపెట్టుకోవాలి. (9) నీముందుకు ఆహారం వచ్చినప్పుడు దేవుని పేరు ప్రస్తావించి తినడం ప్రారంభించాలి. (10) యూదులు, క్రైస్తవుల్లో ప్రాపంచికవ్యవహారాలు వదిలేసి సన్యాసులై తమ మఠాలలో కూర్చుండిపోయినవారి జోలికి పోకూడదు.

ఇక దైవప్రవక్త (సల్లం) చేయమని ఆదేశించిన పనుల్లో ఏఒక్క పనినైనా వదిలేయడంగాని లేదా అదనంగా చేర్చడంగాని ఏమాత్రం చేయకూడదు. దేవుని పేరుతో నడుం బిగించి దైవమార్గంలో సత్యతిరస్కారులతో పోరాడు."

ఖలీఫా సేనాపతి ఉసామా (రజి)కు ఇలా హితబోధ చేసిన తర్వాత వెనుదిరిగి నగరానికి బయలుదేరారు. ఆ సమయంలో ఆయన "ఉసామా! నీవు అనుమతిస్తే నాకు సలహా, సహాయకారాలు అందజేయడానికి ఉమర్ (రజి) నాదగ్గర నగరంలో ఉండిపోతాడు" అని అన్నారు తిరుగులేని సామ్రాజ్యాధినేత అయివుండి కూడా తన క్రింది అధికారి అనుమతి కోరుతూ. దానికి సేనాని ఉసామా (రజి) సంతోషంగా అంగీకరించారు. ఈ అనుమతి లభించగానే ఉమర్ ఫారూఖ్ (రజి) సైన్యం నుండి వేరయి ఖలీఫా అబూబకర్ (రజి)తో కలిసి నగరానికి వెళ్ళిపోయారు.

ఉసామా బిన్ జైద్ (రజి) నేతృత్వంలో ముస్లింసేన బయలుదేరి దరూన్, బల్ఖాన్ లోయల్లో రోమన్ సైనికుల్ని ఢీకొన్నది. భీకరయుద్ధం జరిగింది. చివరికి రోమన్ సైనికులు ఘోరంగా పరాజితులై పారిపోయారు. ముస్లింయోధులు అపార సమర సొత్తు తీసుకొని విజయదరహాసంతో వెనుదిరిగారు.



ఖలీఫా ఉమర్ (రజి) బంధుప్రీతికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉండేవారు. చివరికి ప్రజల ఉపకారవేతనం నిర్ణయించడంలో కూడా తన బంధువులపై ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. ఆయన ఉసామా బిన్ జైద్ (రజి)కు నిర్ణయించిన ఉపకారవేతనం కంటే తన కన్నకొడుకు అబ్దుల్లా (రజి)కు తక్కువ ఉపకారవేతనం నిర్ణయించారు.

దానిపై అబ్దుల్లా (రజి) ఇలా ఎందుకు చేశారని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త (సల్లం) నీకంటే ఉసామా (రజి)ను ఎక్కువగా ప్రేమించేవారు; ఆయన నీ తండ్రి కంటే ఉసామా (రజి) తండ్రి (జైద్)ని ఎక్కువగా అభిమానించేవారు."

# 10. బిలాల్ (రజి)

దైవప్రవక్త (స) కాలంలో ఇస్లాంధర్మాన్ని విశ్వసించి అత్యంత కఠినపరీక్షలలో నెగ్గిన అదృష్టవంతుల్లో హజ్రత్ బిలాల్ (రజి) కూడా ఒకరు. ఈయన ఉమయ్యా బానిసగా ఉండేవారు. కేవలం ఇస్లాంని విశ్వసించినందువల్ల ఆయన్ని ఉమయ్యా రకరకాలుగా హింసించసాగాడు. అప్పుడప్పుడు కూడూనీళ్ళూ ఇవ్వకుండా కడుపు మాడ్చేవాడు.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం ఆ కిరాతకుడు హజ్రత్ బిలాల్ (రజి)ని కాళ్ళుచేతులు కట్టి మండుటెండలో ఇసుక మీద పండబెట్టించాడు. అక్కడే నిల్చున్న ఉమయ్యా స్నేహితులు బిలాల్ (రజి) బాధపడుతుంటే వెకిలిగా నవ్వసాగారు. ఆ దుర్మార్గుడు అంతటితో కసితీరక ఓ బండరాయిని దొర్లిస్తూ తీసుకొచ్చి బిలాల్ (రజి) ఛాతీ మీద పెట్టి ఇలా అన్నాడు:

"ఇప్పటికైనా మించిపోయిందిలేదు. ఇస్లాం విడిచిపెట్టి లాత్, ఉజ్జా విగ్రహాలను పూజించు. లేకపోతే నీ గతి ఇంతే. చచ్చేవరకు నిన్ను వదలిపెట్టను."

హజ్రత్ బిలాల్ (రజి) వీపు కింద ఇసుక ఆయన దేహాన్ని చురచురా కాలుస్తోంది. పైగా పుండుమీద కారం చల్లినట్లు ఎద మీదున్న బండరాయి బరువుకు ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆ బాధలోనే ఊపిరి బిగబట్టి 'అహద్! అహద్!!' (దేవుడొక్కడే, దేవుడొక్కడే) అని అన్నారు ఏమాత్రం సడలని విశ్వాసంతో.

ఓరోజు మహాప్రవక్త ముహమ్మద్ (స) అటుగా రావడం జరిగింది. విషాదకరమైన ఈ దృశ్యం చూసి ఆయన చలించిపోయారు. ఆవేదనాపూరిత హృదయంతో "బిలాల్! ఓర్చుకో. కరుణామయుడైన అల్లాహ్ నీకు త్వరలోనే విముక్తి కలిగిస్తాడు" అని అన్నారు ఆయన సానుభూతి వ్యక్తపరుస్తూ.

హజ్రత్ అబూబకర్ (రజి) బిలాల్ (రజి) పడుతున్న బాధలు చూడలేక పోయారు. ఒకరోజు ఆయన ఉమయ్యా ఆటవిక చర్యలు చూసి “ఉమయ్యా! నీకు కాస్తయినా దైవభీతి లేదా? ఆ అమాయకుడ్ని అలా బాధిస్తున్నావు, నువ్వెంత నిర్దయుడవయ్యా!” అన్నారు.

“అసలు నువ్వే ఇతడ్ని నాశనం చేశావు. ఎందుకూ పనికిరాని ఇలాంటి వాడ్ని పెట్టుకొని నేనేం చేసుకోను?”

“అలాగయితే నా దగ్గర విగ్రహారాధకుడయిన బానిస ఉన్నాడు. నువ్వతడ్ని తీసుకొని బిలాల్ (రజి)ని నాకివ్వు.”

“సరే, నీ బానిసను నాకిచ్చేసి ఇతడ్ని తీసికెళ్ళు” అన్నాడు ఉమయ్యా తనకు మంచి బానిస లభించబోతున్నాడనే సంతోషంతో.

హజ్రత్ అబూబకర్ (రజి) తన బానిసను ఉమయ్యాకు ఇచ్చి అతని దగ్గర్నుంచి హజ్రత్ బిలాల్ (రజి)ని తీసుకున్నారు. ఆ తరువాత వెంటనే బిలాల్ (రజి)ని శాశ్వతంగా బానిసత్వం నుంచి విముక్తం చేశారు.

హజ్రత్ బిలాల్ (రజి) కంఠస్వరం బిగ్గరగా, గంభీరంగా ఉంటుంది. అందువల్ల దైవప్రవక్త (స) ఆయన్ని ముఅజ్జిన్‌గా నియమించారు. ఆయన ప్రతి నమాజ్ వేళకు వచ్చి మసీదు పక్కనుండే ఇంటికప్పుపై నిలబడి అజాన్ పిలుపునిచ్చేవారు. ఇలా ఆయన దైవప్రవక్త (స) జీవించి ఉన్నంత కాలం మదీనాలో ముఅజ్జిన్‌గా పనిచేశారు. దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఆయనకు ముఅజ్జిన్‌గా పనిచేయడానికి మనస్కరించలేదు.

ఆతర్వాత ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు బైతిల్‌మఖ్దిస్ (జెరూసలేం)ని జయించిన పిదప ఓరోజు నమాజ్ వేళయినప్పుడు ఉమర్‌ఫారూఖ్ (రజి) అజాన్ చెప్పమని హజ్రత్ బిలాల్ (రజి)ని కోరారు. దానికాయన “దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఎవరడిగినా అజాన్ చెప్పనని నిర్ణయించుకున్నాను. కాని ఈరోజు మీఆజ్ఞ పాటిస్తున్నాన”ని సమాధానమిచ్చి అజాన్ చెప్పారు. హజ్రత్ బిలాల్ (రజి) నోట అజాన్ వినగానే దైవప్రవక్త (స) కాలంనాటి మధురస్మృతులు గుర్తుకొచ్చి సహాబీలలో అప్రయత్నంగా దుఃఖం పొర్లుకొచ్చింది. చాలా సేపటిదాకా వారి కళ్ళు చిల్లులుపడిన నీటికడవలై పోయాయి.

# 11. సయీద్ బిన్ జైద్ (రజి)

హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) ఇస్లాం స్వీకరించిన ప్రప్రథమ విశ్వాసుల్లోని వారు. ఇస్లాం స్వీకరించేనాటికి ఆయన వయస్సు ఇరవై ఏండ్లే. ఆయన భార్య ఫాతిమా బిన్తె ఖత్తాబ్ (రజి) కూడా ఇస్లాం స్వీకరించారు. వారిద్దరు కలసి ఉమర్ బిన్ ఖత్తాబ్



(రజి)ని కూడా ఇస్లాంపరిధిలోకి తెచ్చారు. ఇస్లాం స్వీకరించిన తరువాత సయీద్ బిన్ జైద్ (రజి) బదర్‌యుద్ధంలో తప్ప దైవప్రవక్త (స)తో కలసి అన్ని యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆ తరువాత కూడా అనేక యుద్ధాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా యర్మూక్ యుద్ధంలో ఆయన ప్రదర్శించిన ప్రతిభాపరాక్రమాలు ఎంతో ప్రశంసనీయమైనవి.

సయీద్ బిన్ జైద్ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి)కు బావ అవుతారు. అంతేగాక వరుసకు సోదరుడు (పినతండ్రి కుమారుడు) కూడా అవుతారు. ఆయన దైవప్రవక్త (స)తో కలసి బదర్‌యుద్ధం తప్ప అన్ని యుద్ధాల్లో పాల్గొన్నారు. బదర్ యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) ఆయనకు వేరే బాధ్యత అప్పగించారు. అంచేత సయీద్ (రజి) బదర్‌యుద్ధంలో పాల్గొనక పోయినా దైవప్రవక్త (రజి) ఆయన్ని బదర్‌ముజాహిద్‌ల జాబితాలో చేర్చి, బదర్ సమరసొత్తులో ఆయనకు వాటా ఇచ్చారు.

ఒకరోజు కూఫా జామియామస్జిద్‌లో హజ్రత్ అలి(రజి) గురించి ఒకతను అభ్యంతర కరమైన మాటన్నాడు. హజ్రత్ సయీద్ (రజి) ఆమాట విని “అబూబకర్, ఉమర్, ఉస్మాన్, అలి, తల్హా, జుబైర్, అబూఉబైదా, సాద్ బిన్ అబీవఖ్ఖాస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)- ఈ తొమ్మిదిమంది పదిమంది స్వర్గవాసులవుతారని చెప్పబడినవారిలోని వారు” అని అన్నారు. అప్పుడు మరొకవ్యక్తి ఈమాట విని “అయ్యా! మీరు చెప్పింది బాగానే ఉంది కాని, ఆ పదవ స్వర్గవాసి ఎవరో చెప్పలేదేమిటీ? ఆయన పేరు కూడా చెప్పండి” అని అడిగాడు. సయీద్ (రజి) దానికి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయారు. అంచేత అతను ఆ పదవ స్వర్గవాసి ఎవరో చెప్పితీరాలని పట్టుబట్టాడు. దాంతో హజ్రత్ సయీద్ (రజి) ఇక చెప్పక తప్పదని భావించి, ఆ పదవ వ్యక్తి నేనే” అన్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకు ఆయన మదీనా వెళ్ళిపోయారు.

అమీర్ ముఆవియా (రజి) పాలనాకాలంలో హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి)కు ఎదురైన ఒక సంఘటన చాలా ఖ్యాతిచెందింది. ఒకసారి మదీనాలో అర్వా బిన్తె ఉవైస్ అనే ఓ స్త్రీ ఒక స్థలం విషయంలో హజ్రత్ సయీద్ (రజి)పై న్యాయస్థానంలో అబద్ధపుదావా వేసింది. ఆమె తన స్థలంలో కొంత భాగాన్ని హజ్రత్ సయీద్ (రజి) ఆక్రమించుకున్నారని ఆరోపించింది. ఆమె ఇంతకు ముందే ఈ విషయాన్ని ప్రజల్లో తిరిగి ప్రచారం చేసింది. అంచేత గవర్నర్ మర్వాన్ నిజానిజాలు తెలుసుకోవడానికి కొంతమంది ప్రజలను హజ్రత్ సయీద్ (రజి) దగ్గరకు పంపాడు. ఈ విషయం హజ్రత్ సయీద్ (రజి) హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. ఆయన వారి ముందు దైవప్రవక్త (స) ప్రవచించిన ఈక్రింది హితోక్తిని ప్రస్తావించారు: “ఎవరైనా ఇతరుల స్థలంలో ఒక జానెడు స్థలం ఆక్రమించుకున్నా ప్రళయదినాన దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు.”

ఈ హితోక్తి చెప్పిన తర్వాత సయీద్ బిన్ జైద్ (రజి) ఆ స్త్రీని శపిస్తూ "దేవా! ఆ స్త్రీ తనపై నేను దౌర్జన్యం చేశానని చెబుతోంది. ఆమె తన వాదనలో అబద్ధాల మారి అయితే ఆమెను గుడ్డిదాన్ని చేసి నేను ఆక్రమించానని పోట్లాడుతున్న స్థలం లోని బావిలో పడవెయ్యి" అని అన్నారు. ఇలా శపించిన కొన్నాళ్ళలోనే ఆ స్త్రీ కళ్ళు పోయాయి. దాంతో ప్రజలు సయీద్ బిన్ జైద్ (రజి) సత్యవంతులని, ఆ స్త్రీయే అబద్ధాలమారి అని తెలుసుకున్నారు. ఆ తరువాత మరికొన్నాళ్ళకు ఆ అంధురాలు తన స్థలంలో దేవులాడుతూ తిరుగుతూ అదే నూతిలో పడి చనిపోయింది.

హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) హి.శ. 51వ సంవత్సరంలో డెబ్భయి రెండేళ్ళ వయసులో ఇహలోకం వీడిపోయి తమ ప్రభువుని కలుసుకున్నారు.

## 12. ఉమైర్ బిన్ సాద్ (రజి)

దైవప్రవక్త (స)ను అమితంగా అభిమానించే ఉమైర్ బిన్ సాద్ (రజి) అనాథ బాలుడయ్యాడు. అతని తండ్రి సాద్ ఎలాంటి ఆస్తిపాస్తులు వదలకుండా చనిపోయాడు. అంచేత కొన్నాళ్ళ తర్వాత ఉమైర్ తల్లి అవస్‌తెగకు చెందిన జులాస్ అనే ఓ శ్రీమంతుడ్ని వివాహమాడింది. ఆనాటి నుండి ఉమైర్ (రజి)ని జులాస్ తన సంరక్షణలోకి తీసుకొని కన్నతండ్రిలా చూసుకోసాగాడు. ఉమైర్ కూడా జులాస్‌ని అమితంగా ప్రేమించసాగాడు.

హి.శ. 9లో దైవప్రవక్త (స) రోమన్‌లను ప్రతిఘటించే ఉద్దేశ్యంతో తబూక్ దండయాత్రకు సన్నాహాలు ప్రారంభించారు. దానికి ధనకనకవస్తు సహాయం కోసం అనుచరుల్ని ప్రోత్సహించారు. దైవప్రవక్త (స) హితోక్తులతో ఉత్తేజితులైన అనుచరులు ఈ సహాయం అందజేయడంలో ఒకరికొకరు పోటీపడ్డారు. కొందరు తమ తాహతుకు మించిన సహాయం కూడా అందజేశారు. అనేకమంది ఉరకలువేసే ఉత్సాహంతో తబూక్‌దండయాత్రలో పాల్గొనడానికి ముందుకొచ్చారు. కాని జులాస్‌లో ఈ దండయాత్ర విషయమై ఏమాత్రం కదలిక కానరాలేదు.

అప్పుడు ఉమైర్ (రజి) జులాస్‌లో దండయాత్ర పట్ల ఉత్సాహం రేకెత్తించడానికి ఎంతగానో ప్రయత్నించాడు. దైవప్రవక్త (స) ముందు అనుచరులు వ్యక్తపరచిన ఉత్సాహం, వారు అందజేసిన ధనకనకవస్తు సహాయం వగైరా దృశ్యాలు అతనికి వర్ణించి చెప్పాడు. చివరికి వాహన సహాయం లభించని పేద ముజాహిద్‌లు తాము జిహాద్‌పుణ్యానికి నోచుకోలేకపోతున్నామే అన్న భావనతో కంటతడి పెట్టుకొని ఇండ్లకు వెళ్ళిపోయిన సంగతి కూడా ఉమైర్ (రజి) ఎంతో ఆవేదనతో జులాస్‌కు తెలియజేశాడు.

అయినప్పటికీ జులాస్‌లో చలనం రాలేదు. పైపెచ్చు అతని నోట అవిశ్వానికి దారితీసే పలుకులు వెలువడ్డాయి. "ఒకవేళ ఇతను చెప్పే మాటలు, చేసే పనులు



నిజంగా సత్యప్రాతిపదికమైనవే అయితే మనం గాడిదల కన్నా నికృష్టులవుతాము" అని అన్నాడతను.

ఈ అవిశ్వాస మాటలు విని ఉమైర్ (రజి) నిర్ఘాంతపోయాడు. క్షణం పాటు రాతిబొమ్మలా కళ్ళప్పగించి చూడటం తప్ప నోట మాట పెగల్లేదు. ఆ తరువాత దీర్ఘాలోచనలో పడ్డాడు.

తాను దైవప్రవక్త (స) తరువాత ఈలోకంలో ఎవరినైనా అమితంగా అభిమానిస్తున్నా డంటే అతను జులాసే. అతనే తనకు తండ్రి మరణానంతరం పితృప్రేమ ప్రసాదిం చాడు. ఎలాంటికొరత లేకుండా సమస్తసౌకర్యాలు కల్పించాడు. అలాంటి మహోపకారి నోట వెలువడిన ఈ అవిశ్వాస పలుకులు దైవప్రవక్త (స)కు చేరవేయకుండా దాచితే ఇస్లాం పట్ల నమ్మకద్రోహం అవుతుంది. ఒకవేళ దైవప్రవక్త (స)కు చేరవేస్తే మేలు చేసినవాడి పట్ల కృతఘ్నత అవుతుంది. ఉమైర్ ఎటూతేల్చుకోలేక తలపట్టుకున్నాడు. అయితే అతని అంతరాత్మ ఇస్లాం వైపుకే మొగ్గింది. అప్పుడతను ఇలా అన్నాడు:

"జులాస్! దైవసాక్షిగా చెబుతున్నాను. దైవప్రవక్త (స) తర్వాత ఈ భూమండలంపై నేను ఎవరినైనా అమితంగా అభిమానిస్తున్నానంటే ఆ వ్యక్తి మీరే. కాని మీరు అవిశ్వాస మాటలు పలికి ఇస్లాం పరిధిని అతిక్రమించారు. అంచేత నేను మీరన్న ఈ మాటలను దైవప్రవక్త (స)కు తప్పక చేరవేస్తాను. దాంతో మీరు నలుగురిలో అభాసుపాలవుతారు."

ఆ తరువాత ఉమైర్ (రజి) దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి జులాస్ అన్న మాటలన్నీ చెప్పాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఒక అనుచరుడి ద్వారా జులాస్‌ని పిలిపించి ఉమైర్ చెప్పిన మాటలకు వివరణ అడిగారు. జులాస్ ఏమాత్రం తడుముకోకుండా "ఉమైర్ అబద్ధం చెబుతున్నాడు. నేనీ మాటలు అనలేదు. ఇది నామీద పచ్చి నిందారోపణ" అని అన్నాడు. ప్రవక్త అనుచరులు వారిద్దరిలో ఎవరు అబద్ధం చెబుతున్నారో తేల్చుకో లేక ఇద్దరినీ మార్చిమార్చి అనుమానాస్పదంగా చూడసాగారు.

ఒక కపటవిశ్వాసి ఉమైర్ వైపు ఉరిమిచూస్తూ "ఈ అబ్బాయి చేసిన మేలు మరిచిపోయే కృతఘ్నుడు, అవిధేయుడు. తనకు మేలుచేసిన ఉపకారికే కీడు తలపెట్ట డానికి సిద్ధమయ్యాడు" అని అన్నాడు. మరొకతను మాట్లాడుతూ "కాదు. ఇతను మంచి పిల్లవాడు; దైవవిధేయతలో పెరిగాడు. ఈ అబ్బాయి ముఖవర్చస్సు ఇతని సత్యసంధతను బహిర్గతం చేస్తోంది" అని అన్నాడు.

తన ఆరోపణ గురించి దైవప్రవక్త (స) ఏమీ మాట్లాడకపోవడంతో ఉమైర్ (రజి)కు దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీళ్ళు చెంపల మీదుగా కారసాగాయి. తల పైకెత్తి చూస్తూ "దేవా! జులాస్ గురించి నేను చేసిన ఆరోపణను ధృవీకరిస్తూ నీ ప్రవక్తపై ఏదైనా సందేశం అవతరింపజెయ్యి" అని ప్రార్థించాడు.

జులాస్ తనను కాపాడుకోవడానికి "దైవప్రవక్తా! కావాలంటే మీరు మా ఇద్దరి చేత ప్రమాణం చేయించండి. నేను దైవసాక్షిగా చెబుతున్నాను. ఉమైర్ నా గురించి మీ ముందు పలికిన మాటలు నేను అనలేదు" అంటూ ప్రమాణం చేశాడు. జులాస్ ప్రమాణం చేసిన మరుక్షణమే దైవప్రవక్త (స) పరిస్థితి మారసాగింది. దాంతో అనుచరులు ఆయనపై దైవసందేశం అవతరిస్తోందని భావించి నిశ్శబ్దంగా, తదేకంగా ఆయన వైపు చూస్తూ, ఆ దివ్యసందేశం ఏమయి ఉంటుందోనని ఎంతో కుతూహలంతో ఎదురు చూస్తున్నారు. జులాస్‌లో వణుకుడు పుట్టింది. అతని గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

కాస్సేపటికి దైవప్రవక్త (స)లో దివ్యావిష్కృతి అవతరణ పరిస్థితి తగ్గిపోయింది. అప్పుడాయన ఈక్రింది ఖుర్ఆన్ సూక్తులు విన్పించారు:

"వారు దేవుని మీద ప్రమాణం చేస్తూ తామా మాట అనలేదని అంటున్నారు. కాని వారా అవిశ్వాసపు మాటన్నారు. ఇస్లాం స్వీకరించిన తర్వాత (ఇలాంటి వికృతచేష్టలతో) తిరిగి అవిశ్వాసానికి పాల్పడ్డారు. వారు (ప్రవక్తకు వ్యతిరేకంగా) ఏదో చేయాలనుకున్నారు. కాని చేయలేకపోయారు. అసలు వారి కసి–కోపం దేవుడు, ఆయన ప్రవక్త తమ అనుగ్రహంతో వారిని ఐశ్వర్యవంతులుగా చేశారనేనా? ఇప్పటికైనా వారు తమవైఖరి మార్చుకుంటే (మంచిది). అందులోనే వారి శ్రేయస్సుంది. వారు తమ వైఖరి మార్చుకోకపోతే మాత్రం దేవుడు వారికి అతి బాధాకరమైన శిక్ష విధిస్తాడు– ఇహంలోనూ, పరంలోనూ. యావత్ప్రపంచంలో వారికి మద్దతిచ్చేవారు, సహాయం చేసేవారు ఎవరూ ఉండరు. (9:74)

జులాస్ ఈ సూక్తులు వినగానే భయంతో వణికిపోతూ రెండు క్షణాలు నోట మాట పెగల్లేదు. ఆ తరువాత ఎలాగో తనను తాను సంబాళించుకొని "దైవప్రవక్తా! ఉమైర్ నిజమే చెప్పాడు. నేనే అబద్ధీకుడ్ని. నన్ను క్షమించండి. నా పాపక్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థించండి" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఉమైర్ వైపు చూశారు. అప్పుడు ఉమర్ ముఖం కళాకాంతులు వెదజల్లుతోంది. కళ్ళ నుండి ఆనందభాష్పాలు రాలుతున్నాయి. దైవప్రవక్త (స) ఉమైర్ (రజి) చెవి పట్టుకొని "అబ్బాయ్! నీ చెవులు నిజాన్నే విన్నాయి. నీ ప్రభువు నీ మాటల్ని ధృవీకరించాడు" అని అన్నారు.

జులాస్ ఇప్పుడు పూర్తిగా ఇస్లాం పరిధిలోకి వచ్చాడు. అంతేకాదు, అతను ఉమైర్‌ని ఇదివరకటి కంటే ఎంతో ఎక్కువగా అభిమానించసాగాడు. ఆ అబ్బాయికి ఎలాంటి లోటు రాకుండా పోషించసాగాడు.

ఉమర్ బిన్ సాద్ (రజి) బాల్యచిత్రం ఎంత అందంగా, ఆకర్షనీయంగా ఉండేదో పాఠకులు తెలుసుకున్నారు. ఆయన యౌవనచిత్రం అంతకంటే ఎంతో సుందరంగా, మనోహరంగా ఉంది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఉమైర్ బిన్



సాద్ (రజి) అనేక యుద్ధాల్లో పాల్గొని దైవమార్గంలో జిహాద్ పట్ల ఎనలేని తన ఆసక్తి, ఉత్సాహాలను వ్యక్తపరిచారు.

హమస్ రాష్ట్రప్రజలు తమ గవర్నర్‌ల మీద ఏదో విధంగా ఆరోపణలు చేయడానికి అలవాటుపడ్డారు. అందువల్ల ఖలీఫా ఉమర్ (రజి) హమస్‌వాసుల నుండి ఎలాంటి ఆరోపణలకు ఆస్కారం రాకుండా పాలించే గవర్నర్‌ని నియమించాలని భావించి అన్వేషించారు. చివరికి ఆయన దృష్టి హజ్రత్ ఉమైర్ బిన్ సాద్ (రజి) మీద పడింది. ఉమైర్ బిన్ సాద్ (రజి) ఆ రోజుల్లో సిరియాకు చెందిన అల్‌జజీరా ప్రాంతంలో ఒక సైనికదళానికి నాయకత్వం వహించి అనేక పట్టణాలపై, కోటలపై విజయపతాకాలు ఎగరేస్తూ అప్రతిహతంగా ముందుకు దూసుకుపోతున్నారు. అయినప్పటికీ ఖలీఫా ఉమర్ (రజి) ఆయన్ని యుద్ధరంగం నుండి వెనక్కి పిలిపించి హమస్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించి పంపించారు.

హమస్ గవర్నర్‌గా ఉమైర్ బిన్ సాద్ (రజి) పూర్తిగా ఒక సంవత్సరం పని చేశారు. కాని అప్పటినుంచి ఆయన ఖలీఫాకు ఉత్తరం రాయడంగాని, కేంద్ర ప్రభుత్వ ధనాగారానికి రెవన్యూపైకం పంపడంగాని చేయలేదు. అందువల్ల ఖలీఫా ఉమర్ (రజి)కు ఆయనపై అనుమానం వచ్చి తన కార్యదర్శిని పిలిచి ఇలా ఆదేశించారు: "నా తరపున హమస్ గవర్నర్‌కు ఇలా ఓ లేఖ రాసి పంపించు- 'విశ్వాసుల నాయకుని లేఖ అందగానే నీవు హమస్ వదలిపెట్టి మదీనా వచ్చెయ్యి. వచ్చేటప్పుడు నీవు ఇప్పటిదాకా నీ రాష్ట్రంలో వసూలు చేసిన రెవున్యూపైకం తీసుకొనిరా."

ఈ లేఖ అందగానే హజ్రత్ ఉమైర్ బిన్ సాద్ (రజి) రొట్టెలపాత్ర, నీళ్ళతిత్తి, ఓ ముంత భుజాన వేసుకొని, చేతిలో ఈటె తీసుకొని హమస్ నుంచి కాలినడకన బయలుదేరి మదీనా చేరుకున్నారు. సుదీర్ఘ ప్రయాణం, ఆకలిదప్పులతో ఆయన ముఖం బాగా వాడిపోయి, శిరోజాలు, గడ్డం పెరిగిపోయి దుమ్ముకొట్టుకొని ఉన్నాయి. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన్ని చూడగానే నిర్ఘాంతపోయి చూస్తూ "ఉమైర్! ఏమిటీ వేషం, క్షేమంగానే ఉన్నావు కదూ?" అని అడిగారు. దానికి ఉమైర్ (రజి) "దేవుని దయవల్ల నేను క్షేమంగానే ఉన్నాను. మీ ఆజ్ఞ ప్రకారం నేను నా యావదాస్తి తీసుకొని వచ్చాను" అని అన్నారు.

"సరే, ఇంతకూ ఏం తెచ్చావు?" అడిగారు ఖలీఫా ఉమర్ (రజి). దానికి ఉమైర్ (రజి) "ఇదిగో ఇది నా రొట్టెలపాత్ర, ఇది నీళ్ళతిత్తి, ఇది నేను ఉజూ, స్నానం చేసుకునే ముంత. ఇవి తప్ప ఇతర ఐహికసంపదేదీ నాకవసరం లేదు" అన్నారు ఉమైర్ (రజి).

ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాటలు విని క్షణం పాటు నివ్వెరపోయారు. హజ్రత్ ఉమైర్ (రజి) అంతదూరం నుంచి కాలినడకన వచ్చారని తెలుసుకొని "స్వారీ కోసం

ప్రభుత్వ ధనాగారం నుంచి గుర్రం ఏదీ లభించలేదా?'' అని అడిగారు ఆయన. దానికి ఉమైర్ (రజి) ''దానికోసం నేను కోశాధికారిని అడగలేదు. ఆయన కూడా నాకు ఎలాంటి వాహనం సమకూర్చలేదు'' అని చెప్పారు. ''సరే, నీవు కేంద్ర ధనాగారం కోసం తెచ్చిన పైకం ఎక్కడుంది?'' అని అడిగారు ఖలీఫా. దానికి ఉమైర్ (రజి) తాను ఎలాంటి పైకం తీసుకురాలేదని చెప్పారు. ఎందుకని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు:

''నేను హమస్‌కు చేరుకోగానే అధికారుల్ని పిలిపించి వారికి శిస్తు వసూలుచేసే బాధ్యత అప్పగించాను. అలా వసూలయ్యే పైకాన్ని వారి సలహాలతోనే పేదలకు పంచిపెడ్తుండేవాడ్ని.'' ఖలీఫా ఉమర్ (రజి) ఈ సమాధానం విని ప్రభుత్వకార్యదర్శిని పిలిచి ''హమస్‌లో ఈయన గవర్నర్ పదవిని పునరుద్ధరిస్తూ ఉత్తర్వు జారీచెయ్యి'' అని అన్నారు.

హజ్రత్ ఉమైర్ బిన్ సాద్ (రజి) ఈమాట విని ''విశ్వాసులనాయకా! ఇప్పుడు నేనీ బాధ్యతాభారం మోయలేను'' అంటూ తన అశక్తత వెలిబుచ్చారు. తర్వాత ఆయన ఖలీఫా అనుమతి తీసుకొని మదీనాశివార్లలో తన కుటుంబం నివసిస్తున్న గ్రామానికి వెళ్ళి ఉండసాగారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు ఖలీఫా ఉమర్ (రజి) నమ్మకస్తుడైన హారిస్ (రజి)ని పిలిచి ''నీవు ఉమైర్ ఇంటికెళ్ళి రెండుమూడు రోజులు ఆయనకు అతిథిగా ఉండి ఆయన ఆర్థిక పరిస్థితి గమనించు. ఆర్థికంగా ఆయన బాగుంటే వెంటనే వచ్చి నాకు తెలియ జెయ్యి. ఒకవేళ ఆయన ఇంట్లో దారిద్ర్యం తాండవిస్తుంటే ఈ వంద దీనార్లు ఆయనకు ఇచ్చి వచ్చేసెయి'' అన్నారు డబ్బుసంచి ఆయన చేతికి అందిస్తూ.

హారిస్ (రజి) మదీనా నుండి ఉమైర్ (రజి) ఇంటికి వెళ్ళి ఆయనకు అతిథిగా ఉండసాగారు. ఇలా ఆయన మూడురాత్రులు గడిపారు. ప్రతిరాత్రీ తినడానకి ఆయనకు ఉమైర్ గృహస్థులు ఒక రొట్టె ఇచ్చేవారు. మూడోరోజు ఉమైర్ (రజి) తెగమనిషి ఒకతను వచ్చి హారిస్ (రజి)తో ''నీవు ఉమైర్‌కుటుంబాన్ని తీవ్రమైన ఆందోళనకు గురిచేశావు. వీరి దగ్గర ఒకేఒక రొట్టె ఉంటుంది. అది నీకిచ్చి వారు పస్తులుంటున్నారు. కావాలంటే నీవు మాఇంటికొచ్చి ఉండు. అంతేగాని వీళ్ళను కష్టాల్లో పడవేయకు'' అని అన్నాడు.

ఆ తరువాత హారిస్ (రజి) ఉమైర్ (రజి) దగ్గరకు వెళ్ళి ఖలీఫా ఇచ్చిపంపిన డబ్బుసంచి తీసి చూపిస్తూ ''ఈడబ్బు మీకోసం ఖలీఫాగారు ఇచ్చారు, తీసుకోండి'' అన్నారు. ఉమైర్ (రజి) దాన్ని చూడగానే ''ఈ డబ్బు తీసికెళ్ళి ఖలీఫాకే తిరిగిచ్చేయి. ఆయనకు నా సలాం అందజేసి నాకీ పైకం అవసరం లేదని చెప్పు'' అన్నారు.



ఉమైర్ బిన్ సాద్ (రజి) భార్య ఈ మాటలు విని ''డబ్బు వాపసుచేయకండి. మీకవసరం లేకపోతే ఇక్కడ పేదలు చాలామంది ఉన్నారు, వాళ్ళకు ఇచ్చేద్దాం'' అని అన్నారు. హజ్రత్ హారిస్ (రజి) డబ్బుసంచి హజ్రత్ ఉమైర్ (రజి) ముందు వదిలేసి వెళ్ళిపోయారు. ఉమైర్ (రజి) ఆ రాత్రే ఆ డబ్బును చిన్నచిన్న సంచుల్లో పెట్టి వాటిని పేదలకు పంచారు.

హారిస్ (రజి) మదీనా తిరిగొచ్చి ఖలీఫాకు నివేదిక సమర్పించారు. ఉమైర్ (రజి) ఆ డబ్బు ఎలా వాడారని అడిగితే, హారిస్ (రజి) తనకు తెలియదని, అయితే ఆయన దాన్ని తన సొంతానికి వాడుకొని ఉండరని అన్నారు. ఖలీఫా ఈమాట విని ఒక ఉత్తరం రాసి ఉమైర్ (రజి)ని మదీనాకు రప్పించుకున్నారు.

అప్పుడాయన ఉమైర్ (రజి)ని ''నువ్వా డబ్బు ఎలా వినియోగించావ''ని అడిగారు. దానికి ఉమైర్ (రజి) ''మీరా డబ్బును నాకిచ్చేసిన తర్వాత ఇక దాని అవసరం మీకేమిటీ?'' అన్నారు. ''ఏమీ లేదు. ఏదో తెలుసుకోవాలని అడుగుతున్నాను, అంతే'' అన్నారు ఖలీఫా ఉమర్ (రజి).

దానికి ఉమైర్ (రజి) సమాధానమిస్తూ ''సంతానం, సిరిసంపదలు ఏవీ పనికిరాని రోజు ఆ డబ్బు నాకెంతో ఉపయోగపడుతుందన్న ఉద్దేశ్యంతో దాన్ని నేను పరలోకంలో జమచేశాను'' అని అన్నారు.

ఈ సమాధానం వినగానే ఖలీఫా కండ్లు అశ్రుపూరితాలయ్యాయి. ఆ తరువాత ఆయన ఉమైర్ (రజి)కు ఒక బస్తా ధాన్యం, ఒక జత బట్టలు తెచ్చి ఇవ్వమని కోశాధికారిని ఆదేశించారు. ఉమైర్ (రజి) ఈమాట విని ''నాకు ధాన్యం అవసరం లేదు. దేవుడు మాకు ఉపాధి ఏర్పాటు చేశాడు. కాకపోతే బట్టలు మాత్రం ఇప్పించండి. నా భార్య బట్టలు బాగా మాసి చీకిపోయాయి'' అని అన్నారు.

ఇదీ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి), ఆయన గవర్నర్‌ల పరిస్థితి. ప్రజాసంక్షేమమే వారి ప్రధానోద్దేశ్యం.

# 13. అబూదర్దా అన్సారీ (రజి)

మదీనాలో అబూదర్దా ఇంటి నుంచి తన దుకాణం వైపుకు బయలుదేరాడు. బదర్‌లో ముస్లింలు మక్కాఖురైషీయుల్ని మట్టికరిపించి విజయోత్సాహంతో మదీనాకు తిరిగొస్తున్నారు. అబూదర్దా ఎదురుగా వస్తున్న ముస్లింలలో ఒక యోధుడ్ని పలకరిస్తూ అబ్దుల్లా బిన్ రవాహ్ ఎలా ఉన్నాడని అడిగాడు. దానికా యోధుడు ''దేవుని దయవల్ల నిక్షేపంగా ఉన్నాడు. రణరంగంలో సింహకిశోరంలా పోరాడుతూ అనేకమంది శత్రువుల్ని నేలకూల్చి విజయదరహాసంతో తిరిగొస్తున్నాడు'' అని అన్నాడు.

అబూదర్దా, అబ్దుల్లా బిన్ రవాహా ప్రాణమిత్రులు. మదీనాలో ఇస్లాం ప్రభంజనం వీచినపుడు అబ్దుల్లా (రజి) ఇస్లాం స్వీకరించి ముస్లింలలో చేరిపోయారు. కాని అబూదర్దా తన వ్యాపారకార్యకలాపాల్లో లీనమై ఇస్లాంను గురించి పట్టించుకోలేదు. అయితే ఇద్దరి మధ్య స్నేహబంధం మాత్రం ఇదివరకటిలా పటిష్ఠంగా కొనసాగుతోంది. అబ్దుల్లా (రజి) తరచూ అబూదర్దాను కలుసుకొని అతని యోగక్షేమాలు విచారిస్తుండేవారు. దాంతోపాటు అతనికి ఇస్లాం ఔన్నత్యాన్ని గురించి అప్పుడప్పుడు హితబోధ కూడా చేస్తుండేవారు. కాని అబూదర్దా ఓ చిరునవ్వు నవ్వి మౌనంగా వెళ్ళిపోయేవాడు.

ఆరోజు అబూదర్దా దుకాణానికి వెళ్ళిపోగానే అబ్దుల్లా బిన్ రవాహా (రజి) అతని ఇంటికెళ్ళి తలుపు తట్టాడు. అబూదర్దా భార్య తలుపు తెరచి ఆయన్ని లోపలికి ఆహ్వానించింది. అబ్దుల్లా (రజి) "అబూదర్దా ఎక్కడికెళ్ళాడ"ని అడిగితే "ఆయన దుకాణానికి వెళ్ళాడ"ని చెప్పిందామె. తర్వాత 'కూర్చోండి' అంటూ ఆమె వేరే గదిలోకి పోయి ఇంటిపనుల్లో లీనమైపోయింది. ఆమె వెళ్ళిపోయాక అబ్దుల్లా (రజి) నేరుగా అబూదర్దా పూజాగదిలోకి ప్రవేశించి వెంట తెచ్చుకున్న సుత్తితో అక్కడి విగ్రహంపై విరుచుకుపడ్డారు. దాన్ని ముక్కలు ముక్కలుగా విరగ్గొట్టి అక్కడ్నుంచి చల్లగా జారుకున్నారు.

అబూదర్దా భార్య ఇంటిపనులు ముగించి పూజాగదిలోకి వచ్చిచూసి ఒకేఒక గావుకేక పెట్టింది. "అయ్యయ్యో! ఎంత ఘోరం జరిగిపోయింది!! అబూదర్దా వస్తే ఇక నన్ను బ్రతకనివ్వడు. ఇప్పుడు నేను ఏం చెయ్యాలి దేవుడా" అంటూ పూజాగదిలోనే కూలబడి భోరున విలపించసాగింది.

కాస్సేపటికి అబూదర్దా వచ్చాడు. అతడ్ని చూడగానే ఆమె కాళ్ళుచేతులు వణికిపోసాగాయి. "ఏమయిందే అలా వణికిపోతున్నావు?" అడిగాడు అబూదర్దా.

"మీరు దుకాణానికి వెళ్ళిపోయిన తరువాత మీ ప్రాణమిత్రుడు అబ్దుల్లా బిన్ రవాహా వచ్చి ఈ విధ్వంసానికి పాల్పడ్డాడు" చెప్పింది అతని భార్య.

అబూదర్దా ముక్కచెక్కలైన విగ్రహదుస్థితి చూసి కోపోద్రేకాలతో ఊగిపోయాడు. పిడికిళ్ళు బిగిస్తూ ప్రాణమిత్రునిపై ప్రతీకారపు కత్తి గట్టాడు. కాస్సేపటికి కోపాగ్ని చల్లారిపోయింది. ఆలోచనా కెరటాలు అతని బుర్రను తొలచివేయసాగాయి. "ఈ విగ్రహంలో కాస్తయినా శక్తి ఉంటే ఇది తననుతాను కాపాడుకునేది" అని భావించాడతను. ఆ తరువాత అతను అబ్దుల్లా బిన్ రవాహా (రజి) ఇంటికి వెళ్ళి ఇస్లాం పట్ల తన అనుమానాలను గురించి అడిగాడు. వాటికి అబ్దుల్లా (రజి) నుండి సంతృప్తికరమైన సమాధానాలు రావడంతో ఆయన వెంట దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి ఇస్లాం స్వీకరించాడు.

హజ్రత్ అబూదర్దా (రజి) ఇప్పుడు సాధారణ ముస్లిం కాదు; పక్కాముస్లిం. దైవప్రవక్త (స) హితోక్తులతో ఆయన హృదయం పూర్తిగా జ్యోతిర్మయమైపోయింది. తాను



అన్సారులందరికంటే చివర్లో ఇస్లాం స్వీకరించి చాల వెనకబడిపోయాననే అన్న భావనతో ఆయన ప్రాపంచికసౌఖ్యాలను త్యజించి దైవారాధన, ఖుర్‌ఆన్ పఠనం, ధర్మ ప్రచారాల్లో పూర్తిగా నిమగ్నులైపోయారు. చివరికి వ్యాపారాన్ని కూడా ఆయన వదిలేసి దైవచింతనలో లీనమైపోయారు.

ఒకసారి హజ్రత్ అబూదర్దా (రజి) ఇంటికి కొందరు అతిథులు వచ్చారు. అది ఎముకలు కొరికే చలికాలం. అబూదర్దా (రజి) తన అతిథులకు వేడివేడి భోజనమైతే పెట్టాడు. కాని చలికి కప్పుకోవడానికి వెచ్చటి రగ్గులేమీ ఇవ్వలేదు. ఆరోజు రాత్రి పడుకోవడానికి సిద్ధమైనపుడు వారు కప్పుకోవడానికి రగ్గు గురించి అబూదర్దా (రజి)ను అడుగుదామని భావించారు. వారిలో ఒకతను అబూదర్దా (రజి) గదికి వెళ్ళి చూస్తే అబూదర్దా (రజి), ఆయన భార్య పల్చటి దుప్పటి కప్పుకొని వణుకుతూ పడుకొని ఉండటం కన్పించింది.

హజ్రత్ అబూదర్దా (రజి) ఆ అతిథిని చూసి లేచికూర్చున్నారు. అతిథి ఆయన్ని చూసి "మీరు కూడా మాలాగే వణుకుతూ రాత్రి గడుపుతున్నారు. ఇంతకూ మీ సామగ్రి అంతా ఏమైపోయింది?" అని అడిగాడు. దానికి అబూదర్దా (రజి) ఇలా చెప్పారు:

"అక్కడ (పరలోకంలో) మా ఇల్లొకటి ఉంది. ఎప్పుడైనా ఏదైనా సామగ్రి మా దగ్గరకు వస్తే దాన్ని మేము ఆ ఇంటికే పంపిస్తుంటాము. మేమీ ఇంట్లో ఏదైనా మిగిల్చిపెడితే దాన్ని మీకు తప్పకుండా ఇస్తాం. అదీగాక పరలోకగృహానికి చేరుకునే దారి చాలా కఠినంగా ఉంటుంది. అదీగాక తలకు మించిన సామగ్రి మోసుకొని వెళ్ళడం కంటే వీలైనంత తక్కువ బరువుతో వెళ్ళడమే తేలికగా ఉంటుంది కదా! బహుశా మీకు నా మాటల అంతరార్థం అర్థమైందనుకుంటా."

దానికా అతిథి "అర్థమైంది. దేవుడు మీ కృషికి తగిన సత్ఫలం ప్రసాదించుగాక!" అని అన్నాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన పరిపాలనాకాలంలో అబూదర్దా (రజి)ను సిరియా గవర్నర్‌గా నియమించాలని భావించారు. కాని ఆయన అందుకు సమ్మతించలేదు. ఉమర్ ఫారూఖ్ (రజి) వత్తిడిచేయడంతో ఆయన "మీరు నన్ను సిరియా పంపాలని అంతగా పట్టుబడుతుంటే, నేను ప్రజలకు ఖుర్‌ఆన్, హదీసుల్ని బోధించడానికి, నమాజ్ చేయించడానికి సిరియా వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు. దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) అంగీకరించారు.

అప్పుడు హజ్రత్ అబూదర్దా (రజి) సిరియా రాజధాని డెమాస్కస్‌కు చేరుకున్నారు. కాని అక్కడి ప్రజలు ప్రాపంచికవ్యామోహంలో కూరుకుపోయి ఉండటం చూసి ఆయన ఆందోళన చెందారు. వెంటనే వారిని మసీదులో సమావేశపరచి సుదీర్ఘ హితబోధ

చేశారు. ఆ తరువాత కూడా ఆయన వారికి తరచుగా హితబోధ చేస్తూ సుశిక్షణ ఇవ్వడానికి కృషిచేశారు.

ఆ రోజుల్లోనే సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) తన కొడుకు యజీద్ వివాహం అబూదర్దా (రజి) కుమార్తెతో చేసే ఉద్దేశంతో ఆయనకు కబురు పంపారు. కాని అబూదర్దా (రజి) ఆయన ప్రతిపాదనను తిరస్కరించి తన కుమార్తె వివాహం సౌశీల్యవంతుడైన ఒక సాధారణ ముస్లింతో జరిపించారు. ఇలా ఎందుకు చేశారని ఒకతను అడిగితే ఆయన దానికి సమాధానమిస్తూ "నా కూతురు దర్దా ప్రయోజనం కోసం ఇలా చేశాను" అని అన్నారు.

ఆ వ్యక్తి ఆశ్చర్యపోతూ "ఏమిటా ప్రయోజనం?" అని అడిగాడు.

"దర్దా గురించి నీ అభిప్రాయం ఏమిటీ? అనుక్షణం ఆమెను సేవించడానికి, ఆమె ఆజ్ఞలు శిరసావహించడానికి సేవికలు-సేవకుల గుంపొకటి సిద్ధమై ఉండాలని, మనోహరమైన రాజసౌధాలలో నివశిస్తూ భోగభాగ్యాలు అనుభవిస్తుండాలని, తన ప్రతిమాటకూ తలలూపే చెలికత్తెలతో కలసి విశాలమైన పూదోటల్లో తిరుగుతూ కాలక్షేపం చేస్తుండాలని నువ్వు భావిస్తున్నావా? అలాంటప్పుడు ఆమె దైవభక్తి, ధర్మపరాయణతల సంగతేమిటీ?" అన్నారు హజ్రత్ అబూదర్దా (రజి).

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఓసారి సిరియా పర్యటిస్తూ డెమాస్కస్‌ను కూడ సందర్శించి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఓరోజు రాత్రివేళ ఆయన తన మిత్రుడు అబూదర్దా (రజి)ను కలుసుకోవడానికి ఆయన ఇంటికెళ్ళారు. లోపల చీకటిగా ఉంది. ఆ చీకటిలోనే ఇద్దరు కలుసుకొని మాట్లాడుకోసాగారు.

అదే సమయంలో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తలగడదిండు కోసం తడుముతుంటే ఓ చిరిగిపోయిన కంబళీ చేతికి తగిలింది. ఆ తర్వాత పడక కోసం తడుముతుంటే ఇసుకలాంటి కంకర్రాళ్ళు చేతికి తగిలాయి. అక్కడే ఉన్న ఓ పల్చటి రగ్గు కూడా చేతికి తగిలింది. బహుశా ఈ రగ్గు చలికి కప్పుకునే దుప్పటి కాబోలు. కాని డెమాస్కస్‌లోని ఎముకలు కొరికే చలికి ఈ రగ్గు ఏమాత్రం పనికిరాదు.

దీన్నిబట్టి అబూదర్దా (రజి) ఎంత దారిద్ర్యంలో మగ్గుతుండేవారో అర్థమవుతుంది. అంచేత ఉమర్ ఫారూఖ్ (రజి) "దేవుడు మిమ్మల్ని కరుణించుగాక! మీ పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఈదుస్థితి నుండి బయటపడేందుకు నేను మీకు కొంత డబ్బు పంపిస్తాను" అనిఅన్నారు. దానికి అబూదర్దా (రజి) సమాధానమిస్తూ "మీ దగ్గర ప్రపంచసామగ్రి బాటసారి దగ్గరుండే సామగ్రిలా అవసరమైన మేరకే చాలా కొద్దిగా ఉండాల'ని దైవప్రవక్త (స) ప్రవచించిన హదీసు మీకు గుర్తులేదా?" అని అన్నారు.



"ఆ...గుర్తుంది" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి). "మరి ఆ మహానుభావుడు ఇహలోకం వీడిపోయిన తర్వాత మనం చేస్తున్నదేమిటీ?" అడిగారు అబూదర్దా (రజి) కంట తడిపెడ్తూ. ఈమాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) కూడా భోరున విలపించారు. ఆ తర్వాత ఆయన సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

# 14. సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)

నవయౌవనంతో మిసమిసలాడుతున్న ఓ నూనూగు మీసాల యువకుడు కళ్ళు చించుకున్నా కానరాని కటికచీకటిలో అడ్డదిడ్డంగా నడుస్తున్నాడు గమ్యం ఎరగని బాటసారిలా. అతని హృదయం వెలుగు కోసం అన్వేషిస్తోంది. కాని అతని చుట్టూ ఎటు చూసినా చీకటితెరలే. అయినప్పటికీ ఆ యువకుడు నిరాశా తెరలను దరికి చేరనివ్వకుండా చీకటితెరలను చించడానికి ప్రయత్నిస్తూ ముందుగుసాగుతున్నాడు. అంతలో హఠాత్తుగా పూర్ణశశాంకుడు కారుమబ్బుల్ని చీల్చిచెండాడుతూ సంపూర్ణ తేజస్సుతో ప్రత్యక్షమయ్యాడు. పరిసరాలు ఒక్కసారిగా ప్రకాశవంతమయ్యాయి. దాంతో ఆ యువకుడు హుషారుగా నడవసాగాడు చరచరా. అయితే అతని ముందు కొద్ది దూరంలో మరో ముగ్గురు బాటసారులు నడుస్తూ ఠక్కున ఆగారు.

ఆ యువకుడు తన కోసమే ఆ బాటసారులు ఆగి ఎదురుచూస్తున్నారని భావించి గబగబా నడచి వాళ్ళను కలుసుకున్నాడు. తరువాత అతను "ఇక్కడికి మీరెప్పుడు వచ్చార"ని అడిగాడు. దానికి వారు "మేము ఇప్పుడే వచ్చాం" అన్నారు....

అంతే, కల చెదరిపోయింది. భళ్ళున తెల్లారింది. ఆ యువకుడు ఆలోచనలో పడిపోయాడు. రాత్రి తాను కలలో చూసిన ఆ ముగ్గురు బాటసారులు అలీ బిన్ అబూతాలిబ్ (రజి), జైద్ బిన్ హారిసా (రజి), అబూబకర్ (రజి) కొత్తగా ఇస్లాం స్వీకరించినట్లు, వారు దైవప్రవక్త (స)తో కలసి రహస్యంగా ధర్మప్రచారం చేస్తున్నారని తెలిసింది. అంటే బహుశా దేవుడు తనకేదో మేలు చేయగోరుతున్నట్లు, చీకటిలోయల నుండి తీసి వెలుగుబాటలో నడిపించదలచినట్లు భావించాడా యువకుడు. వెంటనే అతను కాలకృత్యాలు ముగించుకొని దైవప్రవక్త (స)ను కలుసుకోవడానికి బయలుదేరాడు. దైవప్రవక్త (స) అసర్ నమాజ్ చేసి కూర్చున్నారు. ఆయన ఆ యువకుడ్ని చూడగానే సాదరంగా ఆహ్వానించి హితబోధ చేశారు. ప్రవక్తహితోక్తులతో ప్రభావితుడై అతను అప్పటికప్పుడు సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించాడు.

ఆ యువకుడే సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి). ఇస్లాం స్వీకరించిన పురుషుల్లో ఆయన నాల్గవ వ్యక్తి. హజ్రత్ సాద్ (రజి) ఇస్లాం స్వీకరించగానే మొట్టమొదట ఆయనకు తన మాతృమూర్తి నుండే పరీక్ష ఎదురయింది. కొడుకు ఇస్లాం స్వీకరించాడని తెలియగానే ఆమె తోకతొక్కిన పాములా కస్సుమంటూ బుసలుకొట్టింది.

"సాద్! విను దైవసాక్షిగా చెబుతున్నాను. నువ్వీ కొత్తమతాన్ని వదలుకోనంతవరకు నేను కూడు-నీళ్ళు మానేస్తాను, ఆకలిదప్పులతో మాడి చచ్చినా సరే" అన్నది ఆమె.

"అమ్మా! నువ్వలా చేయకు. నేనీ ధర్మాన్ని వదలుకోలేను. ఇదే మనిషి ముక్తికి మంచిమార్గం" అంటూ బ్రతిమాలాడా సుపుత్రుడు.

కాని ఆ తల్లి పంతానికి పోయి అన్నం మానేసి పస్తులతో రోజురోజుకు చిక్కిపో సాగింది. కొడుకు కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలినా వినలేదు ఆమె. చివరికి ఆ కుమార రత్నం కూడా పట్టువీడకుండా "అమ్మా! అయితే నా నిర్ణయం కూడా విను. దైవసాక్షిగా చెబుతున్నాను. నువ్వంటే నాకెంతో ప్రేమాభిమానాలు ఉన్నాయి. అందులో ఎలాంటి సందేహం లేదు. కాని దేవుణ్ని, ఆయన ప్రవక్తను నేను ఇంతకంటే ఎక్కువ అభిమాని స్తున్నాను. నువ్వు అన్నం మానేసి ఆకలితో మాడి చచ్చినా సరే నేనీ నూతనధర్మాన్ని ఎట్టి పరిస్థితిలోనూ వదిలే ప్రసక్తే లేదు" అని తెగేసి చెప్పాడు.

దాంతో ఆ మాతృమూర్తి ఎలాగో తన పంతం మానేసి దిగివచ్చింది. "తనకే అంత పట్టుదల ఉంటే, తన కడుపున పుట్టిన వీడికి మరెంత పట్టుదల ఉండాలి!" అని భావించిందేమో, తనకు కొంచెం దూరంలో ఉన్న అన్నం కంచాన్ని ముందుకు లాక్కున్నది ఆమె.

"నాపట్ల కృతజ్ఞుడవయి ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతాభావంతో మసలుకో. నీవు (చివరికి) నా దగ్గరికే రావలసిఉంది. అయితే నీకు తెలియనిదాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడిచేస్తే మటుకు నీవు వారిమాట ఎన్నటికీ వినకు. ప్రపంచంలో వారి పట్ల సత్ప్రవర్తన కలిగిఉండు. అనుసరణ విషయంలో మాత్రం నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగిరావలసి ఉంది." (దివ్య ఖుర్‌ఆన్-31:15)

సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఇస్లాం స్వీకరించిన తరువాత అనేక ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా దైవప్రవక్త (స)తో "షొబెఅబూతాలిబ్"లో సాంఘీక నిర్బంధా నికి గురయ్యారు. దీనివల్ల పరిస్థితి విషమించడంతో దైవప్రవక్త (స) తన అనుచరుల్ని అబిసీనియాకు వలసపొమ్మని చెప్పారు. ఇలా చాలామంది అబిసీనియాకు వలసపోగా, సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)తో పాటు కొద్దిమంది మాత్రమే దైవప్రవక్త (స)ను అంటిపెట్టుకొని అవిశ్వాసులు పెట్టే బాధలు భరిస్తూ దుర్భరజీవితం గడపసాగారు. ఇలా నెలా రెండు నెలలా? వరసగా మూడేండ్లు సాంఘిక నిర్బంధానికి గురై అష్టకష్టాలు పడ్డారు. తిండికి-బట్టకూ వారు అనుభవించని బాధలు లేవు.

ఒకరోజు హజ్రత్ సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) తినడానికి ఏమీ దొరక్క ఎంతో బాధపడసాగారు. అలాంటి పరిస్థితిలో ఓచోట ఎండిన తోలుముక్క దొరికితే అదే



భాగ్యమని భావించి, దాన్ని శుభ్రంగా కడిగి, కాల్చి నీళ్ళలో నానబెట్టారు. అలా నీళ్ళలో నానిన ఆ తోలుముక్క తిని ఆయన ఆకలిమంట చల్లార్చుకున్నారు.

సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) మక్కా నుండి మదీనాకు వలసపోయిన తర్వాత దైవప్రవక్త (స)తో కలసి అనేకయుద్ధాల్లో పాల్గొన్నారు. ఆ తరువాత ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఈరానీయులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో ఆయన రచించిన సమరవ్యూహాలు ప్రత్యేకంగా ప్రస్తావించదగినవి.

ఖాదిసియా యుద్ధసమయంలో సేనాపతి హజ్రత్ సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) సయాటికా వ్యాధితో బాధపడుతుండేవారు. దానికితోడు ఇప్పుడు ఆయన వంటిపై కురుపులు కూడా లేచాయి. దానివల్ల ఆయన యుద్ధంచేసే పరిస్థితిలో లేకుండాపోయారు. అంచేత ఆయన అక్కడున్న ఓ పురాతన భవనం కప్పు మీద కూర్చొని తన స్థానంలో ఖాలిద్ బిన్ అర్ఫతహ్ (రజి)ను యుద్ధభూమి సేనాపతిగా నియమించారు. అయితే యుద్ధవ్యూహాలు, రణరంగంలో మార్పులకు సంబంధించిన అధికారాలన్నీ తన అధీనం లోనే ఉంచుకున్నారు.

ఆ యుద్ధంలో శత్రుపక్షం ఏనుగుల బీభత్సకాండలో అనేకమంది ముస్లింలు చనిపోయారు. అంచేత మరునాడు ముస్లింలు సేనాపతి ఆదేశంతో ఒంటెలు ఏనుగుల్లా భయంకరంగా కన్పించడానికి ఉయ్యాలల్లాంటి వస్తువులు తయారుచేసి వాటి మూపురాల పైనుంచి కిందికి వ్రేలాడదీశారు. ఈరాన్‌గుర్రాలు వాటిని చూసి బెదిరిపోయి అడ్డదిడ్డంగా పరుగెత్తాయి. దాంతో ఈరానీయులు చాలమంది గాయపడ్డారు. ముస్లింలు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ అనేకమందిని వధించారు.

ఆ తరువాత జరిగిన యుద్ధాల్లో ముస్లిం సేనలు బహ్రెషేర్‌ను ఆక్రమించుకోగానే ఈరాన్‌చక్రవర్తి ఈరాన్‌రాజధాని మదాయెన్ నుంచి 'హల్వాన్'కు పారిపోయాడు. సేనాపతి సాద్ (రజి) వీలైనంత త్వరగా మదాయెన్‌ను వశపరచుకోవాలని భావించారు. కాని బహ్రెషేర్‌కు, మదాయెన్‌కు మధ్య భయంకరమైన దజ్లా నది ఉంది. ఈరాన్ సైనికులు బహ్రెషేర్ నుంచి పారిపోతూ దజ్లా మీదున్న వంతెనను పూర్తిగా కూలగొట్టారు. దాంతో ముస్లింలకు నది దాటడం చాలా కష్టమైపోయింది.

ఏమైనప్పటికీ ముస్లింలు నది దాటడానికే నిర్ణయించుకున్నారు. సేనాపతి సాద్(రజి) ఆరొందల మంది విలుకాండ్రను నది గట్టుమీద నియమించారు. తర్వాత మిగతా సైన్యానికి తగిన ఆదేశాలిచ్చి నది దాటేందుకు సిద్ధపరిచారు. తర్వాత ఆయన దేవునిపై భారం వేసి, దైవనామాన్ని స్మరిస్తూ తాను కూర్చున్న గుర్రాన్ని నదిలోకి తోలారు. సేనాపతిని అనుసరిస్తూ సైనికులంతా ధైర్యంచేసి తమతమ గుర్రాలను నదిలోకి

తోలారు. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలతో పరవళ్ళు తొక్కుతున్న దజ్లానదిలో ఈ గుర్రాలన్నీ చిన్నచిన్న పడవల్లా, నీటిగుర్రాల మాదిరిగా ముందుకుసాగాయి.

ఇలా నది మధ్యకు చేరుకోగానే నది ఆవల తీరంలో కాపుకాస్తున్న ఈరాన్ విలుకాండ్రు లేచి బాణాలు ఎక్కుపెట్టనారంభించారు. వెంటనే నది ఈవల కూర్చున్న ముస్లిం విలుకాండ్రు వారిపై బలంగా బాణాలవర్షం కురిపించారు. దాంతో వారు అనేకమంది గాయపడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయారు.

దారి సుగమం కావడంతో ముస్లిం యోధులు సునాయాసంగా నది దాటిపోయి ఈరాన్ సైనికుల్ని చీమల్లా నలిపివేశారు. బ్రతికి బయటపడినవారు పిక్కబలంకొద్దీ పారిపోయారు. అప్పుడు ముస్లింలు మదాయన్‌ని వశపరచుకున్నారు.

దేవుడు సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)కు దీర్ఘాయుష్షుతో పాటు అత్యధిక ఐశ్వర్యం కూడా ప్రసాదించాడు. అయితే తనకు అంతిమ ఘడియలు సమీపించినపుడు ఆయన తాను దాచుకున్న ఓ పాత చొక్కా తెప్పించుకొని తన వారసులకు ఇలా హితోపదేశం చేశారు :

“నేను చనిపోయిన తరువాత నా భౌతికకాయానికి ఈ చొక్కా తొడిగించండి. నేను ఈ చొక్కా ధరించే బదర్ యుద్ధంలో పాల్గొని అవిశ్వాసులతో పోరాడాను. అంచేత ఇప్పుడు నేను ఈ చొక్కా ధరించే నా ప్రభువు సన్నిధికి వెళ్ళదలిచాను.”

# 15. వహ్షీ బిన్ హారబ్ (రజి)

ఉహద్ మైదానం యుద్ధ వీరులతో నిండిపోయింది. ఒకవైపు దైవాన్నే నమ్ముకొని క్రమశిక్షణతో బారులుతీరి ఉన్న ముస్లింయోధులు తమ ప్రియతమ నాయకుని అనుజ్ఞ కోసం నిరీక్షిస్తున్నారు. వారికి ఎదురుగా సత్యతిరస్కారులు గాండ్రిస్తూ, గర్జిస్తూ ముస్లింలను చీల్చిచెండాటానికి తహతహలాడి పోతున్నారు.

శత్రుసేనాని అబూసుఫ్యాన్ భార్య హిందా నాయకత్వంలో స్త్రీలు అటూఇటూ తిరుగుతూ పరుష వచనాలతో సైనికుల్ని ఉద్రేకపరచసాగారు. డప్పులు వాయిస్తూ “వీరసైనికులారా! ముందుకు పురోగమించండి. ధైర్యంగా, అప్రతిహతంగా కత్తులు ఝుళిపించండి” అంటూ వారిలో ఆత్మాభిమానం, పౌరుషాలను రేకెత్తిస్తున్నారు.

తరువాత హిందా వహ్షీ బిన్ హారబ్ దగ్గరకెళ్ళి ముహమ్మద్, హమ్జా, అలి- ఈ ముగ్గురిలో ఎవరినైనా ఒకరిని వధిస్తానని అతను తనకు చేసిన వాగ్దానాన్ని గుర్తుచేస్తూ “అబూదస్మా! నాకు చేసిన వాగ్దానం ప్రకారం శత్రువుని హతమార్చి నా గుండెల్లో మండుతున్న ప్రతీకారాగ్నిని చల్లార్చు. నువ్వు కూడా తృప్తిపడు” అని చెప్పింది.



సమరజ్వాలలు మింటికెగిశాయి. ఖురైష్‌నాయకులు ప్రతీకారజ్వాలలతో రగిలిపోతూ సైనికులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. వారి స్త్రీలు పరుషవచనాలతో యువసైనికుల్ని రెచ్చగొడ్తున్నారు. వహ్షీకి తన కర్తవ్యం గుర్తుకొచ్చి హమ్జా (రజి)ను అనుసరించసాగాడు. హమ్జాను హతమారిస్తే తనను బానిసత్వం నుంచి విముక్తి కలిగించడమే కాకుండా తగిన పారితోషికం కూడా ఇస్తానని అబూసుఫ్యాన్ భార్య హిందా వాగ్దానం చేసింది. ఈ ఆశతోనే వహ్షీ రంగంలోకి దూకాడు.

ఒకచోట హజ్రత్ హమ్జా (రజి) శత్రువులతో పోరాడుతుంటే వహ్షీ చెట్టు చాటున నక్కి దొంగచాటుగా బల్లెం విసిరాడు. అది హమ్జా (రజి) పొట్టలో నుంచి దూసుకు పోయింది. దాంతో ఆయన కుప్పకూలిపోయారు. అప్పుడు వహ్షీ తృప్తిచెందాడు.

వహ్షీ తాననుకున్నట్లు హమ్జా (రజి)ను వధించగలిగాననే ఆనందంతో ఎగిరి పడుతూ హిందా దగ్గరకెళ్ళి “మీరు చెప్పినట్లు నేను హమ్జాను చంపాను. దానికిప్పుడు మీరేం బహుమానం ఇస్తారో ఇవ్వండి” అన్నాడు. “నీకు నా కంఠహారం ఇస్తా” అంటూ హిందా అతనికి అప్పటికప్పుడు తన కంఠహారం తీసిచ్చింది.

యుద్ధం ముగిసింది. యుద్ధమైదానం మృతదేహాలతో, కొనవూపిరితో కొట్టు మిట్టాడుతున్న క్షతగాత్రులతో భీకరంగా ఉంది. హజ్రత్ హమ్జా (రజి) మృతదేహం ముక్కలుగా ఖండించబడి ఎంతో భయానకంగా, కడు దయనీయంగా ఉంది. దాన్ని చూడగానే దైవప్రవక్త (స) కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆవేదనాభరితమయిన ఆయన హృదయం నుంచి సన్నగా (ఈ క్రింది) శబ్దతరంగిణి జాలువారింది:

“అబ్బా! ఇంతటి బాధాకరమైన దృశ్యం నేనింతవరకు చూడలేదు. (హమ్జా సోదరి) సఫియా బాధపడకుండా ఉంటే, ఈపని నా తదనంతరం ఆచారంగా మారుతుందన్న భయం కూడా లేకుండా వుంటే నేను హమ్జా దేహాన్ని ఇలాగే గద్దలకు, మృగాలకు వదలి పెట్టేవాడ్ని. ఎప్పటికైనా శత్రువులపై ఆధిక్యత పొందగలిగితే వారిలో ముప్ఫయి మంది మనుషులకు ఇదే గతి పట్టిస్తాను.” కాని.....

“మీరు ప్రతీకారం తీర్చుకోదలిస్తే మీపై ఏ మేరకు దౌర్జన్యం జరిగిందో ఆ మేరకే బదులు తీర్చుకోండి. అయితే సహనం వహిస్తే అది సహనం వహించేవారికి ఎంతో మంచిది. కనుక (ముహమ్మద్!) సహనం వహించు. నీకు సహన గుణం దేవుని ద్వారానే అబ్బింది. వారి చర్యలకు బాధపడకు. వారి మోసపు ఎత్తుగడలకు మనస్తాపం చెందకు. దైవఅవిధేయతకు దూరంగా ఉంటూ దేవుని అయిష్టతకు భయపడి సత్పురుషులుగా ఉండేవారికే ఆయన తోడుగా ఉంటాడు” (ఖుర్ఆన్. 16:126–128)

---అనే దైవవాణి మనోవీధిలో మెదులుతుండగా అంతరంగంలోని ఆవేదన అంతరించి శాంతించారు దైవప్రవక్త (స).

కొన్నేళ్ళ తరువాత మక్కా ముస్లింల అధీనంలోకి వచ్చింది. కాబా ప్రాంగణంలో వేలాదిమంది జనం గుమిగూడి ఉన్నారు. సహృదయుడు, నిజాయితీపరుడైన దైవప్రవక్త (స)ను, ఆయన్ని విశ్వసించినవారిని అనేక హింసలకు గురిచేసిన సత్యతిరస్కారులు వీరు. అందువల్ల దైవప్రవక్త (స) తమ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని లోలోన భయపడుతూ ఊపిరి బిగబట్టి ఎదురు చూస్తున్న మక్కా బహుదైవారాధకులు వీరు. అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (స) వారి ఎదుటకు వచ్చి నిలబడ్డారు. జన సమూహంపై నిశ్శబ్దం ఆవరించింది.

"ఖురైష్ ప్రజలారా! నేనీ రోజు మీ పట్ల ఏవిధంగా ప్రవర్తిస్తానో మీకు తెలుసా?" అడిగారు దైవప్రవక్త (స).

"సద్వర్తనంతోనే ప్రవర్తిస్తారు. మీరు మా ఉత్తమ సోదరులు. ఉత్తమ సోదరుని కుమారులు" అన్నారు ప్రజలు కాస్తంత ధైర్యంచేసి ముక్తకంఠంతో.

"సరే, వెళ్ళండి. ఈరోజు మీ మీద ఎలాంటి ఆరోపణ లేదు. మీరంతా స్వతంత్రులు" అన్నారు కారుణ్యమూర్తి (స).

అంతే..... మక్కా ప్రజలపై పూలవాన కురిసింది. సంతోషాతిశయంతో వారి ముఖాలు ఒక్కసారిగా కలువపువ్వుల్లా వికసించాయి. కృతజ్ఞతా భావంతో కూడిన వారి కళ్ళు మహాప్రవక్త ముహమ్మద్ (స) ఔదార్యాన్ని ప్రశంసించాయి. దాంతో ప్రజలు తండోపతండాలుగా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి సంతోషంగా ఇస్లాం స్వీకరించసాగారు.

దైవప్రవక్త (సల్లం)కు, బద్ధవిరోధులైనవారు సైతం ఇస్లాం స్వీకరించడానికి ముందుకొచ్చారు. దైవప్రవక్త (స)కు అత్యంత ప్రియమైన పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ని హతమార్చిన వహ్షీ కూడా ఇస్లాం స్వీకరించాడు. హమ్జా (రజి) గుండెకాయ తీసి నమిలి మింగడానికి ప్రయత్నించిన హిందా కూడా ఇస్లాం స్వీకరించింది.

ఖలీఫా అబూబకర్ (రజి) పాలనాకాలంలో అసత్యప్రవక్త ముసైలమాను అణచడానికి ఆయన ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు ఓ పెద్ద సైన్యాన్నిచ్చి పంపారు. ఖాలిద్ (రజి) యమామా పట్టణం దిశగా పురోగమించారు. ఖాలిద్సైన్యం సమీపించగానే ముసైలమా కొంతమంది శిష్యుల్ని తీసుకొని పట్నం సమీపంలోని ఓ తోటలోకి పారిపోయి తలదాచుకున్నాడు. ఈతోట చుట్టూ కోటగోడలా దృఢంగా నిర్మించబడిన ప్రహరీ గోడ కూడా ఉంది.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) యమామా పట్నంలోకి ప్రవేశించగానే ముసైలమా సైన్యంతో యుద్ధం ప్రారంభించారు. శత్రుసైనికులు ముస్లింయోధుల ముందు నిలువలేక పారిపోసాగారు. వారి నాయకుడు ఎలుగెత్తి "బనూహనీఫా తెగవారలారా! పారిపోకండి, తోటలోకి ప్రవేశించండి" అని అరిచాడు. దాంతో ముసైలమా సైనికులు



పరుగుపరుగున తోటలోకి ప్రవేశించి తలుపులు మూసుకున్నారు. ఆ తర్వాత ఆ నాయకుడు ముస్లింలతో పోరాడుతూ మృత్యు కోరలకు చిక్కిపోయాడు.

ముస్లింయోధులు వీరోచితంగా పోరాడుతూ ముసైలమా సైనికుల్ని తోట సమీపానికి తరుముకుపోయారు. చివరికి వారు తోట గోడను అనేక చోట్ల పడగొట్టి లోపలికి జొరబడ్డారు. ముసైలమా సైనికాధికారుల్లో కొంతమంది పరిస్థితి క్షణక్షణానికి విషమిస్తూ ఉండటం చూసి "నీ దేవుడు నీకు చేసిన విజయవాగ్దానం ఎప్పుడు నెరవేరుతుంది?" అని అడిగారు ముసైలమాను. దానికా అబద్ధాలమారి "ఇలాంటి విషయాల్ని గురించి మాట్లాడే సమయం కాదిది. ఇప్పుడు ప్రతిమనిషీ తన భార్యా పిల్లల కోసం తెగించి పోరాడాలి" అని సమాధానమిచ్చాడు.

తోటలో కూడా పరిస్థితి విషమించిపోవడంతో అసత్యప్రవక్త ముసైలమా గుర్రం దిగి మెల్లగా తోట నుండి బయటికి జారుకోవడానికి ప్రయత్నించాడు. అయితే తోట ద్వారం దగ్గర కాచుకొనివున్న వహ్షీ (రజి) అతను దగ్గరికి రాగానే బలాన్నంతా కూడదీసుకొని బరిశె విసిరాడు. అది మెరుపులా దూసుకుపోయి ముసైలమా ధరించిన ఉక్కుకవచాన్ని సైతం రంధ్రంచేసి అతని గుండెలోకి చొచ్చుకుపోయింది. దాంతో ఆ దుర్మార్గుడు క్రింద పడి గిలగిల కొట్టుకొని ఊపిరివిడిచాడు.

ముసైలమా చావుతో అతని సైనికులు భయభ్రాంతులై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వీలున్న దిశలకు పరుగెత్తారు. హజ్రత్ వహ్షీ (రజి) తాను ఆనాడు ప్రవక్త పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ను చంపిన పాపానికి ఈనాడు అసత్యప్రవక్త ముసైలమాను కడతేర్చి ప్రాయశ్చిత్తం చేసుకోగలిగానన్న భావనతో తృప్తిచెందారు.

# 16. అబ్బాద్ బిన్ బిషర్ (రజి)

హిజ్రత్ శకారంభానికి పూర్వం మక్కా నుండి ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ధర్మప్రచారకునిగా మదీనా వచ్చినపుడు ఆయన నోట వెలువడిన ఖుర్ఆన్ వాణి అబ్బాద్ బిన్ బిషర్ (రజి) హృదయంపై ప్రగాఢ ముద్ర వేసింది. ఆ రోజు నుండి అబ్బాద్ (రజి) ఖుర్ఆన్ పఠనాన్ని తన దైనందిన జీవితంలో అనివార్య భాగంగా చేసుకున్నారు. ఎప్పుడు ఏమాత్రం అవకాశం లభించినా ఆయన ఖుర్ఆన్ పఠించేవారు. ఆయన పఠనతీరును దైవప్రవక్త (స) సైతం ప్రశంసించేవారు.

హజ్రత్ అబ్బాద్ బిన్ బిషర్ (రజి) దైవప్రవక్త (స)తో కలసి సమస్త దండయాత్రల్లో పాల్గొన్నారు. ఒకసారి దైవప్రవక్త (స), ఆయన అనుచరులు జాతుర్రిఖా దండయాత్ర నుండి తిరిగొస్తూ దారిలో రాత్రి గడపడానికి ఒకచోట విడిదిచేశారు. ఆ దండయాత్ర సందర్భంలో ఒక ముస్లింయోధుడు ఒంటరిగా ఉన్న ఒక బహుదైవారాధక స్త్రీని

నిర్బంధించి తెచ్చాడు. ఎక్కడికో పోయి తిరిగొచ్చిన ఆమెభర్త తన భార్యను ముస్లింలే ఎత్తుకెళ్ళారని భావించి ప్రతీకారేచ్ఛతో ఉడికిపోతూ ధనుర్బాణాలు తీసుకొని బయలు దేరాడు. అది రాత్రివేళ.

దైవప్రవక్త (స) అనుచరులతో మాట్లాడుతూ "ఈరాత్రి మనకు కాపలాదారులుగా ఎవరుంటారా"ని అడిగారు. దానికి అబ్బాద్ బిన్ బిషర్ (రజి), అమ్మార్ బిన్ యాసిర్ (రజి) తాము కాపలా బాధ్యత తీసుకుంటామని అన్నారు. అప్పుడు వారిద్దరు పరస్పరం సంప్రదించుకొని అర్ధరాత్రి దాకా అబ్బాద్ (రజి), ఆ తర్వాత తెల్లవారేదాకా యాసిర్ (రజి) కాపలాకాసేలా నిర్ణయించుకున్నారు. నిర్ణయం ప్రకారం మొదట అబ్బాద్ (రజి) కాపలాబాధ్యత ప్రారంభించారు.

ముస్లింలపై ప్రతీకారేచ్ఛతో బయలుదేరిన ఆ బహుదైవారాధకుడు ముస్లింల సైనికశిబిరానికి కొద్ది దూరాన వచ్చి ఆగి చూశాడు. అతనికి ఒక ముస్లిం నిలబడి నమాజ్ చేస్తున్న దృశ్యం కన్పించింది. ఆ ముస్లిం అబ్బాద్ బిన్ బిషర్ (రజి). హజ్రత్ అబ్బాద్ (రజి) నమాజ్‌లో పూర్తిగా లీనమైపోయారు. ఆయన ఖుర్‌ఆన్ సూక్తుల్ని అర్థం చేసుకుంటూ ఎంతో ఏకాగ్రతతో నమాజ్ చేయసాగారు. అలాంటి పరిస్థితిలో ఆ బహు దైవారాధకుడు ఆయనకు గురిపెట్టి బాణం వదిలాడు. అది ఆయన శరీరంలో దిగ బడింది. అయినప్పటికీ హజ్రత్ అబ్బాద్ (రజి) ఏమాత్రం చలించకుండా ఆ బాణాన్ని చేత్తో లాగిపారేసి తిరిగి దైవధ్యానంలో నిమగ్నులైపోయారు.

ఆ వ్యక్తి మరోబాణం వదిలాడు. అబ్బాద్ (రజి) దాన్ని కూడా లాగిపారేసి నమాజ్‌లో లీనమైపోయారు. బహుదైవారాధకుడు ఆయన సహనం, ఏకాగ్రతలను చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. అయినా అతను వేరొక బాణం వదిలాడు. హజ్రత్ అబ్బాద్ (రజి) దాన్ని కూడా లాగిపారేశారు. అయితే ఈసారి బాధ ఎక్కువైపోవడంతో ఆయన మెల్లిగా జరుగుతూ తన మిత్రుడు అమ్మార్ (రజి) దగ్గరకు చేరుకొని "అమ్మార్! లే, తొందరగా లే. గాయాలతో నేను నిల్చునే శక్తి కోల్పోయాను" అంటూ ఆయన్ని తట్టి లేపారు.

అమ్మార్ బిన్ యాసిర్ (రజి) గబాలున లేచిచూస్తే అబ్బాద్ (రజి) శరీరం నుండి రక్తం కారడం కన్పించింది. దాంతో ఆయన ఆందోళన పడుతూ "నువ్వు నన్ను మొదటి బాణం తగలగానే ఎందుకు లేపలేదు?" అని అడిగారు. దానికి అబ్బాద్ బిన్ బిషర్ (రజి) సమాధానమిస్తూ ఇలా అన్నారు:

"నేనొక సూరా పఠించడంలో లీనమైపోయాను. దాన్ని పూర్తిగా పఠించకుండా మధ్యలోనే ఆపేయడం నాకు నచ్చలేదు. దైవసాక్షి! దైవప్రవక్త (స) నాకప్పగించిన బాధ్యతను నేను పూర్తిగా నెరవేర్చలేనన్న భయం నాకు లేకుంటే నా ప్రాణం పోయినా సరే నేను నమాజ్‌లో ప్రారంభించిన ఖుర్‌ఆన్ పఠనాన్ని ఆపేవాణ్ని కాను."



ఖలీఫా అబూబకర్ (రజి) పాలనాకాలంలో అసత్యప్రవక్త ముసైలమాకు వ్యతిరేకం గా జరిగిన యుద్ధంలో పాల్గొన్నప్పుడు ఓరోజు రాత్రి అబ్బాద్ బిన్ బిషర్ (రజి) ఒక కల గన్నారు. ఆ కలలో ఆయన ఆకాశంలో ఒక ద్వారం చూశారు. దాని తలుపు తెరవబడి ఉంది. ఆయన ఆకాశం వైపు అధిరోహించి ఆ ద్వారం గుండా లోపలికి ప్రవేశించారు. ఆ తరువాత వెంటనే తలుపు మూసేయబడింది.

మరునాడు ఉదయం హజ్రత్ అబ్బాద్ (రజి) ఆ కలను గురించి సేనాపతి అబూసయీద్ ఖుద్రీ (రజి) ముందు ప్రస్తావిస్తూ "ఇది నా అమరగతి కోసం తెరవబడిన ఆకాశద్వారం" అని అన్నారు. ఆ తర్వాత కాస్సేపటికి ప్రారంభమైన యుద్ధంలో ఆయన తన ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శిస్తూ నేలకొరిగి అమరగతిభాగ్యం పొందారు.

# 17. అమ్మార్ బిన్ యాసిర్ (రజి)

సత్యధర్మాన్ని నమ్మి దాని ప్రకారం నడచుకునే దృఢమనస్కులు సహన స్థైర్యా లతో శత్రువుల దౌర్జన్యాలను తట్టుకుంటూ ఇస్లామీయ ఉద్యమంలో పురోగ మిస్తున్నారు. అటువంటి సాహసవంతులలో యాసిర్ (రజి), ఆయన అర్థాంగి సుమయ్యా (రజి), తనయుడు అమ్మార్ (రజి) కూడా ఉన్నారు. నూతనధర్మం విశ్వసించిన కారణంగా వారి బంధువులే వారికి పరమశత్రువులుగా మారారు.

వారు హజ్రత్ యాసిర్ (రజి)ను మిట్టమధ్యాహ్నపు మండుటెండలో ఇసుకనేల మీద నగ్నంగా పడేసి కొరడాలతో వళ్ళు హూనం చేసేవారు. నిప్పుతో వాతలు పెట్టేవారు. మరొకప్పుడు ఆయన్ని నీళ్ళలో ముంచి ఊపిరాడకుండా అదిమి ఉంచేవారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆయన దయనీయ స్థితి చూసి "ఓర్చుకో యాసిర్! సకల సౌఖ్యాలిచ్చే నీ శాశ్వతస్థానం స్వర్గంలో ఉంది" అని ఓదార్చారు.

చివరికి హజ్రత్ యాసిర్ (రజి) అవిశ్వాసులు పెడ్తున్న బాధలు అనుభవిస్తూ ప్రాణం విడిచారు.

ఆయన సతీమణి హజ్రత్ సుమయ్యా (రజి) గాథ కూడా దయనీయమైనదే. పరమ దుర్మార్గుడైన అబూజహల్ ఇంట్లో ఆమె బానిసగా ఉన్నారు. కేవలం ఇస్లాం స్వీకరించిన కారణంగా ఆ సాధ్వీమణిని అతను బాధించడం మొదలెట్టాడు.

ఒకరోజు పట్టరాని కోపంతో ఊగిపోతూ అనరాని మాటలు అన్నాడు. అంతటితో ఊరుకోకుండా ఆ దుర్మార్గుడు చేతిలో వున్న ఈటెను ఎత్తి హజ్రత్ సుమయ్యా (రజి) మీదికి బలంగా విసిరాడు. ఆ దెబ్బకు ఆ సాధ్వీమణి విలవిల్లాడుతూ నేలకొరిగారు. సత్యధర్మ పథంలో ప్రప్రథమంగా రక్తం ధారపోసి అమరగతినొందిన అదృష్టం స్త్రీలలో ఆ ధీరవనితకే దక్కింది.

హజ్రత్ అమ్మార్ (రజి)ను కూడా అవిశ్వాసులు ఘోరాతిఘోరంగా హింసించారు. వారాయనకు ఇనుప కవచం తొడిగించి నిప్పులుచెరిగే ఎండలో చాలాసేపు నిలబెట్టేవారు. మండుతున్న ఇసుకనేల మీద పడేసి స్పృహ తప్పేవరకు కొట్టేవారు. ఈవిధంగా ఆ దుర్మార్గులు అమ్మార్ (రజి)ని హింసిస్తూ, తాము చెప్పినట్లు ముహమ్మద్ (స)ని దూషించి తమ దేవతలను పొగడవలసిందిగా బలవంతం చేశారు. చివరికి అమ్మార్ (రజి) ఈ బాధలకు తాళలేక వారు పలకమన్న మాటలన్నీ పలికారు.

ఆ తరువాత ఆయన రోదిస్తూ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నేను మిమ్మల్ని గురించి చెడుగా, వారి దేవతలను గురించి మంచిగా పలకనంతవరకు వారు నన్ను వదలిపెట్ట లేదు" అని చెప్పారు.

దైవప్రవక్త (స) ఈమాట విని "అప్పుడు నీ హృదయ పరిస్థితి ఎలా ఉండింది?" అని అడిగారు. "నేనప్పుడు పూర్తి విశ్వాస (ఈమాన్) స్థితిలోనే ఉన్నాను."

"అయితే వారు మరెప్పుడైనా దౌర్జన్యంచేస్తే నీవు మళ్ళీ అలాంటి మాటలే పలుకు" అన్నారు దైవప్రవక్త (స).

# 18. జాఫర్ తయ్యార్, నజాషీ (రజి)

మహనీయ ముహమ్మద్ (స) తన పెదనాన్న పడుతున్న కష్టాలు చూసి తల్లడిల్లిపోయారు. ఆయన ఓరోజు పినతండ్రి అబ్బాస్‌ని కలుసుకొని ఇలా అన్నారు:

"బాబాయ్! అబూతాలిబ్ పెదనాన్న సంసారం రోజురోజుకు చితికిపోతోంది. మనం చూస్తూ ఎలా ఉండగలం? ఆయన సంతానంలో ఇద్దరు పిల్లల్ని మన సంరక్షణలోకి తీసుకుంటే బాగుంటుంది. దానివల్ల ఆయనకు కొంతైనా భారం తగ్గిపోతుంది."

దానికి అబ్బాస్ "సరే, అలాగే తీసుకుందాం. ఇలాంటి పరిస్థితిలో మనం గాకపోతే మరెవరు ఆయన్ని ఆదుకుంటారు? తప్పకుండా తీసుకుందాం" అన్నాడు.

ఆ తర్వాత వారిద్దరూ అబూతాలిబ్ దగ్గరకు పోయి ఈ విషయం ఆయనకు చెప్పారు. అబూతాలిబ్ సంతోషంతో "మీరు కోరుకున్న వాళ్ళను తీసికెళ్ళండి" అన్నారు.

అప్పుడు అబ్బాస్, జాఫర్‌ని తన సంరక్షణలోకి తీసుకున్నాడు. ముహమ్మద్ మహనీయుని (సల్లం) సంరక్షణలోకి అయిదేళ్ళ అలి వచ్చాడు. జాఫర్ తన పెంపుడు తండ్రి అబ్బాస్‌కు ముందే ఇస్లాం స్వీకరించి ప్రప్రథమ విశ్వాసుల్లో చేరిపోయారు.

## (1) అబిసీనియాకు వలస

మక్కాలో ఎనభైమంది ముస్లిములు బహుదైవారాధకులు చేస్తున్న దౌర్జన్యాలు భరించలేక దైవప్రవక్త (సల్లం) అనుమతితో అబిసీనియా వలసపోయారు. ఈ సంగతి



తెలిసిన సత్యతిరస్కారులు వెంటనే కాబాలో సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం వారు ఇద్దరు ప్రతినిధుల్ని అబిసీనియా రాజు నజాషీ దగ్గరకు పంపారు.

వారిద్దరు అబిసీనియా వెళ్ళి ముందుగా క్రైస్తవ పాదరీలను కలుసుకున్నారు. క్రైస్తవ మతపెద్దల్ని తమ వైపు తిప్పుకొని పని గడుపుకునేందుకు వారికి విలువైన కానుకలిచ్చారు. తరువాత వారు రాజు నజాషీ దగ్గరకెళ్ళి అతనికి కూడా విలువైన కానుకలు సమర్పించు కొని ఇలా విన్నవించుకున్నారు:

"మహారాజావారికి ప్రణామములు. మా దేశం నుండి కొందరు నేరస్థులు పారిపోయి వచ్చి తమరి దగ్గర తలదాచుకున్నారని తెలిసింది. వారు మా సాంప్రదాయక మతం వదలి మతభ్రష్టులై పోయారు. మహారాజావారి మతమైన క్రైస్తవాన్ని కూడా వారు స్వీకరించ లేదు. మనకెవరికీ తెలియని ఓ కొత్తమతం లేవదీసి జాతి వినాశానికి పాల్పడ్డారు. అంచేత మా నాయకులు వీళ్ళను తీసుకు రమ్మని మమ్మల్ని పంపారు. వీరి గుణగణాలు మా నేతలకు బాగా తెలుసు. ఇలాంటి మతభ్రష్టుల్ని, జాతివిద్రోహుల్ని మీ దేశంలో ఉంచుకోవడం మంచిది కాదు. దయచేసి వీళ్ళను మాకప్పగించండి."

ముందే కానుకలు స్వీకరించిన క్రైస్తవ మతనాయకులు మక్కా అవిశ్వాసులకు వంతపాడుతూ "మహారాజా! వీరు చెప్పేది నిజమే. ఇటీవల అరేబియా నుంచి కొందరు నేరస్థులు పారిపోయి వచ్చి ఇక్కడ నివసించసాగారు. ఆ నేరస్థుల్ని వీరికి అప్పగించడమే మనకు అన్ని విధాలా శ్రేయస్కరంగా ఉంటుంది" అని అన్నారు.

"వీల్లేదు. వారు మాఆశ్రయం కోరి, మాదగ్గర ఉండటానికి ఇష్టపడ్డారు. వాస్తవం ఏమిటో వారి నోటనే విందాం. వాళ్ళను మా ముందు ప్రవేశపెట్టండి" అన్నాడు నజాషీ.

ఈమాట వినగానే ఖురైష్‌ప్రతినిధుల గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. కాస్సేపటికి రాజభటులు వలసవచ్చిన ముస్లిలను నజాషీ దర్బారులో ప్రవేశ పెట్టారు. "మీరు మీసాంప్రదాయక మతం వదిలేసి, ఇటు క్రైస్తవమతం కూడా కాదని ఏదో కొత్తమతం అవలంబించారని విన్నాం. ఏమిటా కొత్తమతం?" అడిగాడు రాజు.

అక్కడ వలస వచ్చిన ముస్లింలలో అబూతాలిబ్ కొడుకు హజ్రత్ జాఫర్ (రజి) కూడా ఉన్నారు. ఆయన ముస్లింల తరపున ఇలా సమాధానమిచ్చారు:

"మహారాజా! మేము పూర్వం అజ్ఞానులుగా ఉండి విగ్రహాలను పూజించేవాళ్ళం. చచ్చిన జీవాలను తినేవాళ్ళం. అశ్లీలతాఊబిలో దిగబడిఉన్నాం. నిరంతరం అంతఃకలహాలతో సతమతమై ఉండేవాళ్ళం. అలాంటి పరిస్థితిలో కరుణామయుడైన అల్లాహ్ మాలో ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. ఆయనెంతో గౌరవప్రదమైన వంశంలో పుట్టాడు. ఆయన సత్యసంధత, నిజాయితీలు మాకు మొదటి నుండీ తెలుసు. ఆయన మాకు

సత్యధర్మం వైపు పిలిచి దైవసందేశం బోధించాడు. 'మనమంతా ఏకైక దేవుడ్ని మాత్రమే ఆరాధించాలి. జీవంలేని విగ్రహాలను వదలిపెట్టాలి. ఎల్లప్పుడూ సత్యమే పలకాలి. జాలి, దయ, సానుభూతి కలిగివుండాలి. తోటిమానవుల కష్టాలలో పాలుపంచుకోవాలి. అశ్లీలతకు దూరంగా ఉండాలి. అనాథలసొమ్ము తినకూడదు. శీలవతులపై అపనిందలు మోపరాదు. నమాజ్, దానధర్మాలు చేస్తుండాలి' అని బోధించాడు.

రాజా! మేము ఆయన్ని సత్యప్రవక్తగా విశ్వసించాం. దైవసందేశం ద్వారా ఆయన తెలిపిన ప్రతి విషయాన్నీ మేము మనసారా స్వీకరించాం. ఈ కారణంగానే మా జాతి ప్రజలు ఆగ్రహించి మమ్మల్ని నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నారు. మేము స్వీకరించిన సత్యధర్మం వదలి పాతమతంలోకి తిరిగొచ్చి వారిలా అజ్ఞానాంధకారంలో కొట్టు మిట్టాడమని ఒత్తిడితెచ్చి మా జీవితాలను దుర్భరం చేశారు. చివరకు మేము వారి హింసాదౌర్జన్యాలు భరించలేక ఇక్కడైనా కాస్త స్వేచ్ఛగా గడపవచ్చని మీ దేశానికి వచ్చి తలదాచుకున్నాం.''

నజాషీ ఈ మాటలు విని ''సరే, ఆయనపై అవతరించిన దైవవాణి మీ దగ్గర ఏమైనా ఉందా? ఉంటే పఠించండి, నేను వింటాను'' అన్నాడు.

హజ్రత్ జాఫర్ (రజి) 'మర్యం' అధ్యాయంలోని కొన్ని సూక్తులు పఠించారు. ఖుర్ఆన్ వాణి విని నజాషీ ఎంతో ప్రభావితుడై కంట తడిపెట్టాడు. పాదరీల కళ్ళు కూడా అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి.

''దైవసాక్షి! ఈ వాణిలో సత్యతా పరిమళం తొంగిచూస్తోంది, ఈ వాణి, మూసా (అలైహి)పై అవతరించిన తౌరాత్‌వాణి ఒకే చెట్టుకొమ్మలుగా, ఒకే జ్యోతి కిరణాలుగా గోచరిస్తున్నాయి'' అన్నాడు నజాషీ కళ్ళు తుడుచుకుంటూ.

''మహారాజా! అక్కడే ఉంది కిటుకంతా. వీరు ముహమ్మద్ (సల్లం) రాసిచ్చిన ఈ వాణి పఠిస్తుంటే, శ్రోతలు ఎంతో ప్రభావితులయిపోతారు. అసలిది దైవవాణి కాదు. ముహమ్మద్ (సల్లం) సొంతవాణి'' అన్నారు ఖురైష్ ప్రతినిధులు.

ఈ మాట వినగానే హజ్రత్ జాఫర్ (రజి) వారి వైపు ఉరిమిచూశారు.

''అమ్ర్! నిజం చెప్పు. ముహమ్మద్ (సల్లం) చదవడం, వ్రాయడం రాని నిరక్షరాసి అని నీకు తెలియదా?'' అన్నారు ఆయన.

''ఆయన వేరేవాళ్ళ చేత రాయిస్తారు'' అన్నాడు అమ్ర్ బిన్ ఆస్.

''అంటే నీవు మొదట అబద్ధమాడావన్న మాట. ఆయన నిరక్షరాస్యుడని నీవు అంగీరిస్తుంటే, అలాంటి నిరక్షరాసి నోట ఇంతటి అద్భుతమైన వాణి వెలువడుతుందా? ద్వేషం, దురభిమానాలు నిన్ను అంధుడిగా చేశాయి'' అన్నాడు రాజు నజాషీ.



ఈమాట వినగానే అమ్ర్ భయపడిపోయాడు. కొంచెం ధైర్యం తెచ్చుకొని చివరి అస్త్రం సంధించాడు. ''మహారాజా! ఈ ముస్లింలు ఏసుక్రీస్తును గురించి చాలా చెడ్డగా మాట్లాడుతారు. ఆ మహనీయుడ్ని వీరు దేవుని కుమారుడిగా ఒప్పుకోరు.''

''నిజమే ప్రభూ! ఈ కొత్త మతస్థులు ఏసుప్రభువుని గురించి చెడుగా మాట్లాడుతారు'' అంటూ ఒక పాదరీ ఖురైషీయులకు వంత పలికాడు.

నజాషీ రాజు హజ్రత్ జాఫర్ వైపు తిరిగి ''ఏమిటీ ఇది నిజమా?'' అని అడిగాడు.

''కాదు రాజా! వీళ్ళు అబద్ధం చెబుతున్నారు. ఖుర్ఆన్ ప్రకారం 'ఈసా (అలైహి) దేవుని దాసుడు, ఆయన సందేశహరుడు మాత్రమే. కాకాపోతే ఆయన మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ, దేవుని దగ్గర్నుండి (మర్యంకు) పంపబడిన ఒక ఆత్మ'' (4:171). ఇదే మావిశ్వాసం'' అన్నారు జాఫర్ (రజి) ఏమాత్రం సంకోచించకుండా.

''మీ విశ్వాసం సరయినదే. ఇంజీల్‌లో కూడా ఈ భావమే ఉంది'' అంటూ నజాషీ క్రిందికి వంగి నేల మీదున్న ఓ చిన్న పుడక చేతిలోకి తీసుకున్నాడు.

''దైవసాక్షి! మీరు పేర్కొన్న దానికంటే ఈసా (అలైహి) ఈ పుడకంత కూడా అధికంగా లేరు'' అన్నాడు నజాషీ చేతిలోని పుడకను చూపిస్తూ.

ఈ మాటలు విని ముస్లింలు సంతోషించారు. ఖురైష్ ప్రతినిధులు మాత్రం నోళ్ళు మూసుకొని తలలు వంచుకున్నారు.

ఆ తరువాత నజాషీ ఖురైష్ ప్రతినిధుల వైపు తిరిగి ''వీళ్ళను మీవెంట పంపించే ప్రసక్తి లేదు. ఇక మీరు వచ్చిన దారే వెళ్ళిపోవచ్చు'' అన్నాడు.

దాంతో ఖురైష్ ప్రతినిధులు బిక్కమొహం వేసుకొని నజాషీ దర్బారు నుండి బయటికి వచ్చి చక్కా మక్కా దారి పట్టారు.

దైవప్రవక్త (సల్లం), నజాషీకి ఇస్లాం సందేశంతో పాటు అబిసీనియాలోని ముస్లిం కాందిశీకుల్ని మదీనా పంపించమని ఆదేశిస్తూ ఒక లేఖ రాశారు. ఇప్పుడా కాందిశీకులు మదీనా వెళ్ళిపోయే సమయం ఆసన్నమయింది. వారి కోసం దైవప్రవక్త (సల్లం) రెండు ఓడలు పంపించారు.

ఈ శరణార్థులంతా ఆ ఓడలలో అబిసీనియా (ఇథియోపియా) నుండి బయలుదేరి మదీనా చేరుకున్నారు. మదీనా చేరుకున్న తరువాత దైవప్రవక్త (సల్లం) యోధుల్ని తీసుకొని ఖైబర్ వెళ్ళారని తెలిసింది. దాంతో ఈ శరణార్థులంతా మదీనా నుంచి మళ్ళీ ఖైబర్‌కు బయలుదేరారు.

దైవప్రవక్త (స), ఆయన అనుచరులు ఖైబర్ దండయాత్ర నుండి తిరిగివెళ్ళడానికి ప్రయాణసన్నాహాలు ప్రారంభించారు. అంతలో హజ్రత్ జాఫర్ (రజి) నేతృత్వంలో

అబిసీనియా శరణార్థులు, నజాషీ రాసిన లేఖ, ఆయన పంపిన కానుకలతో ఖైబర్‌కు చేరుకున్నారు.

హజ్రత్ జాఫర్ (రజి) అకస్మాత్తుగా తన ముందు కన్పించగానే దైవప్రవక్త (సల్లం) సంతోషంతో తబ్బిబ్బుయిపోయారు. ఆయన జాఫర్ (రజి)ని గాఢంగా గుండెలకు హత్తుకొని నుదుటిని పలుమార్లు చుంబించారు. "మనకు ఖైబర్‌విజయం వల్ల ఎక్కువ సంతోషం కలిగిందో లేక జాఫర్ రాకవల్ల ఎక్కువ సంతోషం కలిగిందో నేను చెప్పలేను" అన్నారాయన. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని ఖైబర్ నుండి బయలుదేరారు.

ముస్లింలు మొట్టమొదటిసారిగా కాబాయాత్ర (ఉమ్రా) జరపడానికి మక్కా చేరుకున్నారు. ఉమ్రా విధి నెరవేర్చిన తరువాత తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు.

అంతలో హజ్రత్ హమ్జా (రజి) కుమార్తె అమ్మారా "బాబాయ్! బాబాయ్!! నన్ను కూడా మీవెంట మదీనా తీసికెళ్ళరూ?" అంటూ హజ్రత్ అలి (రజి) దగ్గరకు పరుగెత్తుకొని వచ్చింది. వెంటనే హజ్రత్ అలి (రజి) ఆ పాపను ఎత్తుకొని ముద్దాడారు. హమ్జా (రజి) కూడా ప్రవక్త పినతండ్రే. ఆయన ఉహుద్ యుద్ధంలో అమరగతినొందారు.

ఆతర్వాత "ఈపాప మాబాబాయి హమ్జా కూతురు. మనం ఈమెను తీసికెళ్ళి పెంచుకుందాం" అంటూ అలి(రజి) ఆమెను అర్ధాంగి ఫాతిమా (రజి)కు ఇచ్చారు.

అప్పుడు హజ్రత్ జాఫర్ (రజి) వచ్చి "ఈ అమ్మాయి నా పినతండ్రి కూతురు గనక ఈమెను తీసుకొని పెంచుకునే హక్కు నాకెక్కువ ఉంది" అని చెప్పారు.

"ఆగండి. ఈ పాపతండ్రి హమ్జా నా ధార్మికసోదరుడు. కాబట్టి ఈమెను పెంచు కునే హక్కు నాకే లభించాలి" అన్నారు హజ్రత్ జైద్ (రజి) కూడా అక్కడకు వచ్చి.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) కలగజేసుకుంటూ "ఈ అమ్మాయి పినతల్లి జాఫర్ ఇంట్లో ఉంటోంది. పినతల్లి కన్నతల్లి స్థానం ఆక్రమించుకుంటుంది. కనుక ఈ పాపకు జాఫర్ ఇంట్లోనే ఎక్కువ సుఖంగా ఉంటుంది" అన్నారు.

ఈవిధంగా చిన్నారి అమ్మారా హజ్రత్ జాఫర్ (రజి) సంరక్షణలోకి వచ్చింది. ఆ పాపతో పాటు ఆమె తల్లి సల్మా బిన్త్ అమీస్ (రజి)ని కూడా వెంట తీసుకున్నారు.

ఆ సందర్భంలో దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అలి (రజి)తో "నువ్వు నావాడివి, నేను నీవాడ్ని" అన్నారు. హజ్రత్ జైద్ (రజి)తో "నువ్వు నా సోదరుడు, స్నేహితుడవు" అన్నారు. హజ్రత్ జాఫర్ (రజి)తో "నడవడిక, రూపురేఖల్లో నువ్వు నాలాంటి వాడివి" అన్నారాయన.



# (౭) మూతా యుద్ధం

సిరియాలోని "జాతుత్తలహ్" అనే ప్రాంతానికి ధర్మప్రచారం కోసం ప్రవక్త అనుచర బృందం ఒకటి వెళ్ళింది. అయితే శత్రువులు ప్రచారబృందం సభ్యుల్ని దారుణంగా చంపేశారు. ఒకడు మాత్రమే ఎలాగో తప్పించుకోగలిగాడు. బస్రాగవర్నర్ దగ్గరికి కూడా దైవప్రవక్త (స) తన ప్రతినిధి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని పంపించారు.

హజ్రత్ హారిస్ (రజి) బస్రా వైపు ప్రయాణంసాగిస్తూ సిరియా సరిహద్దు సమీపం లోని మూతా ప్రాంతానికి చేరుకున్నారు. మూతా రోమ్‌రాజ్యంలోని భూభాగమే. కాని మూతాగవర్నర్ షుర్జిల్ బిన్ అమ్ర్ దౌత్యనీతికి తిలోదకాలిచ్చి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని బంధించి, ఆ తరువాత హతమార్చివేశాడు.

ఈ రెండు దుర్ఘటనలు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హృదయాన్ని బాగా కలచివేశాయి. ధర్మప్రచారకులుగా, దౌత్యవేత్తలుగా పోయినవారిని దౌత్యనీతిని ఉల్లంఘించి అన్యాయంగా హతమార్చడం మానవతకే కళంకం. ఈ విద్రోహుల్ని అలా వదలిపెడ్తే మరెన్ని ఘాతుకాలకైనా పాల్పడవచ్చు. అంచేత దైవప్రవక్త (స) తక్షణమే మూడువేల మంది యోధులతో కూడిన ఓ సైనికదళాన్ని సిద్ధంచేశారు. జైద్ బిన్ హారిసా (రజి)ను దానికి సేనాపతిగా నియమించారు. ఆ తరువాత ముజాహిద్‌లను ఈవిధంగా ఆదేశించారు:

"ఒకవేళ జైద్ అమరగతుడయితే జాఫర్ సేనాపతి అవుతాడు. జాఫర్ అమరగతుడైతే అబ్దుల్లా బిన్ రవాహ సేనాని అవుతాడు. అబ్దుల్లా కూడా అమరగతుడయితే సైనికులు తాము కోరుకున్న వ్యక్తిని సేనాపతిగా ఎన్నుకోవాలి."

ముజాహిద్‌లు హిజ్రీశకం 8వ సంవత్సరం, జమాదిల్ అవ్వల్ నెలలో మదీనా నుండి బయలుదేరారు. దారిలో హజ్రత్ ఇబ్నెరవాహ (రజి) తన కవితాపటిమతో ముజాహిద్ లలో ఉత్తేజం కలిగించేవారు.

రోమ్ సామ్రాజ్యంలోని "మూతా" ప్రాంతం పాలకుడు షుర్జిల్ బిన్ అమ్ర్ ముస్లింల యుద్ధ సన్నాహాలను గురించి ముందే తెలుసుకొని లక్షమంది సైనికుల్ని సమీకరించాడు. అదీగాక రోమ్ చక్రవర్తి సహాయం కూడా కోరాడు.

సిరియాలో అడుగుపెట్టే వరకూ ముస్లింలకు ఈ విషయం తెలియదు. వారు లక్షమంది రోమ్‌సైనికుల్ని చూసి నిర్ఘాంతపోయారు. ఇప్పుడేం చేయాలి? పరిస్థితి దైవప్రవక్త (సల్లం)కు తెలియజేయడమా? లేక ఈ భారీ సైన్యానికి ఎదురు నిలిచి పోరాడటమా? ముజాహిద్‌లు సందిగ్ధంలో పడిపోయారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి)లోని పౌరుషం బుసలుకొట్టింది.

"సోదరులారా! మనం ఎప్పుడూ సంఖ్యాధిక్యతను దృష్టిలో పెట్టుకొని యుద్ధం చేయలేదు. అశ్వాలపై, ఆయుధాలపై కూడా మనం ఎన్నడూ ఆధారపడలేదు. మన అసలు ఆయుధం దైవధర్మం. పదండి. విజయమో, వీరమరణమో ఏదో ఓ కోరిక నెరవేరుతుంది. దైవనామం ఉచ్చరించి ముందుకు సాగండి" అన్నారు ఆయన.

ఇబ్నెరవాహ (రజి) ప్రసంగం వినగానే సేనాపతి జైద్ బిన్ హారిస్ (రజి) ఒక చేతిలో పతాకం, మరొక చేతిలో ఈటె తీసుకొని లేచి నిలబడ్డారు. సేనాపతి సమరోత్సాహం చూడగానే మిగిలిన యోధులలో నూతనుత్తేజం జనించింది. ఆ వెనువెంటనే అందరూ రోమ్ సేనలతో ఢీకొనడానికి సిద్ధమయ్యారు.

హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) ఒక చేతిలో ధ్వజం, రెండవ చేతిలో ఖడ్గం పట్టుకొని పెనుతుఫానులా శత్రుసైన్యంలోకి దూసుకుపోయారు. చాలా సేపటిదాకా భయంకరంగా పోరాడుతూ అనేకమంది శత్రువుల్ని కూల్చివేశారు. కాని శత్రుసైనికులు అత్యధికసంఖ్యలో ఉండటంవల్ల జైద్ (రజి)పై నలువైపుల నుంచి బాణాలు ఎడతెరిపి లేకుండా వచ్చిపడుతున్నాయి. అయినప్పటికీ ఆయన ఎంతో ధైర్యంతో పోరాడుతూ చివరికి శరీరం నిండా గాయాలతో కుప్పకూలిపోయారు.

తక్షణమే హజ్రత్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) సమరధ్వజం ఎత్తుకొని శత్రువులపై విరుచుకుపడ్డారు. ఎదురొచ్చిన శత్రువుల్ని హతమారుస్తూ అప్రతిహతంగా ముందుకు పురోగమించారు. కాని శత్రువులు చక్రబంధం వేసి జాఫర్ (రజి) కుడిచేతిని తెగ్గొట్టారు. ఆ చేతిలో ఉన్న యుద్ధపతాకం జారిపోయింది. వెంటనే ఆయన దాన్ని ఎడమ చేతిలోకి తీసుకున్నారు. శత్రువులు ఆయన ఎడమ చేతిని కూడా తెగ్గొట్టారు. హజ్రత్ జాఫర్ (రజి) దాన్ని క్రింద పడనీయకుండా మొండిచేతులతో గుండెలకు అదిమి పట్టుకున్నారు. కాని మరుక్షణమే ఓ రోమ్ సైనికుడు మెరుపుదాడి చెయ్యడంతో హజ్రత్ జాఫర్ (రజి) కూడా అమరగతులయ్యారు.

వెంటనే హజ్రత్ ఇబ్నెరవాహ (రజి) పరుగెత్తి పతాకం చేతిలోకి తీసుకున్నారు. పతాకం తీసుకోగానే రెండవచేతిలో ఉన్న ఖడ్గంతో శత్రువుల మీదికి లంఘించారు. ఆయన కూడా చాలా సేపటివరకు వీరోచితంగా పోరాడుతూ చివరికి తీవ్రంగా గాయపడి అమరగతులయ్యారు.

దైవప్రవక్త (స) నియమించిన ముగ్గురు సేనాపతులు కూడా అమరగతులయ్యారు. అప్పుడు ముజాహిద్‌లు పరస్పరం ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతిగా ఎన్నుకున్నారు. తక్షణమే ఆయన సమరధ్వజం తీసుకొని సుడిగాలిలా శత్రుపక్షంలోకి దూసుకుపోయి ఇదివరకటి సేనాపతులకన్నా భయంకరంగా పోరాడి అనేకమంది శత్రువుల్ని కడతేర్చారు. చివరికి ముస్లింయోధుల ధాటికి రోమ్‌సైనికులు నిలువలేక పారిపోయారు.



## (3) మదీనాలో మూతా యుద్ధవార్తలు

మదీనాలో ముస్లింలు మూతా యుద్ధవార్తల కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఒకరోజు దైవప్రవక్త (సల్లం) మసీదులో కూర్చొని ఆలోచనల్లో మునిగిపోయారు. ముఖంలో గాంభీర్యత చోటుచేసుకుంది. అనుచరులు ఆయన చుట్టూ కూర్చొని ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) నోట ఏసత్యవాక్కు వెలువడుతుంతో విందామని కుతూహలంతో వారు మరింత దగ్గరకు జరిగి నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"అదిగో! జైద్ బిన్ హారిసా. సమరధ్వజం తీసుకొని రంగంలోకి దూకాడు."

అనుచరులు సంభ్రమాశ్చర్యాలతో తమ ప్రియతమ నాయకుని వైపు చూస్తున్నారు.

"అతనిప్పుడు శత్రుసైన్యంలోకి దూసుకుపోయాడు. భీకరంగా పోరాడుతున్నాడు. పోరాడుతూ పోరాడుతూ చివరికి అమరగతి నొందాడు" అన్నారు దైవప్రవక్త (స).

అమరగతి సంగతి వినగానే అనుచరుల ముఖాలు కళావిహీన మయ్యాయి.

మహాప్రవక్త (సల్లం) దైవమహిమతో ఇక్కడ్నుంచే అక్కడి సమర దృశ్యాన్ని వీక్షిస్తున్నా రని వారు గ్రహించారు. ఆ తరువాత ఏం జరగబోతుందోనని కంగారుపడుతూ ఆయన చెబుతున్న విషయాలను చెవులు రిక్కించి వినసాగారు.

"వెంటనే సమరధ్వజాన్ని జాఫర్ అందుకున్నాడు..... ఆయన కూడా శత్రువులతో పోరాడుతూ చివరికి అమరగతినొందాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ సంగతి చెప్పి ఆయన కాస్సేపు మౌనంగా ఉండిపోయారు. అనుచరులు మరింత ఆందోళనచెందారు.

"తర్వాత యుద్ధపతాకం అబ్దుల్లా బిన్‌రవాహ (రజి) చేతికొచ్చింది...ఆయన కూడా చాలాసేపు పోరాడి చివరికి దైవసన్నిధికి చేరుకున్నాడు" అన్నారు దైవప్రవక్త (స).

ముజాహిద్‌ల నాయకులు ముగ్గురూ అమర గతులైపోయారు. దీన్నిబట్టి శత్రువులు అసంఖ్యాకంగా ఉంటారని, పరిస్థితి చాలా క్లిష్టంగానే ఉందని గ్రహించారు అనుచరులు. దాంతో వారిముఖాలు పూర్తిగా వాడిపోయాయి.

"దైవప్రవక్తా! ఇబ్నె రవాహ అమరగతి వార్త చెప్పక ముందు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. కారణం ఏమిటో మాకర్థం కాలేదు" అన్నారు కొందరు.

"జైద్ పరుగిడుతూ స్వర్గంలో ప్రవేశిస్తుంటే చూశాను. తర్వాత జాఫర్‌ని చూస్తే, అతను స్వర్గంలో రెక్కలతో ఎగురుతూ తానుకోరిన చోటికల్లా చేరడం కన్పించింది. కాని అబ్దుల్లా కాస్త ఆలస్యంగా స్వర్గంలో ప్రవేశించాడు" చెప్పారు దైవప్రవక్త (స)

"అయితే దైవప్రవక్తా! అబ్దుల్లాకు స్వర్గం చేరుకోవడానికి ఆలస్యం ఎందుకయి

నట్లు?'' అడిగారు వారు ఆందోళనతో.

"గాయపడటం వల్ల ఆయన కాస్త వెనక్కితగ్గాడు. తర్వాత జరిగిన పొరపాటు గ్రహించి మళ్ళీ రంగంలోకి దూకాడు. శత్రువులతో పోరాడి అమరగతినొందాడు. అందువల్ల స్వర్గంలో కాస్త ఆలస్యంగా ప్రవేశించాడు'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాటలు విని అనుచరుల మనస్సు కాస్త కుదుటపడింది. హజ్రత్ జాఫర్ (రజి) స్వర్గంలో రెక్కలతో ఎగురుతున్నారని వినగానే జనం ఆయన్ని జాఫర్ తయ్యార్ అనే పేరుతో ప్రస్తావించడం ప్రారంభించారు.

అయితే జాఫర్ (రజి) అమరగతి కారణంగా దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం వాడిపోయింది. ఆయన విచారవదనంతో అక్కడ్నుంచి బయటికి వెళ్ళిపోయారు. నేరుగా ఆయన హజ్రత్ జాఫర్ (రజి) ఇంటికి వెళ్ళారు. ఇంట్లో జాఫర్ (రజి) సతీమణి అస్మా బిన్తె అమీస్ (రజి) మాత్రమే ఉన్నారు.

"అస్మా! జాఫర్ ముద్దు బిడ్డలేరి?'' అడిగారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! ఏమిటీ అలా అడుగుతున్నారు? ఆయన క్షేమంగానే ఉన్నారు కదూ? అయ్యయ్యో! ఎందుకా కన్నీళ్ళు? జాఫర్ అమరగతులయ్యారా?'' అంటూ హజ్రత్ అస్మా (రజి) కంగారుపడసాగారు.

"ఔనమ్మా! ఆయన్ని ఈరోజు దేవుడు తన దగ్గరికి పిలుచుకున్నాడు'' అన్నారు దైవప్రవక్త (సల్లం) గద్గద స్వరంతో, కన్నీళ్ళు పొరలుతుండగా.

భర్త మరణవార్త వినగానే ఆమె గావుకేక పెట్టారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ గుండెలు బాదుకోసాగారు.

"అస్మా! బాధపడకమ్మా!! అలా గుండెలు బాదుకోకు. అనుచితమైన ఎలాంటి మాటా నీ నోట వెలువడకూడదు. ధైర్యం తెచ్చుకో తల్లీ.... '' అంటూ దైవప్రవక్త (సల్లం) ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించారు.

శోకతప్త హృదయంతో ఆయన తన చిన్నారికూతురు హజ్రత్ ఫాతిమా (రజి) ఇంటికి వెళ్ళారు. ఆమెతో మాట్లాడుతూ "ఎవరైనా దుఃఖించవలసివుంటే వారు జాఫర్ (రజి)ని తలచుకొని దుఃఖించాలి'' అన్నారు.

అక్కడ్నుంచి దైవప్రవక్త (సల్లం) తన ఇంటికెళ్ళి "జాఫర్ కుటుంబసభ్యుల కోసం భోజనం తయారుచేయండి. ఈరోజు వారు స్పృహలోలేరు'' అన్నారు తన భార్యలతో. తర్వాత ఆయన జైద్ (రజి) ఇంటికి వెళ్ళారు. అక్కడ్నుంచి అబ్దుల్లా బిన్ రావాహ (రజి) ఇంటికి వెళ్ళారు. వారిరువురి కుటుంబసభ్యుల్ని కలుసుకొని వారికి ధైర్యసహనాలను ఉపదేశించారు. వారి పిల్లలను అక్కున చేర్చుకొని ప్రేమగా తలలు నిమిరారు.



# 19. హమ్జా (రజి) బిన్ అబూతాలిబ్

ఓరోజు దైవప్రవక్త (స) ఎక్కడికో వెళ్తుంటే దారిలో అబూజహల్ ఎదురై ఆయనపై మండిపడుతూ అకారణంగా దూషించడం మొదలుపెట్టాడు. అనరాని మాటలు అని మనసులోని అక్కసంతా వెళ్ళబోసుకున్నాడు. కారుణ్యమూర్తి (స) మటుకు పల్లెత్తు మాట అనలేదు. అసలతని వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

అయితే దైవప్రవక్త (స) సమాధానమైనా ఇవ్వకపోవడంతో అబూజహల్ మరింత రెచ్చిపోయాడు. కోపోద్రేకాలతో చిందులు తొక్కాడు. దారి పక్కనే ఉన్న కంకర్రాళ్ళు తీసుకొని ఆయన మీదికి విసిరికొట్టాడు. అయినా మహాప్రవక్త (స) అతని దౌర్జన్యానికి ఏమాత్రం బాధపడలేదు. ప్రతిక్రియ కోసం అసలే పూనుకోలేదు. ఆయన సహనంతో అతడ్ని నుంచి మెల్లిగా తప్పించుకొని మౌనంగా వెళ్ళిపోయారు.

వీళ్ళిద్దరికి కొంచెం దూరంలో ఇదంతా ఓ దాసి గమనిస్తూ నిలబడివుంది. సత్యసంధుడు, నిజాయితీపరుడైన దైవప్రవక్త (స) పట్ల అబూజహల్ ప్రవర్తించిన తీరు చూసి ఆమె హృదయం ద్రవించిపోయింది.

ఆమె ఇదివరకే ఇస్లాంధర్మాన్ని విశ్వసించింది. ఆమెకు దైవప్రవక్త (స) పట్ల అపారమైన అభిమానం ఉంది. అయితే ఈ విషయం ఆమె ఇంకా బయటపెట్టలేదు. ఇస్లాంస్వీకరణ సంగతి తన యజమానికి తెలిస్తే అతను తనను చిత్రహింసలు పెట్టి చంపుతాడు. అందువల్ల ఆమె ఇస్లాంపట్ల తన విశ్వాసాన్ని కొంతకాలంపాటు రహస్యం గానే ఉంచవలసి వచ్చింది.

దైవప్రవక్త (స)పై అకారణంగా అబూజహల్ చేసిన దౌర్జన్యం చూడగానే ఆ దాసి లోని విశ్వాసం ఉరకలు వేసింది. ఎలాగైనా ఆ దుర్మార్గుడి ఆట కట్టించాలని అనుకున్నది. ఆరోజు సాయంత్రం పట్నం వెలుపల కొండల వైపు దారి తీసింది.

అలా ఆమె ఓ కొండ పక్కగా నడుస్తుంటే ఎదురుగా అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు హమ్జా రావడం కన్పించింది. అతని నడుముకు కరవాలం వ్రేలాడుతోంది. భుజానికి విల్లు, వీపు వెనుక అంబులపొది కూడా ఉన్నాయి. బంధుత్వం రీత్యా దైవప్రవక్త (సల్లం)కు పినతల్లి కుమారుడు అవుతాడు. పైగా ఇద్దరూ ఒకే స్త్రీ పాలు తాగి ఉన్నందున దైవప్రవక్త (సల్లం)కు స్తన్యసంబంధ సోదరుడు కూడా అవుతాడు.

హమ్జా బిన్ అబూతాలిబ్ వేటకు పోయివస్తున్నాడు. వేట నుంచి రాగానే అతను మొదట కాబాలయ ప్రదక్షిణ చేస్తాడు. ఆ తర్వాత అక్కడున్న ఖురైష్ నాయకులతో కాస్సేపు ముచ్చటించి ఇంటికి చేరుకుంటాడు. ఇది అతని దినచర్య. దాసీ హమ్జాను చూడగానే ఇలా అన్నది:

"అబూఉమారా (హమ్జా)! మీలో ఆత్మాభిమానం మచ్చుకైనా లేదా? బనీమఖ్జూమ్ గూండాలు ముహమ్మద్ (సల్లం)ను విచ్చలవిడిగా హింసిస్తుంటే మీరు ఏమీ పట్టనట్లు ఉంటారేమిటీ?"

నడుస్తున్న హమ్జా తక్కున ఆగి "అబ్దుల్లా దాసీ! ఏమిటీ నువ్వంటున్నది?" అని అడిగాడు అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఏమని చెప్పను? ఈరోజు మీ ముహమ్మద్‌కు ఏమైందో తెలుసా? ఆయన ఉదయం ఏదో పనిమీద వెళ్తుంటే, అబూజహల్ ఎక్కడ్నుంచో ఊడిపడ్డాడు. వచ్చీరాగానే నోటికొచ్చినట్లు నానాతిట్లు తిట్టాడు. నేను సహించలేక పోయాను. సరే అంతటితో ఊరుకున్నాడా? పిడికెడు కంకర్రాళ్ళు తీసుకొని ఆయన ముఖం మీదికి విసిరికొట్టాడు." అన్నది దాసి.

"ఏమిటీ! నిజమా!! నువ్వు చూశావా?" అడిగాడు హమ్జా ఆశ్చర్యాగ్రహాలతో.

"ఔను. నేను నా కళ్ళారా చూశాను. చెవులారా విన్నాను" అన్నది దాసీ.

"అయితే ఉండు, ఇప్పుడే ఆ దుర్మార్గుడి సంగతి తేల్చుకుంటాను." నిప్పులు కక్కుతూ, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ కాబా మందిరం వైపు నడిచాడు హమ్జా.

కాబా మందిరంలో ఓ మూల ఖురైష్ నాయకులు గుమికూడి ఇస్లాంకు వ్యతిరేకంగా మంతనాలు జరుపుతున్నారు. వారిలో అబూజహల్ కూడా ఉన్నాడు.

హమ్జా కోపంతో ఊగిపోతూ నేరుగా కాబాలయంలోకి ప్రవేశించి ఓసారి చుట్టూ కలియ జూశాడు. ఖురైష్ నాయకుల మధ్య కూర్చున్న అబూజహల్ మీద దృష్టి పడగానే పళ్ళు పటపట కొరికాడు. నాలుగైదు అంగల్లో అబూజహల్ దగ్గరికి దూసుకుపోయాడు. భుజానికి ఉన్న ధనుస్సు చేతిలోకి తీసుకొని అతని మీద బలంగా కొట్టాడు.

అంతే, అబూజహల్ తల పగిలిపోయింది. తల నుండి రక్తం చిల్లిపడిన కుండలా బొటబొట కారసాగింది. మొహమంతా రక్తసిక్తమయింది. క్షణంపాటు కళ్ళు బైర్లు కమ్మాయి. తరువాత అతను తేరుకొని హమ్జా వైపు చూశాడు. హమ్జా కళ్ళ నుంచి అగ్నికణాలు రాలుతున్నాయి.

"దుర్మార్గుడా! ముహమ్మద్ ఎవరనుకున్నావ్? ఆయన నా అన్నకొడుకు. నువ్వు అనాథ అని చులకనగా భావించినవాడు, నీ తిట్లు దెబ్బలు తిన్నవాడు నా సొంత అన్న కొడుకని తెలియదా?" అన్నాడు హమ్జా సింహంలా గర్జిస్తూ.

హమ్జా తీవి, దర్పం గల మనిషి. అతనికి కోపం వస్తే అందరూ వణికిపోతారు. ఏదైనా వ్యవహారం బెడిస్తే అతని ముందు పెదవి విప్పడానికి కూడా ఎవరూ సాహసించ లేరు. అందువల్ల అబూజహల్ పరిస్థితి గ్రహించి నెమ్మదిగా నోరు విప్పాడు:



"హమ్జా! ముహమ్మద్ మనల్ని మూర్ఖుల కింద జమకట్టాడు. మన బుర్రలనే మరమ్మత్తు చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. మన తాతముత్తాతల ఆచారాల మీద దాడి చేస్తున్నాడు. పైగా మన దేవతలను కూడా విమర్శిస్తున్నాడు. బానిసల్ని రెచ్చగొట్టి మతభ్రష్టుల్ని చేస్తున్నాడు" అన్నాడు ముఖం మీది రక్తం తుడుచుకుంటూ.

"మూర్ఖుడా! అల్లాహ్‌ను కాదని విగ్రహాలను పూజిస్తున్నావు కదూ! బాగా విను. నేను మా ముహమ్మద్ పక్షం వాడినే. ఆయనకే నా పూర్తి మద్దతు. ఇకనుంచి నేను ఇస్లాం కోసమే జీవిస్తాను; ఇస్లాం కోసమే మరణిస్తాను" అన్నాడు హమ్జా.

ఈ మాటలు విని అబూజహల్‌తో పాటు అక్కడున్నవారంతా విస్తుబోయారు. వాళ్ళలో అబూజహల్‌కు చెందిన బనీమఖ్జూమ్ తెగవాళ్ళు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని అబూజహల్‌కు సహాయం చేయడానికి సిద్ధమయ్యారు.

"హమ్జా! నీవాలకం చూస్తుంటే నువ్వు మన పూర్వీకుల మతం వదలి ఇతరుల వలలో పడినట్లు అన్పిస్తోంది" అన్నారు వారు.

"ఔను. ఇస్లాం సత్యధర్మం అని తెలిసినప్పుడు దాన్ని నేనెందుకు స్వీకరించను? ముహమ్మద్ చెప్పే విషయం పరమ సత్యం. అందులో నాకెలాంటి అనుమానం లేదు. దైవసాక్షి! ఆ సత్యాన్ని నేనూ స్వీకరిస్తాను. చేతనైతే నన్ను ఎదిరించండి" అని చెప్పి హమ్జా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

సత్యతిరస్కారులైె ఖురైష్ నాయకులు ఏమీ చేయలేక జావగారిన ముఖాలతో గుడ్లప్పగించి హమ్జా వెళ్తున్న వైపు చూస్తూ ఉండిపోయారు.

హమ్జా కాబా నుండి ఇంటికి వచ్చాడు. పరమ కిరాతకుడు అబూజహల్ మదం అణగినందుకు ఆయనకిప్పుడు తృప్తిగా ఉంది. కాని ఇస్లాం విషయంలో మటుకు ఆయన మనస్సు పరిపరివిధాల ఆలోచనలకు పోతోంది.

"ఇంతకూ తానన్న మాట సరయినదేనా? కొంపతీసి తాను ఉద్రేకపు ఉరవడిలో పడి పొరపాటు చేయలేదుకదా? ఏమో, ఆ దేవుడే కాపాడాలి. దేవా! నాకు సన్మార్గం చూపు" అంటూ దైవాన్ని ప్రార్థించాడు హమ్జా.

ఆ రాత్రి హమ్జాకు నిద్ర పట్టలేదు. మనసులో దేవుడ్ని ప్రార్థిస్తూ గడిపాడు. రాత్రి చివరి ఘడియల్లో కాస్తంత కునుకు పట్టింది. అంతలో భళ్ళున తెల్లారింది. కళ్ళుతెరచి చూస్తే ప్రకృతి శోభాయమానంగా కన్పించింది. మనసు తేలిక పడినట్లు అన్పించింది. ఆంతర్యం విశ్వాస జ్యోతితో ప్రకాశవంతమైనట్లు అనుభూతి కలిగింది.

దాంతో ఆయన నూతనోత్సాహంతో లేచారు. గబగబా కాలకృత్యాలు ముగించు కొని, దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. మొదట తాను అబూజహల్ గర్వాన్ని అణచిన

సంగతి చెప్పి దైవప్రవక్త (సల్లం)ను సంతోషపరుద్దామనుకున్నాడు.

"నా సోదరకుమారా! నువ్వీ సంగతి వింటే చాలా సంతోషిస్తావు. నేను నీ తరఫున అబూజహల్ మీద ప్రతీకారం తీర్చుకున్నాను" అన్నాడు హమ్జా.

"బాబాయ్! ఇలాంటి మాటలు నాకు సంతోషం కలిగించవు. మీరు ఇస్లాం స్వీకరిస్తే మాత్రం నాకెంతో సంతోషంగా ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ విషయం గురించి హమ్జా రాత్రంతా తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడం వల్ల వెంటనే ఆయన ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు.

"దైవప్రవక్తా! ఇకనుండి నేను అంతిమశ్వాస వరకు సత్యధర్మం కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతూ ఉంటాను" అన్నారు ఆయన అమితోత్సాహంతో.

ఈ మాటలు వినగానే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ముఖారవిందం కలువ పువ్వులా విప్పారింది. పున్నమి చంద్రునిలా వెలిగిపోయింది. అంతరంగం ఆనందంతో ఉప్పొంగింది. "దేవా! హమ్జాను సత్యధర్మంలో స్థిరంగా ఉంచు" అన్నారు ఆయన అప్రయత్నంగా.

హజ్రత్ హమ్జా (రజి) నూతనధర్మం స్వీకరించడంతో అవిశ్వాసులు ఓ గొప్ప సాహసవంతుడ్ని, మహాయోధుడ్ని కోల్పోయారు. ఈ వార్త ముస్లింలను మాత్రం ఎంతో ఉత్తేజపరిచింది.

ఔను మరి, హమ్జా (రజి) సామాన్య వ్యక్తి కాదు. కాకలు తీరిన యోధుడు. ఆయన బలపరాక్రమ గాథలు దేశం నలుమూలలా విస్తరించి ఉన్నాయి. అలాంటి హమ్జా (రజి) ఇప్పుడు ముస్లిం అయ్యాడంటే ఇస్లామీయ ఉద్యమం గొప్ప మలుపు తిరిగిందన్న మాట.

అవిశ్వాసుల ఆగడాలకు తాళలేక ముస్లింలు మక్కా నుండి మదీనాకు వలస పోయారు. అప్పుడు హజ్రత్ హమ్జా (రజి) కూడా మక్కా వదలి మదీనాకు వెళ్ళిపోయారు. ఆ తరువాత దైవప్రవక్త (స) మదీనా వెళ్ళిపోయారు. బదర్ యుద్ధం తరువాత ఉహద్ యుద్ధం మొదలయింది.

ఉహద్ మైదానం యుద్ధ వీరులతో నిండిపోయింది. ఒకవైపు దైవాన్నే నమ్ముకొని క్రమశిక్షణతో బారులుతీరి ఉన్న ఇస్లామీయ యోధులు తమ ప్రియతమ నాయకుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అనుజ్ఞ కోసం నిరీక్షిస్తున్నారు. వారికి ఎదురుగా సత్యతిరస్కారులు గాండ్రిస్తూ, గర్జిస్తూ ముస్లింలను చీల్చిచెండాటానికి తహతహలాడి పోతున్నారు. బదర్ యుద్ధంలో ఘోరపరాజయం చవిచూసిన ఖురైషీయులు ప్రతీకారంతో ఉడికిపోతున్నారు.



యుద్ధమైదానంలో అబూసుఫ్యాన్ భార్య హిందా నాయకత్వంలో స్త్రీలు అటూ ఇటూ తిరుగుతూ పరుషవచనాలతో సైనికుల్ని ఉద్రేకపరచసాగారు. ఆమె వహ్షీ దగ్గరకెళ్ళి ముహమ్మద్, హమ్జా, అలి- ఈ ముగ్గురిలో ఎవరినైనా ఒకరిని వధిస్తానని అతను చేసిన వాగ్దానాన్ని గుర్తుచేస్తూ "అబూదస్మా! నువ్వు చేసిన వాగ్దానం ప్రకారం శత్రువుని చంపి నా గుండెల్లో మండుతున్న ప్రతీకారాగ్నిని చల్లార్చు. స్వయంగా నువ్వు కూడా తృప్తిపడు" అని చెప్పింది.

వహ్షీకి తన కర్తవ్యం గుర్తుకొచ్చి ధనుర్బాణాలు తీసుకొని హజ్రత్ హమ్జా (రజి)ను అనుసరించసాగాడు. హమ్జా (రజి)ను హతమారిస్తే తనను బానిసత్వం నుంచి విముక్తి కలిగించడమే కాకుండా తగిన పారితోషికం కూడా ఇస్తానని అబూసుఫ్యాన్ భార్య హిందా వాగ్దానం చేసింది.

ఈ ఆశతోనే వహ్షీ రంగంలోకి దూకాడు. ఒకచోట హజ్రత్ హమ్జా (రజి) శత్రువులతో పోరాడుతుంటే వహ్షీ చెట్టు చాటున నక్కి దొంగచాటుగా బల్లెం విసిరాడు. అది హమ్జా (రజి) పొట్టలో నుంచి దూసుకుపోయింది. దాంతో ఆయన కుప్పకూలి పోయారు. అప్పుడు వహ్షీ తృప్తితో నిట్టూర్పు విడిచాడు.

యుద్ధం ముగిసింది. హజ్రత్ హమ్జా (రజి) మృతదేహం ముక్కలుగా ఖండించబడి ఎంతో భయానకంగా, కడు దయనీయంగా ఉంది. దాన్ని చూడగానే దైవప్రవక్త (సల్లం) కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆవేదనాభరితమైన ఆయన హృదయం నుంచి సన్నగా (ఈ క్రింది) శబ్ద తరంగిణి జాలువారింది:

"అబ్బా! ఇంతటి బాధాకరమైన దృశ్యం నేనింతవరకు చూడలేదు. (హమ్జా సోదరి) సఫియా బాధపడకుండా ఉంటే, ఈపని నా తదనంతరం ఆచారంగా మారుతుందన్న భయం కూడా లేకుండా వుంటే నేను హమ్జా దేహాన్ని ఇలాగే గద్దలకు, మృగాలకు వదలి పెట్టేవాడ్ని. ఎప్పటికైనా శత్రువులపై ఆధిక్యత పొందగలిగితే వారిలో ముప్ఫయి మంది మనుషులకు ఇదే గతి పట్టిస్తాను." కాని.....

"మీరు ప్రతీకారం తీర్చుకోదలిస్తే మీపై ఏ మేరకు దౌర్జన్యం జరిగిందో ఆ మేరకే బదులు తీర్చుకోండి. అయితే సహనం వహిస్తే అది సహనం వహించేవారికి ఎంతో మంచిది. కనుక (ముహమ్మద్!) సహనం వహించు. నీకు సహన గుణం దేవుని ద్వారానే అబ్బింది. వారి చర్యలకు బాధపడకు. వారి మోసపు ఎత్తుగడలకు మనస్తాపం చెందకు. దైవఅవిధేయతకు దూరంగా ఉంటూ దేవుని అయిష్టతకు భయపడి సత్పురుషులుగా ఉండేవారికే ఆయన తోడుగా ఉంటాడు" (ఖుర్ఆన్. 16:126-128)

---అనే దైవవాణి మనోవీధిలో మెదులుతుండగా అంతరంగంలోని ఆవేదన అంతరించి శాంతించారు దైవప్రవక్త (సల్లం).

# 20. మహామాంత్రికుడు జిమాద్ (రజి)

హజ్‌సీజన్ రావడంతో మక్కా దరిదాపుల్లోని ఉకాజ్, మజన్న మైదానాలు వందలాది శిబిరాలు, దుకాణాలు, సాంస్కృతికకేంద్రాలతో నిండిపోయాయి. అరేబియా నలు మూలల నుండి వచ్చే యాత్రికులు మక్కా పోతూ ముందుగా ఈ దుకాణాలకు, కేంద్రాలకు వస్తుంటారు. అంచేత దైవప్రవక్త (స) ఆ సంతకు వెళ్ళి యాత్రికుల్ని కలుసు కొని వారికి దైవధర్మాన్ని పరిచయం చేయడం ప్రారంభించారు. బహుదైవారాధన వల్ల కలిగే దుష్ఫలితాలను గురించి హెచ్చరిస్తూ, ఇస్లాం స్వీకరించమని చెప్పసాగారు.

కాని దైవప్రవక్త (స) ఎక్కడికి పోతే అక్కడికల్లా అబూలహబ్, అతని మిత్రమూక చేరుకొని ఆయనకు వ్యతిరేకంగా జనంలో అపార్థాలు రేకెత్తించడానికి ప్రయత్నిస్తున్నారు. వారి దుష్ప్రచారజాలంలో చిక్కుకున్న ప్రజలు దైవప్రవక్త (స) మాటలు వినడానికి కూడా సిద్ధపడటంలేదు. కొందరు ఆయన్ని దుర్భాషలాడేవారు. మరికొందరు ముఖాలు చిట్లించుకొని వెళ్ళిపోయేవారు.

అబూలహబ్ ఉన్నతమైన ఖురైష్ వంశస్థుడని, మక్కాప్రజల అగ్రనాయకుల్లో ప్రముఖుడని ప్రజలకు తెలుసు. అంచేత అతని మాటలు వినగానే అందరూ జారుకున్నారు. అబూలహబ్ చంకలు ఎగరేసుకుంటూ అక్కడ్నుంచి తన శిబిరానికి బయలుదేరాడు. కొన్ని అడుగులు నడిచాడో లేదో అతని భుజమ్మీద ఓ బలమైన చేయి పడింది. వెనక్కి తిరిగిచూస్తే, ఎర్రటి కనుగుడ్లతో, గారపట్టిన పళ్ళతో, జడలుకట్టిన శిరోజాలతో, నల్లటి పెదాలతో, మెడలో లావుపాటి పూసలదండతో చిరునవ్వు చిందిస్తూ ఓ భారీకాయం దర్శనమిచ్చింది.

“మీరు ముహమ్మద్ (స) వ్యవహారంతో బాగా విసిగిపోయినట్లు కన్పిస్తున్నారు” అన్నది ఆ భారీకాయం.

“ఆ... మీరు చెబుతున్నది నిజం. ముహమ్మద్ కొత్త మతాన్ని లేవదీసి మా జాతిలో, మా మతాచారాల్లో గందరగోళం సృష్టించాడు. అతడ్ని వదలించులేక మా ఖురైషీయులు సతమతమవుతున్నారు” అన్నాడు అబూలహబ్.

“బహుశా మీరు నన్ను గుర్తుపట్టలేదనుకుంటాను.”

“మిమ్మల్ని గుర్తుపట్టకపోవడం ఏమిటీ? మిమ్మల్ని గురించి ఎవరికి తెలియదనీ! మీరు యావత్తు అరేబియాలోనే పేరుమోసిన మాంత్రికుడు జిమాద్. యమన్ దేశంలోని సుప్రసిద్ధ అజ్ద్ తెగ నాయకులు కూడా” చెప్పాడు అబూలహబ్.

“మీరు నన్ను బాగా గుర్తుపెట్టుకున్నారు. మీరన్నట్లు నేను నిజంగా అరేబియాలో గొప్ప ఇంద్రజాలికుడ్ని. మీ ముహమ్మద్‌కు ఎవరో చేతబడి చేసిఉంటారు. మీరేమీ



విచారించకండి. నేను నా మంత్రబలంతో దాన్ని పోగొడ్తాను” అన్నాడు జిమాద్.

“మీరు నా తమ్ముడి కొడుక్కు పట్టిన దయ్యం వదలగొట్టి, కొత్తమతాన్ని ప్రచారం చేయనీయకుండా అతడ్ని ఆపగలిగితే నేను మీకు వంద ఒంటెలతో పాటు వంద వరహాలు బహుమానంగా ఇచ్చుకుంటాను.”

“మీరు నాకు పెద్దఆశే చూపిస్తున్నారు. సరే లాత్, ఉజ్జాల సాక్షి! నేను ముహమ్మద్‌కు పట్టిన భూతం వదలగొడ్తా. తర్వాత మీరు మీవాగ్దానానికి కట్టుబడి ఉండాలి సుమా!” అన్నాడు జిమాద్.

“నేనొక్కడ్నే కాదు, వలీద్, ఉత్బా, అబూసుఫ్యాన్ వగైరా నాయకులు కూడా మీకు బహుమానాలు ఇస్తారు” అన్నాడు అబూలహబ్.

“కొంచెం ఆగండి, నేను మీకు నా మంత్రప్రతిభ చూపిస్తాను” అన్నాడు జిమాద్.

“ఇక్కడ నేనొక్కడ్ని చూస్తే ఏంలాభం? మా శిబిరానికి పదండి. అక్కడ మా ఖురైష్ నాయకుల్ని కూడా పిలిపిస్తాను. వారందరి ముందు ప్రదర్శిస్తే బాగుంటుంది.” అన్నాడు అబూలహబ్.

ఇలా మాట్లాడుకుంటూ వారిద్దరు శిబిరానికి చేరుకున్నారు. అబూలహబ్ ఖురైష్ నాయకులందరినీ పిలుచుకు రమ్మని ఇద్దరు బానిసలను పంపించాడు. కాస్సేపటికి ఖురైష్ నాయకులంతా అబూలహబ్ శిబిరానికి చేరుకున్నారు. శిబిరం ముందు తివాచీలు పరచి ఖురైషీయులందరూ కూర్చున్నారు. జిమాద్ వారి మధ్య నిలబడ్డాడు. ఇంద్రజాల ప్రదర్శనం గురించి విన్న ఇతరులు కూడా వందలసంఖ్యలో వచ్చి చేరారు.

“జనులారా! నేను యావత్తు అరేబియాలోనే ప్రసిద్ధిచెందిన ఇంద్రజాలకుడ్ని. దేశంలోని మాంత్రికులంతా గర్వంతో నన్ను తమ గురువుగా చెప్పుకుంటారు. అంచేత మీకందరికీ నా పేరు తెలిసేఉంటుంది” అన్నాడు జిమాద్.

“తెలుసు. తెలుసు. మీ పేరు జిమాద్” అన్నారు జనమంతా ముక్తకంఠంతో.

“నేను మాంత్రికుడ్ని, ప్రముఖ కవిని కూడా. మీకు నా పేరు మాత్రమే తెలుసు. ఈరోజు నా మంత్రవిద్య ప్రదర్శిస్తాను చూడండి. సరే, మీరంతా ఓసారి తల పైకెత్తి చూడండి. ఆకాశం నిర్మలంగా ఉంది. సూర్యుడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. గాలి స్తంభించిపోయింది. ఎండకు చెమటలు కారుతున్నాయి ఔనా?”

“ఔనౌను” జనం అరిచి మరీ చెప్పారు.

“ఇప్పుడు చూడండి. ఆకాశంలో ఒక నల్లటి చుక్క కన్పిస్తోంది” అన్నాడు మహామంత్రికుడు జిమాద్.

జనం ఆకాశంలో చూస్తే అక్కడ నిజంగానే నల్లటి చుక్క కన్పించింది. జిమాద్ ఆ చుక్క వైపే చూస్తూ ఏవో మంత్రాలు పఠిస్తున్నాడు. దాంతో ఆ చుక్క క్రమంగా విస్తరిస్తూ మబ్బుతునకగా మారింది. ఆ తరువాత మెల్లగా గాలి వీచడం మొదలెట్టింది. ఆ మబ్బు తునక క్రమేణా విస్తరిస్తూ అక్కడి మైదానాన్ని క్షణాల్లో కప్పివేసింది.

ప్రజలు నోరు తెరచి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు.

ఆ తరువాత సూర్యుడు పూర్తిగా కనుమరుగైపోయాడు. ఆ వెనువెంటనే చల్లటిగాలి రివ్వున వీచింది. "వర్షించు, బాగా వర్షించు. ఒక్కచుక్క కూడా కింద పడనీకుండా వర్షించు" అన్నాడు జిమాద్.

చిటపట చినుకులతో వర్షం మొదలైంది. ఏకధాటిగా వర్షం కురుస్తోంది. జనమంతా శూన్యంలో నీటిధారలు చూస్తున్నారు. కాని ఒక్క చుక్క కూడ క్రింద పడటం లేదు.

"పిశాచ పటాలం అరబ్బుల్ని ఆశ్చర్యపరుస్తూ ఆర్భాటంగా వారి ముందు నుంచి నడవాలి, చకచకా నడవాలి" అన్నాడు జిమాద్.

ప్రదర్శన మైదానం తూర్పు వైపున నల్లతెర చీల్చుకుంటూ చిత్రవిచిత్రమైన భయంకర ఆకారాలు గాలిలో తేలుతూ ఉరిమురిమి చూస్తూ మైదానంలోకి రాసాగాయి. అలా మైదానం రెండవచివరికి పోయి అదృశ్యమవుతున్నాయి. జనం సంభ్రమాశ్చర్యాలతో మట్టిబొమ్మల్లా చూస్తున్నారు. స్త్రీలు భయపడి కళ్ళు మూసుకున్నారు.

కాస్సేపటికి ఆ ఆకారాలన్నీ మైదానం రెండవ కొనకు వెళ్ళి అదృశ్యమై పోయాయి. ఆతర్వాత కారుమబ్బులు ఒక్కసారిగా విడిపోయాయి. సూర్యుడు మళ్ళీ వాడికిరణాలతో ప్రత్యక్షమయ్యాడు. గాలి స్తంభించిపోయింది. జనానికి చెమటలు కారసాగాయి.

"జిమాద్! నువ్వు నిజంగా గొప్ప మాంత్రికుడవోయ్. నీ మంత్రబలంతో ముహమ్మద్‌ని బాగుచేస్తావని నాకిప్పుడు నమ్మకం కుదిరింది" అన్నాడు అబూలహబ్.

"అయితే ముహమ్మద్‌ని ఇక్కడకు తీసుకురాగల్గితే తీసుకురండి. నేను వీలైనంత త్వరగా అతని దయ్యాన్ని వదలగొడ్తాను" అన్నాడు జిమాద్.

"ఇప్పుడే పిలిపిస్తాను" అంటూ అబూలహబ్ ఒక బానిసను పంపాడు. ఆ బానిస వెళ్ళి కాస్సేపటికి మహనీయ ముహమ్మద్ (స)ని పిలుచుకొని వచ్చాడు.

"ముహమ్మద్! ఈ కొత్త వ్యక్తి ఎవరో నీకు తెలుసా?" అని అడిగాడు అబూలహబ్ జిమాద్ వైపు చూపిస్తూ.

"తెలియదు ఈయన ఎవరో" అన్నారు దైవప్రవక్త (స).

"నే జెప్తాను. ఈయన యమన్ పౌరుడు. పేరు జిమాద్. గొప్ప మాంత్రికుడు. నీకేదో పిశాచం ఆవహించిందని విని దాన్ని వదలగొట్టడానికి వచ్చాడు ఈయన."



ఈ మాటలు విని దైవప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ "పెదనాన్నా! నాకెలాంటి పిశాచం ఆవహించలేదు. నువ్వు అనవసరంగా మోసపోతున్నావు. నేను దేవుని సందేశహరుడ్ని. ఆయన దాసుడ్ని" అన్నారు ఆయన.

"మళ్ళీ అదే పాతపాట పాడుతున్నావు. సరేలే ఓసారి ఆయన ముందుకు పోయి నిలబడు."

దైవప్రవక్త (స) సంకోచం లేకుండా మంత్రికుడి ముందుకు పోయి నిల్చున్నారు.

మాంత్రికుడు జిమాద్ ఓసారి దైవప్రవక్త (సల్లం)ను ఆపాదమస్తకం పరికించి చూశాడు. కాని అతను ఆ మహనీయుని (సల్లం) కళ్ళలోకి సూటిగా చూడలేక ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"జిమాద్! మహామాంత్రికుడా! ఇంతకూ నా గురించి నువ్వేమి చెప్పదలిచావు?" అన్నారు దైవపవక్త (స) గంభీర స్వరంతో.

"మ్మి...మ్మి....మీ మీద ఓ పెద్ద పిశాచం ఆవహించింది. న్నే....న్నే...నేనొక మంత్రం చదువుతా, మీరు వినండి" అన్నాడు జిమాద్ తడబడుతున్న కంఠంతో.

"జిమాద్! నాకెలాంటి పిశాచం ఆవహించలేదు. నువ్వు నీ మంత్రవిద్యతో ప్రజలను ఆశ్చర్యపరచగలవు. కాని నేను దైవప్రవక్తను. నా నోటి నుండి వెలువడే దైవవాణి ఎలాంటి మనిషినైనా ప్రభావితం చేస్తుంది. ముందుగా నేను దైవవాణి విన్పిస్తాను. తరువాత నీవు నీ మంత్రాన్ని పఠించు" అన్నారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.

"ఆ... అలాగే ముందు మీరే విన్పించండి" అన్నాడు జిమాద్ వాడిన ముఖంతో.

"సకల విధాల ప్రశంసలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. కనుక మేము ఆయన్నే స్తుతిస్తాం. ఆయన సహాయమే అర్థిస్తాం. దేవుడు ఎవరికి సన్మార్గం చూపదలచుకుంటాడో అతడ్ని ఎవరూ అపమార్గంలో పడవేయలేరు. అలాగే దేవుడు ఎవరిని అపమార్గంలో పడేలా చేయదలచుకుంటాడో అతడ్ని ఎవరూ సన్మార్గంలో పెట్టలేరు. ఏకేశ్వరుడయిన ఆ దేవుడు తప్ప మరేఆరాధ్యుడు లేడని, ఆయనకు ఎవరూ సాటి లేరని నేను సాక్ష్య మిస్తున్నాను. ముహమ్మద్ దేవుని దాసుడని, ఆయన సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (స).

జిమాద్ దైవవాణి విని ఆశ్చర్యపోతూ "ఏది మరోసారి విన్పించండి" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) పై మాటలనే పునరుక్తం చేసి విన్పించారు.

"ఎంత మధురమైన వాణి ఇది! దయచేసి ఇంకొక్కసారి విన్పించండి."

దైవప్రవక్త (సల్లం) మూడవసారి కూడా అవే మాటలు విన్పించారు.

“నేను నా జీవితంలో అనేకమంది మాంత్రికుల్ని, జోతిష్కుల్ని, కవుల్ని చూశాను. వారి మాటలు విన్నాను. కాని ఇలాంటి మధురమైన, ప్రభావవంతమైన వాణిని మాత్రం నేను ఎవరినోటా వినలేదు. నిస్సందేహంగా మీరు దేవుని సందేశహరులే. నేను మిమ్మల్ని, మీ దేవుడ్ని విశ్వసిస్తున్నాను. చేయిజాపండి. నేను ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను” అన్నాడు జిమాద్.

జిమాద్ అప్పటికప్పుడు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. తర్వాత ఆయన జనసమూహాన్ని ఉద్దేశించి ఇలా అన్నారు:

“మిధ్యాదేవతల పూజారులారా! వినండి. బాగా వినండి. మహనీయ ముహమ్మద్ (సల్లం)కు ఎలాంటి భూతపిశాచాలు ఆవహించలేదు. ఈయన దైవసందేశహరుడు. దేవుని తరఫున ఆయన దాసులకు రుజుమార్గం చూపడానికి వచ్చిన దైవప్రవక్త (సల్లం). అందువల్ల నేను ముస్లిమయ్యాను. మీరు కూడా ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారండి. ముస్లింలుగా మారి మానవులుగా మనుగడ సాగించండి.”

ఈ మాటలు వినగానే అబూలహబ్ కస్సున లేచాడు.

“మోసం! దగా!! కుట్ర!!! నువ్వు ముహమ్మద్‌ని బాగుచేస్తానని చెప్పి మమ్మల్ని మోసగించావు. నువ్వు ముస్లిం కావడమేగాకుండా ఇతరుల్ని కూడా ముస్లింలయిపొమ్మని చెబుతున్నావా? సామూహిక రక్తపాతం జరుగుతుందన్న భయం గనక లేకపోతే, నేను ఇప్పుడే నిన్ను పట్టుకొని హతమార్చివేసేవాడ్ని” అన్నాడతను మాంత్రికుడు జిమాద్‌పై మండిపడుతూ.

“ఓరీ ద్రోహీ! నువ్వసలు నీ పేరుప్రతిష్ఠలకు, హోదాఅంతస్థులకు భంగం కల్గుతుం దని ముస్లిం కావడానికి భయపడుతున్నావు. నీ నరనరాల్లో ప్రాపంచిక వ్యామోహం నిండిపోయిఉంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. విషయం అర్థంచేసుకొని ముస్లిం అయిపో. లేకుంటే చాలా పశ్చాత్తాపపడతావు” అన్నారు హజ్రత్ జిమాద్ (రజి).

“నీచుడా! నన్నే ఇలా అంటావా! ఉండు నీ నాలుక చీరేస్తాను” అంటూ అబూలహబ్ ఆగ్రహోద్రగుడయి జిమాద్ (రజి) మీదికి లంఘించబోయాడు.

“ఆగు. మరోఅడుగు ముందుకు వేశావా....... నీకీ రోజుతో నూకలు చెల్లినట్లేనని తెలుసుకో. నేను జిమాద్‌ని, అరేబియా మొత్తంలోనే పేరుమోసిన ఇంద్రజాలకుడ్ని.”

జిమాద్ (రజి) మాటలు వినగానే అబూలహబ్ భయపడిపోయాడు. ఠక్కున ఆగిపోయాడు. అతను ఇంతకుముందే జిమాద్ మంత్రశక్తి చూసి ఉండటంతో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక దూషిస్తూ నిలబడిపోయాడు. అబూలహబ్, అతని



సహచరులు కూడా జిమాద్ (రజి) ప్రదర్శించిన మంత్రవిద్య చూసివున్నందు వల్ల దాని ప్రభావం ఇంకా వారి మస్తిష్కాల నుంచి చెరిగిపోలేదు. అంచేత వారాయనకు వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోలేక నిశ్చేష్టులై చూడసాగారు.

హజ్రత్ జిమాద్ (రజి) దైవప్రవక్త (స) అనుమతి తీసుకొని యమన్ వెళ్ళిపోయారు. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) కూడా అక్కడ్నుంచి కదలి మక్కా వెళ్ళిపోయారు.

# 21. తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి (రజి)

తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి ఉన్నతవంశానికి చెందిన ప్రముఖ కవి. మంచీచెడుల విచక్షణాజ్ఞానమున్న గొప్పమేధావి. యమన్‌ప్రాంతంలో నివసించే దౌస్‌తెగకు నాయకుడు కూడా. అతను ఓసారి కొందరు అనుచరులతో కాబాదర్శనం కోసం మక్కా పట్టణం వచ్చాడు. ఈ సంగతి తెలిసిన ఖురైష్ నాయకులు వెంటనే బయలుదేరి పట్నం వెలుపలే అతనికి ఘనంగా స్వాగతం చెప్పారు. ఆయన పట్ల తమకు ఎంత గౌరవాభిమానా లున్నాయో చెప్పుకున్నారు. ఖురైష్ నాయకులతో పాటు జనసామాన్యం కూడా వందల సంఖ్యలో వచ్చారు. ఆ తరువాత అందరూ కలసి అతడ్ని ఊరేగింపుగా పట్టణానికి తీసుకొచ్చారు.

పట్నంలో ప్రవేశించగానే ఖురైష్ నాయకులు దైవప్రవక్త (స) గురించి, ఇస్లాం గురించి అతనికి దుర్బోధ చేశారు. ముహమ్మద్ పెద్ద మాంత్రికుడని, ఒక్కసారి గనక అతని నోట వెలువడే వాణి వింటేచాలు, మనిషి ఇట్టే అతని వలలో పడిపోతాడని, అంచేత అతనికి కాస్త దూరంగా ఉండాలని మరీమరీ హెచ్చరించారు. తుఫైల్ ఈ దుర్బోధకు గురయి నిజమే కాబోలు అనుకున్నాడు.

చివరికి ఈ జనసమూహం కాబాలయానికి చేరుకుంది. తుఫైల్ ఖురైష్‌నాయకులతో కలసి ఆలయంలో ప్రవేశించాడు. అక్కడ దైవప్రవక్త (స) ఓచోట నమాజ్ చేస్తూవుండటం చూశాడు. ఎందుకైనా మంచిదని దూది తెప్పించుకొని రెండు చెవుల్లో పెట్టుకొని కాబా ప్రదక్షిణ చేయడం ప్రారంభించాడు. కాబా ప్రదక్షిణ ముగిసిన తరువాత ఖురైషీయులతో కలసి అతిథి గృహానికి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళ తరువాత తుఫైల్ మళ్ళీ కాబాప్రదక్షిణ కోసం వచ్చాడు. అప్పుడు అతని వెంట అతని సహచరులు మాత్రమే ఉన్నారు. అతను చెవుల్లో దూది పెట్టుకొని కాబా ప్రదక్షిణ చేస్తూ దైవప్రవక్త (సల్లం) సమీపంగా పోవలసి వచ్చింది. అప్పుడు యాదృచ్ఛికంగా ఖుర్‌ఆన్ వాక్యమొకటి చెవిలో పడింది. కాని అందులో ఖురైషీయులు చెప్పినట్లు ఏ చెడూ ఉన్నట్లు అన్పించలేదు. అంచేత రెండుక్షణాలు అక్కడే నిలబడి జాగ్రత్తగా ఆలకించాడు. దైవవాణి చెవులకు వింపుగా సోకింది.

దాంతో తుఫైల్ ఆలోచనలో పడ్డాడు.“అయ్యయ్యో! నేనెంత అమాయకుడ్ని. నేను గొప్పకవిని. మంచీచెడులు విచక్షణచేసే జ్ఞానం, ఆలోచించే మేధా, విజ్ఞతావివేచనలు కూడా ఉన్నవాడ్ని. మరి ఈయన మాటలు ఎందుకు వినకూడదు? మంచిమాటలైతే సరే, మంచివి కాకపోతే తిప్పికొట్టవచ్చు” అనుకున్నాడు మనసులో తుఫైల్.

దైవప్రవక్త (స) నమాజు చేసి ఇంటికి బయలుదేరారు. తుఫైల్ ఆయన వెనకాల నడిచి ఆయన ఇంటికి చేరుకున్నాడు. తనను ఖురైషీయులు భయపెట్టి చెప్పిన మాటలన్నీ ఆయనకు విన్పించాడు. దైవప్రవక్త (స) అతడ్ని ఎంతో ఆదరించి ఖుర్ఆన్ సూక్తులు విన్పించారు. దాంతో తుఫైల్ మానసాకాశం జ్ఞానజ్యోతితో ప్రకాశవంతమైంది. దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పఠనం ముగించి, ఇస్లాంస్వీకరణ గురించి హితోపదేశం చేశారు. తుఫైల్ ఏమాత్రం సంకోచించకుండా వెంటనే ఇస్లాం స్వీకరించాడు.

“దైవప్రవక్తా! నా తెగలో నాకు మంచి పలుకుబడి ఉంది. అందరూ నన్ను ఎంతో గౌరవిస్తారు. నేను ఏది చెప్పినా విని వెంటనే దాన్ని అమలుపరుస్తారు. ఇప్పుడే పోయి నేను వారికి ఇస్లాం వైపు ఆహ్వానిస్తాను” అన్నారు తుఫైల్ (రజి) అమితోత్సాహంతో.

“చాలా సంతోషం” అన్నారు దైవప్రవక్త (స) పరమానందంతో.

“దైవప్రవక్తా! మీజాతివాళ్ళు మిమ్మల్ని వేధిస్తూ మీ జీవితం దుర్భరం చేశారని విన్నాను. అంచేత మీరు, మీ అనుచరులు నా దగ్గరకు వచ్చేయండి. మా దేశంలో మీరు ప్రశాంతంగా దైవారాధన చేసుకోవచ్చు. ఎలాంటి చీకూచింతా లేకుండా హాయిగా, జీవితం గడపవచ్చు. ఖురైషీయులు మా దేశంలో ఏ ముస్లింపై కూడా చేయిచేసుకునే దుస్సాహసానికి పాల్పడలేరు. అదీగాక నేను నా కిరీటం మీ శిరస్సుపై ఉంచుతాను. నా దేశం మీ దేశమవుతుంది. నా ప్రజలు ముస్లింలై మీకు విధేయులైఉంటారు. నేను మీకు బానిసనై సేవచేస్తూ ఉంటాను” అన్నారు తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి).

“నీ సానుభూతికి కృతజ్ఞుడ్ని. నాకుగాని, ఇతర ముస్లింలకుగాని ఎలాంటి హోదా, అధికారకాంక్షలు లేవు. నేను దైవాజ్ఞ లేకుండా ఏపనీ చేయలేను. ఆయన ఆజ్ఞ అయినప్పుడు మాత్రమే మేము మక్కా నుండి వలసపోతాం. ఇప్పుడు నీవు నీదేశానికి వెళ్ళిపో. అక్కడ నీ ప్రజలకు దైవసందేశం అందజేసి వారిని ఇస్లాంధర్మం స్వీకరించేలా ఒప్పించు. అయితే ఈ విషయంలో వారిని బలవంతం చేయడం గాని, మరెలాంటి వత్తిడి తీసుకురావడంగాని జరగకూడదు” అన్నారు దైవప్రవక్త (స).

“అలాగే మీ ఆదేశానుసారం చేస్తాను. నేనీ రోజే బయలుదేరి వెళ్తాను. పోగానే ఇస్లాం ప్రచారం ప్రారంభిస్తాను” అన్నారు హజ్రత్ తుఫైల్ దౌసి (రజి).

ఆ తర్వాత తుఫైల్ బిన్ అమ్ర్ (రజి) దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకొని యమన్‌కు వెళ్ళిపోయారు. స్వస్థలం చేరుకోగానే ముందుగా ఆయన తన గృహస్థులకు,



ఇతర బంధువులకు దైవసందేశం విన్పించి దాన్ని స్వీకరించమని చెప్పారు. ఆయనంటే అపార గౌరవాభిమానాలుగల కుటుంబసభ్యులు, ఇతర బంధువులు తక్షణమే ఇస్లాం స్వీకరించారు.

తర్వాత ఆయన చేసిన హితబోధతో ఆయన తెగలో అత్యధికమంది కొన్నాళ్ళలోనే ఇస్లాం స్వీకరించారు.

తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి (రజి) ఖైబర్ యుద్ధంలో, మక్కావిజయంలో దైవప్రవక్త (స) వెంట ఉన్నారు. దైవప్రవక్త (స) ఇహలోకం వీడిపోయిన తర్వాత ఖలీఫా అబూబకర్ (రజి) పాలనాకాలంలో అసత్యప్రవక్త ముసైలిమా, అతని అనుచరులకు వ్యతిరేకంగా జరిగిన యమామా యుద్ధంలో ఆయన అమరగతి పొందారు.

# 22. అబ్దుల్లా బిన్ హుజాఫా సహ్మీ (రజి)

దైవప్రవక్త (సల్లం) ఈరాన్‌చక్రవర్తి ఖుస్రో పర్వేజ్‌కు రాసిన లేఖను హజ్రత్ అబ్దుల్లా బిన్ హుజాఫా సహ్మీ (రజి) తీసికెళ్ళారు. ఆ లేఖ ఈ విధంగా ఉంది:

“కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. దైవప్రవక్త ముహమ్మద్ తరఫున పర్షియా రాజ్యాధినేత కిస్రాకు వ్రాయునది. రుజుమార్గం అవలంబించి దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి, దేవుడు ఒక్కడేనని సాక్ష్యమిచ్చేవారికి శాంతిశ్రేయాలు కలుగుగాక. జీవమున్న ప్రతి వ్యక్తికీ దేవుడ్ని గురించి హెచ్చరించడానికి ఆయన నన్ను యావత్తు మానవాళి కోసం దైవప్రవక్తగా నియమించి పంపాడు. కాబట్టి మీరు ఇస్లాం స్వీకరిస్తే శ్రేయస్కరమైన (శాంతియుతమైన) జీవితం గడుపుతారు. లేకపోతే మొత్తం అగ్నిపూజారుల పాపభారం మీ మీద పడుతుంది.”

ఈరాన్ చక్రవర్తి దైవప్రవక్త (సల్లం) లేఖను చూడగానే మండిపడ్డాడు. ఆ లేఖలో ముందుగా తన పేరు ప్రస్తావించకుండా “కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో” అని రాయబడిన తీరే అతనికి నచ్చలేదు. అందువల్ల అతను కోపం పట్టలేక ఆ లేఖను ప్రవక్త దూత ఎదురుగానే చించి పారేశాడు.

అంతటితో అతని కోపం తగ్గలేదు. ముహమ్మద్ (సల్లం) శిరస్సును ఖండించి తీసుకురమ్మని యమన్ గవర్నర్‌ని ఆదేశించాడు. ఈరాన్‌కు పోయిన ప్రత్యేకదూత తిరిగొచ్చి విషయం దైవప్రవక్త (సల్లం)కు విన్నవించాడు.

దైవప్రవక్త (స) ఈ సంఘటన గురించిన వివరాలు విని “దేవుడు అతని సామ్రాజ్యాన్ని తునాతునకలుగా చేసి అతడ్ని అధికారభ్రష్టుడ్ని చేయుగాక” అని శపించారు. ఇలా శపించిన కొన్నాళ్ళకే ఈరాన్ చక్రవర్తి పర్వేజ్ హతమార్చబడ్డాడు. తరువాత అతని కొడుకు సింహాసనం ఎక్కాడు.

రెండవ ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు డెమాస్కస్ పట్టణాన్ని ముట్టడించి చివరికి దాన్ని కైవశం చేసుకున్నారు. ఆ యుద్ధంలో కొందరు ముస్లింలు రోమన్లకు పట్టుబడ్డారు. వారిలో అబ్దుల్లా బిన్ హుజాఫా సెహ్మీ (రజి) కూడా ఉన్నారు. రోమ్‌సైనికులు వారందర్నీ తీసికెళ్ళి తమ చక్రవర్తి ముందు ప్రవేశపెట్టారు.

చక్రవర్తి ఆయన్ని ఎగాదిగా చూసి "నువ్వు మామాట విని ఇస్లాం వదిలేసి క్రైస్తవం స్వీకరిస్తే మేము నిన్ను విడుదలచేయడమే గాక ఎంతో గౌరవమర్యాదలు జరుపుతాం" అని అన్నాడు.

దానికి అబ్దుల్లా (రజి) అతనివైపు నిర్లక్ష్యంగా చూస్తూ "అలా ఎన్నటికీ జరగదు. దానికంటే మృత్యువే నాకు వేయి రెట్లు మంచిది" అని అన్నారు.

"చూస్తే నువ్వు తెలివిగలవాడిగా కన్పిస్తున్నావు. మామాట విని క్రైస్తవం స్వీకరిస్తే మేము నీకు మా పాలానాధికారంలో ఉన్నత స్థానం కల్పిస్తాం" అన్నాడు చక్రవర్తి.

సంకెళ్ళతో బంధించబడిన అబ్దుల్లా బిన్ హుజాఫా (రజి) ఓ చిరునవ్వు నవ్వి అంతలోనే గంభీరంగా మారిపోయి "దైవసాక్షిగా చెబుతున్నాను. నీవు నీ సామ్రాజ్యమంతా నాకు కట్టబెట్టినా సరే, నేను ముహమ్మద్ (స) ధర్మం నుండి ఒక్క క్షణమైనా వెనక్కి మరలే ప్రసక్తే లేదు" అని అన్నారు.

"అయితే నిన్ను పైకి పంపక తప్పదు" అన్నాడు చక్రవర్తి బెదిరిస్తూ.

దానికి అబ్దుల్లా (రజి) "నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అన్నారు నిర్లక్ష్యంగా.

అప్పుడు రోమ్‌చక్రవర్తి ఆయన్ని ఒక స్తంభానికి కట్టివేయించి ఆయన రెండు చేతుల వైపు బాణాలు విడువమని ఓ సైనికుడ్ని ఆదేశించాడు. శరాఘాతంతో ఒక చేయి తెగిపడిన తరువాత "ఇప్పటికైనా మించిపోయిందిలేదు; క్రైస్తవం స్వీకరించు, నిన్ను వదిలేస్తాం" అన్నాడు. దానికి అబ్దుల్లా (రజి) తీవ్రగా నిరాకరించారు.

అప్పుడు రోమ్‌చక్రవర్తి ఒక పెద్ద తొట్టి తెప్పించి, అందులో నూనె పోయించి, దాన్ని మండుతున్న పొయ్యి మీద పెట్టించాడు. తరువాత ఓ ముస్లిం ఖైదీని అందులో పడవేయమని తన సైనికుల్ని ఆదేశించాడు. వారలా చేయగానే ఆ ముస్లింఖైదీ శరీరం పూర్తిగా కాలిపోయి ఎముకలు బయటికొచ్చాయి.

అప్పుడు రోమ్‌చక్రవర్తి హజ్రత్ అబ్దుల్లా (రజి) వైపు తిరిగి ఇప్పుడైనా నువ్వు క్రైస్తవమతం స్వీకరిస్తావా? లేకుంటే నీకూ అదే గతిపడ్తుంది" అని అన్నాడు హెచ్చరిస్తూ. దానికి అబ్దుల్లా (రజి) ఇంతకుముందు కంటే తీవ్రంగా నిరాకరించారు.

దాంత చక్రవర్తి ఆగ్రహోదగ్రుడై "ఇతడ్ని కూడా మరుగుతున్న నూనెలో పడేయండ"ని ఆజ్ఞాపించాడు. వెంటనే సైనికులు అబ్దుల్లా (రజి)ను మరుగుతున్న నూనెతొట్టి



వైపుకు లాక్కెళ్ళారు. అలా లాక్కెళ్తుంటే అబ్దుల్లా (రజి) అప్రయత్నంగా కంటతడి పెట్టారు. సైనికులు అది గమనించి "ఇతను ఏడుస్తున్నాడ"ని చక్రవర్తితో అన్నారు.

చక్రవర్తి ఆశతో ఆయన్ని తన దగ్గరకు తీసుకురమ్మని ఆదేశించాడు సైనికుల్ని. సైనికులు అబ్దుల్లా (రజి)ను వెనక్కి తెచ్చి చక్రవర్తి ముందు నిలబెట్టారు. అప్పుడు రోమ్ చక్రవర్తి "ఇప్పుడయినా నువ్వు క్రైస్తవమతం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నావా?" అని అడిగాడు.

దానికి అబ్దుల్లా (రజి) ఏమాత్రం సిద్ధంగా లేనంటూ మరొకసారి వ్యతిరేకించారు. "మరైతే ఎందుకు ఏడుస్తున్నావ"ని అడిగాడు చక్రవర్తి. దానికి అబ్దుల్లా బిన్ హుజాఫా (రజి) ఇలా సమాధానమిచ్చారు:

"నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. ఇప్పుడు మీరు నన్ను మరుగుతున్న ఈ నూనెలో పడవేస్తారు. దాంతో క్షణంలో నాప్రాణం అనంతవాయువుల్లో కలసిపోయి నా జీవితం అంతమవుతుంది. కాని నేను కోరుకునేది అది కాదు. నా దేహంలో ఎన్ని వెంట్రుకలున్నాయో అన్ని ప్రాణాలు గనక ఉంటే వాటన్నిటిని దైవమార్గంలో బలిచేయాలని ఉంది నాకు. కాని నా దేహంలో ఒక్క ప్రాణం మాత్రమే ఉందే! ఈ ఆలోచనే నన్ను కంటతడి పెట్టించింది."

రోమ్‌చక్రవర్తి ఆ మాటలకు దిమ్మెరపోయి చూస్తూ "అలాగానా! సరేపోనీ, ఓసారి నా నుదుటిని ముద్దాడగలవా? అలా చేస్తే నేను నిన్ను విడుదల చేస్తాను" అని అన్నాడు.

అబ్దుల్లా (రజి) ఈమాట విని "నాతో పాటు ఇతర ఖైదీల్ని కూడా విడిచిపెడ్తావా?" అనడిగారు.

దానికి చక్రవర్తి "తప్పకుండా నీతోపాటు నీ సహఖైదీలందర్నీ వదిలేస్తాం" అన్నాడు.

అప్పుడు హజ్రత్ అబ్దుల్లా బిన్ హుజాఫా (రజి) ఓక్షణం ఆలోచించి చక్రవర్తి దగ్గరకు వెళ్ళి అతని నుదుటిని ముద్దాడారు. ఆ వెనువెంటనే రోమ్‌చక్రవర్తి ముస్లిం ఖైదీలందర్నీ విడుదలచేసి పంపేయమని సైనికుల్ని ఆదేశించాడు. సైనికులు ఆయన ఆజ్ఞను పాటించారు.

ఈవిధంగా అబ్దుల్లా (రజి) రోమన్ల కబంధహస్తాల నుండి విడుదలైన తరువాత మదీనా చేరుకొని ఖలీఫా ముందు ఈ ఉదంతం గురించి వివరించారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈ వృత్తాంతం విని పరమసంతోషంతో అబ్దుల్లా (రజి)ను ఆలింగనం చేసుకున్నారు. తరువాత "ఇప్పుడు ప్రతి ముస్లింకు అబ్దుల్లా బిన్ హుజాఫా నుదుటిని ముద్దాడే హక్కుంది. ఈ హక్కును ముందుగా నేనే వినియోగించుకుంటున్నాను" అంటూ ఉమర్ ఫారూఖ్ (రజి) అబ్దుల్లా (రజి) నుదుటిని ముద్దాడారు.

# 23. ఉమైర్ బిన్ వహబ్ (రజి)

బదర్ యుద్ధంలో ఘోరపరాజయం పాలయిన మక్కాఖురైషుల్లో కొందరు అవమానభారంతో క్రుంగిపోతే, మరికొందరిలో ప్రతీకారం మరోసారి పడగవిప్పింది. వారిలో ఉమైర్ బిన్ వహబ్, సఫ్వాన్ కూడా ఉన్నారు. ఆ యుద్ధంలో ఉమైర్ ఎలాగో ప్రాణాలు కాపాడుకొని బ్రతుకుజీవుడా అంటూ మక్కా చేరుకోగలిగాడు. కాని అతని కొడుకు ముస్లింలకు ఖైదీగా పట్టుబడి మదీనాలో చిక్కుకుపోయాడు.

మక్కాలో ఉన్నపుడు ముస్లింలకు వ్యతిరేకంగా తాను చేసిన అకృత్యాలకు ప్రతీకారంగా ఇప్పుడు ముస్లింలు తన కొడుకుపై ఎలాంటి హింసాదౌర్జన్యాలకు పాల్పడతారోనని భయపడ సాగాడు. దీనికి నివారణోపాయం ఏమిటీ?

"ఈ సమస్యకు పరిష్కారం ఒకేఒక మార్గం ఉంది. మదీనా వెళ్ళి ముస్లింల నాయకుడు ముహమ్మద్ (స)ని శాశ్వతంగా కడతేర్చితే సరి! కాని ఇంతకుముందు నుంచే రుణభారంతో క్రుంగిపోతున్న తాను ఈ పనికోసం మదీనా వెళ్తే తిరిగొచ్చేవరకు తన భార్యాపిల్లల పోషణబాధ్యత ఎవరు తీసుకుంటారు?" ఉమైర్ ఇలాంటి ఆలోచనలతో సతమత మవుతున్నాడు. ఓరోజు కాబాలయానికి వెళ్తే అక్కడ సఫ్వాన్ కలుసుకున్నాడు.

బద్ర్‌యుద్ధంలో సఫ్వాన్ తండ్రి, సోదరుడు చనిపోయారు. అంచేత అతను కూడా ప్రతీకారంతో లోలోన ఉడికిపోతున్నాడు. అతనీ విషయంలో ఉమైర్ బిన్ వహబ్‌ని కదిలించాడు. కాని ఉమైర్ తన అప్పుల బాధను ఏకరవు పెడ్తూ నిస్సహాయత వ్యక్తపరిచాడు.

సఫ్వాన్ వెంటనే సమాధానమిస్తూ "అప్పు సంగతి నాకు వదిలెయ్యి. అది ఎంత ఉన్నా నేను తీరుస్తాను. అంతేకాదు, నీ భార్యాపిల్లల సంరక్షణ బాధ్యత కూడా నేను తీసుకుంటాను. నువ్వు నిశ్చింతగా మదీనా వెళ్ళి ముహమ్మద్ (స) పని ముగించి వచ్చెయ్యి. అప్పుడే మనకు మనశ్శాంతి లభిస్తుంది" అని అన్నాడు.

"సరే అలాగే వెళ్తాను. అయితే మన ఈ రహస్యపథకం సంగతి మూడో వ్యక్తికి ఏ మాత్రం తెలియకూడదు. ఇది మనిద్దరి మధ్యనే ఉండిపోవాలి, జాగ్రత్త సుమా!" అన్నాడు ఉమైర్.

ఆ తరువాత ఉమైర్ బిన్ వహబ్ కాబా నుంచి ఇంటికి తిరిగొచ్చి ఖడ్గం తీసుకొని మక్కా నుండి బయలుదేరాడు. మదీనా చేరుకొని నేరుగా మస్జిదెనబవీకి వెళ్ళాడు. మసీదులో దైవప్రవక్త(స), ఆయన అనుచరులు కూర్చొనిఉన్నారు. కొందరు అనుచరులు అటూఇటూ తిరుగుతున్నారు. ఉమైర్ మసీదులో ప్రవేశించిన కాస్సేపటికే అతని వాలకం



చూసి హజ్రత్ ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. వెంటనే ఆయన ఉమైర్‌ని ఒడిసి పట్టుకొని అతని దగ్గరున్న ఖడ్గం లాక్కున్నారు. ఆ తరువాత అతడ్ని లాక్కెళ్ళి దైవప్రవక్త (స) సన్నిధిలో ప్రవేశపెట్టారు.

దైవప్రవక్త (స) ఓసారి ఆగంతకుడ్ని ఎగాదిగా చూసి "ఉమర్! అతడ్ని వదలిపెట్టు" అని ఆదేశించారు. హజ్రత్ ఉమర్ (రజి) అతడ్ని వదలిపెట్టారు.

"ఉమైర్! నువ్విక్కడికి ఏ ఉద్దేశ్యంతో వచ్చావు?" అడిగారు దైవప్రవక్త (స).

"నా కొడుకు మీదగ్గర యుద్ధఖైదీగా ఉన్నాడు. అతడ్ని విడిపించుకోవడానికి వచ్చాను. మీరు కనికరించి నా కొడుకును విడుదలచేస్తే మీ మేలు ఎన్నటికీ మరచి పోను" అన్నాడు ఉమైర్ బెదురు చూపులతో.

"నువ్వు అసలువిషయం ఎందుకు చెప్పవు? సఫ్వాన్ నన్ను చంపించడానికి నిన్ను ఒప్పించి పంపాడు. మీరిద్దరు కాబాలో కూర్చొని ఈ పథకం రూపొందించారు. ఎవరైనా నీ అప్పులు తీర్చగల్గితే నువ్వు నన్ను చంపుతానని అన్నావు. అప్పుడు సఫ్వాన్ నన్ను నువ్వు చంపితే నీ అప్పులు తీర్చుతానని వాగ్దానం చేశాడు" అంటూ దైవప్రవక్త (స) వాళ్ళిద్దరి రహస్యపథకాన్ని బట్టబయలుచేశారు.

ఉమైర్ ఈ మాటలు వినగానే కొయ్యబారిపోయాడు. నోరు తెరచి దైవప్రవక్త (సల్లం) వైపు తదేకంగా చూడసాగాడు. రెండు నిమిషాలు తర్వాత ఆశ్చర్యం నుంచి తేరుకున్నాడు.

"ఈ పథకం గురించి నాకు, సఫ్వాన్‌కు తప్ప మూడో మనిషికి తెలియదు. ఇప్పుడు మీకు తెలిసిందంటే మీరు నిజంగా దైవప్రవక్తే. దేవుడే మీకీ విషయం తెలియజేసి ఉంటాడు. అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్నాడు ఉమైర్.

అనుచరులు ఈమాట వినగానే పరమసంతోషంతో "అల్లాహుఅక్బర్" అంటూ నినదించారు. ఉమైర్ (రజి) ముస్లిం అయినందుకు దైవప్రవక్త (స) కూడా సంతోషించారు.

హజ్రత్ ఉమైర్ బిన్ వహబ్ (రజి) కొంతకాలం పాటు దైవప్రవక్త (స) సహచర్యంలో ఉండి ఇస్లాంశిక్షణ పొంది మక్కా తిరిగొచ్చారు. మక్కా తిరిగొచ్చిన తర్వాత ముందుగా ఆయన సఫ్వాన్‌ని కలుసుకొని అతనికి ఇస్లాం గురించి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని పగ, విద్వేషాలతో నిండిన అతని మట్టిబుర్ర దైవసందేశాన్ని త్రోసిపుచ్చింది. తర్వాత ఉమైర్ (రజి) ఇస్లాంసందేశాన్ని ఇతరులకు అందజేసే పనిలో నిమగ్నులైపోయారు. ఆయన కృషి వల్ల మక్కాలో కొందరు ప్రజలు ఇస్లాం స్వీకరించారు.

# 24. సుమామా బిన్ ఉసాల్ (రజి)

హి.శ. 6వ ఏట దైవప్రవక్త (స) వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది రాజులకు దైవసందేశ లేఖలు పంపారు. వారిలో హనీఫాతెగకు చెందిన యమామా ప్రాంతంనాయకుడు సుమామా బిన్ ఉసాల్ కూడా ఉన్నాడు. అతను దైవప్రవక్త (స) పట్ల, ఆయన అనుచరుల పట్ల తీవ్రమైన ద్వేషంతో కుతకుతలాడి పోసాగాడు. అంతేకాదు, అతను కొంతమంది ప్రవక్తఅనుచరుల్ని పట్టుకొని హతమార్చడానికి కూడా పాల్పడ్డాడు. అందువల్ల దైవప్రవక్త (స) తన అనుచరుల్ని సమావేశపరచి, సుమామా బిన్ ఉసాల్ ఎక్కడ తటస్థపడినా అతడ్ని హతమార్చండని ఆదేశించారు.

తర్వాత దైవప్రవక్త (స) నజద్ ప్రాంతానికి ఒక సైనికదళం పంపారు. ఈ దళం రాత్రివేళ మక్కా దిశగా ప్రయాణం చేస్తున్న సుమామాని గుర్తుతెలియని శత్రువుగా భావించి ఖైదీగా పట్టుకున్నది. తర్వాత ఆ యోధులు మదీనా తిరిగొచ్చి అతడ్ని మసీదు ఆవరణలో ఒక స్తంభానికి కట్టివేశారు. కాస్సేపటికి దైవప్రవక్త (స) వచ్చి అతడ్ని చూశారు.

ఆయన సుమామాని "సుమామా! మా గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగారు. దానికి సుమామా "మీరు నన్ను హతమార్చితే విలువైన రక్తంగల ఒక మనిషిని హతమార్చిన వారవుతారు. మీరు గనక నాకు మేలు చేస్తే, చేసినమేలును సదా గుర్తుంచుకునే ఒక వ్యక్తికి మేలుచేసిన వారవుతారు. ఒకవేళ మీరు నాదగ్గర ధనం తీసుకోదలిస్తే నేనివ్వడానికి సిద్ధంగా ఉన్నాను, అడగండి ఎంతకావాలో" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈ విధంగా మూడు రోజులు అడిగారు. అడిగిన ప్రతిసారీ అతను ఇలాగే సమాధానమిచ్చేవాడు. చివరికి దైవప్రవక్త (స) అతడ్ని విడిచిపెట్టమని అనుచరుల్ని ఆదేశించారు. అనుచరులు అతడ్ని తాళ్ళు విప్పి వదలిపెట్టారు.

సుమామా ఖైదునుండి విడుదల కాగానే మదీనా సమీపంలోని ఒక ఒయాసిస్సుకు వెళ్ళి స్నానంచేసి దైవప్రవక్త (స) దగ్గరకు తిరిగొచ్చాడు. ఆయన ముందు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. తరువాత ఇలా అన్నారు: "దైవప్రవక్తా! దీనికి పూర్వం నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాల కన్నా ఎక్కువ మీ (ఇస్లాం) ధర్మాన్ని ద్వేషించేవాడ్ని. కాని ఈరోజు నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాలకన్నా ఎక్కువ మీ ధర్మాన్ని అభిమానిస్తున్నాను. దైవప్రవక్తా! నేనసలు ఉమ్రా ఆచారం పాటించే ఉద్దేశ్యంతో మక్కా వెళ్తుంటే దారిలో మీ సైనికులు నన్ను బందించి తెచ్చారు. ఇప్పుడు నేను మీరనుమతిస్తే ఉమ్రా చేయాలనుకుంటున్నా."

దైవప్రవక్త (స) ఈ మాట విని సంతోషంగా సుమామా (రజి)కు ఉమ్రా చేయడానికి అనుమతిస్తూ "ఇప్పుడు నీవు ఉమ్రాఆచారం ఇస్లామీయధర్మశాస్త్రం ప్రకారం నిర్వహించ వలసిఉంటుంది" అని చెప్పారు. ఆ తరువాత సుమామా (రజి) ఉమ్రా కోసం మక్కా



వెళ్ళిపోయారు. పట్నంలో ప్రవేశించగానే "నేను వచ్చేశాను, దేవా! నేను వచ్చేశాను. నీకు సాటి ఎవరూ లేరు. నేను నీ సన్నిధికి వచ్చేశాను. సమస్తవిధాల స్తుతులు, వరాలు నీకే శోభిస్తాయి." అనే 'తల్బియా' వచనాలు పఠిస్తూ కాబా దిశగా నడిచారు.

మునుపెన్నడూ వినని ఈ కొత్తపలుకులు మక్కాఖురైష్‌లకు ములుకులుగా తోచడంతో వారు ఆగ్రహోదగ్రులై కత్తులు దూస్తూ కాబా వైపు పరుగెత్తారు. హజ్రత్ సుమామా బిన్ ఉసాల్ (రజి) కాబా చేరుకొని నిశ్చింతగా ప్రదక్షిణ చేయసాగారు. వారిలో ఒక యువకుడు పళ్ళునూరుతూ సుమామా (రజి)ను హతమార్చడానికి బాణం ఎక్కుపెట్టాడు. వెంటనే కొందరు అతడ్ని వారిస్తూ "ఆగు, ఇతనెవరో తెలుసా? ఇతను యెమామా రాజు సుమామా బిన్ ఉసాల్. మనం గనక అతనికి ఏదైనా కీడు తలపెడ్తే అతని తెగవాళ్ళు మనకు ధాన్యంసరఫరాను నిలిపి మనల్ని ఆకలితో మాడ్చి చంపుతారు" అని అన్నారు. ఈ మాటలు వినగానే ఇతర ఖురైషీయులు ఢీలా పడిపోయారు.

హజ్రత్ సుమామా (రజి) కాబాప్రదక్షిణ చేస్తుంటే ఖురైష్ నాయకులు ఆయన ధోరణి గమనించి "సుమామా! నువ్వు కూడా మతభ్రష్టుడై పోయావా?" అన్నారు.

దానికి సుమామా (రజి) సమాధానమిస్తూ "కాలేదు. నేనిప్పుడు ముహమ్మద్ మహనీయుని (స) చేతి మీదుగా సత్యధర్మం, సనాతన ధర్మమయిన ఇస్లాం స్వీక రించాను. ఇంకా వినండి. ఇకనుండి ముహమ్మద్ (స) అనుమతి ఇవ్వనంత వరకు లేదా మీరంతా ఇస్లాం స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరనంత వరకు మీకు యమామా నుండి ఒక్క గోధుమగింజ కూడా పంపడం జరగదు" అని అన్నారు.

సుమామా (రజి) యమామా తిరిగొచ్చిన తరువాత అలా చేసి చూపారు కూడా. దాంతో మక్కా ఖురైషీయులు మదీనాలో దైవప్రవక్త (స) సన్నిధికి చేరుకొని "దయచేసి యమామా నుండి వచ్చే ధాన్యాన్ని మాకు సరాఫరా కాకుండా నిలుపుదల చేయించకండి" అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "మక్కా ప్రజలకు యథాప్రకారం ధాన్యం సరఫరా కానివ్వు" అని హజ్రత్ సుమామా (రజి)ను ఆదేశిస్తూ లేఖ రాశారు.

ఖలీఫా అబూబకర్ (రజి) పాలనాకాలంలో హజ్రత్ సుమామా తెగలో ముసైలిమా అనేవాడు తాను కూడా దైవప్రవక్తనని ప్రకటించుకొని జనంలో గందరగోళం సృష్టించాడు. అతని ఉపతెగ బనూహనీఫా ప్రజల్లో అత్యధికమంది అతని మాయాజాలంలో పడి మత భ్రష్టులైపోయారు. అలాటి దుస్థితిలోనూ సుమామా (రజి) ఇస్లాంలో స్థిరంగా ఉండటమే గాక మతభ్రష్టులైన తన తెగవాళ్ళను నచ్చజెప్పడానికి కూడా ఎంతో కృషి చేశారు. వేరొకవైపు ఆయన ఇస్లాంలో స్థిరంగా ఉన్న తన తెగవాళ్ళను తీసుకొని వేరైపోయి, మతభ్రష్టులకు వ్యతిరేకంగా పోరాడటంలో నిమగ్నులైపోయారు.

# 25. ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)

అది నబవీశకం 11వ ఏట. ఔస్, ఖజ్రజ్ తెగలకు చెందిన 12 మంది మదీనా నుండి బయలుదేరి మక్కా సమీపంలోని అఖ్బాప్రదేశం చేరుకొని విడిదిచేశారు. అక్కడ దైవప్రవక్త (స) వీళ్ళను కలుసుకొని ఖుర్ఆన్ సూక్తులు విన్పించి, ఇస్లాంవైపు పిలిచారు. ఎప్పుడెప్పుడా అని చాతకపక్షుల్లా ఎదురుచూస్తున్న వీరు తక్షణమే ఇస్లాం స్వీకరించారు.

తర్వాత వారంతా ప్రమాణం చేసి ఇకముందు ఎన్నటికీ దైవానికి సాటికల్పించమని, దొంగతనానికి దూరంగా ఉంటామని, వ్యభిచారం చేయమని, సంతానాన్ని చేజేతులా చంపుకోమని, ఇతరుల మీద అపనిందలు మోపమని దైవప్రవక్త (స) ఎదుట శపథం చేశారు. ఈ శపథాన్ని కాపాడుకుంటే దేవుడు మీకు స్వర్గసౌఖ్యాలు ప్రసాదిస్తాడని, ఒకవేళ వాటిలో దేన్నయినా అతిక్రమిస్తే దాని పర్యవసానం విశ్వప్రభువు అభీష్టం మీద ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. హజ్ చేసిన తర్వాత వారు తిరిగి మదీనా బయలుదేరారు. మదీనా ప్రజలకు ఇస్లాం గురించి వివరించడానికి, దైవాజ్ఞలను నేర్పడానికి దైవప్రవక్త (స) వారివెంట ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)ని పంపారు.

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) మదీనా చేరుకొని హజ్రత్ అసద్ బిన్ జిరారా (రజి) ఇంట్లో విడిదిచేసి పని ప్రారంభించారు. దాంతో మదీనాలో ఇస్లాం శరవేగంతో విస్తరించసాగింది. ఎంతోకాలం నుంచి సత్యపిపాసతో అలమటిస్తున్న మదీనావారికి ఇస్లాం శాంతి ప్రసాదించింది.

ఔస్‌తెగలో బనీఅబ్దుల్ అష్హల్, బనీజఫర్ అనే రెండు ఉప తెగలున్నాయి. ఇవి మిగతా ఉపతెగలన్నిటిలో ఎంతో శక్తిమంతమైనవి. సాద్ బిన్ ముఆజ్ బనీఅబ్దుల్ అష్హల్ ఉపతెగ నాయకుడేగాక, ఔస్‌తెగలోని ఉపతెగలన్నిటికీ అగ్రనాయకుడిగా ఉన్నాడు. ఉసయ్యిద్ బిన్ హుజైర్ జఫర్‌తెగకు నాయకుడిగా ఉన్నాడు. ఒక రోజు ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి), అసద్ బిన్ జిరారా (రజి)లు బనీ అబ్దుల్ అష్హల్ వాడలో ఓబావి దగ్గర కూర్చొని మాట్లాడుకోసాగారు. సాద్ బిన్ ముఆజ్‌కు వారిద్దరు అలా తమ వాడలోకి వచ్చి ఇస్లాం ప్రచారం చేయడం ఏమాత్రం నచ్చలేదు. అందువల్ల ఆయన ఉసయ్యిద్ బిన్ హుజైర్‌ని పిలిచి ఇలా చెప్పాడు:

"అసద్ నా పినతల్లి కొడుకయినందున నేను గట్టిగా చెప్పి ఆ కొత్తమత ప్రచారాన్ని మాన్పించలేను. వీళ్ళు మన ప్రజల్ని పెడదారి పట్టించి మతభ్రష్టులుగా చేయడానికి వస్తున్నారు. అంచేత నువ్వెళ్ళి నాలుగ చీవాట్లు పెట్టి ఇకముందు ఎప్పుడూ మన వాడలోకి రావద్దని వాళ్ళకు గట్టిగా చెప్పు."

ఉసయ్యిద్ బిన్ హుజైర్ వెంటనే కరవాలం తీసుకొని బయలుదేరాడు. అసద్ (రజి), ముస్అబ్ (రజి)ల దగ్గరకు వెళ్ళి వారిని నానా మాటలు అని బెదిరించాడు.



"అయ్యా! మీరు ఆవేశంలో ఉండి అసలు విషయాన్ని విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం! ఏమిటా అసలు విషయం?" అన్నాడు ఉసయ్యిద్.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను. రెండుమూడు మాటలు వింటే మీ కొచ్చే నష్టమేమీ లేదు. ఆ తరువాత మీ ఇష్టం, ఏదైనా చేసుకోవచ్చు."

"సరే చెప్పండి వింటాను" అంటూ ఉసయ్యిద్ వాళ్ళిద్దరికి ఎదురుగా కూర్చున్నాడు.

అప్పుడు ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ఇస్లాం వాస్తవికతను కాస్త వివరించి ఖుర్ఆన్ నుంచి కొన్ని సూక్తులు పఠించి విన్పించారు. అంతే ఖుర్ఆన్ సూక్తులు వినగానే ఉసయ్యిద్ ఎంతో ప్రభావితుడయి అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

"ఇంకొక మనిషి ఉన్నాడు. అతను కూడా ముస్లిం అయిపోతే ఇక మదీనాలో మిమ్మల్ని వ్యతిరేకించేవారే ఉండరు. నేనెళ్ళి అతడ్ని పంపిస్తాను ఉండండి" అని చెప్పి ఉసయ్యిద్ (రజి) అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

"ఆ.. ఏమయింది పోయిన పని? గట్టిగా చెప్పావా?" అడిగాడు సాద్ బిన్ ముఆజ్ అతడ్ని చూడగానే.

"చెప్పాను. ముఖం వాచేలా చీవాట్లుపెట్టి మరీ చెప్పాను. మన అభిమతానికి వ్యతిరేకంగా ఎలాంటి పనీ చేయమని వారిద్దరు వాగ్దానం కూడా చేశారు. కాని అంతలో అక్కడ ఓ ప్రమాదం వచ్చిపడింది" అన్నారు హజ్రత్ ఉసయ్యిద్ బిన్ హుజైర్ (రజి).

"ప్రమాదమా! ఏమిటా ప్రమాదం?"

"బనీ హారిస్ తెగకు చెందిన కొందరు యువకులు అసద్ బిన్ జిరారాను చంప జూస్తున్నారు" అన్నారు ఉసయ్యద్ (రజి).

ఈ సంగతి వినగానే సాద్ ఖడ్గం తీసుకొని పరుగెత్తాడు. తీరా అక్కడకెళ్ళి చూస్తే ముస్అబ్, అసద్ (రజి)లు ఆ బావి దగ్గరే కూర్చొని హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఉసయ్యిద్ తనను మోసగించి ఇక్కడకు పంపించాడని సాద్ బిన్ ముఆజ్ వెంటనే గ్రహించాడు. ఈ ఆలోచన రాగానే కోపోద్రేకాలతో ఊగిపోతూ ముస్అబ్, అసద్ (రజి)లను శాపనార్థాలు పెట్టడం మొదలెట్టాడు.

"అయ్యా! మీరు ఆవేశంలో పడి అసలు విషయం విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం ఏమిటీ?" అడిగాడు సాద్ బిన్ ముఆజ్ కొంచెం మెత్తబడి.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను" అన్నారు ముస్అబ్ (రజి).

"సరే, చెప్పండి" అంటూ సాద్ కూర్చున్నాడు.

అప్పుడు హజ్రత్ ముస్అబ్ (రజి) ఇస్లాం గురించి ఉసయ్యిద్ (రజి)కు చెప్పినట్లే సాద్‌కు కూడా చెప్పి ఇస్లాంవైపు ఆహ్వానించారు. సాద్ కూడా ఏమాత్రం తటపటాయించకుండా అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

ఆ తరువాత హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) తన తెగవాళ్ళందరినీ సమావేశపరచి "మీరు నన్ను ఎలాంటివాణ్ణని భావిస్తున్నారు?" అని అడిగారు.

"మీరు మా నాయకులు, విజ్ఞతావివేచనలు కలవారు. మీరిచ్చే ప్రతి సలహా ఆచరణ యోగ్యంగా ఉంటుంది" అన్నారు ప్రజలంతా ముక్తకంఠంతో.

"అయితే వినండి. నేను ముస్లిం అయ్యాను. మీరు కూడా ముస్లింలు కానంత వరకు ఇకముందు మీతో నాకెలాంటి సంబంధం ఉండదు" అన్నారు సాద్ (రజి).

నాయకుని మాటలు వినగానే జనమంతా అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించారు.

కొంతకాలం నుంచి దైవప్రవక్త (స) ప్రచారోద్యమంలో సహాయసహకారాలు అందజేసే ఆప్తమిత్రులు కరువయినందుకు ఎంతో విచారంగా ఉండేవారు. ఆ ఆప్తమిత్రులు ఇప్పుడు మదీనాలో దొరికారు.

నిజంగా మదీనా ప్రజల అదృష్టమే అదృష్టం! సొంత ప్రజలే దైవప్రవక్త (సల్లం)ను అంతమొందించడానికి పూనుకున్న క్లిష్టపరిస్థితిలో మదీనా వాసులు ఇస్లాం జ్యోతిని నలుదిశలా ప్రసరింపజేస్తూ ఆయన కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయసాగారు. ఫలితంగా మక్కాలో ఏండ్ల తరబడి ప్రయత్నించినా జరగనంతటి ధర్మపరివర్తన మదీనాలో ఒక్క ఏడాదిలోనే జరిగిపోయింది.

ఓరోజు మదీనా నాయకులు సమావేశమై దైవప్రవక్త (స)కు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని, ఆయన్ని శత్రువుల బారినుండి రక్షించడానికి అవసరమైతే ప్రాణాలైనా అర్పించడానికి వెనుకాడరాదని నిశ్చయించుకున్నారు.

మదీనా ప్రజలకు ఇస్లాం శిక్షణ ఇవ్వడానికి నియమించబడిన హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) మక్కాకు తిరిగొచ్చారు. మదీనాలో ప్రజలు ఇస్లాం పట్ల చూపుతున్న అసక్తి, ఆదరాభిమానాలు, దైవప్రవక్తను కాపాడడానికి వారు తీసుకున్న నిర్ణయాలు వగైరా విషయాలన్నీ ఆయన దైవప్రవక్త (స)కు తెలియజేశారు.

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) బదర్, ఉహద్ యుద్ధాల్లో పాల్గొని తమ ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించారు. కాని ఉహద్ యుద్ధంలో ఆయన వీరమరణం పొందారు. ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) రూపురేఖలు దాదాపు దైవప్రవక్త (సల్లం)ను



పోలివుంటాయి. అందువల్ల ఉహద్ యుద్ధంలో ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) అమరగతి నొంది నపుడు అవిశ్వాసులు దైవప్రవక్త (సల్లం) అమరగతినొందారని పుకార్లు పుట్టించారు. ఈ వదంతి కారణంగా ముస్లింయోధుల్లో కొంచెం గందరగోళం ఏర్పడింది. తరువాత అది దూరమైపోయింది.

ఉహద్ యుద్ధం ముగిసిన తర్వాత దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు మృతవీరుల్ని ఖననం చేయనారంభించారు. ఒక్కొక్క సమాధిలో రెండేసి మూడేసి శవాలను పూడ్చిపెట్టారు. హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) మృతదేహం కప్పడానికి లభించిన వస్త్రం కురచగా ఉంది. దాంతో ఆయన తల వైపు నుంచి కప్పితే పాదాలు బయటుండి పోతున్నాయి. పాదాల వైపు నుంచి కప్పితే తల బయటుండి పోతోంది. చివరికి వస్త్రాన్ని తల వైపు నుంచి కప్పి పాదాలపై గడ్డితో కప్పారు. ఆ తరువాత యుద్ధభూమి నుంచి మదీనా బయలుదేరారు.

# 26. అబూసల్మా (రజి)

అఖ్బా శపథానికి సంబంధించిన సంఘటన తర్వాత మక్కాలో ముస్లింలపై ఖురైషీయుల హింసాదౌర్జన్యాలు హద్దుమీరిపోయాయి. అప్పుడు దైవప్రవక్త (స) ముస్లింలకు మదీనా వలసపొమ్మని అనుమతి ఇచ్చారు.

ఇలా దైవప్రవక్త (సల్లం) అనుమతి లభించగానే నబవీశకం 13వ ఏట ముస్లింలు రహస్యంగా రాత్రివేళల్లో జట్లుజట్లుగా బయలుదేరి మదీనా దారిపట్టారు. ఈ విధంగా కొందరు ముస్లింలు మక్కాలో తమ ఇండ్లు ఖాళీచేసి వెళ్ళిపోగానే ఖురైషీయులకు మళ్ళీ గుబులు పుట్టింది. ముస్లింలు ఇప్పుడు మదీనా పట్టణాన్ని ధార్మికకేంద్రంగా చేసుకొని అక్కడ్నుంచి తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని వారు గ్రహించారు. అంతేకాదు, మదీనాలో ఇప్పటికే చాలామంది ముస్లింలయి పోయారని, మక్కా ముస్లింలు కూడా అక్కడకు చేరుకుంటే ఇక ఈ ఉద్యమం తమకు పెద్ద ప్రమాదం తెచ్చి పెడ్తుందని భావించారు.

అందువల్ల సత్యతిరస్కారులైన ఖురైషీయులు మక్కా నుండి వెళ్తున్న ముస్లింలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ప్రారంభంలో వారు మక్కా నుండి వెళ్ళిపోయిన ముస్లింల ఖాళీ ఇండ్లను తగలబెట్టారు. ఇలా చేస్తే మక్కా నుండి వెళ్ళిపోకుండా ఉన్న ముస్లింలు తమ ఆస్తులు నష్టపోతాయన్న భయంతో మదీనా వెళ్ళిపోరని భావించారు. కాని ఈ ప్రయత్నం వల్ల ప్రయోజనం కన్పించక పోవడంతో వారు పట్నం వెలుపల అనేక చోట్ల కొందరు మనుషుల్ని కాపలా పెట్టించారు. రాత్రివేళ రహస్యంగా బయలుదేరే ముస్లింలను వారు అటకాయించి వారి సొమ్ముల్ని, సామగ్రిని లాక్కొని వేధించడం మొదలెట్టారు.

మక్కానుండి వలసపోతున్నవారిలో కొందరు తమ సిరిసంపదలన్నీ వదలిపెట్టి పోతున్నప్పటికీ ఖురైషీయులు అలాంటివారిని కూడా దారిలో అడ్డుకొని వేధించడం ప్రారంభించారు.

హజ్రత్ అబూసల్మా (రజి) తన భార్య ఉమ్మెసల్మా (రజి)ను, ఒక పిల్లవాడ్ని తీసుకొని మక్కా నుండి బయలుదేరారు. పట్నం నుండి రెండు మూడు మైళ్ళు పోయారో లేదో ఉమ్మెసల్మా (రజి) తరపు బంధువులు వచ్చి వాళ్ళను అటకాయించారు. వారి చేతుల్లో కత్తులు, ఈటెలు కూడా ఉన్నాయి.

ఒంటె మీద భర్త వెనుక కూర్చున్న హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) వాళ్ళను చూడగానే నిలువునా కంపించిపోయారు. ఆమె ఒడిలో కూర్చున్న చంటి పిల్లవాడు ఏడ్పు లంకించు కున్నాడు. అబూసల్మా (రజి)కు పట్టరాని కోపం వచ్చింది. కాని ఏం చేయగలరు?

"ఏమిటీ దౌర్జన్యం! నేను నా ఇల్లు, ఆస్తిపాస్తులన్నీ మక్కాలోనే వదలిపెట్టి వచ్చాను కదా! నేనిప్పుడు నా భార్యను, పిల్లవాడ్ని మాత్రమే తీసికెళ్తున్నాను. ఇక నా దగ్గర ఏముందని వచ్చారు మీరు?" అన్నారాయన కోపాన్ని బలవంతంగా దిగమింగుతూ.

"నువ్వు వెళ్ళ దలచుకుంటే ఎక్కడికైనా వెళ్ళి ఊరేగు. కాని మా అమ్మాయిని మాత్రం తీసికెళ్ళడానికి వీల్లేదు" అన్నారు ఉమ్మెసల్మా (రజి) బంధువులు.

"ఈమె నాభార్య. మీరు స్వయంగా ఈమెను నాకిచ్చి పెళ్ళిచేశారు. ఇప్పుడు ఈమెను నానుండి దూరం చేయడానికి మీకెలాంటి అధికారంలేదు" అన్నారు హజ్రత్ అబూసల్మా (రజి).

"ముందు నువ్వు ఒంటె మీద నుంచి దిగుతావా లేదా?" అంటూ వారు కత్తులు ఝుళిపించారు.

హజ్రత్ అబూసల్మా (రజి) గత్యంతరంలేక ఒంటె మీద నుంచి కిందికి దిగారు. వెంటనే ఉమ్మెసల్మా (రజి) బంధువులు ఉమ్మెసల్మా (రజి)ను, ఆమె పసిబిడ్డను బలవంతంగా తీసుకొని అక్కడ్నుంచి బయలుదేరారు.

పాపం! ఉమ్మెసల్మా (రజి) మాటిమాటికి వెనక్కి తిరిగి భర్త వైపు చూస్తూ కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. తల్లి తరపు బంధువుల వికృతచేష్టల కారణంగా ఆమె ఒడిలోని పిల్లవాడు కూడా వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

హజ్రత్ అబూసల్మా (రజి) నిస్సహాయంగా నిలబడి భార్యాపిల్లల వైపు చూస్తున్నారు. ఆయన కళ్ళు కూడా అశ్రుపూరితాలయ్యాయి. ఆయన భార్యాపిల్లలు కనుమరుగై పోయేదాకా చూశారు. ఆ తర్వాత గత్యంతరంలేక కాళ్ళీడ్చుకుంటూ ఒంటరిగా మదీనా దారిపట్టారు.



ఉమ్మెసల్మా బంధువులు ఉమ్మెసల్మా (రజి)ను సంతోషంగా ఆమెభర్త వెంట మదీనా పంపడానికి బదులు ఇస్లాంపట్ల ఉన్న ద్వేషంతో గుండెల్లో రగులుతున్న కసి తీర్చుకోవడానికి ఈవిధంగా ఆమెను భర్త నుండి విడదీసి లాక్కెళ్తున్నారు.

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) బంధువుల వైఖరి అబూసల్మా (రజి) బంధువులకు సహించరానిదై ఉండాలి. వారు ఉమ్మెసల్మా (రజి) బంధువుల దుశ్చర్యను గర్హించాలి. కాని వారిగుండెల్లో కూడా ఇస్లాంవ్యతిరేక జ్వాలలు రగులుతున్నాయి. సమాచారం అందిన వెంటనే వారు బయలుదేరి పట్నం వెలుపలే దారిలో ఉమ్మెసల్మా (రజి) బంధువుల్ని కలుసుకున్నారు.

"ఆగండి. మీరు మీ అమ్మాయిని మావాడి నుండి వేరుచేసి తీసికెళ్తున్నారు బాగానే ఉంది. కాని ఈ పిల్లవాడు మావాడు, మా వంశాంకురం. మీరితడ్ని తీసికెళ్ళడానికి ఎంత మాత్రం వీల్లేదు. మా పిల్లవాడ్ని మాకిచ్చేయండి" అంటూ అబూసల్మా బంధువులు ఉమ్మెసల్మా (రజి) ఒడిలోని పసిబిడ్డను బలవంతంగా లాగి తీసుకున్నారు.

ఈ దుశ్చర్యకు ఉమ్మెసల్మా (రజి) బంధువులు అభ్యంతరం పెట్టలేదు గాని, పిల్లవాడు మాత్రం మరోసారి ఏడ్పు లంకించుకున్నాడు. ఉమ్మెసల్మా (రజి) కూడా ఏకధాటిగా రోదించసాగారు. ఆ రాతిగుండెలు మాత్రం కాస్తయినా కరగలేదు.

సత్యతిరస్కారుల ఈ దురభిమానం, దుశ్చర్యలకు పాపం ఉమ్మెసల్మా (రజి) అటు భర్తనూ కోల్పోయారు; ఇటు పసిబిడ్డనూ పోగొట్టుకున్నారు. ఈ విధంగా ఉమ్మెసల్మా (రజి) భర్తవియోగంతో, పుత్రవియోగంతో దాదాపు ఏడాదిపాటు దిగులుతో చాల బాధపడ్డారు. చివరికి ఒక దయార్ద్రహృదయుడి సహకారంతో ఆమె అవిశ్వాసుల బారినుండి బయటపడటమే గాకుండా తన పిల్లవాడ్ని కూడా దక్కించుకున్నారు. ఆ తరువాత వెంటనే ఆమె మరో దయార్ద్రహృదయుడి సహాయంతో ఒంటె మీద మదీనా వెళ్ళిపోయారు.

అబూసల్మా (రజి) దైవప్రవక్త (సల్లం)తో పాటు బదర్, ఉహద్ యుద్ధాలలో పాల్గొన్నారు. కాని ఉహద్ యుద్ధంలో ఆయన గాయపడ్డారు. తరువాత కొన్నాళ్ళకే బనీఅసద్ తెగతో జరిగిన యుద్ధంలో పాల్గొనవలసి రావడంతో మానుతున్న గాయాలు పచ్చి పుండ్లయి వాటి నుంచి ధారాపాతంగా రక్తం కారడం మొదలెట్టింది.

గాయపడి మంచాన పడ్డ అబూసల్మా (రజి)ను పరామర్శించడానికి దైవప్రవక్త (సల్లం) తరచుగా ఆయన ఇంటికి వెళ్ళేవారు. ఆయన ఆరోగ్యం కోసం దైవాన్ని ప్రార్థించే వారు. కాని అబూసల్మా (రజి) అనారోగ్యం నుంచి కోలుకోలేక పోయారు. చివరికి ఆ గాయాలతోనే ఆయన శాశ్వతంగా కన్నుమూశారు.

# 27. సురాఖా బిన్ మాలిక్ (రజి)

ఇస్లామీయఉద్యమ రథసారథి మహాప్రవక్త ముహమ్మద్ (స) పరుల హృదయాల్లో సత్యామృతం చిలికించడానికి నడిరాత్రి చీకటిలో మక్కా నుండి ఎప్పుడో అదృశ్య మయ్యారు. ముహమ్మద్ (స) పట్నం వదలిపోయారన్న వార్త మక్కాలో దావానలంలా వ్యాపించింది. నగరవాసుల్లో పెద్ద కలకలం బయలుదేరింది. మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (స) కోసం వెతికి వెతికి వేసారిపోయారు. చివరికి ఆయన్ని పట్టితెచ్చినవారికి వంద ఒంటెల బహుమానం ఇస్తామని ప్రకటించారు.

ఈ బహుమానం కోసం చాలామంది ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఖురైష్ నేతలు ఓరోజు సమావేశమై తీవ్రంగా ఆలోచించసాగారు. అందరి ముఖాల లో నిర్లిప్తత అలుముకుంది. అంతలో వాళ్ళదగ్గరికి ఓ ఆగంతకుడు వచ్చాడు. ఖురైషీయులంతా ఒక్కసారిగా అతని వైపు తలెత్తి చూశారు. "నేను తీరప్రాంతం నుంచి వస్తుంటే ముగ్గురు మనుషులు ఎదురయ్యారు. వారు ముహమ్మద్, ఆయన సహచరులై వుండవచ్చని నా అనుమానం" అన్నాడు ఆగంతకుడు.

ఆ సమయంలో సురాఖా బిన్ మాలిక్ అనే అతను కూడా ఖురైషీయుల సమావేశం లో కూర్చున్నాడు. అతను చాలా దూరదృష్టి కలవాడు. ఆగంతకుడు చెప్పింది నిజమే అయివుంటుందని గ్రహించాడు. ఆ విషయాన్ని పైకి వ్యక్తపరచలేదు. పైగా ముహమ్మద్ (స)ను పట్టుకునే గౌరవం తానే పొందాలని, వంద ఒంటెల బహుమానం తానే కొట్టేయా లని తలచి సురాఖా ఖురైషీయుల్ని పెడదారి పట్టించడానికి పూనుకున్నాడు.

"అబ్బే వాళ్ళు ముహమ్మద్, ఆయన అనుచరులు కాదండి. ఆ మనుషులు నా ముందు నుంచే కదా పోయింది. వాళ్ళను నేను బాగా ఎరుగుదును" అన్నాడతను.

సురాఖా చెప్పిందే నిజమని తోచింది ఖురైషీలకు. అందువల్ల ఆగంతకుడు చెప్పిన మాటలు ఎవరూ పట్టించుకోలేదు. సురాఖా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు కాస్సేపు ఖురైష్ నాయకులతో ముచ్చటించి, ఆ తరువాత లేచి ఇంటికెళ్ళాడు.

ఇంటికి పోగానే సేవకునికి చెప్పవలసిన విషయాలన్నీ చెప్పి, ఆయుధాలతోపాటు ప్రయాణానికి కావలసిన వస్తువులు సిద్ధం చేసుకున్నాడు. సేవకుడు గుర్రం మీద జీను కట్టి పట్నం వెలుపలికి తీసుకుపోయి యజమాని కోసం ఎదురుచూడసాగాడు. కాస్సేపటికి సురాఖా అక్కడికి చేరుకున్నాడు.

సురాఖా తాను తీరం వెంబడి ప్రయాణం చేస్తున్నట్లు ఎవరికీ తెలియకుండా ఉండటానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. సేవకుడ్ని హెచ్చరించి గుర్రం ఎక్కి బయలుదేరాడు. గుర్రం దుమ్ము లేపుకుంటూ పరుగెత్తసాగింది.



గుర్రం తీరప్రాంతంలో కొంతదూరం కూడా పరుగెత్తలేదు, అంతలో ఒక్క కుదుపు కుదిపేసింది. ఆ కుదుపుకు సురాఖా నేలకొరిగేవాడే కాని, కళ్ళెంగట్టిగా పట్టుకొని ఎలాగో గుర్రాన్ని అదుపులోకి తెచ్చుకున్నాడు. తర్వాత కళ్ళెం వదలగానే అది గాలిలో దూసుకు పోయింది. కొంతదూరం పరుగెత్తిన తరువాత మళ్ళీ అమాంతం కుదిపేసింది.

కాని సురాఖా అధైర్యం చెందలేదు. గుర్రాన్ని నేర్పుగా అదుపులోకి తెచ్చుకొని అదిలించాడు. ఈసారి అది ఇంకాస్త బలం పుంజుకొని శరవేగంతో పరుగుతీసింది. దాని వేగం చూస్తుంటే సురాఖాకు భయం, తత్తరపాటు కలిగాయి. అయినా పట్టుదలతో ప్రయాణం సాగించాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం), ఆయన అనుచరుల ప్రయాణం ఒక రాత్రి, ఒక పగలు నిరాటంకంగా సాగింది. శత్రువులెవరూ వెంటాడుతున్న సూచనలేమీ లేకపోవడంతో అందరూ నిశ్చింతగా ప్రయాణం సాగిస్తున్నారు. మరుసటిరోజు మధ్యాహ్నం వేళ. ప్రయాణ బడలికతో విశ్రాంతి తీసుకుందామని తలచి అందరూ ఓ చెట్టు క్రింద దిగారు. హజ్రత్ అబూబకర్ (రజి) వెంట తెచ్చిన అన్నంమూట విప్పి ముందుంచారు. అందరూ కలసి అన్నం తిన్నారు. భోజనం ముగిశాక దైవప్రవక్త (సల్లం) కాస్సేపు నిద్రపోవడానికి ఉపక్రమించారు.

సాయంత్రం కావచ్చింది. ఎండ తీక్షణత కూడా తగ్గింది. ప్రవక్త బృందం ప్రయాణం కొనసాగించడానికి సిద్ధమయింది. అంతలో అకస్మాత్తుగా అబూబకర్ (రజి) దృష్టి దక్షిణ దిక్కు వైపుగా మళ్ళింది. ఎవరో ఒక వ్యక్తి గుర్రం మీద వేగంగా ఇటువైపే వస్తున్నాడు. దాంతో అబూబకర్ (రజి) గుండెలు దడదడ లాడిపోయాయి.

"దైవప్రవక్తా! మనం పట్టుబడి పోయాం. అదిగో అటు చూడండి శత్రువు వస్తున్నాడు" అన్నారు కంగారుపడుతూ ఆయన. కాని దైవప్రవక్త (స) ముఖంలో ఆందోళన మచ్చుకైనా లేదు. "అబూబకర్! కంగారు పడకు. దైవం మనకు తోడున్నాడు" అన్నారు ఆయన ధైర్యం చెబుతూ.

శత్రువు మరికాస్త దగ్గరయ్యాడు. డెక్కల చప్పుడుతో, ధూళి కణాలతో గుర్రం వేగం చాలా భీకరంగా ఉంది. అది మరి కాస్త దగ్గరయింది. అంతే, ఒక్క పల్టీ కొట్టింది. ఆ దెబ్బతో గుర్రం ముందుకాళ్ళు కాస్తా మోకాళ్ళదాకా నేలలో కూరుకుపోయాయి. ఆ ఊపుకు రౌతు కూడా ఇసుకలో బోర్లాపడ్డాడు.

ఇప్పుడు సురాఖా ధైర్యం పూర్తిగా సన్నగిల్లింది. అతనికి కనువిప్పు కలిగింది. ఆలోచిస్తే ఇవన్నీ అపశకునాలే అన్పించాయి. దాంతో అతను తాను చేయబోయే పని దేవునికి ఇష్టం లేదు కాబోలు అనుకున్నాడు. అంచేత సురాఖా అక్కడే ఆగి దైవప్రవక్త (స)ను, ఆయన సహచరుల్ని కేకవేసి పిలిచాడు.

"నేను మాలిక్ బిన్ జూషమ్ కొడుకు సురాఖాను. కొంచెం ఆగండి, మీతో మాట్లాడాలి. నేను మీకు ఎలాంటి హాని తలపెట్టను. నామాట నమ్మండి."

దైవప్రవక్త (స) ఈమాట విని సురాఖా కోసం దైవాన్ని ప్రార్థించారు. దాంతో ఇసుకలో కూరుకుపోయిన గుర్రం బయటపడింది. అతను దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చాడు. ఆ మహనీయుడి (స) ముఖవర్చస్సు చూడగానే సురాఖా హృదయంలో ఆయన పట్ల ఎనలేని గౌరవభావం ఏర్పడింది.

"దైవప్రవక్తా! ఖురైష్‌నాయకులు మిమ్మల్ని పట్టితెచ్చేవారికి వంద ఒంటెలు బహుమానం ఇస్తామని ప్రకటన చేయించారు. ఆ బహుమానం కోసం అనేకమంది అవిశ్వాసులు మిమ్మల్ని పట్టుకోవడానికి పట్నం నలుదిక్కులా పరుగెత్తారు. వంద ఒంటెల పేరాశ నన్ను కూడా వివశుణ్ణి చేసింది. దైవప్రవక్తా! నన్ను క్షమించండి. నేనిప్పుడు మిమ్మల్ని వెంటాడేవాళ్ళను ఆపి వెనక్కి పంపిస్తాను. నాకో శాంతిపత్రం రాసివ్వండి చాలు." అన్నాడతను వినయంగా.

ఈమాటలు విని దైవప్రవక్త (స)కు దయ కలిగింది. అతను కోరినట్లు అబూబకర్ (రజి) చేత శాంతిపత్రం రాయించి ఇచ్చారు.

సురాఖా దాన్ని తీసుకొని తిరిగి వెళ్ళిపోవడానికి గుర్రం ఎక్కాడు.

"సురాఖా! నువ్వు కిస్రా (ఈరాన్ చక్రవర్తి) కంకణం ధరించినప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!" అన్నారు దైవప్రవక్త (స) సురాఖా వైపు చిరునవ్వుతో చూస్తూ.

"ఏమిటీ! నేను కిస్రా కంకణం ధరించడమా!!" సురాఖా నోరు తెరచి సంభ్రమాశ్చర్యాలతో దైవప్రవక్త (స) వైపు చూడసాగాడు.

"ఔను. నువ్వు ఈరాన్ చక్రవర్తి కంకణం ధరిస్తావు" అన్నారు దైవప్రవక్త (స).

"నేను ధరిస్తానా!!" సురాఖా ఆశ్చర్యం నుండి ఇంకా తేరుకోలేకపోయాడు.

"ఔను నువ్వే. నువ్వు కాకపోతే ఇంకెవరు అనుకుంటున్నావు?" అన్నారు దైవప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ.

"దైవప్రవక్తా! నాకు మీమీద పూర్తి నమ్మకం ఉంది. మీమాట ఎన్నటికీ అసత్యం కాదు. ఇక నేను వెళ్తున్నాను" అంటూ సురాఖా గుర్రం అదిలించి మక్కా వైపు బయలుదేరాడు.

హిజ్రీ 16వ శతాబ్దం. ముస్లింలు జలూలా కోట ఆక్రమించుకున్నారని తెలియగానే చక్రవర్తి యజ్దగిర్ద్ హల్వాన్ నుంచి "రే" వైపుకు పారిపోయాడు. అతను రాజధాని మదాయెన్ లోని ఖరీదైన అనేక వస్తువులతో పాటు అపార సిరిసంపదల్ని మదాయెన్



ఆక్రమణకు ముందే జలూలాకు తరలించాడు. ఇప్పుడా వస్తువులు, సిరిసంపదలన్నీ సమరసొత్తుగా ముస్లింలకు దక్కాయి.

ముస్లిం సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఆ సమరసొత్తులో సైనికుల భాగం పోగా మిగతా సమరసొత్తును జియాద్ (రజి) ద్వారా మదీనాకు పంపివేశారు.

మస్జిదెనబవీ ఆవరణలో కనీవినీ ఎరగనంతటి అపార సమరసొత్తును, కళ్ళు జిగేల్ అన్పించే విలువైన వస్తువుల్ని చూసిన మదీనాప్రజలు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కాని సువిశాల సామ్రాజ్యానికి అధినేత అయిన ఖలీఫా ఉమర్ (రజి) మాత్రం ఆ ధనరాసుల్ని చూసి కన్నీరు కార్చారు. ప్రజలు ఆశ్చర్యపోయారు.

"ఏమిటీ ఈయనగారు ఇంతపెద్ద ఎత్తున లభించిన ధనరాసుల్ని చూసి సంతోషించాల్సింది పోయి ఏడుస్తున్నారు?" అనుకున్నారు జనం ముక్కుమీద వేలేసుకొని.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు కూడా ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిస్థితి అర్థం కాలేదు. అందుకే ఆయన "విశ్వాసులనాయకా! ఎందుకిలా కంటతడి పెట్టుకున్నారు? ఇది సంతోషంతో దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకునే సమయంకదా!" అని అడిగారు.

దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "దేవుడు ఏ జాతికి ప్రపంచ సిరిసంప దలు ప్రసాదిస్తాడో ఆ జాతిలో అసూయాద్వేషాలు జనిస్తాయి. దానివల్ల ఆజాతిలో చీలికలు ఏర్పడుతాయి. ఈ విషయమే నన్నిప్పుడు కంటతడి పెట్టించింది" అని అన్నారు.

ఆ సమరసొత్తులో చక్రవర్తి రత్నఖచిత కిరీటం, మణిమాణిక్యాల నడుంకట్టు, వజ్రకంకణాలు కూడ ఉన్నాయి. ఖలీఫా ఖడ్గంతో వాటిని చూసి సురాఖా (రజి)ని పిలిపించారు. సురాఖా(రజి) వచ్చిన తర్వాత ఖలీఫాఉమర్ (రజి) ఆయనకు ఈరాన్‌చక్రవర్తి దుస్తులు ధరింపజేసి ఆయన తలమీద అతని కిరీటం పెట్టారు. తర్వాత ఆయన నడుముకు చక్రవర్తిఖడ్గం వ్రేలాడదీసి, చేతులకు అతని కంకణాలు తొడిగించారు. అప్పుడు ఇతర ముస్లింలు సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు.

ఆ తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సురాఖా బిన్ మాలిక్ (రజి) వైపు తిరిగి "వారెవా! ఒక సాధారణ పల్లెవాసి తలపై ఈరాన్‌చక్రవర్తి రత్నఖచిత కిరీటమా!! చేతులకు అతని వజ్రఖచిత కంకణాలా!!!" అని అన్నారు.

మదీనాకు వలసపోతున్న దైవప్రవక్త (స)ను పట్టుకోవడానికి వచ్చిన సురాఖా (రజి)కు ఆనాడు ఆ మహనీయుడు చెప్పిన భవిష్యవాణి ఈవిధంగా నెరవేరింది.

# 28. అబూ అయ్యూబ్ అన్సారి (రజి)

మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన మహాప్రవక్త ముహమ్మద్ (స)ను మదీనా ప్రజలు స్వాగతకుసుమాల్లో ముంచెత్తసాగారు. అదో అద్భుత సన్నివేశం. మదీనా చరిత్రలో కనీవినీ ఎరగని అపూర్వ సంఘటన. ప్రతి కుంటుంబం దైవప్రవక్త (స)ను తన అతిథిగా చేసుకోవాలని ఉవ్విళూరుతోంది. ప్రతిఒక్కరూ దగ్గరికొచ్చి "దైవప్రవక్తా! మా ఇంటికి రండి, మా అతిథిగా ఉండండి. మాఇల్లు విశాలంగా ఉంది. మాదగ్గర అన్ని సౌకర్యాలు ఉన్నాయి "అని ప్రాథేయపడుతున్నారు.

దైవప్రవక్త (స) చిరునవ్వుతో వారికి కృతజ్ఞతలు చెప్పి ముందుకు సాగిపోతున్నారు. ఒంటె ముకుతాడు కొంచెం వదులుచేసి "ఈ ఒంటె ద్వారా దేవుడు నన్ను ఎక్కడుండ మని సూచిస్తాడో అక్కడుంటాను" అన్నారు. ఆయన కూర్చున్న ఒంటె మదీనా వీథుల్లో నడుస్తోంది. అలా నడచి నడచి చివరకు విశాలమైన ఓ మైదానంలోకి ప్రవేశించి కూర్చున్నది. అప్పుడు జనం 'అల్లాహుఅక్బర్' అంటూ దిక్కులు పిక్కుటిల్లేలా నినదించారు. మరుక్షణమే ఒంటె లేచి ముందుకు కొంచం దూరం నడిచింది. ఆ తరువాత గిర్రున వెనక్కి తిరిగొచ్చి కూర్చున్నది. కూర్చోగానే మోర కిందికివాల్చి తోకాడించడం మొదలెట్టింది. జనం మరోసారి అల్లాహుఅక్బర్ నినాదం చేశారు.

ఆ ప్రదేశం నజ్జార్ వంశానికి చెందిన ఇద్దరు అనాథబాలురది. ఆ ప్రదేశానికి దగ్గర్లోనే హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) గారి రెండస్తుల మేడ ఉంది. అందువల్ల ఆయన వెంటనే దైవప్రవక్త (స) అనుమతితో ఆయన సామగ్రిని తన ఇంటికి చేర్చారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒంటె దిగి "ఈ చోటు ఎవరిది?"ని అడిగారు మస్జిద్ నిర్మించాలన్న ఉద్దేశ్యంతో.

హజ్రత్ ముఆజ్ బిన్ అఫ్రా (రజి) ముందుకు వచ్చి "ఈ భూమి సహెల్, సుహైల్ అనే అనాథ పిల్లలది. పసితనంలోనే తండ్రిని కోల్పోయారు. ప్రస్తుతం వీరిద్దరు నా సంరక్షణలో ఉన్నారు. మీరు సంతోషంగా ఇక్కడ మస్జిద్ నిర్మించవచ్చు. పిల్లలకు నేను నచ్చజెబుతాను" అని చెప్పారు.

దైవప్రవక్త (స) ఆ ఇద్దరు పిల్లల్ని పిలిపించి విషయం తెలియజేశారు. పిల్లలు భూమిని ఉచితంగా ఇవ్వడానికి అంగీకరించారు. అయితే దైవప్రవక్త (సల్లం) ఉచితంగా తీసుకోవడానికి ఒప్పుకోలేదు. దానికి తగిన ధర చెల్లించి తీసుకున్నారు.

మరునాడు అనుచరులు చెట్లు నరికి ఆ స్థలాన్ని చదును చేశారు. ఆ తరువాత మసీదు నిర్మాణం ప్రారంభమయింది. దైవప్రవక్త (స) హజ్రత్ అబూఅయ్యూబ్ అన్సారీ(రజి)కి అతిథి అయ్యారు. దాంతో అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) ఆనందం



అంతాఇంతా కాదు. తనకు ప్రపంచంలోని నిక్షేపాలన్నీ లభించినట్లు పరమానందంతో పరవశించి పోయారు.

హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) ఇల్లు రెండంతస్తులది. ఆయన పై అంతస్తును దైవప్రవక్త (స) కోసం కేటాయించారు. కాని దైవప్రవక్త (స) క్రింది అంతస్తులో ఉండటా నికే ఇష్టపడ్డారు. అబూఅయ్యూబ్ (రజి) దైవప్రవక్త (స)కు కావలసిన ఇతర అవసరాలన్నీ సమకూర్చారు. ఆ రాత్రి ఇషానమాజ్ తరువాత దైవప్రవక్త (స) తన పడకగదిలోకి ప్రవేశించాక ఆయన, ఆయన భార్య పైఅంతస్తులోకి వెళ్ళిపోయారు.

తలుపులు మూసి పడుకోవడానికి ఉపక్రమించగానే హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి)కు హఠాత్తుగా ఏదో అనుమానం వచ్చి భార్యను లేపారు.

"అయ్యయ్యో! మనం ఎంత పొరపాటు చేశాం!! మానవుల మార్గదర్శి అయిన దైవప్రవక్త (స) మనకు క్రింద ఉండటమా! ఎంత అపచారం!! ఆయన పైన మనం నడవడం భావ్యమేనా? ఆయనపై దైవవాణి అవతరిస్తుంది కదా! దైవవాణికి, ఆయనకు మధ్య ఉండి మనం అడ్డుతగలడమా!! ఇలా అయితే మనం సర్వనాశనమైనట్లే" అన్నారాయన (రజి) ఆందోళనపడ్తూ.

"నిజమేనండీ! ఇప్పుడేం చేద్దాం?" అన్నారు ఆయన అర్ధాంగి.

"ఈ రాత్రి మనం గది మధ్యలో పడుకోకుండా ఓ మూలన ఒదిగి కూర్చుందాం" అంటూ లేచి నిలబడ్డారు.

ఈ విధంగా ఆ రాత్రి భార్యాభర్తలిద్దరూ గదిలో ఓ మూలన ఒదిగి కూర్చొని గడిపారు. నడవాల్సి వచ్చినప్పుడు గోడలకు ఆనుకొని మెల్లగా నడిచేవారు.

తెల్లవారింది. హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) క్రిందికి దిగివచ్చి "దైవప్రవక్తా! రాత్రి నేను, నాభార్య ఇద్దరం మేల్కొనే ఉన్నాం" అన్నారు.

"ఎందుకూ? ఏమయింది?" అడిగారు దైవప్రవక్త (స).

"మీరు క్రింది అంతస్తులో, మేము పై అంతస్తులో ఉండటం నాకు భావ్యం అన్పించలేదు. మేము పైన ఉండి నడిచేటప్పుడు దుమ్ముధూళి మీపై పడితే మీకు బాధ కల్గుంది. అదీగాక మీకు, దైవవాణికి మధ్య మేము అడ్డుపడిన వాళ్ళం అవుతాము. ఈ ఆలోచన మమ్మల్ని రాత్రి నిద్ర పోనివ్వలేదు" అన్నారు అబూఅయ్యూబ్ (రజి).

"అబూఅయ్యూబ్! దాన్ని పట్టించుకోకు. ప్రతిరోజూ నా కోసం ఎందరో వస్తూ పోతుంటారు. అంచేత నేను క్రింది అంతస్తులో ఉండటమే మంచిది. మీరు నిశ్చింతగా పై అంతస్తులోనే ఉండండి" అంటూ ధైర్యం చెప్పారు దైవప్రవక్త (సల్లం).

అది జనాన్ని గజగజ వణికించే చలికాలం. ఓ రోజు రాత్రి పై అంతస్తులో నీటికుండ పగిలి నేలంతా తడిసింది. వెంటనే హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి), ఆయన భార్య ఆ నీటిని ఎత్తి పారేయడంలో నిమగ్నులై పోయారు. కాని ఇది సాధ్యమయ్యే పనికాదు. నీరు ఇంకిపోతూ క్రింది అంతస్తులోకి కారే ప్రమాదం ఏర్పడింది. దానివల్ల దైవప్రవక్త (సల్లం)కు బాధ కలగవచ్చు. అందువల్ల వారు కప్పుకోవడానికున్న ఒకేఒక గొంగళిని ఒలికిన నీటిపై వేసి దాన్ని తీశారు.

తెల్లవారిన తర్వాత అబూఅయ్యూబ్ (రజి) దైవప్రవక్త (స) దగ్గరికొచ్చి "దైవప్రవక్తా! మీరు క్రింది అంతస్తులో ఉండి మేము పై అంతస్తులో ఉండటం ఏం బాగాలేదు" అంటూ రాత్రి జరిగిన సంఘటన వివరించారు. మేడ పైఅంతస్తులోకి మారమని పదేపదే ప్రాధేయపడ్డారు. దైవప్రవక్త (స) ఆయన అభ్యర్థనను మన్నించి మేడ పైఅంతస్తులోకి మారారు. ఆరోజు నుంచి ఆయన అబూఅయ్యూబ్ (రజి) ఇంట్లో ఉండసాగారు.

ఈ విధంగా దైవప్రవక్త (సల్లం) ఏడునెలల పాటు హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) ఇంట్లో నివసించారు. ఈలోగా మసీదునిర్మాణంతో పాటు, దాని పరిసరాల్లో ఆయన సతీమణుల కోసం ఇళ్ళు నిర్మించబడ్డాయి. అప్పుడు దైవప్రవక్త (సల్లం), ఆయన సతీమణులు ఆ ఇండ్లలోకి వెళ్ళి అబూఅయ్యూబ్ (రజి)కు పొరుగువారిగా ఉండసాగారు.

ఓరోజు మిట్టమధ్యాహ్నం తీవ్రమైన ఎండలో హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటి నుంచి మసీదుకు బయలుదేరారు. దారిలో హజ్రత్ ఉమర్ (రజి) కలసి "అబూబకర్! ఎక్కడికి బయలుదేరారు ఈ సమయంలో?" అనడిగారు.

దానికి ఉమర్ (రజి) "ఆకలి తీవ్రత నన్ను ఇంటి నుంచి బయలుదేరదీసింది" అని చెప్పారు. "దైవసాక్షి! ఈ కారణమే నన్ను కూడా ఇంటి నుంచి బయలుదేరదీసింది" అన్నారు ఉమర్ ఫారూఖ్ (రజి).

అంతలో దైవప్రవక్త (స) కూడా అక్కడకు చేరుకొని "ఈ సమయంలో మీరిద్దరు మీ ఇండ్ల నుంచి ఎందుకు బయటికి వచ్చారు?" అని అడిగారు.

దానికి వారిద్దరు "దైవసాక్షి! తీవ్రమైన ఆకలే మమ్మల్ని మాఇండ్ల నుండి బయటికి తీసింది" అని చెప్పారు.

దైవప్రవక్త (స) ఈమాట విని "అయితే నా వెంట నడవండి" అని అన్నారు.

ఇలా ఈ ముగ్గురు హజ్రత్ అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) ఇంటికి చేరుకున్నారు. అబూఅయ్యూబ్ (రజి) వాళ్ళను చూడగానే సంతోషంతో స్వాగతం చెబుతూ "దైవప్రవక్తా! రండి, రండి. మీరాకతో మా జీవితం ధన్యమయింది" అని అన్నారు.



ఆ తరువాత ఆయన తోటలోకి వెళ్ళి ఖర్జూరపండ్లు కోసి తెచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు పెట్టారు. ఆ తరువాత ఆయన తన శ్రీమతితో "మన అతిథుల కోసం రొట్టెలు తయారుచెయ్యి. ఈలోగా నేను మేకను కోసి మాంసం తీసుకొస్తాను" అని చెప్పి మేకను జిబా చేయడానికి వెళ్ళారు.

కాస్సేపటికి రొట్టెలు, మాంసం కూరలు తయారయ్యాయి. అప్పుడు అందరూ ఆ రొట్టెలు, మాంసం కూరలతో సుష్టుగా భోంచేశారు.

దైవప్రవక్త (స) ఘుమఘుమలాడే ఆ వంటకాలు ఆరగించగానే ఆయన కళ్ళు ఎందుకో చెమర్చాయి. అప్పుడాయన ఈవిధంగా అన్నారు:

"నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! దేవుడు ప్రసాదించిన ఇలాంటి భాగ్యాలను గురించే రేపు ప్రళయదినాన మిమ్మల్ని ప్రశ్నించడం జరుగుతుంది. కాబట్టి ఇలాంటి భాగ్యాలు లభించినపుడు మీరు వాటిని తినేముందు 'దేవుని పేరుతో' అని పలకండి. తినడం ముగిసిన తరువాత 'మనల్ని కరుణించి, మనకు సుఖసంతోషాలు ప్రసాదించిన దేవునికి కృతజ్ఞతలు' అని చెప్పండి."

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి వెళ్ళిపోతూ "అబూఅయ్యూబ్! రేపు నీవు మాఇంటికి రావాలి" అన్నారు. దానికి హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) "మీ ఆదేశం శిరోధార్యం" అన్నారు.

మరుసటిరోజు అబూఅయ్యూబ్ (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళారు. దైవప్రవక్త (సల్లం) ఆయనకు ఒక సేవికను ప్రసాదిస్తూ "ఈమె మాదగ్గర ఉన్నంత కాలం ఈమెలో నేను మంచితనం తప్ప మరేమీ చూడలేదు. కనుక ఈమె పట్ల మంచిగా వ్యవహరించాలి" అని చెప్పారు.

అబూఅయ్యూబ్ (రజి) ఆ సేవికను తీసుకొని ఇంటికి వెళ్ళారు. ఆమెను తన శ్రీమతికి పరిచయం చేసి, దైవప్రవక్త (స) ఈమె పట్ల మంచిగా ప్రవర్తించాలని చెప్పారు. ఈమెను బానిసత్వం నుండి విముక్తి కలిగించడం కంటే మించిన సత్ప్రవర్తన మరేముంటుంది?" అని చెప్పి ఆమెను శాశ్వతంగా బంధవిముక్తి కలిగించి పంపేశారు. ఆ చర్యపట్ల ఆయన సతీమణి కూడా సంతోషం వ్యక్తపరిచారు.

హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) హతసాక్షి పుణ్యార్జన ఉద్దేశ్యంతో దైవప్రవక్త (స) కాలం నుండి అమీర్ ముఆవియా (రజి) పాలనాకాలం వరకు జరిగిన అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. చివరికి ఆయన ఎనభైఏళ్ళ వయసులో కూడా ముఆవియా (రజి) కుమారుడు యజీద్ నాయకత్వంలో కాన్స్టాంటినోపిల్‌కు వెళ్ళిన సైన్యంలో చేరిపోయారు. అయితే యుద్ధం మొదలైన కొన్నాళ్ళకే ఆయన వ్యాధిగ్రస్తులయిపోయారు. అంచేత

ముజాహిద్‌లు ఆయన్ని యుద్ధరంగం నుండి తీసి చికిత్స కోసం ఓ ప్రత్యేకశిబిరంలోకి తరలించారు.

ఓరోజు సేనాపతి యజీద్ అబూఅయ్యూబ్ (రజి)ని పరామర్శించడానికి వచ్చి "మీ పరిస్థితి కాస్త సీరియస్‌గానే ఉంది. మీ చివరి కోరిక ఏదైనా ఉంటే చెప్పండి" అని అన్నాడు. దానికి హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) "మీరు శత్రురాజ్యం సరిహద్దుల్లోకి చొచ్చుకుపోండి. నన్నెత్తుకొని మీతోపాటు తీసికెళ్ళి నా శవాన్ని కాన్స్టాంటినోపిల్ ప్రహరీ గోడ కింద సమాధిచేయండి" అంటూ చివరిశ్వాస వదిలారు.

యుద్ధం పరాకాష్ఠకు చేరింది. ముస్లింయోధులు శత్రుశవాలను తొక్కుకుంటూ పురోగమించి కాన్స్టాంటినోపిల్‌పై విజయపతాకం ఎగరవేశారు. హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) భౌతికకాయాన్ని ఆయన కోరిక ప్రకారమే అక్కడి ప్రహరీగోడ పక్కన సమాధిచేశారు.

# 29. అబ్దుల్లా బిన్ హజష్ (రజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ హజష్ (రజి) ఇస్లాం స్వీకరించిన ప్రప్రథమ ముస్లిముల్లో ఒకరు. ఆయన దైవప్రవక్త (సల్లం)కు బావమరిది అవుతారు. ఆయన చెల్లెలు జైనబ్ బిన్ హజష్ (రజి) దైవప్రవక్త (స) సతీమణి. ఇస్లాం స్వీకరించిన కారణంగా అబ్దుల్లా బిన్ హజష్ (రజి) మక్కాలో అనేక కష్టాలు భరించవలసి వచ్చింది. చివరికి దైవప్రవక్త(స) అనుమతితో అబిసీనియాకు వలసపోయారు. అక్కడ కొంతకాలం గడిపిన తరువాత సాధారణ హిజ్రత్ అనుమతి రావడంతో ఇళ్ళు-వాకిళ్ళు వదలి కుటుంబ సమేతంగా మదీనా వెళ్ళిపోయారు.

అప్పుడు మక్కాలో ఆయన ఇంటిని అబూజహల్ ఆక్రమించుకున్నాడు. అబ్దుల్లా (రజి)కు ఆ సంగతి తెలిసి దాన్ని దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించారు.

అప్పుడు దైవప్రవక్త (స) "అబ్దుల్లా! దానికి బదులు దేవుడు నీకు స్వర్గంలో అద్భుతమైన ఇల్లు ప్రసాదిస్తాడనే విషయం పట్ల నీవు సంతోషించవా?" అని అన్నారు. దానికి ఆయన "ఎందుకు సంతోషించను, తప్పకుండా సంతోషిస్తాను" అన్నారు.

దైవప్రవక్త (స) ఒకసారి మక్కా ఖురైషీయుల యుద్ధతంత్రాలను, వారి కదలికలను గురించి తెలుసుకొని రావడానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ హజష్ (రజి) నాయకత్వాన ఓ సైనికదళం పంపించారు. పంపించే ముందు ఆయన అబ్దుల్లా (రజి)కు ఓ లేఖ అందిస్తూ ఇలా ఉపదేశించారు:

"అబ్దుల్లా! ఈ లేఖను రెండు రోజుల తర్వాత విప్పి చూడాలి. ఆ తరువాత అందులో ఏముందో దాని ప్రకారం ఆచరించాలి. అయితే ఏ సహచరుని పైనా ఎలాంటి బలవంతం చేయకూడదు."



అది రజబ్ నెల హిజ్రీ రెండవ సంవత్సరం. అబ్దుల్లా బిన్ హజష్ (రజి) సైనికదళం తీసుకొని మదీనా నుండి బయలుదేరారు. రెండు రోజులు ప్రయాణం చేసిన తరువాత లేఖ విప్పి చూశారు.

"నీవు నేరుగా మక్కా-తాయిఫ్‌ల మధ్యనున్న 'నఖ్లా' ప్రదేశం చేరుకో. అక్కడ ఖురైషీయుల కోసం పొంచివుండి ఏమైనా సమాచారం ఉంటే తెలుసుకో" అని ఉంది ఆ ఉత్తరంలో.

హజ్రత్ అబ్దుల్లా (రజి) ఉత్తరాన్ని కళ్ళకద్దుకొని సహచరులతో ఇలా అన్నారు:

"మన ప్రియప్రవక్త (స) మనల్ని నఖ్లా వెళ్ళమని ఆజ్ఞాపించారు. అక్కడ ఖురైషీల కోసం పొంచివుండి, వారి రహస్యాలను తెలుసుకోవాలన్నారు. మీలో ఎవరిపైనా ఎలాంటి బలవంతం చేయవద్దని కూడా చెప్పారు. ఇదీ విషయం. నాతో రాదలచుకున్నవారు రావచ్చు. వెనక్కి వెళ్ళిపోదలచుకున్నవారు నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు. నేను మాత్రం దైవప్రవక్త (స) ఆదేశాన్ని శిరసావహిస్తాను."

ఈ మాటలు విని సహచరులంతా ఉత్సాహంతో నాయకుణ్ణి అనుసరించడానికే అంగీకరించారు. అబ్దుల్లా బిన్ హజష్ (రజి) వారిని తీసుకొని నఖ్లా బయలుదేరారు. దారిలో 'బహ్రాన్' అనే ప్రదేశానికి చేరుకునేటప్పటికి అక్కడ సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి), ఉత్బా బిన్ గజ్వాన్ (రజి)ల ఒంటెలు తప్పిపోయాయి. వీరిద్దరు తమ ఒంటెల్ని వెతుక్కోవడానికి బయలుదేరారు. ఇలా వారు వెనకపడి పోయారు. దారిలో కొందరు ఖురైష్ సైనికులు ఎదురయి వారిద్దర్ని బంధించి మక్కా తీసికెళ్ళారు.

అటు అబ్దుల్లా (రజి) దళం నఖ్లా చేరుకుంది. అక్కడ ఈ యోధులు ఖురైషీయుల కోసం ఎదురుచూస్తూ పొంచి ఉన్నారు.

అది రజబ్ నెల చివరి రాత్రి. ఆ మసక వెల్తురులో వారికి ఓ వర్తకబిడారం కన్పించింది. అది మరికాస్త సమీపానికి వచ్చింది. చూస్తే అది ఖురైషీయుల వర్తక బిడారం. దానిపై ద్రాక్ష, జంతుచర్మాలు పుష్కలంగా ఉన్నాయి.

"ఖురైషీయుల వాణిజ్యబృందం దగ్గరికి వచ్చింది. ఇప్పుడేం చేద్దాం?" అబ్దుల్లా (రజి) సహచరులతో సంప్రదించారు.

"ఈరోజు వీరిని విడిచిపెడితే మక్కా (హరం)లో ప్రవేశిస్తారు. హతమారిస్తే పవిత్ర మాసాన్ని అగౌరపరచినట్లవుతుంది" అన్నారు కొందరు. దాంతో అందరూ ఆలోచనలో పడిపోయారు. యుద్ధం చేయడానికి జంకుతున్నారు.

అయితే ఖురైషీయులు తమను దోచుకున్న సంగతి గుర్తుకొచ్చింది. అందువల్ల వారు వాణిజ్యబృందంతో యుద్ధం చేయడానికే నిశ్చయించుకున్నారు.

వారిలో వాఖిద్ బిన్ అబ్దుల్లా (రజి) వెంటనే విల్లు ఎక్కుపెట్టి బాణం వదిలారు. అది నేరుగా వాణిజ్యబృందం నాయకుడు అమ్ర్ బిన్ హజ్రమి శరీరంలోకి దూసుకు పోయింది. దంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

తరువాత ముస్లింలు ఇద్దరిని ఖైదీలుగా పట్టుకున్నారు. మిగిలిన ఒకడు తప్పించుకొని మక్కా పారిపోయాడు. ముస్లింయోధులు వ్యాపారసామగ్రి స్వాధీనం చేసుకొని మదీనా చేరుకొని విజయశుభవార్త దైవప్రవక్త (స)కు తెలియజేశారు.

కాని దైవప్రవక్త (స) ఈమాట వినగానే ఆగ్రహోదగ్రులై "ఏమిటీ మీరు పవిత్ర మాసంలో రక్తపాతం జరిపారా? నేనందుకోసం మిమ్మల్ని పంపలేదే!" అన్నారు.

అంతే- అబ్దుల్లా (రజి), ఆయన సైనిక సహచరుల గుండెలు ఝల్లుమన్నాయి.

"అయ్యో! ఎంత పని జరిగింది!! దైవప్రవక్త (స) అయిష్టాన్ని కొని తెచ్చుకున్నామే!!! ఇప్పుడేం చెయ్యాలి?" జరిగిన పొరపాటు తెలుసుకొని వారు తీవ్రంగా చింతించారు.

అంతలో మరికొందరు ముస్లింలు కూడా అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకొని అందరూ వారిపై మండిపడ్డారు.

"ఈ ఖైదీలను ఎవరూ ముట్టుకోకండి. ఈ సామగ్రిని కూడా ఎవరూ తాకవద్దు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ దుర్ఘటన ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్ప్రచారానికి మంచి ఊతమిచ్చింది.

"ముస్లింలు పవిత్ర మాసంలో యుద్ధం చేశారట! అవ్వ, ఎంత సిగ్గుచేటు!"

"ఘోరమైన రక్తపాతం జరిపి అనేకమంది ఖైదీలను కూడా పట్టుకున్నారట!!"

ఈ వార్త దావానలంలా మదీనా లోపలా, వెలుపలా అంతటా వ్యాపించిపోయింది. ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి శత్రువులకు సువర్ణావకాశం దొరికింది. గోరంతలు కొండంతలు చేస్తూ దేశమంతా టాం టాం చేశారు. మక్కా ఖురైషీయులయితే పనిగట్టుకొని మరీ ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు.

ముస్లింలు వారి మాటలు ఖండిస్తూ "అలా జరగలేదు. ఇది పచ్చి దుష్ప్రచారం. నిజానికి ఈ సంఘటన షాబాన్ నెల (ప్రారంభం)లో జరిగింది" అన్నారు.

యూదులయితే అదేదో మహాపాతకం జరిగినట్లు తలచి, ఇక ముస్లింలపై దైవశిక్ష విరుచుకుపడక తప్పదని చెప్పుకుంటూ తెగ సంబరపడసాగారు.

జరిగిన సంఘటన పట్ల దైవప్రవక్త (స) ఎంతో విచారం వెలిబుచ్చారు. ఆ మాటకు వస్తే ఏముస్లిం ముఖంలోనూ సంతోషం లేదు. అందరూ విచారంతో దిక్కు తోచని స్థితిలో పడ్డారు.



అంతలో దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం వికసించింది. ఆయన పెదవులపై చిరునవ్వు తొణికిసలాడింది. అది చూసి అనుచరుల ముఖాలు కూడా కలువపువ్వుల్లా విప్పారాయి.

"ముహమ్మద్! ప్రజలు నిన్ను పవిత్ర మాసాలలో యుద్ధం చేయడం గురించి అడుగు తున్నారు. వారికి ఇలా తెలియజెయ్యి: "ఆ మాసాలలో యుద్ధం చేయడం ఘోరమైన విషయం. అయితే దైవమార్గంలో అవరోధాలు సృష్టించడం, దేవుడు పంపిన సందేశాన్ని నిరాకరించడం, దైవభక్తుల్ని ప్రతిష్ఠాలయం (కాబాగృహం)లో ప్రవేశించనీయకుండా నిరోధించడం, అక్కడ ఉండేవారిని బయటికి గెంటివేయడం – ఇవన్నీ దేవుని దృష్టిలో అంతకన్నా ఘోరమైన చర్యలు.

హింసా–పీడనలు హత్యా–రక్తపాతాల కన్నా చాలా ఘోరమైనవి. వారికి సాధ్యపడితే మిమ్మల్ని మీ ధర్మం నుండి మరలించేవరకు మీతో పోరాడుతూనే ఉంటారు. అప్పుడు మీలో గనక ఎవరైనా ఈ ధర్మాన్ని వదలి సత్యతిరస్కారిగా మారి, చివరికి అదే స్థితిలో చనిపోతే మాత్రం అతని ఇహపర కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఇలాంటి ఉభయభ్రష్టులే నరకవాసులు." (ఖుర్ఆన్–2:217)

అప్పుడే అవతరించిన ఈ సూక్తిని దైవప్రవక్త (స) తన సహచరులకు విన్పించారు. దాంతో వారి హృదయాలు కుదుటపడ్డాయి. అసలు ఖురైషీయులే దౌర్జన్యకాండ జరిపారు. అలాంటి దౌర్జన్యకాండ ముందు పవిత్రమాసంలో రక్తపాతం జరపడం పాపం ఎలా అవుతుంది? మొత్తానికి ఎలాగో ఈ సమస్య పరిష్కారమయింది.

దైవప్రవక్త (సల్లం) సమరసొత్తును యోధులకు పంచారు. ఖైదీల విషయంలో మాత్రం ఖురైషీయులతో సంప్రదించారు. వారు ఖైదీల మార్పిడికి అంగీకరించారు. తక్షణమే ఖురైషీలు తమ అధీనంలో ఉన్న ఇద్దరు ఖైదీలను విడిచిపెట్టారు. ముస్లింలు తాము పట్టితెచ్చిన ఆ ఇద్దరు ఖైదీలకు బంధవిముక్తి కలిగించారు.

ముస్లింలు విడిచిపెట్టిన ఇద్దరు ఖైదీలలో ఒకతను ముస్లింగా మారి మదీనాలోనే ఉండిపోయాడు. రెండవ ఖైదీ మక్కా వెళ్ళిపోయాడు.

ఈ సంఘటనకు కారకులైన అబ్దుల్లా (రజి), ఆయన సహచరులు సమస్య పరిష్కా రమైనందుకు ఎంతో ఆనందించారు. ఆ ఆనందంతో శత్రువుతో పోరాటం జరపడానికి అనుమతించమని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తాజాగా అవతరించిన ఈ సూక్తి విన్పించారు:

"ఎవరు సత్యాన్ని విశ్వసించి, ఊరూ, వాడా వదలి వలసపోయి దైవమార్గంలో నిరంతరం పోరాటం సలుపుతారో వారు మాత్రమే దైవానుగ్రహాన్ని ఆశించగలరు. దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు." (ఖుర్ఆన్–2:218)

# 30. అబూఉబైదా బిన్ జిర్రా (రజి)

హజ్రత్ అబూఉబైదా (రజి) ఇస్లాం స్వీకరించిన ప్రప్రథమ విశ్వాసుల్లో ఒకరు. ఆయన హజ్రత్ అబూబకర్ (రజి) ఇస్లాం స్వీకరించిన మరునాడు ఇస్లాం స్వీకరించారు. మక్కాలో ఉన్నంతకాలం ఆయన బహుదైవారాధకుల చేతుల్లో అనేక కష్టాలు అనుభవించారు. మదీనా వలసపోయిన తరువాత బదర్ యుద్ధంలో పాల్గొని శత్రువులతో పోరాడటానికి ప్రయత్నించినప్పుడల్లా ఆయన తండ్రి ఎదురుగా వచ్చి నిలబడేవాడు. చివరికి ఆయన సహనం కోల్పోయి దైవప్రేమ ముందు పితృప్రేమను పక్కనబెట్టి ఒకేఒక వ్రేటుతో తండ్రిని నరకకూపంలో పడవేశారు. ఆయన్ని గురించి ఖుర్‌ఆన్‌లో ఇలా దైవసూక్తి అవతరించింది:

"దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించినవారు దేవునిపై, ఆయన ప్రవక్తపై తిరుగుబాటు చేస్తున్నవారిని ఎన్నటికీ ప్రేమించరు. చివరికి వారు తమ తండ్రులైనా, కొడుకులైనా, సోదరులైనా లేదా తమ కుటుంబసభ్యులైనా సరే, ససేమిరా ప్రేమించరు. అలా ప్రేమించడాన్ని నీవు ఎన్నటికీ చూడలేవు. దేవుడు వారి హృదయాల్లో విశ్వాసాన్ని దృఢంగా పాదుకొల్పాడు. పైగా తన దగ్గర్నుండి స్ఫూర్తి ప్రసాదించి వారికి మరింత బలంచేకూర్చాడు. ఇలా వారిని సెలయేరులు పారే స్వర్గవనాల్లో ప్రవేశింపజేస్తాడు. అక్కడే వారు కలకాలం ఉంటారు. దేవుడు వారిపట్ల ప్రసన్నుడయ్యాడు; వారు దేవునిపట్ల సంతుష్టులయ్యారు. వారసలు దేవుని పక్షానికి చెందినవారు. వినండి! దేవుని పక్షంవారే కృతార్థులవుతారు." (ఖుర్‌ఆన్-50:20-22)

ఒకసారి ఓ క్రైస్తవ ప్రతినిధివర్గం దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని "ఆస్తి విషయంలో మామధ్య ఒక వివాదం తలెత్తింది. ఈ వివాదాన్ని పరిష్కరించగల వ్యక్తి మీ అనుచరుల్లో ఎవరైనా ఉంటే మా దగ్గరకు పంపండి" అని అడిగారు.

దానికి దైవప్రవక్త (సల్లం) "మీరు పగటివేళ కలుసుకోండి. నేను మీవెంట ఓ బలమైన నిజాయితీపరుడ్ని పంపుతాను" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని మరుసటిరోజు జుహర్‌నమాజ్ కోసం చాలా పెందలాడ మస్జిద్‌కు చేరుకున్నారు. దైవప్రవక్త (స) ఈపని కోసం తననే ఎన్నకోవచ్చని, తానందుకు అర్హుణ్ణని భావించారు. అందుకే దైవప్రవక్త (స) నమాజ్ ముగించి అనుచరుల వైపు పరికించి చూస్తున్నపుడు ఉమర్ (రజి) తననుతాను ఆయన దృష్టిలో పడేందుకు మాటిమాటికి తలపైకెత్తి చూడసాగారు.

కాని దైవప్రవక్త (సల్లం) అబూఉబైదా (రజి)ను పిలిచి "నువ్వీ ప్రతినిధివర్గం వెంట వెళ్ళి వారి సమస్యను పరిష్కరించి వచ్చెయ్యి" అని ఆదేశించారు.



హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట వినగానే నిరుత్సాహంతో "ఈ భాగ్యాన్ని అబూ ఉబైదా (రజి) ఎగరేసుకుపోయాడు" అని అన్నారు.

హజ్రత్ అబూఉబైదా (రజి) దైవప్రవక్త (సల్లం)తో కలసి అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. ఉహద్‌యుద్ధంలో ఓ శత్రుఖడ్గం వ్రేటు దైవప్రవక్త (స) శిరస్త్రాణం మీద పడటంతో దాని రింగులు విరిగి ఆయన చెంపలలోకి దిగబడ్డాయి. వాటిని ఆ తర్వాత అబూఉబైదా (రజి) తన పళ్ళబలంతో లాగేశారు. అప్పుడు ఆయన రెండు పళ్ళు ఊడిపోయాయి.

దైవప్రవక్త (స) తదనంతరం ఆయన రాజకీయవారసుడి ఎన్నిక సమయం వచ్చినపుడు ఉమర్ (రజి) అబూఉబైదా (రజి)తో మాట్లాడుతూ "ప్రతిజాతికీ ఒక నిజాయితీ పరుడు ఉంటాడని, మన జాతికి మీరు నిజాయితీపరుడని దైవప్రవక్త (స) చెబుతుంటే విన్నాను. కాబట్టి చేయిజాపండి, నేను మీచేతిలో ఖిలాఫత్ ప్రమాణం చేస్తాను" అని అన్నారు.

కాని అబూఉబైదా (రజి) ఆ ప్రతిపాదనను సున్నితంగా త్రోసిపుచ్చుతూ "దైవప్రవక్త (సల్లం) అబూబకర్ (రజి)ని ముస్లింలకు ఇమామ్ (నాయకుడు)గా నియమించారు. దైవప్రవక్త (స) ఇహలోకం వీడిపోయేదాకా ఆయన మనకు నాయకత్వం వహిస్తుండేవారు. అలాంటి వ్యక్తిని వెనకేసి నేనెలా ముందుకు పోగలను?"అని అన్నారు. ఆ తర్వాత అందరూ అబూబకర్ (రజి) చేతిలో ప్రమాణం చేశారు.

హజ్రత్ అబూబకర్ (రజి) మరణానంతరం హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) రెండవ ఖలీఫా అయ్యారు. ఆయన పాలనాకాలంలో ఓసారి అబూఉబైదా (రజి) సిరియా దండయాత్రలో ముస్లింయోధు లకు నాయకత్వం వహించి అనేక పట్టణాల్లో విజయపతాకాలు ఎగరేస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్నారు. అయితే కొన్నాళ్ళకు సిరియాలో హఠాత్తుగా ప్లేగువ్యాధి వ్యాపించింది. ఈ ప్లేగుమహమ్మారి నెలల తరబడి జనాన్ని పీల్చి పిప్పిచేస్తూ వేలాది మందిని పొట్టన పెట్టుకోసాగింది.

అంచేత ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) పరిస్థితి సమీక్షించి తగిన ఏర్పాట్లుచేసే ఉద్దేశంతో కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని మదీనా నుండి బయలుదేరి సిరియాలోని 'సర్గ్' ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు స్వాగతం చెప్పడానికి సేనాపతి అబూఉబైదా (రజి), మరికొందరు సైనికాధికారులు వచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి) వారిని సంప్రదించి సలహాలు అడిగారు.

వారిలో అత్యధిక మంది ఇక్కడ్నుంచి ఇక ముందుకు సాగి ప్లేగుసోకిన ప్రాంతానికి వెళ్ళవద్దని సలహా ఇచ్చారు. వాళ్ళను మరికొందరు సమర్థిస్తూ "మీరిక్కడ ఆగడం ఏమాత్రం మంచిది కాద"ని చెప్పారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) దైవప్రవక్త (స) ప్రవచించిన ఒక హితోక్తిని గుర్తుచేస్తూ "ఏ ప్రాంతంలో అంటువ్యాధి వ్యాపిస్తే ఆ ప్రాంతానికి మీరు వెళ్ళకండి, ఒకవేళ యాదృచ్ఛికంగా అంటువ్యాధి వ్యాపించిన ప్రాంతానికి వెళ్ళడం జరిగితే అక్కడ్నుంచి మీరు పారిపోకండి" అని దైవప్రవక్త (స) తెలిపారని అన్నారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ మహితోక్తి వినగానే "మనం ఇక్కడ్నుంచి రేపే బయలుదేరాలి, సిద్ధంగా ఉండండి" అని వెంటవచ్చిన అనుచరుల్ని ఆదేశించారు.

అయితే విధివ్రాత పట్ల అతిగా విశ్వాసం కలిగివున్న అబూఉబైదా (రజి) మాత్రం ఖలీఫా తిరుగు ప్రయాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఆయన కనుబొమలు చిట్లిస్తూ "ఉమర్! విధివ్రాత (అదృష్టం) నుండి పారిపోతున్నావా?" అనడిగారు.

దానిని ఉమర్ ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "ఔను, నేను విధివ్రాత నుండి పారిపోతున్నాను. కాని ఈ పారిపోవడం కూడా విధివ్రాత వైపుకే" అని అన్నారు. ఆ తరువాత ఆయన అంటువ్యాధి నివారణ కోసం వీలైనన్ని ఏర్పాట్లు చేసుకోవలసిందిగా అధికారులకు ఆదేశాలిచ్చి మదీనాకు తిరుగుప్రయాణమయ్యారు.

సేనాపతి అబూఉబైదా (రజి) సైన్యం తీసుకొని ఒక ఎత్తయిన ప్రదేశంలో విడిదిచేశారు. ఆ తరువాత ఖలీఫా ఆజ్ఞతో ఆయన సైన్యం తీసుకొని కాస్తంత మంచి వాతావరణం ఉన్న 'జాబియా' ప్రాంతానికి వెళ్ళిపోయారు. కాని అక్కడకు వెళ్ళిన కొన్నాళ్ళకే ఆయనకు ప్లేగువ్యాధి సోకింది. అది క్రమంగా తీవ్రమవుతూ ఉండటంతో ఆయన తన స్థానంలో ముఆజ్ బిన్ జబల్ (రజి)ని సేనాపతిగా నియమించారు. తరువాత ఆయన ఇహలోకం నుంచి శాశ్వతంగా వెళ్ళిపోయారు.

మరికొన్నాళ్ళకు ముఆజ్ బిన్ జబల్ (రజి)పై కూడా ప్లేగురక్కసి విరుచుకుపడింది. ముఆజ్ (రజి)కు ముందు అది ఆయన కుమారునిపై విజృంభించి మృత్యుకుహురంలోకి నెట్టివేసింది. ఆ తరువాత ఆయన్ని కూడా మింగేసింది.

# 31. అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి)

అది మిట్టమధ్యాహ్నం వేళ. మక్కా అడవిలో అబ్దుల్లా బిన్ మస్వూద్ అనే ఓ పదిహేనేండ్ల బానిసబాలుడు మేకలు కాస్తున్నాడు. అంతలో దూరాన ఇద్దరు వ్యక్తులు తన వైపే రావడం చూశాడా అబ్బాయి. వారిద్దరు బాగా అలసిపోయినట్టుంది, కాళ్ళీడ్చుకుంటూ దగ్గరకు వచ్చి "అబ్బాయ్! మేము చాలా అలసిపోయాం. దాహంతో మా నాలుకలు పిడచకట్టుకు పోతున్నాయి. ఆకలి మమ్మల్ని దహించివేస్తోంది. ఈ మేకల్లో ఒకదాన్నుంచి పాలు తీసుకొని తాగమంటావా?" అని అడిగారు.



దానికా బాలుడు తల అడ్డంగా తిప్పుతూ "కుదరదండీ, ఈ మేకలు నావి కావు. నేను వీటి యజమాని కాను. నా యజమాని పట్ల నేను నమ్మకద్రోహానికి పాల్పడలేను" అని అన్నాడు ఏమాత్రం సంకోచించకుండా.

బాలుని నిజాయితీ పట్ల వారిద్దరు ఎంతో ఆశ్చర్యపోయారు.

ఆ తరువాత వారిద్దరిలో ఒకతను "సరే బాబూ! ఈ మేకల్లో ఇంకా పిల్లల్ని ఈనని మేక ఏదైనా ఉంటే చూపించు నాకు" అని అన్నాడు. దానికా బాలుడు ఓ చిన్న మేక వైపు సూచించాడు.

అప్పుడా వ్యక్తి ఆ మేక దగ్గరకు వెళ్ళి దేవుని పేరు స్మరించి దాని పొదుగు పట్టుకున్నాడు. కాపరికుర్రోడు మహా ఆత్రంతో మేకపొదుగు వైపు, ఆ వ్యక్తి చేతుల వైపే తదేకంగా చూడసాగాడు. ఇంకేముంది, మేకపొదుగు నుండి బొటబొటా పాలు కారడం మొదలయింది.

కాపరికుర్రోడు సంభ్రమాశ్చర్యాలతో ఆ దృశ్యం చూడసాగాడు. వెంటనే రెండో వ్యక్తి పాత్రలాంటి ఓ రాయి తెచ్చి మేకపొదుగు కింద పెట్టి పట్టుకున్నాడు. కాస్సేపటికే అది పాలతో నిండిపోయింది. ఆ పాలను ఆ ఇద్దరు మిత్రులు కడుపునిండా తాగారు. తర్వాత కాపరికుర్రోడికి ఇస్తే అతను కూడా తాగాడు. ఆ తర్వాత మొదటి వ్యక్తి మేక పొదుగు తడుముతూ ఏదో పఠించగానే పాలు కారడం ఆగిపోయింది.

ఆరోజు నుండి మేకలకాపరి అబ్దుల్లా బిన్ మస్వూద్ ఆ విచిత్రవ్యక్తి పట్ల ఎంతో ప్రభావితుడై నిరంతరం అతడ్ని గురించే ఆలోచించసాగాడు.

ఆ విచిత్ర వ్యక్తి మరెవరో కాదు, మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం). రెండోవ్యక్తి ఆయన ప్రియఅనుచరుడు హజ్రత్ అబూబకర్ (రజి).

ఈ సంఘటన తర్వాత కొన్నాళ్ళకే అబ్దుల్లా బిన్ మస్వూద్ ఇస్లాం స్వీకరించి తననుతాను దైవప్రవక్త (సల్లం) సేవ కోసం అంకితం చేసుకున్నారు. ఆరోజు నుండి ఆయన దైవప్రవక్త (సల్లం)ను నీడలా అంటిపెట్టుకొని ఉంటూ సేవ చేస్తుండేవారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) దైవప్రవక్త (స) శిక్షణలో అత్యున్నత సద్గుణసంపన్నుడు కావడమే గాక, ఖుర్ఆన్ విద్యలో ప్రవక్తఅనుచరులందరిలో కెల్లా గొప్ప ప్రావీణ్యం సంపాదించగలిగారు. ఖుర్ఆన్ పారాయణంలో, దాని అవగాహనలో, షరీఅత్ విశ్లేషణలో ఆనాడు ఆయనకు మించినవారే లేరు.

దైవప్రవక్త (స) ఓసారి అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లను వెంటబెట్టుకొని ఎక్కడికో బయలుదేరారు. కొంత దూరం నడవగానే మస్జిద్‌లో ఒకతను నమాజ్ చేస్తూ

కన్పించాడు. దైవప్రవక్త (స) కాస్సేపు ఆగి అతని ఖుర్ఆన్ పారాయణం విన్నారు. తరువాత అనుచరుల వైపు తిరిగి "ఖుర్ఆన్ అవతరించిన విధంగా దాన్ని పారాయణం చేయదలచుకున్నవారు ఇబ్నెఉమ్మెఅబ్ద్ (అబ్దుల్లా బిన్ మస్ఊద్) పారాయణం చేస్తున్న రీతిలో పారాయణం చేయాలి" అని అన్నారు.

ఆ తరువాత అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) దుఆ చేయడం ప్రారంభించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఏం కావాలో అర్థించు, అది నీకివ్వబడుతుంది. ఏం కావాలో అర్థించు, అది నీకివ్వబడుతుంది" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాటలు విని "నేను రేపు ఉదయాన్నే ఇబ్నెమస్ఊద్ ఇంటికి వెళ్ళి ఆయన చేసిన ప్రార్థనకు దైవప్రవక్త (స) స్పందిస్తూ తథాస్తు అన్నారన్న శుభవార్త ఆయనకు చెబుతాను" అని మనసులో అనుకున్నారు.

మరునాడు ఉదయాన్నే ఇబ్నెమస్ఊద్ (రజి) ఇంటికి చేరుకొని చూస్తే తనకు ముందే అబూబకర్ (రజి) వచ్చి ఈ శుభవార్త తెలియజేశారు. దాంతో ఉమర్ (రజి) కాస్తంత నిరుత్సాహపడి "నేను ఏదైనా మంచి విషయంలో అబూబకర్‌ని మించిపోవాలని ప్రయత్నించినప్పుడల్లా అబూబకరే నన్ను మించిపోయేవారు" అని అనుకున్నారు తనలోతాను.

ఓసారి హజ్రత్ ఉమర్ (రజి) ఒక ప్రయాణబృందంతో కలసి ప్రయాణిస్తూ రాత్రివేళ విశ్రాంతి కోసం ఒకచోట విడిదిచేశారు. అక్కడే మరో ప్రయాణబృందం కూడా విడిది చేసింది. ఆ ప్రయాణీకుల్లో ఇబ్నెమస్ఊద్ (రజి) కూడా ఉన్నారు. ఆ చీకటిరాత్రిలో ఉమర్ (రజి) ఇబ్నెమస్ఊద్ (రజి)ని గుర్తుపట్టలేక వారు ఎక్కడ్నుంచి వస్తున్నారు, ఎక్కడికి వెళ్ళాలని అడుగు అని తన బృందంలోని ఒక వ్యక్తిని పురమాయించారు.

దానికి అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) "మేము ఫజ్అమీఖ్ నుండి వస్తున్నాం, బైతెఅతీఖ్‌కు వెళ్తున్నాం" అని చెప్పారు.

ఉమర్ (రజి) ఈమాట విని "మీ బృందంలో ధర్మజ్ఞాని ఎవరైనా ఉన్నారా? ఉంటే ఖుర్ఆన్‌లో అన్నిటికంటే మహోన్నతమైన భాగం ఏమిటని అడుగు" అని అన్నారు.

దానికి ఇబ్నెమస్ఊద్ (రజి) ఇలా చెప్పారు: "(అసలైన ఆరాధ్యుడు) అల్లాహ్‌యే. ఆయన తప్ప మరోదేవుడు లేడు. ఆయన నిత్యజీవుడు; ఎన్నటికీ నిద్రించనివాడు; కునుకు పాట్లు కూడా పడనివాడు. భూమ్యాకాశాల్లో వున్న సమస్తం ఆయనదే. ఎవరి విషయంలో నైనా సరే, ఆయన అనుమతి లేకుండా ఆయన సన్నిధిలో ఎవరు సిఫారసు చేయగల్గుతారు? వారి ముందున్నదేమిటో, వారికి గోచరించకుండా ఉన్నదేమిటో అంతా ఆయనకు తెలుసు. ఆయన తలచుకుంటే తప్ప ఆయన జ్ఞానసంపదలోని ఏ విషయమూ ఎవరికీ తెలియదు.



ఆయన రాజ్యాధికారం భూమ్యాకాశాలను పరివేష్టించి ఉంది. వాటి రక్షణ ఆయనకు ఏమాత్రం కష్టమైన పనికాదు. ఆయన సర్వాధికారి, సర్వోన్నతుడు. (2:255)

"ఖుర్ఆన్‌లో ఏ భాగం అన్నిటికంటే స్పష్టమైనది?" అడిగారు ఉమర్ (రజి).

"దేవుడు మిమ్మల్ని న్యాయంగా వ్యవహరించాలని, మేలు చేయాలని, బంధువుల పట్ల దయతో మెలగాలని ఆదేశిస్తున్నాడు." (16:90) అన్నారు ఇబ్నెమసూద్.

ఖుర్ఆన్‌లో ఏ భాగం అన్నిటికంటే సమగ్రమైనది?" అడిగారు ఉమర్ (రజి).

"ఆతర్వాత ఎవరైనా అణు మాత్రం సత్కార్యం చేసివున్నా అతను దాన్ని (కళ్ళారా) చూసుకుంటాడు. అలాగే ఎవరైనా అణుమాత్రం దుష్కార్యం చేసివున్నా అతనూ దాన్ని (కళ్ళారా)చూసుకుంటాడు." (99:6,7) అన్నారు ఇబ్నెమసూద్.

"ఖుర్ఆన్‌లో ఏభాగం అన్నిటికంటే భయంకరమైనది?" అడిగారు ఉమర్ (రజి).

"ఫలితం మీ కోరికలపైగాని, గ్రంథప్రజల కోరికలపైగాని ఆధారపడి ఉండదు. ఎవరైనా సరే చెడ్డ పని చేస్తే అతను దాని పర్యవసానం అనుభవిస్తాడు. ఇక దైవాభీష్టానికి వ్యతిరేకంగా అతనికి ఎలాంటి సహాయం, సమర్థింపులు లభించవు. స్త్రీలైనా పురుషులైనా విశ్వసించినవారై ఉండి సత్కార్యాలు చేస్తే తప్పకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి ఏమాత్రం అన్యాయం జరగదు." (4:123,124) అన్నారు ఇబ్నెమసూద్.

"ఖుర్ఆన్‌లో ఏభాగం మనిషిలో ఆశను రేకెత్తిస్తుంది?" అడిగారు ఉమర్ (రజి).

"ప్రవక్తా! (వారికి ఇలా చెప్పు: 'ఆత్మవంచనకు పాల్పడిన నా దాసులారా! దేవుని కారుణ్యం పట్ల నిరాశచెందకండి. దేవుడు తప్పకుండా మీ పాపాలన్నిటినీ క్షమిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమితదయామయుడు."(39:52,53) అన్నారు ఇబ్నెమసూద్.

"మీలో అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఉన్నారా అని వారిని అడుగు" అన్నారు ఉమర్ (రజి). దానికి ఆ ప్రయాణీకులు ఉన్నారని చెప్పారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనాకాలం వరకు జీవించారు. ఆ తర్వాత వ్యాధిగ్రస్తులై చనిపోయారు.

# 32. సాబిత్ బిన్ ఖైస్ (రజి)

ప్రవక్తప్రత్యక్ష అనుచరుల్లో ఒకరైన హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) కంఠస్వరం దైవప్రవక్త (స) కంఠస్వరం కంటే కొంచెం పెద్దది. ఖుర్ఆన్‌లో "విశ్వాసులారా! దేవుని సమక్షంలో, ఆయన ప్రవక్త సమక్షంలో మీరు మితిమీరిపోకండి. దేవునికి భయపడండి. దేవుడు సమస్తం వింటున్నాడు; సర్వం ఎరిగినవాడు. మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడుకున్నట్లు దైవప్రవక్త ముందు బిగ్గరగా మాట్లాడకండి. (దీనివల్ల) మీరు చేసుకున్న

సత్కర్మలు మీ ఆలోచనకు సైతం తట్టని విధంగా నిష్ఫలం కావచ్చు." (49:1,2) అనే సూక్తులు అవతరించాయి. హజ్రత్ సాబిత్ ఈ సూక్తులు విని భయపడ్డారు.

ఆరోజునుండి ఆయన తనకర్మలు నిష్ఫలమయ్యాయని, తనకు నరకం తప్పదని భావిస్తూ దైవప్రవక్త (సల్లం)ను కలుసుకోకుండా ముఖం చాటవేయసాగారు. కొన్నాళ్ళ తర్వాత దైవప్రవక్త (సల్లం) విషయం తెలుసుకొని "నీవు నరకవాసుల్లో కాదు, స్వర్గవాసుల్లో చేరుతావు" అనే శుభవార్త అందజేశారు ఆయనకు.

హజ్రత్ సాబిత్ (రజి) అప్పటి నుంచి దైవప్రవక్త (సల్లం) వెంట, ఆ తరువాత కూడా అనేక యుద్ధాల్లో ద్విగుణీకృత ఉత్సాహంతో పాల్గొంటూ అమరగతిభాగ్యం కోసం ఎదురుచూడసాగారు.

శ్రేయస్కర ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) పాలనా కాలంలో అసత్యప్రవక్త ముసైలిమా, అతని అనుచరులతో యుద్ధం జరిగింది ఆ యుద్ధంలో శత్రువుల ముందు ముస్లింలు ఢీలా పడినప్పుడు సాబిత్ బిన్ ఖైస్ (రజి) తలకు కఫన్‌వస్త్రం చుట్టి తన కంచుకంఠంతో వారిలో పౌరుషాన్ని, సమరోత్సాహాన్ని రేకెత్తిస్తూ హృదయాల్ని ఉల్లాసపరిచే ఉపన్యాసం ఇచ్చారు. దాంతో ముస్లింలు శత్రువులపై నూతనుత్తేజంతో విజృంభించి విజయఢంకా మోగించారు.

కాని ఈ పోరాటంలో అమరగతులైనవారిలో సాబిత్ బిన్ ఖైస్ (రజి) కూడా చేరి పోయారు. ఎన్నో సంవత్సరాల నుంచి అమరగతి భాగ్యం కోసం తపిస్తున్న సాబిత్ (రజి)కు ఈ యుద్ధంలో తన కోరికను నెరవేర్చుకునే అవకాశం లభించింది.

యుద్ధమైదానంలో ఆయన భౌతికకాయం ఓచోట నిస్తేజంగా పడివుండటం గమనించిన ఒక ముస్లిం సైనికుడు దగ్గరగా వచ్చి చూశాడు. హజ్రత్ సాద్ (రజి) శరీరంపై ఎంతో విలువైన కవచం ఉంది. దాన్ని ఆ సైనికుడు ఊడదీసి తీసుకొని మెల్లిగా అక్కడ్నుంచి జారుకున్నాడు.

మరుసటిరోజు రాత్రి మరొక ముస్లింకు కలలో హజ్రత్ సాద్ (రజి) కన్పించి "నేను సాబిత్ బిన్ ఖైస్‌ని, నన్ను గుర్తుపట్టావా?" అని అడిగారు. ఆ వ్యక్తి గుర్తుపట్టాను అన్నాడు. అప్పుడు హజ్రత్ సాద్ (రజి) ఇలా అన్నారు:

"నేను నీకు ఓ ముఖ్యమైన విషయం ఉపదేశిస్తున్నాను. జాగ్రత్త! ఇది కలలో జరిగిన సంఘటన అని నిర్లక్ష్యం చేయకు. నిన్న నేను హతమార్చబడినపుడు ఒక ముస్లిం యోధుడు నాశవం పక్కగా పోతూ నేను ధరించిన కవచం నా శరీరం నుండి ఊడదీసి తీసికెళ్ళాడు. అతను ఈవిధంగా ఉంటాడు... యద్ధస్థావరానికి ఫలానా దిశలో ఉండే శిబిరంలో ఉంటాడు. కనుక నీవు వెంటనే మన సేనాపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దగ్గరకు వెళ్ళి ఆ కవచం తెప్పించమని చెప్పు...



"మరొక విషయం కూడా నీకు ఉపదేశిస్తున్నాను విను. జాగ్రత్త! ఇది కలలో జరిగిన సంఘటన అని నిర్లక్ష్యం చేయకు. నీవు మదీనా చేరుకున్న తరువాత మన ఖలీఫాను కలుసుకొని సాబిత్ బిన్ ఖైస్ మీద ఇంత రుణభారం ఉందని, దాన్ని ఆయన బానిసలు నెరవేరుస్తారని, తరువాత వారిని బానిసత్వం నుంచి విముక్తి కలిగించాలని ఆయనకు చెప్పు."

మరునాడు ఉదయం ఆ ముస్లింయోధుడు సేనాపతి హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దగ్గరకు వెళ్ళి స్వప్నం సంగతి తెలియజేశాడు. సేనాపతి ఖాలిద్ (రజి) వెంటనే ఒక సైనికుడ్ని పంపి ఆ కవచం తెప్పించారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు సైన్యం మదీనా చేరుకున్న తరువాత ఆయన హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) కలలో కన్పించి చెప్పిన వీలునామా సంగతి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి)కు తెలియజేశారు. ఖలీఫా అబూబకర్ (రజి) ఆ వీలునామాను అమలుపరచారు.

# 33. సల్మాన్ ఫార్సీ (రజి)

ఈరాన్‌జాతీయుడైన సల్మాన్ ఫార్సీ (రజి) ఓ గొప్ప జమీందారీ కుటుంబంలో జన్మించారు. సల్మాన్‌ని ఆయన తండ్రి అల్లారుముద్దుగా పెంచి మజూసీ మతవిద్య నేర్పాడు. ఒకసారి సల్మాన్ ఫార్సీ (రజి) తన తండ్రి ఆదేశం మేరకు సుదూరప్రాంతంలో ఉన్న తమ సేద్యభూముల పర్యవేక్షణ కోసం ఇంటి నుంచి బయలుదేరారు. దారిలో ఒకచోట ఓ చర్చీ సమీపంగా పోతుంటే అందులో క్రైస్తవ భక్తులు ప్రార్థన చేస్తుండటం కన్పించింది. లోపలికి ప్రవేశించి చూస్తే ఆయనకు వారి ఆరాధనా విధానం, ప్రార్థనా పలుకులు బాగా నచ్చాయి. దాంతో ఆయన ఆరోజు సాయంత్రం దాకా చర్చీలోనే గడిపి తర్వాత ఇంటికి తిరిగొచ్చారు.

ఇంటికి రాగానే తండ్రి పొలం పనుల్ని గురించి అడిగితే ఆయన జరిగిన సంగతి చెప్పి "నాన్నా! మన ఆరాధనా పద్ధతి కన్నా వారి ఆరాధనా పద్ధతి ఎంతో బాగుంది. అందుకే నేను సాయంత్రందాక అక్కడే ఉండి పొలం దగ్గరకు పోలేదు" అని అన్నారు.

తండ్రి ఈమాటలు విని "బాబూ! వారి మతం కంటే మన మతమే ఎంతో శ్రేష్ఠమైనది" అన్నాడు.

దానికి సల్మాన్ (రజి) తీవ్రంగా స్పందిస్తూ "లేదు. వారి మతమే మన మతం కంటే ఎంతో శ్రేష్ఠమైనది, ఉన్నతమైనది" అని అన్నారు.

తండ్రి ఈమాట వినగానే కర్రెళ్ళజేస్తూ సల్మాన్‌ని ఇంట్లో నిర్బంధించి కాళ్ళకు బేడీలు వేశాడు.

ఆ తర్వాత సల్మాన్‌ఫార్సీ (రజి) ఓరోజు అవకాశం చూసి బేడీలు విప్పుకొని ఇంటి నుంచి బయటపడి ఒక ప్రయాణబృందంతో కలసి సిరియాకు పారిపోయారు. సిరియాలో కొందరు క్రైస్తవుల్ని కలుసుకొని "క్రైస్తవుల్లో ఇప్పుడు అందరికంటే మంచివాడు ఎవర"ని అడిగారు. దానికి వారు అక్కడి చర్చీధర్మకర్త అని చెప్పారు.

అప్పుడు సల్మాన్ ఫార్సి (రజి) ఆ ధర్మకర్త (పాదరీ) దగ్గరకు వెళ్ళి "నన్ను క్రైస్తవ మతం ఆకట్టుకుంది. అంచేత నేను మీ సేవచేస్తూ మీనుండి మతవిద్య నేర్చుకోవాలను కుంటున్నాను. దయచేసి నన్ను మీ శిష్యుల్లో చేర్చుకొని నాకు మీ సేవచేసే భాగ్యం ప్రసాదించండి" అని అన్నారు.

దానికి ఆ మతగురువు సంతోషంగా అంగీకరించాడు. ఆరోజు నుండి సల్మాన్(రజి) ఆ పాదరీ శిష్యుడైపోయి అతనికి సేవ చేయసాగారు. అయితే కొన్నాళ్ళ తరువాత ఆ మతగురువు ప్రవర్తన చూసి అసహ్యించుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్ళకే ఆ పాదరి చనిపోయాడు. అతడ్ని ఖననం చేయడానికి వందలాదిమంది క్రైస్తవులు వచ్చారు.

అప్పుడు సల్మాన్ (రజి) వారితో మాట్లాడుతూ ఇలా అన్నారు: "మీరు అనుకున్నట్లు ఈయనగారు మంచివాడేమీ కాదు, పరమ చెడ్డవాడు. మిమ్మల్ని దానధర్మాలు చేయమని హితోపదేశం చేస్తాడు. కాని దైవమార్గంలో మీరిచ్చే ధనమంతటినీ ఈయన తన సొంతానికి వాడుకునే ఉద్దేశంతో కూడబెట్టుకుంటున్నాడు. అందులో చిల్లిగవ్వ కూడా పేదలకు పంచడు."

ఖననం చేయడానికి వచ్చినవారు "ఈ విషయాలన్నీ నీకెలా తెలుస"ని అడిగారు.

దానికి హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) "ఇతను దాచుకున్న సిరిసంపదల్ని చూపిస్తాను రండి" అంటూ వారిని ఓ రహస్యస్థలం దగ్గరకు తీసికెళ్ళాడు. అక్కడ తవ్వి చూస్తే వెండి బంగారాలతో నిండిన ఏడు కుండలు బయటపడ్డాయి.

వాటిని చూడగానే వారు నోరెళ్లబెట్టి "ఇతని శవాన్ని మనం సమాధి చేయకూడదు" అని నిర్ణయించారు. ఆ తర్వాత వారు ఆ శవాన్ని సిలువపై ఎక్కించి దానిపై రాళ్ళు విసరి అవమానపరిచారు.

ఆ తరువాత ఆ క్రైస్తవులు ఆ పాదరీ స్థానంలో మరొక పాదరీని చర్చీ ధర్మకర్తగా నియ మించారు. హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) ఆరోజు నుండి అతనికి సేవచేస్తూ గడపసాగాడు. ఈ పాదరీ చాలామంచివాడు, పరలోకభీతి కలవాడు. కాని కొన్నాళ్ళకు అతను కూడా చనిపోయాడు. అంచేత సల్మాన్ ఫార్సీ (రజి) అతని సలహా ప్రకారం మోసిల్‌లో ఉండే మరొక పాదరీ దగ్గరకు వెళ్ళి అతనికి శిష్యుడై పోయారు. కొన్నాళ్ళకు అతను కూడా చనిపోయాడు.



అంచేత సల్మాన్ (రజి) అతని సలహా ప్రకారం నసయ్యిబీన్‌లో ఉండే ఒక పాదరీ దగ్గరకు వెళ్ళి అతని సేవలో గడపసాగాడు. కాని కొన్నాళ్ళకు అతను కూడా పరలోక ప్రయాణం కట్టాడు. అంచేత సల్మాన్ ఫార్సి (రజి) అతని సూచన మేరకు అమ్మూరియాలో ఉండే ఒక పాదరీ దగ్గరకు వెళ్ళి అతనికి శిష్యుడైపోయారు.

ఆ కాలంలో ఆయన కొన్ని ఆవులు, మేకలు పెంచుకున్నారు. అయితే విధివశాత్తు కొన్నాళ్ళకు ఆ పాదరీ కూడా ఇహలోకం వీడిపోయాడు. దానికిముందు హజ్రత్ సల్మాన్ (రజి) ఆ పాదరీని కలుసుకొని "ఫాదర్! నా సత్యాన్వేషణ కృషి గురించి మీకు బాగా తెలుసు. ఇప్పుడు మీ తర్వాత నేను ఎవరి దగ్గరకు వెళ్ళి శిష్యరికం చేయాలో చెప్పండి" అని అడిగారు.

"కుమారా! నాకు తెలిసినంతవరకు ఇప్పుడు యావత్తు ప్రపంచంలో మేమున్న నిజధర్మంలో ఎవరూ స్థిరంగా లేరు. అయితే అరేబియాలో ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) అనుసరించిన నిజధర్మం తీసుకొని ఒక దైవప్రవక్త ప్రభవించే సమయం ఆసన్నమైంది. కొంతకాలానికి ఆయన తన స్వస్థలం నుండి ఖర్జూరతోటలు ఉండే ప్రాంతానికి వలస పోతాడు. ఆయన్ని గుర్తించడానికి కొన్ని సూచనలున్నాయి. ఆయన పారితోషికాన్ని మాత్రమే స్వీకరిస్తాడు, దానాన్ని స్వీకరించడు. ఆయన వీపుపై రెండు భుజాల మధ్య ముహ్రెనబువ్వత్ (దైవదౌత్యముద్ర) ఉంటుంది. కనుక నీవు వీలైతే ఆ ప్రాంతానికి వెళ్ళిపో" అని చెప్పాడా పాదరీ.

హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) ఆ పాదరీ చనిపోయిన కొన్నాళ్ళదాకా అమ్మూరియా లోనే ఉండిపోయారు. ఒకరోజు కొందరు అరబ్బులు అమ్మూరియా సమీపంగా వెళ్తుంటే ఆయన వారిని కలుసుకొని "మీరు నన్ను మీవెంట అరేబియా తీసికెళ్తే నేను నా ఆవులు, మేకలన్నిటినీ మీకు ఇచ్చేస్తాను" అని అన్నారు.

దానికా బాటసారులు అంగీకరించడంతో సల్మాన్ ఫార్సీ (రజి) వారి వెంట బయలుదేరారు. కాని ఖురాలోయ దాకా చేరుకోగానే ఆ దుర్మార్గులు సల్మాన్ (రజి)ని బానిసగా చేసి ఒక యూదుడికి అమ్మివేశారు.

సత్యాన్వేషణలో అనేక ఊళ్ళు, వ్యక్తులు గాలిస్తున్న సల్మాన్ ఫార్సీ (రజి) చివరికిలా బానిసగా మారి బ్రతుకుబండి లాగవలసి వచ్చింది. కొన్నాళ్ళకు బనూఖురైజా తెగకు చెందిన ఒక యూదుడు వచ్చి ఆయన్ని కొని మదీనా తీసికెళ్ళాడు. అక్కడి ఖర్జూరతోటలు చూసి సల్మాన్ (రజి) తన గురువు తెలిపిన ఒక సూచన ప్రకారం ఆ ప్రాంతం మదీనా అని తెలుసుకొని పరమానంద భరితులయ్యారు.

ఆ తరువాత కొంతకాలానికి దైవప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు బయలుదేరి ఖుబా గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఖుబావాసులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు.

ఆరోజు సల్మాన్ (రజి) కొన్ని ఖర్జూరపండ్లు మూట కట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి "మీరెంతోఉత్తములని నాకు తెలుసు. మీరు మీఊరు వదలి ఉత్త చేతులతో వచ్చారు. అంచేత నేను మీకు, మీ అనుచరులకు దానం చేయడానికి కొన్ని ఖర్జూరపండ్లు తెచ్చాను, స్వీకరించండి" అని అన్నారు.

దైవప్రవక్త (స) వాటిని తీసుకొని "తినండి వీటిని" అంటూ తన అనుచరులకు ఇచ్చేశారు. వారంతా ఆ ఖర్జూరపండ్లు తిన్నారు. కాని దైవప్రవక్త (స) ఒక్కటీ తినలేదు.

సల్మాన్ (రజి) అది చూసి "ఇది మొదటి సూచన" అనుకున్నారు మనసులో. ఆ తర్వాత ఆయన అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. ఈలోగా దైవప్రవక్త (స) ఖుబా నుండి మదీనా చేరుకున్నారు. అప్పుడు సల్మాన్ (రజి) ఖర్జూరపండ్లు తీసుకొని ఆయన సన్నిధికి వెళ్ళి "ఆరోజు మీరు నేను దానంగా ఇచ్చిన ఖర్జూరాలు తినలేదు. అందువల్ల నేనీ రోజు ఈ పండ్లు పారితోషికంగా మీకు సమర్పించుకుంటున్నాను" అని అన్నారు.

అప్పుడు దైవప్రవక్త (స) ఆ పండ్లు స్వీకరించి తన అనుచరులకు ఇవ్వడమేగాక తాను కూడా తిన్నారు. అది చూసి సల్మాన్ (రజి) "ఇది రెండవ సూచన" అనుకున్నారు మనసులో.

ఆయన మూడవసారి వెళ్ళినపుడు దైవప్రవక్త (స) అనుచరుల మధ్య మాట్లాడుతూ కూర్చున్నారు. సల్మాన్ (రజి) ఆయనకు దగ్గరగా వెళ్ళి సలాం చేసి ఆయన వీపు వెనక్కి పోయి నిల్చున్నారు దైవదౌత్యముద్రను చూసే ఉద్దేశంతో.

ఆ సమయంలో దైవప్రవక్త (స) వీపు మీదుగా ఒక అంగవస్త్రం కప్పుకొని ఉన్నారు. ఆయన సల్మాన్ (రజి) ఉద్దేశ్యం గ్రహించి అంగవస్త్రాన్ని వదులు చేసి వీపు క్రిందికి జారవిడిచారు. సల్మాన్ (రజి) వెంటనే దైవప్రవక్త (సల్లం) భుజాల మధ్య ఉన్న దైవదౌత్యముద్రను తనివితీరా చూసుకొని మురిసిపోతూ అప్రయత్నంగా వంగి దాన్ని ముద్దుపెట్టుకున్నారు.

దైవప్రవక్త (స) అది గమనించి "ఏమిటీ విషయం?" అని అడిగారు. అప్పుడు సల్మాన్‌ఫార్సీ (రజి) సత్యాన్వేషణలో తాను తిరిగిన ప్రదేశాలు, శిష్యరికం చేసిన గురువులు మొదలైన విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పారు. దైవప్రవక్త (స), ఆయన అనుచరులు సల్మాన్ (రజి) సత్యాన్వేషణ గాథ విని ఎంతో సంతోషం వ్యక్తపరిచారు.

ఇప్పుడు సల్మాన్‌ఫార్సీ (రజి) ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (స) ప్రియసహచరుడై పోయారు. ఆయనతో కలసి బదర్, ఉహద్, కందకం యుద్ధాల్లో పాల్గొన్నారు.

హిజ్రీశకం 5వ సంవత్సరంలో అరబ్ తెగలన్నీ ఏకమై మదీనాపై విరుచుకుపడ నున్నాయని దైవప్రవక్త (సల్లం)కు సమాచారం అందింది. ఆయన తన ముఖ్యానుచరు



లందర్నీ సమావేశపరిచారు. పరిస్థితిని వివరించి కర్తవ్యం గురించి సంప్రదించారు. అనుచరులంతా ముక్తకంఠంతో "ఈసారి బయటకి పోకుండా మదీనాలోనే ఉండి శత్రువుల్ని ఎదుర్కొందాం" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) అంగీకరించారు.

హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) ఈరాన్‌దేశ యుద్ధతంత్రాలను గురించి బాగా ఎరిగిన వ్యక్తి, అనుభవశాలి కూడా. కందకం యుద్ధ సమయంలో ఆయన ఇలా సలహా ఇచ్చారు :

"మనం ఎలాంటి భద్రతలేని బహిరంగ మైదానంలో దిగి యుద్ధం చేయడం మంచిది కాదు. ఏదైనా కీలక ప్రదేశంలో సైన్యాలను సమీకరించి చుట్టూ కందకం తవ్వితే బాగుంటుంది."

ఈ అభిప్రాయం దైవప్రవక్త (స)కు నచ్చింది. "నిజమే. ఇలా చేస్తేనే బాగుంటుంది. లేవండి, సాధ్యమైనంత త్వరగా ఈపని ప్రారంభించాలి" అన్నారాయన.

తక్షణమే ముస్లిం ముజాహిద్‌లు రంగంలోకి దిగారు. పారలు, పలుగులు సేకరించారు. బనీఖురైజాతెగ యూదులు ముస్లింలతో ఇదివరకే స్నేహఒప్పందం చేసుకొనిఉన్నారు. అంచేత కందకం త్రవ్వకానికి కావలసిన పనిముట్లు చాలావరకు వారి నుంచే లభించాయి.

మదీనా పట్టణానికి మూడు వైపుల చిన్న చిన్న కొండలు, ఖర్జూరపు తోటలతో నిండిపోయి సందులేకుండా ఉన్నందున పట్టణం సురక్షితంగా ఉంది. ఒకేఒక వైపు మాత్రం ఖాళీగా ఉంది. దైవప్రవక్త (సల్లం) కొంతమంది అనుచరులను వెంటబెట్టుకొని పట్టణం వెలుపలికి పోయి చుట్టూ పరిశీలించారు. ఖాళీగా ఉన్న వైపు అగడ్త త్రవ్వడం అవసరమని భావించారు. తక్షణమే అగడ్తకు సంబంధించిన పథకాన్ని ఆయనే రూపొందిం చారు. ఆ తరువాత ఆ ప్రదేశాన్ని పదేసి మందికి పది పది గజాల చొప్పున విభజించి ఇచ్చారు. వెంటనే త్రవ్వకం పని మొదలైంది.

ఇలా అనుచరులు కందకం త్రవ్వుతుంటే అందులో ఓ పెద్ద బండరాయి అడ్డొచ్చింది. హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి), ఆయన జట్టు సభ్యులు పలుగులతో దాన్ని కొట్టికొట్టి విసిగిపోయారు. ఎంతకొట్టినా ఆ రాయి కాస్త కూడా పగల్లేదు. చుట్టుపక్కల కందకం త్రవ్వుతున్న ఇతర సహచరులు కూడా వచ్చి తమ బలాలను ప్రదర్శించారు. కాని ఆ రాయి మాత్రం చెక్కు చెదరలేదు.

ఈ విశేషం చూసి ప్రవక్త అనుచరులు ఎంతో ఆశ్చర్యపోతూ విషయం దైవప్రవక్త (సల్లం) దృష్టికి తీసికెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తాను చేస్తున్న పని వదిలేసి బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) వచ్చిన తరువాత కొందరు మాట్లాడుతూ "ఈ రాయిని పగల గొట్టడం సాధ్యమయ్యే పనిలా కన్పించడం లేదు. అంచేత ఈ చోటు వదలి పక్కకు జరిపి త్రవ్వుకోవడం మంచిది" అని సలహా ఇచ్చారు.

దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ పలుగు తీసుకున్నారు. అగడ్తలోకి దిగి 'బిస్మిల్లా' అంటూ బలంగా ఒకేఒక దెబ్బ వేశారు. ఆ దెబ్బకు రాయి మీద సన్నని పగులు ఏర్పడి, అందులో నుంచి తళుక్కున ఓ కాంతిపుంజం వెలువడింది. వెంటనే దైవప్రవక్త (స) 'అల్లాహుఅక్బర్' అన్నారు. అప్రయత్నంగా అనుచరుల నోట కూడా అల్లాహు అక్బర్ అనే పలుకులు వెలువడి ఆ ప్రదేశమంతా మార్మోగింది.

దైవప్రవక్త (స) రాతిపై గట్టిగా మరో దెబ్బ వేశారు. దాంతో ఆ రాయి మరికాస్త పగిలి అందులో నుంచి మళ్ళీ వెలుగు జిగేలుమంటూ విరజిమ్మింది. దైవప్రవక్త (స) రాయిమీద ఇంకో దెబ్బ వేశారు. దాంతో ఆ బండరాయి ముక్కలుముక్కలుగా పగిలి దేదీప్యమానమైన వెలుగు విరజిమ్మింది. క్షణంపాటు పరిసరాలన్నీ ప్రకాశవంత మయ్యాయి. దైవప్రవక్త (స) 'అల్లాహుఅక్బర్' అన్నారు. అనుచరులు కూడా అదేవిధంగా 'అల్లాహుఅక్బర్' అంటూ నినదించారు.

దైవప్రవక్త (సల్లం) కందకం నుండి పెకొచ్చిన తర్వాత ఒడ్డు మీద నిల్చున్న అనుచరులు తొంగితొంగి చూడసాగారు. అంతటి బలమైన ఆ చట్టును దైవప్రవక్త (స) మూడేమూడు దెబ్బలకు నుజ్జునుజ్జు చేయడం పట్ల వారు ఆశ్చర్యపోయారు.

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? ఇది దైవదౌత్య మహిమ" అన్నారు ఒకరు. "ఔను. నిస్సందేహంగా ఇది దైవమహిమే. ఇంతటి శక్తిమంతమైన రాయి పగలడం మానవశక్తికి అతీతమైన పని" అన్నారు మరొకరు.

"దైవప్రవక్తా! మీరా బండరాయి మీద పలుగుతో కొట్టినప్పుడు అందులో నుంచి వెలుగు కిరణాలు ప్రసరించాయేమిటీ?" అని అడిగారు కొందరు అనుచరులు.

"నువ్వు కూడా చూశావా?" దగ్గరే నిలబడివున్న సల్మాన్ ఫార్సి (రజి)ని అడిగారు దైవప్రవక్త (సల్లం). "చూశాను దైవప్రవక్తా! నాతో పాటున్న ఇతర సహచరులు కూడా ఆ వెలుగుని చూశారు" అన్నారు సల్మాన్ ఫార్సి (రజి).

"నేను మొట్టమొదట పలుగుతో ఆ రాయి మీద కొట్టినప్పుడు జిబ్రీల్ దూత ప్రత్యక్షమై నాకు యమన్ దేశపు తాళపుచెవులు ఇచ్చారు. రెండవసారి కొట్టినప్పుడు సిరియా దేశపు తాళపుచెవులు అప్పగించారు. మూడవసారి కొట్టినప్పుడు ఈరాన్ దేశపు తాళపుచెవులు ఇచ్చి 'ఈ మూడు దేశాలు మీ అనుచర సముదాయం అధీనంలోకి వస్తాయి' అన్నారు జిబ్రీల్ దూత" వివరించారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.



# 34. సుహైబ్ రోమి (రజి)

ఈరాన్‌చక్రవర్తి వైపున ఉబల్లా రాష్ట్రగవర్నర్ సనాన్ బిన్ మాలిక్ తన సంతానంలో సుహైబ్ అనే అయిదేళ్ళ పిల్లవాడ్ని ఎంతో ప్రేమించేవాడు. ఓసారి అతని భార్య ఆ పిల్లవాడ్ని తీసుకొని సేవకులతో కలసి వ్యాహ్యావళిగా ఇరాఖ్‌లోని సనీ అనే పట్టణానికి వెళ్ళింది. కాని అక్కడ రోమన్‌సైనికులు అకస్మాత్తుగా ఆ పట్నంపై దాడిచేసి చేతికి దొరికిన వస్తుసంపదను దోచుకొని అనేకమందిని ఖైదీలుగా పట్టుకు వెళ్ళారు. ఆ ఖైదీలలో అయిదేళ్ళ సుహైబ్, అతని తల్లి కూడా ఉన్నారు. అప్పటి నుంచి సుహైబ్ అనేకమంది యజమానుల చేతుల్లో మారుతూ ఏళ్ళ తరబడి బానిసగా జీవితం గడిపాడు.

ఓరోజు సుహైబ్ తన యజమానికి ఒక క్రైస్తవతాంత్రికుడు "అరేబియాలోని మక్కాలో ఈసా బిన్ మర్యం (అలైహి) దైవదౌత్యాన్ని ధృవీకరించే ఒక దైవప్రవక్త త్వరలో ప్రభవించబోతున్నాడని, ఆయన ప్రజలను అజ్ఞాన చీకట్ల నుంచి తీసి జ్ఞానకాంతిలో నడిపిస్తాడ"ని చెప్పడం విన్నాడు. ఆనాటినుంచి సుహైబ్ ఎలాగైనా బానిససంకెళ్ళు తెంచుకొని ఆ 'మహనీయుడి' దర్శనభాగ్యం పొందడానికి తహతహలాడిపోసాగాడు.

చివరికి ఆ అవకాశం లభించగానే రోమ్ నుండి పారిపోయి మక్కా చేరుకున్నాడు. అక్కడ అబ్దుల్లా బిన్ జుదాన్‌తో స్నేహంచేసి వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నుడయ్యాడు. వ్యాపారంలో లక్షలు సంపాదించాడు. అయితే వ్యాపారకార్య కలాపాల్లో మునిగిపోయి క్రైస్తవతాంత్రికుడు చెప్పిన భవిష్యవాణిని మాత్రం మరచి పోలేదు.

కొంతకాలానికి ఓరోజు సుహైబ్ వ్యాపార ప్రయాణం నుండి మక్కాకు తిరిగిరాగానే 'ముహమ్మద్ బిన్ అబ్దుల్లా (స) తాను దైవప్రవక్త అని ప్రకటించుకొని, ప్రజలను ఏక దైవారాధన వైపు ఆహ్వానిస్తున్నారని, చెడులు-అశ్లీలతల నుండి వారిస్తూ నీతినిజాయితీలు బోధిస్తున్నరని తెలిసింది. అంతే, అతను తన రొట్టెవిరిగి నేతిలో పడినట్లు పరమానంద భరితుడయ్యాడు.

వెంటనే అతను ఆ శుభవార్త తెలిపిన జనాన్ని 'ఆయన ఎక్కడ ఉంటాడ'ని అడిగాడు. దానికి జనం "ఆయన ఇప్పుడు సఫా కొండ సమీపంలోని అర్ఖం ఇంట్లో ఉంటున్నాడు. కాని ఆయన్ని కలుసుకోవడం చాలా ప్రమాదకరం. నువ్వాయన్ని కలుసు కోవడం ఖురైష్ నాయకులు గనక చూస్తే వారు నీ తాట వలుస్తారు. నిన్ను కాపాడేందుకు ఇక్కడ నీ బంధువులుగాని, నీ తెగవాళ్ళుగాని ఎవరూ లేరు. అందువల్ల కాస్త జాగ్రత్తగా మసలుకో" అని చెప్పారు.

ఏమైనప్పటికీ సుహైబ్ అర్ఖం ఇంటికి వెళ్ళడానికే నిర్ణయించుకొని, అటూఇటూ చూసి బయలుదేరాడు. అర్ఖం ఇంటికి చేరుకొని అక్కడ తలుపు దగ్గర అమ్మార్ బిన్ యాసిర్ అనే ఓ మిత్రుడ్ని కలుసుకున్నాడు. ఇద్దరూ మాట్లాడుకొని లోపలికి ప్రవేశించి

దైవప్రవక్త (స) బోధిస్తున్న అమృత వచనాలను శ్రద్ధగా వినసాగారు. అవి వారి హృదయాల్లో బాగా నాటుకున్నాయి. వెంటనే మిత్రులిద్దరూ సద్వచనం పఠించి ముస్లింలైపోయారు.

అప్పటినుంచి వారిద్దరిపై కూడా ఖురైషీయుల హింసాకాండ మొదలైంది. ఈ హింసాకాండ హద్దుమీరిపోవడంతో దైవప్రవక్త (స) వారిని మదీనా వలసపొమ్మని అనుమతిం చారు. అప్పుడు అనేకమంది జట్లుజట్లుగా, రహస్యంగా బయలుదేరి మదీనా చేరుకున్నారు. ఖురైషీయులు కొందరిని మదీనా పోకుండా నిరోధించడానికి ప్రయత్నిం చారు. అలా నిరోధించబడినవారిలో సుహైబ్ రోమీ (రజి) కూడా చేరిపోయారు.

సుహైబ్ రోమీ (రజి) మక్కా నుంచి మదీనా పోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఆయన బానిస బంధనాలు త్రెంచుకొని రోమ్‌నుండి పారిపోయి మక్కా వచ్చిన తర్వాత, వ్యాపారంచేసి లక్షలు సంపాదించారు. అంచేత ఈ ధనమంతా వెంట తీసికెళ్తాడేమోనని భావించి ఖురైషీయులు ఆయన్ని మక్కా వీడి పోనివ్వకుండా నిఘా ఉంచారు.

అయినప్పటికీ హజ్రత్ సుహైబ్ (రజి) నిరాశ చెందకుండా అవకాశం కోసం ఎదురుచూడసాగారు. ఓరోజు ఆయనకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. మలవిసర్జన సాకుతో ఆయన మాటిమాటికి బహిర్‌ప్రదేశానికి వెళ్ళిరావడం మొదలెట్టారు. ఆ విధంగా ఆయన ఆరోజు చీకటి పడేదాకా అనేకసార్లు బయటికి వెళ్ళివచ్చారు.

ఆయన పరిస్థితి చూసి నిఘావేసి ఉంచిన ఖురైషీయులకు జాలివేసింది. ఆయనకు ఏదో విరోచన రోగం పట్టుకుందని భావించారు. దాంతో వారు సంతోషంతో చంకలు కొట్టుకున్నారు. పైగా ఆ రాత్రి ఎంతో సంతృప్తితో గురకపెట్టి నిద్రపోవడం ప్రారంభించారు.

హజ్రత్ సుహైబ్ (రజి) ఈ అవకాశాన్ని జారవిడుచుకోకుండా తక్షణమే ధనుర్బా ణాలు తీసుకొని నిద్రపోతున్న కాపలాదారుల మధ్య గుండా మెల్లిగా అడుగులు వేసు కుంటూ బయటికి వెళ్ళారు. పట్నం బయటికి చేరుకోగానే అక్కడ్నుంచి మదీనా దిశగా చకచకా నడుస్తూ చీకటిలో కనుమరుగయి పోయారు.

కాపలాదారులు నిద్రమత్తు వదలిన తరువాత విషయం తెలియగానే ఆదరా బాదరాగా గుర్రాలెక్కి మదీనా దిశగా పరుగెత్తారు.

హజ్రత్ సుహైబ్ రోమి (రజి) కొన్నిమైళ్ళు ప్రయాణం చేసిన తరువాత తనవెవరో వెంటాడుతున్నట్లు గుర్రపుడెక్కల చప్పుడు విన్పించింది. వెంటనే ఆయన పరుగెత్తి ఓ గుట్ట పైకెక్కి నిలబడ్డారు. అంతలో కాపలాదారులు కూడా ఆ గుట్ట దగ్గరికి చేరుకున్నారు. హజ్రత్ సుహైబ్ (రజి) అంబులపొది నుండి చర్రున ఓ బాణం తీసి ఎక్కుపెడుతూ ఇలా అన్నారు:



"ఖురైషీయులారా! నేను విలువిద్యలో బాగా ఆరితేరినవాణ్ణని, నా బాణాలు ఎలాంటి పరిస్థితిలో కూడా గురితప్పవని మీకందరికీ బాగా తెలుసు. బాణాలు అయి పోయిన తరువాత కరవాలంతో నా దేహంలోని చివరి రక్తపు బొట్టు చిందేవరకు పోరాడుతూ మిమ్మల్ని హతమారుస్తాను, జాగ్రత్త!"

ఈ మాటలు విని కాపలాదారుల్లో ఒకతను ముందుకొచ్చి.....

"నువ్వు నీ ధనప్రాణాలు రెంటినీ కాపాడుకొని ఇక్కడ్నుంచి తీసుకుపోలేవు. నువ్వు మా పట్టణానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేని నిష్ఠ దారిద్ర్యస్థితిలో వచ్చావు. ఇక్కడకు వచ్చి లక్షలాది రూపాయలు సంపాదించావు. అదంతా తీసుకొని పొనిస్తామను కుంటున్నావా?" అని అన్నాడు.

"మరి నా ధనమంతా మీకు అప్పగిస్తే నాకు దారి వదులుతారా?"

"తప్పకుండా వదిలేస్తాం." అన్నారు అవిశ్వాసులు.

అప్పుడు హజ్రత్ సుహైబ్ (రజి) తన ఇంట్లో ధనం ఎక్కడ దాచిపెట్టిందీ ఆ ప్రదేశాన్ని గురించి తెలియజేశారు. నూతన ధర్మం స్వీకరించి ముస్లింలయినవారు అబద్ధమాడరని ఖురైషీయులకు తెలుసు. అందువల్ల వారు సుహైబ్ (రజి) మాటలు నమ్మి ఆయన్ని మదీనా వెళ్ళిపోవడానికి వదిలేశారు.

ఆ తరువాత వారు మక్కా పట్టణానికి తిరిగొచ్చి నేరుగా సుహైబ్ (రజి) ఇంటికి వెళ్ళారు. అక్కడ ఆయన చెప్పిన ప్రదేశంలో వెతికితే నిజంగానే అపార ధనరాసులు కన్పించాయి. ధన కాంక్షాపరులైన ఖురైషీయులు సంతోషంతో పొంగిపోతూ వాటిని తీసేసుకున్నారు.

హజ్రత్ సుహైబ్ (రజి) ఆ తరువాత వేగంగా ప్రయాణం సాగించారు. లక్షల ధనరాసులు కోల్పోయినప్పటికీ విశ్వాస మహాభాగ్యం దక్కినందుకు ఆయన పరమ సంతోషంతో, ద్విగుణీకృత ఉత్సాహంతో ప్రయాణంచేసి మదీనా సమీపంలోని ఖుబా గ్రామానికి చేరుకున్నారు.

ఖుబాలో దైవప్రవక్త (స) హజ్రత్ సుహైబ్ (రజి)ని చూడగానే "అబూయహ్యా! నీవు చేసిన ఈ వ్యాపారం నీకెంతో ప్రయోజనకారి అవుతుంది" అన్నారు అమిత సంతోషం వెలిబుచ్చుతూ.

ఈ మాట ఆయన మూడుసార్లు అన్నారు.

దైవప్రవక్త (సల్లం) నోట ఈ శుభవార్త విని హజ్రత్ సుహైబ్ రోమి (రజి) రెండు క్షణాలు పరమానందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆ తరువాత "దైవప్రవక్తా! ఈ

విషయం చెప్పడానికి నాకంటే ముందు మీ దగ్గరికి ఎవరూ వచ్చి ఉండరు. దైవసాక్షి! ఈ సంగతి మీకు (సర్వజ్ఞాని అయిన) దేవుడు తప్ప మరెవ్వరూ తెలియజేయలేదు'' అన్నారు ఆయన.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఖుబా గ్రామంలో పధ్నాలుగు రోజులు ఉండి, అక్కడి ముస్లింలకు తగిన శిక్షణ గరిపారు. ఆ తరువాత ఆయన ముఖ్య అనుచరులతో కలసి మదీనా నగరానికి బయలుదేరారు. ఆ అనుచరుల్లో హజ్రత్ సుహైబ్ రోమీ (రజి) కూడా ఉన్నారు.

# 35. అద్దీ బిన్ హాతిం తాయి (రజి)

ఒకసారి ముస్లింలు 'తై' తెగతో పోరాడవలసి వచ్చింది. ఆ పోరాటంలో తై తెగ ఓడిపోయింది. ఆ తెగనాయకుడు అద్దీ బిన్ హాతింతై ఇస్లాంకు బద్ధవిరోధి. కాని అతను ముస్లిం యోధులను ఎదుర్కోలేక భార్యాపిల్లల్ని తీసుకొని సిరియాకు పారిపోయాడు. ముస్లింయోధులు విజయానందంతో సమరసొత్తును, యుద్ధఖైదీలను తీసుకొని మదీనా తిరిగొచ్చారు. ఈ యుద్ధఖైదీలలో అద్దీ బిన్ హాతింతై సోదరి సఫ్ఫానా కూడా ఉంది.

ఖైదీలను విడిచిపెట్టాలో లేక ముజాహిద్‌లకు పంచాలో ఇంకా నిర్ణయం తీసుకో లేదు. అలాంటి పరిస్థితిలో అటుగా దైవప్రవక్త (సల్లం) రావడం చూసి సఫ్ఫానా ఇలా అన్నది :

"దైవప్రవక్తా! దయజూపండి. తండ్రి చనిపోయాడు. సోదరుడు పారిపోయాడు. ఈ దీనురాలిని కనికరించండి."

దైవప్రవక్త (స) వెనక్కి తిరిగి చూసి "ఎవరూ నీ సోదరుడు?" అని అడిగారు.

"అద్దీ బిన్ హాతిం" అన్నది ఆమె.

"అతనా! అతను దైవవిరోధి, దైవప్రవక్త విద్వేషి!!" అంటూ దైవప్రవక్త (స) ముందుకు సాగారు.

సఫ్ఫానా నిరాశచెందకుండా తనను కనికరించమని మళ్ళీ విన్నవించుకుంది. దైవప్రవక్త (సల్లం) ఆమెను మన్నించి విడుదలచేశారు. పైగా ఎంతో పైకం కూడా ఇచ్చి ఆమెను సిరియా పంపివేశారు.

సఫ్ఫానా సిరియా వెళ్ళి సోదరుడికి తానెలా బయటపడగలిగిందో వివరంగా చెప్పింది. దైవప్రవక్త (స) నిజాయితి, దాతృత్వాలను గురించి అతని ముందు ప్రశం సించింది. అద్దీ దైవప్రవక్త (స) సచ్ఛీలం సంగతి విని ఎంతో ఆశ్చర్యపోయాడు.



"అయితే ఆయన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటీ?'' ప్రశ్నించాడు అద్దీ

"నా అభిప్రాయం- నువ్వు వెంటనే ఆయన దగ్గరికి వెళ్ళిరా. ఆయన నిజంగా దైవప్రవక్తే అయితే నీలాంటివాడ్ని ఆదరించడానికి ఆయన వెనకాడడని నాకు గట్టి నమ్మకం ఉంది. ఒకవేళ ఆయన చక్రవర్తి అయితే ఆయన దగ్గర నీకు విలువ ఉండక పోదు'' అన్నదామె.

ఈ మాటలు విన్న తరువాత అద్దీ మరునాడు మదీనా బయలుదేరాడు. అతను తాను మదీనా వస్తున్నట్లు ముందే దైవప్రవక్త (స)కు కబురు చేయడంగాని, తనకు రాజకీయ ఆశ్రయం కల్పించమని అడగడంగాని చేయలేదు.

అయితే "దేవుడు అద్దీ బిన్ హాతిం చేతిని నా చేతిలోకి ఇస్తాడ"ని దైవప్రవక్త (స) తన సహచరులతో అన్నట్లు అద్దీకి తెలిసింది. ఈ సంగతి కూడా అతడ్ని ప్రభావితం చేసి ఉండవచ్చు. అద్దీ మదీనా చేరుకున్నాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరులతో కలసి మసీదులో కూర్చున్నారు. అద్దీ మసీదులో ప్రవేశించి సలాం చేశాడు.

"ఎవరు నాయనా నువ్వు?'' అడిగారు దైవప్రవక్త (సల్లం) ప్రశాంత వదనంతో.

"నేను అద్దీ నండీ! హాతిం తై కొడుకుని'' చెప్పాడు అద్దీ.

"అద్దీ అంటే నువ్వేనా!'' అంటూ దైవప్రవక్త (సల్లం) లేచి అద్దీ చేతిని తన చేతిలోకి తీసుకొని అతడ్ని ఇంటికి పిలుచుకెళ్ళారు.

దారిలో ఓ ముసలమ్మ దైవప్రవక్త (స)ను ఆపి తన పరిస్థితి గురించి విన్నవించు కోసాగింది. ఆమె వెంట ఓ పసిబాలుడు కూడా ఉన్నాడు. ఆమె చెబుతున్న మాటలు దైవప్రవక్త (స) ఎంతో ఓపిగ్గా వింటుంటే అద్దీకి చాలా ఆశ్చర్యం వేసింది.

"ఓ సాధారణ స్త్రీ మాటలు ఎంతో సేపట్నుంచి అంత ఓపిగ్గా వింటున్నాడంటే ఈయన చక్రవర్తి ఎంతమాత్రం కాలేడు'' అద్దీ అంతరాత్మ ఘోషించింది.

దైవప్రవక్త (స) వృద్ధురాలితో మాట్లాడాక అద్దీని వెంటబెట్టుకొని ఇంటికి వెళ్ళారు.

"అద్దీ! ఈదిండు మీద కూర్చో'' అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఖర్జూరపీచుతో నిండిన ఒక దిండును చూపిస్తూ. తాను మాత్రం మరో దిండు లేనందున నేలపైనే కూర్చున్నారు.

కాని దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కటిక నేలపై కూర్చుంటే తాను దిండుపై కూర్చోవడం అమర్యాదగా ఉంటుందని తలచి అద్దీ బిన్ హాతింతై దిండు మీద కూర్చోవడానికి తటపటాయించాడు.

"దిండు మీద మీరే కూర్చోండి" అన్నాడతను సిగ్గుపడిపోతూ.

"అదేం కుదరదు. మీరే దిండు మీద కూర్చోవాలి" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు అద్దీకి దిండు మీద కూర్చోక తప్పలేదు.

"ఈయన చక్రవర్తి కానే కాడు. చక్రవర్తి అయితే ఇలా ప్రవర్తించడు" అనుకున్నాడు అతను మనసులో దిండు మీద కూర్చొంటూ.

"అద్దీ ఇప్పుడు చెప్పు నీ పరిస్థితి. నువ్వు 'రకూసి'వి కదూ? క్రైస్తవానికి, సాబియానికి మధ్య ఉండే మతాన్ని అవలంబించావు కదూ?" అడిగారు దైవప్రవక్త (స).

"ఔను మహాశయా! నేను 'రకూసి'నే" అన్నాడు అద్దీ.

"నువ్వు నీ జాతిప్రజల నుంచి సమరసొత్తులోని నాల్గవ భాగం వసూలు చేసేవాడివి కదూ? నువ్వు అవలంబించిన మతంలో ధర్మసమ్మతంకాని ధనాన్ని నువ్వు తీసుకునే వాడివి, ఔనా?" ప్రశ్నించారు దైవప్రవక్త (స) మళ్ళీ.

ఈ మాటలు విన్న తరువాత అద్దీకి ముహమ్మద్ మహనీయులు (స) తప్పకుండా దైవప్రవక్తే అయిఉంటారని నమ్మకం కుదిరింది. అందువల్ల అతను నిజాన్ని అంగీకరిస్తూ "ఔనండీ! నేనీ విధంగానే చేస్తున్నాను" అన్నాడు.

"అద్దీ! ముస్లింలు ఈరోజు పేదలుగా ఉన్నారనుకొని నువ్ ఇస్లాం స్వీకరించడానికి వెనకాడుతున్నావు. కాని గుర్తుంచుకో, ముస్లింలు సిరిసంపదలతో తులతూగే రోజు ఎంతో దూరంలేదు. ఆనాడు వీరు దానధర్మాలు చేసినా వాటిని తీసుకునేవాళ్ళే ఉండరు...

...లేదా ఈరోజు ముస్లింలు తక్కువ సంఖ్యలో ఉన్నారని తలచి నువ్వు ఇస్లాంని ఆశ్రయించడానికి సిద్ధంగా లేవనుకుంటా. కాని హజ్‌యాత్ర కోసం ఖాదిసియా నుండి ఒక స్త్రీ ఒంటరిగా ఒంటె మీద బయలుదేరి, దారిలో దైవభయం తప్ప మరెవరి భయం లేకుండా ప్రయాణం చేస్తోందన్న వార్త నువ్వు త్వరలోనే వింటావు...

...లేదా ఈనాడు ముస్లింలకు రాజ్యాధికారం లేనందున నీకీ ధర్మం స్వీకరించడం ఇష్టం లేదు కాబోలు. కాని గుర్తుంచుకో. బాబిల్‌శ్వేతవీధులను ముస్లింలు జయించారని, (ఈరాన్ చక్రవర్తి) కిస్రా ధనాగారాలు ముస్లింల స్వాధీనమయ్యాయని నువ్వు త్వరలోనే వింటావు" అన్నారు దైవప్రవక్త (స) భవిష్యత్తులో జరగనున్న సంఘటనల్ని వివరిస్తూ.

"ఏమిటీ! కిస్రా ఇబ్నెహుర్మూజ్ ధనాగారాలే!!" అన్నాడు అద్దీ ఆశ్చర్యపోయి చూస్తూ.

"ఔనౌను. కిస్రా ఇబ్నెహుర్మూజ్ ధనాగారాలే" అన్నారు దైవప్రవక్త (స).

ఈ మాటలన్నీ విన్న తరువాత అద్దీ కళ్ళ ముందున్న అపోహలు తొలగిపోయాయి; అజ్ఞానపు కారుచీకట్లు మటుమాయమైపోయాయి. ఇక ఉండబట్టలేక అప్పటికప్పుడు



అతను ఇస్లాం స్వీకరించి దైవసిపాయీలలో చేరిపోయాడు.

ఒకరోజు హజ్రత్ అద్దీ బిన్ హాతిం (రజి) ఖుర్‌ఆన్‌లోని ఒక సూక్తి (9:31)ని గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తూ ఇలా అడిగారు:

"దైవప్రవక్తా! ఈసూక్తిలో మేము మా ధర్మవేత్తలను, సాధువులను దేవుళ్ళుగా చేసుకున్నామనే అభియోగం మామీద మోపబడింది. (దీని గూఢార్థం ఏమిటీ?)."

"వారు నిషేధించినవాటిని మీరు నిషేధితాలుగా, వారు ధర్మసమ్మతం చేసిన వాటిని మీరు ధర్మసమ్మతమైనవిగా అంగీకరించడం లేదా?" అన్నారు దైవప్రవక్త (స).

"నిజమే, మేము అలాగే చేస్తున్నాం" చెప్పారు హజ్రత్ అద్దీ బిన్ హాతిం (రజి).

"వారిని దేవుళ్ళుగా ప్రభువులుగా ఆరాధించడమంటే ఇదే"అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

ఆ తర్వాత హజ్రత్ అద్దీ (రజి) సెలవు తీసుకొని అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

# 36. అబూజర్ గిప్ఫారి (రజి)

మక్కాలో దైవప్రవక్త (స) ప్రచారం గురించి గిప్ఫార్ తెగవాళ్ళకు కూడా తెలిసింది. ఆ తెగలో దారిదోపిడీని వృత్తిగా చేసుకొని జీవితం గడిపేవారే అత్యధికమంది ఉన్నారు. అందువల్ల గిప్ఫారీ తెగ దారిదోపిడి చేసే తెగ అని పేరుపడింది.

ఆ తెగనాయకుడు అబూజర్ కూడా ప్రముఖ దోపిడీ దొంగే. అయితే విగ్రహాలను పూజించడం అతనికి సుతరామూ నచ్చేదికాదు. విగ్రహపూజకు అతను ఎల్లప్పుడూ దూరంగా ఉండేవాడు. మదీనావాసులు సువైద్ బిన్ సామిత్ (రజి), అయాజ్ బిన్ ముఆజ్ (రజి)ల ద్వారా నూతనధర్మం గురించి సమాచారం అందగానే ఆయన వివరాలు తెలుసుకోవడానికి తన తమ్ముడు అనీస్‌ని మక్కా పంపించాడు.

అనీస్ మక్కా వెళ్ళి దైవప్రవక్త (స)ను కలుసుకున్నాడు. అనీస్ మంచి కవి కూడా. అంచేత దైవప్రవక్త (స) పఠించిన సూక్తులు నిజంగా దైవవాణేనని ధృవపరచుకొని మదీనా తిరిగొచ్చాడు.

"అన్నయ్యా! ముహమ్మద్ (స) సామాన్య మానవుడు కాదు. ఆయన నోట వెలువడే వాణిలో మానవవాక్కులోలేని ప్రత్యేకత ఉంది. అదీగాక ఆయన సత్కార్యాలు చేయమని ప్రజలను ఉపదేశిస్తున్నారు. దుష్కార్యాల నుండి వారిస్తున్నారు" చెప్పాడు అనీస్.

కాని అనీస్ మాటల వల్ల అబూజర్‌కు పూర్తిగా తృప్తి కలగలేదు. అందువల్ల ఆయన స్వయంగా మక్కా బయలుదేరాడు. మక్కా చేరుకొని నేరుగా కాబాలయానికి వెళ్ళి దైవప్రవక్త (స)ను వెతకసాగాడు. కాని ఆయన దైవప్రవక్త (స)ను ఎప్పుడూ

చూడలేదు. అందువల్ల ఆయన కాబాలో ఉన్న జనంలో ఎవరు దైవప్రవక్తో తెలుసుకోలేక పోయాడు. ప్రజల్ని అడగటం కూడా బాగుండదని భావించాడు.

ఇలా దైవప్రవక్త (స)ను గుర్తుపట్టడంలోనే చీకటిపడి చాలా పొద్దుపోయింది. అంతలో హజ్రత్ అలి (రజి) వచ్చారు. ఆయన అబూజర్‌ని చూసి ఇతనెవరో కొత్తగా వచ్చిన బాటసారిలా ఉన్నాడనుకున్నారు.

"మీరెవరో బాటసారిలా ఉన్నారు. ఈ రాత్రికి మా ఇంటికి పదండి" అన్నారు ఆయన. అబూజర్ మౌనంగా ఆయన్ని అనుసరించాడు. దారిలో, ఆ తరువాత అలి ఇంటికెళ్ళిన తరువాత కూడా అతను ఏమీ మాట్లాడలేదు.

ఆ రాత్రి హజ్రత్ అలి (రజి) అతనికి భోజనం పెట్టి పడక ఏర్పాటు చేశారు. తెల్లవారిన తరువాత అబూజర్ మూటాముల్లె సర్దుకొని మళ్ళీ కాబాలయానికి వెళ్ళాడు. కాని ఆరోజు కూడా అతను దైవప్రవక్త (స)ను గుర్తు పట్టలేకపోయాడు.

చివరికి అబూజర్ ఆ రాత్రి కాబాలయంలోనే ఓ మూలన పడక పరుచుకొని పడుకున్నాడు. అంతలో హజ్రత్ అలి (రజి) వచ్చి అతడ్ని లేపి ఇంటికి తీసికెళ్ళారు. తెల్లవారగానే అబూజర్ మళ్ళీ కాబాగృహానికి వెళ్ళిపోయారు. ఆరోజు కూడా అతను దైవప్రవక్త (స)ను గుర్తు పట్టలేకపోయాడు. కాస్సేపటికి హజ్రత్ అలి (రజి) వచ్చి చూసి ఆశ్చర్యపోయారు.

"ఏమిటీ మీరింకా మీ గమ్యస్థానానికి వెళ్ళలేదా? ఇంతకూ మీరొచ్చిన పనేమిటో చెప్పలేదు" అన్నారు హజ్రత్ అలి (రజి).

"మీరెవరితో ప్రస్తావించనని మాటిస్తే చెబుతాను" అన్నాడు అబూజర్ (రజి). "సరే చెప్పండి." అన్నారు అలి (రజి)

"ఇక్కడ ఒకాయన్ని జనం దైవప్రవక్తని చెప్పుకుంటున్నారట. నేనాయన్ని కలుసుకోవాలి. ఆయన ఎక్కడున్నారో ఎలా ఉంటారో నాకు తెలియదు. మీరేమయినా నాకు సహాయం చేయగలరా?" అన్నాడు అబూజర్.

"అలాగైతే నా వెంట పదండి" అన్నారు హజ్రత్ అలి (రజి). ఆ విధంగా అలి (రజి) అబూజర్‌ని తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి తీసికెళ్ళారు.

అబూజర్ దైవప్రవక్త (స)ను ఉద్దేశించి "మీరు జనంలో ప్రచారం చేస్తున్న విషయాలేమిటో సరైన రీతిలో మంచిస్వరంతో కాస్త నాకు విన్పించండి" అని అడిగాడు.

"అయ్యా! నేను కవిని కాను. నేను చెప్పేమాటలు ఖుర్‌ఆన్‌కు సంబంధించిన సూక్తులు. ఖుర్‌ఆన్ నా సొంతవాణి కాదు, దైవవాణి" అన్నారు దైవప్రవక్త (సల్లం).



"సరే ఆ వాణే పఠించి విన్పించండి నాకు" అన్నాడు అబూజర్ గిఫ్ఫారీ. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించారు.

అబూజర్ దైవసూక్తులు వినగానే "నేను అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను" అన్నాడు.

"చాలా సంతోషం. ఇంతకూ నీవు ఏ తెగవాడివి?" అడిగారు దైవప్రవక్త (సల్లం). దానికి అబూజర్ "నేను గిఫ్ఫార్ తెగ నాయకుడ్ని" అన్నారు.

పెద్ద గూండాగా, దోపిడీదొంగగా కన్పిస్తున్న అబూజర్‌ని దైవప్రవక్త (స) ఓసారి ఎగాదిగాచూసి "నిజంగా దేవుడు తాను తలచిన వారికి సన్మార్గం చూపుతాడు" అన్నారు.

"దైవప్రవక్తా! నేను కాబా వెళ్ళి నలుగురి ముందు సద్వచనం (కలిమా) ప్రకటిస్తాను" అన్నారు హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి).

"అలా చేశావంటే ఖురైషీయులు నిన్ను ప్రాణాలతో వదలిపెట్టరు" అన్నారు దైవప్రవక్త (సల్లం). దానికి అబూజర్ (రజి) "నేను నా ప్రాణం గురించి భయపడను. ఖురైషీయుల ముందు సద్వచనం ప్రకటించి తీరుతాను" అని అన్నారు.

వెంటనే ఆయన కాబాగృహానికి వెళ్ళి "అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని ఎలుగెత్తి చాటారు.

అంతే, ఖురైషీయులు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. పిడిగుద్దులతో, తన్నులతో ఆయన్ని తీవ్రంగా కొట్టసాగారు.

అంతలో ప్రవక్త పినతండ్రి అబ్బాస్ జోక్యం చేసుకుంటూ "అరెరె! ఇతడ్ని కొడ్తారేమిటీ! ఇతను గిఫ్ఫార్ తెగ మనిషయ్యా బాబూ! గిఫ్ఫార్‌తెగ ఉండే ప్రాంతం గుండానే మీ వర్తక బిడారాలు సిరియా నుంచి వస్తుంటాయి" అన్నారు.

ఈ మాట వినగానే ఖురైషీయులు అబూజర్ గిఫ్ఫారీ (రజి)ని కొట్టడం ఆపి పక్కకు తప్పుకున్నారు. హజ్రత్ అబూజర్ (రజి) రక్తసిక్త దేహంతో దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి జరిగిన వృత్తాంతం తెలియజేశారు.

"నేను చెప్పలేదూ ఖురైషీయులు అంతపని చేస్తారని?" అన్నారు దైవప్రవక్త (స).

"పరవాలేదు దైవప్రవక్తా! నేను వారి దెబ్బలకు భయపడేవాడ్ని కాను. రేపు కూడా వెళ్ళి వారి ముందు సద్వచనం ప్రకటిస్తాను" అన్నారు హజ్రత్ అబూజర్ (రజి).

అన్నట్టే ఆయన రెండవరోజు కూడా కాబా వెళ్ళి అందరి ఎదుట సద్వచనం (కలిమా) ప్రకటించారు. అది వినగానే ఖురైషీయులు మళ్ళీ ఆయన మీద విరుచుకుపడి కొట్టారు. అయితే నిన్న అబ్బాస్ అన్న మాటలు గుర్తుకొచ్చి వదిలేశారు.

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) రక్తసిక్త దేహంతో దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి జరిగిన సంగతి చెప్పారు. ఆ తరువాత ఆయన సెలవు తీసుకొని తిరిగి మదీనా వెళ్ళిపోయారు.

అబూజర్‌గిఫ్ఫారి (రజి) స్వస్థలం చేరుకోగానే తన తెగ ప్రజలను సమావేశపరిచారు. వారికి దైవప్రవక్త (సల్లం) గురించి, నూతనధర్మం గురించి తెలియజేసి ఇస్లాం స్వీకరించ మని చెప్పారు. గిఫ్ఫార్‌తెగ ప్రజలు నాయకుని ఆజ్ఞ పాటిస్తూ వెంటనే ఇస్లాం స్వీకరి స్తున్నట్లు ప్రకటించారు.

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి), ఆయన అనుచరులు యధాప్రకారం తమ చోరవృత్తిని కొనసాగిస్తూ దారిదోపిడీలు చేస్తునే ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) అప్పటివరకు అవతరించిన దైవాజ్ఞలు మాత్రమే తెలియజేసి దారిదోపిడి సంగతి ప్రస్తావించలేదు. అంచేత గిఫ్ఫార్ తెగవాళ్ళు బ్రతుకుతెరువు కోసం దారిదోపిడి వృత్తిని ఇంకా మానుకోలేక పోయారు. అయితే బాటసారుల సొమ్ము దోచుకున్న తరువాత ఇస్లాం స్వీకరిస్తే తాము దోచుకున్న సొమ్ము తిరిగిచ్చేస్తామని చెప్పేవారు. ఆ విధంగా వారు కొందరిని ముస్లింలు గా మార్చగలిగారు.

బదర్, ఉహద్, కందకం యుద్ధాలు జరిగే వరకు హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) తన తెగవాళ్ళతో కలసి స్వస్థలంలోనే ఉంటూ ధర్మప్రచార కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నులైపోయారు. ఆ తరువాత తబూక్ దండయాత్రలో పాల్గొన్నారు. దైవప్రవక్త (సల్లం) దివంగతులైన తరువాత ఆయన మొదటి ముగ్గురు ఖలీఫాలు అబూబకర్, ఉమర్‌ఫారూఖ్, ఉస్మాన్ (రజి)ల పాలనా కాలాల దాకా గొప్ప సదాచార సంపన్నుడిగా, తపస్విగా జీవితం గడిపారు.

ఖలీఫాఉస్మాన్ (రజి) పాలనకాలంలో జకాత్ గురించి అబూజర్(రజి) ధోరణిలో కాస్త మార్పువచ్చింది. ఆయన సిరియాలో గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) అధీనంలో ఉంటూ ఓ ఖుర్‌ఆన్‌సూక్తి విషయంలో ముఆవియా (రజి)తో తీవ్రంగా విభేదించారు. అదిలాఉంది:

“వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో వినియోగించని పిసినారులకు దుర్భరయాతన కాచుకొనివుందని శుభవార్త విన్పించు!” (9:34).

ఆయన ఈసూక్తి ఆధారంతో ‘డబ్బుకూడబెట్టడం, దాన్ని పూర్తిగా దైవ మార్గంలో ఖర్చుపెట్టకుండా ఉంచడం ఏమాత్రం ధర్మసమ్మతం కాదని అంటారు.

అమీర్ ముఆవియా (రజి) ఆయనకు నచ్చజెబుతూ “దైవమార్గంలో ఖర్చు పెట్టడం (ఇన్ఫాఖ్ ఫీసబీలిల్లాహ్) అంటే జకాత్ చెల్లింపు అని అర్థం. ఏ పైకం నుంచి



జకాత్ తీసి అర్హులకు చెల్లించడం జరుగుతుందో ఆ పైకాన్ని కూడబెట్టడం పాపం కాదు. ఒకవేళ జకాత్ చెల్లించిన తర్వాత కూడా డబ్బు కూడబెట్టడం పాపమైతే ఖుర్‌ఆన్‌లో వారసులకు ఆస్తిపంపిణీ వివరాల ప్రస్తావనే వచ్చేదికాదు” అని అన్నారు. కాని అబూజర్ గిఫ్ఫారీ (రజి) తన దృక్పథమే సరైనదని వాదించేవారు.

ప్రజలు ఈ వాదన సంగతి విని ఆయన్ని ఎగతాళి చేయసాగారు. ముఖ్యంగా నవయువకులు ఆయన్ని అదేపనిగా ఆట పట్టించడం మొదలెట్టారు. అమీర్ ముఆవియా (రజి) అబూజర్ (రజి) వాదనతో విసిగిపోయి విషయాన్ని ఖలీఫాకు తెలియజేశారు. అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని అత్యంత గౌరవమర్యాద లతో మదీనా పంపమని ఆదేశించారు. ఈ ఆదేశం ప్రకారం ముఆవియా (రజి) ఆయన్ని మదీనా పంపారు.

అయితే అబూజర్ గిఫ్ఫారీ (రజి) మదీనాలో కూడా తన దృక్పథాన్ని ప్రచారం చేయనారంభించారు. ఇక్కడా యువకులు ఆయన్ని ఎగతాళి చేయడం మొదలెట్టారు.

ఆ రోజుల్లోనే హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చనిపోయారు. దైవప్రవక్త (సల్లం) పదిమంది స్వర్గవాసులవుతారని ప్రకటించిన జాబితాలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) కూడా ఉన్నారు. ఆయన చనిపోతూ తన వెనుక అపార ధనరాసులు వదలివెళ్ళారు. అప్పుడు కొందరు ‘అపారసిరిసందలు వదలివెళ్ళిన అబ్దుర్రహ్మాన్(రజి) సంగతేమిటని అడిగారు. దానికి అబూజర్ (రజి) ఆయనపై కూడా అదే ‘ఫత్వా’ (ధార్మికతీర్పు) జారీచేశారు.

ఉమర్‌ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఇస్లాం స్వీకరించిన ప్రముఖ యూద పండితుడు కాబ్ అహ్‌బార్ (రహ్మాలై) ఈమాట విని అబూజర్ (రజి)ని విమర్శించారు. దాంతో అబూజర్ (రజి) చిర్రెత్తిపోయి “ఓరీ యూదుడా! ఈ సమస్యల్ని గురించి నీకేం తెలుసు?” అంటూ ఆయన్ని కొట్టడానికి లాఠీ పైకెత్తారు.

పాపం కాబ్ కాలికి బుద్ధిచెప్పి ఖలీఫా ఉస్మాన్ (రజి) దర్బారు వైపు పరుగెత్తారు. అబూజర్ (రజి) కూడా లాఠీ తీసుకొని ఆయన వెంటపడ్డారు. ఖలీఫా సేవకులు ఎలాగో అతికష్టమ్మీద ఆయన్ని నిలువరించి కాబ్ అహ్‌బార్ (రహ్మా)ని కాపాడారు.

అబూజర్(రజి) కోపం తగ్గిన తర్వాత ఖలీఫా సన్నిధికి పోయి “మన దగ్గరుండే ధనమంతా తప్పనిసరిగా దైవమార్గంలో ఖర్చుపెట్టాలన్నదే నా దృక్పథం. సిరియావాళ్ళు దీన్ని వ్యతిరేకిస్తూ నన్ను చికాగు పరిచారు. ఇక్కడ మదీనాలో కూడా జనం నన్ను వ్యతిరేకిస్తున్నారు. ఇప్పుడు మీరే చెప్పండి. ఇలాంటి పరిస్థితిలో నన్నేం చేయ మంటారు? ఎక్కడికి వెళ్ళమంటారు?” అని అడిగారు.

దానికి ఖలీఫా ఉస్మాన్ (రజి) "మీరు మదీనా వెలుపల ఎక్కడికైనా వెళ్ళి ఉండండి" అని అన్నారు. అప్పుడు అబూజర్ గిఫ్ఫారీ (రజి) మదీనా నుండి మూడు మైళ్ళ దూరంలో ఉన్న రబ్జా అనే ఓ కుగ్రామానికి వెళ్ళి నివసించసాగారు.

దైవప్రవక్త (స) ఓసారి ఆయన్ని గురించి "భూమండలంపై, ఆకాశం క్రింద అబూజర్‌ని మించిన సత్యసంధుడు ఎవరూ లేరు" అని అన్నారు.

# 37. అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి)

ఖురైష్ వంశానికి చెందిన అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) ఇస్లాం స్వీకరించిన ప్రప్రథమ విశ్వాసుల్లో ఒకరు. ఇస్లాం స్వీకరించిన కారణంగా ఎదురైన కష్టాలను ఆయన సహనస్థయిర్యాలతో ఎదుర్కొన్నారు. ఆయన జన్మతఃఅంధుడు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) ఎల్లప్పుడూ దైవప్రవక్త (సల్లం) సహచర్యంలో ఉండి, ఆయన బోధనామృతం ఆస్వాదించాలని ఉవ్విళ్ళూరుతుండే వారు. ఆ ఉద్దేశ్యంతోనే ఒకరోజు ఆయన ఏదో విషయం అడిగి తెలుసుకోవడానికి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు.

ఆ సమయంలో దైవప్రవక్త (స) ఖురైష్ నాయకులతో సంప్రదింపులు జరపడంలో నిమగ్నులై ఉన్నారు. ఖురైష్ ప్రజల్లో అగ్రగణ్యులు, పేరుప్రతిష్ఠలు గల ఈ నాయకులు గనక ఇస్లాం స్వీకరిస్తే ఇతర ప్రజలు సులభంగా వారిని అనుసరిస్తారని ఆయన భావిస్తూ ఉండేవారు. ఈ భావనతోనే దైవప్రవక్త (స) ఆరోజు వారిపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించి సంప్రదింపులు జరపసాగారు.

అలాంటి పరిస్థితిలో అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) దైవప్రవక్త (స)కు దగ్గరగా వచ్చి "దైవప్రవక్తా! దేవుడు మీకు నేర్పిన విషయాల్లో కొన్నిటిని నాక్కూడా నేర్పండి" అని అన్నారు. కాని దైవప్రవక్త (స) ఖురైష్ అగ్రనాయకులకు ఇస్లాం గురించి నచ్చజెప్ప డంలో లీనమైపోయి అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) వైపు దృష్టి సారించలేక పోయారు. అదీగాక ఖురైష్ నాయకులతో ముఖ్యమైన చర్చలు జరుపుతున్నప్పుడు ఇలా ఒక సాధారణ వ్యక్తి జోక్యం చేసుకోవడం దైవప్రవక్త (స)కు నచ్చలేదు. అంచేత ఆయన ఆ అనుచరుడి వైపు దృష్టి సారించలేదు. కాని ఈ వైఖరి దేవునికి నచ్చలేదు.

ఆ సందర్భంలో దైవప్రవక్త (సల్లం)పై ఈ సూక్తులు అవతరించాయి:

అతను తన దగ్గరకు అంధుడొచ్చాడని భృకుటి ముడిచి ముఖం తిప్పుకున్నాడు. నీకేం తెలుసు? ఆ అంధుడు తననుతాను సంస్కరించుకుంటాడేమో; లేదా హితోపదే శాన్ని శ్రద్ధగా ఆలకిస్తాడేమో; హితోపదేశం అతనికి ప్రయోజనం కలిగిస్తుందేమో! (ఖుర్‌ఆన్-80:1-4)



(సత్యాన్ని) ఖాతరు చేయనివాడి పట్ల నీవంతగా ఆసక్తి చూపుతున్నావా? అతను దారికి రాకపోతే అందులో నీ దోషం ఏముంటుందని? (దేవునికి) భయపడుతూ నీ దగ్గరకు పరుగెత్తుకొచ్చిన వాడ్ని చూసి నీవు ముఖం తిప్పుకుంటున్నావు. (దివ్య ఖుర్‌ఆన్=80:5-10)

ఎంతమాత్రం (చేయ)కూడదు. ఇది హితోపదేశం. ఇష్టమైనవాడు దీన్ని స్వీకరిస్తాడు. ఇది మహోన్నతమైన, ప్రతిష్ఠాత్మకమైన, పవిత్రమైన పుటలలో లిఖించబడి ఉంది. అవి గౌరవనీయులైన పరిశుద్ధలేఖకుల హస్తాలలో ఉంటాయి. (దివ్యఖుర్‌ఆన్-80:11-16)

ఆరోజు నుండి దైవప్రవక్త (స) అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి)ని ఎంతగానో అభిమానించసాగారు. మక్కా ఖురైషీయుల దౌర్జన్యాలు హద్దుమీరడంతో ముస్లింలు దైవప్రవక్త (స) ఆజ్ఞతో మదీనాకు వలసపోవడం ప్రారంభించారు. అప్పుడు అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) కూడా మదీనా వెళ్ళిపోయారు. అక్కడ ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి)తో కలసి దైవసందేశ ప్రచారకార్యకలాపాల్లో నిమగ్నులై పోయారు.

ఆ తరువాత మక్కా బహుదైవారాధకులకు, మదీనా ముస్లింలకు మధ్య యుద్ధ పరంపర ప్రారంభమయింది. జిహాద్ ప్రాముఖ్యం, ఔన్నత్యాలను గురించి ఖుర్‌ఆన్ లో గొప్పగా వర్ణించబడింది. దాంతోపాటు జిహాద్‌లో పాల్గొననివారిని తీవ్రంగా విమర్శించడం కూడా జరిగింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) హృదయంలో జిహాద్ పట్ల ఆసక్తి ఉన్నా తాను కళ్ళులేని కబోది కావడం వల్ల జిహాద్‌లో పాల్గొనలేని నిస్సహాయుడై పోయాడు. ఓరోజు ఆయన తనను, తనలాంటి వికలాంగుల్ని గురించి ఏదైనా సూక్తి అవతరింప జేయమని దేవుడ్ని ప్రార్థించారు. అప్పుడు దేవుడు ఖుర్‌ఆన్‌లో ఈ సూక్తి అవతరింపజేశాడు :

"విశ్వాసుల్లో ఏ కారణం లేకుండా ఇంట్లో ఉండిపోయేవారు, దైవమార్గంలో ధన ప్రాణాలు త్యజించి పోరాడేవారు- ఉభయులూ సమానులు కాలేరు. ఇంట్లో ఉండిపోయే వారికన్నా ధనప్రాణాలతో పోరాడేవారికి దేవుడు గొప్ప హోదా, ఔన్నత్యాలు ప్రసాదిస్తాడు. శ్రేయోశుభాలకు సంబంధించిన దైవవాగ్దానం అందరికీ వర్తిస్తుంది. కాని ప్రతిఫలం రీత్యా ఇంట్లో ఉండిపోయేవారి కన్నా దైవమార్గంలో పోరాడేవారికి దేవుడు ఎక్కువ ఔన్నత్యం ప్రసాదిస్తాడు." (4:95)

ఈ సూక్తులు అవతరించిన తరువాత అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) మనసు కొంచెం కుదుటపడింది. అయితే "ప్రతిఫలం రీత్యా ఇంట్లో ఉండిపోయేవారి కన్నా దైవమార్గంలో పోరాడేవారికి దేవుడు ఎక్కువ ఔన్నత్యం ప్రసాదిస్తాడు." అనే సూక్తి భాగం మాత్రం ఆయన్ని ఎలాగైనా జిహాద్‌లో పాల్గొనాలన్న తపనను వీడనివ్వలేదు.

అందువల్ల ఆయన స్వయంగా జిహాద్‌లో తన కర్తవ్యాన్ని నిర్ణయించుకొని "నన్ను రెండు పంక్తుల మధ్య నిలబెట్టి యుద్ధపతాకం నా చేతికివ్వండి. నేను దాన్ని గట్టిగా పట్టుకొని స్థిరంగా నిలబడతాను" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు ఈరానీయులకు వ్యతిరేకంగా ఖాదిసియా యుద్ధంచేసి విజయం సాధించారు. ఆ యుద్ధంలో అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) యుద్ధపతాకం తీసుకొని పాల్గొన్నారు. ముస్లింలకు విజయం లభించినా యుద్ధంలో వేలాదిమంది ముజాహిద్‌లు అమరగతులయ్యారు. వారిలో అబ్దుల్లా బిన్ ఉమ్మెమక్తూమ్ (రజి) కూడా చేరిపోయారు. ఆయన యుద్ధపతాకాన్ని పట్టుకొని రక్తపుమడుగులో పడివున్నదృశ్యం తోటియోధుల హృదయాల్ని కలచివేసింది.

# 38. మజజా ఇబ్నె సౌర్ (రజి)

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనా కాలంలో ఓసారి ఈరాన్‌చక్రవర్తి యజ్దగిర్ద్ పెద్దఎత్తున సైనికసమీకరణ చేస్తున్నట్లు ఖలీఫాకు సమాచారం అందింది. అప్పుడాయన దాన్ని నివారించడానికి వివిధ దిశల్లో, వివిధమార్గాల్లో సైనికదళాలను నియమించమని సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)కు లేఖ రాశారు.

సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఖలీఫా ఆజ్ఞ ప్రకారం ఒక సైనికదళాన్ని 'రామ్‌హర్మిజ్' సమీపంలో కూడా నియమించారు. ఆ సైనికదళాన్ని ఎదుర్కోవడానికి ఈరాన్‌సేనాని హర్ముజాన్ సైన్యం తీసుకొని యుద్ధరంగంలోకి దిగాడు. కాని ముస్లిం యోధులు అతడ్ని తరిమికొట్టి రామ్‌హర్మిజ్‌ను కైవశం చేసుకున్నారు. అప్పుడు హర్ముజాన్ 'తుస్తర్' పట్నానికి పారిపోయి మళ్ళీ సైన్యాన్ని సమీకరించి యుద్ధసన్నాహాలు చేయడం ప్రారంభించాడు.

ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ (రజి) బస్రా సైన్యాలకు అబూమూసా అష్‌అరీ (రజి)ని సేనాపతిగా నియమించి పంపారు. ఆ సందర్భంలో ఆయన బనూబకర్ తెగ నాయకుడు, అరేబియాలో పేరుమోసిన గొప్ప సమరయోధుడయిన మజజా ఇబ్నెసౌర్ (రజి)ని తప్పకుండా వెంట తీసికెళ్ళాలని ఆదేశించారు. అబూమూసా (రజి) బస్రా వెళ్ళి యుద్ధపరంపర ప్రారంభించారు.

ఈరాన్‌లో 'తుస్తర్' ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన అందమైన పట్టణం. ఇక్కడి రక్షణవ్యవస్థ కూడా ఎంతో పటిష్ఠంగా ఉండేది. దుజైల్ నది నుండి ఆ పట్టణానికి, పట్టణం మధ్యలో ఉన్న బ్రహ్మాండమైన ఫౌంటెన్‌కు పటిష్ఠమైన భూగర్భ సొరంగాల ద్వారా నీరు సరఫరా అవుతుంది. పట్టణంచుట్టూ అనేక బురుజులతో కూడిన దుర్భేద్యమైన ప్రహరీగోడ ఉంది. ఆ ప్రహరీగోడ బయట పట్టణంచుట్టూ



ఎంతో లోతైన దాటవీలుకాని కందకం కూడా ఉంది. పట్టణం నలువైపులా వేలసంఖ్యలో కాకాలుతీరిన సైనికులు రేయింబవళ్ళు కాపలా కాస్తుంటారు.

ముస్లింలు బస్రా నుండి తుస్తర్ చేరుకొని, కందకం బయట శిబిరాలు వేసుకొని పట్టణాన్ని దిగ్బంధించారు. ఇరుపక్షాల మధ్య పోరు మొదలయింది. ముస్లింలు తీవ్రంగా ప్రతిఘటించారు. కాని 18నెలలు గడచినా కందకం దాటలేకపోయారు. ఈ సుదీర్ఘ కాలంలో వారు ఈరానీయుల నడుం విరగ్గొట్టినంత పనిచేశారు. ప్రఖ్యాతిగాంచిన వంద మంది వీరాధివీరుల్ని హతమార్చారు.

చివరికి ఈరానీయులు ముస్లింల ధాటికి నిలువలేక కందకం మీది వంతెన దాటి పట్టణంలోకి ప్రవేశించి కోటద్వారాలు మూసుకున్నారు.

అప్పుడు ముస్లింయోధులు ఆ వంతెన దాటి కోటగోడ సమీపానికి చేరుకొని పోరాటం ప్రారంభించారు. ఈరాన్‌సైనికులు కోటబురుజులపై నుంచి ఎర్రగా కాలిన ఇనుప గొలుసులు వ్రేలాడదీసి బాణాల వర్షం కురిపించసాగారు. ముస్లింలలో ఎవరైనా కోట దగ్గరికెళ్ళి గోడ ఎక్కడానికి ప్రయత్నించినప్పుడల్లా ఈరానీయులు అతడ్ని కాలుతున్న ఇనుపగొలుసులతో పైకి లాగేవారు. ఈలోగానే ఆ ముస్లిం ప్రాణం గాలిలో కలసి పోయేది. అయినప్పటికీ ముస్లింలు ముట్టడిని కొనసాగించి పోరాడుతూనే ఉన్నారు.

ఓరోజు యుద్ధవిరామ సమయంలో సేనాపతి అబూమూసా (రజి) శత్రువులకు వ్యతిరేకంగా తమకు సహాయం చేయమని దైవాన్ని ప్రార్థించసాగారు. ఆ సమయంలో కోటబురుజు నుండి ఒక బాణం వచ్చి ఆయన ముందు పడింది. దానికి ఓ కాగితంచుట్ట కట్టబడివుంది. అబూమూసా (రజి) ఆత్రంగా లేచి ఆ కాగితంచుట్ట విప్పదీసి చూశారు. అందులో ఇలా రాయబడిఉంది:

"ముస్లింలారా! నేను మీమీద పూర్తిగా విశ్వాసం ఉంచి నా భార్యాపిల్లలు, బంధుమిత్రుల ధనమానప్రాణాలకు రక్షణహామీ కోరుతున్నాను. దానికి ప్రతిఫలంగా నేను మీకు పట్నంలో ప్రవేశించడానికి ఓ రహస్యమార్గం చూపుతాను."

సేనాపతి హజ్రత్ అబూమూసా (రజి) అది చదివిన తర్వాత మరో కాగితంలో అతనికి రక్షణహామీ రాసి దాన్ని బాణానికి కట్టి కోటగోడ వైపుకు వదిలారు. దాన్ని ఆ ఈరానీ నాయకుడు చదువుకొని ముస్లింలు తమ వాగ్దానాన్ని ఎట్టి పరిస్థితిలో కూడా భంగపరచరన్న గట్టి నమ్మకంతో అర్ధరాత్రివేళ తమవాళ్ళ కంటపడకుండా సేనాపతి దగ్గరికొచ్చి ఇలా అన్నాడు :

"మేము మా జాతినాయకులకు చెందినవాళ్ళము. కాని హర్ముజాన్ మా అన్నను చంపి అతని ఆస్తిపాస్తుల్ని స్వాధీనం చేసుకున్నాడు. అతని భార్యాపిల్లలపై దుర్భర

హింసాకాండ సాగించాడు. హర్ముజాన్ నా విషయంలో కూడా ప్రతీకారవాంఛతో పెట్రేగిపోతున్నాడు. కాబట్టి నేనా దుర్మార్గుడి దౌర్జన్యాలపై మీ న్యాయదృక్పథానికి, వాడి నమ్మక ద్రోహంపై మీ నిజాయితీ-వాగ్దానాలకు అధికప్రాధాన్యత ఇస్తూ మీకొక రహస్య మార్గం చూపదలచుకున్నాను. మీరు నావెంట బుద్ధిశాలి, ధీశాలి, గజఈతగాడయిన ఓ యోధుడ్ని పంపండి. నేనతనికి పట్నంలోకి గొనిపోయే ఆ రహస్యమార్గం చూపిస్తాను.''

సేనాపతి అబూమూసా (రజి) ఈమాట విని హజ్రత్ మజాజా ఇబ్నెసౌర్ (రజి)ని ఆ ఈరానీ నాయకుడి వెంట పంపారు. ఆ ఈరానీమార్గదర్శి ఇబ్నెసౌర్ (రజి)ని అదే రాత్రి కటికచీకటిలో ఓ సొరంగం వైపుకు తీసికెళ్ళాడు. అది నీళ్ళు ప్రవహించే ఎంతో అపాయకరమైన భూగర్భ సొరంగం. అది కొన్నిచోట్ల సన్నగా, మరికొన్నిచోట్ల వెడల్పుగా ఉండి అనేక మలుపులు తిరిగివుంది. ఇద్దరూ ఆ సొరంగం గుండా పట్నంలోకి ప్రవేశించి హర్ముజాన్ నిద్రిస్తున్న చోటుకు చేరుకున్నారు.

హర్ముజాన్‌ని చూడగానే ఇబ్నెసౌర్ (రజి) చేయి అప్రయత్నంగా అంబులపొది మీదికి పోయింది. అయితే సేనాపతి ఆజ్ఞ గుర్తుకు రాగానే ఆయన హర్ముజాన్ని వధించే పని విరమించుకున్నారు. ఆ తరువాత ఆయన సొరంగం గుండా శిబిరానికి చేరుకొని సేనాపతికి నివేదిక సమర్పించారు.

అప్పుడు సేనాపతి అబూమూసా (రజి) అత్యంత ప్రతిభాపరాక్రమాలతో పాటు బాగా ఈత వచ్చిన మూడొందలమంది యోధుల్ని ఎంపికచేసి ఇబ్నెసౌర్ (రజి) నాయకత్వంలో వారిని సొరంగం వైపుకు పంపారు. వారు ఇబ్నెసౌర్ (రజి) సూచనల ప్రకారం పల్చటిదుస్తులు ధరించి, నడుములకు ఖడ్గాలు మాత్రమే కట్టుకున్నారు.

ఇబ్నెసౌర్ (రజి) రాత్రి మూడోజామున చిమ్మచీకటిలో వాళ్ళను తీసుకొని సొరంగంలోకి దిగి ముందుకు సాగారు. దాదాపు రెండుగంటలపాటు ఒకరి వెనుక ఒకరు ఈదుకుంటూ, అనేక వడిదుడుకులకు గాయపడుతూ సొరంగం చివరికి చేరుకున్నారు. కాని బయటికొచ్చి చూసే 80 మంది మాత్రమే సొరంగం నుండి ప్రాణాలతో బయట పడ్డారు. మిగిలిన 220 మంది సొరంగంలో తీవ్రంగా గాయపడి ఊపిరి విడిచారు.

ఇబ్నెసౌర్ (రజి), మిగిలిన ఆయన అనుచరులు పట్టణంలో ప్రవేశించగానే ఖడ్గాలు దూసి కాపలాదారులపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. కొన్ని క్షణాల్లోనే ఆ కాపలాదారులు నేలకొరిగి చలనరహితమైపోయారు. ఆ వెనువెంటనే ముస్లింయోధులు కోట తలుపులు తెరచి ''అల్లాహుఅక్బర్'' అంటూ బిగ్గరగా అరిచారు. కోట ద్వారం బయట కాచుకొనివున్న ముజాహిద్‌లు ప్రవాహంలా లోపలికి దూసుకువచ్చారు.

ఈ అలికిడికి ఈరాన్ సైనికులు దిగ్గునలేచి ఆయుధాలు తీసుకొని పరుగులు పెట్టారు. భయంకర యుద్ధం మొదలయింది. ముస్లింలు ఈరానీయుపై విరుచుకు



పడి ఊచకోతకోయడం ప్రారంభించారు. ఈరాన్‌సైనికుల శవాలు గుట్టలు గుట్టలుగా పడిపోసాగాయి.

ఆ సందర్భంలో ఇబ్నెసౌర్ (రజి) వీరోచితంగా పోరాడుతూ వందమంది శత్రువుల్ని మట్టికరిపించి వారి సేనాపతి హర్ముజాన్ వైపుకు దూసుకుపోయారు. కాని హర్ముజాన్ వేరే వైపుకు వెళ్ళి పోరాడసాగాడు. కాస్సేపటికి ఇబ్నెసౌర్ దృష్టి మళ్ళీ హర్ముజాన్ మీదికి పోయింది. ఈసారి ఆయన సుడిగాలిలా దూసుకుపోయి హర్ముజాన్‌పై మెరుపుదాడి చేశారు. అదే సమయంలో హర్ముజాన్ కూడా ప్రతిదాడి చేశాడు.

అయితే దురదృష్టవశాత్తు ఇబ్నెసౌర్ (రజి) వ్రేటు వృధాపోయి హర్ముజాన్ వ్రేటు ఇబ్నెసౌర్ (రజి) మీద పడింది. దాంతో ఇబ్నెసౌర్ (రజి) కుప్పకూలిపోయి అంతిమశ్వాస విడిచారు. ఈవిధంగా ఇబ్నెసౌర్ (రజి) అమరగతిభాగ్యం పొంది తన చిరకాల వాంఛను నెరవేర్చుకున్నారు.

చివరికి ముస్లింలు ఈరాన్‌సైన్యం నడుం విరగ్గొట్టి తుస్తర్ పట్టణాన్ని వశపరచుకునే తరుణంలో హర్ముజాన్ మళ్ళీ కాళ్ళబేరానికి వచ్చాడు. తనను ఖలీఫా దగ్గరకు తీసికెళ్ళి తన వ్యవహారాన్ని ఆయన నిర్ణయానికి వదిలేస్తే లొంగిపోతానని సేనాపతి అబూమూసా (రజి)కు మనవి చేసుకున్నాడు. దానికి అబూమూసా (రజి) అంగీకరించి కొందరు సైనికుల వెంట హర్ముజాన్‌ని మదీనా పంపివేశారు.

# 39. అబూ తల్హా (రజి)

ఉమ్మెసులైమ్ భర్త మరణానంతరం వితంతువయిందని తెలిసి అబూతల్హా (రజి) ఎంతో సంతోషించారు. ఈ సంతోషానికి కారణం తానామెను చేసుకోవాలన్నదే. ఆమె గుణగణాలు, రూపురేఖలు, హుందాతనం అతడ్ని కట్టిపడేసింది. తాను కూడా తక్కువేమీ కాదు. కుటుంబగౌరవంలో, సిరిసంపదల్లో, విలువిద్యలో, గుర్రపుస్వారీలో ప్రముఖ వ్యక్తిగా ప్రసిద్ధిచెందాడు. కనుక ఉమ్మెసులైం తననే చేసుకుంటుందని అతని ధీమ. ఇలా ఆలోచించి ఓరోజు అబూతల్హా ఆమె ఇంటికెళ్ళి తలుపు తట్టాడు.

ఉమ్మెసులైం (రజి) ఇప్పుడు ముస్లిం వనిత. అయినప్పటికీ ఆమె తలుపు తెరచి అబూతల్హాను లోపలికి ఆహ్వానించింది. అబూతల్హా లోపలికి ప్రవేశించాడు. లోపల ఉమ్మెసులైంతో పాటు ఆమె చిన్నారికొడుకు అనస్ కూడా ఉన్నాడు. అబూతల్హా తన మనసులోని మాట ఆమె ముందు వ్యక్తపరిచాడు. కాని ఆమె తన ఆశలకు భిన్నంగా సమాధానం ఇవ్వడంతో అబూతల్హా ఖంగుతిన్నాడు.

''అబూతల్హా! నేను మీలాంటి వ్యక్తి మాటను కాదనలేను. కాని మీరు ఇస్లాం స్వీకరించనంతవరకు నేను మిమ్మల్ని వివాహమాడలేను'' అన్నారుఉమ్మెసులైం (రజి).

ఇదీ ఆమె నిరాకరణకు అసలు కారణం. కాని ఈ విషయాన్ని అబూతల్హా గ్రహించకుండా "మీ నిరాకరణకు అసలుకారణం అది కాదు" అన్నాడు.

"మరేమిటీ?"

"మహర్ రూపంలో వెండిబంగారాలు, సిరిసంపదలు"

ఉమ్మెసులైం (రజి) ఈమాట విని ఆశ్చర్యపోతూ "అబూతల్హా! నేను దైవసాక్షిగా చెబుతున్నాను వినండి. మీరు గనక ఇస్లాం స్వీకరిస్తే నేను ఎలాంటి సిరిసంపదలు, వెండిబంగారాలు లేకుండానే మిమ్మల్ని వివాహమాడుతాను. నేను మీ నుండి మహర్‌గా ఇస్లాంస్వీకరాన్ని మాత్రమే కోరుతున్నాను" అని అన్నారు.

ఇలా పరస్పర సంప్రదింపుల తరువాత అబూతల్హా ఇస్లాం స్వీకరించడానికి సిద్ధమయ్యాడు. ఉమ్మెసులైం (రజి) చెప్పినట్లు అబూతల్హా సద్వచనం పఠించి ముస్లిం సముదాయంలో చేరిపోయాడు. ఆ తరువాత వారిద్దరి వివాహం జరిగింది.

హజ్రత్ అబూతల్హా (రజి) ఇప్పుడు తన సిరిసంపదల్ని, శక్తిసామర్థ్యాలను ఇస్లాం ధర్మోన్నతి కోసం వినియోగించడం ప్రారంభించారు. ఆయన మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)తో కలసి అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. ఉహద్‌యుద్ధంలో దైవప్రవక్త (స) గాయపడి అతి ప్రమాదకర స్థితిలో పడినప్పుడు కొందరు అనుచరులు మాత్రమే ఆయనకు రక్షణ వలయంగా ఏర్పడి కాపాడగలిగారు. వారిలో హజ్రత్ అబూతల్హా (రజి) కూడా ఉన్నారు.

హజ్రత్ అబూతల్హా (రజి) మదీనాలోని అన్సార్ ముస్లింలలో కెల్లా గొప్ప ధనికులు. ఆయనకు (అనేక) ఖర్జూరపు తోటలు ఉండేవి. వాటిలో 'బైర్హా' అనే తోటంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఈ తోట మస్జిదెనబవీ ముందు భాగాన ఉండేది. దైవప్రవక్త (స) ఆ తోటలోకి తరచుగా వెళ్తుండేవారు. అక్కడ లభించే మంచినీళ్ళు త్రాగేవారు.

ఖుర్‌ఆన్‌లో "మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చుచేయనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు" అనే సూక్తి (3:92) అవతరించినపుడు అబూతల్హా (రజి) లేచి ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! 'మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చుపెట్టనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడు (ఖుర్‌ఆన్‌లో) సెలవిస్తున్నాడు కదా! 'బైర్హా' తోట నాకెంతో ఇష్టమైనది. అంచేత నేనా తోటను దైవమార్గంలో దానం చేస్తున్నాను. దైవం నుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నాను. పరలోకంలో అది నా కోసం గొప్పనిక్షేపంగా తయారవుతుందని నమ్ముతున్నాను. దైవప్రవక్తా! మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉపయోగించండి."



అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. నిజంగా ఇదెంతో లాభదాయకమైన సంపద. నీ మాటలు నేను విన్నాను. అయితే నాదొక సలహా. ఆ తోటను నీ (పేద) బంధువులకు పంచిపెట్టు."

హజ్రత్ అబూతల్హా (రజి) ఈమాట విని "నేను మీఆజ్ఞ శిరసావహిస్తున్నాను" అన్నారు. తర్వాత ఆయన ఆ తోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకులకు, ఇతర బంధువులకు పంచివేశారు. (బుఖారి).

మదీనా పట్టణానికి మూడు వైపుల చిన్నచిన్న కొండలు, ఖర్జూరపు తోటలతో నిండిపోయి సందులేకుండా ఉన్నందున పట్టణం సురక్షితంగా ఉంది. కాని ఒక వైపు మాత్రం ఖాళీగా ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) శత్రువుల్ని ఎదుర్కోవడానికి ఖాళీగా ఉన్న వైపు అగడ్త త్రవ్వడం అవసరమని భావించారు. ఆ తరువాత ఆ ప్రదేశాన్ని పదేసి మంది అనుచరులకు పదిపది గజాల చొప్పున విభజించి ఇచ్చారు. వెంటనే త్రవ్వకం పని మొదలైంది.

హిజ్రీశకం 5వ ఏట శీతాకాలం. రాత్రివేళల్లో విపరీతమైన చలి. పైగా అనేకమంది అనుచరులు తిండిలేక మూడేసి రోజులు పస్తులు కూడా ఉండవలసి వచ్చింది. అలాంటి క్లిష్ట పరిస్థితిలో కూడా వారు ఎంతో నిగ్రహంతో పని చురుగ్గా చేయసాగారు.

కాని అనేకమంది అనుచరులు ఆకలితో నకనకలాడుతున్నారు. కళ్ళు లోపలికి పీక్కుపోయాయి. ఒక అనుచరుడయితే ఆకలితో ఎంతో బాధపడుతూ దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "దైవప్రవక్తా! మూడు రోజుల నుంచి తిండిలేదు. ఆకలికి తాళలేక ఇదిగో పొట్ట మీద రాళ్ళు కట్టుకున్నాను" అంటూ చొక్కా పైకెత్తి కడుపు మీద కట్టుకున్న రెండు రాళ్ళు చూపించాడు.

దైవప్రవక్త (స) అతని పరిస్థితి చూసి ఎంతో జాలిపడ్డారు. కాని ఏం చేయగలరు? స్వయంగా ఆయన కూడా లోలోన ఆకలితో బాధపడుతున్నారు. అందువల్ల అనుచరుని మాటలకు సమాధానంగా ఆయన తన చొక్కా పైకెత్తి చూపారు.

అది చూసిన తరువాత అనుచరుని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. తన ప్రియతమ నాయకుని పొట్టపై మూడు రాళ్ళు కట్టబడి ఉన్నాయి.

ఇలా ఎంతోమంది పస్తులతో ఉండికూడా ఉత్సాహంగా త్రవ్వకం పని చేస్తున్నారు. అయితే అనస్ (రజి) అనే ఓ బాలుడు దైవప్రవక్త (స) ఆకలితో కడుపు మీద కట్టుకున్న రాళ్ళు చూసి చాలా ప్రభావితుడయ్యాడు. అతను వెంటనే కందకం త్రవ్వుతున్న తన తండ్రి అబూతల్హా (రజి) దగ్గరికెళ్ళి తెలియజేశారు. హజ్రత్ అబూతల్హా (రజి) ఈ సంగతి విని చాలా బాధపడ్డారు.

"అయితే బాబూ! నువ్వు వెంటనే దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళి, భోజనం చేయడానికి మా నాన్నగారు పిలుస్తున్నారని చెప్పి ఆయన్ని మనింటికి పిలుచురా. ఆయనతో పాటు మరో ఇద్దరు ముగ్గురు వచ్చినా పరవాలేదు. కాని ఒక విషయం గుర్తుపెట్టుకో. మనింట్లో అన్నం కొద్దిగానే ఉంది. అంచేత నువ్వు దైవప్రవక్త (స) ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రమే ఈ విషయం ఆయనకు తెలియజేసి పిలుచుకురా" అని చెప్పారు హజ్రత్ అబూతల్హా (రజి).

అనస్ (రజి) వెంటనే దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పరుగెత్తారు. కాని అక్కడ దైవప్రవక్త (స) అనేకమంది అనుచరుల మధ్య కూర్చొని ఉన్నారు. అంచేత అనస్ (రజి) వచ్చిన పనేమిటో చెప్పకుండా మౌనంగా నిల్చున్నారు.

అయితే దైవప్రవక్త (స) ఆ అబ్బాయిని చూడగానే "ఏమిటి నిన్ను అబూతల్హా పంపించాడా?" అని అడిగారు.

"అవ్.....ఔనండీ!" అన్నారు అనస్ (రజి) నసుగుతూ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి "సహచరులారా! అబూతల్హా ఇంటికి పదండి. ఆయన మనకు ఈపూట భోజనం ఏర్పాటు చేశాడు" అన్నారు బిగ్గరగా అందరికి వినపడేలా.

దైవప్రవక్త (స) పిలుపు విని దాదాపు ఎనభై మంది అనుచరులు సిద్ధమయ్యారు. దైవప్రవక్త (స) వారందరినీ వెంటబెట్టుకొని అబూతల్హా ఇంటికి బయలుదేరారు.

అనస్ (రజి) ఈ పరిస్థితి చూసి కంగారుపడుతూ ఇంటికి పరుగెత్తారు.

"నాన్నా! నాన్నా!! దైవప్రవక్త (సల్లం) చాలామందిని పిలుచుకొస్తున్నారు" అన్నారు ఆయన రొప్పుతూ, రొజుతూ.

"ఉమ్మెసులైమ్! విన్నావుగా. ఇప్పుడేం చేద్దాం?" అన్నారు అబూతల్హా (రజి).

"కానివ్వండి. దేవుడే మనకు సహాయం చేస్తాడు" అన్నారు హజ్రత్ ఉమ్మెసులైమ్ (రజి) ఏమాత్రం కంగారు పడకుండా.

అంతలో దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని వచ్చారు.

హజ్రత్ అబూతల్హా (రజి) దైవప్రవక్త (సల్లం) చెవి దగ్గరకొచ్చి "దైవప్రవక్తా! ఇంట్లో రెండు రొట్టెలు మాత్రమే ఉన్నాయి" అన్నారు మెల్లిగా.

"మరేం పరవాలేదు. నీవు రొట్టెలతో పాటు నేతిగిన్నె కూడా తెచ్చి నా ముందు పెట్టు" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.



హజ్రత్ అబూతల్హా (రజి) లోపలికెళ్ళి ఒక పాత్రలో రొట్టెలతో పాటు నేతిగిన్నె పెట్టుకొని తీసుకొచ్చారు.

అప్పుడు దైవప్రవక్త (స) నేతిగిన్నెను పైకెత్తి వంచితే అందులోనుంచి రెండు మూడుబొట్లు నెయ్యి రొట్టె మీద పడింది. దాన్ని చూపుడు వ్రేలితో మొత్తం రొట్టె మీద రాశారు. వెంటనే ఆ రొట్టె పైకి ఉబుకుతూ పాత్రఅంచు దాకా వచ్చింది. దాని మీద ఓ గుడ్డ కప్పి "బిస్మిల్లాహి అల్లాహుమ్మ ఆజమ్ ఫీహల్ బర్కత్" అని పఠించారు.

ఆ తరువాత పదేసి మంది చొప్పున అనుచరుల్ని భోంచేయడానికి లోపలికి పిలిచారు. అప్పుడు పదేసి మంది అనుచరులు వచ్చి గుడ్డ క్రింద చేయి దూర్చి ఒక్కొక్క రొట్టె తీసుకొని తినడం ప్రారంభించారు. మొదటి విడత పదిమంది కడుపునిండా తిని వెళ్ళగానే రెండవ విడత పదిమంది వచ్చేవారు.

ఇలా మొత్తం ఎనభైమంది కడుపునిండా తిని లేచారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) కూడా తిన్నారు. అయినా రొట్టెలు ఏమాత్రం తరగకుండా పాత్ర నిండా అలాగే ఉన్నాయి. చివరికి అబూతల్హా (రజి), ఆయన భార్యాపిల్లలు కూడా కడుపునిండా తిన్నారు దైవప్రవక్త (స) ద్వారా బహిర్గతమైన ఈ మహిమను తలచుకుంటూ.

# 40. నయీమ్ బిన్ మస్ఊద్ (రజి)

ముస్లింలు స్వల్పకాలంలో అనేకచోట్ల విజయపతాకాలు ఎగరవేయడంతో యావత్తు అరబ్ తెగలు నీరుగారిపోయాయి. మక్కా ఖురైషీయులకు ముస్లింలతో మళ్ళీ తలపడటానికి ధైర్యం చాలడంలేదు. అయితే కల్లోల స్వభావకులైన యూదులు రంగంలోకి దిగడంతో బహుదైవారాధకులకు ధైర్యం వచ్చింది.

బనూనజీర్‌తెగ యూదులు తమ అలజడుల మూలాన మదీనా నుంచి ఇదివరకే బహిష్కరించబడ్డారు. అప్పుడా తెగవాళ్ళు ఖైబర్‌కు పోయి స్థిరపడ్డారు. అయితే వారు తమకు జరిగిన పరాభవానికి ఉడికిపోతూ పగతీర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. దాని కోసం వారు బహుదైవారాధకుల్ని పావులుగా వాడుకోవడానికి నిర్ణయించుకున్నారు. వారి నేతలు ఖురైష్‌తెగతో పాటు ఇతరతెగల దగ్గరకు పోయి దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా బాగా నూరిపోశారు. దాంతో ఖురైషీయులలో నూతనుత్తేజం ఉప్పొంగింది.

అరబ్ తెగలన్నీ ఏకమై మదీనాపై విరుచుకు పడనున్నాయని దైవప్రవక్త (స)కు సమాచారం అందింది. ఆయన సల్మాన్ ఫార్సీ (రజి) సలహాతో నగరం చుట్టూ కందకం తవ్వించారు. ఖురైష్ సైనికులు కందకం చూసి ఎంతో ఆశ్చర్యపోయి హతాశులయ్యారు. కాని అది ముస్లింలకు అత్యంత క్లిష్టసమయం. శీతాకాలం చలిపులి ఈదురు గాలుల మధ్య భయంకరంగా గాండ్రిస్తోంది. ముస్లింయోధులు ఆకలితో అల్లాడిపోతున్నారు.

మరోవైపు మదీనాలోని బనీఖురైజా యూదులు ముస్లింలతో చేసుకున్న ఒప్పందం ఉల్లంఘించి ఖురైష్ బహుదైవారాధకులతో చేతులు కలిపారు. ఈ వార్త ముస్లిం సైనికుల్లో దావానలంలా వ్యాపించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. యూదుల నమ్మకద్రోహం వల్ల ఖురైషీయులకు దారి సుగమం అయింది. ఈదారి గుండా వారు మదీనాలోకి ఏ క్షణాన్నయినా ప్రవేశించే ప్రమాదం ఉంది.

అలాంటి క్లిష్ట సమయంలో గత్ఫాన్ తెగకు చెందిన నయీమ్ బిన్ మస్వూద్ అనే ఓ ఆసామి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చాడు. ప్రవక్త అనుచరులు ఆశ్చర్యంతో ఆ కొత్తవ్యక్తి వైపు చూడసాగారు.

“దైవప్రవక్తా! అల్లాహ్ దయవల్ల నేను ముస్లిం అయ్యాను. అయితే నేను ఇస్లాం స్వీకరించిన సంగతి ఇంకా ఎవరికీ తెలియదు. అంచేత మీరు తలచుకున్న విధంగా నన్ను ఉపయోగించుకోండి. మీ ఆజ్ఞ శిరసావహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను” అన్నాడతను ఎంతో ఉత్సాహంతో.

“చాలా సంతోషం, నయీమ్! మీరొక్కరే కదా? ఈ పరిస్థితిలో మీకు తోచినట్లు చేసి ఈ ఆపదను దూరం చేయండి. మీరేం చేయాలనుకున్నా దానికి నేను అనుమతి ఇస్తున్నాను” అన్నారు దైవప్రవక్త (స).

నయీమ్ బిన్ మస్వూద్ (రజి) ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గర సెలవు తీసుకొని అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

“అయితే ఇప్పుడు ఎక్కడికెళ్ళాలి? ఏం చెయ్యాలి? శత్రువుల దుష్టయత్నాలను ఎలా వమ్ముచేయాలి? వారిని ఓడించడానికి నావంతు ప్రయత్నం ఏమిటీ? ఎలాంటి పథకం రూపొందించాలి?” ఇలా అనేకవిధాల ఆలోచించారు నయీమ్ బిన్ మస్వూద్. (రజి). చివరికి మెరుపులాంటి ఒక ఉపాయం తట్టింది ఆయనకు. మంచి పథకమే! కళ్ళు మెరిశాయి. వెంటనే ఆయన కార్యాచరణకు ఉపక్రమించి బనూఖురైజా యూదులవాడకు దారితీశారు.

హజ్రత్ నయీమ్ (రజి)కు బనూఖురైజా తెగలో మంచి పలుకుబడి ఉంది. ఆ తెగవాళ్ళు నయీమ్ సహచర్యం లభించడమే గొప్ప భాగ్యమని తలుస్తారు. అందువల్ల ఆయన ఆ వాడలో అడుగు పెట్టగానే బనూఖురైజా పెద్దలు ఎదురెళ్ళి చిరునవ్వుతో స్వాగతమిచ్చారు. అతిథి గృహానికి తీసికెళ్ళి రాచమర్యాదలు చేశారు. యోగక్షేమాలు విచారించి ప్రత్యేక ఆసనం మీద కూర్చోబెట్టారు.

హజ్రత్ నయీమ్ బిన్ మస్వూద్ (రజి) వారి ఆతిథ్యానికి, గౌరవమర్యాదలకు కృతజ్ఞతలు చెప్పారు. ఆ తర్వాత ఆయన దేశ పరిస్థితులు, వ్యాపారవ్యవహారాలను గురించి ఎంతో ఆసక్తికరమైన కబుర్లు చెప్పనారంభించారు. మరికొందరు పెద్దలు,



చిరుపెద్దలు కూడా వచ్చి ఆయన చుట్టూ గుమికూడారు. మాటామంతీ అయ్యాక ఆయన అసలు విషయానికి వచ్చారు.

“మిత్రులారా! ఈ తెగతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు కదా! ప్రత్యేకించి మీ పట్ల నాకున్న ప్రేమాభిమానాలు వేరే చెప్పాలా?” మొదటి బాణం సంధించారు ఆయన.

“ఔనౌను. ఆ విషయం మాకెందుకు తెలియదూ? మీరు మొదటి నుంచీ మాకు మంచి శ్రేయోభిలాషులే” ముక్తకంఠంతో అన్నారు యూదనాయకులంతా.

“మీరు ముహమ్మద్(స)తో చేసుకున్న స్నేహఒప్పందం భంగపరచి ఖురైష్, గత్ఫాన్ తెగలతో చేతులు కలిపారని విన్నాను. కాని ఆ తెగలవాళ్ళు సుదీర్ఘ ముట్టడితో బాగా అలసిపోయినట్లు కన్పిస్తున్నారు. మనం గెలిస్తే అంతకన్నా అదృష్టం మరొకటి ఉండదు. కాని దురదృష్టవశాత్తు ఓడిపోతే? అప్పుడేం చేస్తారు? ఖురైషీయులు మాత్రం చల్లగా జారుకుంటారు. మీరు ఒంటరిగా మిగిలిపోతారు. చివరికి మీరొక్కరే ముస్లింలను ఎదుర్కోవలసి ఉంటుంది. అప్పుడు మీరు ఘోర ప్రమాదంలో పడిపోతారు. ఇదివరకు బనూఖైనుఖా, బనూనజీర్ తెగలకు పట్టిన గతి మీకు తెలుసు. అంచేత బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి” రెండవ బాణం సంధించారు హజ్రత్ నయీమ్ (రజి).

“అయితే ఇప్పుడేం చెయ్యమంటారు? మీరే ఏదైనా ఉపాయం చెప్పండి” అన్నారు యూద నాయకులు ఆదుర్దాగా.

“ఇప్పుడీ ప్రమాదం నుండి బయటపడటానికి ఒకేఒక మార్గం ఉంది. మొదట వారి మనుషులు కొందరిని మీదగ్గర తాకట్టు పెట్టమనండి. తర్వాత వారితో చేరిపోండి. ఆ మనుషులు ప్రముఖవ్యక్తులై ఉండాలి. ఇలా అయితే మీకూ తృప్తి ఉంటుంది. వారు కూడా ముహమ్మద్‌ని చంపేవరకు వెనక్కి తిరిగిపోయే మాటెత్తరు.”

నయీమ్ (రజి) ఇచ్చిన సలహా విని అందరూ సంతోషం వెలిబుచ్చారు.

“చాలా బాగుంది మీ అభిప్రాయం. మీ సలహా తప్పకుండా పాటిస్తాం” అన్నారు అందరూ సంతోషం వెలిబుచ్చుతూ.

“మరి నే వెళ్తాస్తా. జాగ్రత్త, ఈ విషయం ఎవరికీ తెలియకూడదు సుమా!”

“అబ్బే! ఆమాత్రం మాకు తెలియదటండీ? అదంతా మేము చూసుకుంటాంగా. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి” అన్నారు యూదులు నయీమ్ బిన్ మస్వూద్ (రజి)ని సాగనంపుతూ.

“నిజంగా నయీమ్ ఎంత మంచివాడు! మన యోగక్షేమాలంటే ఈయనకు ఎంత శ్రద్ధ! మన కోసం పనికట్టుకొని మరీ ఇంతదూరం వచ్చాడు! ఎంత ప్రేమ!

ఎంత అభిమానం!!'' మరి కొందరు తెగ పొగుడుతూ నయీమ్ (రజి)ని వాడ వెలుపల దాకా సాగనంపి వచ్చారు.

హ్రజత్ నయీమ్ (రజి) లోలోన సంతోషిస్తూ ఖురైష్ నాయకుడు అబూసుఫ్యాన్ దగ్గరకి వెళ్ళారు. అక్కడ అబూసుఫ్యాన్‌తో పాటు మరికొందరు నాయకులు కూడా ఉన్నారు. నయీమ్ (రజి)ని చూడగానే వారంతా సాదరంగా ఆహ్వానించారు. కుశల ప్రశ్నలయ్యాక హ్రజత్ నయీమ్ (రజి) విషయాన్ని మెల్లగా బయటపెట్టారు.

"సోదరులారా! మీపట్ల నాకున్న ప్రేమాభిమానాలు గురించి ప్రత్యేకించి చెప్ప నవసరం లేదనుకుంటాను'' అన్నారు ఆయన.

"అరెరె ఎంతమాట! మీరు మా శ్రేయోభిలాషులన్న సంగతి మాకు తెలియద టండీ!'' అన్నారు అబూసుఫ్యాన్‌తో సహా కొందరు ఉన్నతాధికారులు.

"ఈమధ్యనే నాకో సంగతి తెలిసింది. అది కాస్తా మీ చెవిన పడేస్తే మీ శ్రేయోభి లాషిగా నా బాధ్యత తీర్చుకున్నట్లవుతుందని వచ్చాను'' అన్నారు నయీమ్ (రజి).

"అలాగా! ఏమిటా సంగతి?'' అడిగారు అంతా ఒక్కసారిగా ఆత్రంతో.

"బనూఖురైజా తెగవాళ్ళు ముహమ్మద్ (సల్లం)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగంచేసి పశ్చాత్తాపం చెందుతున్నారని విన్నాను'' చెప్పారు హ్రజత్ నయీమ్ (రజి).

"నిజమా!?'' అన్నారు ఖురైషీయులు నిర్ఘాంతపోయి చూస్తూ.

"కాని వారంతటితో ఊరుకోలేదు. ముహమ్మద్ (స) తమతో పాత ఒప్పందానికి మళ్ళీ ఇష్టపడితే ఖురైష్, గత్ఫాన్ తెగలకు చెందిన కొందరు మనుషుల్ని అప్పగిస్తాం అని, ఆయన వారిని వధించి పగ తీర్చుకోవచ్చని ఆయన దగ్గరికి రాజీధోరణి విజ్ఞప్తిని కూడా పంపుకున్నారట. ఆ మనుషులు కూడా సాధారణ మనుషులు కాదట! ప్రముఖ వ్యక్తుల్ని అప్పగిస్తారట!!'' అన్నారు హ్రజత్ నయీమ్ (రజి) ఆఖరి బాణం సంధిస్తూ.

"ఎంత దుర్మార్గులు! ఎంత నమ్మక ద్రోహులు!!'' కోపంతో చిందులు తొక్కారు ఖురైష్ నాయకులు.

"సోదరులారా! విన్నారు కదా? జాగ్రత్త! మీ శ్రేయస్సు కోరి చెబుతున్నాను. వారెన్ని సాకులు చెప్పినా మీరు మాత్రం వారికి మీ మనుషుల్ని అప్పగించకండి. మరచి కూడా అలా చేయకూడదు సుమా!!'' అన్నారు హ్రజత్ నయీమ్ (రజి).

"ఇంకా ఆ దుర్మార్గుల దగ్గరికి మా మనుషుల్ని పంపిస్తామా? నిజంగా మీరు మా శ్రేయోభిలాషులు. మీరే గనక ఈ క్లిష్ట సమయంలో మాకీ వార్త తెలియజేసి ఆదుకోకపోతే మేమెంతో ప్రమాదంలో పడిపోయేవాళ్ళం'' ఖురైషీయుల్లో కృతజ్ఞతా భావం తొంగిచూసింది.



నయీమ్ (రజి) అక్కడ్నుంచి బయలుదేరి గత్ఫాన్ తెగవాళ్ళ దగ్గరికి వెళ్ళారు. ఖురైషీయుల దగ్గర ఏ మాటలైతే చెప్పారో ఇక్కడ కూడా ఆయన అవే మాటలు చెప్పారు. ఈ మాటలు విని గత్ఫాన్ తెగ నాయకులు కూడా యూదుల్ని అసహ్యించుకొని తరువాత నయీమ్ (రజి)ని తమ శ్రేయోభిలాషిగా భావించి శ్లాఘించారు.

ఆ తరువాత హ్రజత్ నయీమ్ (రజి) విజయోత్సాహంతో దైవప్రవక్త (స) సన్నిధికి తిరిగొచ్చారు. తాను చేసివచ్చిన పని గురించి ఆయనకు నివేదిక సమర్పించారు.

హ్రజత్ నయీమ్ (రజి) మాటలకు అటు ఖురైష్ నాయకులు, ఇటు గత్ఫాన్ నాయకులు ఉభయులూ భయపడ్డారు. తక్షణమే ఉభయతెగల నాయకులు సమావేశమయి చర్చలు ప్రారంభించారు.

"ఏమిటీ వింత? మనం ఆశించిందేమిటి, జరిగిందేమిటి? ఇప్పుడే చెయ్యాలి?''

ఖురైష్-తెగల నాయకులు తీవ్రంగా ఆలోచించారు. అందరూ తమతమ అభిప్రాయాలు తెలిపారు. చివరికి రెండుతెగల నాయకులు ఓ నిర్ణయానికి వచ్చారు. వెంటనే ఉభయ తెగలవాళ్ళు తమ నాయకులు కొందర్ని చర్చల కోసం బనూఖురైజా యూదుల దగ్గరికి పంపించారు.

ఈ ఉమ్మడి ప్రతినిధి వర్గం బనూఖురైజా తెగ దగ్గరికి పోయింది. వాళ్ళను చూసి బనూఖురైజా యూదులు ఇదివరకంతటి ఉత్సాహం చూపలేదు.

ఖురైష్-గత్ఫాన్ ప్రతినిధివర్గం సభ్యులు యూదులు తలపెట్టిన విశ్వాసఘాతుకానికి లోలోన కుతకుతలాడి పోతున్నారు.

"సోదరులారా! మేమిక్కడికి వచ్చి చాలా రోజులయింది. ఇంకా ఎక్కువ రోజులు ఉండటం చాలా కష్టం. ఈ సుదీర్ఘముట్టడితో మేము ఇప్పటికే చాలా విసిగిపోయాం. అంచేత ఇప్పుడు ఏదోఒకటి నిర్ణయం జరగాలి. వీలైనంత త్వరగా మీరు వచ్చి మాతో చేరండి. మనమంతా కలిసి ఒకేసారి పెద్దపెట్టున ముస్లింల మీద దాడిచేద్దాం'' అన్నారు వారు యూదనాయకులతో.

'రేపు శనివారం కదా! శనివారం రోజు మేము యుద్ధం చేయలేము. మరో రోజు పెట్టుకుందాం. కాని ఒక విషయం. ఒకవేళ ముహమ్మద్ గెలిచేలా ఉంటే మాత్రం మీరు మమ్మల్ని విడనాడి పోమని హామీనివ్వాలి. దాని కోసం మాకు నమ్మకం కలగడా నికి మీ మనుషులు కొందరిని మాదగ్గర తాకట్టుపెట్టండి. ఆ తరువాతే మేము మీతో సహకరించ గలం'' అన్నారు యూదులు.

ఈ మాట వినగానే ఖురైష్, గత్ఫాన్ తెగవాళ్ళు నయీమ్ చెప్పిన మాటల్లో ఎలాంటి సందేహం లేదని భావించారు. బనూఖురైజా యూదులు నిజంగా ఏదో మోసం తల

పెట్టారని అనుమానిస్తూ “ అసాధ్యం. మీ దగ్గరికి మా వాళ్ళను పంపే ప్రసక్తేలేదు” అన్నారు వారు ముఖం చిట్లిస్తూ.

వారి మాటలు విని బనూఖురైజా యూదులు కూడా నయీమ్ చెప్పింది ముమ్మాటికి నిజమే అనుకున్నారు. “అయితే మేము మీతో సహకరించే ప్రసక్తి లేదు” అన్నారు వారు ప్రతినిధివర్గంతో.

ప్రతినిధివర్గం మారు మాట్లాడకుండా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఈవిధంగా హజ్రత్ నయీమ్ (రజి) పన్నిన యుద్ధతంత్రం ఫలించి శత్రువుల ఐక్యసంఘటన నిట్టనిలువుగా చీలిపోయింది.

ఈ సమాచారం ముస్లిం శిబిరంలో వెలుగు రవ్వలు వెదజల్లింది. నిరాశా నిస్పృహలు పటాపంచలై పోయాయి. వాడిన ముఖాలన్నీ ఒక్కసారిగా వికసించాయి. మరునాడు దైవకారుణ్యం ధారాపాతంగా వర్షించింది....చూస్తుండగానే నీలాంబరంలో మిలమిల మెరిసే నక్షత్రాలు చకచకా అంతర్థానమయ్యాయి.

ఆ తరువాత వెంటనే నలువైపుల నుంచి దట్టమైన కారుమేఘాలు గబగబా కమ్ముకున్నాయి. చల్లటి ఈదురుగాలి కూడా ప్రారంభమయింది. యుద్ధ మైదానమంతా అంధకారమయమైంది. ఆ వెనువెంటనే ఉరుములు, మెరుపులతో వాతావరణం భయానకంగా మారింది. ఈదురుగాలి ఉధృతమైంది. కొన్ని క్షణాల్లోనే అది పెను తుఫానుగా పరిణమించింది.

కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటిలో హఠాత్తుగా దాడిచేసిన ఈ తుఫాను ఎవరికి ఎలాంటి ముప్పు తెచ్చిపెడ్తుందో! వందల మైళ్ళ వేగంతో వీస్తున్న ఈదురుగాలుల హోరుతో మదీనా కొండలు మార్మోగుతున్నాయి. ఖర్జూరపు చెట్లు కూకటివేళ్ళతో సహా లేచి గాలిలో ఎగురుతున్నాయి.

శరవేగంతో వీస్తున్న గాలిహోరుకు కందకం ఆవల ఉన్న శత్రుసైనికులు భయపడి అరుపులు, కేకలు పెడ్తున్నారు. వారు వేసుకున్న గుడారాలు తుఫానుతాకిడికి గాలిపటాల్లా ఎగిరిపోతున్నాయి. సామగ్రి చెల్లాచెదరయి పోయింది. కుంపట్ల మీదున్న పెద్ద పెద్ద వంటపాత్రలు సైతం ఎగిరి తలక్రిందయి పడిపోయాయి.

తుఫాను క్షణక్షణానికి ఉధృతం కాసాగింది. విపరీతమైన చలితో వీస్తున్న గాలికి సైనికులు గజగజ వణికిపోతున్నారు. నాయకుల వ్యూహం తారుమారయింది. సైనిక వ్యవస్థ అస్తవ్యస్త మయింది. సైనికులు ఆత్మరక్షణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. రానున్న ప్రమాదం మనసులో మెదలగానే వారి గుండెలు దడదడలాడసాగాయి.

అంతా గాఢాంధకారం. కళ్ళు చెదరగొట్టే మెరుపులు. చెవులు చిల్లులు పడే ఉరుములు. గజగజ వణికిస్తున్న ఉధృతమైన చలిగాలి. దేహాలకు తూట్లువేసే ఇసుక



రేణువులు. ప్రకృతి విలయతాండవం చేస్తోంది. మరణరక్కసి తరుముకుంటూ వస్తోంది. సైనికులు భయంతో పెడబొబ్బలు పెడ్తున్నారు. “అమ్మో! మాప్రాణాలు పోతున్నాయి. సర్వనాశనమౌతోంది!!”

సైన్యాధ్యక్షుడు అబూసుఫ్యాన్ పరిస్థితి విషమించిందని గ్రహించాడు. ఈ ప్రకృతి బీభత్సంలో ముస్లింలతో పోరి గెలవలేమనుకున్నాడు. ఇక ఇక్కడ మరికొన్ని రోజులుంటే తనకూ, తనసైన్యానికి సర్వనాశనం తప్పదని భావించాడు.

“ఖురైష్ సోదరులారా! ఇక మనమీ ప్రదేశంలో ఒక్కక్షణం కూడా ఉండలేం. చూడండి ప్రకృతి ఎలా భీకరరూపం దాల్చిందో! గాలికి గుడారాలు ఎగిరిపోతున్నాయి. పశువులు అల్లాడి పోతున్నాయి. పదండి, ప్రమాదం శరవేగంతో ముంచుకొస్తోంది. ఇదిగో చూడండి, నేను వెళ్తున్నాను” అంటూ అబూసుఫ్యాన్ ఓగుట్ట మీద నుంచి పొలికేకలు పెట్టాడు.

తరువాత అతను గుర్రంపై ఎగిరి కూర్చొని బతికుంటే బలుసాకైనా తినొచ్చని భావిస్తూ దౌడుతీయించాడు.

సేనాపతే యుద్ధరంగం వదలిపోతే ఇక సైనికులు అక్కడ ఉండగలరా! వారు కూడా ఆ చీకటిలోనే, ఆ తుఫానులోనే చేతికందిన సామాను తీసుకొని మూటాముల్లెలు సర్దుకున్నారు. ఉధృతంగా వీస్తున్న గాలితాకిడికి తడబడు తున్న కాళ్ళతోనే వడివడిగా నడుస్తూ, కటిక చీకటిలో కళ్ళుచించుకొని తచ్చాడుతూనే బ్రతుకుజీవుడా అంటూ మక్కా దారిపట్టారు.

ఖురైష్ సైనికుల్ని చూసి వారి మిత్రపక్షమయిన గత్ఫాన్‌తెగ సైనికులు కూడా గత్యంతరం లేక గబగబా కాలికి బుద్ధిచెప్పారు.

తుఫానుఉధృతం క్రమంగా తగ్గిపోయింది. మేఘాలు మెల్లగా విడిపోయాయి. ప్రకృతి శాంతించింది. కాస్సేపటికి వాతావరణం యథాస్థితికి వచ్చింది. తూర్పు దిగ్మండలం నల్లచీర వదిలేసి తెల్లచీర కట్టుకుంది. ఆ తరువాత కాస్సేపటికి సహస్రకోటి కిరణాలతో ఉదయభానుడు ముసిముసి నవ్వులతో మేల్కొన్నాడు.

ప్రభాత సమయం ప్రార్థన ముగించుకున్న ముస్లిం యోధులు కందకం కట్ట మీదికి వచ్చి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు. కందకం ఆవల యుద్ధమైదానం నిర్మానుష్యంగా పడివుంది. శత్రుశేషం మచ్చుకైనా కన్పించలేదు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆ నిర్జన ప్రదేశం చూసి “ఇప్పుడిక ఖురైషీయులు మీ మీద ఎన్నటికీ దాడిచేయడానికి రాలేరు. మీరే వారిపై దాడిచేయడానికి వెళ్తారు” అన్నారు గంభీరవదనంతో.

# 41. సాద్ బిన్ ముఆజ్ (రజి)

దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం హజ్రత్ ముస్అబ్ బిన్ఉమైర్ (రజి) మదీనా చేరుకొని హజ్రత్ అసద్బిన్ జురారా (రజి) ఇంట్లో విడిదిచేశారు. ఆ ఇంటినే ప్రచార కేంద్రంగా చేసుకొని పని ప్రారంభించారు. దాంతో మదీనాలో ఇస్లాం వేగంగా విస్తరించ సాగింది. ఎంతోకాలంనుంచి సత్యపిపాసతో అలమటిస్తున్న మదీనావారికి ఇస్లాం శాంతి ప్రసాదించింది. ఇస్లాం శుభాలు చూడగానే, ఖుర్ఆన్ సూక్తులు వినగానే పాషాణ హృదయాలు సైతం మైనంలా కరిగిపోసాగాయి.

ఔస్తెగలో బనీఅబ్దుల్ అష్హల్, బనీజఫర్ అనే రెండు ఉప తెగలున్నాయి. ఇవి మిగతా ఉపతెగలన్నిటిలో ఎంతో శక్తిమంతమైనవి. సాద్ బిన్ ముఆజ్ బనీఅబ్దుల్ అష్హల్ ఉపతెగ నాయకుడేగాక, ఔస్తెగలోని ఉపతెగలన్నిటికీ అగ్రనాయకుడిగా ఉన్నాడు. ఉసైద్ బిన్ హుజైర్ జఫర్తెగకు నాయకుడిగా ఉన్నాడు.

ఓరోజు ముస్అబ్ బిన్ ఉమైర్, అసద్ బిన్ జురారా (రజి)లు బనీ అబ్దుల్అష్హల్ వాడలోని ఒక బావి దగ్గర కూర్చొని మాట్లాడుకోసాగారు. సాద్ బిన్ ముఆజ్కు వారిద్దరు అలా తమ వాడలోకి వచ్చి తమ మతసంస్కృతికి వ్యతిరేకంగా ఇస్లాంప్రచారం చేయడం ఏమాత్రం నచ్చలేదు. అంచేత ఆయన ఉసైద్ బిన్ హుజైర్ని పిలిచి ఇలా చెప్పాడు:

"అసద్ నా పినతల్లి కొడుకయినందున నేను గట్టిగా చెప్పి ఆ కొత్తమత ప్రచారాన్ని మాన్పించలేను. వీళ్ళు మనప్రజల్ని పెడదారి పట్టించి మతభ్రష్టులుగా చేయడానికి వస్తున్నారు. అంచేత నువ్వెళ్ళి నాలుగ చీవాట్లు పెట్టి ఇకముందు ఎప్పుడూ మన వాడలోకి రావద్దని వాళ్ళకు గట్టిగా చెప్పు."

ఉసైద్ బిన్ హుజైర్ వెంటనే కరవాలం తీసుకొని బయలుదేరాడు. అసద్ (రజి), ముస్అబ్ (రజి)ల దగ్గరకు వెళ్ళి వారిని నానా మాటలు అని బెదిరించాడు.

"అయ్యా! మీరు ఆవేశంలో ఉండి అసలు విషయాన్ని విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం! ఏమిటా అసలు విషయం?" అన్నాడు ఉసైద్.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను. రెండుమూడు మాటలు వింటే మీకొచ్చే నష్టమేమీ లేదు. ఆ తరువాత మీ ఇష్టం, ఏదైనా చేసుకోవచ్చు."

"సరే చెప్పండి వింటాను" అంటూ ఉసైద్ వాళ్ళిద్దరికి ఎదురుగా కూర్చున్నాడు.

అప్పుడు ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ఇస్లాం వాస్తవికతను కాస్త వివరించి ఖుర్ఆన్ నుంచి కొన్ని సూక్తులు పఠించి విన్పించారు. అంతే ఖుర్ఆన్ సూక్తులు వినగానే ఉసైద్ ఎంతో ప్రభావితుడయి అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.



"ఇంకొక మనిషి ఉన్నాడు. అతను కూడా ముస్లిం అయిపోతే ఇక మదీనాలో మిమ్మల్ని వ్యతిరేకించేవారే ఉండరు. నేనెళ్ళి అతడ్ని పంపిస్తాను ఉండండి" అని చెప్పి ఉసైద్ (రజి) అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

"ఆ.. ఏమైంది పోయిన పని? గట్టిగా చెప్పావా?" అడిగాడు సాద్ అతడ్ని.

"చెప్పాను. ముఖం వాచేలా చీవాట్లుపెట్టి మరీ చెప్పాను. మన అభిమతానికి వ్యతిరేకంగా ఎలాంటి పనీ చేయమని వారిద్దరు వాగ్దానం కూడా చేశారు. కాని అంతలో అక్కడ ఓ ప్రమాదం వచ్చిపడింది" అన్నారు ఉసైద్ బిన్ హుజైర్ (రజి).

"ప్రమాదమా! ఏమిటా ప్రమాదం?"

"బనీహారిస్ తెగకు చెందిన కొందరు యువకులు అసద్ బిన్ జురారాను చంప జూస్తున్నారు" అన్నారు ఉసైద్ (రజి).

ఈ సంగతి వినగానే సాద్ ఖడ్గం తీసుకొని పరుగెత్తాడు. తీరా అక్కడకెళ్ళి చూస్తే ముస్అబ్ , అసద్ (రజి)లు ఆ బావిదగ్గరే కూర్చొని హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఉసైద్ తనను మోసగించి ఇక్కడకు పంపించాడని సాద్ బిన్ ముఆజ్ వెంటనే గ్రహించాడు. ఈ ఆలోచన రాగానే కోపోద్రేకాలతో ఊగిపోతూ ముస్అబ్, అసద్ (రజి)లను శాపనార్థాలు పెట్టడం మొదలెట్టాడు.

"అయ్యా! మీరు ఆవేశంలో పడి అసలు విషయం విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం ఏమిటీ?" అడిగాడు సాద్ బిన్ ముఆజ్ కొంచెం మెత్తబడి.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను" అన్నారు ముస్అబ్ (రజి).

"సరే, చెప్పండి" అంటూ సాద్ కూర్చున్నాడు.

అప్పుడు హజ్రత్ ముస్అబ్ (రజి) ఇస్లాం గురించి ఉసైద్ (రజి)కు చెప్పినట్లే సాద్కు కూడా చెప్పి ఇస్లాం వైపు ఆహ్వానించారు. సాద్ కూడా ఏమాత్రం తటపటా యించకుండా అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

ఆ తరువాత హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) తన తెగవాళ్ళందరినీ సమావేశపరచి "మీరు నన్ను ఎలాంటివాణ్ణని భావిస్తున్నారు?" అని అడిగారు.

"మీరు మా నాయకులు, విజ్ఞతావివేచనలు కలవారు. మీరిచ్చే ప్రతి సలహా ఆచరణ యోగ్యంగా ఉంటుంది" అన్నారు ప్రజలంతా ముక్తకంఠంతో.

"అయితే వినండి. నేను ముస్లింఅయ్యాను. మీరందరు కూడా ముస్లింలు కానంత వరకు ఇకముందు మీతో నాకెలాంటి సంబంధం ఉండదు" అన్నారు సాద్ (రజి).

నాయకుని మాటలు వినగానే జనమంతా అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించారు.

హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) దైవప్రవక్త (స)తో కలసి బదర్, ఉహద్ యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆ తరువాత కందకం యుద్ధంలో కూడా పాల్గొని శత్రువులతో పోరాడారు. ఆ యుద్ధంలో ఆయన విల్లు ఎక్కుపెట్టి బాణాలు కురిపిస్తున్నారు. కాస్సేపటికి కందకం ఆవల ఒక శత్రువు మాటుకాచి సాద్ (రజి) వైపు గురిపెట్టి బాణం వదిలాడు. దాంతో సాద్ (రజి) తీవ్రంగా గాయపడ్డారు. బాధతో మెలికలు తిరుగుతూ అక్కడ్నుంచి పక్కకు తప్పుకున్నారు.

కారుతున్న రక్తధారలతో అప్రయత్నంగా చేతులు జోడించి పైకెత్తారు. సకల చరాచరాల సృష్టికర్త, పరమ కృపాశీలుడయిన విశ్వప్రభువు ముందు అంతరంగం నుండి పొంగిన ఆవేదనా తరంగిణి జాలువారింది....

"నా దైవమా! ఖురైషీయులతో ఇంకా యుద్ధం కొనసాగించవలసి ఉంటే నన్నింకా సజీవంగా ఉంచు. ఏ జాతి జనం నీ ప్రవక్తను తిరస్కరించి దేశబహిష్కరణ చేశారో అలాంటివారితో తప్ప నాకు మరొకరితో యుద్ధం చేయాలన్న కోరిక లేదు. అయితే ఖురైషీయులతో ఇప్పుడు యుద్ధం ముగిసిపోతే, అది జరగకపోతే నాకు ఈ గాయంతోనే అమరగతి భాగ్యం ప్రసాదించు. అలా కాకపోతే బనూఖురైజా తెగ వల్ల నానేత్రాలు చల్ల బడనంతవరకూ నాకు చావునివ్వకు."

బనూఖురైజా యూదులు ముస్లిములతో చేసుకున్న స్నేహఒప్పందం భంగం చేసి ఉండకపోతే ముస్లిం ముజాహిద్‌లకు ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎదురయ్యేది కాదు. యూదులు కనీసం ఖురైష్ సైనికులతో చేతులు కలపకపోయినా పరిస్థితి ఇంత దారుణంగా విషమించేది కాదు. అయినప్పటికీ దేవుని దయ వల్ల ముస్లింలు ఈ యుద్ధంలో క్లిష్ట పరిస్థితులన్నిటినీ అధికమించి విజయం సాధించారు.

దైవప్రవక్త (స) యుద్ధరంగం నుండి మధ్యాహ్నం వేళకు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ప్రవేశించి ఆయుధాలు తీసివేశారు. సరిగ్గా అదే సమయంలో దైవదూత జిబ్రీల్ (అలైహి) ప్రత్యక్షమై "ఏమిటీ, మీరు అప్పుడే ఆయుధాలు దించారా! మేము మటుకు ఇంకా ఆయుధాలు దించలేదు" అన్నారు.

"మరే వ్యవహారమైనా మిగిలి ఉందా?" అడిగారు దైవప్రవక్త (స) ఆశ్చర్యంగా.

"ఆ... బనూఖురైజా వ్యవహారం మిగిలిఉంది. వీళ్ళను కూడా ఇప్పుడే అణచి వేయాలి" అన్నారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

ఈ ఆజ్ఞ వినగానే దైవప్రవక్త (స) ఒక ఉత్తర్వు జారీచేశారు. "దైవధర్మంలో స్థిరంగా ఉన్న ముస్లిం యోధులంతా బనీఖురైజా వాడకు చేరుకోనంత వరకు ఈరోజు అసర్ నమాజ్ చేయకూడదు" అని ప్రకటన గావించారు. ఆ తరువాత ఆయన హజ్రత్ అలీ (రజి)కి ఒక చిన్న సైనిక దళాన్నిచ్చి పంపారు.



ఈ సైనికదళం యూదులవాడ సమీపానికి చేరుకుంది. దాన్ని చూడగానే యూదులు కోటగోడలు ఎక్కి, తమను బెదిరించడానికి మాత్రమే ఈ చిన్నదళం వస్తోందని తలచి, దైవప్రవక్త (సల్లం)ను, ముస్లింలను నానా దుర్భాషలాడటం మొదలెట్టారు.

ఆ తరువాత కాస్సేపటికే దైవప్రవక్త (సల్లం) సారథ్యంలో భారీ సైన్యం రావడంతో వారిగుండెలు గుభేలుమన్నాయి. వెంటనే వారు కోటద్వారాలు మూసుకొని, దుర్భేద్యమైన ఈ కోటలే తమను కాపాడుతాయని భావించారు.

ఈ యూదులు అతిక్లిష్ట పరిస్థితుల్లో స్నేహఒప్పందానికి తిలోదకాలిచ్చి, మదీనాపై దాడిచేయడానికి వచ్చిన విదేశీశక్తులతో చేతులు కలిపారు. దైవప్రవక్త (సల్లం)ను, ఆయన అనుచరులను శాశ్వతంగా అంతమొందించడానికి కుట్రలు పన్నారు. అలాంటి విశ్వాస ఘాతకులు, దేశద్రోహులను వదలిపెట్టకూడదని భావించారు ముస్లింలు. అందువల్ల వారు కోటను ముట్టడించి యుద్ధం ప్రారంభించారు.

యూదులు కోటబురుజుల నుండి ముస్లింలను ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. కాని బయట నుంచి ముస్లింలు విడుస్తున్న బాణాల ధాటికి నిలువలేక ఆ ప్రయత్నం విరమించుకొని కోట లోపల దూరి కూర్చున్నారు. ముస్లింలు కూడా మొండికేసి అక్కడే రోజుల తరబడి యూదుల కోసం కాచుకొని కూర్చున్నారు.

ఇలా ముట్టడి మూడువారాలు కొనసాగింది. ఆవిధంగా యూదులు ఎన్ని రోజులని కలుగులో ఎలుకల్లా కోటలోనే పడిఉంటారు? అదీగాక వారు నిల్వచేసుకున్న ఆహారపదార్థాలు కూడా అయిపోవచ్చాయి. ఇంకా కొన్ని రోజులు కోటలోనే ఉంటే వారు మలమల మాడి చస్తారు. పోనీ కోట బయటికి వద్దామంటే ముస్లింయోధులు ఆకలిగొన్న బెబ్బులుల్లా గాండ్రిస్తూ కోట గుమ్మం దగ్గరే మాటువేసి కూర్చున్నారు. ఇప్పుడు దారేమిటీ?

యూదులు బెంబేలు పడిపోయారు. నాయకులంతా సమావేశమై ప్రత్యామ్నాయ మార్గం కోసం తీవ్రంగా సమాలోచనలు జరిపారు. "మనం ముహమ్మద్‌తో చేసుకున్న ఒడంబడికను భంగంచేసి పెద్దపొరపాటు చేశాం. పరిస్థితి చేజారిపోయింది. ఇప్పుడు మన ముందు ఒకేఒక మార్గం ఉంది. మనమంతా ఇస్లాం స్వీకరించి ముహమ్మద్‌కు లొంగిపోదాం. ఇలా చేస్తే మన ధనమానప్రాణాలకు ముప్పు రాదు. ముస్లింలతో కలసి మెలసి ప్రశాంతజీవితం గడపవచ్చు" అన్నాడు వారి అగ్రనాయకుడు కాబ్.

ఈ ప్రతిపాదన వినగానే యూదుల్లో పెద్ద కలకలం బయలుదేరింది.

"వీల్లేదు. వీల్లేదు. ముహమ్మద్‌కు లొంగిపోవడంకన్నా మనకు వేరే అవమానం లేదు. తౌరాత్ గ్రంథాన్ని మేము ఎన్నటికీ విడనాడము. ప్రాణాన్నయినా వదులుకుంటాం గాని, తౌరాత్‌ని వదలడం మావల్ల కాదు" తీవ్రంగా నిరాకరించారు అందరూ.

"అయితే మరోపని చేద్దాం. మనం మన భార్యాపిల్లల్ని హతమార్చుదాం. ఖడ్గాలు ధరించి బయటికి వెళ్దాం. ప్రాణాలకు తెగించి ముస్లింలతో పోరాడుదాం. ఒకవేళ మన మంతా వధించబడితే మన కోసం ఏడ్చేవారెవరూ ఉండరు. గెలిస్తే వేరే స్త్రీలను పెళ్ళి చేసుకుందాం. కొన్నాళ్ళలో మళ్ళీ సంతానం కలుగుతుంది" అన్నాడు కాబ్.

ఈ ప్రతిపాదన కూడా ఎవరికీ నచ్చలేదు. "పాపం ఆడవాళ్ళను చంపటం ఏమీ బాగాలేదు. వారు పోతే మన జీవితాల్లో ఇక రుచీపచీ ఏముంటుందని?" అన్నారు కొందరు. కాబ్ మౌనంగా ఉండిపోయాడు.

ఆ తరువాత మరికొన్ని ప్రతిపాదనలు వచ్చాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క అభిప్రాయం వెలిబుచ్చారు. అందరి అభిప్రాయాలు క్రోడీకరించి చివరికి ఒక విషయం తీర్మానించారు.

"మనల్ని సిరియా పోవడానికి అనుమతించమని ముహమ్మద్‌ని అడుగుదాం. బనూఖైనుఖా, బనూనజీర్ తెగల విషయంలో ఇలాగే జరిగింది" అంటూ కాబ్ బిన్ అఖ్జబ్ తుది నిర్ణయం తెలియపరిచాడు.

ఈ నిర్ణయం అందరికీ నచ్చింది. వెంటనే వారొక ప్రతినిధివర్గాన్ని దైవప్రవక్త (సల్లం)తో రాయబారం జరపడానికి పంపించారు. ఆ ప్రతినిధివర్గం చర్చలు జరపడానికి దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళింది.

"అయ్యా! మా వల్ల పొరపాటు జరిగిపోయింది. దయచేసి మమ్మల్ని సిరియా వెళ్ళిపోవడానికి అనుమతించండి" అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు.

"మీకీ అనుమతి లభించదు. ఒక పని చేయండి. ఔస్‌తెగ మీ పాత మిత్రపక్షమే కదా! ఆ తెగలో ఎవరినయినా ఎన్నుకోండి. అతను ఏది నిర్ణయిస్తే దానికి మేము కట్టుబడి ఉంటాం. మీరు కూడా దాన్ని సమ్మతించవలసి ఉంటుంది" అన్నారు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం).

యూదులు రెండు నిమిషాలు ఆలోచించారు. చివరికి వారిదృష్టి సాద్ బిన్ ముఆజ్ (రజి) వైపుకు పోయింది. ఆయన్ని మధ్యవర్తిగా ఉండి ఈ సమస్యను పరిష్కరించమన్నారు.

అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఔస్‌తెగకు చెందిన కొందరు ముస్లింలను పంపుతూ సాద్ బిన్ ముఆజ్ (రజి)ని పిలుచుకొని రమ్మని చెప్పారు. ఆ సమయంలో సాద్ (రజి) రఫీదా సల్మా ఇంట్లో ఉండి చికిత్స పొందుతున్నారు.



ఔస్‌తెగ మనుషులు అక్కడికెళ్ళి దైవప్రవక్త (సల్లం)ఆదేశం విన్పించారు. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) అందుకు అంగీకరించగానే ఆయన్ని వారు పల్లకీలో కూర్చోబెట్టి తీసికెళ్ళారు. ఔస్‌తెగవాళ్ళు తమ పాత మిత్రపక్షానికి అనుకూలంగా తీర్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

అందువల్ల వారు దారిలో హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి)తో మాట్లాడుతూ "ఇప్పుడు మీ తీర్పే తుదినిర్ణయం. అంచేత మీరు మన పాతమిత్రులైన బనీఖురైజా యూదులకు సహాయం చేస్తే బాగుంటుంది" అన్నారు.

దానికి సాద్ బిన్ ముఆజ్ (రజి) "నేను న్యాయం ప్రకారమే తీర్పు చెబుతాను. ఎవరి విమర్శలకు భయపడేవాణ్ని కాను" అని సమాధానమిచ్చారు.

ఆయన పల్లకి సమీపానికి రాగానే దైవప్రవక్త (స) ఔస్‌తెగ వాళ్ళతో "మీ నాయకుడు వస్తున్నాడు ఎదురెళ్ళి స్వాగతం చెప్పి గౌరవప్రదంగా తీసుకురండి" అని చెప్పారు.

వెంటనే ఔస్‌తెగ ముస్లింలు లేచి హజ్రత్ సాద్ (రజి)కు స్వాగతం చెప్పి గౌరవ ప్రదంగా పల్లకీ నుంచి దించి తీసుకొచ్చారు. సాద్ (రజి) రాగానే దైవప్రవక్త (స)కు సలాం చెప్పి కూర్చున్నారు.

"సాద్! మీ పాతమిత్రులు తమ వ్యవహారాన్ని మీకు అప్పగించారు. ఇప్పుడు తుదినిర్ణయం మీ చేతిలో ఉంది" అన్నారు దైవప్రవక్త (స).

హజ్రత్ సాద్ (రజి) అన్సార్ ముస్లింల వైపు చూస్తూ "మీరు దేవుడ్ని సర్వోపగతుడిగా భావించి నా తీర్పును సంతోషంగా అంగీకరిస్తామని మాటివ్వండి" అన్నారు.

దానికి అన్సార్ ముస్లింలంతా "మీ తీర్పు మాకిష్టమే" అన్నారు ముక్తకంఠంతో.

తర్వాత సాద్ (రజి) దైవప్రవక్త (స)ను, ముహాజిర్ ముస్లింలను ఉద్దేశించి "మీరు కూడా దేవుడ్ని సర్వోపగతుడిగా భావించి నా తీర్పును సంతోషంగా ఒప్పుకుంటామని మాటివ్వండి" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) కూడా సాద్ (రజి) ఇచ్చే తీర్పుని గౌరవిస్తామని చెప్పారు. ముహాజిర్ ముస్లింలు ఆ విషయాన్ని సమర్థిస్తూ తమ ఆమోదాన్ని తెలిపారు.

సాద్ బిన్ ముఆజ్ (రజి) యూదుల స్వభావం మొదటి నుంచీ బాగా ఎరిగినవారు. ఆయన ఓ క్షణం ఆలోచించి పరిస్థితి అర్థం చేసుకున్నారు.

ఈ దుర్మార్గులు ముస్లింలతో మంచిగా ఉంటూనే దైవమార్గంలో గోతులు త్రవ్వడానికి పూనుకున్నారు. తనకు గాయమయినప్పుడు, బనూఖురైజా యూదుల నమ్మకద్రోహం పర్యవసానం చూసేవరకు తనను సజీవంగా ఉంచమని ఆయన దైవాన్ని

ప్రార్థించారు. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. కాబట్టి ఆయన వెంటనే తన నిర్ణయాన్ని ఈవిధంగా తెలిపారు:

“బనీఖురైజా తెగ యూదులలో ఎవరెవరు యుద్ధం చేయగల శక్తిమంతులో వారంతా తక్షణమే వధించబడాలి. స్త్రీలు, పిల్లలను బందీలుగా చేసుకోవాలి. వారి ఆస్తిపాస్తులన్నీ ముస్లింలకు పంచబడాలి.”

ఈ నిర్ణయం వినగానే యూదులకు మిన్ను విరిగి మీద పడినట్లయింది. కాళ్ళ కింద భూమి బద్దలయినట్లు అన్పించింది. ఏ ఒక్కరి నోటా మాట పెగల్లేదు. అందరూ నిలువుగుడ్లు వేసి చూడసాగారు.

తక్షణమే ముస్లింలు పెద్దపెద్ద గోతులు తవ్వారు. పురుషులందర్నీ బంధించి గోతుల దగ్గరికి తీసికెళ్ళారు. అక్కడ వారిని వధించి గోతుల్లోకి త్రోసి పూడ్చిపెట్టారు.

“గ్రంథప్రజలలో శత్రుసేనలకు తోడ్పడినవారిని దేవుడు వారి కోటల నుండి బయటికి తీశాడు. వారి హృదయాల్లో (మీ పట్ల) భయోత్పాతం సృష్టించాడు. ఈ కారణంగానే ఈరోజు మీరు వారిలో కొందరిని హతమార్చి, మరికొందరిని బందీలుగా పట్టుకోగలిగారు. అంతేకాదు, ఆయన వారి భూములు, ఇండ్లు, ఇతర ఆస్తిపాస్తులకు మిమ్మల్ని వారసులుగా చేశాడు. వారి ప్రాంతంలో మీరు ఇదివరకెన్నడూ కాలు కూడా మోపి ఉండలేదు; అలాంటి ప్రాంతాన్ని కూడా ఆయన మీకు స్వాధీనం చేశాడు.” (ఖుర్ఆన్–33:26,27)

ఈ విధంగా బనూఖురైజా తెగ యూదుల అధ్యాయం సమాప్తమయింది. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) కోరిక నెరవేరింది. తరువాత ఆయన శత్రువులు కలిగించిన గాయంతోనే శాశ్వతంగా కన్నుమూశారు.

# 42. అబుల్ఆస్ బిన్ రబీ (రజి)

దైవప్రవక్త (స) బదర్‌యుద్ధ ఖైదీల సమస్యను గురించి చర్చించడానికి అనుచరులను సమావేశపరిచారు. ఖైదీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో చెప్పమని వారి అభిప్రాయాలు అడిగారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు:

“వీరు దైవవిరోధులు. ఇస్లాంను అంతమొందించదలచుకున్న పరమదుర్మార్గులు. మిమ్మల్ని చంపడానికి ప్రయత్నించారు ఇలాంటి నీచుల్ని వదలిపెట్టకూడదు. వీరందర్నీ వధించాలి. మనలో ఎవరు ఏఖైదీల బంధువులో వారే ఆ ఖైదీలను వధించాలి. దానివల్ల మన హృదయంలో బంధుప్రేమ కంటే దేవుని, దైవప్రవక్తల ప్రేమే అధికమని, దైవధర్మం ముందు సమస్త బాంధవ్యాలు బలదూర్ అని అవిశ్వాసులు తెలుసుకుంటారు.”

హజ్రత్ అబూబకర్ (రజి) తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచారు: “దైవప్రవక్తా! నష్టపరిహారం తీసుకొని వదలిపెడ్తే మంచిదని నా అభిప్రాయం. ఇలా చేయడం వల్ల



ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద ముస్లింలకు ధనసహాయం అందించినట్లూ ఉంటుంది. మరోవైపు దైవానుగ్రహమయితే మనసు మారి ఖైదీలు ఇస్లాం స్వీకరించనూ వచ్చు.”

ఇలా అనేకమంది తమతమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. కాని దైవప్రవక్త (స)కు అబూబకర్ (రజి) అభిప్రాయమే నచ్చింది. దాని ప్రకారమే అమలు జరపడానికి నిశ్చయించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఖైదీల బంధువులకు తెలియజేశారు.

మక్కానుంచి ఖురైషీయులు తమ బంధువుల్ని విడిపించుకోవడానికి మదీనా వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఒక్కొక్క ఖైదీ నుంచి వేయి నుంచి నాలుగువేల దిర్హమ్‌ల దాకా వారివారి స్తోమతను బట్టి నష్టపరిహారం వసూలుచేసి బంధవిముక్తుల్ని గావించారు.

ఖైదీలలో దైవప్రవక్త (సల్లం) అల్లుడు అబుల్ఆస్ కూడా ఉన్నాడు. కాని అల్లుడని నష్టపరిహారం వసూలుచేయకుండా విడిచిపెట్టలేదు. ఇతర ఖైదీలకు మాదిరిగానే నష్టపరిహారం తెప్పించి విడుదలకమ్మని చెప్పారు ఆయన.

భర్తను విడిపించుకోవడానికి హజ్రత్ జైనబ్ (రజి) తన తల్లి హజ్రత్ ఖదీజా (రజి) నుంచి తనకు సంక్రమించిన కంఠహారాన్ని మదీనాకు పంపించారు.

కంఠహారం చూడగానే దైవప్రవక్త (సల్లం)కు గతస్మృతులు గుర్తుకొచ్చాయి. ఇహలోకం వీడిపోయిన తన అర్ధాంగిని తలచుకొని వ్యధ చెందారు. హృదయం మూగగా విలపించింది.

“కంఠహారం ఒక్కటే నా భార్య ఖదీజా జ్ఞాపకార్థంగా జైనబ్ దగ్గర మిగిలివుంది. మీకెవరికీ అభ్యంతరం లేకపోతే దీన్ని జైనబ్‌కు తిరిగిచ్చివేద్దాం” అన్నారు ఆయన అనుచరులతో.

తమ ప్రియతమ నాయకుడే అలా అన్నప్పుడు ఇక ఎవరికి అభ్యంతరం ఉంటుంది? అదీగాక దైవప్రవక్త ప్రసన్నత కన్నా వారికి కావలసిందేముంది? అంచేత అందరూ సంతోషంగా అంగీకరించారు. దైవప్రవక్త (స) విచారవదనం వికసించింది. కంఠహారాన్ని తన కుమార్తెకు తిప్పిపంపి అబుల్ఆస్‌ను విడుదల చేశారు.

గతంలో ఖురైష్‌నాయకులు ప్రవక్తకుమార్తె జైనబ్ (రజి)ను వదిలేయమని అబుల్ ఆస్‌ని అడిగినప్పుడు “ఆమె నాప్రాణం, నా హృదయేశ్వరి. ఆమెనొదిలి నేనెలా బ్రతగ్గలను? నాప్రాణాన్ని నేనెలా తీసుకోను?” అని చెప్పి వారి ప్రతిపాదనను తిరస్కరించాడు.

అయితే అబుల్ఆస్ ఇంకా ఇస్లాం స్వీకరించకపోవడమే గాక బదర్ యుద్ధంలో దైవప్రవక్త (స)కు ఎదురు నిలిచినందున ఇప్పుడతను జైనబ్ (రజి)ను వదలిపెట్టక తప్పలేదు. యుద్ధఖైదీగా పట్టుబడినప్పుడు అతడ్ని దైవప్రవక్త (స) విడిచిపెడ్తూ మక్కా

వెళ్ళగానే జైనబ్‌ను శాశ్వతంగా మదీనా పంపివేయాలని షరతు విధించారు. ఎందుకంటే ఇప్పుడీ సంబంధం తెగిపోయింది. ఇస్లాం వారిద్దర్నీ వేరుచేసింది.

దైవప్రవక్త (స) ఆజ్ఞ ప్రకారం జైనబ్ (రజి)ను మక్కా సమీపంలో ఉన్న ఒకచోట వదలిపెట్టాలని, అక్కడ్నుంచి ఆమెను హజ్రత్ జైద్ (రజి) మదీనా తీసుకొస్తారని ముందే నిర్ణయించబడింది. అబుల్‌ఆస్ ఈ విషయం హజ్రత్ జైనబ్ (రజి)కు వివరించాడు.

ఆ తరువాత అతను తన తమ్ముడు కనానాతో జైనబ్ (రజి)ను తీసికెళ్ళి మక్కా వెలుపల నిర్ణీత ప్రదేశంలో దిగబెట్టి రమ్మని చెప్పాడు.

జైనబ్ (రజి) మదీనా వెళ్ళడానికి సిద్ధమయ్యారు. అంతలో అబూసుఫ్యాన్ భార్య హిందా వచ్చి "ఏం చెల్లీ! నువ్వు మీనాన్న దగ్గరికి వెళ్ళిపోతున్నావట నిజమేనా?" అన్నది.

ఈమాట విని హజ్రత్ జైనబ్ (రజి) నివ్వెరపోయారు. ఇంత రహస్యంగా ఉంచిన సంగతి హిందాకు ఎలా తెలిసిపోయిందో ఆమెకు బోధపడలేదు. ఇప్పుడేం చెయ్యాలి? ఒకవేళ ఔనంటే హిందా తనకేదైనా కీడు తలపెడ్తుందేమో! అసలే ఆమెకు దైవప్రవక్త (స) అంటే మంట. ఈ ఆలోచనతో హజ్రత్ జైనబ్ (రజి) ఎటూ తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయారు.

"ఏదయినా అవసరమైతే సంకోచం లేకుండా చెప్పెయ్యి చెల్లీ! నేను నీకు ప్రతి వస్తువూ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. మన స్నేహసంబంధాలకు ఎలాంటి లోటు రాకూడదు. మగవాళ్ళ వ్యవహారాలు వేరు; ఆడవాళ్ళ వ్యవహారాలు వేరు. మగవాళ్ళు పరస్పరం ఏదయినా చేసుకోవచ్చు. వాళ్ళతో ఆడవాళ్ళయిన మనకు పనేమిటీ?" అన్నది హిందా ఎంతో ప్రేమ ఒలకబోస్తూ.

ఎంత మధురంగా ఉన్నాయీ మాటలు! వాటిలో ఎంత పరోపకారం వ్యక్తమవుతోంది!! అయినా హజ్రత్ జైనబ్ (రజి) మనస్సు కుదుటపడలేదు. ఏమైనా ఆమె హిందా నుంచి ఎలాంటి సహాయం కోరలేదు.

జైనబ్ (రజి) ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అది ప్రభాత సమయం. కనాన ఆమె కోసం ఒక ఒంటె తెచ్చి ఆమెను ఒంటె మీద ఎక్కించి బయలుదేరాడు. దారిలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన ధనుర్బాణాలు కూడా వెంట తీసుకున్నాడు.

జైనబ్ (రజి) మదీనా వెళ్తున్న సంగతి మక్కాలో అందరికీ తెలిసిపోయింది. దైవప్రవక్త (స) మనస్సు బాధించాలన్న దుర్బుద్ధితో కొందరు ఖురైషీయులు ఆమెను మదీనా పోకుండా అడ్డుకోవాలనుకున్నారు. వారిలో అబూసుఫ్యాన్ కూడా ఉన్నాడు. వారంతా ఆయుధాలు తీసుకొని వెళ్ళి జైనబ్ (రజి)ను, కనానాను వెంబడించారు. వారిని చూడగానే జైనబ్ (రజి) కంగారు పడిపోయారు. ఖురైషీయులు వారిద్దర్ని సమీపించారు.



వారిలో ఒకడు వేగంగా ఒంటె దగ్గరికి వచ్చాడు. అతను ఒంటెపై జైనబ్ (రజి) చుట్టూ కట్టిన పరదా తొలిగించి కత్తి చూపిస్తూ "మర్యాదగా వెనక్కి పద. లేదంటావా....." అని గదమాయించాడు. దాంతో జైనబ్ (రజి) నిలువునా కంపించిపోయారు.

ఆమె దయనీయ స్థితి చూసేటప్పటికి కనానాకు పౌరుషం పురివిప్పింది. తక్షణమే అతను విల్లు ఎక్కుపెట్టి చూపిస్తూ "ఎవడైనా సరే అడుగు ముందుకు వేశాడా.... వాడి గుండెల్లో నుంచి ఈ బాణం దూసుకుపోవడం ఖాయం" అన్నాడు ఉరిమిచూస్తూ.

అతని రౌద్రాకారం చూసి ఖురైషీయులు చల్లబడిపోయి పక్కకు తప్పుకున్నారు.

"ఆగవయ్యా బాబూ! బాణం విడవకు, కాస్త మామాట విను" అన్నాడు అబూసుఫ్యాన్.

"సరే ఏమిటో చెప్పు" అన్నాడు కనాన ధనస్సు క్రిందికి దించుతూ.

"ఇలా నువ్వీమెను బహిరంగంగా తీసికెళ్ళడం ఏమీ బాగాలేదు. ముహమ్మద్ (స) వల్ల మనం ఇప్పటికే అనేక కష్టాలతో సతమతమైపోతున్న సంగతి నీకూ తెలుసు. ఇలాంటి పరిస్థితిలో నువ్వు అతని కూతుర్ని ఇలా తీసికెళ్తే జనం చూసి మనల్ని గురించి ఏమనుకుంటారు? మనం ఓడిపోయామని, మన జాతి ఢీలాపడిపోయిందని అనుకోదా? ఈమెను పోకుండా ఆపినందువల్ల మనకు ఒరిగేదేమీ లేదు. అంచేత ఓ పని చెయ్యి. ప్రజల్లో రేగిన చర్చ అణగిపోయి ప్రశాంత పరిస్థితి నెలకొన్న తర్వాత ఈమెను తీసికెళ్ళ వచ్చు. అప్పటిదాకా ఈమెను మక్కాలోనే ఉంచుదాం" అన్నాడు అబూసుఫ్యాన్.

అబూసుఫ్యాన్ చెప్పినమాట బాగానేఉంది. కనాన దానికి ఒప్పుకున్నాడు. జైనబ్ (రజి)ను తిరిగి మక్కా తీసుకువచ్చాడు.

కొన్నాళ్ళకు జనంలో చర్చ తగ్గిపోయింది. అప్పుడతను ఓరోజు రాత్రివేళ ఆమెను తీసికెళ్ళి నిర్ణీతప్రదేశానికి చేర్చాడు. అక్కడ జైనబ్ (రజి) కోసం ఎదురుచూస్తున్న జైద్ (రజి), ఆయన సహచరులు ఆమెను తీసుకొని పోయి దైవప్రవక్త (స) సన్నిధికి చేర్చారు.

అబుల్‌ఆస్ భార్య నుండి వేరైపోయిన తరువాత చాలా కాలం వరకు మక్కాలోనే ఉన్నాడు. మక్కావిజయానికి కొన్నాళ్ళ ముందు ఆయన వ్యాపారనిమిత్తం సిరియా వెళ్ళారు. సిరియా నుండి తన వర్తకబిడారంతో కలసి మక్కాకు తిరిగొస్తుంటే మార్గమధ్య మదీనా సమీపంలో ముస్లిం సైనికదళం ఒకటి వర్తకబిడారంపై దాడిచేసి సరుకుతో పాటు ఒంటెలను స్వాధీనం చేసుకుంది.

దాడి సందర్భంగా ముస్లింయోధులు వర్తక బిడారానికి చెందిన అనేకమంది మనుషుల్ని కూడా బంధించి తీసికెళ్ళారు. అబుల్‌ఆస్ మాత్రం ఎలాగో తప్పించుకో గలిగాడు.

అయితే అతను ఆరోజు రాత్రిచీకటిలో మక్కా వెళ్ళడానికి బదులు మదీనా వైపు బయలుదేరాడు. ఎంతో జాగ్రత్తవహిస్తూ ప్రజల కంటబడకుండా హజ్రత్ జైనబ్ (రజి) దగ్గరకు చేరుకొని తనను ఎలాగైనా కాపాడమని అభ్యర్థించాడు.

మరుసటి రోజు ఫజర్‌వేళ కాగానే దైవప్రవక్త (సల్లం) మసీదుకెళ్ళి నమాజ్ ప్రారంభించారు. ఆయన వెనుక పురుషులు, వారి వెనుక స్త్రీలు నిల్చున్నారు. నమాజ్ ముగిసిపోగానే హజ్రత్ జైనబ్ (రజి) లేచి నిలబడి "ప్రజలారా! నేను ముహమ్మద్ కుమార్తె జైనబ్‌ని. నేను (నా మాజీభర్త) అబుల్ ఆస్ బిన్ రబీకు ప్రాణరక్షణ హామీ నిచ్చాను. మీరు కూడా అతనికి ప్రాణరక్షణ హామీ ఇవ్వండి" అని ప్రకటించారు.

దైవప్రవక్త (స) ఈ మాటలు విని "అనుచరులారా! జైనబ్ చేసిన ప్రకటన విన్నారు కదా! దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ సంగతి నాకు ఇంతకుముందు తెలియదు. ముస్లిం లలో అతిసాధారణ వ్యక్తి కూడా ఎవరికైనా ప్రాణరక్షణ హామీ ఇవ్వగలుగుతాడు." అని చెప్పి ఇంటికి వెళ్ళిపోయారు.

దైవప్రవక్త (సల్లం) ఇంటికెళ్ళిన తరువాత కుమార్తె జైనబ్ (రజి)తో మాట్లాడుతూ "అమ్మాయ్! అబుల్‌ఆస్‌ని బాగా సత్కరించాలి. అయితే ఒక విషయం గుర్తుంచుకో. అతను నీకోసం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాడు" అని చెప్పారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) వర్తకబిడారాన్ని, వాణిజ్యబృందాన్ని సమరసొత్తుగా స్వాధీనం చేసుకున్న సైనికాధికారిని పిలిచి ఇలా అన్నారు:

"నా దగ్గర అబుల్‌ఆస్‌కు ఎలాంటి హోదా-అంతస్తులు ఉన్నాయో మీకు బాగా తెలుసు. మీరు స్వాధీనంచేసుకున్న అతని వ్యాపారసరుకు, ఒంటెలను ఉపకారబుద్ధితో అతనికి తిరిగిస్తే నా దృష్టిలో ఇది ఎంతో మంచివిషయం. ఒకవేళ మీకా సమరసొత్తుని వాపసుచేయడం ఇష్టం లేకపోతే మీరే ఉంచుకోండి; దానికి మీరే అందరికన్నా ఎక్కువ హక్కుదారులు."

ఈమాట వినగానే సైనికదళంలోని ప్రవక్తఅనుచరులంతా తాము అబుల్‌ఆస్ సొత్తును అతనికి వాపసుచేస్తాం అన్నారు ముక్తకంఠంతో. ఈవిధంగా అబుల్‌ఆస్‌కు అతని వ్యాపారసొత్తు తిరిగిలభించింది.

ఆ తరువాత అబుల్‌ఆస్ మక్కా చేరుకొని ఆ వ్యాపారసొత్తులో ఎవరెవరికి ఎంతెంత వాటా ఇవ్వాలో వారందరికీ అంత వాటాసొత్తు ఇచ్చేసి "ఖురైషీయులారా! మీకు నేను ఇంకా ఏదైనా ఇవ్వాల్సివుంటే చెప్పండి, ఇచ్చేస్తాను" అని అన్నాడు.

ఖురైష్‌నాయకులు ఈమాట విని "ఇంకేమీ లేదు. దేవుడు నీకు దాని సత్ఫలం ప్రసాదించుగాక! మేము నిన్ను ఎల్లప్పుడూ మంచివాడిగా, హక్కులు నెరవేర్చేవాడిగానే చూశాము" అని అన్నారు.



"నేను మీ అందరి హక్కులు నెరవేర్చాను గనక వినండిప్పుడు- అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆ దేవుని ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను. దైవసాక్షిగా చెబుతున్నాను, మీరు గనక నామీద నేను మీసొత్తు కాజేశానని నింద మోపుతారన్న భయం లేకపోయివుంటే నేను మదీనాలోనే ఇస్లాం స్వీకరించి ఉండిపోయే వాడ్ని. ఇప్పుడు నేను మీ అందరి హక్కులు నెరవేర్చాను గనక నా ఇస్లాంస్వీకార ప్రకటన చేస్తున్నాను" అన్నారు అబుల్‌ఆస్ (రజి).

ఈమాట చెప్పిన తరువాత అబుల్‌ఆస్ (రజి) మదీనా వెళ్ళిపోయి దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) పరమసంతోషంతో ఆయనకు స్వాగతం చెప్పారు. తరువాత అబుల్‌ఆస్ (రజి) మొదటివివాహాన్ని పునరుద్ధరించి ఆయన భార్యను ఆయనకు వాపసుచేశారు.

హజ్రత్ అబుల్‌ఆస్ (రజి)ని గురించి దైవప్రవక్త (సల్లం) తరచుగా ఇలా చెబుతుండే వారు: "అతను నాతో మాట్లాడినప్పుడల్లా నిజమే చెప్పాడు; వాగ్దానం చేసినపుడు దాన్ని నెరవేర్చాడు."

# 43. లూసా బిన్ యహూద్ (రజి)

రాళ్ళకుప్పలో ఓ విశిష్ఠ రత్నం మెరిసింది. ఒక యూదయువకుని అంతరంగంలో ఓ వినూత్న కిరణం ప్రసరించింది. ఇస్లాం పట్ల అతని హృదయసాగరంలో విశ్వాస కుసుమం వికసించింది. ఆరోజు నుంచి అతను దైవప్రవక్త (సల్లం) దర్శనం కోసం ఎంతగానో తపించిపోసాగాడు. లోగడ అతను ఎన్నో సార్లు దైవప్రవక్త (సల్లం)ను చూశాడు. కాని ఆ చూపులో విశేషమేమీ లేదు. దృష్టి కాకతాళీయంగా పడింది, మళ్ళీ చెదరి పోయింది. అంతే. కాని ఈరోజు దృష్టి పడగానే ఆంతర్యంలో అనిర్వచనీయమైన ప్రకంపనాలేవో ఎగిసిపడుతున్నాయి.

ఇంటి నాలుగ్గోడల మధ్య ఏ మహనీయుని పేరు ఉచ్చరించడమే పెద్ద నేరమో ఆ మహాత్ముని పట్ల అభిమానం ఇప్పుడతని హృదయ కుహూరంలో తిష్ఠ వేసుకుంది. అది పూర్తిగా వికసించిన అనురాగ కుసుమం. ఉభయలోకాలను ఉత్తేజపరిచే దాని పరిమళాన్ని ఇప్పుడు కప్పిపుచ్చడం అంత సులభం కాదు. ఆశ, భయాల మధ్య చెలరేగిన ఘర్షణతో అతని మెదడు వేడెక్కి పోయింది.

"పద. ఇప్పుడే ఆ దివ్య సమావేశానికి హాజరై ఆయన బోధామృతాన్ని తనివితీరా ఆస్వాదించు" అని మనస్సు ప్రేరేపిస్తుంటే, "ఔను, సత్వరమే వెళ్ళి ఆ అందాల రేడుని ఆపాద మస్తకం దర్శించుకుందాం. ఇహపర లోకాల శుభాలను మూట గట్టుకుందాం" అని నయనాలు మారాము చేస్తున్నాయి.

కాని ఎలా....? లూసా ఆ సమావేశానికి పోవడం ఎవరైనా చూస్తే ఇంకేమైనా ఉందా! తల్లిదండ్రులు తాట వలుస్తారే! సంఘం వెలివేస్తుందే!! ఉక్కు గోడల మధ్య హృదయం బందీ అవుతుందే!!!

ఆశ, భయాల మధ్య సాగిన సంఘర్షణలో చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో ఆశ పాక్షిక విజయం సాధించింది. శక్తినంతా కూడదీసుకొని ఆసక్తి అడుగుని ముందుకు వేయించింది. కాళ్ళు మసీదు ముఖద్వారం పక్కగా నడుస్తుంటే కళ్ళు లోపలికి తొంగిచూసి కాస్తంత చల్లదనం పొందాయి.

కాని మరోసారి మసీదు వైపు పోవడానికి ధైర్యం చాలడం లేదు. అందువల్ల ఈసారి ఆ యువకుడు మసీదుకు వెళ్ళే దారిలో ఓ పక్కన కూర్చొని నిరీక్షించసాగాడు. కాస్సేపటికి మానవమహోపకారి (స) మసీదు నుండి వస్తుంటే ఆయన ముఖవర్చస్సుని కళ్ళ ద్వారా తస్కరించి గుండెల్లో భద్రపరచుకున్నాడు.

ఈ విధంగా రోజులు గడచిపోతున్నాయి. అంతరంగంలో జనించిన ప్రేమాగ్ని కణం ప్రజ్వరిల్లుతూనే ఉంది. చివరికి ఈ అభిమాన జ్వరం తీవ్రమయి కంటికి కునుకు లేకుండా చేసింది. హృదయంలోని భారం తీసివేయడానికి తనివితీరా ఏడుద్దామన్నా స్వేచ్ఛ లేకుండా పోయింది. దాంతో మనోభారం అధికమయి ఆ యువకుడు వ్యాధిగ్రస్తుడయ్యాడు.

వ్యాధినివారణ కోసం అతని తండ్రి ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాడు. గొప్పగొప్ప వైద్యనిపుణుల్ని పిలిపించాడు. కాని ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

శరీర సంబంధమైన వ్యాధి అయితే ఏదో రకంగా నయమయ్యే అవకాశం ఉంటుంది. కాని మనోవ్యాధికి మందేముంటుంది? అందులో ఇది ప్రేమ జబ్బాయె!

ఎన్ని మందులు వాడినా, ఎన్ని అంత్రాలు వేసినా వ్యాధి తగ్గుముఖం పట్టలేదు. పైగా అది దినదిన ప్రవర్ధమానమవుతూ ప్రాణసంకటంగా తయారయింది. చివరికి విప్పారిన పువ్వు లాంటి ఆ నవయువకుడు క్రుంగి కృశించిపోయి ఎముకల గూడులా మారిపోయాడు.

కొడుకు పరిస్థితి చూసి తల్లి తల్లడిల్లి పోయింది. తండ్రి నిరాశానిస్పృహలతో పిచ్చివాడిలా తయారయ్యాడు. బంధువుల ముఖాలపై కూడా విచారఛాయలు అలుముకున్నాయి.

ప్రేమవ్యాధి ఇప్పుడు జీవిత సరిహద్దు వైపుకు వేగంగా పరుగిడుతోంది. నీరసం గంటగంటకు అధికమవుతోంది. నోటమాట వెలువడటం కూడ కష్టమైపోయింది. అప్పుడప్పుడు వినపడే మూల్గుడు ఇంటి వాతావరణాన్ని కకావికలం చేస్తోంది.



రోగిలాగే ఆరోజు సూర్యుడు కూడా నీరసంతో క్షణక్షణానికి తేజోవిహీనుడై పోతున్నాడు. నింగిని నలువైపుల నుంచి కారుమబ్బులు కమ్ముతున్నట్లు పుడమితల్లిని చీకటి తెరలు త్వరత్వరగా కప్పివేయసాగాయి.

అలాగే ఆ యువకుడు కూడా బలాన్నంతా కూడదీసుకొని ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కాని గొంతులోని మాట గొంతులోనే పూడుకుపోయింది. పెదవులు వణకుతుంటే కాంతివిహీనమైన కళ్ళతో తండ్రి వంక అసహాయంగా చూస్తుండిపోయాడు.

కొడుకు దుస్థితి చూసి తండ్రి తల్లడిల్లి పోయాడు. చెవి దగ్గర ముఖం పెట్టి "బాబూ! ఏదైనా చెప్పాలనుకుంటున్నావా?" అని అడిగాడు అమితమైన వాత్సల్యంతో.

"నాన్నా......" హీనస్వరంతో కాస్తంత పెదవులు విచ్చుకున్నాయి.

"నా జీవితపు చివరి కోరికను మీరు సంతోషంగా నెరవేరుస్తానంటే చె.... బు....తా....ను" గొంతు మళ్ళీ పూడుకుపోయింది.

"నా చిట్టితండ్రీ! నువ్వు కోరితే చాలుగాని ఎంత మూల్యం చెల్లించయినా, చివరికి తల తాకట్టు పెట్టయినా సరే నీ కోరిక తీర్చనూ? చెప్పు నాయనా! నీకోరిక ఏమిటో సంకోచం లేకుండా చెప్పు. ఇప్పుడే ఈ క్షణంలోనే తీర్చుతాను" పుత్రప్రేమ పురివిప్పింది.

"నాన్నా! మీరు ఏమనుకోకుంటే........" పెదవులు వణికాయి.

"నాన్నా! కొన్నాళ్ళ నుంచి నేను ముహమ్మద్ మహనీయుని పట్ల కలిగిన భక్తి విశ్వాసాలతో లోలోనే దహించుకుపోతున్నాను. మీకు భయపడి నేనీ రహస్యాన్ని బయట పెట్టలేకపోయాను. కాని ఆయన జ్ఞాపకం నన్ను అనుక్షణం తినేస్తోంది. కళ్ళు మూసినా, తెరిచినా ఆయన రూపమే నా మనస్సులో మెదలుతోంది....

"నాన్నగారూ! ఒక్కసారి..... ఒక్కసారి అంటే ఒక్కసారి ఆ మహాత్ముడ్ని ఇక్కడికి పిలుచుకు రారూ? ఆయన దివ్యమోమును తనివితీరా తిలకించి తరిస్తాను. ఆయన నోట ముక్తి శుభవార్త విని తృప్తిగా ఊపిరి విడుస్తాను. నాన్నా! ఒక్కసారి....."

కొడుకు కోరిక విని తండ్రి మండిపడ్డాడు. కాని కోపాన్ని పళ్ళమధ్య బిగబట్టి ఎలాగో తనను తాను తమాయించుకున్నాడు. ఎంతైనా కన్నకొడుకు కదా! అందులో లేకలేక కలిగిన ఏకైక సంతానం!! తనకు ఇష్టమున్నా లేకపోయినా ఈ స్థితిలో కొడుకు కోరిక నెరవేర్చక తప్పదు మరి. ఓ వేడి నిట్టూర్పు విడుస్తూ అన్నాడు:

"సరేలే నాయనా! ఈమాట నాకు తీవ్రమైన అసంతృప్తి కలిగించినా, నువ్వు విచారపడుతూ క్రుంగిన మనస్సుతో ఇహలోకం వీడటం నాకిష్టంలేదు. నీ కోరికను తీర్చడానికి ఇప్పుడే వెళ్తున్నాను. రేపటి నుంచి మన జాతి ప్రజలు నన్ను యూదసమాజం శత్రువుగా పరిగణిస్తారు. అయినా నీకోసం ఈ అపవాదుని కూడా సహిస్తాను."

ఆంతర్యం అభ్యంతరం పెడ్తున్నా కాళ్ళు బలవంతంగా అతడ్ని మసీదు వైపుకు లాక్కెళ్ళాయి. మసీదు ముఖద్వారం దగ్గరే నిలబడి "నేను ముహమ్మద్ (స)ని కలుసుకోవడానికి వచ్చాను. లోపల ఉంటే కాస్త కబురుచేయండి" అన్నాడు అక్కడున్నవారితో.

కొన్ని క్షణాల తరువాత దైవసందేశహరుని సుమధుర వాక్కు విన్పించింది:

"చెప్పండి, నాతో ఏం పనిపడి వచ్చారు?" ఈ పలుకులు యూదుని కర్ణపుటాలకు తాకి హృదయంలో క్షణంపాటు సంచలనం సృష్టించాయి.

"నా ఏకైక కుమారుడు చావుబ్రతుకుల్లో ఉన్నాడు. మీమీది ప్రేమాభిమానాలతో వాడు పిచ్చివాడయి పోయాడు. మీ విశిష్ఠ వ్యక్తిత్వం యావత్తు అరబ్బుల్ని ఉన్మాదులుగా చేసింది. అది నా కొడుకుని కూడా పిచ్చివాణ్ణి చేసింది. ఆ పిచ్చితోనే మావాడు చిక్కి శల్యమై ఇప్పుడు కాటికి కాళ్ళుజాపి కూర్చున్నాడు. వాడు తన చివరికోరికగా మీ దర్శన భాగ్యం పొంది, మీనోట ముక్తి శుభవార్త వినాలని ఉబలాటపడుతున్నాడు."

యూదుడి మాటలు వినగానే దైవప్రవక్త (సల్లం) ముఖపద్మం విప్పారింది.

"పదండి, అదృష్టజాతకుడైన ఆ యువకుడ్ని చూసి వద్దాం. అతడ్ని స్వాగతించడానికి నభోమండలంలో హంగామా మొదలయింది" అన్నారు ఆయన తన అనుచరులతో.

ప్రవక్త కోసం ఎదురుచూసి చూసి యువకుని కళ్ళు మూతలు పడ్డాయి.

తండ్రి తలగడ వైపున నిల్చున్నాడు. మహాప్రవక్త (సల్లం) అనుచరుల మధ్య యువరోగికి ఎదురుగా నిలబడ్డారు. తండ్రి కొడుకు మీద వంగి ఆప్యాయతగా అతని తల నిమురుతూ అన్నాడు-

"నాయనా! కళ్ళు తెరు. ఇదిగో నీ విశ్వాస కేంద్రబిందువు నీ ముంగిట వాలింది. నీ అభిమాన నాయకుడు ముహమ్మద్ మహనీయుడు (సల్లం) నీ ముందు నిల్చున్నాడు. కళ్ళు తెరు బాబూ!"

మహనీయ ముహమ్మద్ (స) పేరు వినగానే పోతున్న ప్రాణమల్లా గిర్రున తిరిగొచ్చింది. కాస్సేపటికి యువరోగి కళ్ళు మెల్లిగా తెరచుకున్నాయి.

ఎదురుగా అందాలరేడు వరాల పూలహారంతో శోభాయమానంగా వెలుగుతూ నిల్చున్నాడు.

"మహానుభావా! ఎదలో భక్తివిశ్వాసాల సిరిసంపదలు పెట్టుకొని అంతిమ గమ్యం వైపు పయనిస్తున్నాను. మీ సేవకుల జాబితాలో ఈ సేవకుని పేరు కూడా చేర్చుకోండి. సాటిలేని ఏకైక దైవాన్ని విశ్వసించినప్పటికీ జీవితంలో ఒక్క సారయినా ఆయన ప్రసన్నత కోసం సజ్దా (సాష్టాంగప్రణామం) చేసే భాగ్యానికి నోచుకోలేకపోయాను. ఇలాంటి స్థితిలో



నాకు మోక్షం లభిస్తుందని ఆశించగలనా?" అన్నాడు ఆ యువకుడు దైవప్రవక్త (సల్లం) వైపే తదేకంగా చూస్తూ.

"ఆందోళన పడకు నాయనా! దేవుని ఏకత్వాన్ని అంగీకరిస్తూ ఓసారి 'సద్వచనం' (కలిమాయె తయ్యిబా) పఠించు. నీ మోక్షానికి నేను హామీ ఇస్తాను" అన్నారు దైవప్రవక్త (సల్లం) అభయమిస్తూ.

యువకుని తండ్రి ఈ మాటలు వినగానే చెప్పలేని భావావేశాలతో వివశుడయిపోయి కొడుక్కి ఇలా హితవు చేశాడు:

"నా చిట్టితండ్రీ! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి. నా మనసులో ఎంత విరోధం ఉన్నా ఈ పలుకులు సత్యవ్రతుడయిన ఒక దైవప్రవక్త నోట వెలువడ్డాయన్న వాస్తవాన్ని నేను అంగీకరించకుండా ఉండలేను. ఒక దాసునికి స్వయంగా దైవప్రవక్తే ఇలాంటి హామీ ఇస్తున్నాడంటే ఇంతకంటే అదృష్టం అతనికి మరేమీ ఉండదు. ఆయన దగ్గర నువ్వు స్పష్టమైన మాటల్లో వాగ్దానం తీసుకొని ఇస్లాం పరిధిలో ప్రవేశించు."

తండ్రి హితబోధ యువకుడ్ని మరింత ఉత్సాహపరిచింది.

"మహానుభావా! సమాధి మజిలీ మొదలు స్వర్గానికి చేరుకునే దాకా మీరిస్తున్న హామీతో నేను ఇస్లాం స్వీకరిస్తున్నాను. అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను."

యువకుని నోట వెలువడ్డ ఈ సద్వచనం వాతావరణంలో మౌనంగా ప్రతిధ్వనించింది. ఆ వెనువెంటనే అతను శాశ్వతంగా కన్నుమూశాడు. ఇంట్లో వారంతా ఒక్కసారిగా గొల్లుమన్నారు.

యువకుని తండ్రి దుఃఖం నుండి తేరుకొని "మహాత్మా! ఇప్పుడీ భౌతిక కాయం మాది కాదు. అంత్యక్రియలు జరిపే బాధ్యత మీకే అప్పగిస్తున్నాను" అన్నాడు.

దైవప్రవక్త (స) అతని అభ్యర్థనను మన్నించారు.

"విశ్వాసాభిమానాల ఈ అమూల్యనిక్షేపాన్ని చేతుల పైకి ఎత్తుకోండి. పెళ్ళికొడుకు ఊరేగింపులా ఈ జనాజా మదీనా వీథుల గుండా సాగుతుంది" అన్నారు ఆయన.

ఈ వార్త క్షణాల్లో మదీనా అంతటా కార్చిచ్చులా వ్యాపించింది. జనాజాలో పాల్గొనడానికి జనం తండోపతండాలుగా మసీదుకు వచ్చారు. మదీనా చుట్టుపక్కల ఊళ్ళ నుంచి కూడా ఎంతోమంది జనం వచ్చారు.

అంతిమ సందర్శనార్థం ముఖం మీది వస్త్రం తొలగించారు. ఆశ్చర్యం! ఆ యువకుని ముఖం పున్నమి చంద్రునిలా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. పెదవులపై చిరునగవు నాట్యమాడుతోంది.

అంతిమ సందర్శనం తర్వాత అశేషప్రజానీకం వెంటరాగా జనాజా శ్మశానవాటిక వైపు బయలుదేరింది. పోయేవాడు ఒట్టిచేతులతో పోవడం లేదు. అతను దైవప్రవక్త (సల్లం) ప్రదానం చేసిన వస్త్రాల కఫన్‌పొరల్లో పారలౌకిక ధనరాసుల్ని దాచుకొని మరీ వెళ్తున్నాడు.

అందుకే ఈరోజు మదీనా వీథులు ఇసుక వేస్తే రాలనంత జనంతో క్రిక్కిరిసి పోయాయి. చివరికి దైవప్రవక్త (సల్లం) కూడా వీథులు ఇరుకైపోయి కాలిమునివ్రేళ్ళ మీద నడుస్తున్నారు.

ఈరోజు జనాజావెంట ఇంతమంది జనం ఎక్కడ్నుంచి వచ్చారో చాలామంది జనానికి అర్థం కాలేదు. వారిలో కొందరు సంగతేమిటో అడుగుదామని ఉత్కంఠతతో సమయం కోసం ఎదురుచూస్తున్నారు. కాని ఆసక్తి అణచుకోలేక ఒకతను అడగనే అడిగాడు "ఏమిటీ విశేషం దైవప్రవక్తా!" అని.

"ఈ యువకుని జనాజాలో పాల్గొనడానికి ఈరోజు ఊర్ధ్వలోకం నుంచి కారుణ్య దూతలు కాలు తీసి పెట్టలేనంత అసంఖ్యాకంగా వచ్చి చేరారు" అంటూ దైవప్రవక్త (సల్లం) అసలు విషయం చెప్పారు.

ఈమాట విని అనుచరులు ఆశ్చర్యచకితులయ్యారు. జనాజా జన్నతుల్‌బఖీ శ్మశానికి చేరుకుంది. భౌతికకాయాన్ని దించడానికి దైవప్రవక్త (సల్లం) సమాధిలోకి దిగారు. ఆయన తన పవిత్రహస్తాలతో జనాజాని అందుకొని సమాధిలో దించారు.

చాలా సేపటి తరువాత ఆయన (సల్లం) సమాధి నుండి బయటికి వచ్చారు. ఆయన్ని చూసి అనుచరులు మళ్ళీ ఆశ్చర్యపోయారు. ఆయన బట్టలు తడిసిపోయాయి. లలాటంపై చెమటచుక్కలు తుషారబిందువుల్లా మెరసిపోతున్నాయి. ముఖంలో మాత్రం దరహాసం తొణికిసలాడుతోంది.

అంత్యక్రియలు ముగిసిన తరువాత అనుచరులు తమ ప్రియతమ నాయకుని చుట్టూ మూగి అత్యంతాసక్తితో అడిగారు:

"దైవప్రవక్తా! మీ ముఖానికి ఈరోజు ఇంతగా చెమట పట్టిందేమిటీ? బట్టలు కూడా తడిసిపోయాయే! చూస్తే సమాధిలో మీరు చాలా శ్రమపడినట్లు అన్పిస్తోంది."

దైవప్రవక్త (స) అనుచరుల మాటలు విని చిరునవ్వు చిందించారు.

"సమాధి మొదలు స్వర్గం చేరేదాకా తనపై నా కారుణ్యఛాయలు ఉండాలని ఈ యువకుడు ముందుగానే నా నుండి హామీ తీసుకున్నాడు. అందువల్ల అతని కోసం ఇప్పుడు వందలాది అప్సరసలు వచ్చి గుమిగూడారు. వారు తమ ప్రియుడి ముఖార విందంలోని సౌందర్య మకరందం జుర్రుకోవడానికి నలువైపుల నుంచి అతనిపై



విరుచుకుపడ్డారు. వారు నా పాదాల పైనుంచి పరుగెత్తి నన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. అందుకే నేను చెమటతో తడిసి ముద్దయిపోయాను" అన్నారు ఆయన.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నోట అమృతం చిందించే ఈ పలుకులు విని అనుచరులు అమితమైన ఆనందంతో పొంగిపోయారు. వారి ఆత్మలు దేహాలలో ఉరకలు వేసే ఉత్సాహంతో ఊగిపోయాయి. వారి విశ్వాసం ద్విగుణీకృతమయి వినూత్న కాంతులతో వెలిగిపోయింది.

# 44. అబూజందల్, అబూబసీర్ (రజి)

హిజ్రీశకం 6వ సంవత్సరం మక్కా సమీపంలోని హుదైబియా ప్రదేశంలో ఖురైష్ బహుదైవారాధకుల తరపున సుహైల్ బిన్ అమ్ర్‌కు, ముస్లింల తరపున మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు మధ్య శాంతిఒప్పందం జరగడానికి సన్నాహాలు ప్రారంభ మయ్యాయి.

సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికాలేదు. అంతలో ఒక యువకుడు మక్కా నుంచి పారిపోయి రొప్పుతూ ముస్లింల దగ్గరికి వచ్చాడు. కాళ్ళకు, చేతులకు సంకెళ్ళు ఉన్నాయి. వాడిపోయిన అతని ముఖంలో దైన్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది.

ఈ పీడితుడు ఎవరో కాదు, సుహైల్ బిన్ అమ్ర్ కుమారుడే. పేరు అబూజందల్. ఇస్లాం స్వీకరించిన నేరానికి అతని జీవితం మక్కాలో దుర్భరమై పోయింది. ఖురైషీయుల చేతుల్లో ఎన్ని బాధలు పడ్డాడో ఈ అభాగ్యజీవి! వారి నుండి తప్పించుకోవడానికి మరెన్ని తిప్పలు పడవలసి వచ్చిందో!!

అబూజందల్ (రజి)ని చూడగానే సుహైల్ తోక తొక్కిన పాములా కస్సుమన్నాడు. అతని కళ్ళు అగ్నికణాలయ్యాయి. వెంటనే అతను కొడుకు దగ్గరికి పోయి పళ్ళు పటపట నూరుతూ విసురుగా ఒక్క లెంపకాయ వేశాడు.

"వీడు నాకొడుకు. నేను వీడి సంరక్షకుడ్ని. ఒప్పందం ప్రకారం మాకు చెందిన ఏ ఒక్కరినీ నిరోధించడానికి మీకిప్పుడు ఎలాంటి అధికారం లేదు. కనుక వీడ్ని నాకప్ప గించండి" అన్నాడు సుహైల్.

"సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికాలేదు కదా?" అన్నారు దైవప్రవక్త (స).

"సంధిపత్రం రాయడం పూర్తికాకపోయినా సంధిషరతులు మన మధ్య ముందే నిర్ణయమై పోయాయి" అన్నాడు సుహైల్.

"ఆవేశపడకండి. ఇతడ్ని మా దగ్గర వదలి పెట్టండి."

"వీల్లేదు. అలాగైతే మాకీ ఒప్పందం అవసరమే లేదు" అన్నాడు సుహైల్ కటువుగా.

దైవప్రవక్త (సల్లం) ఎంతో అనునయంగా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని సుహైల్ మొండికేశాడు. కారుణ్యమూర్తి (సల్లం) హృదయం బాధగా మూల్గింది. కాసేపు మౌనంగా ఉండిపోయారు. తరువాత ఆయన అబూజందల్ (రజి) వైపు తిరిగారు.

"బాబూ! సహనం వహించు. దేవుడు తప్పకుండా ఏదో ఓ దారిని సుగమం చేస్తాడు. ఇప్పుడు ఒప్పందం జరిగిపోయింది. మనం వాగ్దానభంగం చేయలేము కదా!" అన్నారు ఆయన దయార్ద్ర హృదయంతో.

సంధిపత్రం రాయడం పూర్తయింది. సంతకాలు కూడా అయ్యాయి. ఆ తరువాత సుహైల్ బిన్ అమ్ర్ ఆవేశంతో ఊగిపోతూ కొడుకు మెడ పట్టుకొని ఈడ్చుకుంటూ తీసికెళ్ళసాగాడు.

"ముస్లిం సోదరులారా! నేను ఇస్లాం స్వీకరించాను. నన్నీ పరిస్థితిలో చూడదలిచారా మీరు? నన్ను మళ్ళీ అవిశ్వాసుల కబంధహస్తాల్లో పెడుతున్నారా?" అంటూ అబూజందల్ (రజి) చంటిపిల్లాడిలా విలపించారు.

హృదయవిదారకమయిన ఈ దృశ్యం చూసి ముస్లింలు చలించిపోయారు. హజ్రత్ ఉమర్ (రజి) ఉండబట్టలేక వర నుంచి ఖడ్గం తీసి అబూజందల్ (రజి) దగ్గరికి పోయి "ఇదిగో, ఈ కత్తి తీసుకొని ఎదిరించి నిన్ను నీవు కాపాడుకో" అన్నారు.

కాని అబూజందల్ (రజి) అందుకు సాహసించలేకపోయారు. సుహైల్ ఆయన్ని బలవంతంగా మక్కా పట్నానికి లాక్కెళ్ళాడు.

ముస్లింలు మదీనా చేరుకున్నారు. వారు మదీనా తిరిగొచ్చారో లేదో ఖురైషీయులకు చెందిన అబూబసీర్ అనే ఒక పీడిత ముస్లిం మక్కా నుండి పారిపోయి వచ్చాడు.

అబూబసీర్ (రజి) మక్కాలో బహుదైవారాధకుల చిత్రహింసలు భరించలేక మదీనా పారిపోయి వచ్చారు. అయితే కాస్సేపటికి మక్కా బహుదైవారాధకులకు చెందిన ఇద్దరు మనుషులు కూడా ఆయన్ని వెంబడిస్తూ మదీనా వచ్చారు. వారిద్దరి దగ్గర అబూబసీర్ (రజి) యజమాని దైవప్రవక్త (స) పేరిట రాసిన ఓ లేఖ ఉంది. ఆ లేఖలో హుదైబియా ఒడంబడికను ప్రస్తావిస్తూ అబూబసీర్ (రజి)ని అప్పగించమని కోరడం జరిగింది.

ఒకవైపు అసహాయ స్థితిలో ఉన్న అబూబసీర్ (రజి) దీన వదనం! మరోవైపు ఖురైషీయులతో చేసుకున్న శాంతిఒప్పందం!! దైవప్రవక్త (స) క్షణంపాటు ఆలోచనలో పడ్డారు. తరువాత ఓ నిర్ణయానికి వచ్చారు.

"అబూబసీర్! ఖురైషీయులతో మనం ఒప్పందం చేసుకొనిఉన్నాం. మనం ఒప్పందాన్ని ఉల్లంఘించలేము కదా! ఒప్పందాన్ని ఉల్లంఘించడం అధర్మం. అందువల్ల నీవు నీ తెగవాళ్ళ దగ్గరికి తిరిగివెళ్ళిపో" అన్నారు ఆయన బాధగా.



"దైవప్రవక్తా! మీరు నన్ను మళ్ళీ అవిశ్వాసుల దగ్గరికి పంపి వారి దౌర్జన్యకాండకు బలికమ్మంటున్నారా? దేవుడు నన్ను వారి కబంధహస్తాల నుండి కాపాడాడు. కాని మళ్ళీ నన్ను వారి దగ్గరకు...."

"భయపడకు నాయానా! సహనం వహించు. దేవుడు ఏదోమార్గం చూపించకపోడు. వారి హింసాకాండకు గురవుతున్నవారు ఇంకా కొందరున్నారు. దేవుడు వారిని అలాగే వదలిపెట్టడు. వెళ్ళు బాబూ! వెళ్ళు."

దైవప్రవక్త (సల్లం) గుండెను రాయిచేసుకొని ఆ అభాగ్యజీవిని ఖురైష్ ప్రతి నిధులకు అప్పగించారు. వారు హజ్రత్ అబూబసీర్ (రజి)ని బంధించి తమతోపాటు తీసికెళ్ళారు. మదీనా ముస్లింలు ఏమీ చేయలేక ఆ దీనుడి వైపు అసహాయంగా చూస్తూ కంటతడి పెట్టుకున్నారు.

"ఖురైష్ మనుషులిద్దరు అబూబసీర్ (రజి)ని తీసుకొని జుల్‌హులీఫా ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ కాస్తంత విశ్రాంతి తీసుకుందామని ఆగిపోయారు.

వారిలో ఒకడితో హజ్రత్ అబూబసీర్ (రజి), "నీ ఖడ్గం చాలా బాగుందే! ఏది చూద్దాం, ఓసారి ఇటివ్వు" అన్నారు.

అతను ఖడ్గం ఇచ్చాడు. వెంటనే అబూబసీర్ (రజి) ఆ ఖడ్గంతో అతడ్ని ఒక్క దెబ్బతో కడతేర్చారు.

ఈ హఠాత్పరిణామం చూసి రెండవవాడు పలాయనం చిత్తగించాడు. అతను నేరుగా మదీనా వెళ్ళి మసీదులో ప్రవేశించాడు. అతని ముఖంలో కానవస్తున్న భయాం దోళనలను దైవప్రవక్త (సల్లం) గమనించారు.

"ఏమిటి ఇలా వచ్చావు! క్షేమమే కదా!?" అని అడిగారు ఆయన.

"ఏం చెప్పను మహాశయా! మీ మనిషి నాస్నేహితుడ్ని చంపేశాడు. నేనెలాగో తప్పించుకొని వచ్చాను. లేకుంటే నాకూ అదేగతి పట్టేది" అన్నాడు ఖురైష్ మనిషి.

అంతలో హజ్రత్ అబూబసీర్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు.

"దైవప్రవక్తా! మీరు నన్ను ఖురైషీయులకు అప్పగించి మీ కర్తవ్యం నెరవేర్చు కున్నారు. ఇక మీపై ఎలాంటి బాధ్యతలేదు. కాని నేను నా ఆత్మరక్షణ కోసం ఈ పని చేశాను" అని చెప్పి ఆయన అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

హజ్రత్ అబూబసీర్ (రజి) మదీనా నుంచి నేరుగా సముద్ర తీరానికి పోయి అమీస్ అనే చోట ఆగిపోయారు. వెంట తెచ్చుకున్న ఖర్జూరపండ్లతో, సముద్రపు చేపలతో క్షుద్బాధ తీర్చుకుంటూ అక్కడే కాలం గడపసాగారు.

మక్కాలో ఖురైషీయుల హింసాదౌర్జన్యాలకు గురయి అష్టకష్టాలు అనుభవిస్తున్న ఇతర ముస్లింలు ఈ విషయం తెలుసుకొని ఒక్కొక్కరే రహస్యంగా అబూబసీర్ (రజి) దగ్గరికి చేరుకోవడం ప్రారంభించారు. సుహైల్ కొడుకు హజ్రత్ అబూజందల్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు.

ఈవిధంగా కొంతకాలానికే మక్కా నుండి డెబ్భయి మందికి పైగా ముస్లింలు పారిపోయి వచ్చి ఇక్కడ స్థిరపడిపోయారు. మక్కా నుంచి సిరియాకు పోయే, సిరియా నుండి తిరిగొచ్చే వర్తక బిడారాలన్నీ ఈ ప్రాంతం గుండానే వచ్చి పోవలసి ఉంటుంది.

హుదైబియా ఒప్పందం ప్రకారం మక్కా నుండి పారిపోయే ముస్లింలు మదీనా వెళ్ళడానికి వీలులేనందున వారంతా ఈ ప్రాంతానికే వచ్చి చేరుకొని, ఇక్కడకు వచ్చే వాణిజ్యబృందాలపై గెరిల్లాదాడులు చేస్తూ వాటిని దోచుకోవడం ప్రారంభించారు.

ఇలా ఈ పీడితముస్లింలే మక్కా ఖురైషీయులకు పెద్ద బెడదగా తయారయ్యారు. ఏ సంధిషరతుల వల్ల తమ ప్రతిష్ఠ పెరుగుతుందని భావించారో ఆ సంధిషరతులే ఇప్పుడు వారి బ్రతుకుతెరువుకు అవరోధాలుగా మారి ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ పోరు పడలేక ఖురైషీయులు మదీనా వెళ్ళి దైవప్రవక్త (సల్లం)కు మొర పెట్టుకున్నారు. ఒప్పందంలో తాము విధించిన షరతుల్ని ఇప్పుడు తామే ఉపసంహరించుకుంటున్నామని, సముద్రతీరాన ఉన్న శరణార్థుల్ని మదీనా పిలిపించుకొని తమను ఇక్కట్ల నుంచి గట్టెక్కించమని వేడుకున్నారు ఖురైష్ నాయకులు.

దైవప్రవక్త (సల్లం) శత్రువుల అభ్యర్థనను మన్నించారు. ఆయన హజ్రత్ అబూబసీర్ (రజి) దగ్గరికి ఒక లేఖ పంపి అమీస్‌లో నిరాశ్రయజీవితం గడుపుతున్న శరణార్థుల్ని తీసుకొని మదీనా వచ్చేయమని ఆజ్ఞాపించారు.

ఈ లేఖ అబూబసీర్ (రజి) దగ్గరకు చేరుకునే సమయంలో ఆయన వ్యాధిగ్రస్తులై ఉన్నారు. అంచేత ఆయన అబూజందల్ (రజి)ని పిలిచి దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ విన్పిస్తూ "నీవు వెంటనే మనవాళ్ళను తీసుకొని మదీనా వెళ్ళిపో" అని చెప్పారు.

# 45. ఆసిమ్ బిన్ సాబిత్ (రజి)

ఉహద్ కొండల్లో యుద్ధవాతావరణం చల్లబడింది. గెలుపు ఖురైషీయుల వైపే మొగ్గుచూపుతున్నా, ఎందుకో వారు ముస్లింలతో యుద్ధం కొనసాగించలేదు. ముస్లింలు కూడా తమ పోరాటాన్ని ఆపారు. యుద్ధమైదానం సైనికుల మృత దేహాలతో, క్షతగాత్రుల మూల్గుళ్ళతో భయానకంగా ఉంది. ఖురైషిమహిళలు విజయగర్వంతో జూలు విదిలిస్తూ ముస్లింయోధుల మృతదేహాల వైపుకు దూసుకుపోయారు. వాటి ముక్కు, చెవులు, ఇతర అవయవాలను కత్తులతో నరికిపారేస్తూ వికృతంగా చేయసాగారు.



వారిలో ఒక స్త్రీ బదర్‌యుద్ధంలో ముస్లింలు తన తండ్రిని, సోదరుడ్ని, చిన్నాయన్ని హతమార్చినందుకు ప్రతీకారంతో రగిలిపోతూ ముస్లిం మృతదేహాల నరికివేయబడిన అవయవాలను దండగా చేసుకొని మెడలో వేసుకొని తిరగసాగింది.

సులాఫా అనే మరోస్త్రీ మాత్రం వారందరికీ భిన్నంగా తన భర్త, కొడుకుల పరిస్థితి ఏమయిందోనని కంగారుపడుతూ శవాల మధ్య తిరగసాగింది. ఒకచోట భర్తశవం రక్తపుమడుగులో పడివుండటం ఆమెకంట పడింది. దాంతో ఆమె తోకతొక్కిన పాములా బుసలుకొడ్తూ పరుగులు తీసింది.

మరొకచోట ఆమె ముగ్గురు కుమారులు కూడా నేలపై నిస్తేజంగా పడివుండటం కన్పించింది. దగ్గరకుపోయి చూస్తే ఆ ముగ్గురిలో ఇద్దరు ప్రాణం కోల్పోయి ఉన్నారు. మూడోవాడు కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. సులాఫా వెంటనే అతని తల తన ఒడిలోకి తీసుకొని రక్తం తుడుస్తూ "బాబూ! నిన్నెవరు ఈ దుస్థితికి చేర్చారో చెప్పు నాయనా!" అని అడిగింది.

దానికా సైనికుడు శక్తినంతటిని కూడదీసుకొని "ఆ...సిమ్ బిన్ సాబిత్" అన్నాడు అతికష్టమ్మీద. ఆ తరువాత అతనికి నిలువుగుడ్లు పడ్డాయి. అప్పుడామె పెడబొబ్బలు పెడ్తూ "లాత్, ఉజ్జాల సాక్షి! ఖురైషీయులు ఆసిమ్ నుండి ప్రతీకారం తీర్చుకొనంతవరకు, నేను సారాయి తాగడానికి వారతని పుర్రె నాకు అప్పగించనంతవరకు నా కన్నీటిధారలు ఆగవు" అని అన్నది.

తరువాత ఆమె "ఆసిమ్ బిన్ సాబిత్‌ని సజీవంగా బంధించి తెచ్చే లేదా చంపి అతని తలకాయ తెచ్చిచ్చే వారికి బహుమానంగా నేను పెద్దఎత్తున ధనరాసులిస్తాను" అని మొక్కుబడి చేసుకుంది.

ఆ తరువాత కొన్నాళ్ళకు హుజైల్ తెగకు సన్నిహితులయిన అజల్, ఖారా తెగల మనుషులు కొందరు మదీనా వచ్చి దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నారు. ఆయనతో వారు "ముహమ్మద్ గారూ! మా తెగవాళ్ళు ఇస్లాంధర్మం వైపు ఆకర్షితులయ్యారు. వారికి ఇస్లాంధర్మం గురించి వివరించి, దాని ఆదేశాలేమిటో తెలియజేయవలసిన అవసరం ఉంది కదా! అందువల్ల మీరు మా దగ్గరికి కొందరు బోధకులను పంపండి" అని మనవి చేశారు.

ఏ తెగవాళ్ళయినా ఇస్లాం స్వీకరిస్తే వారికి ధర్మవిద్య బోధించేందుకు తన అనుచరులు కొందరిని అక్కడికి పంపడం దైవప్రవక్త సంప్రదాయం. దాని ప్రకారమే ఆయనిప్పుడు ఆరుగురు అనుచరుల్ని ఎంపికచేసి ఆ వ్యక్తుల వెంట పంపించారు.

వారంతా హి.శ. 4వ యేట, ముహర్రం నెల 5వ తేదీన మదీనా నుండి బయలుదేరి మక్కా సమీపంలోని 'రజీ' అనే ఒయాసిస్సు దగ్గరికి చేరుకున్నారు. అక్కడికి చేరుకోగానే

ఆ కొత్తవ్యక్తులు కేకలేస్తూ హుజైల్ తెగవాళ్ళను పిలువసాగారు. ఈధోరణి గమనించిన ముస్లిం బోధకులకు అనుమానం కలిగింది. వారి అనుమానం నిజమే అన్నట్లు అక్కడ దరిదాపుల్లో ఉన్న హుజల్ తెగ సైనికులు పరుగెత్తుకు రావడం కన్పించింది.

ఈ హఠాత్పరిణామానికి ప్రవక్త అనుచరులు బిత్తరబోయారు. తరువాత వెంటనే తేరుకున్నారు. తమల్ని పిలుచుకొచ్చిన ఈ మనుషులు మోసం చేశారని, హుజైల్ సైనికుల చేత చంపించడానికి కుట్రపన్నారని వారు గ్రహించారు.

అలా గ్రహించగానే వారు తమ వరల నుంచి ఖడ్గాలు లాగి శత్రువుల్ని ఎదుర్కో వడానికి సిద్ధమయ్యారు.

"అరె! మేము మిమ్మల్ని హతమార్చడానికి రాలేదే, ఎందుకు మీరిలా కత్తులు బయటికి తీశారు? దైవసాక్షి! మేము మిమ్మల్ని చంపడానికి రాలేదు. మమ్మల్ని నమ్మండి" అన్నారు హుజైల్ సైనికులు.

"వీరు చెబుతున్న మాటలు ఎంతవరకు నిజం? ఒకవేళ వీరి మాటలు నమ్ముకుంటే తాము అనవసరంగా వారికి చిక్కిపోతామేమో!! ఇలా కాకుండా వారితో పోరాడి అమరగతి పొందడమే మంచిది" అని భావించారు ముస్లింలు.

"మీ మాటలపై మాకు నమ్మకం లేదు. మీరు మీ వాగ్దానాలను నిలబెట్టుకుంటారని నమ్మకం ఏమిటీ?" అన్నారు వారు శత్రువులతో.

శత్రువులు చాలామంది ఉన్నారు. వారి ముందు ఈ ముస్లింలు ఏపాటికి వస్తారు? అయినా వారు శత్రువులతో తలపడటానికే సిద్ధమయ్యారు. పర్యవసానం శత్రువులే గెలిచారు. పోరాటంలో ముగ్గురు ముస్లింలు అమరగతులయ్యారు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడి ఖైదీలుగా పట్టుబడ్డారు.

ఈవిధంగా అమరగతులయినవారిలో హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (రజి) కూడా ఉన్నారు. ఆయన ఉహద్‌యుద్ధంలో ముసాఫా అనే శత్రువుని వధించారు. దాంతో ముసాఫా తల్లి సులాఫా హజ్రత్ ఆసిమ్ (రజి)పై తీవ్రంగా పగబూనింది.

ఆసిమ్ తల నరికి తెచ్చినవారికి వంద ఒంటెలు బహుమానంగా ఇస్తానని ఆమె ఓ బహిరంగ ప్రకటన చేసింది. అంతేకాకుండా ఆయన పుర్రెలో సారాయి పోసుకొని మరీ తాగుతానని కూడా ఆమె శపథం చేసింది.

ఈ విషయం హుజైల్ సైనికులందరికీ తెలుసు. ఇప్పుడు ఆసిమ్ (రజి) వధించ బడగానే ఆ వందఒంటెల బహుమతి కొట్టేద్దామన్న ఆశతో వారు ఆసిమ్ (రజి) శవం దగ్గరికి పరుగెత్తుకొచ్చారు. కాని తీరా చూస్తే శవం చుట్టూ ఓ తోడేళ్ళ గుంపు మూగి ఉండటం కన్పించింది. భయంతో ఎవరూ ముందుకు అడుగు వేయలేకపోయారు.



"సరే, ఉండనివ్వండి ఇప్పటికి. సాయంత్రం వచ్చి తల ఖండించి తీసికెళ్దాం" అని తమలోతాము చెప్పుకొని వెళ్ళిపోయారు. కాని సాయంత్రం వచ్చి చూస్తే ఆ శవం తాలూకు అవశేషాలు కూడా లేవక్కడ. అందరూ హతాశులయ్యారు.

వారెళ్ళిపోయిన తరువాత కుంభవృష్టి కురిసింది. దాంతో వరదలొచ్చి హజ్రత్ ఆసిమ్ (రజి) శవం కొట్టుకుపోయింది. సులాఫా కోరిక కూడా నెరవేరలేదు.

# 46. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)

ఆరోజు మదీనా పట్టణం అన్సార్‌లు (ఆదుకున్నవారు), ముహాజిర్‌ల (వలసవచ్చిన వారి) కలయికతో కళకళలాడుతోంది. వారి మధ్య దైవప్రవక్త (సల్లం) నిలబడి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని గురించి బోధిస్తున్నారు. ఆ మహనీయుని నైతికశిక్షణ వల్ల అనుచరుల్లో ఇదివరకే చాలావరకు పరస్పర సోదరభావం పెనవేసుకున్నది. ఇప్పుడీ ప్రత్యేక సమావేశంలో బోధించే ఇస్లాం హితవులతో వారు మరింత ఉత్తేజితులయ్యారు.

ప్రసంగం ముగిసిన తర్వాత కట్టుబట్టలతో మాత్రమే వచ్చిన ముహాజిర్‌ల వైపు చూపిస్తూ "ఇదిగో వీరు మీ సోదరులు" అని అన్సార్‌ల (ఆదుకున్నవారి)కి గుర్తుచేశారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

ఆ తరువాత వరుసగా ఒక్కొక్క ముహాజిర్‌ను, ఒక్కొక్క అన్సార్‌ని పిలిచి "ఈరోజు నుంచి మీరిద్దరు పరస్పరం అన్నదమ్ములు" అని చెప్పనారంభించారు.

అనుచరులకు దైవప్రవక్త (సల్లం) ఆదేశానికి మించిన విషయం మరేదీలేదు. ఆయన ఆజ్ఞాపిస్తే చాలు, తోటిసోదరుని కోసం ప్రాణమైనా సరే అర్పించడానికి సిద్ధం. అందువల్ల అన్సార్ ముస్లింలు పరమసంతోషంతో తమ ముహాజిర్ సోదరుల్ని గుండెలకు హత్తుకున్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి)తో హజ్రత్ ఖారిజా బిన్ జుబైర్ (రజి)కు, ఉమర్ ఫారూఖ్ (రజి)తో ఉత్బాన్ బిన్ మాలిక్ (రజి)కు, అబూఉబైదా బిన్ జిరా (రజి)తో సాద్ బిన్ మాజ్ (రజి)కు, అబ్దుర్రహ్మాన్ (రజి)తో సాద్ బిన్ రబీ (రజి)కు, జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)తో సలామా బిన్ సలామా (రజి)కు, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి)తో సాబిత్ బిన్ ముంజర్ (రజి)కు, తల్హా బిన్‌ఉబైదుల్లా (రజి)తో కాబ్ బిన్‌మాలిక్ (రజి)కు, ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి)తో అబూఅయ్యూబ్ (రజి)కు, అమ్మార్ బిన్ యాసిర్ (రజి)తో హుజైఫా బిన్ యమాన్ (రజి)కు మధ్య సోదరసంబంధాలు ఏర్పాడ్డాయి.

ఇలా యావత్తు ముహాజిర్ ముస్లింలకు అన్సార్ ముస్లింలకు మధ్య దృఢమైన సోదర సంబంధాలు నెలకొన్నాయి.

ఆ తరువాత అన్సార్ ముస్లింలు తమతమ ధార్మిక సోదరుల్ని తమ ఇళ్ళకు తీసికెళ్ళి తమతో సమానంగా సకల సౌకర్యాలు కల్పించారు. ఉన్న ఆస్తిలో అర్ధభాగం పంచిచ్చారు. తమకు చెందిన ప్రతివస్తువునీ, ఎంత విలువైనదైనా సరే, రెండు సమాన భాగాలుగా విభజించి ఇచ్చారు.

ఈ విషయంలో సాద్ బిన్ రబీ అన్సారీ (రజి) అయితే మరింత ముందుకు పోయారు. ఆయన అన్సార్ ముస్లింలలో కెల్లా గొప్పధనికుడు. దేవుడు ఆయనకు సిరిసంపదలతో పాటు విశాలహృదయం కూడా ఇచ్చాడు.

హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి) తన ముహాజిర్ సోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ను తీసుకొని ఇంటికి వెళ్ళారు. ఆయన ఇంట్లో ఉన్న ప్రతి వస్తువునీ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు చూపించి వీటిలో అర్ధభాగం మీదని చెప్పారు. తరువాత ఆయన్ని మరో గదిలోకి పిలిచికెళ్ళి కూర్చోబెట్టారు.

“సోదరా! నేను నా యావత్తు ఆస్తిపాస్తుల్ని, సమస్త వస్తుసామగ్రిని మీకు చూపెట్టాను. అందులో మీకు సగం ఇచ్చేశాను. మీకిష్టమైనవి నిస్సంకోచంగా మీరు తీసుకోవచ్చు.” సాద్ బిన్ రబీ (రజి) తన సహజ ధోరణిలో చెప్పుకుపోతున్నారు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆయన మాటల్ని మౌనంగా వింటున్నారు.

“సోదరా! నాకు ఇద్దరు భార్యలు ఉన్నారు. వారిలో మీకిష్టమైన ఆమెను ఎన్నుకుంటే నేనామెకు విడాకులిస్తాను. ఇద్దత్ గడువు ముగిసిన తరువాత మీరామెను నిస్సంకోచంగా వివాహం చేసుకోండి. మీరు నా ధార్మికసోదరులు. నాకున్న ప్రతి వస్తువులో అర్ధభాగం మీకు రావలసిన హక్కు. వీటిని నేను సంతోషంగా ఇస్తున్నాను, స్వీకరించండి” అన్నారు హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి).

“నా ప్రియసోదరా! దైవం మీ వ్యాపారంలో మరింత శుభం, సమృద్ధులు కలిగించు గాక! ఈ అసామాన్య సోదరభావానికి తగిన బహుమానం కూడా ప్రసాదించుగాక! నాకు వీటిలో ఏదీ అవసరం లేదు. నాకు బజారుకు పోయే దారి చూపండి చాలు” అన్నారు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఎంతో వినయంతో.

కేవలం కట్టుబట్టలతో వచ్చిన ముహాజిర్ ముస్లింలకు ఎన్నెన్ని వస్తువుల అవసరం ఉంటుందో చెప్పనవసరం లేదు. అంతకంటే ఎక్కువే ఇవ్వడానికి అన్సార్ ముస్లింలు ముందుకొచ్చారు. కాని ఇక్కడ చూస్తే ముహాజిర్ ముస్లిం తనకేమి అవసరం లేదంటు న్నాడు. అన్సార్ ముస్లిం ‘ఇది మీ హక్కే, తీసుకోండి’ అంటున్నాడు.

సోదరుడుకాని సోదరుని పట్ల సొంత అన్నదమ్ముల్లో కూడా ఇలాంటి అనురాగం, ఆప్యాయతలు కానరావు. గత చరిత్రలో కూడా ఎక్కడా కన్పించవు.



మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇచ్చిన సుశిక్షణ, ఆయన కనబరచిన సమయ స్ఫూర్తి అలాంటివి మరి! ఇస్లాంలోని ఈ విశ్వమానవ సౌభ్రాతృత్వం ముహాజిర్‌లు, అన్సార్‌ల మధ్య విడదీయరాని అనుబంధం ఏర్పరచింది. ఎనలేని వాత్సల్యం జనింప జేసింది. ఒకరికొకరు ప్రేమా, సానుభూతులతో మెలగసాగారు.

అన్సార్‌ముస్లింలలో ప్రతిఒక్కడూ తనకు ఇష్టమైనదే తన సోదరుని కోసం ఇష్టపడు తున్నాడు. ఆ సోదరునికి చీమకుట్టినా తనకే ఆ చీమ కుట్టినట్లు బాధపడేవాడు.

ముహాజిర్ ముస్లింలు స్వతహాగా కష్టజీవులు. వారికి ఇలా రోజుల తరబడి అన్సార్ ముస్లింల ఆస్తులు హరిస్తూ కూర్చోవడం ఇష్టం లేదు. అందువల్ల కాస్త అవకాశం దొరగ్గానే కష్టపడి పనిచేయ నారంభించారు.

ఈవిధంగా కొంతమంది వ్యాపారం చేపట్టారు. మరి కొంతమంది అన్సారుల పొలాల్లో సేద్యం చేయడానికి, ఇంకొందరు ఇతర కాయకష్టం చేయడానికి పూనుకున్నారు.

కష్టేఫలే అన్నారు. దైవానుగ్రహం వల్ల వారు అనతికాలంలోనే గణనీయమైన అభివృద్ధి సాధించారు. వారి ఆత్మాభిమానం కూడా వారిని ఇతరుల మీద ఆధారపడ కుండా సొంతకాళ్ళ మీద నిలబడటానికి ప్రేరేపించింది.

సాద్ బిన్ రబీ (రజి) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు బజార్ (మార్కెట్)కు పోయే దారి చూపారు. అప్పుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) మార్కెట్‌లోని వస్తువుల్ని ఓసారి పరిశీలించిన తరువాత ప్రజలకు కావాల్సిన కొన్ని నిత్యావసర వస్తువులు కొని అమ్మడం ప్రారంభించారు.

కొన్నాళ్ళలో మహర్‌కు కావలసినంత పైకం లభించగానే ఆయన వివాహం చేసుకున్నారు. తరువాత ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం) ఆయన వంటి మీది పెళ్ళిచిహ్నాలు చూసి “ఏమిటీ వేషం?” అని అడిగారు.

దానికి అబ్దుర్రహ్మాన్ (రజి) “ఈరోజు నేను పెళ్ళిచేసుకున్నా దైవప్రవక్తా!” అన్నారు.

“శుభం. పెళ్ళయితే చేసుకున్నావు బాగానే ఉంది. మరి వలీమా? ఓ మేకయినా సరే కోసి వలీమావిందు కూడా చెయ్యి. దైవం నీ సంపదలో శుభం ప్రసాదించుగాక!” అన్నారు దైవప్రవక్త (స).

విందు జరిగిపోయింది. దైవప్రవక్త (సల్లం)తో పాటు ఆయన అనుచరులు చాలా మంది అందులో పాల్గొన్నారు. ఆనాటి నుంచి హజ్రత్ అబ్దుర్రహ్మాన్ వ్యాపారం దేవుని దయ, ఆయన ప్రవక్త (సల్లం) ఆశీర్వాదాలతో అతివేగంగా వృద్ధిచెందసాగింది. ఆయన పట్టిందల్లా బంగారం కావడం మొదలయింది.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) వ్యాపారం మీదే దృష్టి కేంద్రీకరించకుండా బదర్, ఉహద్ యుద్ధాల్లో కూడా పాల్గొని తన ప్రతిభాపరక్రమాలు ప్రదర్శించారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒక దండయాత్రకు కావలసిన నిధుల కోసం బహిరంగ ప్రకటన చేసినపుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఒక మూట తీసుకొని వచ్చి "దైవప్రవక్తా! నా దగ్గర ప్రస్తుతం నాలుగువేల దిర్హంలు ఉన్నాయి. వాటిలో రెండువేలు నా కుటుంబం కోసం వదలి మిగిలిన రెండువేల దిర్హంలు తెచ్చాను, స్వీకరించండి" అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం) దాన్ని స్వీకరిస్తూ "నువ్వీ దైవకార్యం కోసం ఇచ్చిన దానిలోనూ, నీ భార్యాపిల్లల కోసం వదలిన దానిలోనూ దేవుడు శుభాభివృద్ధులు ప్రసాదించుగాక!" అని అన్నారు.

మరికొన్నాళ్ళకు దైవప్రవక్త (సల్లం) తబూక్ దండయాత్రకు కావలసిన ధనకనక వస్తు సహాయం కోసం మరో బహరంగ ప్రకటన చేశారు. అప్పుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) రెండొందల ఔఖియాలు (అంటే దాదాపు 26 కిలోల బంగారం) తెచ్చిచ్చారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) అది చూసి "అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ భార్యాపిల్లల కోసం ఏమీ వదలిపెట్టకుండా ఇంట్లో ఉన్న ధనమంతా తెచ్చి పెద్ద తప్పు చేశాడు" అని వ్యాఖ్యానించారు.

దైవప్రవక్త (సల్లం) దాన్ని స్వీకరిస్తూ "అబ్దుర్రహ్మాన్! నువ్వు భార్యాపిల్లల కోసం ఏమైనా వదలిపెట్టావా లేదా?" అనడిగారు.

"నేను వారి కోసం వదలిపెట్టింది ఇప్పుడు ఖర్చు చేసినదానికంటే ఎంతో శ్రేష్ఠమైనది." సమాధానమిచ్చారు అబ్దుర్రహ్మాన్ (రజి).

"ఎంత వదలిపెట్టావు?" అడిగారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ.

"దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) పుణ్యఫలం కోసం చేసిన సత్యవాగ్దానం." చెప్పారు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి).

దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత విశ్వాసుల మాతృమూర్తుల వ్యక్తిగత అవసరాల కోసం కావలసిన పైకమంతా హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫే (రజి) సమకూర్చేవారు. అంతేకాదు, వారు ఎక్కడికైనా ప్రయాణం చేయవలసి వచ్చినపుడు ఆయన వారికి అంగరక్షకుడిగా, సేవకుడిగా పనిచేస్తూ వారి వెంటే ప్రయాణం చేసేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే విశ్వాసుల మాతృమూర్తుల్ని కంటికి రెప్పలా కాపాడుతూ అనుక్షణం వారికి అవసరమైన సేవలన్నీ అందిస్తుండేవారు.



అబ్దుర్రహ్మాన్ (రజి) వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూపోయింది. దాంతో ఆయన కోట్లకు పడగలెత్తి ఆనాడు యావన్మంది సహాబీలలో పెద్ద ధనికులయ్యారు.

ఖలీఫా ఉస్మాన్ గని (రజి) పాలనాకాలంలో ఒకసారి సిరియా నుంచి హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి)కు చెందిన ఏడువందల ఒంటెలు కిటకిటలాడే సరుకులతో మదీనా చేరుకున్నాయి. ఈ వాణిజ్యబిడారం చూడగానే సరుకు కొనడానికి వచ్చిన వందలాది మంది వర్తకుల అరుపులు, కేకలతో మదీనా నగరం మార్మోగిపోయింది.

ఈ అరుపులు, కేకల హంగామాతో విశ్వాసులమాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) ఇంట్లో నుండి బయటికొచ్చి "ఏమిటీ అరుపులు, కేకలు?" అనడిగారు జనంతో.

దానికి జనం "అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు చెందిన ఏడువందల ఒంటెలు సిరియా నుండి వివిధరకాల సరుకులతో వచ్చేశాయి. వాటిని కొనడానికి వందలాది వర్తకులు వచ్చారు" అని చెప్పారు.

ఆయిషా (రజి) ఈమాట విని "దేవుడు ఆయనకు ప్రపంచంలో ఇచ్చిన దానిలో శుభం ప్రసాదించుగాక! పరలోక సత్ఫలం అంతకంటే ఎంతో గొప్పది, శ్రేష్ఠమైనది...

...ఓసారి దైవప్రవక్త (సల్లం) ఆయన్ని గురించి మాట్లాడుతూ 'అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ప్రాకుతూ స్వర్గంలో ప్రవేశిస్తాడ'ని చెప్పారు" అని అన్నారు.

ఒకతను ఈమాట విని వెళ్ళి ఒంటెలపై నుంచి సరుకులు దించకముందే హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి)కు తెలియజేశాడు. వెంటనే అబ్దుర్రహ్మాన్ (రజి) హజ్రత్ ఆయిషా (రజి) సన్నిధికి వెళ్ళి "అమ్మా! మీరీ మాట దైవప్రవక్త (సల్లం) నోట విన్నారా?" అని అడిగారు. దానికామె విన్నానన్నారు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) ఈమాట విని పరమానందంతో పరవసించిపోయారు.

ఆ తర్వాత ఆయన హజ్రత్ఆయిషా (రజి)తో "అమ్మా! సాధ్యమైతే నేను నిటారుగా నిలబడి స్వర్గంలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తాను. నేనిప్పుడు మిమ్మల్ని సాక్షిగా చేసి చెబుతున్నాను. ఏడొందల ఒంటెలతో కూడిన ఈ వాణిజ్యబిడారం, ఒంటెల జీనులతో సహా వాటిపై ఉన్న మొత్తం సరుకుల్ని నేను దైవప్రసన్నత కోసం దానం చేస్తున్నాను" అని అన్నారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఈమాట విన్న తరువాత తరచుగా "దేవుడు ఆయనకు సల్సబీల్ సెలయేరులోని సుమధుర మద్యం తాగించుగాక!" అని ప్రార్థించేవారు.

హజ్రత్ ఆయిషా (రజి) నోట స్వర్గశుభవార్త విన్న నాటినుండి హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) వ్యాపారాభివృద్ధి పట్ల, ఆ సంపాదనలో వీలైనంత ఎక్కువ దైవమార్గంలో ఖర్చు

పెట్టడం పట్ల అసాధారణ శ్రద్ధాసక్తులు కనబరచసాగారు. బీదసాదలకు బహిరంగంగా, రహస్యంగా విచ్చలవిడిగా దానం చేసేవారు. సమరయోధులకు వందలాది గుర్రాలు, ఒంటెలు సమకూర్చారు. ఆయన తన జీవిత చరమఘడియలు సమీపించినపుడు వందలమంది బానిసలను బానిసత్వం నుంచి విముక్తి కలిగించారు.

బదర్‌యుద్ధంలో పాల్గొని అప్పటివరకు జీవించివున్న వందమంది సహాబీలకు ఒక్కొక్కరికి నాలుగొందలు దీనార్ల చొప్పున తన ఆస్తి నుండి ఇవ్వాలని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) వీలునామా రాశారు.

ఆయన తన వారసుల కోసం కోట్లాది దీనార్ల ధనం వదలివెళ్ళారు. వేయి ఒంటెలు, వంద గుర్రాలు, మూడువేలు మేకలను కూడా వదలివెళ్ళారు. వెండిబంగారాలు కిలోలు కాదు, టన్నుల్లో ఉన్నాయి. వాటిని తన వారసులకు పంపిణీ చేయడానికి వాటిని గొడ్డళ్ళతో నరకవలసి వచ్చింది.

ఈవిధంగా దేవుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి)కు లెక్కలేనన్ని సిరిసంపదలు ప్రసాదించినప్పటికీ ఆయన అణుమాత్రం కూడా అహంకారానికి లోనుకాలేదు. ఆయన అణుకువ, నిరాడంబరతలను గురించి చెప్పాలంటే చూసే వారికి ఆయనకు, ఆయన బానిసలకు మధ్య తేడే కన్పించేదికాదు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఇస్లాం స్వీకరించిన మొట్టమొదటి ఎనిమిది మంది అదృష్టవంతుల్లో ఒకరు; స్వర్గశుభవార్త అందజేయబడిన పదిమంది పుణ్యాత్ముల్లో ఆయన ఒకరు.

ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) తన రాజకీయవారసుని ఎన్నిక కోసం నియమించిన ఆర్గురు ఎలక్షన్ కమీషన్ సభ్యుల్లో ఆయన ఒకరు. అంతేకాదు, ఏదైనా సమస్య వచ్చినపుడు దైవప్రవక్త (సల్లం) సమక్షంలో ఫత్వా జారీచేసే అధికారం ఇవ్వబడిన కొద్దిమంది ప్రత్యేక ధర్మవేత్తల్లో కూడా ఆయన ఒకరై ఉన్నారు.

ఇస్లాం స్వీకరించిన తరువాత హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) కూడా అనేక కఠిన పరీక్షలను ఎదుర్కోవలసి వచ్చింది. అయినప్పటికీ దైవధర్మం పట్ల ఆయన విశ్వాసంలో ఏమాత్రం సడలింపు రాలేదు.

మక్కాలో అవిశ్వాసుల ఆగడాలు హద్దుమీరినపుడు దైవప్రవక్త (సల్లం) అనుమతితో ఆయన కూడా అబిసీనియాకు వలసవెళ్ళారు. మక్కా తిరిగొచ్చిన తర్వాత మదీనాకు వలసపోయిన మొదటిబృందంలో చేరి మదీనా వెళ్ళారు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) ఖలీఫా ఉస్మాన్ (రజి) పాలనాకాలంలో చనిపోయారు. ఆయన జనాజానమాజ్ స్వయంగా ఖలీఫా ఉస్మాన్ (రజి) చేశారు.



# 47. అబ్దుల్లా బిన్ సలాం (రజి)

దైవప్రవక్త (స) పట్నం వస్తున్నారని మదీనావారందరికీ తెలిసిపోయింది. ఇంకే ముంది! ఆనందభరితమైన ఓ కలకలం బయలుదేరింది. ముస్లింలు, యూదులు, బహుదైవారాధకులు అంతా అమితసంతోషంతో ఎగిరి గంతులేశారు. ఆనంద డోలికల్లో ఊగుతూ గానాలాపనం చేయసాగారు. అంతులేని అనురాగంతో, ఆగలేని ఆత్రంతో ఆడసాగారు. పరమసంతోషంతో పరవశించిపోతూ పాడసాగారు.

ప్రతి మనిషి కళ్ళలో దైవసందేశహరుని (సల్లం) కోసం నిరీక్షణా జ్యోతులు వెలిగిపోతున్నాయి.

చిన్నారి పిల్లలు సైతం సంతోషంతో వీధి వీధి తిరుగుతూ "ప్రియప్రవక్త వస్తున్నారు, త్వరలో వస్తున్నారు" అని చెబుతూ అపార సంతోషంతో గంతులేయసాగారు.

వారు ప్రతిరోజూ ఉదయాన్నే పట్నం బయటికెళ్ళి, కళ్ళలో వత్తులు వేసుకొని దైవప్రవక్త (సల్లం) వచ్చే దారి వైపు గంటల తరబడి చూసేవారు. అలా మధ్యాహ్నం దాకా చూసి, వచ్చే జాడ కన్పడక పోవడంతో నిరాశపడి ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోయేవారు.

అలాంటి పరిస్థితిలో ఓరోజు హఠాత్తుగా..... "మదీనా ప్రజలారా! మీరు ఎవరికోసం ఇన్నాళ్ళ నుంచి ఎదురుచూస్తున్నారో ఆయన వచ్చేశారు" అని ఓ గుట్ట పైనుంచి ఒక యూదుని గొంతు పట్నంలో ప్రతిధ్వనించింది.

అంతే, ఆ కేక విని మదీనా ప్రజావాహిని ఆనందాతిశయంతో పరవళ్ళుతొక్కింది. పెద్దలు, పిల్లలు, స్త్రీలు, పురుషులు ఆబాలగోపాలమంతా బిలబిలమంటూ ఇళ్ళలో నుంచి బయటికి వచ్చారు.

వారిలో ప్రతి ఒక్కడూ పట్టరాని సంతోషంతో వీధుల్లోకి దూసుకు వచ్చాడు. అందరి కళ్ళు పూర్ణశశాంకుడ్ని చూసిన కలువపువ్వుల్లా ఒక్కసారిగా వికసించాయి. బాలబాలికల ఆనందం అవధులు దాటింది. ప్రతి ఒక్కడూ తనకేదో గొప్ప పెన్నిధి లభించబోతున్నట్లు మహా సంబరపడిపోతున్నాడు.

ఎక్కడ చూసినా ఒకటే సందడి. ఆఖరికి చంటిపిల్లలు సయితం ఏడ్పులు మానేసి, సంతోషంతో కేరింతలు కొట్టడం ప్రారంభించారు. అంతా ఆనందడోలికల్లో ఉర్రూతలూగ సాగారు. ముస్లింలు, యూదులు, బహుదైవారాధకులు..... ఒకరేమిటీ? యావన్మంది ప్రజలు కుల మత వర్ణ వర్గ విభేదాలు లేకుండా ఆ విశిష్ఠ వ్యక్తి దర్శనభాగ్యం కోసం తహతహలాడి పోతున్నారు.

ముందుగా పెద్దలు, వృద్ధులు స్వాగతం చెప్పడానికి అంతులేని ఉత్సాహంతో పట్నం బయటికిపోయి నిరీక్షించసాగారు. అలా చూస్తుండగానే వారి కళ్ళు తళుక్కున

మెరిశాయి. ఆయన వచ్చేశారు. నిరీక్షణా ఘడియలకు గడిపెట్టి వచ్చేశారు. ప్రియ సహచరులు ఎంతో ఆనందంతో ఆలింగనం చేసుకొని ఆయన్ని తీసుకువస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా జనం తండోపతండలుగా వస్తున్నారు. ఖుబా నుంచి మదీనా వరకు మూడు మైళ్ళ పొడవున దైవప్రవక్త (స)కు ఇరువైపులా అనుచరులు బారులుతీరి నిలబడ్డారు. అక్కడక్కడ వారి మధ్య కొందరు పిల్లలు కూడా ముందుకు తోసుకుంటూ ఆ మహనీయుడ్ని చూడటానికి ఆరాటపడిపోతున్నారు.

అది శుక్రవారం. దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో బనీసాలమ్ వాడలోకి వచ్చేటప్పటికి జుమానమాజ్ వేళయింది. అంతా కలిసి అక్కడ నమాజ్ చేశారు.

తరువాత ఆయన బయలుదేరి తన మాతృమూర్తి వంశస్థులు నివసిస్తున్న ప్రదేశం మీద కాలు మోపారు. తన రక్తమాంసాల కోసం ఎగబడిన ఖురైషీయులకు వ్యతిరేకంగా తన పట్ల అచంచల విశ్వాసంతో ప్రాణత్యాగమైనా చేయడానికి సిద్ధమైన ధర్మయోధుల పవిత్ర నగరంలో అడుగుపెట్టారు.

దైవప్రవక్త (సల్లం) మదీనా వచ్చినప్పుడు హుసీన్ బిన్ సలాం అనే ప్రఖ్యాత యూదపండితుడు ఓ చెట్టెక్కి దాన్నేదో సరిచేస్తున్నాడు. క్రింద అతని మేనత్త ఖాలిదా నిల్చొని ఉంది. దైవప్రవక్త (సల్లం) మదీనా వచ్చారని తెలియగానే హుసీన్ ఆనందం అవధులు దాటింది. సంతోషం అణచుకోలేక 'అల్లాహుఅక్బర్' అని నినదించాడు.

కాని ఆయన ధోరణి మేనత్త ఖాలిదాకు ఆశ్చర్యం కలిగించింది.

"దైవం నిన్ను కాపాడుగాక! మెదడు సరిగ్గానే ఉందా? మూసా (అలైహి) వచ్చారన్న శుభవార్త విని కూడా నీవింతగా సంతోషించవేమో!" అన్నది ఆమె.

"అత్తయ్యా! నీకు తెలియదా? ఈయన మూసా ప్రవక్త సోదరుడే. మూసా బోధించిన ధర్మాన్నే తెచ్చారు. ఆయన ప్రకటించిన సందేశాన్నే చాటుతున్నారు. ఇద్దరూ ఒక దారిన నడిచే బాటసారులు. ఒకే ధర్మం వైతాళికులు" అన్నారు హుసీన్ (రజి).

"ఏమిటీ! ఈయన మనగ్రంథంలో ప్రకటించబడిన దైవప్రవక్తే అయి ఉంటాడని అంటున్నావా?" అప్పుడు హుసీన్ "ఔనత్తయ్యా! ఈయనే ఆయన. ఆయనే ఈయన." అన్నారు. దానికి ఖాలిదా "అలాగా, అయితే సంతోషకరమైన విషయమే" అన్నది.

ఆ తరువాత హుసీన్ (రజి) మహాప్రవక్త (స) సన్నిధికి పోయి ఇస్లాం స్వీకరించారు. అప్పుడాయనకు దైవప్రవక్త (స) 'అబ్దుల్లా' అని పేరు పెట్టారు.

అబ్దుల్లా (రజి) అక్కడ్నుంచి తిరిగొచ్చి తన కుటుంబసభ్యులకు ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేశారు. దాంతో ఇంటిల్లిపాదీ ఇస్లాం స్వీకరించింది.



కాని ఈ విషయం అబ్దుల్లా బిన్ సలాం (రజి) యూదుల ముందు బహిర్గతం చేయలేదు. ఆయన దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి ఇలా అన్నారు: "దైవప్రవక్తా! యూదులు అసత్యవాదులు. వారికి కన్పించకుండా నన్ను మీరొక గదిలో కూర్చోబెట్టండి. తరువాత నేనెలాంటివాడినో, వారి దగ్గర నాకున్న స్థానం ఏమిటో స్వయంగా మీరే వారిని అడగండి. నేను ఇస్లాం స్వీకరించినట్లు వారికింకా చెప్పలేదు. అందువల్ల వారు ఉన్నది ఉన్నట్లు చెప్పి తీరుతారు. ఆ తరువాత నాలో లేని తప్పులన్నీ నాకు అంటగడతారు. ప్రపంచంలోని ప్రతి నిందను నాపై మోపుతారు."

అబ్దుల్లా బిన్ సలాం (రజి) చెప్పినట్లే దైవప్రవక్త (సల్లం) ఆయన్ని రహస్యంగా ఓ గదిలో కూర్చోబెట్టి యూదుల్ని పిలిపించారు. యూదనాయకులు వచ్చిన తరువాత దైవప్రవక్త (సల్లం) వారితో చర్చలు ప్రారంభించారు.

"హుసీన్ బిన్ సలాం గురించి మీ అభిప్రాయం ఏమిటీ?" అడిగారు ఆయన. దానికి యూదులు "ఆయన మా నాయకుడు. మాకు మంచిమార్గదర్శి, గొప్ప జ్ఞానసంపన్నుడు. విజ్ఞుడు, వివేచనాపరుడు" అన్నారు ముక్తకంఠంతో.

ఆ సమయంలో అక్కడే వేరేగదిలో వారికి కనపడకుండా కూర్చున్న అబ్దుల్లా బిన్ సలాం (రజి) తన జాతివాళ్ళ మాటలు వినగానే వారి ముందుకొచ్చి ఇలా అన్నారు:

"యూదసోదరులారా! దైవానికి భయపడండి. ఈయన మాటలు వినండి. ఈయన దైవసందేశహరుడని మీకు తెలిసేవుంది. తౌరాత్‌లో ఈయన ప్రస్తావన స్పష్టంగా ఉంది. అందులో ఈయన గుణగణాలన్నీ వర్ణించబడ్డాయి. నేను మటుకు ఈయన దైవప్రవక్తని సాక్ష్యమిస్తున్నాను. నేనీయన్ని పూర్తిగా గుర్తించాను. ఈయన అన్నివిధాలా సత్యవంతుడని విశ్వసిస్తున్నాను. ఈయన ఏది చెప్పినా నేను శిరసావహిస్తాను."

అదొక విచిత్ర సన్నివేశం. యూదులు కాస్తయినా ఊహించని సన్నివేశం. వారి ఆశలకు పూర్తిగా భిన్నమైనది. తమ ప్రియతమ నాయకుడు, గొప్ప మతాచార్యుడయిన హుసీన్ నోట తాము ఇలాంటి మాటలు వినవలసి వస్తుందని వారు కలలో కూడా ఊహించలేదు. అందువల్ల ఈ హఠాత్పరిణామానికి వారు నిర్ఘాంతపోయారు. వెంటనే తేరుకున్నారు. ఆ మరుక్షణమే వారు రంగుమార్చి హుసీన్ (అబ్దుల్లా బిన్ సలాం-రజి)పై నిప్పులు కురిపించారు.

"ఏమిటీ! మీరు ఇతడ్ని గురించి అడిగారా? మేము మీమాట సరిగా అర్థం చేసుకోలేక మరో హుసీన్ గురించేమో అనుకున్నాం. ఇతనయితే వట్టి మందమతి. బుద్ధిలేని చాందసుడు. విజ్ఞతావివేచనలు ఇతనిలో ఏకోశానా లేవు. మేమింతవరకు ఇతని నోట మంచిమాట ఒక్కటీ వినలేదు. ఎల్లప్పుడూ పనికిమాలిన మాటలే పలుకుతుంటాడు" అన్నారు యూదులు.

"దైవప్రవక్తా! చూశారా? నేను ముందే చెప్పలేదూ వీరు చాలాదుర్మార్గులని! అబద్ధమాడటంలో ఆరితేరినవారు. నిందలు మోపడంలో మహా నిపుణులు" అన్నారు అబ్దుల్లా బిన్ సలాం (రజి).

అబ్దుల్లా బిన్ సలాం (రజి) గొప్ప పండితులు, ప్రముఖ ధర్మవేత్త. యూద మతవేత్తల్లో గొప్ప స్థానం కలవారు. ఇతర యూదపండితుల్లాగానే ఈయన కూడా అంతిమ దైవప్రవక్త (సల్లం) గుణగణాలు, ఆయన ప్రభవన కాలం గురించి బాగా ఎరిగిన పండితుడు.

ఒకసారి మదీనాలోని మస్జిదెనబవీలో కొందరు సమావేశమై ధార్మికవిషయాలు చర్చించుకోసాగారు. ఆ సమావేశంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ సలాం (రజి) కూడా ఉన్నారు. ఆయన నోట వెలువడుతున్న పలుకులు సభికుల్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సమావేశం ముగిసిన తరువాత ఆయన లేచి ఇంటికి బయలుదేరారు.

అప్పుడు కొందరు "మీలో ఎవరైనా స్వర్గవాసిని చూడదలచుకుంటే అతనా వ్యక్తిని చూడవచ్చు" అని అన్నారు.

అప్పుడు ఖైస్ బిన్ ఉబాదా (రజి) "ఎవరీ మహనీయుడు?" అని ప్రశ్నించారు.

దానికి జనం "ఈయన అబ్దుల్లా బిన్ సలాం (రజి)" అని సమాధానమిచ్చారు.

ఖైస్ బిన్ ఉబాదా (రజి) ఈమాట విని ఆయన వెనకాల నడిచారు. అబ్దుల్లా బిన్ సలాం (రజి) ఇంటికి చేరుకొని లోపల ప్రవేశించారు. హజ్రత్ ఖైస్ (రజి) లోపలికి రావడానికి అనుమతి అడిగారు.

అందుకాయన అనుమతిస్తూ "చెప్పు నాయనా! ఏమిటీ విశేషం ఇలా వచ్చావు?" అని ప్రశ్నించారు.

"మీరు మస్జిద్ నుండి వెళ్ళిపోతున్నపుడు కొందరు మీ గురించి 'ఎవరైనా స్వర్గ వాసిని చూడదలచుకుంటే ఆయన్ని చూడవచ్చు' అని అన్నారు. అందువల్ల మీరు స్వర్గవాసుల్లో చేరిపోయినట్లు ప్రజలకు ఎలా తెలిసిందో తెలుసుకోవడానికి నేను మీ దగ్గరకు వచ్చాను" అన్నారు ఖైస్ బిన్ ఉబాదా (రజి).

"స్వర్గవాసి ఎవరో దేవునికి మాత్రమే తెలుసు" అన్నారు అబ్దుల్లా (రజి).

"అది నిజమే. కాని జనం ఇలా అంటున్నారంటే దానికి ఏదో కారణం ఉండవచ్చు కదా!" అన్నారు హజ్రత్ ఖైస్ (రజి).

"ఉంది. దీన్ని గురించి నేను దైవప్రవక్త (సల్లం) కాలంలో జరిగిన ఓ సంఘటన చెబుతాను విను" అంటూ అబ్దుల్లా బిన్ సలాం (రజి) ఇలా తెలియజేశారు-



"ఒకరోజు రాత్రి నేను పడుకొనివుంటే కలలో ఒకతను వచ్చి "లే" అన్నాడు. నేను లేచినిల్చున్నాను. ఆ వ్యక్తి నా చేయి పట్టుకొని నడిచాడు. కొంతదూరం నడిచిన తర్వాత ఎడమవైపుకు పోయే దారి కన్పించింది. నేనా దారిన నడుద్దామని అటువైపు తిరిగాను. కాని అతను "అటుకాదు, ఇటు. ఆ దారి నీకోసం కాదు" అన్నాడు.

"నేను కాస్త ముందుకు నడిచి చూస్తే కుడివైపుకు పోయే మరోదారి కన్పించింది. అతను చెప్పినట్లు నేనా దారిన నడిచాను. అలా ముందుకు సాగుతూ చివరికి ఒక తోటలోకి ప్రవేశించాను...

...ఆ తోట ఎంతో విశాలంగా, పచ్చగా, మనోహరంగా ఉంది. అందులో నలు వైపులా వీనులవిందు గొలిపే పాటలు పాడేవారున్నారు. తోట మధ్య ఓ ఇనుపస్తంభం కూడా ఉంది...

...ఆ వ్యక్తి నన్ను దానిపైకి ఎక్కు అన్నాడు. నేను ఎక్కలేను అన్నాను. అప్పుడు ఒక సేవకుడు వచ్చి నన్ను పైకి లేపాడు. నేనతని సహాయంతో ఆ స్తంభం మీద పాకుతూ వృత్తాకారంగా ఉన్న దాని కొనవరకు చేరుకొని రెండు చేతులతో ఆ వృత్తాకారాన్ని గట్టిగా పట్టుకున్నాను. ఆ విధంగా తెల్లవారేదాకా పట్టుకొని ఉన్నాను...

"తెల్లవారిన తరువాత నేను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి చేరుకొని నా కల గురించి ఆయనకు వివరించాను. ఆయన అది విని 'నీవు ఎడమవైపు చూసిన దారి వామపక్షం వాళ్ళు (నరకవాసులు) పోయేదారి. నీవు కుడివైపు చూసిన దారి కుడిపక్షంవాళ్ళు (స్వర్గ వాసులు) పోయేదారి. నీవు చూసిన మనోహరమైన తోట ఇస్లాం. దాని మధ్య ఉన్న స్తంభం దైవధర్మ స్తంభం. దానిపై ఉన్న వృత్తం అది పటిష్ఠమైన వృత్తం. నీవా వృత్తాన్ని జీవితాంతం దృఢంగా పట్టుకొని ఉంటావు' అని చెప్పారు."

# 48. ఉతెబా బిన్ గజ్వాన్ (రజి)

ఈరానీయులు ముస్లింల చేతిలో మాటిమాటికి చావుదెబ్బ తింటున్నప్పటికీ వెంటనే వారికి తమ ప్రధాన సైనికస్థావరాల నుండి ధన, సైనిక సహాయం లభిస్తుండేది. దాంతో వారు రెచ్చిపోయి మళ్ళీ మళ్ళీ దాడులకు పాల్పడసాగారు. అలాంటి సైనికస్థావరాల్లో ఉబులా ఒకటి.

ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈరాన్ సైన్యాలకు అందుతున్న ధన, సైనిక సహాయాన్ని అడ్డుకోవడానికి 'ఉబులా' పట్టణం వైపుకు ఒక సైనికదళాన్ని పంపడానికి నిశ్చయించుకున్నారు. అయితే మదీనాలో అప్పుడు సమర యోధులు చాలా తక్కువమంది ఉన్నారు. అంచేత ఆయన తక్కువమంది సైనికులతో వ్యూహాత్మకంగా పోరాడగలిగే సమర్థుడైన నాయకుడి కోసం అన్వేషించారు.

చివరికి ఆయన దృష్టి హజ్రత్ ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) మీద పడింది. మరుసటి రోజు ఆయన ఉతెబా (రజి) నేతృత్వంలో మూడొందల మంది యోధులతో కూడిన ఒక సైనిక దళమిచ్చి ఉబలా వైపుకు పంపారు.

ఇస్లాం స్వీకరించిన ప్రప్రథమ విశ్వాసుల్లో ఉతెబా (రజి) ఏడవ వ్యక్తి. ఆయన రెండుసార్లు (అబిసీనియా, మదీనాలకు) హిజ్రత్ చేశారు. బదర్, ఉహద్, అహ్జాబ్, యమామా యుద్ధాల్లో పాల్గొని తన ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించారు.

హజ్రత్ ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) ఆ కొద్దిపాటి సైన్యం తీసుకొని బయలు దేరారు. దారిలో ఖలీఫా పంపిన మరో మూడొందల మంది యోధులు కలిశారు. మొత్తం సైనిక దళంలో కొందరు స్త్రీలు కూడా ఉన్నారు.

సైనికులు ఉబలా పట్టణానికి చేరుకోక ముందే ఆహారపదార్థాలు నిండుకోవడంతో ఒక ప్రదేశంలో విడిదిచేశారు. అందరూ ఆకలితో నకనక లాడసాగారు.

ముజాహిద్‌లు ఆహారం కోసం అన్వేషిస్తే వారికి ఒకచోట ఏవో వస్తువులతో నిండిన రెండు బస్తాలు లభించాయి. వాటిలో ఒకదానిలో ఖర్జూరపండ్లున్నాయి. రెండవ దానిలో ఏవో ధాన్యపు గింజలు ఉన్నాయి. ఒక సైనికుడు వాటిని చూసి "ఇందులో ఏదో విషమున్నట్లు అన్పిస్తోంది నాకు. శత్రువులు మనల్ని చంపడానికి పన్నిన పన్నాగం ఇది" అని అన్నాడు.

అంచేత సైనికులు వాటిని వదలి ఖర్జూరపండ్ల మీద ఎగబడ్డారు. కాని కొద్దిపాటి ఆ ఖర్జూరపండ్లతో వారి ఆకలి తీరలేదు.

యోధులు అర్ధాకలితో బాధపడుతూ ఏం చెయ్యాలన్న ఆలోచనలో పడిపోయారు. అప్పుడు వారిలో ఒక మహిళ లేచి "విషం కలసిన పదార్థాన్ని వేడిచేస్తే దాని విషప్రభావం పోతుందని మా నాన్నగారు చెబితే విన్నాను" అని చెప్పింది.

సైనికులు ఈమాట విని వెంటనే పొయ్యిరాజేసి ఆ ధాన్యాన్ని పొయ్యి మీద పెట్టి వండారు. కాస్సేపటికి ఆ ధాన్యం ఎరుపెక్కి, వాటిమీది పొట్టు పోయి తెల్లటి బియ్యపు గింజలు బయటికొచ్చాయి. కాస్సేపట్లో వరి అన్నం తయారైపోయింది. సమరయోధులు సంతోషంతో దాన్ని కడుపునిండా తిని దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నారు.

ఆ తరువాత వారు దజ్లా నదీతీరాన వున్న ఉబలా పట్టణం సమీపానికి చేరుకున్నారు. ఆ పట్టణాన్ని ఈరానీయులు తమ ఆయుధగారంగా చేసుకున్నారు. పట్టణం చుట్టూ వున్న ప్రహరీగోడ బురుజులపై వారి సైనికులు అహోరాత్రులు కాపలా కాస్తుంటారు.



ఆరొందల మంది యోధులు అనేక వేలమంది శత్రుసైనికులతో తలపడటం చాలా కష్టం. అంచేత సేనాపతి ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) స్త్రీలను పురుష పంక్తులకు వెనుక ఉంచి "మేము పట్టణం సమీపించగానే మీరు మావెనుక ఉవ్వెత్తున దుమ్ము-ధూళి లేపుతూ పరిసరాలు మసకబారేలా చేయండి" అని ఆదేశించారు.

ఈ ఆదేశం ప్రకారం పట్టణం దగ్గరకు రాగానే స్త్రీలు పెద్ద ఎత్తున దుమ్ము-ధూళి లేపుతూ, యుద్ధపతాకాలు ఊపుతూ దూసుకురాసాగారు.

కోట బురుజులపై కాపలా కాస్తున్న ఈరానీయులు ఈ దృశ్యం చూసి తమ నాయకులకు సమాచారం అందజేశారు. అప్పుడా నాయకులు కోట తలుపులు తెరచి బయటికొచ్చి చూస్తే ఫ్రంట్‌లైన్ సైనికుల వెనుక ఉవ్వెత్తున లేచిన దుమ్ము తప్ప మరేమీ కన్పించలేదు వారికి.

దాంతో వారు శత్రువులు తమ కంటే అత్యధికసంఖ్యలో ఉంటారని భావించి భయపడిపోయారు. వెంటనే ఈరానీ సైనికులు తమ దగ్గరున్న విలువైన సామగ్రి తీసుకొని నదీతీరం మీదున్న పడవల వైపుకు పరుగెత్తారు. బ్రతికుంటే బలుచాకైనా తినొచ్చని భావిస్తూ పడవల మీదెక్కి పారిపోయారు.

ముస్లిం యోధులు ఎలాంటి పోరాటం, ప్రతిఘటనలు లేకుండా ఉబలా పట్టణాన్ని సులభంగా స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత ఆ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా విజయపతాకాలు ఎగరేశారు. ఈ దండయాత్రలో వారికి పెద్దఎత్తున సమరసొత్తు లభించింది.

ఆ తరువాత సేనాపతి ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) ఖలీఫా అనుమతి తీసుకొని అక్కడ ఓ అందమైన పట్టణం నెలకొల్పారు. దాని పేరే 'బస్రా'.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన్ని బస్రా గవర్నర్‌గా నియమించారు. అక్కడ ముస్లిలు సువిశాలమైన ఇండ్లలో నివశిస్తూ, ఇదివరకెన్నడూ ధరించని ఖరీదైన బట్టలు ధరిస్తూ, ఇంతకు ముందెన్నడూ తినని రుచికరమైన ఆహారపదార్థాలు తింటూ విలాసవంతమైన జీవితం గడపసాగారు.

కాని గవర్నర్ హజ్రత్ ఉతెబా (రజి) మాత్రం సాధారణ తిండి తింటూ, కంబళ్ళతో కట్టుకున్న ఓ చిన్న గుడారంలో ఉండసాగారు. ఆయనకు తన అనుచరుల విలాసజీవితం ఏమాత్రం నచ్చలేదు. అంచేత ఆయన ఓరోజు అందర్నీ మసీదులో సమావేశపరచి క్షణ భంగురం లాంటి ప్రాపంచిక జీవితంలోని తళుకుబెళుకులు చూసి మోసపోవద్దని, పరలోక జీవిత సౌఖ్యాల కోసం పాటుపడాలని ఉపదేశించారు.

ఆ తరువాత ఆయన తన స్థానంలో మరొకర్ని గవర్నంగా నియమించి మదీనా వెళ్ళిపోయారు. మదీనాలో ఖలీఫాను కలుసుకొని తన గవర్నర్‌పదవికి రాజీనామా చేశారు.

అయితే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన రాజీనామాను ఆమోదించకుండా తిరిగి ఆయన్ని బస్రా పంపివేశారు. హజ్రత్ ఉతెబా (రజి) తనకు గవర్నర్ పదవి ఇష్టం లేకున్నా ఖలీఫా ఆజ్ఞను శిరసావహిస్తూ బస్రా వెళ్ళడానికి సిద్ధమై ఒంటె ఎక్కారు.

ఆ సమయంలో ఆయన "దేవా! నన్ను మళ్ళీ అక్కడికి తీసికెళ్ళకు. దేవా! నా మొరాలకించు" అని దుఆ చేశారు. ఆయన వేడుకోలును సృష్టికర్త స్వీకరించాడు. హజ్రత్ ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) మదీనా నుండి కొన్నిమైళ్ళు పోయారో లేదో ఆయన ఒంటె కాలుజారి దబేలున క్రింద పడిపోయింది. దాంతో ఆయన కూడా కొద్ది దూరంలో పడిపోయి ఊపిరి విడిచారు.

# 49. ఉసైద్ బిన్ హుజైర్ (రజి)

దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం హజ్రత్ ముస్అబ్ బిన్ఉమైర్ (రజి) మదీనా చేరుకొని అసద్ బిన్ జురారా (రజి) ఇంట్లో విడిదిచేశారు. ఆ ఇంటినే ప్రచారకేంద్రంగా చేసుకొని పని ప్రారంభించారు. దాంతో మదీనాలో ఇస్లాం వేగంగా విస్తరించసాగింది.

ఎంతోకాలం నుంచి సత్యపిపాసతో అలమటిస్తున్న మదీనా ప్రజలకు ఇస్లాం శాంతి ప్రసాదించింది. ఇస్లాం శుభాలు చూడగానే, ఖుర్ఆన్ సూక్తులు వినగానే పాషాణ హృదయాలు సైతం మైనంలా కరిగిపోసాగాయి.

ఔస్‌తెగలో బనీఅబ్దుల్ అష్హల్, బనీజఫర్ అనే రెండు ఉప తెగలున్నాయి. ఇవి మిగతా ఉపతెగలన్నిటిలో ఎంతో శక్తిమంతమైనవి. సాద్ బిన్ ముఆజ్ బనీఅబ్దుల్ అష్హల్ ఉపతెగ నాయకుడేగాక, ఔస్‌తెగలోని ఉపతెగలన్నిటికీ అగ్రనాయకుడిగా ఉన్నాడు. ఉసైద్ బిన్ హుజైర్ జఫర్‌తెగకు నాయకుడిగా ఉన్నాడు.

ఒక రోజు ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి), అసద్ బిన్ జురారా (రజి)లు బనీ అబ్దుల్అష్హల్ వాడలోని ఓబావి దగ్గర కూర్చొని మాట్లాడుకోసాగారు. సాద్ బిన్ ముఆజ్‌కు వారిద్దరు అలా తమ వాడలోకి వచ్చి ఇస్లాం ప్రచారం చేయడం ఏమాత్రం నచ్చలేదు. అందువల్ల ఆయన ఉసైద్ బిన్ హుజైర్‌ని పిలిచి ఇలా చెప్పాడు:

"అసద్ నా పినతల్లి కొడుకయినందున నేను గట్టిగా చెప్పి ఆ కొత్తమత ప్రచారాన్ని మాన్పించలేను. వీళ్ళు మనప్రజల్ని పెడదారి పట్టించి మతభ్రష్టులుగా చేయడానికి వస్తున్నారు. అంచేత నువ్వెళ్ళి నాలుగ చీవాట్లు పెట్టి ఇకముందు ఎప్పుడూ మన వాడలోకి రావద్దని వాళ్ళకు గట్టిగా చెప్పు."

ఉసైద్ బిన్ హుజైర్ వెంటనే కరవాలం తీసుకొని బయలుదేరాడు. అసద్ (రజి), ముస్అబ్ (రజి)ల దగ్గరకు వెళ్ళి వారిని నానా మాటలు అని బెదిరించాడు.



"అయ్యా! మీరు ఆవేశంలో ఉండి అసలు విషయాన్ని విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం! ఏమిటా అసలు విషయం?" అన్నాడు ఉసైద్.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను. రెండుమూడు మాటలు వింటే మీకొచ్చే నష్టమేమీ లేదు. ఆ తరువాత మీ ఇష్టం, ఏదైనా చేసుకోవచ్చు."

"సరే చెప్పండి వింటాను" అంటూ ఉసైద్ వాళ్ళిద్దరికి ఎదురుగా కూర్చున్నాడు.

అప్పుడు ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ఇస్లాం వాస్తవికతను కాస్త వివరించి ఖుర్ఆన్ నుంచి కొన్ని సూక్తులు పఠించి విన్పించారు. అంతే ఖుర్ఆన్ సూక్తులు వినగానే ఉసైద్ ఎంతో ప్రభావితుడయి అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

ఉసైద్ (రజి) ఇస్లాం స్వీకరణతో ఆయన భార్యాపిల్లలు, సాద్ బిన్ ముఆజ్, అతని తెగవాళ్ళు కూడా ఇస్లాం స్వీకరించారు.

హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయనలో ఖుర్ఆన్ పఠనం, దాని అధ్యయనాల పట్ల అమితమైన ఆసక్తి జనించింది. ఎక్కడున్నా, ఏ పరిస్థితిలో ఉన్నా ఆయన దృష్టి ఖుర్ఆన్ పఠనం మీదనే ఉంటుంది. ముఖ్యంగా రాత్రివేళ ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రజానీకం గాఢనిద్రలో జోగుతున్నపుడు, పరిసరాలు మూగబోయి పూర్తినిశ్శబ్దం ఆవరించినపుడు ఖుర్ఆన్ పఠించడమంటే ఆయనకు ఎంతో ఇష్టం.

ఆయన ఖుర్ఆన్‌పారాయణలో ఓ ప్రత్యేక ఆకర్షణ ఉంది. ఆయన కంఠస్వరంలో ఓ విశేష మాధుర్యం ఉంది. అందుకే ప్రవక్త అనుచరులు ఆయన ఖుర్ఆన్ పఠనం వినడానికి ఎంతో ఆరాటపడేవారు.

ఓరోజు అర్ధరాత్రి వేళ హజ్రత్ ఉసైద్ (రజి) తన ఇంటిపెరట్లో కూర్చొని ఖుర్ఆన్ పారాయణం ప్రారంభించారు. ఆయన పక్కన కొడుకు యహ్యా పడుకొని ఉన్నాడు. దైవమార్గంలో పోరాడేందుకు పెంచుకుంటున్న తన గుర్రం కొంచెం దూరంలో కట్టివేయ బడివుంది.

చిమ్మ చీకటి, శ్మశానవాతావరణాన్ని తలపించే నిశ్శబ్దం, నిర్మలమైన ఆకాశం, వెలుగురవ్వలు వెదజల్లుతున్న నక్షత్రాలు. అలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆయన ఖుర్ఆన్‌పారాయణం కర్ణపేయంగా ఇలా ప్రతిధ్వనించసాగింది-

"అలిఫ్-లామ్-మీమ్. ఇది ఎలాంటి సందేహానికి ఆస్కారంలేని (దైవదత్త) గ్రంథం. ఈ గ్రంథం భయభక్తులు కలవారికి రుజుమార్గం చూపుతుంది. వారు అగోచరాలు, అతీంద్రియాలను విశ్వసిస్తారు; ప్రార్థన (వ్యవస్థ) స్థాపిస్తారు; మేము ప్రసాదించిన సంపద

నుండి (మామార్గంలో) ఖర్చుపెడతారు; నీపై అవతరించిన ఈ గ్రంథాన్ని, నీకు పూర్వం గతప్రవక్తలపై అవతరించిన గ్రంథాలను విశ్వసిస్తారు. పరలోకాన్ని కూడా విశ్వసిస్తారు. అలాంటి దైవభీతిపరులే తమ ప్రభువు నుండి వచ్చిన రుజుమార్గంలో నడిచేవారు." (ఖుర్ఆన్-2:1-4)

అప్పుడు హఠాత్తుగా గుర్రం బెదరిపోతూ కట్టినతాడు తెంచుకొని పారిపోవడానికి ప్రయత్నించసాగింది. హజ్రత్ ఉసైద్ (రజి) ఖుర్ఆన్ పఠనం ఆపి అటువైపు చూశారు.

ఆయన ఖుర్ఆన్‌పఠనం ఆపగానే గుర్రం కూడా ఆగిపోయి సాధారణ స్థితిలోకి వచ్చింది. తరువాత ఆయన ఖుర్ఆన్ పారాయణం కొనసాగిస్తూ ఇలా పఠించారు- "అలాంటివారే సాఫల్యం చెందేవారు; మోక్షం పొందేవారు." (2:5)

ఖుర్ఆన్ పఠనం మొదలవగానే గుర్రం మళ్ళీ బెదరిపోతూ తాడు తెంచుకొని పారిపోవడానికి ప్రయత్నించింది.

హజ్రత్ ఉసైద్ (రజి) ఖుర్ఆన్‌పఠనం ఆపి అటువైపు చూశారు. ఖుర్ఆన్‌పఠనం ఆపగానే గుర్రం కూడా ఆగిపోయి సాధారణ స్థితిలోకి వచ్చింది.

గుర్రం ఇలా బెదరిపోతూ తన కొడుకుని తొక్కివేస్తుందేమోనని భయపడి ఆయన అతని దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో యాదృచ్ఛికంగా ఆయనదృష్టి ఆకాశం వైపుకు మళ్ళింది. అంతే, అక్కడి దృశ్యం చూసి ఆయన ఆశ్చర్యపోయారు.

అక్కడ గొడుగు ఆకారంలో ఒక మేఘం కింద ఎన్నో వెలుగుదివ్వెలు వంటి ఏవో అసాధారణ వస్తువులు కన్పించాయి.

హజ్రత్ ఉసైద్ (రజి) ఇంతకు పూర్వం ఎప్పుడూ అలాంటి దృశ్యం చూడలేదు. అంచేత ఆయన తెల్లవారిన తరువాత దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి రాత్రి జరిగిన సంఘటన ఆయనకు తెలియజేశారు.

దైవప్రవక్త (సల్లం) అది విని "ఉసైద్! ఆ వెలుగు దివ్వెలు దైవదూతలు. వారు నీ ఖుర్ఆన్‌పారాయణం వినడానికి వచ్చారు. నీవు గనక ఖుర్ఆన్ పారాయణం ఆపకుండా కొనసాగించివుంటే తెల్లవారుజామున జనం వాళ్ళను కళ్ళారా చూసుకునేవారు" అని అన్నారు.

హజ్రత్ ఉసైద్ (రజి) దైవప్రవక్త (స)పై అపార ప్రేమాభిమానాలు పెంచుకున్నారు. ఉహద్‌యుద్ధంలో ఆయన ప్రాణాలకు తెగించి దైవప్రవక్త (స)కు రక్షణ కల్పించారు. ఆ సమయంలో ఆయనకు తీవ్రమైన ఏడు గాయాలయ్యాయి.

ఆయన ఉమర్‌ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఇహలోకం వీడిపోయారు.



# 50. ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి)

మక్కాలో ఉమ్మెఅన్మార్ అనే ఓ మహిళ ఒక బానిసను కొనడానికి మార్కెట్‌కు వెళ్ళింది. అక్కడ కొందరు బాలబానిసలు కూడా ఉన్నారు. వారిలో ఉమ్మెఅన్మార్ దృష్టి ఒక బాలుడిపై పడింది. ఆ బాలుడి ముఖంలో సత్యసంధత, నిజాయితీ, తెలివితేటల సూచనలు కన్పిస్తున్నాయి. అందుకే ఆమె వెంటనే వ్యాపారికి డబ్బు చెల్లించి ఆ అబ్బాయిని కొనుక్కొని వెళ్ళిపోయింది.

దారిలో ఉమ్మెఅన్మార్ పేరు, ఊరు అడిగితే అతను తన పేరు ఖబ్బాబ్ బిన్ అరత్ అని, తాను నజద్ నివాసినని చెప్పాడు. అప్పుడామె "నువ్వీ దోపిడీగాళ్ళకు ఎలా చిక్కావు బాబూ!" అని అడిగింది.

ఖబ్బాబ్ బిన్ అరత్ తన బాధమయగాథ చెబుతూ ఇలా అన్నాడు: "ఓసారి మా ఊరిపై ఒక తెగవాళ్ళు అకస్మాత్తుగా దాడిచేసి మా ఆస్తిపాస్తుల్ని, స్త్రీలను, పిల్లలను పట్టుకెళ్ళారు. ఆ పిల్లలతో పాటు నేనూ పట్టుబడ్డాను. ఆ తరువాత నేను అనేకమంది చేతులు మారి చివరికి మక్కా చేరుకున్నాను. ఇప్పుడు మీ చేతిలోకి వచ్చాను."

ఉమ్మెఅన్మార్ ఆ బాలుడికి ఆయుధతయారీ కళ నేర్పించి అతని ద్వారా డబ్బు సంపాదించే ఉద్దేశంతో అతడ్ని ఓ కమ్మరి దగ్గరకు పంపించింది.

ఖబ్బాబ్ కొద్దికాలంలోనే ఆయుధతయారీ కళలో మంచి నైపుణ్యం సంపాదించాడు. అప్పుడు ఉమ్మెఅన్మార్ ఒక దుకాణం అద్దెకు తీసుకొని, ఆయుధతయారీకి కావలసిన పనిముట్లు, ఇతర సామగ్రి కొని ఖబ్బాబ్‌కు అప్పగించింది. ఈవిధంగా ఉమ్మెఅన్మార్ బానిస ద్వారా బాగా డబ్బు సంపాదించడం ప్రారంభించింది.

ఖబ్బాబ్ బిన్ అరత్ కొన్నాళ్ళలోనే ఆయుధతయారీ కళలో ప్రసిద్ధిచెందాడు. పైగా అతను నిజాయితీపరుడు కూడా. అందువల్ల అతని దగ్గర ఖడ్గాలు కొనడానికి జనం అత్యధిక సంఖ్యలో రాసాగారు.

అయితే మరోవైపు ఖబ్బాబ్‌కు అరబ్ సామాజికజీవితం నచ్చలేదు. ముఖ్యంగా ప్రతిచిన్న విషయానికీ ఏళ్ళ తరబడి యుద్ధాలు చేసుకోవడం, స్వేచ్ఛాపరుల్ని బలవంతంగా బానిసలుగా మార్చడం, వారిని సంతలో సరుకులుగా అమ్మివేయడం వంటి అకృత్యాలు అసలు నచ్చలేదు. ఈ అజ్ఞానాంధకారం పోయి అరబ్బుల జీవితాల్లో వెలుగు ఎప్పుడొస్తుందోని అతను తరచుగా ఆలోచిస్తుండేవాడు.

కొన్నాళ్ళకు ఆ వెలుగు రానేవచ్చింది. అరబ్బుల చీకటిబ్రతుకుల్లో జ్ఞానకాంతి నింపే కరదీపిక వచ్చింది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆ కరదీపిక తీసుకొని పరిసరాలను ప్రకాశవంతం చేయడం ప్రారంభించింది.

అప్పుడు ఖబ్బాబ్ బిన్ అరత్ నేరుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికిపోయి ఆయన సందేశాన్ని విన్నాడు. దాంతో ఆయన హృదయం జ్యోతిర్మయం అయింది. తక్షణమే ఆయన సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించారు.

హ॥జత్ ఖబ్బాబ్ (రజి) తన ఇస్లాంస్వీకార విషయం రహస్యంగా ఉంచలేదు. అందువల్ల అది త్వరలోనే బయటికి పొక్కింది. ఆ సంగతి ఉమ్మెఅన్మార్‌కు కూడా తెలిసిపోయింది. దాంతో ఆమె ఖబ్బాబ్ (రజి) మీద కారాలు మిరియాలు నూరింది.

వెంటనే ఆమె తన సోదరుడు సబాను, మరికొందరు యువకుల్ని తీసుకొని దుకాణంలో పనిచేస్తున్న ఖబ్బాబ్ (రజి) దగ్గరకు వెళ్ళింది.

సబా హ॥జత్ ఖబ్బాబ్ (రజి) వైపు ఉరిమిచూస్తూ "ఖబ్బాబ్! నువ్వు మన తాత ముత్తాతల ధర్మం వదలి మతభ్రష్టుడయ్యావని తెలిసింది. నిజమేనా?"అని అడిగాడు.

"లేదు. నేను మతభ్రష్టుడ్ని కాలేదు. నేను మీ విగ్రహాలను, బహుదైవారాధనను వదలి సర్వలోక ప్రభువైన ఏకేశ్వరుడ్ని విశ్వసించాను. మహనీయ ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్తని, ఆయన దాసుడని సాక్ష్యమిచ్చాను" అన్నారు ఖబ్బాబ్ (రజి).

ఈమాటలు వినగానే సబా, అతని మిత్రమూక ఒక్కసారిగా హ॥జత్ ఖబ్బాబ్ (రజి)పై విరుచుకుపడి పిడిగుద్దులతో ఆయన వళ్ళు హూనం చేశారు; ఆయన్ని కింద పడేసి కాళ్ళతో తొక్కి కసితీర్చుకున్నారు.

దాంతో ఖబ్బాబ్ (రజి) దేహం రక్తసిక్తమై స్పృహ కోల్పోయారు. ఆయన నిజాన్ని నిర్భయంగా వ్యక్తపరచడం విన్న ఇతర ముస్లింలు కూడా ధైర్యంచేసి తమ నూతన విశ్వాసాన్ని బహిరంగపరచసాగారు. దాంతో వారు కూడా బహుదైవారాధకుల దౌర్జన్యాలకు గురయ్యారు.

మక్కా బహుదైవారాధకులు ఇస్లాం ప్రచారం నుండి దైవప్రవక్త (సల్లం)ను అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని అవేమీ ఫలించకపోవడంతో ఆయన అనుచరులపై దాడి చేయడానికి పూనుకున్నారు. ఈపని కోసం వారు ఇతరతెగలను కూడా కలుపుకున్నారు.

దాంతో ముస్లింలపై గొప్పవిపత్తు వచ్చిపడింది. ముఖ్యంగా పేదముస్లింలు దుర్భర దౌర్జన్యకాండకు గురయ్యారు. కొందరు అవిశ్వాసులు వారిని కొరడాలతో కొట్టి హింసించ సాగారు. మరికొందరు వారి శరీరాల మీద వాతలు పెడ్తున్నారు. ఇంకా కొంతమంది వారిని నీళ్ళలో ముంచి ఊపిరాడకుండా చేస్తున్నారు.

ఇక బానిసలుగా ఉన్న ముస్లింలపై జరుగుతున్న అఘాయిత్యాలయితే చెప్ప నవసరం లేదు. గుక్కెడు మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా చీకటికొట్లలో బంధించి, ఆ



తరువాత మండుటెండలో చురచుర కాలే ఇసుక తిన్నెల మీద పడేసి ఈడుస్తూ వారిని రకరకాలుగా హింసించసాగారు.

భూమ్యాకాశాలు రోదిస్తున్నా, మానవత్వం నెత్తీ నోరు కొట్టుకున్నా ఈ కిరాతకుల రాతిగుండెల్లో కనికరం కాస్తయినా కలగడం లేదు.

ఈ హింసాదౌర్జన్యాలు చూసి కొందరు ముస్లింలు తమ విశ్వాసాన్ని లోలోపలే దాచుకుంటున్నారు. అయితే సత్యధర్మాన్ని నమ్మి దాని ప్రకారం నడచుకునే దృఢ మనస్కులు సహన స్థయిర్యాలతో శత్రువుల దౌర్జన్యాలను తట్టుకుంటూ ఇస్లామీయ ఉద్యమంలో పురోగమిస్తున్నారు.

అలాంటి సాహసవంతులలో హ॥జత్ ఖబ్బాబ్ (రజి) కూడా ఉన్నారు. ఈయన ఉమ్మెఅన్మార్ బానిస. ఉమ్మెఅన్మార్ ఇనుప కడ్డీ కాల్చి తరచుగా ఖబ్బాబ్ (రజి) తల మీద వాతలుపెట్టి బాధిస్తుండేది.

ఓసారి ఆమె బొగ్గులు కాల్చి వాటిపై ఖబ్బాబ్ (రజి)ని వెల్లకిలా పండబెట్టింది. ఆ వేడికి ఖబ్బాబ్ (రజి) శరీరం కాలి చిట్లిపోయింది. చివరికి చిట్లిన దేహం నుండి కారిన ద్రవంతోనే నిప్పులు చల్లారాయి.

ఈ బాధలు భరించలేక ఆయన ఒకరోజు దైవప్రవక్త (సల్లం)తో తన కష్టాలు చెప్పుకోవడానికి కాబాలయానికి వెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) కాబాగోడకు ఆనుకొని కూర్చొనిఉన్నారు.

"దైవప్రవక్తా! మా కోసం దైవాన్ని ప్రార్థించరా?" అన్నారు హ॥జత్ ఖబ్బాబ్ (రజి).

ఈ మాట వినగానే దైవప్రవక్త (స) ముఖం కోపంతో జేవురించింది. ఒక్కసారిగా ఆయన కదలి నిటారుగా కూర్చున్నారు.

"ఏమిటీ! మీపై కష్టాలు వచ్చిపడ్డాయా? గత కాలంలోని విశ్వాసులపై మీకంటే ఘోరమైన కష్టాలు వచ్చిపడ్డాయి. వారిలో ఒకడ్ని నేలలో గుంట తవ్వి అందులో కూర్చోబెట్టి అతని తల మీద రంపం పెట్టి చీల్చివేయడం జరిగింది. మరొకడ్ని ఇస్లాం నుండి మరల్చడానికి అతని కీళ్ళలోకి ఇనుప దువ్వెనలు గుచ్చి లాగివేయడం జరిగింది. దైవసాక్షి! ఈ పని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరుతుంది. చివరికి ఒక స్త్రీ విలువైన నగలు ధరించి సనా నుండి హ॥జెమౌత్ వరకు నిర్భయంగా ప్రయాణం చేస్తుంది. అప్పుడామె మనసులో దైవభయం తప్ప మరెవరి భయమూ ఉండదు" అన్నారు ఆయన.

ఆ తరువాత ఆయన "ప్రభూ! ఖబ్బాబ్‌ని కాపాడు" అని దైవాన్ని ప్రార్థించారు.

ఈ ప్రార్థన ఫలితానిచ్చింది. ఉమ్మెఅన్మార్ తలలో ఏదో రోగం పుట్టి ఆమెను తీవ్రంగా బాధించడం మొదలెట్టింది. వైద్యులు ఆమెను పరీక్షించి, ఇనుపచువ్వ ఎర్రగా

కాల్చి తల మీద వాతపెడ్తే రోగం నయమవుతుందని చెప్పారు. శిరోబాధ భరించలేని ఉమ్మెఅన్మార్ అలాగే చేయించుకుంది.

దాంతో ఉమ్మెఅన్మార్ హజ్రత్ ఖబ్బాబ్ (రజి)కు పెట్టిన బాధలకు విరుగుడయి, ఆమె శాశ్వతంగా మృత్యుకోరల్లోకి పోయింది.

హజ్రత్ ఖబ్బాబ్ (రజి) మదీనా వలసపోయిన తరువాత దైవప్రవక్త (స)తో కలసి బదర్, ఉహద్ వగైరా యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆయన తొలి నలుగురు శ్రేయస్కర ఖలీఫాల కాలం వరకు జీవించారు. వారి కాలంలో ఆయన ఎంతో గౌరవమర్యాదలతో జీవితం గడిపారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఒకసారి ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) ఏదో పని మీద ఆయన దగ్గరకు వచ్చారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) ఆయన్ని ఎంతో గౌరవించి ఉన్నతాసనంపై కూర్చోబెట్టారు.

ఆ సందర్భంలో ఆయన "ఖబ్బాబ్! బిలాల్ తరువాత ఈ ఆసనం మీద కూర్చునే అర్హత నీకు తప్ప మరెవరికీ లేదు" అని అన్నారు. తరువాత ఆయన "అవిశ్వాసుల చేతుల్లో అనుభవించిన బాధలన్నిటిలో అత్యంత దుర్భరమైన బాధ నీవు ఏది అనుభవించావు?" అని అడిగారు.

హజ్రత్ ఖబ్బాబ్ (రజి) ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి మొదట్లో కాస్తంత నిరాకరించారు. కాని ఉమర్ ఫారూఖ్ (రజి) పట్టుబడటంతో ఆయన వంటిమీది చొక్కా పైకెత్తి వీపు చూపించారు.

ఖలీఫా ఉమర్ (రజి) ఆయన వీపు మీది ఎర్రటి వాతల మచ్చలు చూసి నివ్వెరపోతూ "ఈ మచ్చలు ఎలా ఏర్పడ్డాయి?" అని అడిగారు. దానికి ఖబ్బాబ్ (రజి) సమాధానమిస్తూ ఇలా చెప్పారు :

"ఒకరోజు అవిశ్వాసులు అగ్ని రాజేసి నిప్పులు తయారుచేశారు. తరువాత నా బట్టలు ఊడదీసి నన్ను ఆ నిప్పులపై పండబెట్టి ఈడ్చారు. దాంతో నా వీపులోని మాంసం కాలిపోయి ఎముకలు మాత్రమే మిగిలాయి. చివర్లో నా శరీరం నుండి వెలువడిన కొవ్వు ఆ నిప్పును ఆర్పివేసింది."

హజ్రత్ ఖబ్బాబ్ (రజి) మొదట్లో ఎంతో దారిద్ర్యం అనుభవించారు. అయితే తన జీవిత ద్వితీయార్థ కాలంలో ఆయన గొప్ప ధనికుడయ్యారు. అయితే ఆ సిరి సంపదల్ని పేదలు, అవసరార్థులు తీసుకోవడానికి వీలుగా వాటిని ఆయన తన ఇంట్లోని ఓ గదిలో పెట్టి దానికి తాళం వేయకుండా, ఎవర్నీ కాపలా ఉంచకుండా వదిలేశారు. అయినప్పటికీ ఈ సిరిసంపదల కారణంగా రేపు పరలోకంలో తాను పట్టుబడి పోతానేమోనని ఆయన భయపడుతుండేవారు.



హజ్రత్ ఖబ్బాబ్ (రజి) తన జీవిత చరమఘడియల్లో కంటతడి పెడ్తుంటే 'ఈ దుఃఖానికి కారణం ఏమిట'ని అడిగారు కొందరు మిత్రులు. దానికి ఆయన ఇలా సమాధాన మిచ్చారు:

"నా స్నేహితుల్లో అనేకమంది తమ సదాచరణకు ఇహలోకంలో ఎలాంటి ప్రతిఫలం పొందకుండా పరలోకానికి వెళ్ళిపోయారు. కాని నేను పెద్దఎత్తున ధనరాసులు ఉంచుకొని ఇంకా బ్రతికే ఉన్నాను. ఈ ధనం నా సదాచరణకు ఇహలోక ప్రతిఫలం అవుతుందేమోనని భయపడుతున్నాను."

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) చనిపోయినపుడు ఖలీఫా అలిముర్తుజా (రజి) ఆయన అంత్యక్రియల్లో పాల్గొని ఆయన పరలోక క్షేమం కోసం దైవాన్ని ప్రార్థించారు.

# 51. సయీద్ బిన్ ఆమిర్ (రజి)

దైవప్రవక్త(సల్లం) కాలంలో సయీద్ బిన్ ఆమిర్ (రజి) ముస్లిం కాకముందు ప్రవక్త అనుచరుడు హజ్రత్ ఖుబీబ్ బిన్ అదీ (రజి)ని అవిశ్వాసులు చిత్రహింసలు పెట్టి ఘోరాతిఘోరంగా హతమార్చిన భయానక దృశ్యం చూసి తీవ్రమైన ప్రభావానికి గురయ్యారు. ఆనాటి నుంచి సయీద్ కళ్ళలో ఆ దృశ్యమే అనుక్షణం మెదలుతుండటంతో దాన్ని భరించలేక కొన్నాళ్ళ తరువాత ఆయన ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (స) అనుచర సముదాయంలో చేరిపోయారు.

ఆ తరువాత ఆయన మదీనా వలసపోయి దైవప్రవక్త (సల్లం)తో పాటు అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. దైవప్రవక్త (సల్లం) ఇహలోకం వీడిపోయిన తరువాత శ్రేయస్కర ఖలీఫాలు అబూబకర్, ఉమర్ (రజి)ల పాలనాకాలాల్లో జరిగిన యుద్ధాల్లో కూడా పాల్గొన్నారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) ఖిలాఫత్ ప్రారంభకాలంలో హజ్రత్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) ఓసారి ఉమర్ (రజి)కు హితోపదేశం చేస్తూ "ఉమర్! ప్రజల విషయంలో సదా దైవానికి భయపడుతూ ఉండాలి. దేవుని (ధార్మిక) వ్యవహారంలో ఎవరికీ భయపడకు. నీ మాటలకు, చేతలకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదు. దైవమార్గంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకంజ వేయకు" అని అన్నారు.

ఆ సందర్భంలో హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "సయీద్! నేను మిమ్మల్ని హమస్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించదలిచాను" అని అన్నారు.

దానికి సయీద్ (రజి) "ఉమర్! దయచేసి దేవుని కోసం మీరు నన్ను పరీక్షకు గురిచేయకండి" అన్నారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని కాస్తంత కోపంతో "మీరందరూ పరిపాలనా బాధ్యతల పెనుభారమంతా నామీద మోపి మీరు మాత్రం ఈ బాధ్యతలకు దూరంగా ఉండదలిచారు. దైవసాక్షి! నేను మిమ్మల్ని ఎట్టి పరిస్థితిలోనూ వదలిపెట్టను" అని అన్నారు.

అప్పుడు సయీద్ (రజి)కు గవర్నర్ బాధ్యతను స్వీకరించక తప్పలేదు. ఆ తర్వాత ఆయన హమస్‌కు వెళ్ళి ఆ రాష్ట్రానికి గవర్నర్‌గా పని చేయనారంభించారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు హమస్ రాష్ట్రం నుండి ఒక ప్రతినిధి వర్గం మదీనా వచ్చి ఖలీఫాను కలుసుకున్నది. ఆ సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) వారితో మాట్లాడుతూ "మీ రాష్ట్రంలో నిరుపేదలు ఎవరెవరు ఎంతమంది ఉన్నారో వారందరి పేర్లు రాసి నాకివ్వండి, నేను వారి అవసరాలు నెరవేర్చడానికి తగిన ఏర్పాట్లు చేస్తాను" అని చెప్పారు.

హమస్ ప్రతినిధులు ఈమాట విని ఖలీఫా దర్బారు నుంచి వెళ్ళిపోయి తమ రాష్ట్రంలోని నిరుపేదలకు సంబంధించిన ఓ పెద్ద జాబితా తయారుచేశారు. ఆ తరువాత వారా జాబితా తీసుకొని వచ్చి ఖలీఫాకు చూపించారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ జాబితాలోని మొట్టమొదటి పేరు చూసి ఖంగుతిన్నారు. ఆయన హమస్ ప్రతినిధుల వైపు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ "ఏమిటీ! సయీద్ బిన్ ఆమిర్!! ఎవరీ సయీద్ బిన్ ఆమిర్?" అని అడిగారు.

దానికి ప్రతినిధి వర్గం నాయకుడు "మా రాష్ట్రగవర్నర్" అని సమాధానమిచ్చాడు.

"ఏమిటీ! మీ రాష్ట్రగవర్నరా? మీ రాష్ట్రగవర్నర్ అంత పేదవాడా?" అంటూ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మరింత ఆశ్చర్యపోయారు.

"ఔనండీ! మా రాష్ట్రగవర్నరే. ఆయన మారాష్ట్రంలో అందరికంటే చాలా పేదవాడు. దైవసాక్షిగా చెబుతున్నాం, ఆయన గారింట్లో ఒక్కోసారి రోజుల తరబడి పొయ్యి కూడా రాజేయబడదు" అన్నారు హమస్ ప్రతినిధులు విషయం మరింత వివరిస్తూ.

ఈమాట వినగానే హజ్రత్ ఉమర్‌ఫారూఖ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. ఆయన కళ్ళు చిల్లులు పడిన నీటికుండలై పోయాయి.

చివరికి దుఃఖాన్ని ఎలాగో దిగమింగి లేచి లోపలి గదిలోకి పోయారు. కాస్సేపటి తరువాత ఆయన ఓ డబ్బుసంచి తీసుకొని వచ్చారు.

దాన్ని ప్రతినిధివర్గం నాయకునికి అందిస్తూ "ఇదిగో, ఇందులో వేయి దీనార్లు ఉన్నాయి. మీ గవర్నర్‌కు నా తరఫున సలాం చెప్పి, ఈ పైకం ఆయనకు అప్పగించండి. వీటితో ఆయన తన అవసరాలు గడుపుకుంటారు" అని చెప్పారు.



ప్రతినిధివర్గం డబ్బుసంచి తీసుకొని హమస్ చేరుకున్నది. దాన్ని వారు గవర్నర్ ముందు పెడుతూ "మన ఖలీఫాగారు ఈ పైకం మీకు అప్పగించి మీ అవసరాలకు వాడుకోమని చెప్పారు" అని అన్నారు.

గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) తన ముందు పెట్టిన డబ్బుసంచిని దూరంగా నెట్టివేసి "ఇన్నాలిల్లాహి వఇన్న ఇలైహి రాజివూన్" అన్నారు తనపై ఏదో పెద్ద ఆపద విరుచుపడినట్లు భావిస్తూ.

ప్రతినిధి వర్గం డబ్బుసంచి అప్పగించి వెళ్ళిపోయింది. ఆ తరువాత హజ్రత్ సయీద్ (రజి) భార్య తన భర్త మాటల ద్వారా ఏదో ఆపద వచ్చిపడిందని భావించి ఆందోళన పడుతూ ముందు గదిలోకి వచ్చింది.

"ఏమయిందండీ? మన ఖలీఫా గారు చనిపోయారా?" అని అడిగింది ఆమెగారు.

దానికి సయీద్ (రజి) "చనిపోలేదు. కాని అంతకంటే పెద్ద ఆపదే వచ్చిపడింది" అని చెప్పారు.

ఆయన భార్య ఆశ్చర్యపోతూ "అంతకంటే పెద్ద ఆపద! ఏదైనా యుద్ధంలో ముస్లింలు ఓడిపోయారా?" అని అడిగారు.

"లేదు, అంతకంటే కూడా పెద్ద ఆపద వచ్చిపడింది" అన్నారు సయీద్ (రజి).

ఆయన భార్య ఈమాట విని మరింత ఆశ్చర్యపోతూ "ఏమిటీ! అంతకంటే పెద్ద ఆపద ఏమిటండీ?" అని అడిగింది విషయం అర్థంగాక.

"ఔను, అంతకంటే పెద్ద ఆపదే. మన పరలోకాన్ని పాడుచేయడానికి ప్రపంచం మన ఇంట్లోకి జొరబడింది" అన్నారు సయీద్ (రజి).

ఆయన భార్యకు ఖలీఫా పంపిన పైకం సంగతి తెలియక "దానిదేముందండీ! ప్రపంచాన్ని వదిలించుకుంటే సరిపోలా?" అన్నది.

అప్పుడు సయీద్ (రజి) "అయితే ఈ వ్యవహారంలో నువ్వు నాతో సహకరిస్తావా?" అని అడిగారు ఆశతో చూస్తూ.

దానికి ఆయన భార్య "తప్పకుండా సహకరిస్తా. (నేను మీ అర్థాంగిగా) మీ కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడం నా బాధ్యత" అని అన్నది.

ఆ తరువాత హజ్రత్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) తన భార్య సహకారంతో ఆ పైకం మొత్తాన్ని చిన్నచిన్న సంచుల్లో సమానంగా విభజించి పెట్టారు. తరువాత పట్నంలోని పేదలను పిలిపించి ఆ సంచుల్ని వారందరికీ పంచివేశారు. అప్పుడాయన హృదయానికి ఊరట కలిగింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు రెండవ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి సిరియా రాష్ట్రం పర్యటించారు. ఆ సందర్భంలో ఆయన రాజధాని హమస్‌కు చేరుకొని అక్కడి ప్రజలతో "మీ కొత్తగవర్నర్ మీపట్ల ఎలా వ్యవహరిస్తున్నాడ"ని అడిగారు. దానికి వారు తమ గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) మీద ఇలా నాలుగు ఆరోపణలు చేశారు:

"మా గవర్నర్ గారు ఉదయం చాలా పొద్దెక్కేదాకా ఇంట్లో నుంచి బయటికిరారు" అన్నారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) "ఈ ఆరోపణకు మీ సమాధానం ఏమిట"ని హజ్రత్ సయీద్ (రజి)ని ప్రశ్నించారు.

దానికి గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) సమాధానమిస్తూ ఇలా అన్నారు: "ఇది నా వ్యక్తిగత విషయం. దీన్ని నేను బహిర్గతం చేయదలచుకోలేదు, అయినా తప్పడం లేదు. నాఇంట్లో సేవకులు ఎవరూ లేరు. అంచేత ఉదయం పెందలాడే లేచి పిండి పిసికి అది నానేవరకు కాస్సేపు ఎదురుచూస్తాను. తరువాత దాన్ని రొట్టెలుగా చేస్తాను. ఆ తర్వాత ఉజూచేసి ప్రజల అవసరాలు తీర్చడానికి బయటికి వస్తాను."

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ తరువాత "మీ రెండవ ఆరోపణ ఏమిట"ని అడిగారు.

దానికి ప్రజలు "ఈయనగారు రాత్రివేళ ఎవరొచ్చి ఏమడిగినా సమాధానమే ఇవ్వరు" అని చెప్పారు. ఖలీఫా దీనికి మీ సమాధానం ఏమిటని అడిగితే గవర్నర్ సయీద్ (రజి) ఇలా చెప్పారు:

"నేనీ విషయాన్ని కూడా బహిర్గతం చేయదలచుకోలేదు. కాని తప్పడం లేదు. నేను పగటివేళను ప్రజల కోసం, రాత్రివేళను నా ప్రభువు కోసం ప్రత్యేకించాను."

ఖలీఫా ప్రజలను, మీ మూడవ ఆరోపణ ఏమిటని అడిగారు. దానికి వారు " మా గవర్నర్ నెలలో ఒకరోజు పగలంతా ఇంట్లోనే ఉండిపోతారు, బయటికే రారు" అని ఆరోపించారు. ఖలీఫా దీనికి మీ సమాధానం ఏమిటని అడిగారు.

గవర్నర్ సయీద్ (రజి) దానికి సమాధానమిస్తూ ఇలా చెప్పారు: "నాదగ్గర ఒంటి మీదున్న ఈఒక్క జతబట్టలు తప్ప మరేమీ లేవు. వీటిని నేను నెలకొకసారి ఉతికి ఆరబెడ్తాను. అవి ఆరిన తరువాత తొడుక్కొని సాయంత్రం వేళ బయటికి వస్తాను."

ఖలీఫా ఈ సమాధానం విన్న తరువాత మీ నాల్గవ ఆరోపణ ఏమిటని ప్రజల్ని అడిగారు. దానికి వారు "ఈయన ఒక్కోసారి సొమ్మసిల్లి పోతారు. చుట్టపక్కల విషయాలేమీ గ్రహించలేరు" అని అన్నారు. ఖలీఫా దీనికి మీ వివరణ ఏమిటని అడిగితే సయీద్ (రజి) ఇలా చెప్పారు:



"నేను ఇస్లాం స్వీకరించక పూర్వం మక్కా అవిశ్వాసులు ఖబీబ్ బిన్ అదీ (రజి)ని చిత్రహింసలు పెట్టి చంపినప్పుడు ఆ భయంకర దృశ్యం కళ్ళారా చూశాను. ఇస్లాం స్వీకరించిన తరువాత ఆ దృశ్యం నా మనోవీథిలో మెదలినప్పుడల్లా- 'అయ్యయ్యో! ఆ సమయంలో నేనేమీ చేయలేకపోయానే!! దేవుడు నన్ను ఎన్నటికీ క్షమించడు' అన్న ఆలోచన వస్తుంది. దాంతో నేను స్పృహతప్పుతాను."

ఉమర్ ఫారూఖ్ (రజి) ఇలా సయీద్ (రజి) పట్ల తనకున్న సద్భావనకు విఘాతం కల్గలేదని తెలుసుకొని తృప్తిగా నిట్టూర్పువిడిచి దైవానికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

ఆ తరువాత ఆయన ఒక సేవకుని ద్వారా సయీద్ (రజి)కు ఇంటిఖర్చులు కోసం వేయి దీనార్లు పంపించారు.

అయితే సయీద్ బిన్ ఆమిర్ (రజి) తన శ్రీమతితో సంప్రదించి ఆ డబ్బును కూడా తన సొంతానికి వాడుకోకుండా పేదలకు, అనాథలకు దానం చేశారు.

# 52. నోమాన్ బిన్ ముఖర్రిన్ (రజి)

ఖాదిసియాలో అరబ్ సైనికులు విడిది చేశారని, ఫిరాత్, హీరాల మధ్య ప్రాంతాన్ని అరబ్బులు లూటీచేసి ధ్వంసం చేశారని రాజధానికి వార్తలు చేరడంతో ఈరాన్ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అనేకమంది ప్రజాప్రతినిధులు రాజదర్బారుకు వచ్చి తక్షణమే సైనికచర్య ప్రారంభించాలని, లేకుంటే తాము అరబ్బులకు విధేయులైపోతామని హెచ్చరించారు.

యుద్ధతంత్రాల్లో ఎంతో అనుభవశాలి అయిన సేనాపతి రుస్తుమ్ వీలైనంతవరకు యుద్ధం చేయకుండా అరబ్బుల్ని వారి మానాన వదలిపెట్టడమే మంచిదని చక్రవర్తికి సలహా ఇచ్చాడు. చక్రవర్తి యజ్దగిర్ద్ దానికి అంగీకరించలేదు.

అప్పుడు రుస్తుం విధిలేక సైన్యం తీసుకొని బయలుదేరి 'సాబాత్' ప్రదేశంలో విడిదిచేశాడు. దేశంలోని వివిధప్రాంతాల నుంచి వేలాదిమంది సైనికులు వచ్చి ఆయన సైన్యంలో చేరారు. ఈవిధంగా రుస్తుం చుట్టూ లక్షాయాభైవేల మంది సైనికులు చేరి సమరోత్సాహంతో ఊగిపోసాగారు.

అప్పుడు ముస్లిం సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఖలీఫా ఆదేశం ప్రకారం మాటకారి, వివేచనాపరులైన పధ్నాలుగు మంది యోధుల్ని ఎంపిక చేసి రాయబారం కోసం ఈరాన్ చక్రవర్తి దగ్గరకు పంపించారు. ఈ దౌత్యప్రతినిధి వర్గం ఈరాన్ రాజధాని మదాయెన్‌కు చేరుకుంది.

ముస్లిందౌత్యవేత్తలు వస్తున్నారని వినగానే చక్రవర్తి తన దర్బారును ఎంతో అట్టహాసంగా అలంకరింపజేశాడు. ముస్లిందౌత్యవేత్తలు సాధారణ సైనికదుస్తుల్లోనే

రాజదర్బారులో ప్రవేశించారు. చక్రవర్తి యజ్దగిర్డ్ వారితో సాధారణ సంభాషణ తరువాత మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ ఇలా అన్నాడు :

"మాకు వ్యతిరేకంగా పోరాడేందుకు మీరెలా సాహసించగలిగారు? మీ (అరబ్)జాతి ప్రపంచంలో అత్యంత నీచమయిన, తెలివిమాలిన జాతిగా భావించబడుతోందన్న విషయాన్ని మీరు మరచిపోయారా? మీలో ఎప్పుడైనా తిరుగుబాటు ధోరణి తలెత్తితే మా సామంతరాజులే మీ పీచం అణచి మిమ్మల్ని దారికి తెచ్చేవారన్న సంగతి కూడా మీరు మరిచిపోయారా?"

ప్రతినిధివర్గంలో ఒకరయిన నోమాన్ బిన్ ముఖ్రిన్ (రజి) ఈ మాటలు విని ఇలా సమాధానమిచ్చారు :

"మేము ప్రపంచం నుండి విగ్రహారాధన, బహుదైవారాధనలను అంతమొందించ డానికి కృషిచేస్తున్నాం. ఇస్లాం స్వీకరణ ద్వారానే మానవుడు మానవత్వం, మోక్షం పొందగలడని మేము యావత్తు మానవాళికి తెలియజేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా ఇస్లాం స్వీకరించడానికి నిరాకరిస్తే అతను ముస్లింల రక్షణలో ఆశ్రయం పొంది జిజ్యా (రక్షణరుసుం) చెల్లించవలసి ఉంటుంది. దానికి భిన్నంగా ఎవరైనా ఇటు ఇస్లాం స్వీకరించకుండా, అటు జిజ్యా చెల్లించడానిక్కూడా నిరాకరిస్తే అలాంటి వారికి, మాకు మధ్య ఖడ్గమే తీర్పుచేస్తుంది."

చక్రవర్తి యజ్దగిర్డ్ ఈ మాటలు విని ఇలా అన్నాడు: "మీరసలు మూర్ఖులు, అడవి మనుషులు. మీ జనాభా కూడా చాలా తక్కువ. అంచేత మీరు మా దేశంలో ఏ భూభాగాన్ని కూడా ఆశించకండి. మేము మిమ్మల్ని కనికరించి అన్నవస్త్రాలు ప్రసాదిస్తాం. మీపై మృదు మనస్కుడైన పాలకుణ్ణి నియమిస్తాం."

దౌత్యప్రతినిధి వర్గంలో మరొకరైన ఖైస్ బిన్ జిరారా (రజి) ఈ మాటలు వినగానే ముందుకొచ్చి ఇలా అన్నారు:

"మీరు అరబ్బుల దుస్థితి గురించి చెప్పిన విషయాలన్నీ నిజమే. పైగా మేము అంతకంటే కూడా దిగజారి ఉండేవాళ్ళం. అయితే సృష్టికర్త, సర్వేశ్వరుడైన దేవుడు మాపై దయదలచి మాకు సరైన మార్గదర్శనం చేయడానికి దైవప్రవక్త (సల్లం)ను పంపాడు. ఆయన మాకు రుజుమార్గం చూపి సత్యవ్యతిరేక శక్తుల్ని అణచివేశాడు. ఆయన ప్రపంచంలో మేము దుష్టశక్తులపై విజయ పరంపరలు సాధిస్తామని శుభవార్త తెలియజేశాడు. కనుక మీరు ఇస్లాం స్వీకరించండి, అందులోనే మీ శ్రేయస్సుంది. అదిష్టం లేకపోతే జిజ్యా చెల్లించండి. దానికీ అంగీకరించకపోతే యుద్ధానికి సిద్ధంకండి."

చక్రవర్తి ఈ మాటలు వినగానే క్షణంపాటు కోపోద్రేకాలతో ఊగిపోయాడు. అంత లోనే తమాయించుకొని "దౌత్యవేత్తల్ని చంపడం ధర్మసమ్మతమైఉంటే నేను మిమ్మల్ని



ఈ క్షణంలోనే మట్టుపెట్టేవాణ్ణి" అన్నాడు. తర్వాత అతను తన సేవకుల్ని పిలిచి "మట్టితో నింపిన గంప తెచ్చి వీరి నాయకుడి నెత్తి మీద పెట్టండి; అదే స్థితిలో ఇతణ్ణి నగరం నుండి బయటికి పంపివేయండి" అన్నాడు.

ఆ తర్వాత దౌత్యవేత్తల్ని ఉద్దేశించి "మా సేనాపతి అతిత్వరలోనే మిమ్మల్నందరినీ ఖాదిసియా కందకంలో పడవేసి సమాధి చేస్తాడు. అప్పుడు తెలుస్తుంది మీకు మా శక్తి ఏమిటో" అని అన్నాడు.

ఈలోగా సేవకులు మట్టి నింపిన గంప తెచ్చారు. వెంటనే ప్రతినిధివర్గం నాయకుడు ఆసిమ్ బిన్ ఉమర్ (రజి) ముందుకొచ్చి "నేనే ప్రతినిధి వర్గం నాయకుణ్ణి" అంటూ ఆ గంప తీసుకొని భుజమ్మీద పెట్టుకున్నారు.

తరువాత ముస్లిం దౌత్యవేత్తలందరూ దర్బారు నుంచి బయటికి వచ్చి గుర్రాలెక్కి తమ శిబిరం చేరుకొని "మీకందరికీ శుభం. దేవుడు మనకు ఈరాన్‌మట్టి ప్రసాదించి ఆదేశంలో మనకు విజయసంకేతం తెలియజేశాడు" అన్నారు.

ఈమాట విని సేనాపతి కూడా ఎంతో సంతోషించారు.

ముస్లిందౌత్యవేత్తలు రాజధాని నుండి వెళ్ళిపోగానే ఈరాన్‌పాలకులు సమర సన్నాహాలు ముమ్మరం చేశారు. కొన్నాళ్ళలోనే రుస్తుమ్ లక్షా ఎనభైవేల మంది సైనికులతో కూడిన బ్రహ్మాండమైన సైనికపటాలం తీసుకొని బయలుదేరాడు.

అయితే అతనీ యుద్ధాన్ని వీలైనంతవరకు నివారించడానికి ప్రయత్నిస్తూ, దారిలో అనేకచోట్ల ఆగుతూ ఆర్నెల్లదాకా ఖాదిసియా చేరుకోలేదు. చివరికి రాజదర్బార్ నుండి వస్తున్న వత్తిళ్ళకు తలవొగ్గి రుస్తుం ఆర్నెల్ల తరువాత ఖాదిసియా చేరుకున్నాడు.

అప్పుడు సంప్రదింపుల కోసం తన దగ్గరకు ఎవరినైనా దౌత్యవేత్తగా పంపవల సిందిగా ముస్లిం సేనాపతికి లేఖ రాశాడు.

అప్పుడు సేనాపతి సాద్ (రజి) దౌత్యవేత్తగా రబయి బిన్ ఆమిర్ (రజి)ని పంపారు. ఆ సందర్భంలో రుస్తుం తన దర్బార్‌ను ఖరీదైన వస్తువులతో ఎంతో అట్టహాసంగా రూపొందింపజేశాడు.

ఈరాన్ సేనాపతి రుస్తుం ప్రత్యేకంగా తనకోసం ఒక ఎత్తయిన వేదిక, దానిపై సువర్ణ సింహాసనం పెట్టించుకున్నాడు. దానికి నలువైపులా పెద్దపెద్ద పట్టుదిండ్లు, రోమన్ తివాచీలు పరిపించాడు. దిండ్ల గలేబులు, షామియానాల అంచులకు ముత్యాలు పొదిగిన ఝూలర్లు కుట్టించాడు.

హజ్రత్ రబయి బిన్ ఆమిర్ (రజి) సాధారణ సైనికదుస్తుల్లోనే రుస్తుమ్‌దర్బారులో ప్రవేశించి, గుర్రాన్ని తివాచీ మీదున్న ఓ పెద్దదిండుకు కట్టివేశారు.

ఆ తరువాత ఆయన నేలపై పరచిన ఖరీదైన తివాచీని ఖడ్గంతో పొడిచి చించుతూ రుస్తుం సింహాసనం దగ్గరకెళ్ళి అతని పక్కనే కూర్చున్నారు. ఈరాన్ సైనికులు తమ సేనాపతి పట్ల జరుగుతున్న ఈ అవమానాన్ని సహించలేక ముస్లిం దౌత్యవేత్త ఖడ్గాన్ని లాక్కొని, ఆయన్ని సింహాసనం పైనుంచి దించడానికి ప్రయత్నించారు.

అప్పుడు రబయి బిన్ ఆమిర్ (రజి) వాళ్ళవైపు ఉరిమిచూస్తూ "నేనిక్కడికి నా అంతట నేను రాలేదు, మీరు పిలిపిస్తేనే వచ్చాను. ఒక మనిషి దేవుడయి కూర్చుంటే మిగిలినవాళ్ళు దాసులుగా అతని ముందు చేతులు కట్టుకొని నిలబడటం మా ధర్మంలో నిషిద్ధం" అని అన్నారు.

అంతలో రుస్తుం తన సైనికుల్ని వారిస్తూ, అతన్నేమీ చేయకండి అన్నాడు.

తరువాత రబయి బిన్ ఆమిర్ (రజి) ఓ క్షణం ఆలోచించి సింహాసనం పైనుంచి లేచారు. కాస్త దూరం జరిగి ఖడ్గంతో నేల మీద పరచిన తివాచీని, పట్టుపరుపును చించి తీసేసి, కటికనేల మీద కూర్చున్నారు.

తరువాత ఆయన రుస్తుమ్‌ని ఉద్దేశించి "మాకు మీ ఖరీదైన తివాచీలు, పట్టు పరుపులు కూడా అవసరం లేదు. మాకు దేవుడు ప్రసాదించిన ఈ మట్టిపరుపే చాలు" అని అన్నారు.

ఆ తరువాత రుస్తుమ్ దుబాసీ ద్వారా దౌత్యవేత్తని ఉద్దేశించి "ఈ యుద్ధం వెనుక మీలక్ష్యం ఏమిట"ని ప్రశ్నించాడు.

దానికి ముస్లిం దౌత్యవేత్త రబయి (రజి) ఇలా సమాధానమిచ్చారు :

"మేము ప్రజలలోని సృష్టిపూజ మాన్పించి వారిని సృష్టికర్త ఆరాధన వైపు మళ్ళించాలని, ప్రపంచంలో అన్యాయం, అసత్యమతాలను రూపుమాపి న్యాయాన్ని, సత్యధర్మమైన ఇస్లాంను స్థాపించాలని భావిస్తున్నాం. ఎవరైనా ఇస్లాం స్వీకరించి నీతిన్యాయాలతో జీవించదలచుకుంటే మేము వారిపట్ల సద్భావనతో వ్యవహరిస్తాం. దీనికి భిన్నంగా ఎవరైనా మా దారికి అడ్డంవస్తే మాత్రం మేము వారితో విజయం సాధించేవరకూ లేదా వీరమరణం పొందేవరకూ పోరాడుతాం. కనుక మీరు మాకు జిజ్యా చెల్లించడానికి అంగీకరిస్తే మేము మీ జోలికి రాము. ఎప్పుడయినా మీకు మా అవసరమొస్తే మేము మీకు సహాయం చేస్తాం."

రుస్తుమ్ ఈ మాటలు విని "నీవు ముస్లింల నాయకుడివా?" అని ప్రశ్నించాడు.

దానికి రబయి (రజి) "లేదు. నేనొక సాధారణ సైనికుడ్ని. అయితే మాలో ప్రతి ఒక్కడికీ ప్రతి వ్యవహారంలోనూ నిర్ణయం తీసుకునే అధికారం ఉంది" అని అన్నారు.

ఈమాట విని రుస్తుమ్, అతనిసహచరులు ఆశ్చర్యపోయారు.



రుస్తుం "సరే, మేము ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటాం" అన్నాడు.

ఆ తర్వాత హజ్రత్ రబయి (రజి) లేచి అక్కడ్నుంచి తిరిగొచ్చి సేనాపతి సాద్ బిన్ వఖ్ఖాస్ (రజి)కు విషయాలు వివరించారు.

మరునాడు రుస్తుమ్ "ఈరోజు కూడా మీ దౌత్యవేత్తను పంపండ"ని సాద్ (రజి)కు లేఖ పంపాడు. సేనాపతి హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఈసారి హుజైఫా బిన్ ముహ్‌సిన్ (రజి)ని పంపారు.

ఆయన కూడా రబయి (రజి) లాగానే నేలపై పరచిన ఖరీదైన తివాచీలను, పట్టుపరుపుల్ని బరిశతో చించివేస్తూ, గుర్రం మీద కూర్చునే నేరుగా రుస్తుం సింహాసనం దగ్గరకు వెళ్ళారు.

రుస్తుమ్ కట్టలు తెంచుకొస్తున్న కోపాన్ని పళ్ళ కింద నొక్కిపట్టి "ఏమిటీ, ఈరోజు నిన్ను పంపారు? నిన్న వచ్చిన దౌత్యవేత్తను ఎందుకు పంపలేదు?" అని అడిగాడు.

దానికి హుజైఫా (రజి) ఇలా సమాధానమిచ్చారు: "మా నాయకుడు న్యాయంగా వ్యవహరిస్తాడు. మా అందర్నీ సమానంగా చూస్తాడు. సేవ చేయడానికి ప్రతి ఒక్కడికీ అవకాశం ఇస్తాడు. నిన్న అతని వంతు వచ్చింది, ఈరోజు నా వంతు వచ్చింది."

"సరే, మీరు మాకు ఎన్ని రోజులు గడువిస్తారు?" అడిగాడు రుస్తుం.

"ఈరోజు నుండి మూడు రోజులు గడువిస్తున్నాం" చెప్పారు హుజైఫా (రజి).

రుస్తుమ్ ఈమాట విని మారుమాట్లాడలేదు.

హజ్రత్ హుజైఫా(రజి) గుర్రాన్ని వెనక్కి మళ్ళించి తమ సైనికశిబిరానికి తిరిగొచ్చారు. మూడోరోజు కూడా రుస్తుమ్ దౌత్యవేత్తను పంపమని సాద్ (రజి) దగ్గరకు లేఖ పంపాడు.

అప్పుడు సేనాపతి సాద్ (రజి) ముగీరా బిన్ షాబా (రజి)ను పంపారు.

రుస్తుం ముగీరా (రజి)కు నయానాభయానా నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూ "ఇప్పటికైనా మించిపోలేదు, మీరు యుద్ధంచేసే ఆలోచన మానుకొని మాదేశం నుండి వెళ్ళిపోతే మాకెలాంటి అభ్యంతరం లేదు. పైగా మేము మీకు మీరు కోరిన బహుమతి కూడా ఇస్తాం" అని అన్నాడు.

ముగీరా (రజి) ఈమాటలకు తీవ్రంగా స్పందిస్తూ కరవాలంవర మీద చేయిపెట్టి "మీరు ఇస్లాం స్వీకరించడానికిగాని, జిజ్యా చెల్లించడానికిగాని ఒప్పుకోకపోతే సమస్యను ఈ ఖడ్గమే పరిష్కరిస్తుంది" అని కఠినంగా సమాధానమిచ్చారు.

దాంతో ఈరాన్ సేనాపతి రుస్తుమ్ ఘీంకరిస్తూ "ఇప్పుడిక నేను మీతో ఒప్పందం చేసుకునే ప్రసక్తే లేదు. మిమ్మల్నందర్నీ వధించితీరుతాను" అన్నాడు.

దానికి ముస్లిం దౌత్యవేత్త హజ్రత్ ముగీరా (రజి) “సరే, మేమూ చూస్తాం ఎవరు ఎవర్ని వధిస్తారో” అంటూ లేచి తమ సైనికశిబిరానికి తిరిగొచ్చారు.

ఆ తరువాత ఖాదిసియాలో ఇరుపక్షాల మధ్య సమరజ్వాలలు మింటికెగిశాయి. శత్రుపక్షంలోని ముప్ఫయివేల మంది రౌతుల్లో ముప్ఫయి మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మిగిలిన రౌతులంతా హతమార్చబడ్డారు.

హిజ్రీశకం 14వ ఏట, ముహ్రం నెలలో జరిగిన ఈ యుద్ధంలో ముస్లింలు ఆరువేల మంది అమరగతులయ్యారు.

ఈరాన్ సైనికులు ఖాదిసియా నుండి పారిపోయి బాబిల్‌కు చేరుకున్నారు. వారి అధికారులు అక్కడ మరింత సైనిక సమీకరణ చేసి యుద్ధసన్నాహాలు చేయసాగారు. కాని అక్కడా వారికి చుక్కెదురు కావడంతో బాబిల్ నుంచి కొందరు ఈరాన్ రాజధాని మదాయెన్ వైపుకు, మరికొందరు అహ్వాజ్, నిహావంద్‌ల వైపుకు పారిపోయారు.

అహ్వాజ్, ఖుజిస్తాన్ ప్రాంతాలు ముస్లింల కైవశం కావడం, యుద్ధతంత్రంలో దిట్టయిన హర్ముజాన్ ముస్లింల చేతికి చిక్కి మదీనా వెళ్ళిపోవడం లాంటి సంఘటనలు విన్న తర్వాత యజ్దగిర్ద్ రోషంతో ఉడికిపోతూ మళ్ళీ సైనికసమీకరణ ప్రారంభించాడు. అతను చుట్టుపక్కలున్న వివిధప్రాంతాల పాలకులకు లేఖలు రాసి వాళ్ళను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు.

దాంతో కొన్ని రోజుల్లోనే తబ్రిస్తాన్, జర్జాన్, ఖురాసాన్, హమ్దాన్, వగైరా దేశాల, రాష్ట్రాల నుంచి వేలాదిసైనికులు వచ్చి అతని పతాకం క్రిందికి చేరారు. ఇలా ఈ సైనికుల సంఖ్య లక్షన్నరకు చేరింది. అప్పుడా సైన్యానికి అతను మర్వాన్‌రాజును సర్వసేనానిగా నియమించి నిహావంద్ ప్రాంతానికి పంపాడు.

అటు మదీనాలో ఈ సంగతి తెలియగానే ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) వెంటనే శత్రువుల్ని ఎదుర్కోవడానికి కూఫాసేనలకు నోమాన్ బిన్ ముఖ్రిన్ (రజి)ని సేనాపతిగా నియమించి తగిన ఆదేశాలిచ్చారు.

నోమాన్ (రజి) కూఫాలోని సేనలన్నిటిని ఒకచోట సమీకరించి నిహావంద్ వైపుకు బయలుదేరారు. 30 వేలమందితో కూడిన ఈ సైన్యం నిహావంద్‌కు తొమ్మిదిమైళ్ళ దూరంలోని ఓ ప్రదేశానికి చేరుకొని విడిదిచేసింది.

అటు ఈరాన్‌సైన్యం అంతకుముందే నిహావంద్‌లో ప్రవేశించి యుద్ధం చేయడానికి సిద్ధమైంది. మరునాడు ఈరానీయులు పట్నం బయటికొచ్చి కత్తులు దూశారు.

ఇరుపక్షాల మధ్య సంకులసమరం మొదలయింది. అయితే రెండు రోజులు యుద్ధం జరిగినా ముస్లింలు ఈరానీయుల్ని ప్రతిఘటించలేకపోయారు.



ఈరాన్‌సైనికులు పట్టణం లోపలికి వెళ్ళి బయట ఇనుప సూదులతో కూడిన ముళ్ళకంచె పరిచారు. దాని వల్ల ముస్లింసేనలు ముందుకు వెళ్ళలేకపోయాయి.

అపుడు సేనాపతి నోమాన్(రజి) యుద్ధవ్యూహాన్ని మార్చారు. నిహావంద్ పట్టణానికి ఆరుమైళ్ళ దూరంలో కొండగుట్టలున్నాయి. వాటి వెనుక ఆయన సేనల్ని దాచి, ఖాఖా బిన్ అమ్ నాయకత్వంలో ఒక చిన్న సైనికదళం పంపుతూ నిహావంద్ కోటపై దాడి చేయమని చెప్పారు.

ఖాఖా తన సైన్యం తీసుకొని కోట సమీపానికి వెళ్ళారు. ఈరాన్ సైనికులు ఆ చిన్న సైన్యాన్ని చూసి ద్విగుణీకృత ఉత్సాహంతో దానిపై విజృంభించారు.

ఇక్కడ ఆసక్తికరమైన ఓ సంఘటన గురించి తెలుసుకుందాం. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సేనాపతి నోమాన్ (రజి)కు మద్దతుగా సారియా (రజి) నేతృత్వంలో ఓ చిన్న సైనికదళమిచ్చి నిహావంద్‌కు పంపించారు. అయితే దారిలో ఓచోట శత్రువులతో తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. ముస్లింలు ఓటమి పాలయ్యే పరిస్థితిలో వారికి ఎక్కడ్నుంచో “సారియా! కొండ వైపుకు వెళ్ళు” అంటూ మూడుసార్లు ఓ అదృశ్యవాణి విన్పించింది. అప్పుడు దళపతి సారియా వెంటనే సైన్యాన్ని తీసుకొని కొండమీదికి చేరుకొని శత్రువులపై పునర్విజృంభించారు. దాంతో ఆయన విజయం సాధించారు.

సరిగ్గా అదేరోజు, అంటే శుక్రవారంనాడు మదీనాలో ఖలీఫా ఉమర్ (రజి) జుమా ప్రసంగంచేస్తూ హఠాత్తుగా “సారియా! కొండ వైపుకు వెళ్ళు” అంటూ మూడుసార్లు అన్నారు. ప్రజలీ మాట విని ఆశ్చర్యపోతూ “సారియా నిహావంద్ యుద్ధానికి వెళ్ళిపోయాడు కదా! ఇక్కడ మీరు సారియాను పిలుస్తున్నారేమిటీ?” అని అడిగారు.

దానికి ఆయన “అప్పుడు నేను ముస్లింలు యుద్ధంచేస్తున్న దృశ్యం చూశాను. వారు కొండ వైపుకు పోవడంలోనే వారి శ్రేయస్సుంది. అంచేత నా నోట అప్రయత్నంగా ఈ మాటలు వెలువడ్డాయి” అని అన్నారు.

ఆ తరువాత నెల రోజులకు సారియా దగ్గర్నుంచి ఒక సైనికుడు మదీనా వచ్చి ఆరోజు జరిగిన సంఘటన ఖలీఫాకు వివరించాడు.

అదలా ఉంచితే, ఖాఖాసైన్యం కొత్తవ్యూహం ప్రకారం వెనక్కిజరుగుతూ కొండల దగ్గరకు చేరుకుంది. ఈరాన్‌సైన్యం ఇక విజయం తమదేనని మరింత ఉత్సాహంతో ముస్లింసేనను వెనక్కినెడ్తూ కొండగుట్టల్ని సమీపించింది. అప్పుడు కొండగుట్టల వెనుక దాక్కున్న సేనాపతి నోమాన్(రజి) భారీసైన్యంతో ఒక్కసారిగా ఈరాన్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. దాంతో ఈరానీయులు కంగారుపడ్తూ కాలికి బుద్ధిచెప్పారు. ముస్లింలు ఈరానీయుల వెంటబడి వారిని సొరకాయల్ని కోసినట్లు హతమార్చ నారంభించారు. యుద్ధ మైదానం రక్తసిక్తమయి గుర్రాలు జారిపడేటంతగా జారుడుగా మారింది.

అలాంటి పరిస్థితిలో సేనాపతి నోమాన్ (రజి) గాయపడి గుర్రం మీదనుంచి క్రిందపడి ఊపిరి విడిచారు. వెంటనే ఆయన తమ్ముడు నయీమ్ (రజి) తన అన్న దుస్తులు ధరించి ధ్వజం తీసుకొని రంగంలోకి దూకారు. ముస్లింలు తమ సేనాపతి నోమాన్ (రజి) అమరగతినొందినప్పటికీ ఏమాత్రం అధైర్యం చెందకుండా శత్రువుల్ని చీల్చిచెండాడసాగారు.

దాంతో ఈరాన్ సైనికులు ముస్లింయోధుల ధాటికి తట్టుకోలేక యుద్ధమైదానంలో ముప్ఫయివేల శవాలను వదలిపెట్టి హమ్దాన్‌కు పారిపోయి కోటలో దూరి తలుపులు మూసుకున్నారు.

అయితే ముస్లింయోధులు వారిని వదలిపెట్టకుండా తరుముకుంటూ హమ్దాన్ పట్టణానికి చేరుకొని కోటను ముట్టడించారు. ఈరాన్‌సైన్యం కాస్సేపు పెనుగు లాడి చేతులెత్తేయడంతో ముస్లింలు హమ్దాన్‌ని సులభంగా కైవశం చేసుకున్నారు.

సేనాపతి నోమాన్ (రజి) అమరగతినొందిన తరువాత ఆయన స్థానంలో హుజైఫా బిన్ ఐమాన్ (రజి) సేనాపతి అయ్యారు. ఆయన నిహావంద్‌కు వెళ్ళి సమరసొత్తును సమీకరించి అక్కడ ఈరాన్ చక్రవర్తి రాజేసిన అగ్నిగుండం ఆర్పివేశారు.

# 53. తల్హా బిన్ ఉబైదుల్లా తైమి (రజి)

సిరియా అంతర్జాతీయా వ్యాపారకేంద్రం బుస్రా పట్టణం ఆరోజు విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన కొనుగోలుదారులతో కిటకిటలాడసాగింది. ఆ వర్తకుల్లో అరేబియా నుండి వచ్చిన అరబ్బు వర్తకులు కూడా ఉన్నారు. వ్యాపారలావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. అంతలో ఓ క్రైస్తవసాధువు అరబ్బు వర్తకుల దగ్గరకు వచ్చి "అరబ్బు వర్తకులారా! మీలో ఎవరైనా మక్కాపట్టణవాసి ఉన్నారా?" అని అడిగాడు.

ఈమాట వినగానే ఓ నవయువకుడు ముందుకు వచ్చి "నేను మక్కాపట్టణవాసిని. చెప్పండి ఏమిటీ విశేషం?" అన్నాడు.

"అయితే మీలో అహ్మద్ వెలువడ్డాడా?" అని అడిగాడు క్రైస్తవసాధువు.

"అహ్మదా! ఏ అహ్మద్?" అన్నాడు తల్హా ఆశ్చర్యపోతూ.

"అబ్దుల్లా బిన్ అబ్దుల్‌ముత్తలిబ్ కుమారుడు అహ్మద్. ఆయన వెలువడే సమయం ఈ నెలలోనే. ఆయన అంతిమ దైవప్రవక్త. ఆయన మీ భూభాగంలో, కాబాలయం ఉన్న ప్రదేశంలోనే ప్రభవిస్తాడు. అక్కడ్నుంచి నల్లరాళ్ళు, ఉప్పుమట్టి నుండి వెలువడే సెలయేరులు, ఖర్జూరతోటలు ఉండే ప్రాంతానికి వలస పోతాడు. యువకుడా! ఆయన్ని విశ్వసించడంలో నువ్వు ఏమాత్రం తటపటాయించకూడదు సుమా!" అన్నాడు వివరంగా క్రైస్తవసాధువు.



"అయితే నేనిప్పుడే బయలుదేరి వెళ్ళిపోతాను" అని చెబుతూ తల్హా తక్షణమే వ్యాపారసామగ్రి సర్దుకొని ఒంటెలపై కట్టుకొని ఇతర అరబ్బువర్తకుల్ని వదిలేసి వేగంగా మక్కాదారి పట్టాడు.

ఆయన మక్కా చేరుకొని తన గృహస్థులతో మాట్లాడుతూ "నేను మక్కా నుండి వెళ్ళిపోయిన తర్వాత ఇక్కడ ఏదైనా కొత్తసంఘటన జరిగిందా?" అని అడిగాడు.

దానికి గృహస్థులు "ఆ...అబ్దుల్లా కొడుకు ముహమ్మద్ (సల్లం) తాను దైవప్రవక్త నని ప్రకటించుకున్నాడు. అబూఖహాఫా కొడుకు అబూబకర్ ఆ మాటలు నమ్మి ఆయనకు అనుచరుడైపోయాడు" అని చెప్పారు.

తల్హా బిన్ ఉబైదుల్లా ఈమాట వినగానే అబూబకర్ ఇంటికి చేరుకొని "అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్ (సల్లం) తాను దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడని విన్నాను, మీరాయనకు అనుచరులయ్యారని కూడా విన్నాను. ఇదంతా నిజమేనా?" అనడిగాడు.

దానికి అబూబకర్ "నువ్వు విన్నదంతా నిజమే. జీవితంలో ఎన్నడూ అబద్ధమాడని మనిషి తాను దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడంటే అందులో ఏమాత్రం సందేహం లేదు. అందుకే నేనా ప్రకటన విని ఆయనకు అనుచరుణ్ణి ఐపోయాను" అని అన్నారు.

తరువాత తల్హా సిరియాలో తనకు క్రైస్తవసాధువు చెప్పిన భవిష్యవాణి గురించి తెలియజేశాడు. ఈమాట వినగానే అబూబకర్ ఆశ్చర్యపోయారు.

"అయితే ముహమ్మద్ (సల్లం) దగ్గరకు వెళ్దాం పద. ఆయనక్కూడా ఈ సంఘటన గురించి తెలియజేసి, ఆయన హితోపదేశం విని దైవధర్మంలో చేరిపో" అన్నారు అబూ బకర్ (రజి) తల్హాను ప్రోత్సహిస్తూ.

ఆ తరువాత అబూబకర్ (రజి) తల్హాను వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి ఆయనకు తల్హాను పరిచయం చేశారు.

అప్పుడు దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్ వాణి పఠించి తల్హాకు ఇస్లాం స్వీకారం గురించి హితోపదేశం చేశారు. తల్హా దైవవాణి విని ఎంతో ప్రభావితుడవుతూ సిరియా క్రైస్తవ సాధువు చెప్పిన భవిష్యవాణి తెలిపాడు. అది విని దైవప్రవక్త (సల్లం) ఎంతో సంతోషించారు. ఆ వెనువెంటనే తల్హా "అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధ్యదైవం లేడని, ముహమ్మద్ (సల్లం) ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను" అనే సద్వచనం పఠించి విశ్వాసుల్లో చేరిపోయాడు.

హజ్రత్ తల్హా (రజి) ఇస్లాంస్వీకరణ సంగతి విని అతని కుటుంబం విచార సముద్రంలో పడిపోయింది. ముఖ్యంగా ఆయన తల్లిహృదయం తల్లడిల్లిపోయింది. దిగులుతో క్రుంగిపోసాగింది.

తల్హా (రజి) కుటుంబసభ్యులు, ఆయన తెగవాళ్ళు ఆయన్ని ఇస్లాం నుండి వెనక్కి మరలించడానికి శతవిధాల ప్రయత్నించారు. కాని తల్హా (రజి) దైవధర్మంలో స్థిరంగా ఉండిపోయారు. వారాయాన్ని మొదట నయానా భయానా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. అది ఫలించకపోవడంతో వారాయనపై దౌర్జన్యానికి దిగారు.

ఓరోజు వారు ఆయన్ని పట్టుకొని కాళ్ళుచేతులు కట్టిపడేసి కొట్టసాగారు. మరోవైపు తల్హా (రజి) వృద్ధమాత ఆయన్ని చెడామడా తిడ్తూ ఆడిపోసుకోసాగింది.

తరువాత ఖురైష్‌పులిగా పేరుపడ్డ నౌఫల్ బిన్ ఖువైలద్ అనే ఓ నాయకుడు అబూబకర్ (రజి)ని, తల్హా (రజి)ని తాడుతో కట్టి రౌడీలకు, ఆకతాయిలకు అప్ప గించాడు. ఆ దుర్మార్గులు వారిద్దరిని ఇష్టమొచ్చినట్లు చితగ్గొట్టారు.

కాలం ఎలాంటి వడిదుడుకులు లేకుండా సాగిపోతోంది. ఒకదాని తర్వాత ఒకటి చొప్పున అనేక సంఘటనలు జరుగుతున్నాయి. తల్హా బిన్ ఉబైదుల్లా (రజి) అనేక పరీక్షల్ని ఎదుర్కొంటూ విశ్వాసమజిలీలను విజయవంతంగా దాటుకుంటూ ముందుకు సాగుతున్నారు.

చివరికి మక్కా నుండి మదీనాకు వలసిపోయిన తరువాత మక్కా అవిశ్వాసులతో సాయుధప్రతిఘటన పరీక్ష కూడా ఎదురయింది. బదర్ యుద్ధంలో తన ప్రతిభా పరాక్రమాల ప్రదర్శన తరువాత మరుసటి సంవత్సరమే ఉహద్‌యుద్ధంలో మరొక పరీక్ష ఎదురయింది. దైవప్రవక్త (సల్లం)ను కాపాడటానికి ముందుకొచ్చారు.

ఉహద్ కొండపై ముస్లింలకు, సత్యతిరస్కారులకు మధ్య భీకరపోరాటం సాగింది. ముస్లింలు ఆత్మరక్షణలో పడిపోయి శత్రువుల్ని ప్రతిఘటించడానికి చెల్లాచెదరైపోయారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) దగ్గర పదిమంది అనుచరులే ఉండిపోయారు. వారాయనకు రక్షణ వలయంగా మారి పోరాడుతూ కొండపైకి ఎక్కుతున్నారు. కొందరు అవిశ్వాసులు అది గమనించి దైవప్రవక్త (సల్లం)ను హతమార్చడానికి వచ్చిపడ్డారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అవిశ్వాసుల బారి నుండి మనల్ని కాపాడే యోధుడు మీలో ఎవరైనా ఉన్నాడా? అతను స్వర్గంలో నా అనుచరుడిగా ఉంటాడ"ని అన్నారు.

తల్హా (రజి) ఈశుభవార్త వినగానే "దైవప్రవక్తా! నేను వారిబారి నుండి కాపాడుతా" అంటూ ముందుకొచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "వద్దు, నువ్వు నీ స్థానంలోనే నిలబడు" అన్నారు. అప్పుడు ఒక అన్సారీ యోధుడు ముందుకొచ్చి "నేను కాపాడుతా" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ...నువ్వీ పని చెయ్యొచ్చు" అని అన్నారు.

అప్పుడా అన్సారీయోధుడు దైవప్రవక్త (సల్లం) సమీపానికి వస్తున్న అవిశ్వాసులపై విరుచుకుపడి తీవ్రంగా పోరాడుతూ చివరికి అమరగతుడయ్యాడు.



ఈలోగా దైవప్రవక్త (సల్లం) కొండమీద మరింత పైకెక్కారు.

అది చూసి అవిశ్వాసులు అటువైపు దూసుకు పోయారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "వారిని ఎదుర్కొనేవారు మీలో ఎవరూ లేరా?" అన్నారు తన అనుచరులతో.

వెంటనే తల్హా (రజి) ముందుకొచ్చి "నేనున్నాను దైవప్రవక్తా!" అన్నారు.

దానికి దైవప్రవక్త (సల్లం) "వద్దు, నువ్వు నీ స్థానంలోనే ఉండు" అన్నారు.

వెంటనే మరొక అన్సారీ యోధుడు ముందుకొచ్చి "నేనున్నాను దైవప్రవక్తా!" అన్నాడు. "ఆ...నువ్వు ప్రతిఘటించు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అప్పుడా అన్సారీయోధుడు అవిశ్వాసులపై విరుచుకుపడి తీవ్రంగా పోరాడుతూ చివరికి అతను కూడా అమరగతుడయ్యాడు. ఈలోగా దైవప్రవక్త (సల్లం) కొండమీద మరింత పైకెక్కారు.

దైవప్రవక్త (స) తనరక్షణ కోసం అనుచరుల్ని పిలవగానే ముందుగా తల్హా (రజి) తనను సమర్పించుకోవడం, దానికి దైవప్రవక్త (సల్లం) నిరాకరించడం, అప్పుడు వేరొక అన్సారీ ముందుకొచ్చి ఆయన అనుమతితో సత్యతిరస్కారులతో పోరాడి అమరగతి నొందడం జరుగుతూ ఇలా పదిమంది అన్సారీయోధులు నేలకొరిగి ఊపిరి విడిచారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) తల్హా(రజి)ను అనుమతించారు. ఆ అనుమతి లభించగానే తల్హా (రజి) సింహకిషోరంలా అవిశ్వాసులపై లంఘించారు.

అయితే అప్పటికి దైవప్రవక్త (సల్లం) ఒక అగడ్తలో పడటంతో ఒక పన్ను ఊడి పోయి పెదవులు గాయపడి ముఖం రక్తసిక్తమవడం జరిగింది.

హజ్రత్ తల్హా (రజి) అవిశ్వాసులతో తీవ్రంగా పోరాడి వారిని దూరంగా తరిమి కొట్టారు. తర్వాత వెనక్కి తిరిగొచ్చి దైవప్రవక్త (స)ను రెండు చేతులతో పొదివిపట్టుకొని మరికొంచెం పైకి తీసికెళ్ళి కూర్చోబెట్టారు. ఆ వెనువెంటనే అవిశ్వాసులపై దాడిచేసి వారిని దూరంగా నెట్టివేశారు. అయితే ఆ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.

అంతలో అబూబకర్ (రజి), అబూఉబైదా (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వస్తుంటే ఆయన వారిని వారిస్తూ "నా సంగతి వదలి ముందు మీ మిత్రుడు తల్హా (రజి)ని కాపాడేందుకు వెళ్ళండి" అని చెప్పారు.

వెంటనే వారిద్దరు తల్హా (రజి) వైపు పరుగెత్తారు. చూస్తే తల్హా(రజి) దేహం దెబ్బయి గాయాలతో పూర్తిగా రక్తసిక్తమైపోయింది. ఒక హస్తం తెగిపోయింది. ఆగని రక్తప్రవాహంతో ఆయన స్పృహ కోల్పోయి ఓ గుంటలో పడిపోయి ఉన్నారు.

ఈ సంఘటన తరువాత దైవప్రవక్త (సల్లం) తల్హా(రజి)ను గురించి అనుచరుల ముందు ప్రస్తావిస్తూ "తన మొక్కుబడి (మృత్యువు)ని తీర్చుకొని నేలపై (హాయిగా)

తిరుగుతుండే మనిషిని చూడదలచుకుంటే తల్హా బిన్ ఉబైదుల్లా (రజి)ని చూడండి" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) నోట వెలువడిన ఈ హితోక్తితో ఆయన అనుచరులు అప్పటినుంచి హజ్రత్ తల్హా (రజి)ను 'సజీవఅమరవీరుడు' అని పిలువసాగారు.

హజ్రత్ తల్హా(రజి) బడావ్యాపారవేత్త, గొప్ప ధనికుడు. ఒకరోజు హద్రెమౌత్ ప్రాంతం నుండి ఆయనకు డెబ్భయి లక్షల దిర్హంల పైకం చేరింది. దాంతో ఆయన ఆందోళన చెందుతూ ఆ రాత్రంతా నిద్రపోలేకపోయారు.

ఆయన భార్యామణి ఉమ్మె కుల్సూమ్ బిన్ అబూబకర్ (రజి) ఆయన పరిస్థితి గమనించి "ఏమిటీ ఆందోళన చెందుతున్నట్లు కన్పిస్తున్నారు? నావల్ల మీకేదైనా బాధ కలిగిందా?" అని అడిగింది.

దానికి తల్హా(రజి) "అదేమీ లేదు. నువ్వు ఎంతో మంచి ముస్లిం సతీమణివి. తన ఇంట్లో ఇంతపెద్ద ధనరాసి ఉంచుకొని ప్రశాంతంగా నిద్రించే మనిషి తన ప్రభువు విషయంలో ఎలాంటి అభిప్రాయం కలిగివుంటాడా అని నేను రాత్రంతా ఆలోచిస్తూ ఉండిపోయాను" అని అన్నారు.

"అందులో ఆందోళన చెందాల్సిన విషయం ఏముందని? మీరు నిరుపేదలను, నిరాధారులను మరచిపోలేదు కదా! తెల్లవారిన తరువాత వారిని పిలిచి ఈ పైకం మొత్తం దానం చేయండి" అన్నది భార్యామణి.

"దేవుడు నీపై కరుణామృతం కురిపించుగాక! నువ్వు నిజంగా గొప్ప దైవభక్తురాలివి, గొప్ప దైవభక్తుడి కూతురివి" అన్నారు హజ్రత్ తల్హా(రజి) సంతోషిస్తూ.

తెల్లవారగానే ఆయన పట్నంలోని పేదలందర్నీ పిలిపించి ఇంట్లో ఉన్న ధనమంతా వారికి దానంచేసి 'అమ్మయ్య' అంటూ గుండెల మీద చేయి వేసుకున్నారు.

ఒకరోజు తల్హా(రజి) దూరపు బంధువొకడు వచ్చి తనకు కొంచెం ఆర్థికసహాయం చేయమని అడిగాడు.

తల్హా (రజి) అతని మాటలు విని "నా దగ్గర ఒక భూమి ఉంది. దాన్ని ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) తీసుకొని నాకు మూడు లక్షలు దిర్హంలు ఇస్తానన్నాడు. ఇప్పుడా భూమిని నీవు కోరితే నీకు ఇచ్చేస్తాను. కాదంటే దాన్ని అమ్మి మూడు లక్షల పైకం నగదుగా ఇస్తాను" అని చెప్పారు.

తల్హా (రజి) దూరపు బంధువు డబ్బే కావాలని అడిగాడు. అంచేత తల్హా(రజి) ఆ భూమిని అమ్మి మూడు లక్షల దిర్హంల పైకం అతనికి ముట్టజెప్పారు. ఆ తర్వాత మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ రెండు ఉదంతాలు విని ఆయనకు 'తల్హాఖైర్' అనే బిరుదు ప్రదానం చేశారు.



# 54. రబీ బిన్ జియాద్ హారిసి (రజి)

ఖిలాఫత్ వారసుడిగా ఎంపికైన ఉమర్ ఫారూఖ్ (రజి)కు మద్దతు ప్రకటిస్తూ బైత్ చేయడానికి వివిధ రాష్ట్రాల నుండి ప్రతినిధిబృందాలు మదీనా చేరుకున్నాయి. ఉమర్ ఫారూఖ్ (రజి) వారిలో రబీ బిన్ జియాద్ హారిసి (రజి) అనే ఓ ప్రతినిధిని పిలిచి సలహా అడిగారు.

అప్పుడాయన ఇలా అన్నారు: "విశ్వాసుల నాయకా! దేవుడు మీపై ముస్లింల వ్యవహారాల బాధ్యత మోపి మిమ్మల్ని ఓ పెద్ద పరీక్షకు గురిచేశాడు. కనుక మీరు ఖిలాఫత్ బాధ్యతల నిర్వహణ విషయంలో ఎల్లప్పుడూ దేవునికి భయపడుతూ ఉండండి. గుర్తుంచుకోండి, ఫిరాత్ నదీతీరంపై ఒక మేక చచ్చినా సరే ప్రళయదినాన దాన్ని గురించి దేవుడు మిమ్మల్ని నిలదీస్తాడు."

ఈమాటలు వినగానే ఉమర్ ఫారూఖ్ (రజి) కళ్ళు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి. ఆయన కళ్ళు తుడుచుకుంటూ "ఖిలాఫత్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పటివరకు ఎవరూ ఇలాంటి ఉపదేశం చేయలేదు నాకు" అని అన్నారు.

సమావేశం ముగిసిన తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి)ని పిలిచి "రబీ బిన్ జియాద్ గురించిన వివరాలు పూర్తిగా తెలుసుకొని, అతను నాతో అన్న మాటల్లో చిత్తశుద్ధి కలిగివుంటే నిజంగా అతను క్రియాశీలుడైన గొప్పమనిషని చెప్పవచ్చు...

...ఖిలాఫత్ వ్యవహారాల్లో అతనిద్వారా మనం అత్యధిక సహాయసహకాలు పొందగలమని ఆశించవచ్చు. అంచేత నువ్వతనికి ఏదైనా బాధ్యత అప్పగించి దాని నిర్వహణ గురించి నాకు తెలియజేస్తూ ఉండు" అని చెప్పారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు అబూమూసా అష్అరీ (రజి) ఖలీఫా అనుమతితో అహ్వాజ్ రాష్ట్రంలోని మనాజర్ పట్టణాన్ని జయించడానికి ఒక సైనికదళం సిద్ధం చేశారు. అందులో రబీ బిన్ జియాద్ (రజి)ని, ఆయన సోదరుడు ముహాజిర్ (రజి)ను కూడా భర్తీచేశారు.

ఈవిధంగా ఆయన సైన్యంతో వెళ్ళి మనాజర్ పట్టణాన్ని ముట్టడించారు. ఇరుపక్షాల మధ్య సంకులసమరం సాగింది. అందులో అనేకమంది ముస్లింయోధులు అమరగతులయ్యారు. రమజాన్ నెల రావడంతో ముస్లింలు ఉపవాసం ఉండి యుద్ధం చేయసాగారు.

రబీ (రజి) సోదరుడు ముహాజిర్ (రజి) కఫన్ వస్త్రాలు ధరించి రబీ(రజి)కి హితోపదేశం చేసి విజయమో వీరమరణమో తేల్చుకోవడానికి శత్రుసైన్యంలోకి తుఫానులా దూసుకుపోయారు.

హజ్రత్ రబీ బిన్ జియాద్ (రజి) తన సోదరుడి పరిస్థితి చూడగానే సేనాపతి అబూమూసా (రజి) దగ్గరకు వెళ్ళి "ముహాజిర్ ఉపవాస స్థితిలోనే పోరాడుతూ ప్రాణాలు అర్పించడానికి పూనుకున్నారు. ఇలా మన యోధులు ఉపవాసముండి యుద్ధం చేస్తున్నందు వల్ల మానసికంగా, శారీరకంగా బలహీనమయ్యారు. అయినప్పటికీ వారు ఉపవాసం విరమించడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. మీరే ఆలోచించి ఏదైనా నిర్ణయం తీసుకోండి" అని అన్నారు.

అబూమూసా (రజి) ఈమాట వినగానే సైనికుల్ని సంబోధిస్తూ "ముస్లిం యోధులారా! నేను దేవుని మీద ప్రమాణంచేసి చెబుతున్నాను. మీరు ఉపవాసాన్నయినా విరమించండి లేదా యుద్ధరంగం నుండి తొలగిపోండి. ఇదిగో చూడండి, నేను ఉపవాసం విరమిస్తున్నాను" అంటూ మంచినీళ్ళు తాగారు.

సేనాపతి మాటలు వినగానే ముస్లిం యోధులందరూ ఉపవాసం విరమించి శత్రువులపై విరుచుకుపడ్డారు. రబీ బిన్ జియాద్ (రజి) సోదరుడు ముహాజిర్ (రజి) కూడా ఉపవాసం విరమించి ఖడ్గం వేగంగా తిప్పుతూ శత్రుసైనికపంక్తుల్ని చీల్చుతూ ఎంతో లోపలికి దూసుకుపోయారు. అయితే శత్రుసైనికులు నలువైపుల నుంచి ఆయన్ని చుట్టుముట్టి ఖడ్గాలతో విరుచుకుపడ్డారు. దాంతో హజ్రత్ ముహాజిర్ (రజి) తీవ్రమైన గాయాలతో నేల కూలారు. వెంటనే శత్రువులు ఆయన శిరస్సు ఖండించి ఓ ఎత్తయిన ప్రదేశంలో ఉంచారు.

రబీ బిన్ జియాద్ (రజి) ఆ హృదయవిదారక దృశ్యం చూసి ఆవేశంతో రగిలిపోతూ "దైవసాక్షి! దేవుడు తలిస్తే నేను మీ తరపున, యావత్ ముస్లిం అమరగతుల తరపున శత్రువుల నుండి ప్రతీకారం తీర్చుకుంటాను" అని అన్నారు.

అబూమూసా (రజి) రబీ(రజి) హృదయంలో ఆయన సోదరుని మృతి పట్ల శత్రువులకు వ్యతిరేకంగా రగిలిన భావోద్రేకాలను గమనించి, సైనికనాయకత్వపు బాధ్యత నుంచి తప్పుకొని దాన్ని రబీ (రజి)కి అప్పగించారు. తర్వాత ఆయన "సూస్" పట్టణాన్ని జయించడానికి వెళ్ళిపోయారు.

రబీ బిన్ జియాద్ (రజి) సైన్యానికి నేతృత్వం వహించి సింహకిషోరంలా శత్రువులపై విరుచుకుపడ్డారు. దాంతో శత్రు సైనికపంక్తులు చిందరవందరయ్యాయి. కాస్సేపటికే వారు ప్రాణభీతితో పలాయనం చిత్తగించారు. మనాజర్ పట్నం ముస్లింల స్వాధీనంలోకి వచ్చింది. వారు శత్రుసైనికుల్ని వధించి వారి స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా చేసుకున్నారు. ఆ యుద్ధంలో వారికి అపార సమరసొత్తు లభించింది. ఈ విజయంతో రబీ బిన్ జియాద్ (రజి) అదృష్టతార మరింత మెరిసింది. ఖలీఫా ఉమర్ (రజి) సీస్తాన్ ప్రాంతాన్ని జయించడానికి రబీ (రజి) నాయకత్వంలో ఓ సైనికదళమిచ్చి పంపారు.



రబీ బిన్ జియాద్ (రజి) సైన్యం తీసుకొని సీస్తాన్ దిశగా బయలుదేరారు. భయంకరమైన ఆ దారిలో అనేక వడిదుడుకులు ఎదుర్కొంటూ, అనేక ఊళ్ళను జయిస్తూ సజిస్తాన్ రాజధాని జరంగ్ సమీపానికి చేరుకున్నారు. అక్కడి నాయకులు భారీఎత్తు సైనికసమీకరణ చేసి యుద్ధానికి సమాయత్తమయ్యారు.

యుద్ధం మొదలయింది. ఉభయపక్ష సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడసాగారు. చివరికి శత్రుసైనికులు ఢీలా పడిపోయారు. ముస్లింల వైపు విజయచిహ్నాలు కన్పించడంతో ఈరానీసేనాపతి పర్వేజ్ సంధిపేరుతో కాళ్ళబేరానికి వచ్చాడు. అతను తన దౌత్యవేత్తను రబీ బిన్ జియాద్ (రజి) దగ్గరకు పంపి అతని ద్వారా తాను సంధి గురించి మాట్లాడదలిచానని, అందుకు సమయం, స్థలం నిర్ణయించమని కోరాడు. దానికి రబీ (రజి) అంగీకరించారు.

దౌత్యవేత్త వెళ్ళిపోయిన తరువాత రబీ బిన్ జియాద్ (రజి) శత్రుసేనాపతిని స్వాగతించడానికి ఓ ప్రత్యేక స్థలం ఎంపికచేసి, అతను వచ్చే దారిలో ఇరువైపులా అతని సైనికుల మృతదేహాలను పడవేయించారు.

రబీ బిన్ జియాద్ (రజి) పెద్ద తలతో ఆరున్నర అడుగుల ఆజానుబాహుడైనందున ఆయన్ని చూసిన ప్రతి వ్యక్తీ ఆయన కళ్ళలో కళ్ళుపెట్టి మాట్లాడటానికి జంకుతాడు.

ఈరాన్ సేనాపతి పర్వేజ్ యుద్ధ ఒడంబడిక గురించి మాట్లాడటానికి వచ్చినపుడు హజ్రత్ రబీ (రజి)ని చూసి భయంతో వణికిపోసాగాడు. అతను దూరాన నిలబడే తడబడుతూ, నసుగుతూ ముఖస్తుతి చేసే ధోరణిలో మాట్లాడుతూ "నేను తమరికి వేయిమంది బానిసల్ని సమర్పించుకుంటా. వారిలో ప్రతిఒక్కడి తలపై స్వర్ణపాత్ర ఉంటుంది" అన్నాడు.

రబీ (రజి) పర్వేజ్ సమర్పణను అంగీకరించి అతనితో సంధి కుదుర్చుకున్నారు. మరుసటి రోజు ఆయన రాజఠీవి ఉట్టిపడుతుండగా వేయిమంది బానిసల మధ్య అల్లాహుఅక్బర్ నినాదాలతో పట్టణంలో ప్రవేశించారు.

రబీ బిన్ జియాద్ తొలి నలుగురు ఖలీఫాల కాలంలో అనేకసార్లు యుద్ధాలు చేసి ఎన్నో విజయాలు సాధించారు. బనూఉమయ్యా తెగవారి పాలన ప్రారంభమైనపుడు అమీర్ ముఆవియా (రజి) ఆయన్ని ఖురాసాన్ గవర్నర్‌గా నియమించారు. హజ్రత్ రబీ (రజి)కు హోదాఅంతస్తులు ఇష్టం లేకపోయినా రాజ్యాధినేత ఆదేశం కనుక గవర్నర్ పదవిని అంగీకరించారు.

అమీర్ ముఆవియా (రజి) పాలనలో జియాద్ బిన్ అబియా అనే ఓ ముఖ్యమైన వ్యక్తి హజ్రత్ రబీ (రజి)కి రాజ్యాధినేత తరపున ఒక లేఖ పంపుతూ "యుద్ధంలో లభించే సమరసొత్తులో వెండిబంగారాలను కేంద్రీయ ధనాగారానికి పంపి మిగిలిన

సంపదను యోధులకు పంచమని మన విశ్వాసుల నాయకుడు ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి) ఆదేశించారు'' అని అందులో రాశాడు.

దానికి రబియా బిన్ జియాద్ (రజి) ఘాటుగా సమాధానమిస్తూ ''నీవు విశ్వాసుల నాయకుని తరఫున రాసిన మాట దైవాజ్ఞకు వ్యతిరేకంగా ఉంది. అంచేత నేను ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆదేశాన్ని పాటించలేను'' అని రాశారు.

ఆ తర్వాత ఆయన తన సైనిక సహచరులందర్నీ పిలిచి ఈ సమరసొత్తులో మీకు రావలసిన వాటాలు తీసికెళ్ళండి'' అని చెప్పారు. ఇలా సైనికుల భాగం పోగా మిగిలిన 1/5వ భాగం రాజధాని డెమాస్కస్‌కు పంపివేశారు.

మరునాడు మస్జిద్‌లో హజ్రత్ రబీ (రజి) జుమాప్రసంగం చేస్తూ ''సోదరులారా! నేనిప్పుడు నా జీవితం పట్ల విసిగిపోయాను. అంచేత నేను దైవాన్నిలా వేడుకుంటాను, దానికి మీరంతా తథాస్తు అనండి'' అని చెప్పారు.

ఆ తర్వాత ఆయన ''దేవా! నీవు నా విషయంలో ఏదైనా మంచిని గురించి నిర్ణయిస్తే నన్ను వీలైనంత త్వరగా నీ దగ్గరకు పిలిపించుకో'' అని దుఆ చేశారు.

దానికి ప్రజలు ఆమీన్ అన్నారు. అంతే, ఆరోజు సూర్యుడు ఇంకా అస్తమించనే లేదు అనన్య ప్రతిభాపరాక్రమాల ఈ ధరణితార నింగికెగిసి శాశ్వతంగా కనుమరుగై పోయింది.

# 55. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)

''పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న సామెత హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)కు సరిగ్గా వర్తిస్తుందని చెప్పవచ్చు. ఇంతకూ ఆ పువ్వు పరిమళించడానికి, అది వికసించి తన పరిమళాన్ని ధరణి దశదిశలా వ్యాపింజేయడానికి మూలకారణం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నోట వెలువడిన లాలాజలమే.

అబ్దుల్లా (రజి) పుట్టగానే ఆయన మాతృమూర్తి ఆయన్ని దైవప్రవక్త (స) సన్నిధికి తీసికెళ్ళారు. దైవప్రవక్త (స) ఆ చిన్నారి నోట్లో తన లాలాజలం వేసి మనసారా దీవించారు. దైవప్రవక్త (సల్లం) లాలాజల ప్రభావానికి ఆయన శిక్షణ కూడా తోడయింది.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) బాల్యం నుండే దైవప్రవక్త (సల్లం) శిక్షణలో పెరగసాగారు. దైవప్రవక్త (సల్లం) ఉజూ చేయడానికి లేచినప్పుడు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఆయనకు నీళ్ళు తెచ్చిచ్చేవారు. ఆయన నమాజ్ చేయడానికి సిద్ధమైనప్పుడు ఆయన వెనుక నిల్చొని ఆయన్ని అనుసరించేవారు. ఆయన ప్రయాణమై ఎక్కడికైనా బయలుదేరినప్పుడు ఒంటెపై ఆయన వెనుక కూర్చునేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే అబ్దుల్లా (రజి) అనుక్షణం దైవప్రవక్త (సల్లం)కు నీడలా ఉండేవారు.



ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఉజూ చేయదలచుకున్నప్పుడు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఆయనకు నీళ్ళు తెచ్చిచ్చారు. దాంతో దైవప్రవక్త (సల్లం) సంతోషిస్తూ ఆయన వైపు ప్రేమగా చూశారు. దైవప్రవక్త (సల్లం) నమాజ్ ప్రారంభిస్తూ అబ్దుల్లా (రజి) తన పక్కన నిలబడమని సూచించారు. కాని అబ్దుల్లా (రజి) ఆయన పక్కన నిలబడటానికి బదులు ఆయన వెనుక నిలబడ్డారు.

నమాజ్ పూర్తికాగానే దైవప్రవక్త (సల్లం) అబ్దుల్లా (రజి) వైపు తిరిగి ''అబ్దుల్లా! నువ్వు నా పక్కన ఎందుకు నిల్చోలేదు?'' అనడిగారు.

దానికి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ''దైవప్రవక్తా! నా దృష్టిలో మీ వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనది. అలాంటి మహోన్నత వ్యక్తి పక్కన నేను నిలబడేటంత సాహసం చేయగలనా?'' అని సమాధానమిచ్చారు.

దైవప్రవక్త (సల్లం) ఈ సమాధానం విని చేతులు పైకెత్తి ''దేవా? ఈ అబ్బాయికి దూరదృష్టి, విజ్ఞతావివేచనాలు ప్రసాదించు'' అని ప్రార్థించారు.

విశ్వప్రభువు తన ప్రవక్త (స) చేసిన ఈ ప్రార్థనను స్వీకరించాడు. ఫలితంగా అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) అపారమైన బుద్ధి, దూరదృష్టి, వివేచన, అవగాహనా మహాభాగ్యాలతో తులతూగిపోయారు.

హజ్రత్ అలి (రజి), హజ్రత్ ముఆవియా (రజి)ల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు అలి (రజి) మద్దతుదారుల్లో కొందరు ఆయన్ని వీడిపోయారు. అప్పుడు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) అలి (రజి) అనుమతి తీసుకొని ఆ ఖార్జీల దగ్గరకు వెళ్ళారు. ఖార్జీలు స్వాగతం చెప్పి ఆయన రాక ఉద్దేశ్యం ఏమిటని అడిగారు. ఆయన చర్చలు జరపడానికి వచ్చానని చెప్పారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) చర్చ ప్రారంభిస్తూ ''దైవప్రవక్త (స) పెదనాన్న కుమారుడు, ఆయన అల్లుడు, అందరికంటే ముందు దైవధర్మం స్వీకరించినవాడయిన అలీ (రజి) పట్ల మీరెందుకు విముఖులయ్యారు? ఆయన్ని ఎందుకు వీడిపోయారు?'' అని అడిగారు.

దానికి వారు ''ఆయన చేసిన మూడు పనులు మాకు నచ్చలేదు'' అని సమాధాన మిచ్చారు. ''ఏమిటవి?'' అని అడిగినపుడు వారిలా అన్నారు:

''ఒకటి, దైవధర్మం విషయంలో ఆయన మానవుల్ని మధ్యవర్తులుగా అంగీక రించారు. రెండు, ఆయన ఆయిషా (రజి), ముఆవియా (రజి)లతో యుద్ధం చేశారు. కాని సమరసొత్తు స్వాధీనం చేసుకోలేదు, యుద్ధఖైదీలను నిర్బంధంలోకి తీసుకోలేదు. మూడు, ముస్లింలు ఆయన్ని తమ నాయకుడిగా ఎన్నుకొని ఆయన చేతిలో బైత్ చేసి నప్పటికీ ఆయన తన పేరు నుంచి విశ్వాసులనాయకుడనే బిరుదుని తీసివేశారు''

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఈ మాటలు విని "ఒకవేళ నేను మీ మాటలకు ఖుర్ఆన్-హదీసుల వెలుగులో సమాధానమిస్తే మీరు మీ ప్రస్తుత వైఖరిని మార్చుకొని అలీ (రజి)ని వ్యతిరేకించడాన్ని మానుకుంటారా?" అని అడిగారు.

దానికి ఖార్జీలు "ఆ...మీ మాటలు మాకు సంతృప్తి కలిగిస్తే మేము ఆయన్ని వ్యతిరేకించడాన్ని మానుకొని ఆయన మద్దతుదారుల్లో చేరిపోతాం" అని అన్నారు.

"సరే, దైవధర్మం విషయంలో అలి (రజి) మానవుల్ని మధ్యవర్తులుగా అంగీక రించారని కదా మీరు ఆరోపిస్తున్నది? కాని ఖుర్ఆన్‌లో దేవుడు ఇలా ఆదేశిస్తున్నాడు-

'విశ్వాసులారా! మీరు హజ్‌దీక్షలో ఉన్నప్పుడు వేటాడకండి. ఒకవేళ ఎవరైనా కావాలని ఇలా చేస్తే అతను తాను వేటాడిన జంతువుకు సమానమైన మరో జంతువును సమర్పించి మొక్కుబడి చెల్లించవలసి ఉంటుంది. దీన్ని గురించి మీలో ఇద్దరు నిజాయితీపరులు నిర్ణయం తీసుకోవాలి.' (5:95)–

నేను దైవాన్ని సాక్షిగా చేసి అడుగుతున్నాను. మానవుల ప్రాణాలు కాపాడటానికి, వారి మధ్య సయోధ్యకుదర్చడానికి మానవుల్ని మధ్యవర్తులుగా అంగీరించడం మంచిదా? లేక పావు దిర్హం విలువ కూడా లేని ఒక కుందేలు విషయంలోనా?" అడిగారు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి).

దానికి వారు "ముస్లింలను రక్తపాతం నుండి కాపాడే ఉద్దేశంతో వారి మధ్య సయోధ్య కుదర్చడానికి మధ్యవర్తిని అంగీకరించడమే మంచిది" అని అన్నారు.

"అంటే ఈ సమస్య పరిష్కారమైందన్న మాట" అడిగారు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి). "ఆ...ఈ సమస్య పరిష్కారమైనట్లే" అంటూ ఖార్జీలు తలలూపారు.

"పోతే అలి (రజి) యుద్ధం చేశారుగాని దైవప్రవక్త (సల్లం) పట్టుకున్నట్లు యుద్ధ ఖైదీలను పట్టుకోలేదని కదా మీ రెండవ ఆరోపణ? యుద్ధంలో పట్టుబడే ఇతర మహిలా ఖైదీలుగా మీ మాతృమూర్తి ఆయిషా (రజి)ను ఖైదీగా పట్టుకొని తన కోసం ధర్మసమ్మతం చేసుకోవాలని మీరు కోరుతున్నారా?

...దీనికి మీ సమాధానం ఔను అయితే మీరు అవిశ్వాసులు అవుతారు. ఒకవేళ మీరు ఆమె మా మాతృమూర్తి కాదని అంటే అప్పుడు కూడా మీరు అవిశ్వాసానికి పాల్పడినట్లే. ఎందుకంటే-

'దైవప్రవక్త (సల్లం) విశ్వాసులకు వారి ప్రాణాలకన్నా ఎంతో సన్నిహితుడు. దైవప్రవక్త భార్యలు వారికి మాతృమూర్తుల్లాంటివారు' (33:6) అని అంటోంది ఖుర్ఆన్.

"మరి ఈ సమస్య కూడా పరిష్కారమైనట్లేనా?" అన్నారు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి). "ఆ...ఈ సమస్య కూడా పరిష్కారమయింది" అన్నారు ఖార్జీలు సంతృప్తిచెందుతూ.



"ఇక మీ మూడో ఆరోపణ. అలి (రజి) తన పేరు నుండి విశ్వాసులనాయకుడనే బిరుదు తొలగించారని మీరు ఆరోపిస్తున్నారు. ఈవిధంగా ఓసారి దైవప్రవక్త (సల్లం) కూడా చేశారు-

హుదైబియా ఒడంబడిక సమయంలో ఒడంబడిక పత్రం రాయిస్తూ 'అలీ రాయ్. దైవప్రవక్త ముహమ్మద్ (స) రాయిస్తున్న ఒడంబడిక పత్రం ఇది' అని అన్నారు. అప్పుడు వెంటనే ఖురైష్‌ప్రతినిధులు అభ్యంతరం లేవదీస్తూ 'మేము మిమ్మల్ని దైవప్రవక్తగా అంగీకరించివుంటే మిమ్మల్ని కాబాలయానికి రాకుండా అడ్డుపడేవాళ్ళం కాము; మీతో యుద్ధం కూడా చేసేవాళ్ళం కాము. కనుక మీరు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు బదులు అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్ అని రాయించండి' అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) 'మీరు నన్ను వ్యతిరేకించినా దైవసాక్షి! నేను దైవప్రవక్తనే' అంటూ వారి అధర్మకోరికను అంగీకరించారు.

ఇలా వివరించిన తరువాత ఇబ్నెఅబ్బాస్ (రజి). "మీఈ ఆరోపణకు కూడా తృప్తికరమైన సమాధానం లభించిందా?"అని అడిగారు.

దానికి వారు "మేమిప్పుడు పూర్తిగా సంతృప్తిచెందాం" అని అన్నారు.

ఈ చర్చల ఫలితంగా వారిలో ఇరవైవేల మంది హ్జ్రత్ అలి (రజి) మద్దతుదారుల్లో చేరిపోయారు. మిగిలిన నాలుగువేల మంది మాత్రం అలి (రజి) పట్ల పెంచుకున్న విరోధం, విద్వేషాలతో రగిలిపోతూ తమ పాత వైఖరికే అంటిపెట్టుకొని ఉన్నారు.

ఈ చర్చలను బట్టి హ్జ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఖుర్ఆన్-హదీసుల్లో, వాటి అనువర్తనంలో ఎంతటి ప్రావీణ్యం సంపాదించారో తెలుస్తోంది. ఆయన జ్ఞానార్జన మార్గంలో ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించేవారు.

ఎవరైనా సహాబీ (ప్రవక్త అనుచరుడు) దగ్గర ఏదైనా హదీసు ఉందని తెలిస్తే అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో ఆయన ఇంటికెళ్ళి, ఇంటిగుమ్మం దగ్గర దుప్పటి పరచుకొని పడుకునేవారు. అప్పటి ఎండతీవ్రత, దుమ్ముధూళి ఆయన మీద పడేది. ఆయన కోరుకుంటే ఇంట్లో ప్రవేశించే అనుమతి లభిస్తుంది. కాని ఆయన ఆ సహాబీ హృదయాన్ని చూరగొనడానికి ఇలా చేసేవారు.

ఆ సహాబీ బయటికొచ్చి ఆయన్ని చూసి "ప్రవక్త పినతండ్రి కుమారా! మీరెందుకు ఈ శ్రమ తీసుకున్నారు? కబురు చేస్తే నేనే మీ దగ్గరకు వచ్చేవాణ్ని కదా!" అనేవారు.

దానికి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) "మీ సన్నిధికి రావడానికి నేనే ఎక్కువ అర్హుణ్ని. విద్యార్జన కోసం విద్యార్థే విద్యావంతుడి దగ్గరకు పోవలసి ఉంటుంది. అంతేగాని విద్యావంతుడు విద్యార్థి దగ్గరకు పోడు" అని అన్నారు ఎంతో వినమ్రత, అణుకువలతో. ఆ తరువాత ఆయన హదీసును గురించి ఆ సహాబీని అడిగేవారు.

ఈవిధంగా హజ్రత్ అబ్దుల్లా బిన్‌అబ్బాస్ (రజి) ఇస్లామీయ జ్ఞానానికి సంబంధించిన విభిన్న విద్యలను ఆర్జించిన తరువాత అధ్యాపకసేవ కోసం నడుం బిగించారు. ఆయన తన ఇంటినే విశ్వవిద్యాలయంగా తయారుచేశారు. విద్యార్జన పట్ల ఆసక్తి గలవారిని గ్రూపులవారిగా పిలిపించి వారడిగే ప్రశ్నలకు, సందేహాలకు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వడమే గాక మరిన్ని విషయాలు కూడా తెలియజేసేవారు. ఆ తరువాత మరో గ్రూపును పిలిపించేవారు.

ఇలా వివిధ ప్రాంతాల నుండి అనేకమంది ఆయన ఇంటికి తెంపు లేకుండా వస్తూ పోతుండేవారు. కొన్నాళ్ళకు విద్యార్జన కోసం వచ్చేవారి సంఖ్య (రద్దీ) అనూహ్యంగా పెరిగిపోవడం వల్ల విభిన్న విద్యాకళలను గురించి తెలుసుకోవడానికి వచ్చేవారి కోసం అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) వేర్వేరు దినాలను నిర్ణయించారు.

క్లిష్టసమస్యల పరిష్కారం కోసం శ్రేయస్కర ఖలీఫాలు (ఖుల్ఫాయెరాషిదీన్) సైతం వయసులో చిన్నవాడైనా ఫిఖ్హావిద్యలో గొప్ప ప్రతిభాశాలి అయినందున అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరకు వస్తుండేవారు. హజ్రత్ అబ్దుల్లా (రజి) సామాన్యప్రజానీకం కోసం సభలు ఏర్పాటుచేసి ప్రసంగాలతో వారికి హితోపదేశం చేసేవారు.

ఒకసారి ఆయన పాపాత్ముల్ని సంబోధిస్తూ ఇలా ప్రసంగించారు:

"పాపాలకు పాల్పడేవారలారా! మీరు మీపాపాల పట్ల ఏమరుపాటుకు లోనుకాకండి. ఒక విషయం బాగా గుర్తుంచుకోండి. పాపఫలితం పాపం కంటే కూడా ఎక్కువ ప్రమాదకరమైనది. మనిషి పాపానికి పాల్పడుతున్నప్పుడు అతని కుడిఎడమల వైపుండే దైవదూతల పట్ల సిగ్గుపడకపోవడం ఆ పాపం కంటే ఏమాత్రం తీసిపోదు...

...పాపం చేస్తున్నప్పుడు మనిషి ముఖంలో కన్పించే నవ్వు ఆ పాపం కంటే ఎంతో ప్రమాదకర మైనది. దేవుడు ఎలాంటి శిక్ష విధిస్తాడో అతనికి తెలియదు. పాపం చేయడంలో విజయం సాధించడంపట్ల సంబరపడిపోవడం పాపం కంటే తీవ్రమైన విషయం...

...అలాగే పాపంచేయడంలో విఫలమవడం పట్ల విచారించడం పాపం కంటే ఎక్కువ ప్రమాదకర మైనది. పాపాత్ములారా! (దైవప్రవక్త) అయ్యూబ్ (అలైహి) ఏం తప్పు చేశారని దేవుడు ఆయనకు శారీరకంగా, ఆర్థికంగా కఠినాతి కఠినమైన పరీక్షకు గురిచేశాడో మీకు తెలుసా? ఒక నిరుపేద పీడితుడు తనను దౌర్జన్యం నుండి కాపాడమని హజ్రత్ అయ్యూబ్ (అలైహి)ని అర్థించినపుడు ఆయన ఆ సహాయం చేయకపోవడమే ఆయన చేసిన తప్పు."

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) విద్యాజ్ఞానాల్లోనే కాదు, దైవభీతిపరాయణత లోనూ ఎంతో గొప్పవారు. ఆయన పగటివేళల్లో ఉపవాసం పాటించి రాత్రివేళల్లో



నమాజులో లీనమైపోయేవారు. ఒక్కోసారి నమాజులో ఒకేసూక్తిని మాటిమాటికి పఠిస్తూ ధారాపాతంగా కన్నీరు కార్చేవారు.

ఒకసారి ఇబ్నెఅబ్బాస్ (రజి) ఓ ప్రయాణబృందంతో కలసి మక్కా నుండి మదీనా ప్రయాణం చేయసాగారు. దారిలో ఓచోట ఈ బృందం విశ్రాంతి కోసం ఆగింది. ప్రయాణ బడలికతో బాటసారులంతా ఆరాత్రి మేను వాల్చి నిద్రలోకి జారి గురకలు పెడ్తుంటే అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) మాత్రం నమాజ్ చేయడంలో నిమగ్నులై పోయారు.

ఆయన ఖుర్‌ఆన్‌లోని "చూడండి, చివరికి ప్రాణసంకటం సత్యాన్ని తీసుకొచ్చింది. "(మానవా!) నీవు ఏ సత్యాన్ని నిరాకరిస్తూ పారిపోతుండేవాడివో ఆ సత్యం ఇదే." (50:19) అనే సూక్తిని పఠించసాగారు. దాన్ని మాటిమాటికి పఠిస్తూ కన్నీరు మున్నీరుగా దుఃఖించారు. అదే పరిస్థితిలో తెల్లవారింది.

ఒకసారి అమీర్ ముఆవియా (రజి) ఖలీఫా హోదాలో హజ్‌యాత్రికులకు నాయకత్వం వహించి హజ్‌యాత్ర జరపడానికి మక్కాకు బయలుదేరారు. ఆ సంవత్సరమే అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కూడా తన శిష్యబృందంతో కలసి హజ్ యాత్రకు బయలుదేరారు.

ఆ కాలంలో ఆయనకు ఎలాంటి ప్రభుత్వహోదాలు లేవు. అయినప్పటికీ అమీర్ ముఆవియా (రజి) బృందం సభ్యుల కంటే ఆయన బృందం సభ్యులే ఎక్కువమంది ఉన్నారు. దాన్నిబట్టి కూడా విద్యాజ్ఞానాల్లో అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఔన్నత్యం స్పష్టంగా తెలుస్తోంది.

ఆనాడు హదీసువిద్యలో అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)ని మించినవారు లేరని చెప్పవచ్చు. ఆయన ముస్లిం సముదాయం కోసం, భావితరాల కోసం దైవప్రవక్త (సల్లం) నుండి 1,660 హదీసుల్ని ఉల్లేఖించారు. వీటన్నిటిని ఇమామ్ బుఖారి (రహ్మలై), ఇమామ్ ముస్లిం (రహ్మలై)లు తమ హదీసు గ్రంథాల్లో నమోదు చేసుకున్నారు.

ఈవిధంగా అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) తన మేధాకాశంలోని జ్ఞానకిరణాలను నలుదిశలా ప్రసరింపజేసి డెబ్బయి ఒక్క సంవత్సరాల వయసులో పార్థివశరీరం వదలి పితృలోకానికి చేరుకున్నారు. ఆయన జనాజా నమాజ్‌ని ముహమ్మద్ బిన్ హనఫియా చేయించారు. ఆ నమాజులో అప్పటి సహాబీలు, ఇతర ప్రముఖులందరూ పాల్గొన్నారు. ఆయన భౌతికకాయాన్ని సమాధిలో దించి దాన్ని పూడ్చడానికి జనం మట్టి పోస్తున్నపుడు సమాధిలోనుంచి ఓ అదృశ్యవాణి ఇలా విన్పించింది:

"తృప్తిచెందిన మనసా! పద నీప్రభువు సన్నిధికి. నీవు ఆయన పట్ల సంతోషించావు, ఆయన నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. (ఇక) నా పుణ్యదాసులలో చేరి నా స్వర్గంలో ప్రవేశించు' అని చెప్పడం జరుగుతుంది." (ఖుర్‌ఆన్-89:27-30)

# 56. అబూహురైరా దౌసి (రజి)

దౌస్ తెగకు చెందిన ప్రముఖ సహాబీ హజ్రత్ అబూహురైరా (రజి) పూర్వనామం అబ్దుష్షమ్స్. దైవప్రవక్త (సల్లం) దాన్ని మార్చి ఆయనకు అబ్దుర్రహ్మాన్ అని పేరుపెట్టారు. అయితే ఆయన తన చిన్నతనంలో ఒక పిల్లిని పెంచుకొని దాంతో ఆడుకునేవారు. అందువల్ల ఆయన్ని ఆయన బాల్యస్నేహితులు అబూహురైరా అని పిలవడం ప్రారంభించారు. ఆ తరువాత కొన్నాళ్ళకు ఆ పేరే ఆయనకు స్థిరపడిపోయింది.

యమన్ ప్రాంతంలోని దౌస్‌తెగ నాయకుడు, ప్రముఖకవి, గొప్పమేధావి అయిన హజ్రత్ తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి) చేసిన ప్రచారంతో అబూహురైరా ఇస్లాం స్వీకరించారు. ఆ తరువాత ఆయన మదీనా చేరుకొని మస్జిదెనబవీలో ఉంటూ దైవప్రవక్త (సల్లం) సేవలోనే జీవితం గడపడం ప్రారంభించారు.

ఆయనతో పాటు ఆయన వృద్ధమాత మాత్రమే ఉంది. కాని ఆమె ఎంత నచ్చజెప్పినా ఇస్లాం స్వీకరించలేదు. దాంతో అబూహురైరా చాలా బాధపడిపోయేవారు. అయినప్పటికీ ఆయన నిరాశచెందకుండా వీలుపడినప్పుడల్లా హితోపదేశం చేస్తూ ఆమెను ఇస్లాం వైపు ఆహ్వానిస్తుండేవారు.

ఒకసారి ఆమె కొడుకు హితోపదేశంతో విసిగిపోయి దైవప్రవక్త (సల్లం)ను గరించి అనరాని మాటలు అన్నది. ఆ మాటలు విని అబూహురైరా ఎంతగానో బాధపడ్డారు.

ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి చేరుకొని రోదిస్తూ "దైవప్రవక్తా! నేను నా తల్లికి ఎంత నచ్చజెప్పినా ఆమె ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా లేదు. ఈరోజయితే నేను ఇస్లాంస్వీకరణ గురించి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తుంటే ఆమె చిర్రెత్తిపోయి మీ గురించి అనరాని మాటలు అన్నది. దైవప్రవక్తా! నా తల్లికి ఇస్లాంస్వీకార భాగ్యం ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించండి" అని అన్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) చేతులు జోడించి దైవాన్ని ప్రార్థించారు. తరువాత అబూహురైరా (రజి) ఇంటికి తిరిగొస్తే తలుపు మూయబడి ఉంది. లోపల నీళ్ళు పోసుకుంటున్న ధ్వని విన్పించింది. అబూహురైరా (రజి) తలుపు దగ్గరే నిల్చొని తల్లిని పిలిచారు. దానికి ఆయన తల్లి "కాస్సేపు బయటే నిలబడు బాబూ! నేను స్నానం చేస్తున్నాను" అన్నది. ఆ తర్వాత కాస్సేపటికీ ఆమె బట్టలు కట్టుకొని తలుపు తెరచి "రా బాబూ!" అన్నది చిరునవ్వుతో.

అంతేకాదు, అబూహురైరా (రజి) ఇంట్లో అడుగు పెట్టగానే ఆ మాతృమూర్తి "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆయన దాసుడు, ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని అన్నది.



ఈమాటలు వినగానే అబూహురైరా (రజి) సంతోషంతో పొంగిపోయారు. తరువాత ఆయన ఆనందభాష్పాలు పొంగిపొర్లుతుండగా దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పరుగెత్తికెళ్ళి "దైవప్రవక్తా! దేవుడు మీ ప్రార్థనను స్వీకరించాడు. ఆయన నా తల్లికి ఇస్లాంస్వీకార భాగ్యం ప్రసాదించాడు" అని తెలియజేశారు.

ఓరోజు హజ్రత్ అబూహురైరా (రజి) మదీనాలోని ఒకవీథిలో నడచిపోతుంటే అక్కడ జనం ప్రాపంచిక వ్యవహారాల్లో, అమ్మకం-కొనుగోళ్ళలో పూర్తిగా తలమునకలై ఉండటం కన్పించింది. అబూహురైరా (రజి) వారి పరిస్థితి పట్ల ఆందోళనపడుతూ "మదీనా వాసులారా! మీరెంతటి ఏమరుపాటుకు గురయ్యారు!! అక్కడ మస్జిదెనబవీలో దైవప్రవక్త (సల్లం) వారసత్వపు ఆస్తి జనానికి పంచబడుతుంటే మీరింకా ఇక్కడే ఉన్నారా? తొందరగా వెళ్ళి మీ వాటా తీసుకోండి" అని అన్నారు.

ఈమాటలు వినగానే వారు మస్జిదెనబవీ వైపు పరుగెత్తారు. తీరా మస్జిద్‌కు చేరుకొని చూస్తే అక్కడ అబూహురైరా (రజి) చెప్పిన సూచనలేవీ కన్పించలేదు వారికి. దాంతో వారు హతాశులై తిరిగొచ్చి "మీరు చెప్పినట్లు మస్జిద్‌లో అలాంటిదేమీ కన్పించలేదే మాకు?" అని అన్నారు.

"మీకు మస్జిద్‌లో ఎవరూ కన్పించలేదా?" అని అడిగారు అబూహురైరా (రజి).

దానికి వారు "ఎందుకు కన్పించలేదు, మేమక్కడ కొందరు నమాజ్ చేస్తుండటం, కొందరు ఖుర్‌ఆన్ పఠిస్తుండటం, మరికొందరు ధర్మసమ్మతం-నిషేధం గురించి చర్చించుకోవడం చూశాము మేము" అని అన్నారు.

"దేవుడు మీకు సద్బుద్ధి ప్రసాదించుగాక! అదే దైవప్రవక్త (సల్లం) వారసత్వపు ఆస్తి" అన్నారు అబూహురైరా (రజి).

అబూహురైరా (రజి) దైవప్రవక్త (సల్లం) సేవలో, జ్ఞానార్జనలో పూర్తిగా లీనమైపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసివచ్చింది. చివరికి పస్తులు కూడా ఉండవలసివచ్చింది. ఒకరోజయితే ఆయన తీవ్రమైన ఆకలితో విలవిల్లాడి పోయారు. దాంతో ఆయన దారిలో ఒకచోట నిల్చొని ఎవరైనా వచ్చి తనను ఇంటికి తీసికెళ్ళి భోజనం పెట్టిస్తారేమోనని ఎదురుచూడసాగారు.

కాస్సేపటికి హజ్రత్ అబూబకర్ (రజి) అటుగా వచ్చారు. వెంటనే అబూహురైరా (రజి) ఆయన దగ్గరకు వెళ్ళి, ఖుర్‌ఆన్‌లోని ఒక సూక్తి అంతరార్థం తనకు బాగా తెలిసినా దాన్ని గురించి ఆయన్ని అడిగారు. అబూబకర్ (రజి) దానికి సమాధానమిచ్చి ముందుకు సాగారు. అంతేగాని ఆ దైవదాసుడు పాపం అబూహురైరా (రజి) ముఖంలోని ఆకలిచిహ్నాలను గమనించలేదు. దాంతో అబూహురైరా (రజి) ఢీలా పడిపోయారు.

మరికాస్సేపటికి హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) వచ్చారు. అబూహురైరా (రజి) ఆయన దగ్గరకు వెళ్ళి మరొక సూక్తి అంతరార్థం తనకు బాగా తెలిసినప్పటికీ దాన్ని గురించి ఆయన్ని అడిగారు. ఆయన కూడా దానికి సమాధానమిచ్చి వెళ్ళిపోయారు. అంతేగాని ఆ దైవదాసుడు కూడా పాపం అబూహురైరా (రజి) ముఖంలోని ఆకలి చిహ్నాలను గమనించలేదు. ఆ తరువాత కాస్సేపటికి కారుణ్యమూర్తి (సల్లం) అటుగా వచ్చారు. ఆయన్ని చూడగానే అబూహురైరా (రజి)లోని ఆశాకెరటాలు ఉప్పొంగాయి.

దైవప్రవక్త (సల్లం) ఎంతో వాత్సల్యంతో ఆయన వైపు చూస్తూ "అబూహురైరా! పద నావెంట" అన్నారు. అబూహురైరా (రజి) వెంటనే లబ్బైక్ అంటూ ఆయన వెంట నడిచారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని తన ఇంటికి తీసికెళ్ళారు. అక్కడ ఒక గిన్నెలో పాలు ఉండటం చూసి "ఈ పాలు ఎక్కడ్నుంచి వచ్చాయి?" అని అడిగారు ఆయన తన ఇంటివారిని. "వీటిని మీకోసం ఫలానావారు పంపించారు" అన్నారు ఇంటివాళ్ళు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అబూహురైరా (రజి)తో "అబూహురైరా! మస్జిద్‌కు వెళ్ళి సప్ఫావారందరినీ పిలుచుకొనిరా" అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం) వాళ్ళందరినీ పిలిపించడం అబూహురైరా (రజి)కు నచ్చలేదు. ఓ గిన్నెడు పాలు అంతమందికి ఎలా సరిపోతాయి? అనుకున్నారు ఆయన. "ఏమైనా దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ కదా!" అని భావిస్తూ వెళ్ళి వారందరినీ పిలుచుకు వచ్చారాయన.

దైవప్రవక్త (సల్లం) అందరూ వచ్చి కూర్చున్న తరువాత "అబూహురైరా! ఈ పాలగిన్నె తీసుకొని వీరందరికీ పాలుతాగించు" అని అన్నారు.

అబూహురైరా (రజి) పాలగిన్నె తీసుకొని ఒకరి తర్వాత ఒకరు చొప్పున అందరికీ పాలు తాగించారు. అయినా గిన్నెలో పాలు ఏమాత్రం తగ్గలేదు. తరువాత ఆయన పాలగిన్నెను దైవప్రవక్త (సల్లం) ముందు పెట్టారు.

"ఇప్పుడు నేను, నువ్వు మాత్రమే మిగిలిపోయాం" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఔను దైవప్రవక్తా! మనిద్దరమే మిగిలిపోయాం" అన్నారు అబూహురైరా (రజి).

"సరే, ఇప్పుడు నువ్వు తాగు ఈ పాలను" అన్నారు దైవప్రవక్త (సల్లం). ఆకలితో నకనకలాడుతున్న అబూహురైరా (రజి) వెంటనే పాలగిన్నె తీసుకొని గటగటా పాలుతాగి దాన్ని కింద పెట్టేశారు.

దైవప్రవక్త (సల్లం) ఇంకా తాగమన్నారు. అబూహురైరా (రజి) మరొకసారి గిన్నె పైకెత్తి పాలుతాగారు. దైవప్రవక్త (సల్లం) ఇంకాతాగు, ఇంకాతాగు అన్నారు. అబూహురైరా (రజి) ఆవిధంగా కడుపునిండా తాగి "దైవప్రవక్తా! మీకు సత్యధర్మాన్నిచ్చి పంపిన దేవుని సాక్షి! ఇప్పుడిక నా కడుపులో ఏమాత్రం అవకాశం లేదు" అని అన్నారు.



గిన్నెలో పాలు ఇంకా మిగిలివున్నాయి. అందరికంటే చివర్లో దైవప్రవక్త (సల్లం) ఆ పాలను తాగారు.

కొన్నాళ్ళ తరువాత ముస్లింలకు అపారమైన సమరసొత్తు లభించడంతో వారి దారిద్ర్యం పూర్తిగా అంతమైపోయింది. అబూహురైరా (రజి)కు కూడా సిరిసంపదలు లభించాయి. అయినప్పటికీ ఆయన తన పాత జీవితాన్ని మరచిపోకుండా ఎల్లప్పుడూ ప్రజాసేవలో లీనమైవుంటూ నిరాడంబర జీవితమే గడపసాగారు.

అమీర్ ముఆవియా (రజి) తన పాలనాకాలంలో అబూహురైరా (రజి)ను అనేకసార్లు మదీనా గవర్నర్‌గా నియమించారు. గవర్నర్ హోదాలో ఉండి కూడా ఆయన తన భార్యాపిల్లలకు సహాయపడుతూ ఇంటిపనులు చేసుకునేవారు; కట్టెలమోపు మోసుకొని తెచ్చుకునేవారు.

హజ్రత్ అబూహురైరా (రజి) దగ్గర ఒక బానిసమహిళ ఉండేది. ఒకసారి ఆమె వల్ల ఏదో పెద్ద తప్పు జరిగింది. దానివల్ల అబూహురైరా (రజి), ఆయన గృహస్థులు ఎంతో బాధపడ్డారు. అబూహురైరా (రజి) కోపం పట్టలేక ఆమెను కొట్టడానికి కొరడా తీసుకొని పైకెత్తారు. కాని అంతలోనే ఆగిపోయి "తీర్పుదినాన ప్రతీకారశిక్ష (ఖిసాస్) గురించిన భయం గనక లేకపోయివుంటే నువ్వు మాకు కలిగించిన బాధ కారణంగా నేను నిన్ను తప్పక శిక్షించేవాడ్ని. కాని ఇప్పుడు నేను అందరికంటే ఎక్కువ అవసరార్థి అయ్యే రోజున నాకు నీ ధర ఇచ్చే శక్తిస్వరూపుడికి నిన్ను అమ్మివేస్తున్నాను. నేను నిన్ను దైవప్రసన్నత కోసం స్వతంత్రురాలిగా చేస్తున్నాను వెళ్ళిపో" అని అన్నారు.

ఒకసారి అమీర్ ముఆవియా (రజి) బంధువు మర్వాన్ ఒక సేవకుని ద్వారా అబూహురారా (రజి)కు పారితోషికంగా వంద దీనార్ల పైకం పంపించారు. అయితే మరుసటిరోజు "ఆ పైకం నా సేవకుడు వేరే వ్యక్తికి ఇవ్వాల్సింది పొరపాటున మీకు ఇచ్చాడు. అంచేత ఆ పైకం తిరిగిచ్చేయండి" అంటూ సేవకుని ద్వారా కబురుచేశాడు.

హజ్రత్ అబూహురైరా (రజి) ఈమాట విని విచారిస్తూ "నేనా డబ్బంతా దైవమార్గంలో ఖర్చుచేశాను. ఇప్పుడు నా దగ్గర ఒక్క దీనార్ కూడా లేదు. ప్రభుత్వధనాగారం నుండి నాకు రావలసిన ఉపకారవేతనంలో ఆ వంద దీనార్లు తగ్గించుకోండి" అని మర్వాన్‌కు సేవకుని ద్వారా చెప్పి పంపారు.

మర్వాన్ నిజానికి అబూహురైరా (రజి)ని పరీక్షించ దలిచాడు. తరువాత అబూహురైరా (రజి) ఆ పైకాన్ని తన సొంతానికి వాడుకోకుండా పేదలకు దానం చేశారని తెలుసుకొని ఆయన చెప్పింది నిజమేనని నిర్ధారించుకున్నాడు.

తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన, బంధుప్రేమ గురించి ప్రజల్లో ప్రచారం చేయడమంటే అబూహురైరా (రజి)కు ఎంతో ఇష్టం. ఒకరోజు వీధిలో ఇద్దరు వ్యక్తులు పోతుంటే

ఆయన చూశారు. వారిలో ఒకతను వయసు మళ్ళినవాడు, రెండోవాడు పిన్నవయస్కుడు. అబూహురైరా (రజి) వారిలో పిన్నవయస్కుడ్ని పిలిచి ఆ పెద్దాయన ఎవరని అడిగారు. దానికతను ఆయన మా నాన్నగారని చెప్పాడు. అప్పుడాయన అతనికి హితోపదేశం చేస్తూ "అయితే ఆయన్ని నీవు ఎప్పుడూ పేరుపెట్టి పిలవకు. ఆయన ముందు నడవకు, ఆయన కంటే ముందు కూర్చోకు" అని అన్నారు.

హజ్రత్ అబూహురైరా (రజి) 1690 హదీసులు ఉల్లేఖించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కాని హదీసువేత్తలు ఆయన 5374 హదీసులు ఉల్లేఖించారని అన్నారు.

# 57. కాబ్ బిన్ మాలిక్ (రజి)

దాదాపు యావత్‌అరేబియా ముస్లింల అధీనంలోకి వచ్చింది. ఇస్లాం వ్యతిరేకశక్తుల బలం తగ్గిపోయింది. సర్వత్రా దైవధర్మమే ప్రకాశించసాగింది. అయితే ఇంకా ఇస్లామీయ రాజ్య సరిహద్దుల్ని పటిష్ఠం చేయవలసివుంది. అరేబియా ఉత్తర సరిహద్దులో ఉన్న సిరియా రోమన్ల అధీనంలో ఉన్నందున ఆ ప్రాంతపు సరిహద్దు భద్రత కోసం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఈ సమస్యను గురించి దైవప్రవక్త (సల్లం) నిరంతరం యోచిస్తూ ఉండేవారు. రోమ్‌సైన్యాలు ఏ క్షణమయినా ఇస్లామీయ రాజ్యంపై దాడిచేసే ప్రమాదముందని ఆయనకు అనుమానంగా ఉంది.

ఈ అనుమానం కొన్నాళ్ళకే నిజమయ్యే సూచనలు కానవచ్చాయి. రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. తక్షణమే ఆయన శక్తికల వారంతా యుద్ధానికి సిద్ధం కావలసిందిగా ప్రకటన చేశారు.

దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే ముస్లింలు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. కాని కపటముస్లింలు యుద్ధప్రకటన వినగానే నెత్తిమీద పిడుగు పడినట్లు నిలువుగుడ్లు వేశారు. వీరు స్వయంగా యుద్ధానికి బయలు దేరకపోగా బయలుదేరే వారిని కూడా ఆటంకపరచడానికి ప్రయత్నించారు.

"ఏమిటీ! ఇంత తీవ్రమయిన ఎండాకాలంలో యుద్ధానికి బయలుదేరుతున్నారా!! కాస్త ఆలోచించండి. పైన నిప్పులు కురిపించే సూర్యుడు; క్రింద చుర్రున కాలే ఇసుక నేల; ఆపై సుదీర్ఘప్రయాణం!! అమ్మోయ్! ఇలాంటి పరిస్థితిలో బయలుదేరితే ఇంకేమైనా ఉందా!! చీమల్లా మలమల మాడి చావరూ!!! అయినా ఒక వైపు పొలాల్లో పంటలు, తోటల్లో పండ్లు పండి కోతకు సిద్ధంగా ఉంటే ఈ ప్రయాణ సన్నాహాలు ఏమిటీ?" అంటూ కపటవిశ్వాసులు ముజాహిద్‌లను అధైర్య పరచసాగారు.

హిజ్రీ 9వ సంవత్సరం, రజబ్ నెలలో ముప్ఫయివేల మంది ముజాహిద్‌లతో కూడిన భారీ సైనికవాహిని మదీనా నుండి బయలుదేరింది



ఈ పవిత్ర ప్రస్థానంలో పాల్గొననివారు కూడా కొందరున్నారు. వారు మదీనాలోనే ఉండి దట్టమైన వృక్షచ్ఛాయల్లో, సెలయేరుల మధ్య సుఖభోగాలు అనుభవిస్తున్నారు. వారిలో అనేకమంది ఈ ప్రయాణం తప్పినందుకు సంతోషిస్తున్నారు. అయితే కొందరు మాత్రం దైవప్రవక్త (సల్లం) వెళ్ళిన తరువాత ఆలోచనల్లో పడ్డారు. తామీ పవిత్రమైన మహాకార్యంలో పాల్గోలేకపోయామేనని సిగ్గుతో పశ్చాత్తాపం పడసాగారు.

హజ్రత్ అబూఖైసిమా (రజి) తన తోటలోకి ప్రవేశించారు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారు. అబూఖైసిమా (రజి) తన భార్యలతో కలసి తోటలోనే నివసిస్తున్నారు. అక్కడ ఒక అందమైన కుటీరం ఉంది. దాని ద్వారాలకు, కిటికీలకు వట్టివేరు తడికలు వ్రేలాడుతున్నాయి. వాటిపై ఆయన భార్యలు నీళ్లుచల్లి కుటీరాన్ని చల్లబరిచారు. భర్త రాగానే వారాయనకు ఒకవిధమైన పదార్థంతో ఘుమఘుమలాడే అన్నం వడ్డించారు. ఒక కూజాలో చల్లనినీళ్ళు తెచ్చిపెట్టారు. అబూఖైసిమా (రజి) భోజనం చేయడానికి ఉపక్రమించారు. ఎంతో ఉల్లాసం గొలిపే వాతావరణం అది.

కాని అబూఖైసిమా (రజి)కు అకస్మాత్తుగా దైవప్రవక్త (సల్లం) తబూక్ దండయాత్రకు పోయిన సంగతి గుర్తుకొచ్చింది. దాంతో ఆయన హృదయం తల్లడిల్లిపోయింది. చివాలున లేచి నిలబడ్డారాయన.

"అక్కడ మన ప్రియప్రవక్త (సల్లం) ఎండలో వాడి మాడిపోతుంటే, నేనిక్కడ స్త్రీల మధ్య చల్లని నీడపట్టున భోగభాగ్యాలు అనుభవించడమా! కాదు, కాదు. తక్షణమే నా ప్రయాణ సామగ్రి సిద్ధం చేయండి. నేను కూడా వెళ్ళి ఆ యుద్ధంలో పాల్గొంటాను" అన్నారు ఆయన. ప్రియపత్నులు ప్రయాణసామగ్రి సిద్ధం చేశారు. హజ్రత్ అబూఖైసిమా (రజి) ఒంటెపై ఎక్కి వేగంగా ప్రయాణిస్తూ ముజాహిద్‌ల దగ్గరకు చేరుకున్నారు.

సుదీర్ఘప్రయాణం చేసిన తర్వాత "తబూక్" సమీపానికి చేరుకున్నారు. ఆ ప్రాంతం సిరియా, అరేబియాల సరిహద్దుపై ఉంది. అయితే అక్కడకు చేరుకోగానే రోమన్లు కోటద్వారాలు మూసుకున్నారని తెలిసింది. ముస్లింలు అక్కడ ఎన్నిరోజులు నిరీక్షించినా రోమన్లు కోట నుండి బయటికి రాలేదు. యుద్ధం జరగలేదు. చివరికి దైవప్రవక్త (సల్లం) అక్కడి చుట్టుపక్కల రాజులతో స్నేహఒప్పందాలు చేసుకొని మదీనా తిరిగొచ్చారు.

తబూక్ దండయాత్రలో అబూలుబాన్ బిన్ అబ్దుల్‌మన్జిర్ (రజి), ఆయన సహచరులు ఆర్గురు బద్ధకం, అలసత్వాల కారణంగా పాల్గొనలేకపోయారు. అయితే దైవప్రవక్త (స) దండయాత్ర నుంచి తిరిగొచ్చిన తర్వాత అందులో పాల్గొననివారిని గురించి విచారణ జరపనారంభించగానే వారు తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడ్డారు. విచారణకు ముందే వారు తమనుతాము ఒక స్తంభానికి కట్టుకొని (దేవుడు) తమను క్షమించేదాకా లేదా తాము చనిపోయేదాకా నిద్రాహారాలు మానేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఆవిధంగా వారు అనేకరోజులు గడిపి బలహీనమైపోయి స్పృహతప్పారు. చివరికి దేవుడు, క్షమించాడని తెలియగానే వారు ఆనందభరితులయ్యారు. ఆ సంతోషంతో వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి తమను ఏమరుపాటుకు గురిచేసిన సిరిసంపద లన్నీ దైవమార్గంలో దానం చేస్తామని అన్నారు. కాని దైవప్రవక్త (సల్లం) అందులో మూడోవంతు దానంచేస్తే చాలని అన్నారు. దాని ప్రకారం వారు తమ సంపదలో మూడో వంతును దైవప్రవక్త (సల్లం)కు సమర్పించారు.

ఇలాంటి మరో ముగ్గురు ముస్లింలు కూడా ఉన్నారు. కాబ్ బిన్‌మాలిక్ (రజి), మరార్ బిన్ రబీ (రజి), హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) అనే ఈ ముగ్గురు కేవలం బద్ధకం వల్లనే ఈ దండయాత్రలో పాల్గోలేక పోయారు. దైవప్రవక్త (స) వారందరినీ పిలిపించి దండయాత్రలో పాల్గొనకపోవడానికి కారణం అడిగారు.

ముందుగా దైవప్రవక్త (స) సన్నిధికి కపటులు వచ్చారు. వారు రకరకాల కారణాలు చెప్పారు. దైవప్రవక్త (సల్లం) వారి కారణాలు విని మౌనం వహించారు. అవి నిజమైన కారణాలా లేక కట్టుకథలా అని ప్రశ్నించలేదు. వారి వ్యవహారాన్ని దైవానికి వదిలేశారు. ఆ తరువాత హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) వంతు వచ్చింది. దైవప్రవక్త (సల్లం) పిలుపు వినగానే ఆయన ఎంతో వినయవిధేయతలతో వచ్చి నిల్చున్నారు.

“కాబ్! నువ్వెందుకు పాల్గోలేదీ దండయాత్రలో? ఏ విషయం నిన్ను నిరోధించింది?” అడిగారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.

“దైవప్రవక్తా! మరొకరి ముందయితే నేను ఏదో ఒకమాట చెప్పి తప్పించుకో గలుగుతాను. సాకులు చెప్పడం, కట్టుకథలు అల్లడం నాకూ వచ్చు. కాని మీ విషయం గురించి నాకు తెలుసు. ఒకవేళ నేనిప్పుడు ఏదో ఒక సాకు చెప్పి మిమ్మల్ని మెప్పించ గలిగినా, తర్వాత దేవుడు తప్పకుండా నా గుట్టు కాస్తా బయటపెడతాడు.

“అప్పుడు నేను ఎటూ మీ ఆగ్రహానికి గురికాక తప్పదు. దైవసాక్షి! నాపై మీకు కోపం వచ్చినా సరే, నేను నిజమే చెబుతాను. ఏదో ఓ రూపంలో దేవుడు నన్ను క్షమిస్తాడని నాకు నమ్మకం ఉంది. దైవప్రవక్తా! దండయాత్రలో పాల్గొనక పోవడానికి నా దగ్గర ఎలాంటి కారణం లేదు. నేను అన్ని విధాలా శక్తి ఒనరులు కలిగి ఉన్నాను” అన్నారు హజ్రత్ కాబ్ (రజి) సిగ్గుతో తలవంచుకొని.

“ఇతను నిజాన్ని ఒప్పుకున్నాడు... సరే వెళ్ళు. నీ విషయంలో దైవం ఏదైనా నిర్ణయం చేసే వరకు వేచివుండు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

కాబ్ (రజి) లేచి తన తెగవాళ్ళ మధ్యకెళ్ళి కూర్చున్నారు. కాబ్ (రజి) ప్రవర్తన ఆయన తెగవాళ్ళలో కొందరికి నచ్చలేదు. అందరిలాగే నువ్వూ ఏదో ఒక సాకు ఎందుకు చెప్పలేదని విమర్శించారు. వారి మాటలు విని ఆయన మండిపడ్డారు.



కాస్సేపటికి మరార్ బిన్ రబీ (రజి), హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) కూడా దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి నిజం ఒప్పుకున్నారు. దాంతో కాబ్ (రజి) మనస్సు కాస్త కుదుటపడింది. ఆయన తన నిజాయితీపై స్థిరంగా ఉన్నారు.

సమావేశం ముగిసింది. నిజాన్ని ఒప్పుకున్న ఈ ముగ్గురితో ఎవరూ మాట్లాడ కూడదని దైవప్రవక్త (సల్లం) ముస్లింలందరినీ ఆదేశించారు. అప్పటి నుండి వారితో అందరూ మాట్లాడటం మానేశారు. చివరికి సలాంకు జవాబు కూడా ఇవ్వడం లేదు. ఆ విధంగా వారు ముగ్గురు ఒక విధమైన సంఘబహిష్కారానికి గురయ్యారు.

హిలాల్, మరార్ (రజి)లు దిక్కుతోచని స్థితిలో పడి ఇంట్లోనే ఉండిపోయారు. కాబ్ (రజి) మాత్రం బయటికి వెళ్ళేవారు, బజార్లలో తిరిగేవారు. మసీదుకు వెళ్ళివచ్చే వారు. కాని ఎవరూ ఆయన్ని పలకరించేవారు కాదు. పాపం! ఆయనకు ప్రపంచమే అంధకారమైనట్లు అన్పించింది. యావత్తు మదీనాలో అపరిచిత వ్యక్తిగా మారిపోయారు.

మసీదులో అందరూ పరస్పరం సలాం చేసుకుంటూ, యోగక్షేమాలు తెలుపు కుంటూ సంతోషంగా ఉంటే, హజ్రత్ కాబ్ (రజి) ఏకాకిగా విచారవదనంతో ఉండవలసి వచ్చేది. నమాజ్‌లో నిమగ్నులై ఉన్నప్పుడు మాత్రం ఆయన్ని దైవప్రవక్త (స) ఓరగా చూస్తుండేవారు. ఆయన నమాజ్ చేయడం పూర్తికాగానే దైవప్రవక్త (స) తన దృష్టిని మరో వైపు తిప్పుకునే వారు. దాంతో కాబ్ (రజి) మరింత బాధపడిపోయేవారు.

ఓరోజు ఆయన తన చిన్ననాటి స్నేహితుడు అబూఖతాతా (రజి) ఇంటికి వెళ్ళారు. ఆ ఇల్లు తోటమధ్య ఉంది. తోట చుట్టూ ప్రహరీగోడ ఉంది. హజ్రత్ కాబ్ (రజి) ప్రహరీ గోడఎక్కి సలాం చెప్పారు. కాని అబూఖతాదా (రజి) ఆయన వైపు చూసి కూడా సలాంకు జవాబివ్వకుండా మౌనంగా ఉండిపోయారు.

అప్పుడు హజ్రత్ కాబ్ (రజి) దేవుణ్ణి సాక్షిగా చేస్తూ “అబూఖతాదా! నాకు దైవం పట్ల, దైవప్రవక్త (సల్లం) పట్ల ప్రేమాభిమానాలు లేవా?” అని అడిగారు.

దానికీ అతను సమాధానమివ్వలేదు. కాబ్ అలా రెండుసార్లు అడిగారు.

మూడోసారి అడిగిన మీదట “ఆ సంగతి దేవునికి, దైవప్రవక్త (సల్లం)కు మాత్రమే తెలుసు”అని ముక్తసరిగా జవాబిచ్చాడు.

ఈమాట విని హజ్రత్ కాబ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. భారమైన అడుగు లతో ఆయన అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ రోజుల్లోనే హజ్రత్ కాబ్ (రజి) బజారున నడిచిపోతుంటే సిరియా నుండి ఒకతను వచ్చి గస్సాన్ రాజు రాసిన ఒక లేఖను ఆయనకు అందించాడు. అందులో ఆ రాజు హజ్రత్ కాబ్‌ని సంబోధిస్తూ ఇలా రాశాడు:

"మీ మనిషి మీమీద దుర్భర దౌర్జన్యం చేస్తున్నట్లు విన్నాము. మీరు ఆ అవమానం సహించేటంత అధములు కారు. పైగా మీరు అప్రయోజకునిగా భావించి వదిలెయ్యాల్సిన వ్యక్తి కూడా కాదు. కనుక మీరు మా దగ్గరకు వచ్చేయండి. మేము మిమ్మల్ని గౌరవిస్తాం."

ఆ లేఖ చూడగానే కాబ్ (రజి) ముఖం కందగడ్డలా మారిపోయింది.

ఆయన దాన్ని చదివి మరో విపత్తు వచ్చిపడిందే! అనుకుంటూ అప్పటికప్పుడు దాన్ని పొయ్యిలోకి విసిరి కాల్చివేశారు.

ఆ విధంగా నలభై రోజులు గడచిపోయాయి. నలభై ఒకటో రోజున దైవప్రవక్త (సల్లం) తరపున ఒకతను వచ్చి "ఇక నుండి మీరు మీ శ్రీమతికి కూడా దూరంగా ఉండాలని దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు" అని చెప్పాడు.

"అంటే విడాకులివ్వాల్నా?" అడిగారు హజ్రత్ కాబ్ (రజి).

"కాదు. ఆమెకు దూరంగా ఉండాలి" అన్నాడా వచ్చిన వ్యక్తి.

ఆరోజు నుండి కాబ్ (రజి), మరార్ (రజి), హిలాల్ (రజి) ముగ్గురూ తమ తమ భార్యలకు దూరంగా ఉండవలసి వచ్చింది. కాబ్ (రజి) తన అర్థాంగిని పుట్టింటికి పంపి ఒంటరి జీవితం గడపసాగారు. ఆ విధంగా తొమ్మిది రోజులు గడచిపోయాయి. పదోరోజున ఫజ్ర్‌నమాజ్ తర్వాత ఆయన తన ఇంటికప్పుపై విచారవదనంతో కూర్చొని ఉన్నారు. జరిగిన విషయాన్ని తలచుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నారు.

ఆ సమయంలో "కాబ్! నీకు శుభం కలుగుగాక!" అనే మాటలు విన్పించాయి.

అంతే, హజ్రత్ కాబ్ (రజి) అప్రయత్నంగా సాష్టాంగపడ్డారు. తన పాపక్షమాపణకు సంబంధించిన ఆజ్ఞ వెలువడిందని ఆయన గ్రహించారు.

ఆ తర్వాత వెంటనే అనేకమంది మిత్రులు, బంధువులు తండోపతండలుగా వచ్చి కాబ్ (రజి)ని అభినందించడం ప్రారంభించారు. తర్వాత కాబ్ (రజి) లేచి నేరుగా మసీదుకు వెళ్ళారు. అక్కడ దైవప్రవక్త (స) ముఖం ఆనందకిరణాలు విరజిమ్ముతోంది.

"కాబ్! శుభం, శుభం!! నీ జీవితంలో ఈరోజు సుదినం" అన్నారు దైవప్రవక్త (స) ఆయన్ని చూడగానే అభినందిస్తూ.

"దైవప్రవక్తా! ఈ క్షమాపణ మీ తరపు నుండా లేక దేవుని తరపు నుండా?" అని అడిగారు హజ్రత్ కాబ్ (రజి).

"దేవుని తరపు నుండే" అంటూ దైవప్రవక్త (సల్లం) అప్పుడే అవతరించిన ఖుర్ఆన్ సూక్తులు పఠించారు.



"ఇక వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా దేవుడు కరుణించాడు. భూమి ఎంతో విశాలంగా ఉన్నప్పటికీ అది వారికి చాలా ఇరుకై పోయింది. చివరికి వారి ప్రాణాలే వారికి భారమై పోయాయి. దేవుని పట్టు నుండి తప్పించుకోవడానికి స్వయంగా ఆయన కరుణాశ్రయం తప్ప మరెలాంటి ఆశ్రయం లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు దేవుడు దయతో వారి వైపు మరలాడు, వారు తన వైపు మరలి వచ్చేందుకు. నిస్సందేహంగా దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్-9:118)

అప్పుడు హజ్రత్ కాబ్ (రజి) దేవునికి కృతజ్ఞతగా తన వాటాకువచ్చిన ఖైబర్‌భూమి ఉంచుకొని మిగిలిన ఆస్తినంతా దైవమార్గంలో దానంచేశారు.

# 58. విశ్వాసుల మాతృమూర్తి ఉమ్మెసల్మా (రజి)

సత్యతిరస్కారులు ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు ఉధృతం చేశారు. ముఖ్యంగా ప్రవక్త అనుచరులపై వారి దౌర్జన్యాలు మితిమీరిపోయాయి. దైవప్రవక్త (స) ఈ పరిస్థితి చూసి తీవ్రంగా ఆందోళన చెందారు. ఇక ఈ దేశంలో ఇస్లాం పట్ల పరిపూర్ణ విశ్వాసంతో ప్రశాంతంగా మనుగడ సాగించడం సాధ్యం కాదని భావించారు.

"దేవుని భూమి విశాలంగా ఉంది. మీరు దుర్మార్గులకు దూరంగా మరో ప్రాంతానికి వెళ్ళిపోండి" అని చెప్పారు ఆయన తన అనుచరులకు సలహా ఇస్తూ.

"దైవప్రవక్తా! ఎక్కడికి వెళ్ళమంటారు? అదీ మీరే చెప్పండి" అన్నారు అనుచరులు.

"అబిసీనియా వెళ్ళండి. అక్కడి రాజు నజాషీ (నీగస్) క్రైస్తవ మతస్థుడు, చాలా ధర్మాత్ముడు. మీకు ఏలోటూ రానివ్వడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవదౌత్య బాధ్యత చేపట్టి నాలుగేళ్ళు దాటి అయిదవ సంవత్సరం జరుగుతోంది. దైవప్రవక్త (సల్లం) అనుమతి లభించగానే వారు మక్కా నుండి జిద్దా వెళ్ళి అక్కడ్నుంచి ఓడలో అబిసీనియా చేరుకున్నారు.

వారిలో అబూసల్మా (రజి), ఆయన భార్య ఉమ్మెసల్మా (రజి), వారి పిల్లవాడు కూడా ఉన్నారు. ఈ దంపతులు ప్రప్రథమ విశ్వాసుల్లోని వారు. విశ్వసించిన స్త్రీలలో హజ్రత్ ఖదీజా (రజి) తరువాత ఉమ్మెసల్మా (రజి) రెండవ స్త్రీ. ఈవిధంగా ముస్లింలు అబిసీనియా చేరుకొని అక్కడ ప్రశాంతజీవితం గడపసాగారు.

కొన్నాళ్ళ తరువాత హమ్జా బిన్ అబూతాలిబ్ (రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)లు ముస్లింలుగా మారారని, వారి ప్రవేశంతో ముస్లింలకు కొండంత ధైర్యంవచ్చి బాహాటంగా ధర్మప్రచారం చేస్తున్నారని అబిసీనియాకు వలసపోయిన ముస్లింలకు తెలిసింది. పైగా, మక్కాపట్నం వాడవాడలా ఇస్లాంకిరణాలు ప్రసరించాయని, వాటి ప్రభావం చుట్టుపక్కల

గ్రామాలపై పడిందని కూడా విని ఎంతో సంబరపడ్డారు. వెంటనే వారు అబిసీనియా వదలి మక్కా బయలుదేరారు. కాని మక్కా దరిదాపులకు చేరుకునేటప్పటికి ముస్లింలు షొబె అబితాలిబ్‌లో నిర్బంధించబడి అష్టకష్టాలు అనుభవిస్తున్నారని విషాదవార్త విన్నారు.

దాంతో వారు మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ వచ్చినదారే తిరిగివెళ్ళిపోయారు. కొందరు మాత్రమే మక్కాలో ఉండిపోయారు. వారిలో అబూసల్మా దంపతులు కూడా ఉన్నారు.

అఖ్బా శపథానికి సంబంధించిన సంఘటన తర్వాత మక్కాలో ముస్లింలపై ఖురైషీయుల హింసాదౌర్జన్యాలు మరింత ఎక్కువైపోయాయి. అప్పుడు దైవప్రవక్త (స) ముస్లింలకు మదీనా వలసపొమ్మని అనుమతి ఇచ్చారు. ఈ అనుమతి లభించగానే నబవీశకం 13వ ఏట ముస్లింలు రహస్యంగా రాత్రివేళల్లో జట్లుజట్లుగా బయలుదేరి మదీనా దారిపట్టారు.

ఈవిధంగా ముస్లింలు మక్కాలో తమఇండ్లు ఖాళీచేసి వెళ్ళిపోగానే ఖురైషీయులకు మళ్ళీ గుబులు పుట్టింది. ముస్లింలు ఇప్పుడు మదీనాని ధార్మికకేంద్రంగా చేసుకొని అక్కడ్నుంచి తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని గ్రహించారు. అంతేకాదు, మదీనాలో ఇప్పటికే చాలామంది ముస్లింలయి పోయారని, మక్కా ముస్లింలు కూడా అక్కడకు చేరుకుంటే ఈ ఉద్యమం తమకు పెద్దప్రమాదం తెచ్చి పెడ్తుందని భావించారు.

అందువల్ల ఖురైషీయులు మక్కా నుండి వెళ్తున్న ముస్లింలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. మొదట్లో వారు మక్కా నుండి వెళ్ళిపోయిన ముస్లింల ఖాళీ ఇండ్లను తగలబెట్టారు. ఇలా చేస్తే మక్కా నుండి ఇంకా వెళ్ళిపోకుండా ఉన్న ముస్లింలు తమ ఆస్తులు కూడా నష్టపోతాయన్న భయంతో మదీనా వెళ్ళిపోరని భావించారు. కాని ఈ ప్రయత్నం వల్ల ప్రయోజనం కన్పించక పోవడంతో వారు పట్నం వెలుపల అనేక చోట్ల కొందరిని కాపలా పెట్టించారు. రాత్రివేళ రహస్యంగా బయలుదేరే ముస్లింలను వారు అటకాయించి వారి సొమ్ముల్ని, సామగ్రిని లాక్కొని వేధించడం మొదలెట్టారు.

మక్కానుండి వలసపోతున్నవారిలో కొందరు తమ సిరిసంపదలన్నీ వదలిపెట్టి పోతున్నా ఖురైషీయులు అలాంటివారిని కూడా అడ్డుకొని వేధించడం ప్రారంభించారు.

హజ్రత్ అబూసల్మా (రజి) తన భార్య ఉమ్మెసల్మా (రజి)ను, ఒక పిల్లవాడ్ని తీసుకొని మక్కా నుండి బయలుదేరారు. పట్నం నుండి రెండు మూడు మైళ్ళు పోయారో లేదో ఉమ్మెసల్మా (రజి) తరపు బంధువులు వచ్చి వాళ్ళను అటకాయించారు. వారి చేతుల్లో కత్తులు, ఈటెలు కూడా ఉన్నాయి.

ఒంటె మీద భర్త వెనుక కూర్చున్న హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) వాళ్ళను చూడగానే నిలువునా కంపించిపోయారు. ఆమె ఒడిలో కూర్చున్న చంటి పిల్లవాడు ఏడ్పు లంకించుకున్నాడు. అబూసల్మా (రజి)కు పట్టరాని కోపం వచ్చింది. కాని ఏం చేయగలరు?



"ఏమిటీ దౌర్జన్యం! నేను నా ఇల్లు, ఆస్తిపాస్తులన్నీ అక్కడే వదలిపెట్టి వచ్చాను కదా! నేనిప్పుడు నా భార్యను, పిల్లవాడ్ని మాత్రమే తీసికెళ్తున్నాను. ఇక నా దగ్గర ఏముందని వచ్చారు మీరు?" అన్నారు ఆయన కోపాన్ని బలవంతంగా దిగమింగుతూ.

"నువ్వు వెళ్ళదలచుకుంటే ఎక్కడికైనా వెళ్ళి ఊరేగు. కాని మా అమ్మాయిని మాత్రం తీసికెళ్ళడానికి వీల్లేదు" అన్నారు ఉమ్మెసల్మా (రజి) బంధువులు.

"ఈమె నాభార్య. మీరు స్వయంగా ఈమెను నాకిచ్చి పెళ్ళిచేశారు. ఇప్పుడు ఈమెను నానుండి దూరం చేయడానికి మీకెలాంటి అధికారంలేదు" అన్నారు అబూసల్మా. "ముందు నువ్వు ఒంటె పైనుంచి దిగుతావా లేదా?" అంటూ వారు కత్తులు ఝుళిపించారు.

హజ్రత్ అబూసల్మా (రజి) గత్యంతరంలేక ఒంటె మీద నుంచి కిందికి దిగారు. వెంటనే ఉమ్మెసల్మా (రజి) బంధువులు ఉమ్మెసల్మా (రజి)ను, ఆమె పసిబిడ్డను బలవంతంగా తీసుకొని అక్కడ్నుంచి బయలుదేరారు. ఉమ్మెసల్మా (రజి) మాటిమాటికి వెనక్కి తిరిగి భర్త వైపు చూస్తూ కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. ఆమె ఒడిలోని పిల్లవాడు కూడా వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

పాపం అబూసల్మా (రజి) నిస్సహాయంగా నిలబడి భార్యాపిల్లల వైపు చూస్తున్నారు. ఆయన కళ్ళు కూడా అశ్రుపూరితాలయ్యాయి. ఆయన భార్యాపిల్లలు కనుమరుగైపోయే దాకా చూశారు. ఆ తరువాత కాళ్ళీడ్చుకుంటూ ఒంటరిగా మదీనా దారిపట్టారు.

ఉమ్మెసల్మా బంధువులు ఉమ్మెసల్మా (రజి)ను సంతోషంగా ఆమెభర్త వెంట మదీనా పంపడానికి బదులు ఇస్లాంపట్ల ఉన్న ద్వేషంతో గుండెల్లో రగులుతున్న కసి తీర్చుకోవడానికి ఈవిధంగా ఆమెను భర్త నుండి విడదీసి లాక్కెళ్తున్నారు.

ఉమ్మెసల్మా బంధువుల వైఖరి అబూసల్మా బంధువులకు సహించరానిదై ఉండాలి. వారు ఉమ్మెసల్మా బంధువుల దుశ్చర్యను గర్హించాలి. కాని వారిగుండెల్లో కూడా ఇస్లాంవ్యతిరేక జ్వాలలు రగులుతున్నాయి. సమాచారం అందిన వెంటనే వారు బయలుదేరి పట్నం వెలుపలే దారిలో ఉమ్మెసల్మా (రజి) బంధువుల్ని కలుసుకున్నారు.

"ఆగండి. మీరు మీ అమ్మాయిని మావాడి నుండి వేరుచేసి తీసికెళ్తున్నారు బాగానే ఉంది. కాని ఈ పిల్లవాడు మావాడు, మా వంశాంకురం. మీరితడ్ని తీసికెళ్ళడానికి ఎంతమాత్రం వీల్లేదు. మాపిల్లవాడ్ని మాకిచ్చేయండి"అంటూ అబూసల్మా బంధువులు ఉమ్మెసల్మా (రజి) ఒడిలోని పసిబిడ్డను బలవంతంగా లాగి తీసుకున్నారు.

ఈ దుశ్చర్యకు ఉమ్మెసల్మా (రజి) బంధువులు అభ్యంతరం పెట్టలేదు గాని, పిల్లవాడు మాత్రం మరోసారి ఏడ్పులంకించుకున్నాడు. తల్లి ఉమ్మెసల్మా (రజి) కూడా ఏకధాటిగా రోదించసాగారు. ఆ రాతిగుండెలు మాత్రం కాస్తయినా కరగలేదు.

సత్యతిరస్కారుల ఈ దురభిమానం, దుష్టచర్యలకు పాపం ఉమ్మెసల్మా (రజి) అటు భర్తనూ కోల్పోయారు; ఇటు పసిబిడ్డనూ పోగొట్టుకున్నారు. ఈవిధంగా ఉమ్మెసల్మా (రజి) అటు భర్తవియోగంతో, ఇటు పుత్రవియోగంతో దాదాపు ఏడాది పాటు దిగులుతో బాధపడ్డారు. చివరికి ఒక దయార్ద్రహృదయుడి జోక్యంతో ఆమె అవిశ్వాసుల బారినుండి బయటపడటమే గాకుండా పిల్లవాడ్ని కూడా దక్కించుకున్నారు. ఆ తరువాత వెంటనే ఆమె మరో దయార్ద్రహృదయుడి సహాయంతో ఒంటె మీద మదీనా వెళ్ళిపోయారు. మొత్తంమీద దంపతులిద్దరూ కలుసుకొని మదీనాలో ప్రశాంతజీవితం గడపసాగారు.

ముస్లింలు మక్కాలో అవిశ్వాసుల ఆగడాలు భరించలేక మదీనా వచ్చి స్థిరపడ్డారు. అయితే మదీనా వచ్చిన సంవత్సరానికే మక్కా అవిశ్వాసులు మదీనాపై దాడిచేయడానికి కవ్వింపుచర్యలకు పాల్పడనారంభించారు. తత్ఫలితంగా బదర్, ఉహద్ యుద్ధాలు జరిగాయి. ఉమ్మెసల్మా (రజి) భర్త అబూసల్మా (రజి) ఈ రెండు యుద్ధాల్లో పాల్గొన్నారు. కాని ఉహద్ యుద్ధంలో గాయపడ్డారు. తరువాత కొన్నాళ్ళకే బనీఅసద్ తెగతో జరిగిన యుద్ధంలో పాల్గొనవలసి రావడంతో మానుతున్న గాయాలు పచ్చి పుండ్లయి వాటి నుంచి ధారాపాతంగా రక్తం కారడం మొదలెట్టింది.

గాయపడి మంచాన పడ్డ అబూసల్మా (రజి)ను పరామర్శించడానికి దైవప్రవక్త (సల్లం) తరచుగా ఆయన ఇంటికి వెళ్ళేవారు. ఆయన ఆరోగ్యం కోసం దైవాన్ని ప్రార్థించే వారు. కాని అబూసల్మా (రజి) అనారోగ్యం నుంచి కోలుకోలేక పోయారు. చివరికి ఆ గాయాలతోనే ఆయన శాశ్వతంగా కన్నుమూశారు.

భర్త మరణంతో ఉమ్మెసల్మా (రజి) కృంగిపోయారు. తండ్రి నీడ కోల్పోయిన తన అనాథపిల్లల దుస్థితి చూసి ఆమె భోరున విలపించారు. మదీనాలో ఆమెకు తన పిల్లలు తప్ప బంధువులెవరూ లేరు. కనీసం సానుభూతి చూపడానికి ఆమె తెగవాళ్ళు కూడా లేరు. దాంతో ఆమె లోలోన కుమిలిపోసాగారు. కొన్నాళ్ళకు ఆమె విషాదాన్ని బలవంతంగా దిగమింగారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆమెను వివాహమాడదలచి కబురు పంపారు. అప్పటికి ఆమె యవ్వనసరిహద్దులు దాటారు. పిల్లలు కూడా చాలా మంది ఉన్నారు. అంచేత ఆమె దైవప్రవక్త (సల్లం)ను వివాహమాడలేనని చెప్పారు.

అయితే దైవప్రవక్త (స) కొన్నాళ్ళు ఆగి ఆమె అభ్యంతరాలకు తృప్తికరమైన సమాధానాలిస్తూ మళ్ళీ పెళ్ళికబురు పంపించారు. చివరికి ఆమె అంగీకరించారు. అప్పుడాయన ఆమెను వివాహమాడి ఆమె పిల్లల్ని తన సంరక్షణలోకి తీసుకున్నారు. ఇలా హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) తన పిల్లలకే కాదు, యావత్తు ముస్లింలకు మాతృమూర్తి అయ్యారు.

"దైవప్రవక్త (సల్లం) విశ్వాసులకు వారి ప్రాణాలకన్నా ఎంతో సన్నిహితుడు. దైవప్రవక్త భార్యలు వారికి మాతృమూర్తుల్లాంటివారు." (ఖుర్ఆన్-33:6)



# 59. విశ్వాసులమాతృమూర్తి ఉమ్మెహబీబా (రజి)

పచ్చిబహుదైవారాధకుడు, పరమ అసత్యవాది, ముస్లింల బద్ధశత్రువయిన అబూ సుఫ్యాన్‌కు పిడుగులాంటి వార్త అందింది. స్వయంగా ఆయన కూతురు ఉమ్మెహబీబా, ఆమె భర్త ఉబైదుల్లా నూతనధర్మం స్వీకరించి ముస్లిములైపోయారట! అబూసుఫ్యాన్ ఈ సంగతి విని తోకతొక్కిన త్రాసుపాములా కస్సున లేచాడు. కన్నకూతురు, అల్లుడని చూడకుండా వారిద్దర్ని మళ్ళీ తాతముత్తాల మతంవైపు మరల్చడానికి రకరకాలుగా వేధించాడు. అయినా ఆ దంపతులు దైవధర్మంలో స్థిరంగా ఉన్నారు.

ఆనాడు మక్కాలో ముస్లింలపై కష్టాలకడగండ్లు విరుచుకుపడ్డాయి. వారిపై అవిశ్వాసుల ఆగడాలు హద్దుమీరిపోయాయి. అప్పుడు దైవప్రవక్త (సల్లం) వారిని అబిసీనియాకు వలసపొమ్మని చెప్పారు.

ఈ అనుమతి లభించగానే దాదాపు జట్లుజట్లుగా మక్కా వదిలేసి అబిసీనియా చేరుకున్నారు. వారిలో ఉమ్మెహబీబా (రజి), ఆమెభర్త ఉబైదుల్లా బిన్ హజష్ కూడా ఉన్నారు. కాని అబిసీనియాకు వచ్చిన తర్వాత ఉమ్మెహబీబా (రజి) భర్త ఉబైదుల్లా మతభ్రష్టుడై పోయాడు. క్రైస్తవం స్వీకరించి కొన్నాళ్ళకు చనిపోయాడు.

అబిసీనియాకు వచ్చిన తర్వాత భర్త చేసిన విశ్వాసఘాతుకం వల్ల ఉమ్మెహబీబా (రజి) అతనికి దూరమైపోవలసి వచ్చింది. అలా ఆమె దిక్కులేని అభాగినై పోయింది. దైవప్రవక్త (సల్లం) ఆమె పరిస్థితి తెలుసుకొని ఎంతో జాలిపడ్డారు. ఆపద సమయంలో సహనం వహించాలని, పరిస్థితుల్ని ధైర్యంతో ఎదుర్కోవాలని ఉపదేశించారు.

అయితే భర్తకు దూరమయిన ఈ దీనురాలు ఎన్ని కష్టాలని ఎదుర్కోగలదు? ఈ కష్టాల నుండి ఆమెను గట్టెక్కించేందుకు స్వయంగా దైవప్రవక్తే ముందుకు వచ్చారు. ఆయన నజాషీ రాజుకు ధర్మప్రచార లేఖ రాసిన సందర్భంలో తాను ఉమ్మెహబీబాను వివాహమాడ దలిచానని, దీనికి ఆమె అంగీకరిస్తే రాజు నజాషీ స్వయంగా వకీలయి తనతో ఆమె వివాహం జరిపించాలని మరొక లేఖ రాశారు.

నజాషీ దైవప్రవక్త (స) అభిప్రాయాన్ని తెలియజేస్తూ హజ్రత్ ఉమ్మెహబీబా (రజి)కు వివాహసందేశం అందజేశారు. ఈ శుభవార్త అందుకున్న ఉమ్మెహబీబా (రజి) సంతోషంతో పొంగిపోయారు. మహాప్రవక్త, మానవోత్తముడయిన మహామనీషి తనంతట తానుగా వివాహసందేశం పంపితే ఏ స్త్రీ సంతోషించదు? పైగా భర్త కోల్పోయిన వితంతువు, అభాగిని అయిన సామాన్య స్త్రీని ఇలాంటి మహాపురుషుడు వివాహమాడటానికి ముందుకు వస్తే ఇక ఆమె ఎంత ఆనందోత్సాహాలతో పరవశించి పోతుందో చెప్పనవసరం లేదు.

అందుకే హ\u200cజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఈ వివాహసందేశాన్ని తక్షణమే అంగీకరించారు. అప్పుడు నజాషీ దైవప్రవక్త (స)తో ఆమె వివాహం జరిపించాడు. దైవప్రవక్త తరఫున ఆయన మహర్‌గా నాలుగొందల దీనార్ల పైకం కూడా ఆమెకు ఇచ్చివేశారు.

దైవప్రవక్త (సల్లం), నజాషీకి రాసిన మొదటి లేఖలో ఇస్లాం సందేశంతో పాటు అబిసీనియాలోని ముస్లిం కాందిశీకుల్ని మదీనా పంపించమని ఆదేశించారు. ఇప్పుడా కాందిశీకులు మదీనా వెళ్ళిపోయే సమయం ఆసన్నమయింది. వారి కోసం దైవప్రవక్త (సల్లం) రెండు ఓడలు పంపించారు.

ఈ శరణార్థులంతా ఆ ఓడలలో అబిసీనియా (ఇథియోపియా) నుండి బయలుదేరి మదీనా చేరుకున్నారు. వారిలో ఉమ్మెహబీబా (రజి) కూడా ఉన్నారు. మదీనా చేరుకున్న తరువాత దైవప్రవక్త (సల్లం) యోధుల్ని తీసుకొని ఖైబర్ వెళ్ళారని తెలిసింది. దాంతో ఈ శరణార్థులంతా మదీనా నుంచి మళ్ళీ ఖైబర్‌కు బయలుదేరారు. ఉమ్మెహబీబా (రజి) మాత్రం మదీనాలోనే ఉండిపోయారు.

దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరయోధులు ఖైబర్ నుండి తిరిగి వెళ్ళడానికి ప్రయాణసన్నాహాలు ప్రారంభించారు. అంతలో హ\u200cజ్రత్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) నేతృత్వంలో అబిసీనియా ముస్లింశరణార్థులు, నజాషీ రాసిన లేఖ, ఆయన పంపిన కానుకలతో ఖైబర్‌కు చేరుకున్నారు. పాత సహచరుల్ని కలుసుకొని ముస్లింలంతా పరమానంద భరితులయ్యారు. తిరుగుప్రయాణంలో ముస్లింయోధులు ఫదక్, ఖురా, తైమా ప్రాంతాల యూదుల మెడలను కూడా వంచి మదీనా చేరుకున్నారు.

మదీనాలో తన నూతనభర్త అయిన మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్న హ\u200cజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఆ మహనీయుని దర్శనం లభించగానే పరమసంతోషంతో ఉప్పొంగిపోయారు. స్వయంగా దైవప్రవక్త (సల్లం) అంతటి మహాపురుషుడే తనను కోరి వివాహమాడి అక్కున చేర్చుకున్నందుకు హ\u200cజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఆనందం అవధులు దాటింది.

## 60. సఫియా బిన్త్ అబ్దుల్‌ముత్తలిబ్ (రజి)

హ\u200cజ్రత్ సఫియా (రజి) ఖురైష్ నాయకుడు అబ్దుల్‌ముత్తలిబ్ కుమార్తె; దైవప్రవక్త (సల్లం) మేనత్త. సఫియా(రజి) తన భర్త అవ్వామ్ బిన్ ఖువైలద్ చనిపోవడంతో కొడుకు జుబైర్‌ని గొప్ప సమరయోధుడిగా చేసే ఉద్దేశ్యంతో తగినశిక్షణ ఇస్తూ పెంచారు. దైవప్రవక్త (సల్లం) దైవసందేశ ప్రచారశంఖం పూరించిన తొలిరోజుల్లోనే ఆ తల్లీకొడుకులు ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (సల్లం) ఓరోజు దైవసందేశాన్ని తన బంధువులందరికీ అందజేసే ఉద్దేశంతో ఒక విందు ఏర్పాటుచేశారు.



నిర్ణీతదినాన దైవప్రవక్త (సల్లం) ఇల్లు బంధువర్గంతో నిండిపోయింది. పెదనాన్నలు, పినతండ్రులు, సోదరులు, మేనత్తలు, ఇతర బంధువులు విందు భోజనానికి వచ్చారు. కాని ఈ విందుకు కారణం ఏమిటో ఎవరికీ అర్థంకాలేదు. అందరూ భోజనాలు ముగించిన తర్వాత ముహమ్మద్ (సల్లం) ఈ విందుకు కారణం ఏం చెబుతారో విందామని కుతూహలంతో ఎదురుచూడసాగారు. కొన్ని క్షణాల తరువాత దైవప్రవక్త (సల్లం) విషయం చెపుదామని లేచి నిలబడ్డారు. అంతలో అబూలహబ్ దిగ్గునలేచి ఇలా అందుకున్నాడు:

“ముహమ్మద్ (స)! వీళ్ళంతా నీ బంధువులు. నీ శ్రేయస్సు కోరేవారే. కాని వీరంతా అనుసరిస్తున్న తాతముత్తాతల కాలం నుంచీ వస్తున్న మతం సరైనది కాదని అంటున్నావు. కొత్తమతం ఏదో కనిపెట్టి నీ సోదరులపై పెద్దఆపద తెచ్చిపెట్టావు. నీ ధోరణి ఏమీ బాగా లేదు. ఒక విషయం గుర్తుంచుకో. అరబ్ తెగలన్నీ ఏకమై పోరుకు వస్తే మన తెగవాళ్ళు నీకు సాయపడరు. నీ వైఖరి మార్చుకోకపోతే మేము నిన్ను కారాగారంలో పడవేస్తాం. అంతేగాని ఖురైషీయులు, ఇతర తెగలు కలిసి నిన్ను పట్టుకోవడం మాత్రం మన తెగవాళ్ళు ఏమాత్రం సహించరు.”

విందులో దైవప్రవక్త (సల్లం) మేనత్త సఫియా (రజి) కూడా ఉంది. ఆమె ఈ మాటలు సహించలేక “అన్నయ్యా! నీకు కాస్తయినా సిగ్గుందా! తమ్ముడి కొడుకునే వ్యతిరేకిస్తున్నావా? ముత్తలిబ్ వంశంలో ఒక దైవప్రవక్త పుడ్తాడని కొంతకాలం నుంచి అనేకమంది సాధువులు, తాత్వికులు చెబుతూవస్తున్న సంగతి నీకూ తెలుసు. ఆ దైవప్రవక్త ఈయనే...” అన్నది.

సఫియా మాటలకు అబూలహబ్ వికటాట్టహాసం చేస్తూ “సఫియా! నీకేం హాయిగా (గాజులు తొడుక్కొని) ఇంట్లో కూర్చుంటావు. ఖురైషీయులు శత్రువులుగా మారి మనపై పోరుకుపాల్పడితే, ఇతరతెగలు కూడా వారి పక్షమే వహిస్తే... అప్పుడు మన గతేమవుతుందో తెలుసా? చీమల్లా నలిగిపోతాం” అని అన్నాడు.

అబూతాలిబ్ కూడా అబూలహబ్ వైఖరి సహించలేక “అలా ఎన్నటికీ జరగదు. మా బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ మేమంతా ముహమ్మద్‌కు మద్దతిస్తాం.” అంటూ తన తిరుగులేని నిర్ణయాన్ని ప్రకటించారు.

“సోదరులారా! ఇక ఇక్కడుండటం మనకు మంచిదికాదు, పదండి అంటూ చరచరా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఇతరులు కూడా ఒక్కక్కరే లేచి వెళ్ళిపోయారు.

ఎన్నో విషయాలు చెప్పాలనుకున్న దైవప్రవక్త (స) ఏమీ చెప్పలేక నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. కాని ఏనాటికైనా బంధువులు తన సందేశం విని సన్మార్గం అవలంబిస్తారన్న ఆశతో ఆయన సహనం వహించారు.

కొన్నాళ్ళ తరువాత దైవప్రవక్త (సల్లం) మళ్ళీ విందు ఏర్పాటుచేసి బంధువుల్ని పిలిచారు. బంధువులంతా వచ్చి భోజనాలకు కూర్చున్నారు. భోజనాలు ముగిసిన వెంటనే దైవప్రవక్త (సల్లం) లేచి ఇలా మాట్లాడారు:

"అబ్బాస్ బాబాయి! ప్రవక్త మేనత్త సఫియా! ముహమ్మద్ కూతురు ఫాతిమా! పెదనాన్న అబూతాలిబ్! మీరంతా నరకాగ్ని నుండి తప్పించుకునే విషయం గురించి ఆలోచించండి. నేను మిమ్మల్ని దేవుని పట్టునుండి ఏమాత్రం కాపాడలేను. కావాలంటే నాఆస్తి నుండి మీరు కోరినవాటిని అడిగి తీసుకోవచ్చు. నేను మీకు అంతవరకే సహాయం చేయగలను. పరలోకంలో మాత్రం నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను."

అబూతాలిబ్ ఈ మాటలు విని "నేను తరతరాల నుంచి వస్తున్న మన పెద్దల మతాన్ని వదలిపెట్టలేను. అయితే నీవు దేవుడు ఆదేశించినదాన్ని నిరభ్యంతరంగా కొనసాగించు. నీకు నా మద్దతు పూర్తిగా ఉంటుంది" అన్నారు.

అబూతాలిబ్ మాటలు విని అబూలహబ్ వస్తున్న కోపాన్ని మింగలేక, కక్కలేక విలవిల్లాడి పోయాడు. ఈ విందు సందర్భంగా బంధువుల్లో కొత్తగా ఎవరూ ఇస్లాం స్వీకరించకపోయినా అబూతాలిబ్ మాట దైవప్రవక్త (స)కు కొంత ఊరడింపు ఇచ్చింది.

ముస్లింలు అవిశ్వాసులు పెడ్తుండిన బాధలు భరించలేక మక్కా వదలి మదీనాకు వలసపోయినప్పుడు హజ్రత్ సఫియా (రజి) కూడా కొడుకు జుబైర్ (రజి)ని తీసుకొని మదీనా వెళ్ళిపోయారు. అప్పటికి ఆమె వయసు అరవై ఏండ్లు. అయినప్పటికీ ఆమె ఉహుద్, కందకం వగైరా యుద్ధాల్లో పాల్గొని తన వంతు సేవ చేశారు.

ఉహుద్‌యుద్ధ సమయంలో సైన్యం వెంట కొందరు మహిళలు కూడా బయలు దేరారు. వారిలో ప్రవక్తసతీమణి ఆయిషా (రజి), ఉమ్మెసలీం (రజి), ఉమ్మెసలీత్ (రజి), సఫియా (రజి) కూడా ఉన్నారు. హిజ్రీశకం 3వ ఏట, షవ్వాల్ నెలలో సత్యాసత్యాల మధ్య సంకులసమరం మొదలైంది. ముస్లింయోధులు శత్రువులపై విరుచుకుపడ్డారు. అవిశ్వాసులసైన్యం కూడా భీకరంగా పోరాడుతోంది.

హజ్రత్ సఫియా (రజి) తోటి మహిళలతో కలసి అమితోత్సాహంతో అటూఇటూ పరుగెత్తుతూ తమ యోధులకు మంచినీళ్ళు సరఫరా చేయసాగారు. కొందరు స్త్రీలు క్షతగాత్రులకు మందువేసి కట్లు కూడా కడ్తున్నారు.

ఈ యుద్ధంలో దైవప్రవక్త (సల్లం) అమరగతులయ్యారని పుకార్లు పుట్టడంతో ముస్లింలు నిరాశానిస్పృహకు లోనయ్యారు. సైనికపంక్తులు చిందరవందరయ్యాయి. కొందరు మాత్రమే దైవప్రవక్త (సల్లం)కు రక్షణకవచంగా మారి శత్రువుల్ని ప్రతిఘటించ సాగారు. మరికొందరు శత్రువుల ధాటికి నిలువలేక పారిపోతున్నారు.



దైవప్రవక్త (సల్లం)ను వదిలేసి పారిపోతున్న ముస్లింయోధుల్ని చూడగానే హజ్రత్ సఫియా (రజి) చేతిలోని నీళ్ళతిత్తి విసిరిపారేసి, పారిపోతున్న ఒక యోధుని చేతిలోని బరిసెను లాక్కొని శత్రుసైనికపంక్తుల్ని చీల్చుతూ ఎదురుగా వస్తున్న శత్రువులపై దాడిచేస్తూ తుఫానులా దూసుకుపోయారు. పారిపోతున్న ముస్లింలను సమీపించి "మీ పాడుగాను! మీరు దైవప్రవక్త (సల్లం)ను వదలి పారిపోతున్నారా!!" అన్నారు.

శత్రుసైనికులు యుద్ధరంగం నుంచి వెళ్ళిపోగానే ముస్లింయోధులు కొండపై నుంచి క్రిందికి దిగారు. అమరగతులయిన తమ డెబ్బయిమంది యోధుల మృతదేహా లకు అంత్యక్రియలు జరపడానికి సిద్ధమయ్యారు.

హజ్రత్ హమ్జా (రజి) మృతదేహం ముక్కలుగా ఖండించబడి ఎంతో భయానకంగా, దయనీయంగా ఉంది. దాన్ని చూడగానే దైవప్రవక్త (స) కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

హమ్జా (రజి) మరణవార్త విని చూడటానికి ఆయన చెల్లెలు హజ్రత్ సఫియా (రజి) వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆమెను దూరం నుంచి చూడగానే "ఆమెను హమ్జా శవం దగ్గరకు పోనివ్వకు" అన్నారు హజ్రత్ జుబైర్ (రజి)తో.

హజ్రత్ జుబైర్ (రజి) తన మాతృమూర్తి హజ్రత్ సఫియా (రజి)ని నిరోధించబోతే "నా సోదరుడి శవాన్ని శత్రువులు కోసి వికృతంగా చేశారని నాకు తెలుసు. నేనిక్కడకు బట్టలు చించుకొని పెడబొబ్బలు పెట్టడానికి రాలేదు. నేను ఓర్పువహించి అతని కోసం దైవాన్ని ప్రార్థిస్తాను" అని అన్నారు ఆమె.

దైవప్రవక్త (స) ఈ మాటలు విని శవాన్ని చూడటానికి ఆమెకు అనుమతిచ్చారు. అప్పుడు హజ్రత్ సఫియా (రజి) దగ్గరకు వచ్చి సోదరుని శవాన్ని చూశారు. ముంచుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ "ఇన్నా లిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్ (మనం దేవుని వాళ్ళం, దేవుని వైపునకే మనం మరలిపోవలసి ఉంది)" అన్నారు. ఆతర్వాత ఆమెసోదరుని పాపమన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఇక కందకం యుద్ధసమయంలో సఫియా(రజి) ప్రదర్శించిన ప్రతిభాపరాక్రమాలు, ధైర్యసాహసాలు మరువరానివి.

కందకంయుద్ధంలో బహుదైవారాధక సైన్యం నూతన ఉత్తేజంతో ముస్లింల మీదకు విజృంభించింది. ముస్లింల మిత్రపక్షమైన మదీనా యూదులు అతిక్లిష్ట పరిస్థితిలో స్నేహఒప్పందం ఉల్లంఘించి విద్రోహానికి పాల్పడారు. నిన్నటిదాకా భయంతో బిక్క ముఖాలు వేసుకున్న ఖురైష్ సైనికులకు ఈరోజు బనూఖురైజా యూదుల మద్దతు లభించడంతో ఎక్కడలేని ధైర్యం పుట్టుకొచ్చింది. కందకం వల్ల ఏర్పడిన భయం కాస్తా పోయింది. రక్తాన్ని గడ్డ కట్టించే చలి ఉన్నా ఖాతరు చేయకుండా పోరాడుతున్నారు.

ముస్లింలు ఎటువైపు నుంచి కూడా బయటపడలేనంత పకడ్బందీగా ఖురైష్ సైనికులు వారిపై ఉధృతంగా బాణాలు కురిపిస్తున్నారు.

ముస్లింల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నలువైపుల నుంచి ప్రమాదం ముంచుకొస్తోంది. భయాందోళనలతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకున్నారు. మరో వైపు యూదులు వచ్చిపడతారనే భయం కూడా వారిని రేయింబవళ్ళు పట్టి పీడిస్తోంది. స్త్రీలు, వృద్ధులు, పిల్లలు నగరంలోని కోటలో తలదాచుకున్నారు. అయినా నమ్మకద్రోహు లయిన యూదులు ఎప్పుడు ఏ హాని తలపెడ్తారోనన్న భయాందోళనలతో ముస్లింలు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు.

మిత్రద్రోహులయిన బనుఖురైజా యూదులు దొంగచాటుగా ముస్లింలపై దాడి చేయడానికి అవకాశం కోసం పొంచిచూస్తున్నారు. ఈ ఉద్దేశంతోనే ఒక సైనికదళం రహస్యంగా బయలుదేరింది. వారి విద్రోహచర్యల్ని కనిపెట్టిన ముస్లింయోధులు వెంటాడి వారిని తరిమేశారు.

అయినప్పటికీ యూదులు తమ కుటిలయత్నాలు మానుకోలేదు. మదీనాలో ముస్లింస్త్రీలు, పిల్లలు, వృద్ధులు తలదాచుకున్న కోట పక్కనే యూదుల కోటలు కూడా ఉన్నాయి. ఈ సంగతి తెలుసుకున్న యూదులు సంతోషంతో ఎగిరి గంతేశారు.

"ముస్లిం సైనికులు ఖురైషీయులతో పోరాడుతున్నారు. అందువల్ల కోటలో వారి స్త్రీలు, పిల్లలు, తప్ప యుద్ధం చేయగలిగే పురుషులెవరూ ఉండకపోవచ్చు. కోటను ఆక్రమించుకోవడానికి ఇదే మంచి అవకాశం." ఈ ఆలోచన రాగానే యూదులు ఒక సైనికుడ్ని ముస్లింల కోట వైపు పంపారు.

ఆ సైనికుడు మెల్లగా కోట దగ్గరకు వెళ్ళాడు. కోట చుట్టూ తిరుగుతూ కోట లోపల పురుషయోధులు ఎవరైనా ఉన్నారా అని పరిశీలించసాగాడు.

కోట పకడ్బందీగా ఉంది. లోపల ఉన్న స్త్రీలకు, పిల్లలకు కాపలా కాయడానికి ప్రముఖ కవి హజ్రత్ హస్సాన్ (రజి) నియమించబడ్డారు. కోటలో ప్రవక్త మేనత్త హజ్రత్ సఫియా (రజి) కూడా ఉన్నారు. కోట వెలుపల శత్రునీడ కన్పించగానే ఆమె భయపడ్డారు. హజ్రత్ హస్సాన్ (రజి)కు అటువైపు చూపిస్తూ ఇలా అన్నారు:

"చూశారు కదా శత్రువు మన కోట చుట్టూ ఎలా తిరుగుతున్నాడో? తక్షణమే వెళ్ళి అతని శిరస్సు ఖండించి రండి. ఆలస్యం చేస్తే అతను వెళ్ళిపోయి మనల్ని గురించిన సమాచారం శత్రువులకు చేరవేస్తాడు. అటు మన సైనికులు ఖురైషీయులతో యుద్ధంలో నిమగ్నులై ఉన్నారు. ఒకవేళ ఇతను తప్పించుకొనిపోతే మాత్రం మనం ప్రమాదంలో పడిపోతాం. త్వరగా బయలుదేరండి."



హజ్రత్ హస్సాన్ (రజి) సందిగ్ధంలో పడిపోయారు. ఆయన ప్రఖ్యాత కవి. తన అసాధారణ కవితా పటిమతో దైవప్రవక్త (సల్లం) తరపున సత్యతిరస్కార కవుల నోళ్ళను కట్టిపడవేసేవారు. కాని ఖడ్గం చేపట్టాలంటే కొంచెం భయపడ్డారు. అందువల్ల క్షణం పాటు తటపటాయించి తన పిరికితనాన్ని బయట పెట్టుకోక తప్పలేదు.

"అబ్దుల్ ముత్తలిబ్ కూతురా! నన్ను పరీక్షించకు. నేనీ పనికి తగనని నీకు తెలుసు కదా!" అన్నారు ఆయన.

హజ్రత్ సఫియా (రజి)కు మరోమార్గం కన్పించలేదు. ప్రమాద ఘడియ దగ్గర పడుతోంది. గత్యంతరంలేక తానే ఓ శిబిరం గుంజ పీకి బయటకు వెళ్ళారు. చప్పుడు చేయకుండా శత్రువు వెనకాలగా పోయి గుంజతో అతని తల మీద బలంగా ఒకేఒక దెబ్బవేశారు. ఆ దెబ్బకు శత్రువు తల పుచ్చకాయలా పగిలిపోయి నేలకొరిగాడు.

తరువాత హజ్రత్ సఫియా (రజి) కోటలోకి తిరిగొచ్చి "శత్రువు చచ్చిపోయాడు. ఇప్పుడైనా వెళ్ళిరండి. అతను పురుషుడైనందున నేను తాకడం సమంజసం కాదు. మీరెళ్ళి అతని ఆయుధాలు, దుస్తులు తీసి పట్రండి" అని చెప్పారు.

"పోనివమ్మా! నాకు వాటి అవసరం లేదు" అన్నారు హజ్రత్ హస్సాన్ (రజి) పోవడానికి సాహసించలేక.

"సరే, కనీసం అతని శిరస్సునైనా కోసిపారేయండి. దాన్ని చూసి యూదులు హడలిపోతారు" హజ్రత్ సఫియా (రజి) మళ్ళీ పురమాయించారు.

కాని హజ్రత్ హస్సాన్ (రజి) దానికీ సిద్ధం కాలేకపోయారు. చేసేదిలేక హజ్రత్ సఫియా (రజి)యే మళ్ళీ బయటికి పోవలసి వచ్చింది.

ఆమె వెళ్ళి శత్రువు తల ఖండించి దూరంగా విసిరివచ్చారు. బనూఖురైజా యూదులు తమ సైనికుడి శిరస్సు చూసి కోటలో కూడా సైనికులున్నారని భావించారు. అందువల్ల వారు ముస్లింల కోటపై దాడిచేయడానికి సాహసించలేక పోయారు.

## 61. అస్మా బిన్తె అబూబకర్ (రజి)

ముహమ్మద్ (స) పట్నం వదలిపోయారన్న వార్త మక్కాలో దావానలంలా వ్యాపించింది. నగరవాసుల్లో కలకలం బయలుదేరింది. పలువురు పలువిధాలా చెప్పుకోసాగారు.

"పదండి. ఇక ఆలస్యం చేయకండి. వెతకండి" క్రోధావేశాలతో గొంతులు చిరిగి పోయేలా అరిచారు ఖురైష్ నాయకులు. వారు కాలుకాలిన పిల్లుల్లా నలుగురు నాలుగు వైపులా పరుగెత్తారు. అయితే మదీనా దిక్కుకు పోయినవాళ్ళు ముహమ్మద్ (సల్లం) జాడ దొరక్క నిరాశతో తిరిగొచ్చారు.

కొందరు హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికి పరుగుతీశారు. ఎందుకంటే ఆయన దైవప్రవక్త (సల్లం)కు అత్యంత సన్నిహితుడు, ప్రాణస్నేహితుడు. అలా అబూబకర్ (రజి) ఇంటికి పోయినవారిలో కరుడుకట్టిన సత్యతిరస్కారి అబూజహల్ కూడా ఉన్నాడు. పోగానే వారు తలుపులు విరిగిపోతాయా అన్నట్లు దబదబా బాదారు.

ఈ చప్పుడుకు లోపల ఉన్న అబూబకర్ కుమార్తె అస్మా (రజి) గుండెలు దడదడలాడి పోయాయి. ఆమె బిక్కు బిక్కుమంటూ వెళ్ళి తలుపు తెరిచారు.

శత్రువులు ఆగ్రహోదగ్రులయి ''ఏడి మీ నాన్న? ఎక్కడున్నాడు?'' అని గద్దించారు.

అస్మా (రజి) భయపడుతూ ''ఏమో ఎక్కడికి పోయారో నాకు తెలియదు'' అన్నారు.

అబూబకర్ (రజి) కూడా ముహమ్మద్ (సల్లం)తో పాటు వెళ్ళిపోయి ఉంటాడని శత్రువులు గ్రహించారు. దాంతో అబూజహల్ బాగా రెచ్చిపోయి హజ్రత్ అస్మా (రజి) చెంప మీద లాగికొట్టాడు. ఆ దెబ్బకు పాపం అస్మా (రజి) చెవిపోగు తెగి దూరంగా పడిపోయింది. తరువాత శత్రువులు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అవిశ్వాసులు తనను ఇంకా వెంటాడుతూ ఉండవచ్చని దైవప్రవక్త (సల్లం) మూడు రోజుల దాకా సౌర్‌గుహలోనే ఉండవలసి వచ్చింది.

ఈ మూడురోజులు అబూబకర్ (రజి) కొడుకు అబ్దుల్లా (రజి) పగలంతా నగరంలో తిరిగి, ఖురైషీయులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఏమేమి కుట్రలు పన్నుతున్నారో తెలుసుకొని రాత్రిపూట వచ్చి సమాచారం అందజేసేవారు. ఆయనచెల్లెలు అస్మా (రజి) తండ్రికి, దైవప్రవక్త (సల్లం)కు అన్నం నీళ్ళు తెచ్చిచ్చేవారు. అబూబకర్ (రజి) సేవకుడు ఆమిర్ బిన్ ఫుహైరా మేకలను మేపుకుంటూ గుహ దగ్గరకు వచ్చేవాడు.

హజ్రత్ అస్మా (రజి) తెచ్చిన అన్నం దైవప్రవక్త (సల్లం), అబూబకర్ (రజి) తినేవారు. ఆ తరువాత అస్మా(రజి), అబ్దుల్లా(రజి) గుహ దగ్గర్నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు శత్రువులు అడుగుజాడల్ని గుర్తించడానికి వీలులేకుండా ఉండేందుకు ముందు వారిద్దరు నడుస్తుంటే వారి వెనుక ఆమిర్ మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు.

ఇలా మూడు రోజులు గుహలో గడిపి, అబ్దుల్లా (రజి) సేకరించిన సమాచారాన్ని బట్టి శత్రువులు తమను వెంటాడటం మానేశారని నిర్ధారణ చేసుకున్నారు.

అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) కొడుకుతో ''నేను మన ఇంటి దగ్గర రెండు ఒంటెల్ని సిద్ధంచేసి ఉంచాను. నీవు వెంటనే పోయి, ఎవరికీ తెలియకుండా వాటిని తీసుకురా. వచ్చేటప్పుడు ఇబ్నెఅర్ఖత్‌ను కూడా పిలుచుకురా'' అని చెప్పి పంపించారు.

ఆరోజు సాయంకాలమే అబ్దుల్లా (రజి) గుహ దగ్గరకు తిరిగొచ్చారు. ఆయన వెంట అస్మా (రజి), ఆమిర్ కూడా ఉన్నారు. వారి వెనకాల ఇబ్నెఅర్ఖత్ ఒంటెలను



తోలుకొని వచ్చాడు. ఇబ్నెఅర్ఖత్ ముస్లిమేతరుడు అయినప్పటికీ అబూబకర్ (రజి)కు ఎంతో నమ్మకస్తుడు. అంచేత అబూబకర్ (రజి) అతనికి కొంతపైకం ముట్టజెప్పి తమను నిర్జనప్రాంతం గుండా మదీనా తీసికెళ్ళటానికి మార్గదర్శిగా కుదుర్చుకున్నారు.

హజ్రత్ అస్మా (రజి) ప్రయాణానికి కావలసిన సామానంతా సిద్ధపరిచారు. కాని అన్నం పాత్ర, నీళ్ళతిత్తి బిగించి కట్టడానికి ఏమీ దొరక్క కాస్సేపు కంగారుపడ్డారు. తరువాత ఆమెకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. వెంటనే ఆమె తన ఓణీ తీసి బరబరా రెండుముక్కలుగా చింపి వాటికి కట్టారు. అప్పుడు హజ్రత్ అస్మా (రజి) కన బరచిన సమయస్ఫూర్తి చూసి దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో ఆమెను ''జాతున్నితాఖైన్'' (రెండు ఓణీల మహిళా)'' అని పిలిచారు.

హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (సల్లం)తో కలసి మదీనా వలసపోతున్నపుడు తన వెంట ఇంట్లోవున్న ఆరువేల దిర్హంల పైకమంతా తీసికెళ్ళారు. ఇస్లాం ఇంకా స్వీక రించని తండ్రి అబూఖహాఫా ఈ సంగతి తెలుసుకొని అస్మా(రజి)తో ''మీ నాన్న ఇంట్లో వున్న డబ్బంతా తీసికెళ్ళాడు. మన కోసం ఒక్క పైసా మిగల్చకుండా మనల్ని ఆర్థిక ఇబ్బందుల్లో పడవేసి వెళ్ళిపోయాడు'' అని అన్నాడు.

దానికి హజ్రత్ అస్మా (రజి) ''లేదు తాతయ్యా! మా నాన్న మన కోసం చాలా డబ్బు వదలిపోయారు'' అని అన్నారు.

తరువాత ఆమె ఒక సంచిలో నిండా కంకర్రాళ్ళు వేసి, దాని మూతికట్టి గోడలో నిర్మించబడిన ఒక అల్మారీలో పెట్టి దానిపై గుడ్డ కప్పారు. ఆ తరువాత కంటిచూపు పోయిన తన తాతయ్య చేయిపట్టుకొని అల్మారీ దగ్గరకు తీసికెళ్ళి ''తాతయ్యా! మానాన్న మన కోసం ఎంత డబ్బు వదలిపోయారో చూడు'' అన్నారు.

అబూఖహాఫా మనుమరాలి చేతి సహాయంతో అల్మారీలోని సంచి తడిమిచూసి ''అలాగైతే పర్వాలేదు. మనకోసం అంత డబ్బు వదలిపోయి అతను మంచి పనే చేశాడు'' అని అన్నాడు. ఆవిధంగా అస్మా(రజి) తాతను తృప్తిపరచ గలిగారు.

దైవప్రవక్త (సల్లం) మదీనా చేరుకున్న తరువాత మక్కాలో ఉన్న తన కుటుంబ సభ్యుల్ని, ఇతర బంధువుల్ని మదీనాకు పిలుచుకొని రావడానికి జైద్ బిన్ హారిసా (రజి)ను, అబూరాఫె (రజి)ను మక్కా పంపించారు.

వారిద్దరు మక్కా వెళ్ళి దైవప్రవక్త (సల్లం) సతీమణులు సౌదా (రజి), ఆయిషా (రజి), దైవప్రవక్త (సల్లం) కుమార్తెలు ఫాతిమా (రజి), ఉమ్మెకుల్సూమ్ (రజి), జైద్ (రజి) భార్య ఉమ్మెఈమన్ -బర్కా (రజి), వారి కొడుకు ఉసామా (రజి), అబూబకర్ (రజి) అర్ధాంగి ఉమ్మెరూమాన్ (రజి), ఆయన సంతానం అబ్దుల్లా (రజి), అస్మా (రజి) తదితరులకు విషయం తెలియజేసి ప్రయాణానికి సిద్ధంచేశారు. దైవప్రవక్త (సల్లం)

కుమార్తె జైనబ్(రజి)ని పంపడానికి ఆమె అవిశ్వాసి భర్త అబుల్‌ఆస్ నిరాకరించినందున ఆమెను వదిలేయవలసి వచ్చింది. ఆమె తప్ప మిగిలినవారంతా సంతోషంతో మదీనా చేరుకొని తమ ఆప్తులను కలుసుకున్నారు.

హజ్రత్ అస్మా(రజి) వివాహం హజ్రత్ జుబైర్ (రజి)తో అయింది. ఆ దంపతులకు కలిగిన సంతానమే అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి). అస్మా(రజి) తన పుత్రరత్నాన్ని గొప్ప సుగుణసంపన్నుడిగా, సమరయోధుడిగా, అత్యంత దైవభీతి పరాయణుడిగా తీర్చి దిద్దడంలో ఏ కొరతా చేయలేదు.

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) దైవప్రవక్త (స) మదీనాకు వలసవచ్చిన ఇరవై నెలల తర్వాత మదీనాలో జన్మించారు. ఆయన జన్మపట్ల ముస్లింలలో సర్వత్రా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. కారణం ముహాజిర్‌ముస్లింలు మదీనా వలసవచ్చి సంవత్సరం గడిచినా వారికి సంతానం కలగకపోవడంతో యూదులు తాము ముస్లిం లకు పిల్లలు పుట్టకుండా చేతబడి చేశామని, ఇకముందు మదీనాలో ముస్లింలకు పిల్లలు పుట్టరని చెబుతుండేవారు. కాని దేవుడు వారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాడు.

అబ్దుల్లా(రజి) తండ్రి జుబైర్ (రజి) స్వర్గవాసులవుతారని దైవప్రవక్త (స) ప్రకటించిన పదిమంది సహాబీలలో ఒకరు. ఇబ్నెజుబైర్ (రజి) తల్లి హజ్రత్ అస్మా (రజి) మొదటి ఖలీఫా అబూబకర్ (రజి) కుమార్తె. ఇబ్నెజుబైర్ (రజి) నాయనమ్మ హజ్రత్ సఫియా (రజి). ఆమె దైవప్రవక్త (స) మేనత్త. ఇబ్నెజుబైర్ (రజి) పుట్టగానే దైవప్రవక్త (స) ఖర్జూరపండు నమిలి ఆయన నోట్లో పెట్టి అబ్దుల్లా అని పేరుపెట్టారు.

యజీద్ పాలనాకాలంలో మక్కాప్రజలు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేయడం జరిగింది. ఆ తర్వాత క్రమంగా ఇరాఖ్, ఈజిప్టు మొదలైన ప్రాంతాలతో సహా ఇస్లామీయ సామ్రాజ్యంలోని దాదాపు యావత్తు ప్రాంతాలు ఇబ్నె జుబైర్ (రజి) అధికార పరిధిలోకి వచ్చాయి. సరిగ్గా అదే సమయంలో బనూఉమయ్యా తెగకు చెందిన మర్వాన్ బిన్ హకం రంగంలోకి దిగడంతో ఇబ్నెజుబైర్ (రజి)కు, ఆయన రాజ్యానికి గడ్డుకాలం ఎదురైంది.

హి.శ. 65లో మర్వాన్ హత్య తరువాత అతని కొడుకు అబ్దుల్‌మలిక్ సిరియాలో అధికారం చేపట్టగానే కూఫాని ఆక్రమించుకొని అక్కడి ప్రజల చేత ఖిలాఫత్ బైత్ చేయించుకున్నాడు. ఆ తరువాత పార్శీ, బస్రా, ఖురాసాన్, అహ్వాజ్ వగైరా రాష్ట్రాలు కూడా క్రమంగా ఇబ్నెజుబైర్ (రజి) నుండి చేజారి పోయాయి. అబ్దుల్‌మలిక్ ఇరాఖ్, ఈరాన్‌లపై పట్టుసాధించిన తరువాత మక్కాపై దృష్టి సారించాడు.

అతను డెమాస్కస్ నుండి కూఫా వెళ్ళి హజ్జాజ్ బిన్ యూసుఫ్ అనే సేనానికి ఆపని కోసం ఒప్పించాడు. అప్పుడు హజ్జాజ్ హి.శ. 72లో మూడువేల మంది



సైనికుల్ని తీసుకొని కూఫా నుండి బయలుదేరి మక్కా సమీపానికి చేరుకున్నాడు. తర్వాత కొన్నాళ్ళకు అబ్దుల్‌మలిక్ మరో ఐదువేల మంది సైనికుల్ని మక్కాపంపాడు.

వేరొకవైపు అబ్దుల్‌మలిక్ తరపున తారిఖ్ అనే మరోసేనాని మదీనా వెళ్ళి అక్కడ ఇబ్నెజుబైర్ గవర్నర్‌ని తొలగించి, సిరియన్ వ్యక్తిని గవర్నర్‌గా నియమించి, అయిదు వేలమంది సైనికులతో మక్కా చేరుకున్నాడు. దాంతో హజ్జాజ్ అహంకారంతో విర్రవీగుతూ మక్కాను ముట్టడించి రాళ్ళురువ్వడం ప్రారంభించాడు. ఈముట్టడి నాలుగునెలలు కొనసాగింది.

ఇబ్నెజుబైర్ (రజి) సైనికులు శాయాశక్తుల వారిని ప్రతిఘటిస్తూనే ఉన్నారు. ఆ తర్వాత హజ్జాజ్ ఓ దుష్టపన్నాగం పన్నాడు. దానివల్ల ఇబ్నెజుబైర్ (రజి) సైన్యంలోని అనేకమంది ఆయన్ని వదిలేసి హజ్జాజ్ దగ్గరకు వెళ్ళిపోయారు. చివరికి ఇబ్నెజుబైర్ (రజి) కొడుకుల్లో కూడా ఇద్దరు హమ్జా, హబీబ్‌లు ఆయన్ని వదలి వెళ్ళిపోయారు. మూడవ కుమారుడు మాత్రమే చివరిదాకా తండ్రిని అంటిపెట్టుకొని ఉన్నాడు.

ఇలా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని అనేకమంది వదలి వెళ్ళిపోయిన తరువాత ఆయన దగ్గర చాలా కొద్ది మంది మాత్రమే మిగిలారు.

అలాంటి పరిస్థితిలో హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఒక సైనికుడి ద్వారా హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) దగ్గరకు ఒక ఉత్తరం పంపాడు. అందులో ఈవిధంగా ఉంది:

"ఇప్పుడు మీదగ్గర ఎలాంటి శక్తి లేదు. మీరు అన్నివిధాలా బలహీనమైపోయారు. కనుక మీరు మా రక్షణలోకి వచ్చేయండి. అందులోనే మీ శ్రేయస్సుంది. మీరు మా రక్షణలోకి వస్తే మీపట్ల మేము ఎంతో గౌరవమర్యాదలతో వ్యవహరిస్తాము. మీరు కోరే ప్రతి కోరికా తీరుస్తాము. నేను మిమ్మల్ని వీలైనంత వరకు హత్యవ్యవహారానికి దూరంగా ఉంచాలని, శాంతీసుహృద్భావాల వైపు మరలించాలని విశ్వాసులనాయకుడు (అబ్దుల్‌మలిక్) నన్ను ఆదేశించాడు."

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈ ఉత్తరం చదివి తన మాతృమూర్తి అస్మా (రజి) దగ్గరికెళ్ళి ఇలా అన్నారు :

"అమ్మా! ఇప్పుడు నా దగ్గర అయిదుగురు యోధులు తప్ప ఎవరూ లేరు. ప్రజలు హుసైన్ బిన్ అలీ (రజి)ని మోసగించి వెళ్ళిపోయినట్లే నన్ను కూడా మోసగించి వెళ్ళిపోయారు. హుసైన్ (రజి) కొడుకులు జీవించి ఉన్నంతవరకూ తండ్రి దగ్గర ఖడ్గధారులై శత్రువులతో పోరాడారు. కాని నా కొడుకులు నన్ను వదిలేసి ఆ దుర్మార్గుడి పంచన చేరిపోయారు. ఇప్పుడు హజ్జాజ్ నన్ను కూడా తన రక్షణలోని రమ్మని, నేను కోరిందల్లా ఇస్తానని చెబుతున్నాడు. అంచేత నేను నీ ఆదేశం కోసం వచ్చాను. చెప్పమ్మా! ఇప్పుడు నన్నేం చేయమంటావు?"

అప్పుడా వీరమాత ఇలాఅన్నది: "నీ వ్యవహారం గురించి నీకే బాగాతెలుసు. సత్యం నీపక్షాన ఉంటే, సత్యంవైపే నువ్వు ప్రజల్ని పిలిచేవాడివైతే ఆ పనిలోనే స్థిరంగా ఉండు. నీస్నేహితులు దైవమార్గంలో పోరాడుతూ అమరగతులయ్యారు. కనుక నువ్వు కూడా ఆ బాటలోనే పురోగమిస్తూ అమరగతిభాగ్యం సాధించుకో. ఒకవేళ నువ్వు ఐహిక భాగ్యాలు పొందాలని నిర్ణయించుకుంటే నీకంటే అసమర్థుడు, అయోగ్యుడు మరెవరూ ఉండరు. అప్పుడు నిన్ను నీవు మృత్యునోట అందించడమేగాక, నీ సహచరుల్ని కూడా మృత్యుకుహురంలోకి నెట్టినవాడవుతావు. కాబట్టి నువ్వు ఎట్టి పరిస్థితిలోనూ బనూ ఉమయ్యా వారికి లొంగకు. మరణం తన నిర్ణీత సమయంలో తప్పకుండా వస్తుంది. మగధీరుడిలా జీవించు, మగధీరుడిలా చచ్చిపో. ఇదే నీకు నా సలహా."

ఇబ్నెజుబైర్ (రజి) తల్లి మాటలు విన్న తర్వాత ఆమె నుదుటిని ముద్దాడి ఇలా అన్నారు :

"నా అభిప్రాయం కూడా ఇదేనమ్మా. నాకు ప్రాపంచికవ్యామోహం, అధికారదాహం ఏమాత్రం లేవు. ప్రజలు దైవాజ్ఞల్ని పాటించడం లేదని, నిషేధితాల వైపు మొగ్గుతున్నారని మాత్రమే నేనీ పని చేస్తున్నాను. నీ మాటలు నాకు కొండంత ధైర్యానిచ్చాయి. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు నేను సత్యం కోసం పోరాడుతూనే ఉంటాను. అమ్మా! ఈరోజే నేను హతమార్చబడతానని నాకు అనుమానంగా ఉంది. కనుక నీవు బాధపడకు. నన్ను దేవునికి అప్పగించి సహనం వహించు."

హజ్రత్ అస్మా (రజి) ఈమాటలు విని "బాబూ! దేవుడు నీకు దాని ప్రతిఫలం ప్రసాదిస్తాడులే. నువ్వు దేవుని పేరు స్మరించి శత్రువులపై దాడిచెయ్యి" అన్నారు.

ఆ తరువాత ఆమె కొడుకుని కౌగిలించుకోవడానికి ముందుకొచ్చి ఆయన శరీరాన్ని తాకితే ఆయన కవచం ధరించినట్లు తెలిసింది. హజ్రత్ అస్మా (రజి) అధిక వృద్ధాప్యం వల్ల అంధురాలయి పోయారు. కవచం చేతికి తగలగానే "నాయనా! నువ్వీ కవచం ఏ ఉద్దేశంతో ధరించావని" అడిగారు.

దానికా సుపుత్రుడు "నీ సంతృప్తి కోసం ధరించా నమ్మా!" అన్నారు.

హజ్రత్ అస్మా (రజి) "తీసేయి నాయానా! కవచం తీసేసి పైజామా, పొడుగుచొక్క తొడుక్కో. దానివల్ల వేగంగా కదలడానికి, బలంగా దాడిచేయడానికి వీలుంటుంది" అని అన్నారు.

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈమాట వినగానే కవచం తీసేసి పైజామా, పొడుగు చొక్కా ధరించారు. ఆ తర్వాత ఆయన తల్లి ఆశీర్వాదం తీసుకొని యుద్ధభూమికి బయలుదేరారు. సహచరుల దగ్గరికెళ్ళి వారికి తగిన సూచనలు ఇచ్చి శత్రుసమూహం లోకి సుడిగాలిలా దూసుకుపోయారు.



అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) వారిలో అనేకమందిని మట్టుపెట్టి చివరికి తీవ్రమైన గాయాలతో నేలకొరిగారు. వెంటనే శత్రువులు ప్రాణంపోయిన ఆ పులిరాజు శిరస్సును ఖండించారు. ఈ దుర్ఘటన హి.శ. 73లో సంభవించింది.

ఇబ్నె జుబైర్ (రజి) హత్యతో హజ్జాజ్ బిన్ యూసుఫ్, అతని సైనికమూకలు తెగ సంబరపడిపోతూ నినాదాలు చేశారు. తరువాత ఆయన మొండాన్ని ఒకచోట కాకులకు, గద్దలకు వదిలేసి ఖండిత శిరస్సును కాబా గోడకు వ్రేలాడదీశారు.

హజ్రత్ అస్మా బిన్త్ అబూబకర్ (రజి) ఈ విషాదవార్త విని పుత్రశోకాన్ని బలవంతంగా దిగమింగుతూ "ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహిరాజివూన్ ('మేము దేవుని ఆస్తులం. దేవుని వైపుకే పోవలసిన వాళ్ళం')" అని అన్నారు.

ఆ తర్వాత ఆమె కొడుకు భౌతికకాయాన్ని ఖననం చేసేందుకు అనుమతివ్వమని అడిగారు. దానికి హజ్జాజ్ బిన్ యూసుఫ్ నిరాకరించాడు. ఖలీఫా అబ్దుల్‌మలిక్‌కు ఈ విషయం తెలిసి హజ్జాజ్‌కు చీవాట్లుపెట్టాడు. అప్పుడు హజ్జాజ్ ఆ భౌతికకాయాన్ని హజ్రత్ అస్మా (రజి) కుటుంబానికి అప్పగించి ఖననం చేయించాడు.

## 62. విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా (రజి)

హజ్రత్ అబూబకర్ (రజి) కుమార్తె ఆయిషా (రజి) వివాహం లేతవయస్సులోనే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)తో జరిగింది. మక్కా నుండి మదీనా వలసపోయిన రెండేళ్ళకు ఆమె కాపురానికి వచ్చారు. మదీనాలో ముస్లింలకు కపటులు, యూదుల బెడద మొదలైంది.

హిజ్రీ5వ ఏట, షాబాన్‌లో బనీముస్తలిఖ్ తెగవాళ్ళు మదీనాపై దాడి చేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని తెలిసి దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని యుద్ధభూమికి బయలుదేరారు. కపటాగ్రేశ్వరుడు అబ్దుల్లా బిన్ ఉబయి కూడా తన శిష్యగణంతో ముజాహిద్‌ల వెంట బయలుదేరాడు.

దైవప్రవక్త (స) ఏదైనా యుద్ధానికి బయలుదేరవలసివస్తే చీటీ వేసి అందులో ఏ భార్య పేరు వస్తే ఆమెను తన వెంట తీసికెళ్ళేవారు. ఈసారి చీటీ వేస్తే హజ్రత్ ఆయిషా (రజి) పేరు వచ్చింది. అంచేత ఆమె దైవప్రవక్త (సల్లం) వెంట బయలుదేరారు. ఈ యుద్ధంలో ముస్లింయోధులు పెద్దగా శ్రమపడకుండానే శత్రువుల్ని చిత్తుగా ఓడించి తిరుగు ప్రయాణమయ్యారు.

యోధులు ప్రయాణబడలిక తీర్చుకోవడానికి దారిలో ఒకచోట ఆగారు. ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సైనికులు తిరిగి బయలుదేరడానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో హజ్రత్ ఆయిషా (రజి) అవసర నిమిత్తం ఒయాసిస్సు బయటికి వెళ్ళారు.

చాలాసేపు గడచినా తిరిగిరాలేదు. ఈలోగా సైన్యం బయలుదేరింది. ఆమె అంబారీలోనే ఉన్నారని భావించి సైనికులు దాన్నిఎత్తి ఒంటెమీద పెట్టి బయలుదేరారు.

హజ్రత్ ఆయిషా(రజి) అవసరం తీరాక సైనికశిబిరాల వైపుకు వస్తూ చూసుకుంటే మెడలో కంఠహారం కనపడలేదు. అది తెగిపోయి దారిలో ఎక్కడో పడివుంటుందని తలచి ఆమె దాన్ని వెతకడానికి వెనక్కివెళ్ళారు. చివరికి ఎలాగో కంఠహారం దొరికింది. దాన్ని తీసుకొని శిబిరాల దగ్గరికొచ్చి చూస్తే అంతా నిర్మానుష్యంగా కన్పించింది. దాంతో ఆమె దిక్కుతోచని స్థితిలో పడి అక్కడే ఓ ఇసుకతిన్నె మీద కూలబడ్డారు.

చూస్తుండగానే చీకటి పడిపోయింది. సైనికులు కొంచెందూరం వెళ్ళి అంబారీలో తాను లేకపోవడం గమనించి వెనక్కి తిరిగొస్తార్లే అని భావించి ఆమె అక్కడే ఒక చోట దుప్పటి కప్పుకొని పడుకున్నారు. పడుకోగానే గాఢంగా నిద్రపట్టింది.

సూర్యోదయమయింది. సైనికులు మరచిపోయి ఏవైనా వస్తువులు వదలి పెట్టారేమో నని దారిపొడుగూతూ గమనిస్తూ వెనుకనుంచి సఫ్వాన్ (రజి) వస్తున్నారు. సైన్యం బసచేసి వెళ్ళిన ఒయాసిస్సు దగ్గరికి వచ్చిచూస్తే అక్కడ హజ్రత్ ఆయిషా (రజి) కన్పించారు. అప్పుడామె ముఖం మీది దుప్పటి తొలగివుంది.

సఫ్వాన్ బిన్ ముఅత్తిల్ (రజి) పరదాఆజ్ఞలు అవతరించక పూర్వం హజ్రత్ ఆయిషా (రజి)ని చూసి ఉన్నారు గనక, వెంటనే ఆమెను గుర్తుపట్టి "ఇన్నాలిల్లాహి వఇన్నాఇలైహి రాజివూన్. ప్రవక్త సతీమణి (రజి) ఇక్కడే ఉండిపోయారా!" అన్నారు ఆశ్చర్యపోతూ.

ఈ అలికిడికి హజ్రత్ ఆయిషా (రజి) మేల్కొని గబాలున ముఖం మీద వస్త్రం కప్పుకున్నారు. హజ్రత్ సఫ్వాన్ (రజి) తన ఒంటెను ఆమె దగ్గరగా కూర్చోబెట్టి, ఆమెతో ఏమీ మాట్లాడకుండా కొంచెం దూరం వెళ్ళి కూర్చున్నారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా మౌనంగా లేచి ఒంటె మీద ఎక్కి కూర్చుకున్నారు. ఆమె కూర్చోగానే హజ్రత్ సఫ్వానే (రజి) ఒంటెను లేపి దాని పగ్గం పట్టుకొని బయలుదేరారు.

సైన్యం కొన్ని మైళ్ళు ప్రయాణం చేసిన తరువాత విశ్రాంతి కోసం మరో మజిలీ దగ్గర విడిది చేసింది. హజ్రత్ సఫ్వాన్ (రజి) ఒంటె మీద హజ్రత్ ఆయిషా (రజి)ను తీసుకొని నడుస్తూ చివరికి సైన్యం మజిలీ చేసిన చోటికి చేరుకున్నారు.

వీలు చిక్కితే చాలు, ఏదో ఒక ఉపద్రవం లేవనెత్తడానికి అనుక్షణం కాచుకొని ఉండే కపటవిశ్వాసి అబ్దుల్లా బిన్ ఉబైకి సువర్ణావకాశం లభించింది. వాళ్ళిద్దర్ని ఆ విధంగా చూడగానే "ఇదిగో చూడండి. మీ ప్రవక్తగారి భార్యామణి రాత్రి ఓ పరపురుషుని తో గడిపి, ఇప్పుడు బహిరంగంగానే అతనితోనే కలసి వస్తోంది!" అన్నాడతను. అతని శిష్యులు ఎగిరి గంతేసి తమకు చేతినిండా పని దొరికిందని తెగ సంబరపడి పోయారు. వారీ విషయాన్ని సైనికుల్లో ప్రచారం చేయడం మొదలెట్టారు.



ఈ దుష్ప్రచారం క్రమంగా ముస్లింలందరి చెవులకు ప్రాకింది. అనేకమంది ముక్కు మీద వేలేసుకున్నారు. కొందరు సందిగ్ధంలో పడిపోయారు. మరికొందరు ఇది అపనింద ని కొట్టిపారేశారు. ఆయిషా (రజి) తండ్రి అబూబకర్ (రజి) పరిస్థితి అర్థంగాక లోలోన బాధపడసాగారు. ఈ గొడవ గురించి ఆయిషా (రజి)కు ఏమాత్రం తెలియదు.

ఇలాంటి పరిస్థితిలో ముస్లింయోధులు మదీనాలో ప్రవేశించారు. ఇద్దరు సైనికులు ఆయిషా (రజి) కూర్చున్న ఒంటెను ఆమె పుట్టింటికి తీసికెళ్ళి ఆపారు. ఆయిషా (రజి) అంబారీ నుంచి దిగి ఇంట్లోకి వెళ్ళారు. కాని ఆమె మదీనా తిరిగిరాగానే జబ్బుపడ్డారు. నెలరోజుల దాకా కోలుకోలేక పోయారు.

దైవప్రవక్త (స) అప్పుడప్పుడు వస్తూ ఆమె ఆరోగ్యపరిస్థితి గురించి ఆమె తల్లిదండ్రుల్ని అడిగి తెలుసుకొని వెళ్ళిపోయేవారు. అంతేగాని ఆమెను కలుసుకొని మాట్లాడేవారు కాదు. ఇలా ఆయన తనతో ఎందుకు ముభావంగాఉన్నారో ఆమెకు అర్థమయ్యేది కాదు.

ఓరోజు ఆమె మిస్తహ్ తల్లిని వెంటబెట్టుకొని బహిర్భూమికి వెళ్ళారు. దారిలో మిస్తహ్ తల్లికి ఎదురురాయి తగిలింది. అప్పుడామె నోట అప్రయత్నంగా "మిస్తహ్ నాశనం గాను!" అన్న మాటలు వెలువడ్డాయి.

ఆయిషా (రజి) ఈమాట విని "భలే తల్లివే నువ్వు! కన్నకొడుకునే శపిస్తున్నావా!!" అన్నారు ఆశ్చర్యపోతూ.

"అమ్మాయ్! నీకీ విషయం ఇంకా తెలియదా?" అంటూ మిస్తహ్ తల్లి జరిగిన వృత్తాంతమంతా తెలియజేసింది.

దాంతో హజ్రత్ ఆయిషా (రజి)కు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలయినట్లు అన్పించింది. వెంటనే ఆమె వచ్చిన పని కూడా మరచిపోయి నేరుగా ఇంటికి వెళ్ళి పోయారు. ఆ రోజు రాత్రి భోజనం చేయకుండా పడుకొని రాత్రంతా కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ గడిపారు.

ఓరోజు దైవప్రవక్త (సల్లం) అలీ (రజి)ని, ఉసామా (రజి)ని పిలిచి "ఉసామా! ఆయిషా గురించి ప్రచారం జరుగుతున్న విషయాలన్నీ విన్నావు కదా? వాటిని గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అని ప్రశ్నించారు.

"దైవప్రవక్తా! మీ శ్రీమతిలో నేను మంచితనం తప్ప మరో విషయం చూడలేదు. ఆమెను గురించి జనం చెప్పుకుంటున్న మాటలన్నీ అబద్ధం, అపనిందలు తప్ప మరేమీ కాదు" అన్నారు హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి).

"అలీ! మరి నువ్వేమంటావు?" అడిగారు దైవప్రవక్త (సల్లం)

"దైవప్రవక్తా! నేను కూడా ఆమెలో అలాంటి విషయమేదీ ఇంతవరకు చూడలేదు. కాని మీరేమో చాలా విచారంతో ఉన్నట్లు కన్పిస్తున్నారు" అన్నారు హజ్రత్ అలి (రజి).

"ఔను. నాకీ విషయంలో విచారంగానే ఉంది. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"విచారించకండి. మిమ్మల్ని భర్తగా పొంది, ఆ విషయం తమకు గర్వకారణంగా భావించే స్త్రీలు చాలామంది ఉన్నారు" చెప్పారు హజ్రత్ అలి (రజి).

"కాని ఆయిషా సంగతి......?"

"ఆమె ఏపాపం ఎరగని అమాయకురాలని నా అభిప్రాయం. సరే, మీరొక సారి ఆమె సేవకురాలు బరీరాను (రజి) కూడా పిలిపించి విషయం అడిగి తెలుసుకోండి" అన్నారు అలి (రజి).

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికెళ్ళి, బరీరాను పిలిచి అడిగారు. దానికామె ఇలా సమాధానమిచ్చింది:

"మీకు సత్యధర్మం ఇచ్చి పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేను ఆయిషాలో ఇంతవరకు ఎలాంటి చెడువిషయం చూడలేదు. కాకపోతే నేను పిండి పిసికి మరో పని మీద వెళ్తూ 'నేనిప్పుడే వస్తా, కాస్త పిండి వైపు చూస్తుండమ్మా!' అని చెబితే అమె నిద్రపోతుంది. అంతలో మేక వచ్చి పిండి కాస్తా తినిపోతుంది" అన్నది సేవిక.

చివరికి ఒక రోజు దైవప్రవక్త (సల్లం) అబూబకర్ (రజి) ఇంటికి వచ్చి దాదాపు నెలరోజుల తరువాత మొదటిసారిగా ఆయిషా (రజి) దగ్గర కూర్చున్నారు. ఆమె తల్లి ఉమ్మెరూమాన్ (రజి), తండ్రి అబూబకర్ (రజి) కూడా వచ్చి కూర్చున్నారు.

"ఆయిషా! నీ గురించి ఈ పుకార్లు పుట్టాయి. నువ్వు నిజంగా ఏ తప్పు చేయకపోతే దేవుడు నీ సచ్ఛీలం గురించిన విషయం బహిర్గతం చేస్తాడు. ఒకవేళ నీవల్ల ఏదైనా తప్పు జరిగివుంటే దేవుడికి క్షమాపణ చెప్పుకో. దాసుడు తన తప్పు అంగీకరించి క్షమాపణ కోరుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

హజ్రత్ ఆయిషా (రజి) ఈ మాటలు విని మరింత బాధపడుతూ "నాన్నా! దైవప్రవక్త అడిగిన మాటలకు మీరు సమాధానం చెప్పండి" అన్నారు ఆమె.

"తల్లీ! ఏం సమాధానమివ్వాలో నాకేమీ అర్థం కావడంలేదు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి) తల వొంచుకుంటూ.

"అమ్మా! నువ్వయినా దీనికి సమాధానం చెప్పు."

"నేను మాత్రం ఏం చెప్పగలనమ్మా! నాక్కూడా ఏమీ అర్థం కావడంలేదు" అన్నారు హజ్రత్ ఉమ్మెరూమాన్ (రజి).



"అసలు మీ చెవుల్లో ఓమాట పడిపోయి అది మీ హృదయాల్లో తిష్ఠవేసుకొని కూర్చుంది. ఇప్పుడు నేను గనక ఏపాపం ఎరగనంటే మీరు నమ్మలేరు. ఒకవేళ నేను చేయని తప్పు చేశానని చెబితే మాత్రం మీరు ఒప్పుకుంటారు. ఇలాంటి పరిస్థితిలో యూసుఫ్ (అలైహి) తండ్రి అన్నట్లు 'ఫసబ్రున్ జమీల్' అని పలకటం తప్ప నాకు మార్గాంతరం లేదు." ఆయిషా (రజి) ఇలా చెప్పి పడకపై పక్కకు తిరిగి పడుకున్నారు.

అంతలో దైవప్రవక్త (సల్లం) పరిస్థితి హఠాత్తుగా మారిపోయింది. ఆయన తల వొంచుకొని కళ్ళు మూసుకున్నారు. తీవ్రమైన చలిలో సైతం ఆయన నుదుటి నుంచి చెమట బిందువులు ముత్యాల్లా రాలిపడుతున్నాయి. అంటే, దివ్యావిష్కృతి ద్వారా ఆయన హృదయ ఫలకంపై దైవసూక్తులు అవతరించసాగాయి:

"ఈ అపవాదు మీలోనే ఒకవర్గం లేవదీసింది... ఇందులో ఎవరెంత పాత్ర వహించారో ఆమేరకు వారు పాపం మూటగట్టుకున్నట్లే. ఈ వ్యవహారంలో అత్యధిక బాధ్యత నెత్తిమీద వేసుకున్న ప్రధాన సూత్రధారికి కఠినాతికఠిన శిక్ష కాచుకొని ఉంది... (24:11-21)

దివ్యావిష్కృతి పరిస్థితి తొలిగిపోయిన తర్వాత దైవప్రవక్త (స) ముఖపద్మం విప్పారి దివ్యతేజస్సుతో వెలిగిపోసాగింది. ఆయన పెదవులపై దరహాసం తొణికిసలాడింది.

"ఆయిషా! నీకు శుభం కలుగుగాక! దేవుడు నీ పాతివ్రత్యం గురించిన విషయం అవతరింపజేశాడు" అని తెలియజేశారు. తర్వాత ఖుర్ఆన్‌లోని పైసూక్తులు విన్పించారు.

ఈ శుభవార్త వినగానే కుటుంబ సభ్యులందరూ సంతోషించారు. దైవసూక్తులు వినగానే హజ్రత్ ఆయిషా (రజి) హృదయం ఎంతో తేలికపడింది. ఆమె మనసులోనే దైవానికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి) అప్పుడు కుమార్తె ఆయిషా (రజి)తో "లేచి దైవప్రవక్త (సల్లం)కు కృతజ్ఞతలు చెప్పుకో" అన్నారు.

"ఏవిటీ కృతజ్ఞతలా! నేను ఆయనకూ కృతజ్ఞతలు చెప్పను; మీ ఇద్దరికీ కృతజ్ఞతలు చెప్పను. నా పాతివ్రత్యాన్ని బహిర్గతంచేసిన దేవునికి మాత్రమే నేను కృతజ్ఞతలు సమర్పించుకుంటాను. మీరీ అపనిందను కనీసం ఖండించనయినా ఖండించలేదు" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి) చిరుకోపంతో.

ఆతర్వాత పాతివ్రత్యం గురించిన దైవసూక్తులు ఇతర విశ్వాసులకు కూడా తెలియ జేయబడ్డాయి. దాంతో ముస్లింలంతా సంతోషించారు. అబ్దుల్లా బిన్ ఉబై, అతని మిత్రమూక మాత్రం తమ దుష్టపథకం బెడిసినందుకు తలలు వ్రేలాడదీసుకున్నారు. తరువాత వారు ఎక్కడికి పోయినా ముస్లింల ఛీత్కారానికి గురవసాగారు.

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేస్తున్నారు:-

"మేమొకసారి దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేస్తున్నాం. బైదా (లేక జాతుల్‌జైష్) అనే ప్రాంతానికి చేరుకునే సరికి నా కంఠహారం తెగి ఎక్కడో పడి పోయింది. దైవప్రవక్త (స) దాన్ని వెతకడానికి అక్కడ ఆగిపోయారు. ఆయనతో పాటు మిగిలినవాళ్ళు కూడా ఆగిపోయారు. ఆ ప్రదేశంలో ఎక్కడా నీటిచుక్క లేదు.

జనం అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళి "మీఅమ్మాయి ఆయిషా (రజి) ఏం చేసిందో చూశారా? ఆమె మూలంగా దైవప్రవక్త (సల్లం) ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. ఆయనతో పాటు ప్రజలంతా ఆగిపోయారు. కాని ఇక్కడ చూస్తే ఒక్క నీటిచుక్క కూడా లేదు. జనం దగ్గరున్న నీళ్ళు కాస్తా అయిపోయాయి" అని అన్నారు.

అబూబకర్ (రజి) ఈ మాటలు విని నాదగ్గరకు వచ్చారు. ఆ సమయంలో దైవ ప్రవక్త నావడిలో తలపెట్టి నిద్రపోతున్నారు. అబూబకర్ (రజి) వచ్చిరాగానే "నీమూలంగా దైవప్రవక్త (సల్లం) ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. ఆయనతో పాటు ప్రజలు కూడా ఆగిపోయారు. ఇక్కడ చూస్తే చుక్క నీరులేదు. జనం దగ్గర కూడా నీళ్ళులేవు" అని మండిపడ్డారు నామీద.

ఆయన చేత్తో నా వీపుపై కొడ్తూ అనదలచిన మాటలన్నీ అన్నారు. దైవప్రవక్త (సల్లం) నా తొడల మీద తలపెట్టి పడుకోవడం వల్ల నేను (దెబ్బలు సహిస్తూ) కదలకుండా అలాగే ఉండవలసి వచ్చింది.

మరునాడు తెల్లవారుజామున దైవప్రవక్త (స) మేల్కొంటే (ఉజూ చేయడానికి) నీళ్ళే లేవు. అప్పుడు దేవుడు "తయమ్ముమ్" ఆజ్ఞలు అవతరింపజేశాడు. దాంతో అందరూ తయమ్ముమ్ చేశారు.

అప్పుడు ఉసైద్ బిన్ హుజీర్ (రజి) మాట్లాడుతూ "అబూబకర్ సంతానమా! మీ మూలంగా (ముస్లింలకు) శుభం కలగడం ఇది మొదటిసారి కాదు" అన్నారు.

ఆ తర్వాత నేను కూర్చున్న ఒంటెను లేపారు. దాని క్రింద నా కంఠహారం దొరికింది." (బుఖారి, ముస్లిం)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాబాయాత్ర నుండి తిరిగొచ్చి మూణ్ణెల్లయినా కాలేదు, హఠాత్తుగా ఆయన వ్యాధిగ్రస్తులయ్యారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి దాడిచేసి ఆయన్ని చాలా బాధపెట్టసాగాయి. అదేమి జబ్బోగాని రాత్రిపూట ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టేదికాదు.

మరుసటి రోజు ఉదయం దైవప్రవక్త (స) ఏదో పని మీద ఇంటి నుండి బయలు దేరారు. దారిలో అర్ధాంగి ఆయిషా (రజి) ఇంటి దగ్గర ఆగారు. అప్పుడామె తలనొప్పితో బాధ పడుతున్నారు. "అబ్బా! నా తల పగిలిపోతోంది" అన్నారామె తల పట్టుకొని.



"ఆయిషా! నాతలలో అంతకంటే ఎక్కువ బాధగా ఉంది. అబ్బబ్బా! నాతల పగిలిపోతోంది" అన్నారు దైవప్రవక్త (స).

అప్పుడామెకు ఏం జవాబివ్వాలో బోధపడలేదు.

"ఆయిషా! ఒకవేళ నాకంటే ముందు నువ్వే చనిపోతే ఎంత బాగుంటుందో! ఎంచక్కా నేను నా స్వహస్తాలతో నీకు వస్త్రసంస్కారం చేస్తాను. స్వయంగా నేనే నిన్ను సమాధి చేస్తాను" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆమెను మరింత ఉడికించే ఉద్దేశ్యంతో.

"నేనే ఎందుకు? మీ శ్రీమతులు ఇంకా ఉన్నారుగా. నాకన్నా వారైతేనే బాగుం టుంది" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి) చిరుకోపంతో.

ఆమె మాటలు విని దైవప్రవక్త (సల్లం) నవ్వారు. కాని తలనొప్పి తీవ్రంగా ఉన్నందున ఆయన అర్ధాంగితో అంతకంటే ఎక్కువ పరాచికాలాడలేక పోయారు.

దైవప్రవక్త (సల్లం) సాధారణంగా ఒక్కోరోజు ఒక్కోభార్య దగ్గర గడుపుతుంటారు. ఇప్పుడు కూడా అలా వంతులవారిగా అయిదు రోజులు గడిపిన తరువాత వ్యాధి ముదరడంతో ఆయన మైమూనా (రజి) ఇంట్లో ఉండి, ఇతర భార్యాలందర్నీ పిలిపించు కున్నారు. ఇక నుండి తాను ఆయిషా దగ్గరే ఉండిపోవడానికి అనుమతివ్వమని అడిగారు. దానికి వారు సంతోషంగా ఒప్పుకున్నారు.

అప్పటికే ఆయన జబ్బుతో చాలా బలహీనమై పోయారు. లేచి నిల్చోవడం కూడా కష్టమయిపోయింది. అప్పుడు అలి (రజి), అబ్బాస్ (రజి)లు వచ్చి ఆయన్ని పట్టుకొని మెల్లిగా ఆయిషా (రజి) ఇంటికి చేర్చారు.

ఆతర్వాత కొన్నాళ్ళకే ఆయిషా(రజి) ఇల్లు విషాదనిలయమై పోయింది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అనేకమంది అనుచరులకు దర్శనభాగ్యం కలిగించి అశాశ్వతమైన ఈ ప్రపంచం నుండి శాశ్వతంగా కనుమరుగయ్యారు.

తొలిఇద్దరు ఖలీఫాల పాలన తర్వాత మూడవ ఖలీఫా ఉస్మాన్ (రజి) పాలనా కాలంలో ముస్లింముఖ యూదుడు ఇబ్నెసబా, అతని మిత్రమూక రేకెత్తించిన అరాచకం, అల్లర్ల మూలంగా ముస్లింసముదాయం రెండువర్గాలుగా చీలిపోయింది.

హజ్రత్ అలి (రజి) వర్గం సత్యంపక్షాన ఉన్నప్పటికీ అయన వర్గంలో ఇబ్నెసబా అనుచరమూకలే అత్యధికమంది ఉన్నారు. వారే ముస్లింలను బెదిరించి అలీ (రజి)ని బలవంతంగా ఖిలాఫత్ పీఠంపై కూర్చోబెట్టారు. అమీర్ ముఆవియా (రజి) వర్గం అధికార స్థాయిలో హజ్రత్ ఉస్మాన్ (రజి) హంతకుల్ని తమకు అప్పగించాలని పట్టుబట్టింది.

దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఉస్మాన్ (రజి) హత్యకు ముందే మదీనాలో అరాచక పరిస్థితులతో విసుగెత్తి మక్కా వెళ్ళిపోయారు. అక్కడ హజ్ చేసిన తరువాత మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే దారిలో ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య వార్త, అలి (రజి) బైత్ సంగతి విని మక్కాకు తిరిగి వెళ్ళిపోయారు. ఆమె కూడా ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించే విషయంలో హజ్రత్ అలి (రజి)కి వ్యతిరేకమైపోయారు.

హజ్రత్ ఆయిషా (రజి) మార్గమధ్య నుండే తిరిగిరావడం చూసి మక్కా ప్రజలకు ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడా కలిగింది. వారామె కూర్చున్న ఒంటె చుట్టు గుమికూడి ఖలీఫా ఉస్మాన్(రజి) హత్యగావించబడ్డారన్న దుర్వార్త విని తీవ్రవిభ్రాంతికి గురయ్యారు. అప్పుడు హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు.

"ఏపాపం ఎరగని ఉస్మాన్ (రజి)ని దుండగులు దారుణంగా హతమార్చారు. రక్తపాతం నిషేధించబడిన హజ్‌సీజన్‌లో ఘోరమైన రక్తపాతం జరిపారు. మదీనాపట్టణ పవిత్రను దిగజార్చారు. దైవసాక్షి! నేను ఉస్మాన్(రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకుంటాను."

వెంటనే మక్కాప్రజలు ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. హజ్రత్ ఆయిషా (రజి) నేతృత్వంలో మూడువేల మంది సాయుధులు బస్రాకు బయలుదేరారు.

మక్కాలో ఉన్న అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ద్వారా ఖలీఫా అలీ (రజి)కి ఈసంగతి తెలియగానే ఆయన సిరియాపై దాడి నిర్ణయం వాయిదావేసి, బస్రాకు బయలుదేరారు. కూఫా ప్రజలు కూడా ఆయన సైన్యంలో చేరారు.

హజ్రత్ ఆయిషా (రజి) సైన్యం బయలుదేరే సమయంలో మర్వాన్ బిన్ హకం వచ్చి సైన్యంలో చేరిపోయాడు. ఈ మర్వాన్ మరెవరో కాదు, ఖలీఫా ఉస్మాన్ (రజి) పేరు, రాజముద్రలతో ఈజిప్టుగవర్నర్‌కు దొంగఉత్తరం వ్రాసి సబాయీదుండగుల అరాచకపుఅగ్నికి ఆజ్యం పోసినవాడే. ఖలీఫా కార్యదర్శిగా ఉంటూ తన నోటిదురుసు, దుష్ప్రవర్తనలతో మదీనాప్రజల ఛీత్కారానికి గురైనవాడే ఈ దుర్మార్గుడు.

సైన్యం కొన్ని మైళ్ళు ప్రయాణం చేసి "ఖాబ్" అనే సరస్సు దగ్గరకు చేరుకోగానే అక్కడ కొన్ని కుక్కలు మొరగడం మొదలెట్టాయి. హజ్రత్ ఆయిషా (రజి) ఆ సరస్సు పేరేమిటని అడిగారు. దానికి కొందరు అది 'ఖాబ్' సరస్సు అని చెప్పారు.

ఈపేరు వినగానే ఆమె ఒంటెను ఆపుతూ "నన్ను వెనక్కి పంపండి"అన్నారు. ప్రజలు 'ఎందుకు? ఏమైంద'ని అడిగారు. దానికామె ఇలా చెప్పారు :



"ఒకసారి దైవప్రవక్త (సల్లం) తమ భార్యల దగ్గర కూర్చొని మాట్లాడుతూ 'మీలో ఎవరిని చూసి ఖాబ్‌కుక్కలు మొరుగుతాయో నాకు తెలిస్తే ఎంత బాగుండు!' అని అన్నారు."

ఈమాట చెప్పి ఆమె ఒంటె మెడపై కొట్టి దాన్ని అక్కడే కూర్చోబెట్టారు. ఒక పగలు, ఒక రాత్రి అక్కడే ఉండిపోయారు. సైన్యం మొత్తం ఆమెతో పాటు అక్కడే ఆగిపోయింది.

ఆ సమయంలో కొందరు ఆయిషా(రజి) దగ్గరికొచ్చి "ఎవరో పొరపాటున ఇది 'ఖాబ్' సరస్సు అని చెప్పారు మీకు. ఇదసలు ఖాబ్ సరస్సు కాదు. ఖాబ్ సరస్సు ఈ దారిలో రాదు" అని అన్నారు.

ఆ తర్వాత తెల్లవారు జామున "అలి (రజి) సైన్యం మనకు దగ్గరగా వచ్చింది. లేవండి, త్వరగా బయలుదేరండి" అంటూ అకస్మాత్తుగా సైన్యంలో కలకలం చెలరేగింది. ఈమాట వినగానే సైనికులంతా బస్రా దిశగా బయలుదేరారు.

హజ్రత్ ఆయిషా(రజి) కూడా మార్గాంతరం కన్పించక వాళ్ళను అనుసరించారు.

చివరికి ఈసైన్యం బస్రా సమీపానికి చేరుకుంది. బస్రా సైనికులకు హజ్రత్ ఆయిషా (రజి) ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగాయి. చర్చల సందర్భంలో బస్రా సైనికుల్లో తీవ్రవిభేదాలు వచ్చాయి. దాంతో సైన్యంలో ఒకవర్గం యుద్ధం చేయడానికి నిరాకరించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఆయిషా (రజి) సైన్యం యుద్ధంచేసి బస్రా పట్టణాన్ని సులభంగా స్వాధీనం చేసుకుంది.

అటు ఖలీఫా అలి(రజి) సైన్యం బస్రాకు కొన్నిమైళ్ళ దూరం వచ్చి విడిది చేసింది. అలి (రజి) ప్రతినిధులకు, ఆయిషా ప్రతినిధులకు మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఉభయపక్షాల్లోని ముస్లింసముదాయ శ్రేయోభిలాషులంతా యుద్ధనివారణ కోసమే కృషిచేశారు. యుద్ధనివారణకు హజ్రత్ అలి (రజి) సంధికోసం అనేకసార్లు ప్రయత్నించారు. చివరికి ఓరోజు సాయంత్రం రాజీ కుదిరింది. మరునాడు ఉదయం సంధిపత్రంపై సంతకాలు చేయవలసి ఉండింది.

అయితే సంధిసంగతి తెలుసుకున్న 'సబాయీ దుండగులు' ఆందోళనచెందారు. చివరికి నాయకుని ఆదేశం ప్రకారం కొందరు తెలతెలవారుతుండగా దొంగచాటుగా వెళ్ళి హజ్రత్ ఆయిషా (రజి) సైన్యం పై మెరుపుదాడి చేశారు. దాంతో ఆ సైనికులు తమపై హజ్రత్ అలి (రజి) సైనికులు దాడి చేశారని భావించి అరుపులు, కేకలతో అప్రమత్తులైపోయారు.

ఈ గందరగోళానికి అలి (రజి) లేచి విచారిస్తే, ఇబ్నెసబా అనుచరులు "తల్హా, జుబైర్‌లు మన సైన్యంపై దాడిచేశారని, మనవాళ్ళు గత్యంతరంలేక ఆత్మరక్షణ

పోరాటానికి సిద్ధమయ్యారని'' అబద్ధమాడారు. అలి (రజి) ఈ మాట వినగానే సైనికుల్ని సమాయత్తపరిచారు. కొన్నిక్షణాల్లోనే యుద్ధమైదానం వేడెక్కింది.

కాని యుద్ధానికి దారితీసిన అసలు విషయం తెలియక ప్రతిమనిషీ ఎదుటి పక్షంవారినే దుర్మార్గులుగా భావించసాగాడు. హజ్రత్ ఆయిషా (రజి) ఒక అనుచరుడి సలహాతో ఒంటె మీద కూర్చొని యుద్ధమైదానంలోకి ప్రవేశించారు.

ఖలీఫా అలి (రజి) పరిస్థితి తీవ్రతను గమనిస్తూ, ఆయిషా (రజి) కూర్చున్న ఒంటె కాలికి గురిపెట్టి బాణం వదలమని ఒక సైనికుడ్ని ఆదేశించారు. అతనలా బాణం వదలగానే ఒంటె దబేలున కూలిపోయి కూర్చున్నది. ఆ దృశ్యం చూడగానే ఒంటె చుట్టూ రక్షణవలయంగా నిలబడి పోరాడుతున్న ఆయిషా (రజి) సైనికులు భీతావహులై పారిపోయారు. చివరికి ఆయిషా (రజి) సైన్యం ప్రత్యర్థిసైన్యం ముందు నిలువలేక చేతులెత్తేసింది.

ముస్లింముఖయూదుడైన ఇబ్నెసబా కుట్ర ఫలితంగా రెండు పక్షాలకు చెందిన పదివేల మందికి పైగా ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. హి.శ. 36లో జరిగిన ఈ యుద్ధాన్ని "ఉష్ట్రయుద్ధం" (జంగె జమల్) అంటారు.

హజ్రత్ ఆయిషా (రజి) బస్రా నుండి మక్కా చేరుకొని ఉష్ట్రయుద్ధానికి ముందు ఎదురైన పరిస్థితుల్ని గుర్తుకుతెచ్చుకొని బాధపడ్డారు. ఖాబ్ సరస్సు దగ్గర కుక్కలు మొరగడం, అలి (రజి) సైన్యంలో అమ్మార్ బిన్ యాసిర్ (రజి) ఉండటం మొదలైన సంఘటనలు ఆమె విజయానికి దుశ్శకునాలయ్యాయి.

కాని అప్పుడామె వాటినిగురించి అంతగా పట్టించుకోలేదు. పరాజయం తరువాత వాస్తవం వికృతనాట్యంచేస్తూ తన ముందు నిలబడగానే ఆమె తీవ్రంగా పశ్చాత్తపం చెందారు. ముఖ్యంగా ఖుర్ఆన్ పఠిస్తూ "మీరు మీఇండ్లలోనే ఆగిఉండండి." అనే సూక్తి (33:32) దగ్గరకు వచ్చి నప్పుడల్లా ఆమె ఎంతో బాధపడేవారు. కన్నీటితో ఆమె ఓణి తడిసిపోయేది.

దానధర్మాలు చేయడంలో ఆమెకుఆమే సాటి అని చెప్పవచ్చు. హజ్రత్ ఆయిషా (రజి)కు సంతానం లేనందున ఆమె తనఅక్క అస్మా(రజి) కొడుకు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ను పెంచుకున్నారు. ఒకసారి అబ్దుల్లా (రజి) హజ్రత్ ఆయిషా (రజి)కు లక్ష దిర్హంలు అందజేశారు. ఆ పైకాన్ని ఆమె అప్పటికప్పుడు పేదలకు, అనాథలకు దానం చేశారు. ఆరోజు ఆమె ఉపవాసం ఉన్నారు. సాయంత్రం సేవకురాలు వచ్చి "అమ్మా! మీరా పైకంలో కొంత సాయంత్రం ఉపవాసవిరమణ కోసం మాంసం కొనివుంటే ఎంత బాగుండేది!" అని అన్నది. దానికామె "నువ్వా సంగతి నాకు జ్ఞాపకం చేస్తేకదా!" అని అన్నారు.



హజ్రత్ ఆయిషా(రజి) ఉపవాసమున్న రోజుల్లో ఓరోజు ఆమె ఇంట్లో ఒక రొట్టె మాత్రమే ఉండింది. అంతలో ఓ పేదస్త్రీ వచ్చి ధర్మంచేయి తల్లీ అన్నది. ఆయిషా (రజి) ఆరొట్టె సేవికకు అందిస్తూ "దీన్ని ఆ పేదరాలికి ఇవ్వు"అని చెప్పారు.

అప్పుడు సేవిక "సాయంత్రం మీరు ఉపవాసవిరమణ దేంతో చేస్తార''ని అడిగింది. దానికామె "ముందు దీన్ని ఆమెకు ఇచ్చిరా" అన్నారు. ఆరోజు సూర్యాస్తమయానికి ముందే ఆయిషా (రజి)కు ఎవరో పారితోషికంగా కొంతమాంసం పంపారు. అప్పుడామె సేవికతో "చూశావా! దేవుడు రొట్టె కంటే శ్రేష్ఠమైన పదార్థం పంపాడు" అన్నారు. చివరికి ఆయిషా(రజి) తాను నివసించే ఇంటిని సైతం అమీర్ ముఆవియా (రజి)కు అమ్మి ఆ డబ్బుని కూడా దైవమార్గంలో ఖర్చుచేశారు.

కపటవిశ్వాసులు హజ్రత్ ఆయిషా (రజి)పై అపనింద మోపినపుడు ఆ దుష్ప్రచారం వల్ల కొందరు చిత్తశుద్ధిగల ముస్లింలు కూడా అపోహకు గురయ్యారు. వారిలో ప్రముఖకవి హజ్రత్ హస్సాన్ (రజి) కూడా ఉన్నారు. దాంతో ఆయన ఆయిషా (రజి)కు వ్యతిరేకులయ్యారు. కాని ఆ దుర్ఘటన ఆయిషా (రజి) హృదయాన్ని చాలా కలచివేసింది. అయినప్పటికీ ఆమె హస్సాన్ (రజి)ని క్షమించారు. ఆయిషా (రజి) బంధువులు కొందరు హస్సాన్ (రజి)ని దూషించడానికి పాల్పడ్డారు. అయితే హజ్రత్ ఆయిషా (రజి) ఆ పని నుండి వారిని వారిస్తూ "ఆయన్ని దూషించకండి. ఆయన దైవప్రవక్త (స) తరపున బహుదైవారాధక కవులకు సమాధానమిచ్చేవారు"అని అన్నారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఎంతో దైవభీతిపరాయణురాలు. ఎలాంటి శత్రువునైనా క్షమించే విశాలహృదయంగల సాధ్వీమణి ఆమె. దుర్భాషలు, ప్రత్యక్ష-పరోక్ష నిందలు అంటే ఆమెకు అసలు గిట్టవు. ఫర్జ్‌నమాజులు, ఫర్జ్‌రోజాలతోపాటు నఫిల్ నమాజులు, నఫిల్ రోజాలు కూడా ఆమె పాటించేవారు.

హజ్రత్ ఆయిషా(రజి) ప్రజల ధార్మికశిక్షణ కోసం పాఠశాలను కూడా నడిపారు. ఆమె వేల హదీసులు ఉల్లేఖించారు. చివరికి 67 ఏళ్ళ వయసులో హి.శ.58 రమజాన్ నెలలో ఇహలోకం వీడిపోయి యావత్ముస్లింలను విషాదసాగరంలో ముంచారు.

**I.R.C. సిలబస్**

తేనెలొలికే 'తేటతెలుగు'లో ఇస్లాం సంపూర్ణ స్వరూపం చూడదలచినవారికి ఇస్లాం సాహిత్యాన్ని సమగ్రమైన సిలబస్‌గా అందజేస్తున్న ఏకైకసంస్థ "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" (జీవన్‌యార్‌జంగ్ కాలనీ, సయీదాబాద్, హైదరాబాద్-59) మాత్రమే. ఈ సిలబస్ ప్రకారం ప్రచురించవలసిన ముఖ్యమైన 12 పుస్తకాలు దేవుని దయ వల్ల ప్రచురించబడ్డాయి (సహాబీల జీవితగాథలు, ఇస్లాంచరిత్రలతో సహా). ఆసక్తి కలవారు మా ఫోన్ నెం. 9441515414 ద్వారా సంప్రదించగలరు

# ప్రవక్త (స)పై ప్రేమకు పరాకాష్ఠ

దైవప్రవక్త (సల్లం) అమరగతులయ్యారన్న వదంతి మదీనాలో దావానంలా వ్యాపించింది. దాంతో అనేకమంది తీవ్రఆందోళన చెందుతూ కన్పించిన ప్రతి మనిషినీ "ఈవార్త నిజమేనా?" అని అడుగుతూ తిరుగుతున్నారు.

దైవప్రవక్త (సల్లం) గురించిన వదంతి విని ఒక అన్సార్ మహిళ తీవ్ర ఆందోళన చెందుతూ ఆదరా బాదరాగా యుద్ధభూమికి బయలుదేరింది.

"ఏమిటీ..........! నా ప్రియతమ నాయకునికి.... నా అభిమాన ప్రవక్తకు.... నా మహోపకారికి.... మరణప్రాప్తమా!?..... కాదు కాదు. ఇవేవో దుష్టులు లేవదీసిన పుకార్లు; గిట్టనివాళ్ళు వ్యాపింపజేసిన కట్టుకథలు.... ఒకవేళ ఇది నిజమే అయితే....? వద్దు వద్దు. దైవం ఆయన్ని కాపాడుగాక!"

ఇలా ఆమె పరిపరి విధాల ఆలోచిస్తూ వేగంగా ముందుకు సాగిపోతోంది. దారిలో ముళ్ళను, రాళ్ళను కూడా గమనించే స్థితిలో లేదు. కాలి సత్తువ కొద్దీ చరచరా నడచి పోతోంది. యుద్ధంలో ఆమె తండ్రి, భర్త, సోదరుడు తదితర రక్త బంధువులు కూడా పాల్గొన్నారు. కాని వారి పరిస్థితి గురించి ఆలోచించడం లేదామె.

ఇప్పుడామె హృదయంలో ముద్ర వేసుకున్నది మానవమహోపకారి ముహమ్మద్ (సల్లం) చిత్రం మాత్రమే. ఆ మహనీయుడు క్షేమంగా ఉంటే చాలు, ఇక తనకు ఏ దిగులూ ఉండదు. అదే ఆమె ఆకాంక్ష. ఆ ఆకాంక్షతోనే ఆమె అలుపూ సలుపూ లేకుండా ఎడాపెడా నడుస్తూ యుద్ధభూమి వైపు దూసుకుపోతోంది.

అప్పుడే రణరంగం నుంచి యోధులు జట్లు జట్లుగా తిరిగొస్తున్నారు.

"అమ్మా! చెప్పడానికి మాకు నోరు రావడం లేదు. యుద్ధంలో మీ నాన్నగారు చనిపోయారమ్మా!" అన్నారు కొందరు ముజాహిద్‌లు ఆమెను చూడగానే.

"నాన్నా....! కని పెంచిన తండ్రి.... బ్రతుకు బండలు చేసుకొని పోషించిన తండ్రి..... ప్రేమామృతం కురిపించి విద్యాబుద్ధులు నేర్పిన తండ్రి....."

అలాంటి తండ్రి చనిపోతే ఆ కూతురి హృదయం ఎంత తల్లడిల్లి పోతుంది! కాని ఆ సహనమూర్తి తండ్రి మరణవార్త విని కించిత్తయినా చలించలేదు. అసలామె దానికి ఏమాత్రం ప్రాముఖ్యం ఇవ్వకుండా ఇలా అడిగింది:

"ముందీ సంగతి చెప్పండి. మన ప్రియప్రవక్త (సల్లం) క్షేమంగా ఉన్నారా?"

"ఆయన క్షేమంగానే ఉన్నారు. కాకపోతే కాస్త గాయపడ్డారు" అన్నారు యోధులు.

కాని వారి మాటలపై ఆమెకు పూర్తిగా నమ్మకం కుదరలేదు. కారుణ్యమూర్తి (స)ని తన కళ్ళతో చూసుకుంటేగాని మనసు కుదుటపడదు.



అంతలో మరికొందరు యోధులు తెలిపారు, నీ సోదరుడు చనిపోయాడని.

తండ్రి మరణవార్తనే ఖాతరుచేయని స్త్రీ సోదరుడు చనిపోతే విచారిస్తుందా? ఆమె విచారమల్లా దైవప్రవక్త (సల్లం)ను గురించే. అదే ఆమె మనశ్శాంతిని దూరంచేసి ఆమెను ఇంత దూరం లాక్కొచ్చింది. మరికొంత దూరం పోయాక మరో విషాదవార్త....

"నీ భర్త కూడా యుద్ధంలో చనిపోయాడమ్మా!"

"ఆ......నా భర్త? నా హృదయేశ్వరుడు.....? నా అనురాగమూర్తి.....? చనిపోయాడా? నాకు శాశ్వతంగా దూరమయ్యాడా? భరించలేని ఎడబాటు! బ్రతుకుపై నిప్పులు కురిపించిన గ్రహపాటు!!"

కన్నతండ్రి పోతే కాస్తయినా ఓర్చుకోవచ్చు. రక్తం పంచుకొని పుట్టిన సోదరుడు పోయినా పెద్దగా బాధుండదు. కాని కట్టుకున్న భర్తనే కోల్పోతే ఇక సంఘంలో తనకు నీడిచ్చే నాథుడెవరు? పైగా తండ్రి, సోదరుడు, భర్త ముగ్గురూ ఒకేసారి చనిపోతే ఇక ఆ దీనురాలి గతేమిటి?? ఆమె కోమల హృదయం ఎన్ని ముక్కలవుతుంది???

కాని ఆ ధీరవనిత హృదయం లేశమైనా చలించలేదు. అదొక సహనసాగరం. అందులో ఆందోళనా సుడిగుండం ఏదైనా ఉందంటే అది దైవప్రవక్త (సల్లం) సంక్షేమం విషయంలోనే. ఆ తరువాతే మరేదైనా విషయానికి తావుంటుంది.

అందుకే ఆ నారీమణి నయనాలు తీవ్రమయిన ఆందోళనతో దైవసందేశహరుని దివ్యమోము కోసం గాలించసాగాయి.

ఆమె పరిస్థితి గమనించి ఒక యోధుడు "అదిగో దైవప్రవక్త (సల్లం) వస్తున్నారు" అని చెప్పాడు అటువైపు చూపిస్తూ.

అంతే... ఆమె సుడిగాలిలా అటువైపు పరుగెత్తింది. అనుచరుల మధ్య పున్నమి చంద్రునిలా వెలిగిపోతున్న ప్రియతమ నాయకుడ్ని చూసుకోగానే ఆమె అమిత సంతోషంతో పరవశించిపోయింది.

"దైవప్రవక్తా! మీరు క్షేమంగా ఉన్నారు, అదే చాలు నాకు. ఇక నాపై విరుచుకుపడిన ఎలాంటి ఆపదనైనా తేలిగ్గా భరించగల్గుతాను" అన్నది ఆ వీరవనిత కళ్ళ నుంచి ఆనంద భాష్పాలు రాలుతుండగా.

ఇలాంటి అభిమానం గురించే దైవప్రవక్త (సల్లం) అన్నారు: "నేను మీకు మీ తండ్రి, మీ కొడుకులు, యావన్మంది (సన్నిహితుల) కన్నా ఎక్కువ ప్రియమైనవాడ్ని కానంతవరకు మీలో ఏ ఒక్కడూ నిజమైన విశ్వాసి కాలేడు."

**-(సమాప్తం)-**